తెలుగు జానపద సాహిత్యము

స్త్రీల గేయములలో సంప్రదాయము

గ్రంథకర్త
డా॥ చింతపల్లి వసుంధరా రెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

తెలుగు

జానపద సాహిత్యము

స్త్రీల గేయములలో సంప్రదాయము

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె.చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

గ్రంథకర్త

డా. చింతపల్లి వసుంధరా రెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, ఆబిడ్స్

హైదరాబాద్ - 500001

తెలుగు జానపద సాహిత్యము

స్త్రీల గేయములలో సంప్రదాయము

Tradition as Reflected in Women's Folk Songs

By

Dr. C. Vasundhara Reddy

First Edition : 1984
Second Edition : 1986
Third Edition : 2015

Pages : 524

Price : Rs. 250/-

Mobile : 9701222386

Published by :
Andhra Saraswatha Parishat
Tilak Road, Abids
Hyderabad-1

For Copies :
Andhra Saraswatha Parishat
Tilak Road, Abids
Hyderabad-1
Phone : 040-24753724

Typesetting :
R. Anuradha Raghuram (9441186831)

Printed at :
Sai Likhitha Printers
Khairatabad, Hyderabad
Phone : 040 65 545 979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పున రుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది.

2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు

వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని– తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, ప్రాచీన తెలంగాణ తెలుగు కవుల సాహితీసేవ, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై ప్రత్యేక గ్రంథప్రచురణను పరిషత్తు చేపట్టింది. ఈ పరంపరలో ప్రస్తుత గ్రంథం డా.చింతపల్లి వసుంధరా రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం పి. హెచ్.డి.పట్టాకోసం సమర్పించిన సిద్ధాంతవ్యాసం "తెలుగు జానపద సాహిత్యము: స్త్రీల గేయములలో సంప్రదాయము". మూలం 720 పుటల బృహత్ గ్రంథం. ఈ తరం పాఠకుల సౌకర్యార్థం పరిషత్తు సూచన మేరకు రచయిత్రి దీనిని సంక్షిప్తీకరించారు. దేశంలో ఎన్ని పరిణామాలొచ్చినా మన విశిష్ట సంప్రదాయాన్ని స్త్రీలు ఏ విధంగా పరిరక్షిస్తున్నారో రచయిత్రి ఈ పరిశోధన గ్రంథంలో ప్రతిభాన్వితంగా నిరూపించినారు. ఇందుకు ఆమె తెలుగు జానపద గేయాలను భూమికగా స్వీకరించినారు. సంప్రదాయాన్ని వివిధ కోణాలలో ఆవిష్కరించినారు. సరళ గ్రాంథికంలో ఈ అమూల్యకృతిని అందించిన డా.వసుంధరా రెడ్డికి నా హార్దికాభినందనలు.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగా అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు
తేది : 25-03-2015

(డా.సి.నారాయణరెడ్డి)
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణ కు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి.

ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాల నిర్వహణలో ప్రచురణ ఒకటి. ఆ ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం–స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

ప్రస్తుత గ్రంథం డా. సి. వసుంధర గారి పి. హెచ్. డి సిద్ధాంత గ్రంథం 'తెలుగు జానపద సాహిత్యం–స్త్రీల గేయాల్లో సంప్రదాయం'. జానపద సాహిత్యంలో స్త్రీల పాటలకున్న ప్రాధాన్యం గణనీయమైంది. డా. సి. వసుంధర గారు ఎంతో శ్రమకోర్చి అటు జానపద విజ్ఞాన నేపథ్యాన్ని ఇటు ఇంటింటా స్త్రీలు పాడుకునే పాటలను రాశి పోసి అందించారు. వారు చిరకాలం హైదరాబాద్‌లోని సరోజిని నాయుడు వనితా మహావిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా సేవలందించారు. అంతేగాక జానపద సాహిత్య పరిషత్తు అధ్యక్షులుగా ఉన్నారు. జానపద సాహిత్య పరిశోధకులకు ఎంతో ఉపయుక్తమయ్యే ఈ మౌలిక గ్రంథాన్ని పరిషత్తు తరపున ప్రచురించడానికి అంగీకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

(డా॥ జె. చెన్నయ్య)

ప్రధాన కార్యదర్శి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు

తేది : 27-03-2015

ఉపోద్ఘాతం

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి ఒక సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా తెలంగాణాలో చిరకాలంగా తెలుగుభాషా సాహిత్యాల అభివృద్ధి కొరకు విశేషమైన కృషిచేస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలంగాణా సాహిత్యానికి సంబంధించిన అనేక గ్రంథాలను ప్రకటింపబూనడం సంతోషదాయకం. ఆచార్య నాయని కృష్ణకుమారిగారి పర్యవేక్షణలో రచింపబడిన నా పి. హెచ్‌డి. పరిశోధనా గ్రంథం "తెలుగు జానపద సాహిత్యము-స్త్రీల గేయములలో సంప్రదాయము"ను సంక్షిప్త తృతీయ ముద్రణగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వారా ప్రచురిస్తున్నందుకు పరిషత్తు అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణ్ ఆచార్య సి.నారాయణరెడ్డిగారికి, వారి కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

గ్రంథరచనా వ్యాసంగమున నేను సరళగ్రాంథిక భాషను గ్రహించి, దీర్ఘసమాసములను చేపట్టక ఎడనెడ విస్పష్టత కొరకు విసంధులను చేయుటను పండితులు మన్నింప ప్రార్థన.

మానవులు జన్మించినది మొదలు మరణించువరకు నిత్యజీవితమున పాటించు సంప్రదాయపరమైన పద్ధతులు అనేకములున్నను ప్రస్తుతము నా పరిశోధనాంశమున స్త్రీల గేయములే పరిమితమగుటవలన గేయప్రధానమైన సంప్రదాయములను మాత్రమే నేను గైకొనుటను గుణగ్రహణపారీణులగు సహృదయులు మన్నించ మనవి చేసుకొనుచున్నాను.

విధేయురాలు

సి. వసుంధర

విషయసూచిక

1. పరిచయము 1-2

2. కౌటుంబిక గేయములు 3-104

పరిచయము 1-2, భార్యాభర్తల అనుబంధము 7-18, సంతాన ప్రీతి 18-29, తల్లీపిల్లలు 29-49, పిల్లల ఆటపాటలు 63-67, కుటుంబము లోని యితర వ్యక్తుల పరస్పర సంబంధము 67-68, అత్తాకోడండ్రు 68-76, సవతులు 76-81, తోడి కోడండ్రు 81-83, వదిన-మరదలు 83-86, వదిన-మరిది 86-92, అన్నాచెల్లెండ్రు - అక్కాచెల్లెండ్రు 92-101, బావామరదలు-బావామరది 101-106, తాత-మనుమలు, అవ్వ-మనుమలు 105-106.

3. ఆచార ప్రదర్శక గేయములు 107-274

పరిచయము107-109, నామకరణము 109-122, సమర్త 122-131, వివాహము 131-140, వరుని వెదకుట 140-153, నలుగు పెట్టుట 153-156, అలంకరణ 156-163, ఐరేణి పూజ 163-172, కన్యాదానము 172, సన్నెకల్లు ద్రొక్కించుట 173, తాళి కట్టుట-174, తలంబ్రాలు 178-180, అరుంధతి దర్శనము 180-181, ప్రత్తిగింజలలుకుట 181-183, అక్కాతమ్ముని సంవాదము 184-189, వధూవరులు తాంబూలమందుకొనుట 189-191, వదినగారి వందనము 192-193, నాగబలి 193-198, బువ్వముబంతి 198-202, అంపకములు 202-218, శోభనము 213-218, మంగళహారతులు 218-222, చూలింత 223-232, సీమంతము 232-237, బాలెంత 237-255, ఒడిబియ్యము 255-260, మరణము 260-274.

4. వ్రతోత్సవ గేయములు 275-434

వ్రతము-పరిచయము 275-281, శ్రావణ మంగళవారము-మంగళగౌరి వ్రతము 281-288, శ్రావణ శుక్రవారము నోము, వరలక్ష్మీ

వ్రతము 288-292, గౌరీనోము 292-297. కేదారగౌరి నోము 297-303, చల్లచిత్తనోము 304-305, మోచేటిపద్మమ్మ నోము 305-308, చిట్టిబొట్టు 308-309. కామేశ్వరి నోము 309-312, ఏకాదశీ వ్రతము 312-316, లక్షవత్తుల నోము 316-318, వృక్షపూజ-పరిచయము, తులసిపూజ 318-326, కందగౌరినోము 320-327, చిక్కుళ్లగౌరి నోము 327-329, ములగగౌరీ వ్రతము 329-332, వ్రత ప్రయోజనములు 332, పండుగలు-పరిచయము 333, ఉగాది 334-339, శ్రీరామనవమి 339-348, ఏరువాక పున్నమ 349-353, నాగపంచమి-నాగులచవితి 354-371, కృష్ణాష్టమి 371-374, మేలుకొలుపుల ప్రసక్తి 375-378, బొడ్డెమ్మ పండుగ 378-385, బతుకమ్మ పండుగ 386-393, అట్లతద్దె 394-397, దీపావళి 397-403, సంక్రాంతి 403-414, హోళి 415-428, వ్రతోత్సవముల ప్రాముఖ్యత 426-427, గ్రామదేవతలు-జాతరలు 428-434.

5. శ్రామిక గేయములు — 435-503

పరిచయము 435-436, వ్యవసాయ ప్రధానములు-పరిచయము 437-440, వానపాటలు 440-445, విత్తనములు చల్లుట 445-449, నాట్లు 449-456, కలుపుతీయుట 456-459, చేనికావలి 459-463, కోతలు 463-469, నూర్పులు 469-475, గృహ పరిశ్రములు-పరిచయము 476-480, కవ్వము పాటలు480-484, రోకటిపాటలు 484-491, విసరురాతి పాటలు 491-499, రాట్నము పాటలు 499-503.

6. ముగింపు — 504

7. ఉపయుక్త గ్రంథసూచిక — 505-514

4. ఛత్తీస్‌గఢ్ లోక్‌జీవన్ ఔర్ లోక్ సాహిత్య కా అధ్యయన్ డా॥ శకుంతలా వర్మా, రచనా ప్రకాశన్, ఇలహాబాద్, 1972.
5. ధీరెబహో గంగా – దేవేంద్ర సత్యార్థి, రాజకమల్ ప్రకాశన్, ఢిల్లీ, 1948.
6. లోక్ గీతోంకీ సాంస్కృతిక్ పృష్ఠభూమి – విద్యాచౌహాన్, ప్రగతి ప్రకాశన్, 1949.
7. సోహాగ్ గీత్ – విద్యావతీ "కోకిల" జ్యోతి ప్రకాశన్, ప్రయాగ, 1953.

ENGLISH

1. Ancient Indian Festivals - Dr.K. Krishna Murthy, Archaeological Survey of India, Hyderabad.
2. Ancient Symbol Worship - HODDER M. Westropp and C. StaNIL AND WARE. Kumar Brothers, New Delhi, 1970.
3. Castes and tribes of Southern India - Edgar Thurston VOL.VI, VII, Government Press, Madras, 1909.
4. Folklore of Tamil Nadu - S.M.L.Lakshmana Chettiar - National Book Trust of India, New Delhi, 1973.
5. Folktales of Andhra Pradesh - Dr. B. Rama Raju, Sterling Publishers, New Delhi, 1974.
6. Folkways - W. Graham Sumner, Blaisdell Publishing Company, New York, 1940; 1965.
7. Fundamentals of Sociology - P. Gisbert, Orient Longman limited, New Delhi, 1976.
8. Golden Bough (Vol.I) Sir James George Frazer. The Macmillan Company, New York, 1953.
9. Hindu Religion, Customs and Manners - P. Thomas, D.B. Taraporewala Sons & Co., Ltd., Bombay.
10. The Hindu Religious Tradition - Thomas J. Hopkins, Dickenson Publishing Company, Inc.California, 1971.
11. Hindu Social organization - A Study in Socio-psychological and ideological foundations - Pandarinath H. Prabhu, Popular Prakashan, Bombay, 1961.
12. The Hindu view of life - Dr. Sarvepalli Radhakarishna Unwin Books, London, 1965.
13. History of Dharma Sastra - Vol.II, Part.II - P.V. Kane, Bhandarkar Oriental Research Institute, poona, 1941.
14. Indian Myths and Legends - Shantha Rameshwar Rao.
15. Indian Village - S.C. Dube, Routledge & Kegen Paul Ltd., London, 1961.

16. Kinship and Urbanization - Sylvia Vatuk, University of California Press, London, 1972.

17. Lore-Munro S. Edmonson. Holt, Rinehart & Winston Inc. Newyork, 1971.

18. Omens and Superstititions of Southern India - Thurstone.

19. On understanding Women - Mary R. Beard, Green Wood Press, Publishers Newyork, 1968.

20. The Position of Women in Hindu Civilization - Dr.A.S. Altekar. The Culture publication, Benaras, 1938.

21. Races and Cultures of India - D.N.Majumdar, Asia Publishing House, New Delhi, 1961.

22. Religion among the primitives - William J. Goode.

23. Shakti cult Ancient - Dr.Pushpendra Kumar - Bharatiya Publishing House, Varanasi, 1974.

24. A short History of Human Marriage - E. Westermarck Macmillan, London, 1926.

25. Social Disorganization - Mabel A. Elliot and Francis E Merrill Harper & Row, Publishers, Newyork, 1961.

26. Social organisation - Lowie Robert H. Routledge & Kegal Paul, London, 1950.

27. Some aspects of Social life in Ancient India (325 B.C.A.D.200) - Sandhya Mukherjee, Narayan Publishing House, Allahabad, 1976.

28. Sources of Indian Tradition - W.M. Teodore de Bary Columbia University Press, Newyork, 1954.

29. Tree and Serpent Worship - Ferguson.

30. The tribal Culture of India - L.P. Vidyarthy and B.K. Rai - Concept publishing Company, Delhi, 1977.

31. Tribal India - A. Synthetic view of primitiveman - P. Gisbert - Runt publications, Jaipur, 1978.

32. Universal Religion - R.N.Suryanarayana - published by the author, Mysore, 1952.

33. The village Gods of South India - R. Rev. Henry Whitehead - D.D. Association Press, Calcutta, 1921.

34. Woman in India - Mary Frances Bellington, Chapman & Hall Ltd., London, 1885.

35. A woman's thoughts about Women - Miss Dinah Maria Mulock - The F.M. Lupton Publishing Company - New York.

పరిచయము

జనపదమను పదము జనులుండు నివాసము, దేశవిభాగము, పల్లెటూరు, గ్రామము అను అర్థములలో వాడబడుచున్నది. శబ్దరత్నాకరకారుడు "జనపదము" అను పదమునకు దేశము, గ్రామము, గ్రామ సమూహము (అని కొందరు) అని అర్థములను తెలిపినారు.[1] ప్రస్తుతము నా పరిశోధనలో జనపదము అను పదము పల్లెటూరు, గ్రామము అను అర్థములకే పరిమితమైనది. జనపదములలో నివసించువారు జానపదులు (Folk). వారు పాడు పాటలు లేదా గేయములు జానపద గేయములు (Folk songs). అందులో స్త్రీలు పాడుకొనెడు గేయములను "స్త్రీల జానపద గేయములు" గా గ్రహించితిని. ఈ గేయములు జానపదులలో తరతరములనుండి మౌఖిక సాహిత్యములో భాగమై నిలచియున్నవి.

స్త్రీలు పాడుకొనెడు పాటలను పరిశీలించిన పాటలేని సన్నివేశమేదియును స్త్రీ జీవితమున లేదు. ఈ పాటల సాహిత్యస్థాయి స్త్రీకి సాంప్రదాయికముగా లభించెడి విద్యాస్థాయిని విదితము చేయును. ఈ పాటలలో స్త్రీలు తమ ఆచార వ్యవహారములతో బాటుగా పరస్పర సంబంధ బాంధవ్యములను, భక్తిని, నీతులను, నానుడులను, సామెతలను – ఈవిధముగా ఎన్నియో సొంపులను నిక్షిప్తము చేసినారు. స్త్రీల ప్రత్యేకతను నిలుపుటకు పాటలు ఒక సాధనమైనవి.

సంప్రదాయమనునది జాతి సంపద, జాతి జీవించియున్నంత కాలము అంతరంగ బహిరంగ ప్రభావముతో సంప్రదాయము మార్పులు చేర్పులకు లోనైననూ తన అంతస్సత్త్వమును మాత్రము కోల్పోవదు. అట్లు స్థిరాంశముతో నుండునదియే సంప్రదాయమనిపించుకొనును.

ప్రాచీన నిఘంటుకారుడైన అమరసింహుడు తన నామలింగాను శాసనమను అమరకోశమున "సంప్రదాయమును" – లెస్సగా శిష్యులకుపదేశింప బడునది అనియు, గురుపరంపరాగతమైన మంచి ఉపదేశమనియు నిర్వచించెను.[2]

సం+ప్ర+దా+ఘఞ్ – సంప్రదాయః[3] – "దా" అను ధాతువునకు ఇచ్చుటయని యర్థము. దీనికి "సం" అను ఉపసర్గము చేర్చుటవలన బాగుగా నీయబడినది, పరంపరానుగతముగా నీయబడినది సంప్రదాయము అను యర్థము లేర్పడుచున్నవి.

---

1. శబ్దరత్నాకరము
2. అమరకోశము – లింగా భట్టీయ గురుబాల ప్రబోధికా సహితము.పుట.697.
3. శబ్దకల్పద్రుమః

జాత్యభివృద్ధికి సంప్రదాయముననుసరించుట అవసరము. "సంప్రదాయములేని జాతి వెన్నెముకలేని శరీరమువంటిది. ఏ జాతి తన సంప్రదాయములను సంస్కార నికషముపై వఱసికొనుచుండునో ఆ జాతి పదికాలములపాటు బ్రతికి బట్టకట్టును."[1]

సంప్రదాయము గురువునుండి శిష్యులకు, పెద్దలనుండి పిన్నలకు, ఒక తరము నుండి మరొక తరమునకు అందునటువంటి విశిష్టమైన ఆస్తి. ఈ ఆస్తిని తరువాత తరములకు అందించుటలో స్త్రీలు ప్రముఖపాత్రను పోషించుచున్నారు.

జానపదుల పరస్పర ఆత్మీయానుబంధములు, కుటుంబ బాంధవ్యములు స్త్రీలు పాడుకొనెడు కౌటుంబిక గేయములలో స్పష్టమగును. జానపదుల సంప్రదాయ విరుద్ధమైన ఆచార వ్యవహారములు జననము మొదలు మరణము వరకు అనుష్ఠించు కార్యకలాపములలో ప్రస్ఫుటమగుచుండును. ఇట్లే నాగులచవితి, శ్రావణమాసపు నోములు, అట్లతద్ది, బతుకమ్మ పండుగవంటి పండుగలు కూడా స్త్రీల సంప్రదాయ పరిరక్షణమునకు చిహ్నములు. జానపద స్త్రీలు పాడుకొనెడు శ్రామిక గేయముల ఆధారముగా వ్యవసాయ వృత్తిపనులను గృహపరిశ్రమలను పరిరక్షించుటలో వారి పాత్రను అంచనా వేయవచ్చును.

ఈ పాటలు తెలుగుజాతి సంస్కృతీ సంప్రదాయములు వినాశమెరుగక విస్తరించుటకును, స్థిరపడుటకును ఎంతగానో తోడ్పడును.

స్త్రీలు పాడు గేయములలోని వైవిధ్యమును పురస్కరించుకొని వానిలో విరాజిల్లిన సంప్రదాయమును గుర్తించి ఆ గేయములను ప్రధానముగా క్రింది విధముగా విభజించుచున్నాను.

1. కౌటుంబిక గేయములు.
2. ఆచార ప్రదర్శక గేయములు
3. వ్రతోత్సవ గేయములు
4. శ్రామిక గేయములు

– పై ప్రకరణములలో జనపదములలో స్త్రీలు పాడుకొనునట్టి పాటలను – సంస్కారవతులు పాడునవి, సంస్కార రహితులు పాడునవి అను భేదము లేకుండా గ్రహించితిని.

---

1. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు – ప్రయోగములు, డా. సి. నారాయణరెడ్డి. పుట. 7

కౌటుంబిక గేయములు

భార్య, భర్త, పిల్లలు గల సమూహమును కుటుంబమని వ్యవహరింతుము. అమరకోశకారుడు కుటుంబశబ్దమునకు పరివారము, సంతతి మున్నగు అర్థములను చెప్పినాడు. వాచస్పత్యము "కుటుంబః– కుటుంబయతే పాలయతే ఇతి కుటుంబః" అనియు "కుటుంబ్యతే పాల్యతే సంబధ్యతేవా ఇతి కుటుంబః" అనియు వ్యుత్పత్తి చెప్పుచు, జ్ఞాతి, బాంధవుడు, సంతతి, పోష్యవర్గము అనునర్థములను చెప్పినది.[2] శబ్దకల్ప ద్రుమము కూడ కుటుంబమున కిదే విధముగా వ్యుత్పత్తిని చెప్పుచున్నది.[3] మోనేర్ విలియమ్స్ సంస్కృతాంగ్ల నిఘంటువునందు కుటుంబమనగా a house hold అనియు, members of a house hold అనియు, family అనియు పేర్కొనబడినది.[4] తెలుగులో కుటుంబమను పదము ఆంగ్లములోని family అనుపదమునకు సమానార్థకముగా వ్యవహరింపబడుచున్నది. పి. గిస్‌బర్ట్ "family" స్వరూపమును వివరించుచు "కొన్ని సమయములలో భర్త తల్లిదండ్రులుగాని, భార్య తల్లిదండ్రులుకాని వారితోబాటు నివసింతురు. కొన్ని సంఘములలో సేవకులు గూడ కుటుంబములోనివారుగా పరిగణింపబడుచున్నారు. కనుకనే ఆంగ్లమున 'family' అను పేరేర్పడెను. ఈ పదము famulus అను పదము నుండి పుట్టినది–దీని అర్థము సేవకుడు. ఇది సామాన్యమైన కుటుంబ స్వరూపము" అని పేర్కొనెను.[5] కావున కుటుంబమున స్థూలముగా భార్యాభర్తలు, వారి సంతానము–రక్తసంబంధీకులు మాత్రమేగాక పోషింపబడు సమూహమునుగూడ చేరుదురని

1. అమరకోశము–ద్వితీయకాండ, మనుష్యవర్గ
2. వాచస్పత్యము–మూడవ సంపుటము
3. శబ్దకల్పద్రుమము–Part II చౌకంబ సాంస్క్రిట్ series. office వారణాసి.
4. A sanskrit English Dictionary, by Sir Monier Monier-Williams Oriental Publishers-Delhi.
5. Fundamentals of Sociology-By P. Gisbert. P. 83 Orient Longman Ltd., New Delhi, 1976.

చెప్పవచ్చును. కాని ఈ పదము భార్య, భర్త, వారి పిల్లలు అను పరిమితార్థముననే నేడు రూఢమయినది.

పూర్వము కుటుంబము భార్య, భర్త ఉన్నయుగళముతోనే ప్రారంభ మయినదని మనము భావింపవచ్చును. కుటుంబము యొక్క ఉద్దేశ్యము సంతతి సృష్టికనుక సంతానమును పొందుటకు స్త్రీ పురుషులు చేరినప్పుడే కుటుంబము అనబడును. కుటుంబము అను వ్యవస్థకు ఆర్థిక, సాంఘిక, భౌగోళిక, సాంస్కృతిక విభేదములు అడ్డురావు. ఇది అనాదిగా వచ్చుచున్న వ్యవస్థ ప్రథమమున మానవుడు పశు ప్రాయుడై ఆహారాన్వేషణలో మృగమువలె సంచరించుకాలమున వావి వరుసలు లేని దశలో నిర్దిష్టముగా కుటుంబమను వ్యవస్థ లేదు. కుటుంబ వ్యవస్థ యేర్పడుట, మానవుడు నాగరిక సౌధము మొదటి మెట్టును మెట్టుటవలెనైనది. ఆదిమ కుటుంబమున ఒక స్త్రీకి ఒక పురుషుడను కట్టుబాటు స్థిరముగా లేని దశ యుండెడిది. వంశమును నిలుపుటకు భార్యను ఇతరులకు నియమించి సంతానమును పొందుట యొకనాటి సంప్రదాయము. దీనిని నియోగమనినారు. అటు తరువాత వంశము వారెవరైనను-తరచు భర్త తమ్ములు-వారినుండి సంతానమును పొందు పద్ధతి యేర్పడినది. దీనిని దేవర న్యాయమని వ్యవహరించిరి. వివాహయోగ్యతలేక సంతానమును పొందలేక ఏ గృహస్థునైనను సంతాన ప్రాప్తివరకు భార్యను బదులివ్వమనుట. సంతానానంతరము ఆమెను భర్త యొద్దకు తిరిగి పంపుట కూడ ఆచారమైయుండెడిది. అప్పు తీరువరకు భార్యను అప్పిచ్చిన వాని దగ్గర కుదువయుంచు ఆచారము నిన్నమొన్నటి వరకు ఉదకమండలములోని ఆదిమ జాతులలో నుండెడిది. ధర్మరాజు ఓడిపోయినందు ననే ద్రౌపదిపై దుర్యోధనునకు అధికారము కలిగినది. ఇది ఇంతకు మునుపు పేర్కొనిన ఆదిమజాతి సంప్రదాయమువంటిదే. స్త్రీని కుదువబెట్టుటకు మహాభారతములోని మాధవి కథను ఉదాహరించవచ్చును.[1] అప్పుపడినవాని భార్యపై గెలిచిన వానికి అధికారమున్నదనుటకు ఋగ్వేదములోని కితవసూక్తము మనకు గొప్పతార్కాణము.[2]

1. వ్యాస మహాభారతము. ఉద్యోగపర్వము. యయాతి మహారాజు పుత్రిక మాధవి కథ
2. కితవ సూక్తము-ఋగ్వేదము.

ఇవన్నియు కుటుంబవ్యవస్థ స్థిరపడని కాలపు పద్ధతులు కావచ్చును. కుటుంబవ్యవస్థ స్థిరపడిన తరువాత పాతివ్రత్యమనియు, ఏకపత్నీవ్రతమనియు ఏర్పడినవి. దాని వైభవ ప్రఖ్యాపనమే రామాయణమని తోచుచున్నది.

ఇట్టి కుటుంబవ్యవస్థ ఒక మర్రిచెట్టువంటిది. క్రమముగా పుత్రులు, పౌత్రులు, బంధుమిత్రులు తక్కిన బలగముచేరి ఊడలుబారును. కనుకనే గృహస్థాశ్రమమును మన ధర్మశాస్త్రములు గొప్పగా ప్రశంసించినవి.[1]

అల్లసాని పెద్దన గార్హస్థ్యమునిట్లు వర్ణించినారు:-

"కెలకులనున్న తంగెటిజున్ను గృహమేధి
యజమానుడంకస్థితార్థపేటి
పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు
దొడ్డిబెట్టిన వేల్పుగిడ్డికాపు
కడలేని యమృతంపు నడబావి సంసారి
సవిధ మేరునగంబు భవనభర్త
మరుదేశపథమధ్యమప్రప కులపతి
ఆకటి కొదవు సస్యము కుటుంబి
పథిక పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావ
ధూత కాపాలి కాద్యనాథులకుగాన
భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె!"[2]

కుటుంబవ్యవస్థలో మాతృస్వామ్య పితృస్వామ్య దశలుండినవి. మాతృస్వామ్యదశ ప్రాచీనమైనది. పురుషులు తమయధికారమును గుర్తించిన పిమ్మట పితృస్వామ్య వ్యవస్థ బలపడుటతో భార్య తక్కిన యుత్పాదక క్షేత్రములవలె ఆస్తిగా పరిణమించినది. కాళిదాసువంటివాడు కూడ స్త్రీని యింద్రియార్థ సాధనముగా వర్ణించినాడు.[3]

1. మనుస్మృతి-అధ్యాయము-3, శ్లో. 77-79.
2. మనుచరిత్ర-అల్లసాని పెద్దన 1-6.
3. రఘువంశము-సర్గ 14.

పి. గిస్‌బర్ట్ కుటుంబ వ్యవస్థను నిర్వచించుచు కుటుంబమనునది సంతానోత్పత్తి కొరకును, సంతానపోషణము కొరకును, ప్రేమ మరియు తృతీయ పురుషార్థ సంతృప్తికొరకును, ఆర్థిక సహకారము కొరకును, పరస్పర సహాయము కొరకును, వీనివలన నేర్పడు తదితర అప్రధాన చర్యలకొరకును, ఉద్దేశింపబడిన స్త్రీ పురుషుల శాశ్వత సంబంధమని చరిత్రవలన దెలియుచున్నది-యని పేర్కొనివాడు.[1]

ఏ కుటుంబ వ్యవస్థలోనైనను సమష్టిగా నున్నప్పుడే ఎక్కువ పని జరుగుట సహజము. మనయార్థిక వ్యవస్థ వ్యవసాయముపై నాధారపడినది. వ్యవసాయమునకు శారీరకమైన పరిశ్రమ యవసరము గనుక కుటుంబమెంత పెరిగినను కలసియేయుండుట తప్పనిసరి, దానివలన కమతము విచ్ఛిన్నము కాదు. పని ఉమ్మడిగా జరుగును.

సమష్టి కుటుంబములో తండ్రిగాని, పెద్దన్నగాని యజమాని; పెద్దన్న తండ్రితో సమానుడు. "జ్యేష్ఠభ్రాతా పితృసమానః"- అని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. తండ్రి తరువాత అధికారము తల్లిది. పిదప పెద్దకోడలు మున్నగువారు క్రమముగానధికారులు. సమష్టి కుటుంబములో పెద్దలను ఎదిరించు నవకాశమేలేదు: అందరును విధేయులుగా నుండవలసినదే. అట్లు కానినాడు ఆకుటుంబమవిభక్త కుటుంబముగాక విభక్తకుటుంబముగా చీలిపోవును.

భారతీయ సమాజము సమష్టికుటుంబమునే మొదటినుండియు సమర్థించినది. సమష్టి కుటుంబమును అధర్వవేదము రమణీయమగు భాషలో వర్ణించినది. సమష్టి కుటుంబములోనివారి మనస్సులు, హృదయములు ఏకము కావలెనని, ఆవును దూడ అనుసరించుచు పరస్పరము ప్రేమించినట్లు సమష్టి కుటుంబములోనివారు ఏకైక లక్ష్యముతో. ఏకైక వాంఛతో, ఒకే మనస్సుతో ఒకే నాయకుని అనుసరించుచు పరస్పరము ప్రేమించుకొనవలెననియు, వారందరును చక్రములోని ఆకులవలె అగ్నిచుట్టును చేరి పూజింపవలెననియు అధర్వవేదము వాంఛించుచున్నది.[2]

3. "The family appears in history as a permanent union of man and woman meant for the procreation and rearing of children, the satisfaction of love and sex tendencies, economic Co-operation, mutual help and other derived or secondary functions. "Tribal India-A synthetic view of Primitive man-by P. Gisbert.

2. అధర్వవేదం-III-30

భారతీయ సాంఘిక వ్యవస్థ సమష్టి కుటుంబమును ఎంతగా సమర్థించినను ధర్మశాస్త్రములెంతగా ప్రశంసించినను కాలక్రమమున విదేశీ సంస్కృతుల ధాటికిది తట్టుకొన లేకపోయినదనవచ్చును.[1]

సమష్టి కుటుంబవ్యవస్థ బలిష్టమైనదైనను క్రమముగా పరమత సంపర్కము వలనను పర పరిపాలన వలనను, కాల పరిణామముతోవచ్చిన పరిశ్రమలు మున్నగు క్రొత్త వృత్తుల వలనను - విచ్ఛిన్నమగుట సంభవించుచున్నది; విడి కాపురములు తప్పనిసరియయినవి.

కుటుంబ వ్యక్తుల మధ్యసుండు సంబంధబాంధవ్యములను, సామాన్య సంసార జీవితములలోనుండు ఒడుదుడుకులను జానపదగేయములలో కాంచనగును. కుటుంబమనగానే భార్య, భర్త, తల్లి, తండ్రి, కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, అత్త, మామ, వదిన, బావ, మరదలు మొదలైన సంబంధములు ప్రధానములు. కుటుంబమునకు సంబంధించిన పాటలలో ఆ సభ్యులమధ్యగల సంబంధముతోపాటు, ఆ కుటుంబము కాపాడుకొను సంప్రదాయముకూడ స్పష్టముగా వ్యక్తమగును.

భార్యాభర్తల అనుబంధము :

కుటుంబములో భార్యాభర్తలకు గల పాత్ర అతిముఖ్యమైనది. భార్యాభర్తలు కలసిమెలసి అన్యోన్యమైన అనురాగమును ప్రదర్శించి స్వర్గసుఖము లననుభవించు వారును. క్షణక్షణము పరస్పరము పోట్లాడుకొనుచు మనస్పర్థలను పెంచుకొని యిల్లును నరకకూపమును చేసుకొనువారును కలరు. జానపదుల ముగ్ధ ప్రేమానురాగములను, సుఖ దుఃఖములను, కోపతాపములను తెలుపు పాటలలో వీరి జీవిత ధర్మమంతయు సాక్షాత్కరించుటయేగాక కౌటుంబికమైక సంప్రదాయము తేటతెల్లమగును.

భార్య పుట్టింటి వారిని గూర్చి వారిగొప్పతనమును గూర్చి తెలుపుచు పాటలల్లుచుండుట సహజము. ఎంతసేపు పుట్టింటి గొప్పతనమేకాని తనను గూర్చి పలుకదేమని భర్త

"అన్నల్ని పాడేవు, తమ్ముల్ని పాడేవు
నన్నేల పాడవే? సిరిగౌరి దేవి" ....[2]

---

1. Fundamentals of Sociolgy by P. Gisbert. P. 85, 86.
1. పదవాఙ్మయంలో స్త్రీ (వ్యా)-సారస్వత వ్యాసములు. రెండవ సంపుటము పుట-236.

అని అడుగగా "ఏమని పాడేది వె(రిమాధవుడ" అని భార్య జవాబు చెప్పుచు "పాలల్లో పనసపండు, నీళ్లలో నిమ్మపండు" గలసిపోయిన భార్యాభర్తలను గూర్చి చెప్పవలసినదేముండునని చమత్కరించును. అంతటితో తృప్తిపడని భర్తలు

"తర తరంబులవారు తరియించపాడు
కాకి బాణము తొడిగి కంచురథమెక్కి
కాముడు నావాడ వచ్చెనని పాడు
నాద బాణము తొడిగి నవసజ్జనెక్కి
నా శివుడు నావాడ వచ్చెనని పాడు"[1] మని అడుగును.

భర్తనే దైవముగా భావించునదైనను భార్య అట్టి భావములను మాటల రూపమున వ్యక్తీకరించిన తృప్తిపడువారనేకులుందురు. మాటలలో భర్త కెదురుపడి చెప్పకపోయినను

"ఏవూరు చూసినా మావూరుగాదు
ఏవార్ని చూచినా మావారు గారు [2]

– అని తన మెట్టినూరు ఉత్కృష్టతను, భర్త ఆధిక్యమును వెల్లడించును.

తనకు సంబంధించిన ప్రతిపనియును తన స్త్రీయే చేసి పెట్టవలెనని కాంక్షించు భర్తలను సంతృప్తిపరచు భార్యలు సర్వ సాధారణముగ నుందురు. అట్టి భావమును ప్రదర్శించునదే సంవాదాత్మక రూపమున నున్న ఈ క్రిందిపాట:–

పు: ఇరుగోరి మాటలు ఇనవచ్చెలేవే
చిలుక నీళ్ళు తోడె, జలకమాడేని
హంస అన్నము పెట్టె ఆరగించేనే
వెలది మంచమెయ్యె వెన్నెలాబైట
పణతి పానుపు పరచు పవ్వళించేనే
సున్నం కాయ దేవె సుట్టియ్యె విడెము
విడెము సుట్టే పణతి సగము కొరికియ్యె

1. సెలయేరు పుట–110
2. సెలయేరు–114.

స్త్రీ:- ఎంగిలెంగిలి సామి యెగ్గుపట్టేవు

పు:- మనకేమి ఎంగిలే సతికి పురుషునకు [1]

ఒక్కొక్క స్త్రీ పాదము నట్టింట సిరినొలికించుననునట్లు అడుగు పెట్టుటతోడనే పురుషునకు మంచి అదృష్టము కలసివచ్చి సుఖపడునవకాశము కల్గిన ఆ భార్యనాతడు అందలమెక్కించును.

పు:- నీతోనే లచ్చీమి నాకొచ్చినాదే మరుదాలా
నువురాకముందమ్మా నాకేమి లేదు ॥
ఎలుక గొడుదామన్న ఏడిత్తుల్లేవే ॥
ఇంటెనుక జూతైమ్మ (చూస్తేనమ్మ) ఎలుకపెంటాలే మరుదాలా
నీతోనె లచ్చీమి నాకు వచ్చినదే ॥
నువురాక ముందమ్మా నాకేమి లేదే ॥
నువు వచ్చిన గడియ లచ్చిమొచ్చిందే ॥
నువు వచ్చిన గడియ దనము వచ్చిందే ॥
నువు వచ్చిన గడియ దొడ్డి పెరిగిందే ॥
నువు వచ్చిన గడియ ఇల్లు పెరిగిందే ॥ [2]

– భర్త అభిమానమునకు పాత్రమైన భార్య

"ఓ బావ సుబ్బయ్యా నీకు దండమురాబావయ్య" అని జోతలెత్తును.

కినుక వహించిన భార్యలు పుట్టింటికి ప్రయాణము కట్టుట పరిపాటి. పోతే పోనిమ్మని ఊరకొను భర్తలు కొందరు. ప్రాణప్రదముగ నెంచి పోవద్దని ప్రాధేయపడు వారు మరికొందరు. ఒక భర్త గతస్మృతులను గుర్తుచేయుచు

పోతే పోనిస్తానటె వీరగౌరు
నిన్ను పొలిమేర దాటస్తానటే లీలగౌరు
గుంటూరు దిబ్బలమీద వీరగౌరు
మనం గూటీబిళ్ళ ఆడలేద లీలగౌరు

1. సెలయేరు పుట-129
2. తెలంగాణా పల్లె పాటలు-పుట 119.

కోరుకొండ బజారులోను వీరాగౌరు
నిన్నుకోరి పెళ్ళాడలేదా లీలగౌరు
ఏలూరు సంతలోను వీరాగౌరు
నిన్నెంచి ప్రేమించలేదా లీలాగౌరు-[1]

- అని ఆమె పోవుటను అడ్డగించును. అవిభక్త కుటుంబములో అణకువగల్గిన స్త్రీ పుట్టింటి ప్రయాణమునకు అనుమతిపొందుట గగనకుసుమము. అత్తమామలు, తోడికోడలు, బావ, మరది-ఒకరి తరువాత ఒకరిని అందరిని "మా అన్నవచ్చెను మమ్మంపుతారా" అని అడగవలసినదే. అడుగకుండ ఆమెమనసునెరంగి అనుమతించు అత్తమామలు అరుదు. సామాన్యముగా అందరును "నేనెఱుగ నేనెఱుగ నంటు" తప్పించుకొందురు. ఈ పాటలోనంతే జరిగినది. చివరకు భర్తనడుగ

"పెట్టుకో సొమ్ములు, కట్టుకో చీరె
పోయిరా సుఖముగా పుట్టినింటికిని" -[2]

- అని అనుమతిచ్చెను. వేరింటి కాపురముచేయు పడతులు తాము పుట్టింటికి వెళ్ళిన సంసారమును కనిపెట్టుకొని యుండువారు లేరే అను విచారమున తప్ప ఎప్పుడు మనసువచ్చిన అప్పుడు పుట్టింటి ప్రయాణము కట్టుచుందురు. భర్త అనుమతిపొందిన చాలును. అందుననుకొందరు ఎవరి ప్రమేయము లేకుండగనే పుట్టింటికి బయలుదేరు వారును ఉందురు. ఇట్టి సంఘటనలు పరిస్థితులపైనను, అవసరములపైనను ఆధారపడియుండును.

సొమ్ములపైన స్త్రీలకు కోరిక సర్వసాధారణము. పనీ పాటాలేకుండ ఇంటనే కాలము గడుపు మగవాడైనను నగలు చేయించెదనని భార్యతో శపథములు చేయుటకద్దు. అట్టియెడ సంపాదన కలిగిన భర్తల మాట చెప్పనవసరము లేదు. భార్యల కోరికలను కాదని త్రోసిపుచ్చు భర్తలరుదుగా నుండెదరు. ఇచ్చట సంపాదనలేని భర్త మాటలిట్లున్నవి-

1. సెలయేరు పుట-128
2. పద వాఙ్మయంలో స్త్రీ (వ్యా) సారస్వతవ్యాసములు రెండవ సంపుటి. మరియు మిన్నేరు పుట-194;

"కోరిన సొమ్ములు చేయిస్తానే
కోపము చేయకె ప్రాణసఖి
ఊరకె యింట్లో నున్నానని
కండ్లురిమి చూడకే యిందుముఖీ" [1]

ప్రియులు బ్రతిమాలు వారున్న, వారిని స్త్రీలు ఉవ్విళ్లూరించుచు మాటలు పొడిగించెదరు.

స్త్రీ:- వస్తానుగాని మామ వస్తానుగానీ....నన్ను
కొట్టకుండ తిట్టకుండ పెట్టుకుంటావా ?
పు:- నిన్ను కొట్టకుండ తిట్టకుండ పెట్టుకుంటాను నువ్వు
యెవ్వరితోను మాట్లాడకుండ వుంటావు కదా?
స్త్రీ:- యెవరితోను మాట్లాడకుండ వుంటాను కాని నే
నవ్వేటి నవ్వు మొఖం యెట్ల పెట్టేది?
పు: నవ్వేటి నవ్వు మొఖం అట్ల పెట్తేను నా
చేతిలో వుండె చారకోలు చెండాడదా?
స్త్రీ:- చేతిలో వుండె చారకోలు చెండాడితే నా
నోట్లో వుండె బండమాట బయటెల్లదా?
పు:- నోట్లో వుండె బండమాట బయటెల్లితే నా
కాళ్ళ వుండె కిర్రుజోడు దవడాదడా? –[2]

– ఇంతవరకు సాగిన బెదిరింపులు ఆపైన వ్యంగ్యాత్మక రూపమును దాల్చును. వారి దారి పెడదారి పట్టినది.

పు:- నీ అమ్మగారింటికీ నీవెల్లితే
నే కొట్టుకుంట తిట్టుకుంట తోడ్కొనిరానా
స్త్రీ:- కొట్టుకుంట తిట్టుకుంట తోడ్కొనొస్తే
కూడు నీళ్లు వండకుండ దిగనూకనా

1. మిన్నేరు పుట–203.

2. పల్లెపదాలు పుట–237.

పు:- కూడు నీళ్లు వండకుండ దిగనూకితే నే
సేద్యానికి పోకుండ యెగనూకనా?
స్త్రీ:- సేద్యానికి పోకుండ యెగనూకితే
బావిలోవున్న గుంటలోన నేను పడనా-[1]

– అని ఆఖరి ఆయుధమును ప్రయోగించును. అతడంతకన్న ఘటికుడు "వెట్టోణ్ణి" పిలిపించి యెత్తించెదననును. "వెట్టో ణ్ణి పిలిపించి యెత్తించితే దెయ్యమై భూతమై పట్టెద"-నను ఆమె. "అట్లయితే వైద్యుణ్ణి పిలిపించి వదలగొట్టిస్తా నంటాడు" అతడు. ఇలా ఒకరి నొకరు బెదిరించుకోవడముతో సరిపోయిన సరే. అట్లుగాక చిలికి చిలికి గాలివానయగు పరిస్థితులును ఏర్పడుచుండును.

కినుక వహించిన కాంతను ప్రసన్నురాలనుగావించుకొనుటకు వస్తువుల నేన్నింటిని పంపినను ఆమె వంకలు చూపుటకే ప్రయత్నించును.

పు:- ఎలనాగరో నిన్ను ఎవరేమన్నారే
అలివేళి నామీద అలగితివేమో
పెద్ద పెల్లంగట్ల-పేరు బంపితినీ ॥ఎ॥
స్త్రీ:- పేరు మంచిదెగాని-చాత తక్కువరా
పు:- అనుమకొండగంట్ల-అందెలు బంపితినీ ॥ఎ॥
స్త్రీ:- అందెలు మంచివెగని-మోత తక్కువరా-[2]

అని అతడు పంపించిన 'చింతగట్టంగట్ల చీరెకు చింగుతక్కువనియు", "బోనాగిరంగట్ల బొట్టు నొప్టి కతుకడములేదనియు, "మట్టెవాడంగట్ల మట్టేలకు గట్టి తక్కువయిందనియు మంచిలోనే కించిత్తు లోపమును ఎత్తి చూపును.

నగలు, చీరెలు-స్త్రీలను బాగుగా ఆకట్టుకొనును. వాటి మోహమునకు గురై కొందరు స్త్రీలు వక్రమార్గములననుసరించుటయుగలదు. ఒక అనుకూలవతిగాని యిల్లాలు "చీరెలు లేకున్న చీరెలవాడ్ని (చీరెలమ్మువానిని) కూడితే చీరెలిచ్చును"గదా యని తప్పు త్రోవ తొక్కును. ఆ సంగతి తెలిసి భర్త భార్యను బాదును. అందులకు

1. పల్లె పదాలు-పు. 238.
2. తెలంగాణా పల్లె పాటలు. పుట-123.

"మందిమాటలు నీవింటివి మొగడ
దిబ్బదిబ్బ నసుగొడితివి మొగడ
బాయిలంట పడిపోతర మొగడ
యెవ్వలిల్లు చెడిపోవుర మొగడ" [1]

– అని ఆమె మందలించును. చిన్న చిన్న పొరపాటుపనులను సరిదిద్దుకొని పోవుటయే సరియైన పద్ధతియను హెచ్చరిక ధ్వనింపజేసినది. ఇట్టి స్త్రీలు చాల అరుదుగా నుందురు.

భారతీయుల అవిభక్త కుటుంబములనే అధికముగా వాంఛించినను అత్త పోరును. ఆడబిడ్డలపోరును భరించలేని స్త్రీలు వేరుకాపురములను పెట్టుటకే భర్తలను ప్రోత్సహించెదరు. అందులకు తోడుగా భర్తలు అమాయకులో, అనుకూలురోయైన యెడల ఇంకనాయిల్లాలు ఆడింది ఆటగా, పాడిందిపాటగా నుండును.

ఛాయ పసుపులాగ ననుదెచ్చినావు
సరసుడా! మీ తల్లి సాధింపుచూడు
ముద్ద పసుపులాగ ననుదెచ్చినావు
ముగ్దుడా! నీతల్లి మూతిరుపుచూడు. [2]
– అని పలుకుటయేగాక
సందమామకన్న సక్కాని మొగుడా
వేరే పోదామా ?
అత్తమామలపోరు నేమ పడలేను
ఆడబిడ్డల పోరు నేను పడలేను ॥స॥– [3]

–అని వేరింటి కాపురమున కామె భర్తను ప్రోత్సహించును. వేరు పడిన గలుగు లాభములను అతనికి సచ్చచెప్పజూచును.

"ఏరుబడ్డ తెల్లారి ఏకమైమనముండి
ఏకించి పీకించి నెలకొక్కపోగొడికి
మోటదండెద దొడ్డు మొలతాడు చేయిస్తు ॥ఏడు॥
మక్కజొన్న చేను మనపాలికే వస్తే

1. తెలంగాణా పల్లెపాటలు పుట–184.
2. మిన్నేరు–పుట 197
3. మిన్నేరు–197. (ఇదే పాట పల్లెపదాలు – పుట. 103లోను కలదు.)

నక్క బెదురూ బెట్టి నా(ప్రజ్ఞ చూపించి
ఇద్దామ్ము పండేది పుట్టెడు పండిస్తు ॥ఏడు॥
రంగు రంగొంకాయలు గొంగెడన్నీ దెంపి
హంగుగా నేనన్మకొండంగడికి పోయి
పొంగుబొంకే కల్లు బుంగెడంతాదెస్తు ॥పడు॥ [1]

అని ఆశలు గొలుపును. ఈమె వైఖరి చూచిన "కలసి ఉన్ననాడు కాలు మెదుపలేనమ్మ, ఏరుబడ్డాక ఏదుము మోసిందన్నట్లు"న్నది. ఇంకొక యిల్లాలు పొదుపునంతయును పొదిగి నీతి బోధచేయును.

"పాలు మాలక నీవు పాలుపంచుకుంటే
కూలినాలి జేసి నిన్ను కూర్చోబెట్టి
సోలబియ్యములోను సొరగొట్టి యొకగిద్ద
విడుపు బత్తెముక్రింద పెనుకేతు నొకరోజు
గిద్దపెసరాపప్పు గిన్నెతోడను వండి
వద్దు వద్దన నీకు వడ్డించి నేతిసగ
ముద్దజేసికొంత మూలదాచిపెట్టి
ప్రొద్దున చద్దితో పొలముకే పంపింతు" [2]

– ఈ పాటలోని పొదుపు పద్ధతిని చూడగా "ఈచేతబెట్టి మోచేత నాకించినట్లు"న్నది.

పొరపొచ్చములు లేకుండ గడచిపోవు సంసారములు చాలతక్కువ. ఏదైన అనుమానము వచ్చిన భర్త ప్రతిదానిని అనుమానముతోనే చూచుచుండును. ''అనుమానం ప్రాణసంకటం'' అన్నారు పెద్దలు. ఈ అనుమానము కలుగకూడదేకాని కలిగిన పెనుభూతమై వేదించును. ఇట్టి అనుమానమును కొందరు స్త్రీలు చమత్కారముగా తొలగింపజూతురు. ఎంత అనుమాన ప్రాణియైనను భర్త ఆమెతోనే సంసారము చేయవలెను గనుక ఆమె మాటలు వినక తప్పదు.

భర్త :– చిన పాపా చినపాపా నీచీరా చినిగిందేమిటే
నీచీరా చినిగిందేమిటే.
భార్య:– పాటే లింటికి పాలకు పోతే పసుగడి తట్టిందోయ్
ఆచీరా అపుడే చినిగిందోయ్.

1. తెలంగాణా పల్లెపాటలు 120
2. మిన్నేరు – 198.

"రవికె చిరుగడానికి అజాను రోకలి బుజానపెడితే చిరిగిందని, కుంకుమ చెదరటా నికి ఉడుకుడుకంబలి ఊదుక తాగితె చెమటకు చెదిరిందని. కాటిక చెదరటానికి" ఎచ్చికట్టె పచ్చికట్టె పొయిలేసి ఊదితే పొగాన చెదిరిందని" సరిదిద్ది చెప్పును.[1] సరిదిద్దిచెప్పుటలో అనుమానము కలుగకుండు సహజత గమనింపదగినది.

ఇంకొకతె అనుమానము ప్రాణసంకటముగా మారకుండ నవ్వుచు నవ్వుచునే సమాధానములతోనే తృప్తి పరచ ప్రయత్నించును.

భర్త:- బాయినేను-కట్టెలు తెమ్మంటె
కొప్పునున్న పూలు-ఎక్కడివె భామా? నీ
" " "
ఆత్తేరి పూలు ఎక్కడివే భామ-ధూత్తేరి పూలు ఎక్కడివె భామా.

భార్య:- గాలి ధూళి వచ్చి-గంపంత మబ్బొచ్చి
కొమ్మ ఊగికొప్పు-నిండింది మగడా
నాతోడు రంకాడలేదు-అబ్బతోడు రంకాడలేదు
నీతోడు " -అమ్మతోడు "

భర్త:- ... .
కొంగునిండా దుబ్బ-ఎక్కడిదె భామా

భార్య:- పాటేలు ఇంటికి పాలకని పోతేను
కత్తెకోడె కాలు-దువ్వింది మగడా.

భర్త:- ....
చెంపనున్న కాటు-ఎక్కడిదె భామా

భార్య:- కోమటోరింటికి-కొబ్బరికి పోతేను
తక్కెట్ల గుండొచ్చి తగిలింది మగడా

భార్య యిట్లు ప్రతి దానికి ఒక జవాబును కల్పించి చెప్పును. చివరకు భర్త మితిమీరిన అనుమానముతో "మంచం క్రిందివాడు-ఎవ్వాడేభామా" అని నిలదీసి అడిగినప్పుడు "ప్రక్క ఇంట్లుండేది పడుసు పిల్లోడు, పిల్లికి తలనొస్తే నల్లికొచ్చిండు"[2]

1. తెలంగాణా పల్లెపాటలు-పుట. 148.

2. తెలంగాణా పల్లెపాటలు పుట-132.

–అని సరిదిద్ది హాస్య వచనములతో తేల్చివేయును. ఈ మాటలో ఎంత చమత్కారమున్నట్లు భాసించినను అనుమానమునకు ఆస్కారము లేకపోలేదు. మనిషికి తలనొచ్చిన నల్లివాసన చూచిన తలనొప్పి తగ్గునని డా॥ రామరాజు గారు పేర్కొనిరి. "కాని పిల్లికి తలనొచ్చిన నల్లి కొచ్చిందు" అనుట అబ్బురమే. "ఆడది అబద్ధమాడితే అడ్డుగోడ పెట్టినట్లుండును" అని అందురుగాని ఇక్కడ తడికపెట్టినట్లునులేదు.

ఏ పొరపాటులు చేయకపోయినను భర్తలకు అనుమానము రేకెత్తునట్లు పలికి వానిని చమత్కారమైన మాట నైపుణ్యముతో విడమర్చి చెప్పగడుసు పెండ్లాముల హాస్యములు మధురములు. అట్టి సంభాషణమే ఈ క్రిందిపాటలో చమత్కరింపబడినది.

స్త్రీ:– ఒకరికీ చేతులిచ్చాన్ ఒకరికీ కాళ్ళనిచ్చాన్
ఒకరీని చేతబట్టి కూకున్నానోయ్ బావా కూకున్నానోయ్.
పు:– ఎవరికీ చేతులిచ్చావ్ ఎవరీకి కాళ్ళనిచ్చావ్
స్త్రీ:– గాజుల్కీ చేతులిచ్చాన్ కడియాలకి కాళ్ళనిచ్చాన్
డబ్బుల్నీ చేతబట్టి కూకున్నానోయ్ బావా కూకున్నానోయ్
స్త్రీ:– ఒకరీనీ నానవేశాన్ ఒకరీని చితకాకొట్టాన్
ఒకరీనీ చుట్ట చుట్టి కూకున్నానోయ్
పు:– ఎవరీనీ నానావేశావ్ ఎవరీని చితకా కొట్టావ్
ఎవరీనీ చుట్టా చుట్టి కూకున్నావే పిల్లా కూకున్నావే
స్త్రీ:– సున్నాన్నీ నానవేశాన్ వక్కల్నీ చితకకొట్టాన్
ఆకుల్నీ చుట్టా చుట్టి కూకున్నానోయ్ బావా కూకున్నానోయ్
స్త్రీ:– ఒకరీనీ కట్టి వేశాన్ ఒకరీనీ వదలీ వేశాన్
ఒకరీనీ చేతబట్టి కూకున్నానోయ్ బావా కూకున్నానోయ్
పు:– ఎవరీనీ కట్టి వేశావ్ ....
స్త్రీ:– ఆవుల్నీ కట్టివేశాన్ దూడల్నీ వదిలీవేశాన్
చెంబూనీ చేత బట్టి కూకున్నానోయ్ బావా కూకున్నానోయ్.[1]

1. పల్లెపదాలు –పుట. 93

–ఇట్లు అడుగడుగునా అనుమానము కలిగించుచు, చిక్కును విప్పివేయుచు వెర్రిబావ తేరుకునే లోపల ఆవును పితికి చెంబునిండా పాలుకూడ తీసుకొని వచ్చేటంతటి తెలివితేటలు కలవారుగానుందురు.

ఇట్టి సమయమున సర్దుకొనిపోవు స్వభావము కలవారైన సరేసరి. లేకున్న అనుమానము పెనుభూతమై సంసారములు నరక ప్రాయమగును.

ప్రక్క పాపిడేలనని – ప్రక్కలిరగ తన్నేడే సిరిసిరిమువ్వ
జాకెట్టు తొడిగితే – షోకేలనని తన్నేడే ,,
పాకిదాని లాగుంటేని – పకపకలాడు నవ్వేడె,, [2]

"కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు నిక్కము సుమతీ" అన్న సుమతి శతకకారుడు అందుకే అనుభవజ్ఞుడు.

భర్తలపై అలుకలను సాగించి భర్తలచే అపురూపముగా భావింపబడు భార్యలును కలరు.

భార్య :– కాముడా కాముడా వలలో కట్టెక్కి పోంగా వలలో
కట్టకాళ్ళ బెసిగె ,, గంగారేగుముల్లా వలలో
సీతకాళ్ళ బెసిగె ,, జిట్టిరేగుముల్లా ,,
ముల్లుదీయి కాముడా ,, ముల్దీయవయ్యా ,,
భర్త :– ముల్లెట్లు దీస్తూనే ,, ఈ మూకాలోనా ,,
కాలెట్ల ముడుదూనే ,, ఈ కంతాలోనా ,, –[3]

అని యొక్క భర్త ప్రేమగా వెనుకాడును. ఆమెకు కలిగిన బాధను అతడు అర్థము చేసికొనినను ఆమె బాధను ఉపశమింపజేయుటకు అది ఏకాంత స్థలముకాదాయెను. అదొక క్రంత, అచ్చట ప్రజల మూక యుండుటవలన వెనుకాడినాడు. ఆమె కాలి బాధను తగ్గించుటకు విసనకర్రతో విసరినను, "గుండంల పూలన్నీ గుప్పి లేపినను" లాభము లేకపోయినది. 'కాలంటి తీసిన కరుణించి లేచునని' కాలంట బోగానే గుణతి కదిలినది.

---

1. పల్లెపదాలు –పుట. 106
2. తెలంగాణా పల్లెపాటలు 71.

పై పాటలలోని కొన్ని సామెతలు :

వల్లని భార్య చెయ్యితగిలినా తప్పే కాలు తగిలినా తప్పే;
'ఎరువు సొమ్ములు పెట్టుక మొగని కాళ్ళ మొక్కితే.
కల్గితే చేపిస్తాగాని కల్లుకు పైసలిమ్మన్నాడట'.

– సామెతలు సంఘానుభవ ఫలితములు. ఎందరో వ్యక్తుల అనుభవముల సమష్టి స్వరూపమే సామెతలుగనుక అవి సంఘములోని వివిధ దృశ్యములను మనకు కనుల గట్టినట్లు చేయును. ఈ సామెతలను పాటలలో మిళితముచేసి వానిని శాశ్వతముగా నిలిపినారు జానపదులు. "జానపద మనస్తత్వము కలిగిన వారైననేగాని ఈ గేయములను ఆదరించలేరు. అందుచేతనే మనదేశములో పండిన మధురమైన గేయసంపద విశేష ప్రజాదరణమునకు నోచుకొనకజాలక మూలలంట ఒదిగి పడివుండవలసిన గతి తటస్థించినది.[1]

సంతాన ప్రీతి:–

గృహిణియైన స్త్రీకి సంతానాపేక్ష మిక్కుటముగా నుండును. కోరినదే తడవుగా సంతానవతి అయిన స్త్రీకి ఎట్టిలోటును ఉండదు. ఆమె సంతానము ముద్దు ముచ్చటలను తిలకించుచు కలలు గనుటయేగాని సంతానము కలుగకపోవుట వలన ఏర్పడు మనోవ్యధ ఆమెకుండదు. అట్టి కొరత కలిగి సంతానము కొరకు అంగలార్చు వారి పాట్లు వర్ణింప తరముగానివి. ఇట్టి గేయములు అన్ని భాషలలోను కోకొల్లలు; చిరకాలమునుండియు గృహిణుల నోళ్ళలో నాని పోయినవి. వారి హృదయము నుండి పెల్లుబికి వచ్చిన భావప్రవాహమునకు ఆనకట్టులు వేయుట సాధ్యముకానిది.

సంతానము కొరకు ప్రతి గృహిణియు పడుబాధ సామాన్య ధనికభేదము లేక ఒకే తీరుగా నుండును. ఇంటినిండ వ్యక్తులున్నను సంతానము లేని యెడల ఇల్లాలికి ఇల్లంతయు నిర్మానుష్యముగా గోచరించును.

1. మన గేయ సాహిత్యము (వ్యా) శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి భారతి. మే 1941 పుట. 578.

సంతులేని యిల్లు సావడికొట్టము
పిల్లలు లేని యిల్లు పీర్ల కొట్టము
బాలలు లేని యిల్లు బందిఖానా [1]

అని సంతులేని యిల్లాలు సంతానాపేక్షను వ్యక్తము చేయును. తినుటకు తిండి, కట్ట వస్త్రము, ఏలుటకు రాజ్యములున్నను వ్యర్థమనిపించును. నేలను ప్రాకు చీమదగ్గరనుండి చెట్టు గూటిలోనుండు జీవ జంతువులన్నింటికిని సంతానము కలదు కాని తనకు లేకపోయెనే అని ఆవేదన ననుభవించును.

స్త్రీ మాతృత్వములోనే పరిపూర్ణత్వమును అనుభవించును. కనుక ఆమెకు సంతానములేని జీవితము నిస్సారమనిపించును. అందమైన పిల్లలు తల్లిని ఆత్మీయతతో చుట్టివేసిన అంతకంటె ఆమె కోరునదేదియునుండదు. ఏదేశకవితను చూచినను మాతృత్వము కొరకు ఆవేదనపడు అతివలు కొల్లలుగా కానవచ్చెదరు. ఆమెకు ప్రకృతిని చూచిన కొలది ఈ ఆవేదన మిక్కుటమగును.

"ఓద్రాక్ష తీగ నీ అదృష్ట సంపద నేమని పొగడుదును
అంతటి తీయని పండ్ల గుత్తులతో వంగుటకు గర్వించుచున్నావు.
ఆతాటి జాతిని చూడుము. ఇసుకమీద నిలబడి ఎట్లు విర్రవీగుచున్నదో-[2]

– ఈ గేయము సంతానాపేక్ష మాత్రమేకాక ఆసంతానము అందముగను. లోక రంజకముగను ఉండవలెనను తల్లి హృదయమును తెలుపుచున్నది.

సంతానమును పొందుటకు స్త్రీలు పడరాని పాట్లు పడుట కలదు.

"సింహాద్రి అప్పన్న గుళ్ళముందార
పడ్డారె గొ(డ్రా)ళ్ళు ప్రాణాచారమ్మొ
ఎందుకు పడ్డారు యేల పడ్డారు

---

1. మల్లన్నకథలో నీల(లి)మాదేవి ఆవేదన. నేను సేకరించినది. పాడినవారు రాసులోల్లబుగ్గమ్మ, ఈపాటలోని ఉదాహరణములో నొకవిశేషమున్నది. ముసల్మానులు మొహరము పండుగనాడు హుసేన్ ధ్వజచిహ్నమగు హస్తమును గ్రామమునందలి చావడియందు నిలుపుదురు. ఈ హస్తములు (పీరీలు) ఎన్నియున్నను ఆస్థలమంతయు విషాదముతో కళాకాంతులు లేక యుండును. అట్లే పిల్లలులేని యిల్లుకూడ విషాదఛాయతో నుండునని భావము.
2. A woman's thoughts about women..., Miss Mulock. P. 55 The F.M. Lupton Publishing company, New York.

సంతానమియ్యమని చాలపడ్డారు - సంతాన॥
బిడ్డల నియ్యమని కోరిపడ్డారు - కుమాళ్ళ [1]

- కోరిక తీరిన సింహాద్రి అప్పన్నకు "గుడి తిరుగు వస్త్రాలు, గుమ్మడి పళ్ళు. తాగళ్ళ వడపప్పులు, దండు బెల్లాలు" - అర్పించుకొనుటకు సిద్ధపడుదురు. ఈశ్వరుని గుడులకు ఇటుకలు మోయుట, రామయ్య గుళ్ళకు రాళ్ళుమోయుట, "రావియ్య చెట్టుకు"[2] ప్రదక్షిణములు చేయుట సామాన్య విషయముగా గోచరించును. వంధ్యలకు సంతాన ప్రాప్తికై ప్రాచీన వైద్యక గ్రంథములోనేగాక అధర్వవేదమునందును కొన్ని పక్రియలు సూచింపబడినవి.

"శమీ మశ్వత్థ ఆరూఢస్తత్ర పుంసవనం కృతం
తద్వైపుత్రస్య వేదనం తత్ స్త్రీ ష్వాభరామసి
పుంసోవై రేతో భవతి తత్స్త్రీయా మనుషిచ్యతే
(తత్త్రియా -పాఠాంతరము)
తద్వై పుత్రస్య వేదనంత త్ప్రజాపతి రబ్రవీత్."-[3]

అనగా ఏజమ్మిచెట్టు పై రావిచెట్టు మొలచునో ఆ రావిచెట్టు వేరును గర్భాదానము నాటినుండి రెండు మూడు మాసములవరకు ఔషధముగా స్త్రీకినిచ్చినచో పుత్రసంతాన ప్రాప్తికలుగునని ప్రజాపతి చెప్పెనట. ఈ మంత్రములోని ఆచారము కేవలము రావి చెట్టుకు ప్రదక్షిణము చేయుట వరకే పరిమితమైయున్నదని డా॥ ఎల్దండ రఘుమారెడ్డిగారు తెలుపుచున్నారు.[4] కాని సంతానమునకై రావివేరు కషాయము త్రాగుట నేటికిని గ్రామములలో కలదు. సంతానము లేనివారి ఆవేదనకు ఈ క్రింది పాట మరొక్క తార్కాణము.

"బిడ్డలు లేనివారు గొడ్డుమోతువారు
చేసే రంతర్వేది గంగస్నానాలు
గంగస్నానము చేసి గట్టు పైకెక్కి

1. పాతపాటలు-టేకుమళ్ల కామేశ్వరరావు పుట-17
2. సెలయేరు-నేదునూరి గంగాధరం పుట-80
3. అధర్వవేదము- 6-11-1, 2.
4. పల్లెపదాలు-వేదమంత్రాలు (వ్యా) డా॥ ఎల్దండ రఘుమారెడ్డి. వివేచన-తృతీయ సంపుటి. పుట-99. 104

యెదురున్న సూర్యునికేమని మ్రొక్కు
సూరన్న నీవంటి శుభకరునిమ్ము
చంద్రన్న నీవంటి యింద్రుని యిమ్ము"–[1]

మహారాణులకైనను ఈ అగచాట్లు తప్పలేదు. కుమారరాముని తల్లియైన అరియాల దేవి "పుట్టె పన్నెండు పెరిగే పన్నెండు, పన్నెండు పన్నెండు ఇరవై నాలుగేండ్లు వెళ్లెను; నగర సంతానములేక నోమరాని నోములు, పట్టరాని వ్రతాలు ఆకల్లాపత్రిగా నోచెను. రావి చిలుక నోము నోచెను. కాశీతీర్థం గంగకు మోచెను; గంగతీర్థం కాశికి మోచెను, కాళీరామేశ్వరం సందున చాలురావులు (వరుసగా రావిచెట్లు) వేయించెను. పర్వతం బోయేటి మార్గంలో పదివేలకు జంగమార్చన చేయించెను. అందునా సంతానఫలము అందదాయెను...."[2] చివరకు రాముల పర్వతము మీద ఘోరమైన తపస్సు చెసెనట–ఆ తపోవిధానమిట్లున్నది.

"ఆదేవళము ముందరను–సూదిగుండు ఉన్నది.
నరులెక్కలేరు దిగలేరు
ఆ సూది గుండు మీదికి
బామతాసు ప్రాకెను.
దర్భాసనము పరచినది
దర్భాసనము మీదను
పులి చర్మము పరచినది
పైన జింక చర్మము పరచినది
జింక చర్మము మీదను
గుమ్మడి పండును నిలిపెను
గుమ్మడి పండు మీదను
సూది మీద మీదను
యేడు సూదులు నిలిపెను
చివర సూదిని అరియాలి
ఆవగింజను నిలిపెను
ఆవగింజ మీదను

1. పాతపాటలు (శీర్షిక) నేదునూరి గంగాధరంగారు.
భారతి–ఫాల్గుణమాసము–అంగీరస సంవత్సరము పుట–429.
2. కుమార రాముని కథ–సంపాదకుడు డా॥ నేలటూరు వెంకట్రమణయ్య, పుట–1, 2.

శిరస్సు క్రిందు మోపినది
శ్రీ పాదము మీదేమి
భామ తపస్సు పట్టింది"[1]

– ఆ తపస్సు మూడు గడియలె అయినను చుక్కలు పిక్కటిల్లినవట సూర్య చంద్రాదులు త్రోవలు తప్పిరట. భూమి తల్లడిల్లెనట. నీళ్ళకు చెదలు పట్టెనట. అగ్నికి ఈగలు మునిరెనట. ఇట్టి కఠోరమ్మైన తపస్సునకును వెనుకాడరు–సంతానపేక్ష గల స్త్రీలు.

సంతానము కలుగుటను స్త్రీ వరముగా భావించును. కాని అంతవరకును–
"కొత్త చింత పండు గోనెల్ల చీకు
గొడ్రాలి వస్త్రాలు పెట్టెల్ల చీకు–[2]

– అని బాధపడిన స్త్రీ సంతానమునందుకూడ ప్రథమమున పురుష సంతానమునే అభిలషించును.

మన యింటి యెనకాల దానిమ్మ చెట్టో
దానిమ్మ చెట్టున్నాది నాయుడప్పన్నో
దానిమ్మ పండే తినాలి, తింటేను దానిమ్మ
పండే తినాలి, కంటేను తొలుచూలు
కొడుకును కనాలి, కొడుకును కనాలి
– అట్లే – "మన యింటి వెనకాల బత్తాయి చెట్టున్నాది
తింటే బత్తాయి పండే తినాలి
కంటె తొలుచూలు కొడుకునే కనాలి"–[3]

అను కోరికను ప్రదర్శించును. దీనివలన ఆమెకు పుత్ర సంతానము నెడగల మక్కువ వ్యక్తమగును. ప్రపంచమునందంతటను పుత్రిక కంటె పుత్రుడే తల్లి తండ్రుల ఆదరమును పొందుచున్నట్లు చరిత్ర చెప్పుచున్నది. "ప్రాచీనకాలము

1. కుమార రాముని కథ పుట – 415
2. సెలయేరు నేదునూరి గంగాధరం. పుట 80 మరియు పాతపాటలు–టేకుమళ్ళ కామేశ్వరరావు. పుట–16.
1. జానపదగేయాలు – ఎల్లోరా.

నందు అన్ని పితృస్వామిక సంఘములలోను బాలిక జననము హర్షింపదగిన సంఘటనకాదు. దాదాపు అన్ని చోట్లను కుమార్తెకన్న కుమారునికి ఎక్కువ విలువ యుండెను. కుమారుడు కుటుంబమునకు శాశ్వతమైన ఆర్థిక సంపద. అతడు వృద్ధులైన తల్లిదండ్రులతో పాటే నివసించుచుండెను కుమార్తెవలె వివాహానంతరము మరొక కుటుంబమునకు వలస పోయెడివాడు కాదు. తన తండ్రి కుటుంబపు పేరును శాశ్వతమొనర్చుచుండెను. –[1]

ఆదిమానవుని దృష్టి ఆహార సంపాదనవే గనుక తనతోబాటు పోరాటములలోను సంఘర్షణములలోను సహాయపడు కుమారునియందే అతనికి అభిమాన ముండుట సహజము. అతనికి అతడు పుత్రికాజన్మను హర్షించలేక పోయెను. అంతేగాక స్త్రీలు అతనికి సహాయపడుటకు మారు, వారికి ప్రకృతి సిద్ధముగానున్న లోపములవలన ఆటంకముగను కనుపించినారు. కనుక అతడు కొన్ని సమయములలో స్త్రీ సంతానము కలుగగానే, ఆమెను వదలివేయుటకును కొన్ని సందర్భములలో ఆమెను చంపుటకుకూడ ప్రయత్నించినాడు. నేటికిని స్త్రీ సంతానము తక్కువయను భావము సంఘములో పాతుకొని యున్నది. అంతేగాక కుమారుడే కులమును ఉద్ధరించునను విశ్వాసము బలముగానున్నది.

కొడుకుల కనని వాళ్ళ కడుపేమి కడుపు
కులముద్ధరించని కొడుకేమి కొడుకు?
పిడికెడు విత్తనాలు మడికెల్ల జాలు
వక్కడే కొడుకైన వంశాన చాలు–[2]

– ఈ విశ్వాసమువలననే "వేలెడు పిల్లగాడుంటే వేల (రూపాయలకు) కు ఆసర" మున్నగు సామెతలు పుట్టినవి. ఈ కుమార సంతతి అయినను ఒక్కటైన చాలదు. పెక్కురు కుమారులు కావలెను. ఈ వాంఛవలననే "ఒక కన్నుకన్నుగాదు, ఒక్క కొడుకు కొడుకుగాదు" అను వాడుక కలిగినది.

---

1. The Position of woman in Hindu Civilization,-Altekar P. 3
1. సెలయేరు పుట–81 మరియు పాతపాటలు–టి. కామేశ్వరరావు పుట–16

"కంటేను కొడుకుల్ల కాన్పెకనాలి
అడితేను అన్నతో వియ్యమందాలి"–[1]

– అని కొడుకును కన్నంతనే అన్నతో వియ్యమందు ఆలోచనలను కూడ తల్లి ప్రదర్శించును.

తల్లి దృష్టిలోనేగాక లోకము దృష్టిలోను ఆడసంతానమునకంతగా ప్రాముఖ్యములేదు. మన దేశముననున్న ఆర్థిక వ్యవస్థనుబట్టి కాబోలు అందరును స్త్రీ సంతానముకన్న పురుష సంతానమునే యాకాంక్షింతురు. స్త్రీ సంతానము కలిగినచో "సోహర్" వంటి వేడుకలు ఔత్తరాహులుచేయరు. మనవారు కూడ ఆడబిడ్డలనుగని చింతింతురు.–[2]

"ఆముదాలు పండిన చేను చూడండి
ఆడవార్నికన్న తల్లి(ని) అరసి చూడండి
మోదుగుపూసిన బీడు చూడండి
మొగవార్ని కన్న తల్లి మోజుచూడండి
ఆడవార్ని కన్నావు అమ్ముకున్నావు
సిరిదేవి నీయిల్లు చిన్న బోయింది
మగవార్ని కన్నావు మొక్కుకున్నావు
మాతల్లి నా (నీ) యిల్లు తామరకొల్లు.–[3]

– అనుచు నలుగురును నాలుగు రకములుగా పుత్రవతి అయినతల్లిని మెచ్చుకొందురు. "మోదుగులున్న వనము మగపిల్లలున్న యిల్లు చెడదు" అను వాడుక యేర్పడినది. అంతేగాక

"కొడుకు పుట్టాడంటె కొండ లెక్కుదురట
రంభకోడలు వస్తే రచ్చ లెక్కుదురట."

– తన కొడుకునే సమస్త కార్యములకు అధినేతగా భావించిన తల్లి

వీధినెందరువున్న విసరదేగాలి
రచ్చనెందరువున్న రాదమ్మవాన

1. సెలయేరు పుట - 81
2. తెలుగు జానపదగేయ సాహిత్యము, పుట - 446
3. సెలయేరు.

నాచిన్ని అబ్బాయి వీధి నిలుచుంటె
మొగిలి పువ్వుల గాలి, ముత్యాలవాన-[1]

- అని మురసిపోవును.

గౌసు వెనకమోత యెవరిదిమోత
చిన్ని నాబాలయ్యది గజ్జెల మోత
ఊరు వెనక మోత యెవరిది మోత
చిన్ని నాబాలయ్యది వుం(గ్రాలమోత-[2]

- ఆమె హృదయములో కుమారుడు గజ్జెలమోత వినిపించుటయేగాక కనుల వెలుగై భాసించును.

తెలుగు జానపద గేయములోనేగాక దేశములోని వివిధ జానపద గేయములలోను పు(త్రసంతానము గొప్పదనుభావము వ్యాపించి యున్నది. ఇది బహుశ పురుషుని పెత్తనమునకు సూచన కావచ్చును. పు(త్ర సంతాన (ప్రాధాన్యమును గురించి ఒక రాజు తన రాణికి నచ్చచెప్పు జానపద గేయము 'అవధి' లో నున్నది. పు(త్రునిగను గొప్ప అవకాశము (ప్రతి దినము రాదని రాజు రాణికి ఇట్లు చెప్పుచున్నాడు.

"సదా నబేటా జాహియే రాణీ
సదా న సోహర్ హోయ్
సదా న నేగీనేగు మాంగై
సదా న అవసర్ హోయ్
భీతర్ సందుకియా ఖోలో జచ్చారాణీ
యహధన్ దేహులుఠాయ్. -[3]

- (ఓరాణీ! సదా కుమారుడు కలుగడు, సదా పురుటిల్లు ఉండదు. సదా యాచకులు యాచన చేయరు. సదా ఇట్టి అవసరము కలుగదు. లోపలనున్న సందూకు (పెట్టె)ను తెరువుము. ఓ బాలెంతరాలా! స్వేచ్ఛగా ధనము దానము చేయుము)

---

1. సెలయేరు పుట-81 ఇవే చరణములు 'పాతపాటలు' పుట-6 లోకలవు.

2. పాత పాటలు - పుట - 44

3. అవధీలోక్ గీత్ ఔర్ పరంపరా (హిందీ) పుట - 38.

ఇట్లు పుత్ర సంతానమునకు ప్రాముఖ్యము పితృస్వామిక సంఘముల ప్రభావము వలననో పుత్రుడు ఉత్తరోత్తర రక్షకుడుగా నుండుననుస్వార్థము వలననో కలిగినను స్త్రీ సంతానము నెడలను తల్లుల హృదయమున స్థానముండకపోదు. మన సంఘమున పుత్రికకును కొన్ని విషయములలో ప్రాధాన్యమున్నది. పుత్రిక పుట్టినయింటికిని, మెట్టినయింటికిని కీర్తితెచ్చి వంశమును వృద్ధిచేయునది గనుక ఆమె ఎడలను ఆదరము చూపినట్లు సాహిత్యమున పెక్కు ఉదాహరణములు కలవు. "వివాహమునందు తండ్రి కుమార్తెను దానము చేయుటవలన పృథ్వీదాన పుణ్యమును సంపాదించు చున్నాడు. కుమారుని వలన ఈ పుణ్యము సంపాదింపడు. అందువలన కుమార్తె కుమారునకన్న ఉత్తమురాలు. కనుక పుత్ర జన్మవలన సంతోషమును, పుత్రికా జన్మవలన ఆనంతృప్తి పొందనక్కరలేదు....నిపుణురాలు సత్ప్రవర్తన కలదియునగు పుత్రి, పుత్రునికన్నను శ్రేష్ఠురాలు కావచ్చునని కొందరు తత్త్వవేత్తలు సూచించినారు. సంస్కారవంతమైన వర్గములలో అట్టి కుమార్తె కుటుంబమునకు గర్వకారణముగా భావింపబడినది. పెండ్లి కుమార్తెకు ఎక్కువ ధర (కన్యాశుల్కము) పలుకు సంఘములోని క్రింది తరగతులలో కుమార్తె జననము హర్షదాయకముకావచ్చును."–[1]

వేదకాలమున కుమార్తెకన్న కుమారునకే ప్రాధాన్యముండెను. పుత్రుడు తల్లి దండ్రులను పున్నామ నరకము నుండి తప్పించునను విశ్వాస ముండెను. –[2] కాని తరువాత సంఘములో కొంత మార్పు జరిగెను. ఉత్తమురాలైన కుమార్తె విషయమున సంఘము దృష్టి మారెను. దీనికి కుమార సంభవములోని "కన్యేయంకుల జీవితమ్"–[3] అను వాక్యమును ఉదాహరణముగా పేర్కొనవచ్చును.

వాస్తవమున ఆడపిల్లలనే ఇంటికి అందము నిండుతనము వచ్చును తల్లి ఆడపిల్లలతో ముద్దు ముచ్చటలను తీర్చుకొనునంతగా మగపిల్లలతో తీర్చుకొనదు. కుమారుడు భావికాలమునకు రక్షకుడను భావమే తల్లిదండ్రుల కెక్కువగా నుండుటవలన అతని భవిష్యత్తును తమ కనుగుణముగా తీర్చిదిద్దుట యందే

1. The position of woman in Hindu Civilization. PP. 4-8.
2. పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్ర.
3. కుమార సంభవము–కాళిదాసు. చౌకంబవిద్యాభవన్. వారణాసి 1977 సర్గ – 6. శ్లో. 63.

ఆసక్తిని చూపుదురు. ఆడపిల్లల విషయమునన్నట్లుగాదు. వారు ఎప్పటికయినను కాళిదాసన్నట్లు "అర్థోహికన్యా పరకీయ ఏవ" కనుక వారిని ముద్దుముచ్చటలతో సంతోషపెట్టుటకే తల్లి కుతూహలపడును.

"అమ్మణ్ణి కన్నులు తమ్మి పువ్వుల్లు
తమ్మి పూవులలోని కమ్మ తేనెలు
....
కిలకిలా నవ్వితే కలువల్లు పూసే
కలువపూవు లేమొ కలికి చూపుల్లు"–1

–అని తన స్త్రీ సంతానమును చూచి మురిసిపోవును.

చిలుకల్లు చిలుకల్లు అందురేకాని
చిలుకలకు రూపేమి పలుకులేకాని
హంసల్లు హంసల్లు అందురేగాని
హంసలకు రూపేమి ఆటలేకాని
పార్వాలు పార్వాలు అందురేకాని
పార్వాలకు రూపేమి పాటలేకాని
కోయిల్లు కోయిల్లు అందురేకాని
కోయిల్లకు రూపేమి ఘోషలేకాని
చిల్లుకల్లు మాయింటి చిన్నకోడళ్ళు
హంసల్లు మాయింటి ఆడపడుచుల్లు
పార్వాలు మాయింటి బాలపాపల్లు
కోయిల్లు మాయింటి కొత్తకోడళ్ళు–[2]

– స్త్రీ సంతానము–వారు ఇంట పుట్టినవారైనను, ఇల్లు మెట్టిన వారైనను శోభను కలుగ జేయుదురనుటకు ఈ పాట మచ్చుతునక.

ఏ తల్లియయినను సమస్త ప్రపంచములోని అందమునంతను తన సంతానమునందే తిలకించును.

చిలుకలాడేనమ్మ హంసలాడేని
పావురాలాడేని పందిళ్లలోన

1. సెలయేరు పుట – 83
2. పాతపాటలు పుట – 13

చిలక నా అబ్బాయి! హంస అమ్మాయి–[1]
చిట్టినా అబ్బాయి చిరుమొగము చూచి
సిగ్గుపడి చంద్రుడూ పొడవ జాలాడు–[2]
ముద్దులు ముద్దులు
ముచ్చి కాయల్లు
అమ్మాయి ముద్దులు
గచ్చకాయల్లు–[3]

–అట్టి చిన్నారి పాపలు కన్నుల నీరు పెట్టిన భరింపలేక ఆమె హృదయము తల్లడిల్లును. ఒక్కొక్కప్పుడు పసివారు మారాము చేసిన విసుగు చెంది వారిని బెదరింపక

"బూచివాడ రార బుట్టల్లుకోనీ
బుట్టలో నాయినను పట్టుకొనిపోరా–[4]

అని భయపెట్టచూచును. ఆమె భావమును తెలిసికొనియో, తెలుసుకొనకయో పసివాడు ఏడుపును రెట్టింపు చేసి కన్నీరు బెట్టును. ఆకన్నీటిని భరింపజాలక

పిల్లమ్మ కన్నుల్లు బీరపువ్వుల్లు
అబ్బాయి కన్నుల్లు కలువ రేకుల్లు
కలువ రేకులవంటి నీకన్నులకును
కాటుకలు పెట్టితే నీకు అందమ్ము
ఏడువకు ఏడువకు వెర్రి అబ్బాయి
ఏడుసై నీకళ్ళు నీలాలుకారు
నీలాలు కారితే నేజూడలేను
పాలైన కారవే బంగారు కళ్ళ–[5]

అని కోరుకొనును. కలువరేకులవంటి కన్నులలో కాటుకను దిద్ది మురిసిపోవ నెంచునే గాని బాధతో కూడిన కన్నీరును చూచి భరించలేక పోవుట ఆమెకు సంతానమునెడగల మమకారమును వ్యక్తము చేయుచున్నది.

1. పాత పాటలు–పుట–6
2. అందే–పుట–10
3. అందే–పుట–10
4. తెలంగాణా పల్లెపాటలు–పుట–3
5. బాల భాష–వేటూరి ప్రభాకర శాస్త్రి పుట–22.

ఇందువలన స్త్రీలకు మాతృత్యము నెడ ఎంతటి ప్రగాఢమగు అపేక్షయుండునో దానిని ఫలవంతముచేయుటకు వారెంతటి కష్టమునకైన నెట్లు సహించెదరో స్పష్టమగుచున్నది. సంతానము కలిగిన పిదప ఎంత సంతృప్తి పడుదురో తెలుపుటకు మరొక చిన్న గేయమును ఉదాహరించుచున్నాను.

చిక్కుడు చెట్టుకు తీగలందమ్ము
శ్రీకృష్ణ తమ్ముడికి తిరమణందమ్మ
బీరయ్య పాదులకు పూవులందమ్ము
పణతికి పది నెలల బాలుడందమ్మ–[1]

సంతానాపేక్ష యెంత సహజమో పై పరిశీలనవలన స్పష్టమైనది. ఈ అపేక్ష తల్లినీ, పిల్లలను ఎంతగా సన్నిహితమొనర్చునో, జానపద సాహిత్యమున అదెంతగా మిళితమయియున్నదో పరిశీలించుట ఆవశ్యకము.

తల్లీ పిల్లలు :–

తల్లిపిల్లల సంబంధము అపూర్వమైనది. పవిత్రమైనది. దానిలో చెడు భావనలకు అవకాశములేదు: ప్రేమ తప్ప మరియొకటి వర్ధింపదు. మన ఉపనిషత్తులును తల్లిపిల్లల సంబంధమున మాతృప్రాధాన్యమును గుర్తించి అగ్ర గౌరవము ఆమెకే చెందవలెనని "మాతృదేవోభవ" అని ఉద్ఘాటించినవి.[2] జె. జె. బాకోఫన్ (J.J. Bachofan) అన్నట్లు "అన్ని సంస్కృతులకును, అన్ని ధర్మములకును, జీవితమునందలి ప్రతి ఉన్నత దశకును మూలమగు సంబంధము మాతృశిశు సంబంధము. ఈ సంబంధము ఈ హింసా ప్రపంచమున ప్రేమ సమైక్య శాంతుల దివ్య సూత్రముగా వర్తించుచున్నది.–[3] ఈ సంబంధము పిల్లలు పెరిగిన కొలది తల్లి దండ్రులకు గురుతరమైన బాధ్యతగా ఏర్పడును. పిల్లలు తల్లిదండ్రుల జీవన సంఘర్షణమునకు మరింత బరువును చేకూర్చెదరు. కనుక "తల్లిదండ్రుల – పిల్లల సంబంధము ఎంతో త్యాగమునకు సంబంధించినది. అనగా పిల్లల పెంపకమున తల్లిదండ్రులు తమ సుఖములను వదలుకొని వారి కొఱకు త్యాగము చేయవలసి యుండును."–[4]

1. సెలయేరు పుట – 18
2. తైత్తరీయోపనిషత్తు–శిక్షావల్లీ.
3. Myth, Religion and Mother Right (J. J. Bachofan P. 79.
4. FolkWays - W. Graham Sumner. P. 310

ఈ త్యాగము ఎక్కువగా తల్లిపాలపడుట సహజము. శైశవమునందును బాల్యమునందును పిల్లల పోషణ భారమంతయు తల్లి బాధ్యతయే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఆమె పాత్ర దానిలో హెచ్చుగా నుండును. “పిల్లలు చాల వరకు భాష, నీతి, పారిశుద్ధ్యము, ప్రవర్తనము, మతములను గురించిన మూలసూత్రములను తల్లిఒడినుండియే నేర్చుకొందురు. –[1] కనుకనే శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి తల్లిఒడిని ఒక బడిగాను, గుడిగాను వర్ణించినారు. “అమ్మ ఒడి సామాన్యమైనది కాదు. అది జాతి యొక్క నైతికస్థాయిని తీర్చిదిద్దేది. అది సుధర్మా మధ్యపీఠముకంటె ఏమి తక్కువదికాదు” అని నొక్కి వక్కాణించినారు. –[2]

ఇంతమాత్రమున తండ్రి బాధ్యత ఏమియు లేదనికాదు. “పిల్లల పోషణలోను, బోధనము నందును తండ్రికి కూడ కొన్ని విధులున్నవి. కాని అతని పాత్ర ప్రధానముగా ఆర్థికము. అది తల్లి పాత్రకు ప్రాథమికముగా పూరకము”. –[3]

పసిపిల్లలను వేదకాలపు మంత్రదృష్టలు తమ బుక్కులతో పోల్చిరి. పసిపిల్లల యెడ వాత్సల్యము చూపవలెనని ఋగ్వేదమున నొక మంత్రమున కలదు. వేణుని ఋగ్వేదమంత్రదృష్టలు తమ ఋక్కులతో ప్రేమతో లాలించిరి. –[4] మరియొక మంత్రమున ఒక మంత్రదృష్ట అమరత్వమును కోరుచున్నాడు, అమరత్వమనగా మరణము లేక శాశ్వతముగా నుండుటకాదు. పసిపిల్లలు జాతియొక్క అమరత్వమునకు చిహ్నముగసుక “నేను నా పిల్లల మూలమున అమరుడుగా నుందునుగాక” అని అతడు ప్రార్థించెను.[5]

అందువలన పిల్లల పోషణమునందును, వారికి విద్యాబుద్ధులు గరపుట యందును. లాలన యందును తండ్రికి కూడ బాధ్యత యున్నను పిల్లల పసితనమున తల్లికర్తవ్యమే గురుతరమైనట్లు ఈ చర్చఫలితార్థము. తల్లి తనకు గలిగిన సంతానమునకు ఆత్మీయతను సమానముగా పంచి పెట్టును; నట్టింటిలో కనులపండువుగా బాలబాలికలాడుటను ఆకాంక్షించును.

1. Social Disorganization. ..., Mabel A. Elliot. P. 230
2. కళ్యాణకల్పవల్లి – ఇల్లిందల సరస్వతీదేవి. పుట 51,
3. Social Disorganization. ..., Mabel A. Elliot. P. 230
4. ఋగ్వేదము 10–123–1
5. ఋగ్వేదము 5–4–10.

దేవూడి గుళ్ళోను దేవుడాడేని
దేవేంద్ర సభలోను జూదమాడేని
పరమేశ్వరుడు గుళ్ళోను సాములాడేని
పణతి నానట్టింట బాలలాడేని–[1]

తన సంతానమును కాపాడుకొనుటలో కంటికి రెప్పవలె చూచుకొనును.

తల్లికోరికలు ఆమె పరిసరములకు. అనుభవములకు, విజ్ఞానమునకు అనుగుణముగా ఈరికలెత్తుచుండగా శిశువుకూడ పుట్టిన కొన్ని క్షణముల నుండియే తన మానసిక శక్తులను పుంజుకొనుటకు ఏవిధముగా కృషిచేయునో పరిశీలించుట అవసరము. పసిపాపకు గల ఈ శక్తిని "గ్రహణశీల మనస్తత్వము" అని సుప్రసిద్ధ శిశుమనస్తత్వ శాస్త్రజ్ఞ, విద్యావేత్త్రి డా॥ మాంటేస్సోరి నిర్వచించిరి. ఈ శక్తి మూలముననే శిశువు జనించిన కొన్ని గడియలకే బుద్ధిని, మానసిక శక్తులను కూడగట్టుకొనుటకు, చురుకుగా నిరంతరము కృషిచేయుటకు ప్రారంభించును. పసిపాప పుట్టిన కొంతసేపటికే ఏడ్చుట, కదలుట, ఊపిరి పీల్చుకొనుట మున్నగు కదలికలతోనే గ్రహణశీల మనస్తత్త్వముతో పరిసర పరిస్థితులను ఆకళించుకొనుటకు ప్రయత్నించును. "ప్రశాంత ప్రేమ వాతావరణమున పరిజ్ఞాన ప్రబోధకములైన పరిస్థితుల మధ్య ఉత్తమ శిక్షణను పొందుచు పెరిగిన బిడ్డలు ప్రాజ్ఞులు. సకల సద్గుణ సంపన్నులు, కార్య నిరతులునగు ఉత్తమ పౌరులు కాగలరని గొప్ప గొప్ప మనస్తత్త్వవేత్తలు నొక్కి చెప్పుట లోకవిదితము"–[2]

పసిపిల్లలు పరిసరములను, కుటుంబ సంఘ పరిస్థితులను గ్రహించు కొనుచు తమ దేహమును, మానసిక శక్తులను పెంపొందించుకొనుచున్నారు. వారి సర్వతోముఖ వికాసమునకు వారికి జన్మమునిచ్చి వాత్సల్యముతో పెంచునట్టి తల్లిదండ్రులు, తక్కిన సన్నిహిత బంధువర్గము ముఖ్యులు. మానవుడు పుట్టినది మొదలు పదునెనిమిది సంవత్సరములవరకు శారీరకముగా పెరిగినట్లే అతని మానసిక శక్తులు సహితము క్రమవికాసమును పొందును. ఈ వికాసమునకు ప్రధానమైన దశలు మూడు. మొదటి దశ:– పుట్టినది మొదలు ఆరు

---

1. పాతపాటలు – టేకుమళ్ళ కామేశ్వరరావు పుట–5
2. తల్లీ–బిడ్డ–దరిశి సుభద్రమ్మ పుట–140. ఆదర్శగ్రంథమండలి – విజయవాడ 1956.

సంవత్సరములవరకు. రెండవదశ:- ఆరునుండి పన్నెండు సంవత్సరములవరకు. మూడవదశ:- పన్నెండు నుండి పదునెనిమిది వరకు. ఈ మూడు వికాస దశలయందును మానవునిలో దైవికముగను, మానసికముగను విస్పష్టమైన విభిన్న పరిణామములు గోచరించును.

"దేవునికైన దెబ్బేగురువు" అనునొక సామెత మనలో వాడుకలో నున్నది. కొట్టుటవలన అనగా శిక్షించుటవలన పిల్లలు బాగుపడుదురను భ్రాంతి మనలో చాలా కాలమునుండి పాదుకొనియున్నది. శిశు మనస్తత్త్వవేత్తల పుణ్యమా అని సంస్కారముగల కుటుంబములలో బిడ్డను కొట్టుట, తిట్టుట కొంత తగ్గినను భయపెట్టుట మాత్రమింకను పోలేదు. తల్లిదండ్రులు తమ బిడ్డల ప్రవర్తనమును ఇతరుల యెదుట ఆక్షేపించుట, అపహాస్యము చేయుట, అగౌరవ పరచుట, సంస్కారవంతుల యిండ్లలోను కలదు. సూక్ష్మ గ్రాహులయిన పిల్లల హృదయము దీనివలన గాయపడి వారిబుద్ధి మొద్దుబారుటయేగాకు మానసిక వ్యాధులును, దుష్టస్వభావమును ఏర్పడుచున్నవి. కనుక తల్లిదండ్రులు ప్రేమతోబాటు తమ పిల్లలయెడ గౌరవముకూడ చూపుట అవసరము. ఆగౌరవము వలననె పిల్లలలో ఆత్మవిశ్వాసము ఏర్పడి ఇతరులను గౌరవించు సభ్యతయును నేర్చుకొందురు.

తల్లిదండ్రులకును పిల్లలకును మధ్య ప్రేమాదరములు లింగభేదమును బట్టి కలుగునని కొందరు శాస్త్రజ్ఞులు చెప్పగా మరికొందరు శాస్త్రజ్ఞులు అట్టిదేమియు లేదనియు. అది అస్వాభావికమనియు నిర్ణయించినారు. కాని శిశువు ఆరేండ్లవరకు ఆడుబిడ్డ అయినచో తండ్రిని, మగబిడ్డ అయినచో తల్లిని అధికముగా ప్రేమించుననని, అది సహజమని మరికొందరు శిశు మనస్తత్త్వవేత్తలు నిర్ణయించినారు. ఏమైనను శిశువు లింగ వివక్షలేక అభివృద్ధిపొందుటకు మంచి పరిసరములు. సంస్కారవంతమైన కుటుంబ పరిస్థితులు ఆవశ్యకమనుటలో వీరందరును ఏకీభవించుచున్నారు.

ఇంతకు ముందు చెప్పిన మూడు దశలలోని మొదటి దశలో తనమీద అనుక్షణము ఆధారపడుచున్న శిశువునకు తల్లి ఆటలు, మాటలు, పాటలు నేర్చుట

మూలమున మానసికాభివృద్ధికి తోడ్పడును. కాని మనదేశము నందున్న తల్లులకు ముఖ్యముగా జానపద స్త్రీలకు ఈ మనస్తత్త్వ దృక్పథముండుట సంభవముకాదు. వారికి వంశపారంపర్యముగా అలపడిన అనుభవజ్ఞానము మాత్రమే యుండును. దానితోనే వారు తమ పిల్లలను పెంచుచున్నారు. "సమష్టి కుటుంబములలో పెద్దవారైన తాతయ్యలు, అమ్మమ్మలు, తీరిక వేళల యందు తల్లిదండ్రులును బాల్యదశలోనున్న పాపలకు కథలు, ఎక్కములు, పురాణేతిహాసములలో రసవత్తరమైన ఘట్టములను చెప్పుచు ఇంటిలోనే వారికి విద్య నేర్పుచుండెడివారు. కాని నవీన కాలమునందు తల్లిదండ్రులకు తీరిక లేక ఈ సంప్రదాయము విచ్ఛినమైపోయినది".–[1] దీనికి సమష్టి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై ఎవ్వరికి వారు పొట్టచేతబట్టుకొని ఊరూరు తిరుగుట, పెద్దలనువారు వారివద్దనుండక పోవుట కారణములు.

ప్రపంచమునందంతటను శిశువులను మూడు సంవత్సరములకే శిశు విహారములనబడు ప్రాథమిక పూర్వపాఠశాలలకు పంపు అలవాటున్నది. ఈ పద్ధతి మన దేశమున నిప్పుడిప్పుడే వ్యాపించుచున్నది. పారిశ్రామికముగా అభివృద్ధిచెందిన విదేశములలో తల్లిదండ్రులిరువురు ఉద్యోగులగుటవలన ఇట్టి వ్యవస్థ ఆదేశములలో బహుళ వ్యాప్తిని పొందినది. కనుక మనదేశమున ఐదు సంవత్సరముల వరకు పిల్లలను బడికి పోని పిల్లలుగానే భావింపవలయును. పిల్లలలో సహజముగా ఐదు సంవత్సరముల వరకును ఆరునెలల కొకమారు పెక్కు మార్పులు వచ్చును. ఇట్టి వయస్సునందు వారిలో కుతూహలము మిక్కుటముగా నుండును. ఇది ప్రపంచములోని వివిధ అనుభవములను పొందుటకు వారిని ప్రేరిపించును. ఈ దశలను తల్లిదండ్రులు ముఖ్యముగా తల్లి గ్రహించి ప్రవర్తింపవలసి యుండును. ఈ వయస్సులో పిల్లలకు అతి సన్నిహితురాలు తల్లియేగనుక ఆమె నిత్య జీవితములో తనతోబాటు పిల్లలనుగూడ విజ్ఞానవంతులనుజేయుటకు తన పూర్వానుభవము లతోను. నూతన ప్రక్రియలతోను శిక్షణనిచ్చును. ఇది శిశువు జన్మించుటతోనే ప్రారంభమగును.

---

1. పిల్లల మనస్తత్త్వశాస్త్రము – ధూర్జటి సుబ్బారావు. పుట–49.
   విశాలాంధ్ర ప్రచురణాలయము–విజయవాడ 1965.

ఆనందావిర్భావమే సంగీతమని విశ్వకవి రవీంద్రుడనెను. ఈ నిర్వచనమునకు సార్థకత తల్లీపిల్లల అనుబంధములో మనకు కానవచ్చు చున్నది. నవమాసములు మోసి, మరణవేదన ననుభవించి, పునర్జన్మనుపొంది కన్న సంతానమును కనులపండువుగా చూచిన పిదప ఆమెలోని ఆనందాతిరేకము మాటగా పాటగా వచ్చుట సహజము. ఇదియే లాలిపాటలకును, జోలపాటలకును మూలమైనట్లు నేను భావించుచున్నాను. సంతానమునకు రెండుమూడు నెలలు వచ్చువరకు శబ్దగ్రహణ శక్తియుండదు. ఆటుపిదప రాగధ్వనికి ఆకర్షితులై తల్లి ముఖకవళికలను గ్రహింపగలిగి ఆ పాట రాగమాధుర్యమును అనుభవించుచు నిద్రపోవుదురు. అయినప్పుడు, తల్లులు పుట్టిన పాపలకే జోలలు పాడుట సమంజసమా? పిల్లలు అర్థము చేసికొనగలరా? అను సందేహములు కలుగవచ్చును. గేయరాగ ధ్వనిని, గేయార్థమును పసిపిల్లలు గ్రహించుట తరువాతి మాట. తల్లి తన హృదయములో గూడుకట్టుకొనిన ప్రేమ పరివాహమును కుమ్మరించుటయే ఈ పాటల పరమార్థము.

తల్లి ఈ లాలిజోలపాటలలో తన గడిచిన కష్టములను, వర్తమాన పరిస్థితులను, భావి సుఖ సంతోషములను వెళ్ళబోసుకొనును. ఈ పాటలలో తల్లి తన సంతానమును గురించి ఏవేవియో బంగారు కలలుగనును. ఏవేవియో సంఘటనలు జరిగినట్లు కల్పించును. తన కలలు పండినట్లే సంతృప్తి పడును. తల్లి ఆనందానుభూతి తప్ప మరియొక ఉద్దేశ్యము ఈ పాటలలో నుండదు.

లాలి, జోల అను పదములు రెండును జోలపాటలను ఉద్దేశించిన వైనను, రెండింటిలో ఏ పల్లవిని వాడినను తారతమ్యము లేకపోయినను లాలి అనుపదము పిల్లలను లాలించుటకును, జోల అనునది నిద్రపుచ్చుటకును ఉద్దేశించినవై యుండును. ఈ లాలి, జోలపాటలను ఇంగ్లీషులో "లల్లబీ" [1] లనియు హిందీలో "లోరియా" [2] లనియు అందురు. మూడింటిలోను 'ల' పదసామ్యమున్నను ప్రాక్పశ్చిమ దేశ భాషలుగానుండి భాషాసామ్యము ఏమాత్రములేని తెలుగు ఇంగ్లీషు భాషలలో పదసామ్యము అధికముగానుండుట చిత్రము.

---

1. Standard dictionary of Mythology and Legend Vol. I.P. 219
2. కాశ్మీర్ ఔర్ హిందీకే లోక్‌గీత్ – ఏక్‌తులనాత్మక్ అధ్యయన్ – (హిందీ)–జవాహర్‌లాల్ హండ్ పుట–277.

జోగు అనుటకు ఊగు అను నర్థముకూడ కలదు గనుక ఊగునట్టి జోలపై వచ్చిన పాటలన్నియు జోలపాటలైనవని మనమూహింపవచ్చును. లాలి, జోల, ఊయెల, తొట్ల పాటల మూలమెట్లున్నను నేడు సమానార్థకములు గనే వ్యవహరింపబడుచున్నవి.

ఈ జోలపాటలలో ముందు నేను పేర్కొనినట్లు తల్లి ఆశలు, ఆశయములతో బాటు కవితా రసముగూడ చిప్పిలుచుండును. కనుకనే "తెలుగుతల్లులు తమ బిడ్డలకు ఉగ్గుపాలతో బాటు కావ్య రసమున్నూ పోశారనడానికి జోలపాటలు, లాలిపాటలు నిదర్శనము"[1] అని చింతా దీక్షితులుగారు నుడివిరి.

తల్లి తన సంతానమును గొప్పగా ఊహించుకొనుననుట సర్వవిదితము. ఆ ఊహలో ఎన్నియెూ కథలుగాథలు-తాను విన్నట్టి పురాణగాథలు. తానూహించుకొనిన గొప్పవారి గాథలు గూడ పాటలై జాలువారును.

"జోజో జో జో లాలీ; నిద్రపో బలభద్ర రాజకుమార
నిద్రపో అబ్బాయి నిద్రపోవయ్యా; నిద్రకు నూరేళ్ళు నీకు నూరేళ్ళు
నినుగన్న తండ్రులకు నిండ నూరేళ్ళు" [2]

-దీనిలో తల్లి తన కుమారుని బలరామునిగా భావించుచున్నది. నిద్రకు నూరేళ్ళు అనగానే దీర్ఘనిద్ర యగునేమోయని సందేహించి నీకు నూరేళ్ళు అని బిడ్డను గూడ నూరేళ్ళు వర్ధిల్లుమని ఆశీర్వదించుచున్నది. నూరేళ్ళ నిద్రయా? అని సందేహము కలుగవచ్చును.

నిద్రను గురించి ఇచ్చట కొంత వివరించవలసియున్నది. మానవునకు దేహారోగ్యమునకై వ్యాయామమెంత అవసరమో నిద్రయును అంత ఆవశ్యకము. వార్థక్యమున నిద్ర అంతగా నుండదు. రెండు మూడు గంటలసేపు నిద్రించిన చాలును. కాని పసిపిల్లలకును యువకులకును నిద్ర చాల అవసరము. పసిపిల్లలు కనీసము పదునెనిమిది గంటలు నిద్రించుట ఆరోగ్యలక్షణము; వయసు రానురాను ఆరుగంటలకు పరిమితమగును, కనుక తల్లులు తమ పిల్లలను 'నూరేండ్లు

1. ప్రజావాఙ్మయము-చింతా దీక్షితులు పుట - 58
2. మిన్నేరు పుట - 76

నిద్రపోమ్మని' ఆశీర్వదించుటలోని ఆంతర్యమిదియే. ఆయుర్వేద శాస్త్ర గ్రంథములు నిద్రాప్రాధాన్యమును పెక్కుచోట్ల ఉద్ఘోషించినవి.

"నిద్రాధీనం సుఖం దుఃఖం పుష్టిః కార్శ్యమ్ బలాబలమ్.
వృషతా క్లీబతా జ్ఞానం అజ్ఞానం జీవితం నచ" [1]

– అనగా సుఖ దుఃఖములు, పుష్టిగానుండుట, బక్కచిక్కిపోవుట, బలము కలుగుట, బలము లేకపోవుట, ప్రజనన శక్తి, క్లీబత్వము, జ్ఞానము అజ్ఞానము – నిద్రపైన ఆధారపడియున్నవి–అని వాగ్భటాచార్యుడు చెప్పెను.

తల్లులు పిల్లలను నిద్రపుచ్చునప్పుడు 'చిచ్చిహాయి' అనీగాని, చిచ్చిఓయి, అనిగాని సంబోధించుటయును కలదు. దీనినే చిచ్చికొట్టు అనియు నందురు. చిచ్చి అను పదమునకు "బిడ్డలకు జోలలు పాడునపుడు పీడాపరిహారార్థము చెప్పబడుమాట" అని శబ్దరత్నాకరమున అర్థమీయబడినది. దీని అర్థమేది అయినను తెలుగునాట ప్రతి తల్లియును ముద్దుగా నుచ్చరించుమాట. ఆమె పిల్లలను జోకొట్టుచు–

చిచ్చీ ఓయీ చీమల్ల మట్టీ – మట్టీ కింద నాయిన మాటలకు వెట్టీ
చిచ్చీకి పెట్టరె చీమలెంగిలులు – నాయినకు పెట్టరే పాలమీగడలు
ఊరేలు ఉత్తముడ జగమేలుస్వామి–మమ్మేలు మాపాలి కోదండరామ. [2]

– అని పాడును. లాలీ పల్లవిలో ప్రారంభించిన పాటలు

లాలీ లాలీ లాలీ లాలమ్మ లాలీ–లాలమ్మ లాలీ
లాలమ్మ గుజ్జులు లంకల్లా మేసే–లంకల్లా మేసె. [3]

– అను తీరులో నడచును.

చెవులకు ఇంపును గొలుపు గాన స్వరమున బాలురు అర్థము తెలియక పోయినను ఆనంద తరంగములలో నోలలాడెదరు. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగాన రసంఫణీ" అనునట్లు గానమునకు పరవశించని శిశువుండడు.

---

1. అష్టాంగ హృదయమ్ – సూత్ర స్థానమ్ – స్వస్థవృత్తమ్
2. తెలంగాణ పల్లె పాటలు – పుట 1
3. మిన్నేరు పుట. 77.

జోలల్లు పాడితే బాలులకు నిద్ర నాగస్వరము పట్టితే నాగులకు నిద్ర[1]

– నాగస్వరమునకు నాగులు ముగ్ధులయినట్లే బాలలును జోలపాటలకు వివశులయ్యెదరు. అందుకనియే జోలపాటలు శిశువు పసితనమున నింత ప్రముఖ స్థానమునాక్రమించినవి.

తల్లి జోలపాటలు పాడునప్పుడు కుమారునిని కులదైవము పేరుననో, ఇష్ట దైవము పేరుననో సంబోధించుచు పాటలు పాడును. కుమారుని రామునిగా భావించిన

"రామలాలీ మేఘ శ్యామలాలీ తామరసనయన దశరథ తనయా లాలీ"

– అను పాట పాడుదురు. ఈ పాట అన్నమాచార్యుల

"జో అచ్యుతానంద జోజో ముకుంద రార పరమానంద రామగోవింద"[2]

అను పాటవలె తెలుగు తల్లుల నోళ్ళలో నాడుచుండును. (ఊయెల పాటలు కొన్ని ఆచార ప్రదర్శక గేయములలో 'నామకరణము' అను శీర్షికలో పేర్కొనినాను).

పిల్లలకు ఉగ్గు పెట్టుటతో వారి ఆరోగ్యమునెడ శ్రద్ధతీసుకొను ఘట్టము ప్రారంభమగును. శిశువు బాల్య దశలో ఈ ఉగ్గునకొక ప్రత్యేకత కలదు. శిశువు జన్మించిన మూడవనాటి నుండియే అతనికి ఉగ్గుపెట్టుట సంప్రదాయము. ఈ ఉగ్గు విశిష్టతను తెలుపుచు తెలుగు వారిలో చక్కని నుడికారములు వాడుకలోనున్నవి. ఎవ్వరియందైన ఒక ప్రత్యేకత ఉన్నయెడల దానిని "ఉగ్గుపాలతో వచ్చిన గుణము" అనియు "ఉగ్గుతో బెట్టిన విద్య" అనియు నందురు. పసితనమునుండియే అలవడినదనుటను నిట్టి ప్రయోగముల ద్వారా తెలిపెదరు. నేడు ఆంధ్రులలో ఉగ్గుపెట్టు దినమున ప్రత్యేకమగు వేడుకలేవియు చేయరు. పూర్వమెట్లుండెడిదో.

1. సెలయేరు పుట – 22
2. ఈ పాదములకు మారుగా అన్నమాచార్యుల రాగిరేకులలో ప్రాసస్థానమున 'వ" (జోవచ్యుతానంద .... రావే పరమానంద") గలదని నిర్ధారింపబడినది గమనింప తమిళములో తిరు + అరంగం – తిరువరంగం–అని సంధియయినట్లు పూర్వము తెలుగునను వడాగమ సంధి జో + అచ్చుత–జోవచ్చుత అని యుండినట్లు గ్రహింపనగును. ఇప్పటికిని వ్యవహారమున కలదు.

అవధీ జానపద గేయములలో "చఠీ" వేడుక ప్రస్తావనకలదు. ఛఠీ అనగా శిశువు జన్మించిన అరవరోజు ఉగ్గుపాలు పెట్టు వేడుక అని అర్థము. ఈ వేడుకను అతి ఘనముగా చేయుదురట. వారిలో "చఠీకా ధూద్ యాద్ ఆనా" అను సామెతకలదు.[1] ఉగ్గు పెట్టుటలో చాలరకములుకలవు. సామాన్యముగా ఆముదము, చనుబాలు కలిపి ఉగ్గుగా పెట్టుట ప్రసిద్ధము. మొదట మొదట తల్లి ఈ మిశ్రమమును కొంచెము కొంచెముగా నాకించి అలవాటుచేయును. ఆముదములోని వెగటును తొలగించుటకు కొంచెము పంచదారనో లేదా ఒక్క ఉప్పు రవ్వనైనను వేయుదురు. పసివానిని తల్లి తన కాళ్ళపై నుంచుకొని యొకవ్రేలును సెలవి పైనుంచి ఆ ఉగ్గంతయు మ్రింగునంతవరకు అట్లే పిల్లవాని నోరును తెరచిపట్టి మ్రింగిన తరువాత ఆ చేతనే యొకమారు పిల్లవాని జొజ్జపైనిమిడి కుడిచేయి ఎడమకాలునొకమారు, ఎడమ చేయి కుడికాలునొకమారు మెల్లగా సాగునట్లు లాగి బాలుని రెండు చేతులను జోడించి "చక్కని తండ్రికి జేజేలనుచు" దేవునికి జోతల నెత్తించును. ఇట్టి ఉగ్గుపెట్టు రమణీయ దృశ్యమును సారంగధర చరిత్ర పేర్కొనుచున్నది.[2] ఇందు చనుబాలు నెయ్యి కలిపి గిలకొట్టిన మిశ్రమమును ఉగ్గనిరి. ఆముదముతో కూడిన ఉగ్గు జీర్ణశక్తి అభివృద్ధియగుటకును, ఆరోగ్యము సక్రమముగా నుండుటకును, కాలకృత్యములు అనాయాసముగా జరుగుటకును తోడ్పడును. గ్రామీణులలో ఉగ్గుగా ఉడుకుచున్న అన్నముపైని గంజిని తీపి గోరువెచ్చగా చల్లార్చి అందు ఒక ఉప్పు రవ్వను వేసి పిల్లలకు పట్టుటయు కనవచ్చుచున్నది. ఈ గంజివలన కడుపులోని నరములకు సడలింపు జరిగి శిశువులో చురుకుదనము కలుగును. ఇట్టి గంజినే గర్భిణీ స్త్రీలు త్రాగుటయుకలదు.

పిల్లలకు కొంచెము తెలివి ఏర్పడినంతనె ఉగ్గుతో బాటుగా ఉగ్గు పాత్రను చూచినంతనే అసహ్యించుకొనుచు ముఖమును త్రిప్పుకొనుచుందురు తల్లి శిశువు ఉగ్గును అసహ్యించుకొనకూడదనే దృష్టితో

---

1. అవధీలోక్‌గీత్ ఔర్ పరంపరా (హిందీ) పుట - 30
2. సారంగధర చరిత్ర - చేమకూర వేంకటకవి 1-44.

"ఊఁఊఁఉంగన్న, ఉగ్గుపాలు ఇందన్న
గరిటెడు ఉగ్గు కమ్మన్న - ఉమ్మక కక్కక మింగన్న-[1]

- అని పాడును. పాట వినుటయేకాని భావము తెలిసికొనలేని బాలుడు ముఖము చిట్లించుచునే యుండును. వెగటు ఎక్కువై శిశువు గ్రక్కినను

"ఊ ఊ ఊ ఉంగన్న - లుంగలు పెట్టక గ్రక్కన్న
ఓర్వని సవతుల దిష్టన్న - ఒప్పుగ మసలర బుచ్చన్న-[2]

- అని ఓర్వని సవతుల దిష్టి (దృష్టి) గా భావించును. పిల్లవాడు ఏకారణము చేతనైన ఆకలిగొన్నవాని మాదిరిగా నుండక తినుటకు యిష్టపడకున్న మొదట ఎవ్వరిదైన దిష్టితగిలి అట్లు చేయుచున్నాడేమోనని భ్రమించి దిష్టి మంత్రములు వేయించియు, ఉప్పుతోగాని ఎండు మిరపకాయ లతో గాని, పాత చీపిరిగట్టతో గాని, ఎర్రనీళ్లతో గాని, ఎడమకాలి చెప్పుతోగాని పిల్లవాని చుట్టు మూడు మారులు త్రిప్పి పారవేయును. ఉప్పు అయిన నిప్పులోను, ఎర్రనీళ్లైన ఎవ్వరు త్రొక్కని స్థలము నందును పోయుదురు. మిగిలిన వస్తువులయిన దూరముగా విసరివేయుటను చేయుదురు. మంత్రించిన నిమ్మకాయలను నడుమునకు కట్టుదురు. గ్రామీణులు జీడితో జిల్లేడాకులను కలిపి దిష్టి తగిలిన వారిపై నుండి త్రిప్పివేయుట సామాన్య ముగా ఆచరింతురు.

పిల్లలకు పాలు త్రాగునప్పుడు ఓర్వనివారి దృష్టి తగులునను విశ్వాసము స్త్రీలలో పాదుకొనిపోయినది. అందుచేత తల్లి తన పయిట చాటున బాలునికి పాలుపట్టును. విశ్వాస మెట్లు న్నను ఇట్లు చేయుట వలన ఇతర ఆకర్షణ లేక పిల్లలు శ్రద్ధగా పాలు త్రాగుదురు.

ఉగ్గుపెట్టి తల్లి శిశువును తన తొడలపై కూర్చుండబెట్టి ఒక చేయి బిడ్డవీపుపై మరియొక చేయి రొమ్ముపైనుంచి పాట పాడుచు ముందు వెనుకలకూపుచు తాను కూడ కుడియెడములుగా ఊగుచుండును. శిశువు "ఊ ఊ" అనుచు వెనుకముందులకూగును. దీని వలన శిశువు శరీరమున కంతటికిని వలసినంత పరిశ్రమ కలుగును. ఊపుతో శరీర మంతటరక్త ప్రసారము జరుగునట్లే

1. బాలభాష పుట-20 మరియు మిన్నేరు పుట 71.
2. అందే

ఈ పాటయందలి "గంగెద్దా" అను అంత్యప్రాసములు లయను రక్తము వెనువెంట శరీరమంతటను ప్రాకించును.

ఊగూ ఊగూ గంగెద్దా – ఉగ్గూ పాలే గంగెద్దా
సోలీ ఊగే గంగెద్దా – సోలేడు పాలే గంగెద్దా
తాళీ ఊగే గంగెద్దా – తవ్వెడు పాలే గంగెద్దా
మారీ ఊగే గంగెద్దా – మానెడు పాలే గంగెద్దా
ఆగీ ఊగే గంగెద్దా – అడ్డెడు పాలె గంగెద్దా–[1]

– నిత్య జీవితమున కొలమానములుగా ఉపయోగించు "సోల, తవ్వ, మానిక, అడ్డ" క్రమము తప్పక ఉత్తరోత్తరము బాలుని ఆరోగ్యాభివృద్ధులను చూపుటకు ఉద్దేశించినట్లు తెలియుచున్నది.

పసిబాలునికి పెట్టిన ఉగ్గు జీర్ణమైయొంటికి పట్టవలెనని తల్లి అభిలాష.

"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం – గుఱ్ఱం తిన్న గుగ్గిళ్లు జీర్ణమై
ఏనుగుతిన్న వెలక్కాయ జీర్ణమై – భీముడు తిన్న పిండివంటలు జీర్ణమై
అర్జునుడు తిన్న అప్పాలు జీర్ణమై – అబ్బాయి తిన్న ఉగ్గు జీర్ణమై

కుందిలాగ కూర్చోని నందిలాగపాకి – లేడిలాగ లేచి తాంబేలు లాగ తాండాలి"–[2]

– ఈ పాటలో వాతాపి ఇల్వలుల కథా ప్రసక్తికలదు. వాతాపివంటి దుర్మార్గుడు అగస్త్యుని కడుపులో జీర్ణమయినంత సులభముగా తన సంతానము తినిన ఉగ్గుజీర్ణము కావలెనని తల్లి అభిప్రాయము.

కుంది అనగా రాయితోగాని కఱ్ఱతోగాని చేయబడిన కుదురు. తన కుమారుడు కుందివలె స్థిరముగా, ఒద్దిగా కూర్చొని నందివలెపాకి లేడివలె చురుకుగా లేచి, ఆ చురుకు నడకలో తప్పి పడిపోకుండ తాబేలువలె నెమ్మదిగా తిరుగులాడవలెనని తల్లి ఆకాంక్షించుచున్నది.

1. తెలంగాణ పల్లెపాటలు–పు. 11
2. సెలయేరు పుట. 23. ఇదేపాట కొద్ది భేదముతో జానపదగేయాలు– 2వ సంపుటి ఎల్లోరా–68.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బాలభాషలో "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అని ప్రారంభించి వేరు విధమైన సేకరణను ఉదాహరించినారు. అందు

"అర్జునుడు తిన్న అరటి పళ్ళరిగి - భీముడు తిన్న పిండివంటలరిగి
గణపతి తిన్న ఖజ్జాలరిగి - అబ్బాయి తాగిన పాలు ఆముదం అరిగి
పందల్లే పాకి, కుందల్లే కూర్చుండి - నందల్లే నడిచి, గుఱ్ఱమంత పరుగు
ఏనుగంత సత్తువ ఉండేటట్లు-సాకుమీ యా బిడ్డను సంజీవరాయా[1]

అని పేర్కొనినారు. ఇందును బాలుని పెరుగుదల రమ్యముగా వర్ణింపబడినది. పంది అనగా నిచట అడవిపంది. అది వేగమునకు, పరాక్రమమునకు ప్రసిద్ధి. "పందిని కొట్టిన బంటును చూడు. కందము చెప్పిన కవిని చూడు" అని వాడుక.

పిల్లల కాళ్లు చేతులను ఆడించి, ఒడిలో కూర్చుండబెట్టుకొని రెండు చేతులను కలిపి చప్పట్లు కొట్టించుచు తల్లి యిట్లు పాడును:

"తారంగం తారంగం తాండవ కృష్ణ తారంగం
చిన్నారి తారంగం శ్రీకృష్ణ తారంగం
తారంగమ్మని సారెకు సారెకు-అందరు చూడగ ఆడర కృష్ణ
వీరందరు చూడగ ఆడర కృష్ణ ॥తారం॥ - దురితమగుచు చెవులమద్ది
కాయలల్లాడా కృష్ణ - పులిగోరు పతకము గొలుసు
బొజ్జపై నోలలాడగ ॥తారం॥-మురుగులు గొలుసులు చేతులు త్రిప్పుచు"[2]

....

-తారంగం పాట పాడుచు నిజముగా తన కుమారుడే కృష్ణుడయి తారంగ మాడినంతగా మురిసిపోవును తల్లి. చుట్టుప్రక్కల నుండు పిల్లలందరిలోను తన పిల్లలకు ప్రత్యేకత నిచ్చును. తల్లి కనిపెంచుటవలన అట్టి ఆత్మీయతను తన సంతానముపై పెంచుకొను చున్నది.

"ఏటికి కాలువ యెంతదూరమ్మ-ఎత్తి పెంచిన తల్లి కెంతమోహమ్మ
కాలువ నీళ్ళన్ని కడు సముద్రమాయె-కడలేని మోహమో కన్నతల్లిక్కి[3]

1. బాలభాష-పుట. 20. 2. సెలయేరు-పుట-2
3. పాతపాటలు పుట-16

అందునను అందచందములు, తెలివి తేటలు కలిగిన సంతానము గనిన తల్లి అపారమైన సంతోషమును ప్రదర్శించును.

"కన్న కాన్పు లెల్ల కడు చక్కనైతే-కన్నుల్ల పండుగే కన్న తల్లికిని"[1]

– ఇట్లు కనిన అబ్బాయిని కనుల వెలుగుగా భావించుటలో అబ్బురము లేదు.

"లాభమ్ము లాభమ్ము ఏమి లాభమ్ము-కొడుకులను గంటేను కోటిలాభమ్ము

గోరంత దీపమ్ము కొండలకు వెలుగు-గోపాల కృష్ణమ్మ గోవులకు వెలుగు

మాడంత దీపమ్ము మేడలకు వెలుగు-మారాజు అబ్బాయి మాకళ్ల వెలుగు[2]

అని మురసిపోవును; కన్నులలో వత్తులు వేసుకొని బాలలను పెంచుకొనును; భగవంతుని రక్షణను మనసార కోరును.

"హోయి, హోయి, హోయి, ఆపదలుకాయి

చిన్నవాళ్ళను గాయి శ్రీరంగశాయి"[3]

– ఆపదలు గాయుమని భగవంతుని కోరుచు 'శ్రీరంగశాయి' స్థానమున తమ యిష్టదైవముల నామములను చేర్చును. ఇందు దిష్టి మంత్రము కూడ ఇమిడి యున్నదని తల్లుల విశ్వాసము.

దీపము పెట్టగనే దీపమునకు అరచేయి చూపి అబ్బాయి కన్నుల కద్దుచు

"రక్ష రక్ష సంధ్య రక్ష – సర్వ రక్ష, దీప రక్ష, దివ్య రక్ష

చిన్ని నా అబ్బాయికి శ్రీరామరాక్ష"–[4]

అని తల్లి పాడుట సంప్రదాయములో భాగమే. పిదప సందె దీపమునకు నమస్కరింప జేయుచు

సంజదీవికి చక్కని జేజే – గుడిదీపానికి గుప్పెడు జేజే

కుందెల దేవికి గొప్పగ జేజే – పళ్లెర హారతికి పట్టెడు జేజే

మంగళ హారతికి మక్కువ జేజే ....

చిట్టిపాపల చిరు హస్తాల – దేవుని కెత్తాలి దీవన జోత – [5]

---

1. బాలభాష పుట 23 మరియు మిన్నేరు పు. 64
2. బాలభాష పుట 23 కొద్ది భేదముతో మిన్నేరు పు. 64.
3. సెలయేరు పుట–2
4. బాలభాష పుట–2.
5. సెలయేరు పుట–2

– అనుచు పసితనమునందే చిన్నవారి హృదయములో భక్తి బీజములను తల్లి నాటుచున్నది. "జేజే" అనుట దీపమునకును, భగవంతుని సంబోధనమునకును ఊతగా గ్రహించుట. మత శిక్షణము అనాది సంఘమువారు కూడ పసిపిల్లలకు శిక్షణ మూలముననో లేక ఆచరణమూలముననో నేర్పుట పరిపాటి యైనట్లు చరిత్ర తెలుపుచున్నది. "మత శిక్షణము పిల్లల నిత్యజీవితములో భాగమై యుండెను. –[1] విలియమ్ గ్రాహమ్ సమ్నర్ ఆదిమవాసులు తమ పిల్లలకు బోధించు పద్ధతిని ఇట్లు తెలుపుచున్నారు: "ఆదిమ సంఘమున జానపద రీతులు రూపొందుటకును, బోధించుటకును, సంప్రదాయముల నందించుటకును, పురాణములు సృష్టించుటకును, సానుభూతులు పెంపొందించుటకును కుటుంబము రంగముగ నుండెను. తల్లికిని పిల్లలకును అత్యంత సన్నిహితత్వ ముండెను. బోధనము గాని, వివరణముగాని లేక ఉదాహరణములతో చూపుటయే ముఖ్యమగు శిక్షణము.... పిల్లలు తమ తల్లులనుండి గృహ వ్యవహారములు, సంఘనియమములను, శీలమును, నీతిని నేర్చుకొనుచుండిరి"[2]

పిల్లలు చిన్నవయస్సులో నేర్చుకొను పాటలలో రెండు శాఖలున్నవి. 1. తల్లి పిల్లలకు నేర్పునట్టివి. 2. పిల్లలు స్వకపోలకల్పితముగా కూర్చుకొనునట్టివి. మొదటి శాఖలో తల్లి ఆశయములన్నియు ఉండును. తన సంతానమును తీర్చి దిద్దుట ఆమె ఆశయము. ఆ ఆశయము ఆ పాటలలో ప్రతిబింబించుచుండును. gxx ¥pƒf~=f" «R"Z=~â అందురు. రెండు శాఖలలోని పాటలు కేవలము అర్థరహితమగు పదముల కూర్పుగనే యుండును. పిల్లలు సాధారణముగా అనుకరణ నిపుణులు. ఎక్కడో పొగబండి పోవుచున్న దాని శబ్దమును విని "బుక్ బుక్" అను పల్లవితో పాటలు కట్టుదురు. వానిలో అంత్యప్రాస. వర్ణావృత్తి మాత్రమే ప్రధానము. ఉదాహరణమునకు

చిన చిన దొంతుల్ చిటారి దొంతుల్ – లక్కా మేడల్ లవంగమొగ్గల్–[3]

చిన్ని మీరేటివారే – చిలుకా మీరేటివారే

తామర మొగ్గల్లు తామర మొగ్గల్లు.–[4]

1. Religion among the premitives P. 185.
2. Family and Social change (Essays)-W.G. Summer. P. 239
3. ప్రజావాఙ్మయము–చింతా దీక్షితులు పుట–59.
4. అందే పుట–42

– ఈ పాటలలో అర్థము లాగుటకు అవకాశములేక పోలేదు. కాని పర్ణావృత్తి, పదావృత్తి, అంత్యప్రాస–ఇవియే ముఖ్యము. పిల్లలు అర్థమునకంటె పదములకును, ధ్వనికిని ప్రాధాన్యమిత్తురు. కనుకనే వీనిని పాశ్చాత్య విద్వాంసులు Nonsense Rhymes అనిరి.–[1] నేను గ్రహించిన పాటలలో తల్లిపాటలకే ప్రాధాన్యమిచ్చుటవలన ఈ Nonsense Rhymes ప్రసక్తి రాలేదు.

ప్రతి కార్యమును ప్రారంభించుటకు ముందు ఆకార్యము నిర్విఘ్నముగా కొనసాగుటకు విఘ్నేశ్వరుని పూజించుట జానపదుల సంప్రదాయము. తల్లియా సంప్రదాయమును పిల్లలకు పసితనమునుండియే అలవడునట్లు చేయును.

వెనకా వెనకా వేములతోట – కనకా పండ్లూ కాముని రూపులు
వాగూ నీళ్లూ వనముల పత్రి – మెత్తని కాళ్లూ మేచక శంకులు
దూదీ మడుగులు దుప్పటి రేకులు – తెల్లని గూళ్లో నల్లని వినాయకా
నాలుగు చేతుల నమస్కారమయ్యా–[2]

– ఇక్కడ నాలుగు చేతులనుటలో తల్లి చేతులు రెండు, పిల్లవాని చేతులు రెండు కలిసి నాలుగని శ్రీ నేదునూరి గంగాధరంగారు పేర్కొనినారు.

పిల్లలకు భగవంతుని పూజింప నేర్పుటయేగాక దినదినమును ఎదుగుచున్న పిల్లవానిలో భగవంతుని రూపములను సమన్వయ పరుచుకొనును తల్లి

"కుదురుగ పాపడు గుమ్మడికాయ – విడిసిన పాపడు విఘ్నేశాయ
సాగిన పాపడు సాంబశివాయ – చెలగిన పాపడు శ్రీకృష్ణాయ
అందెల పాపడు అంజనేయాయ – చెంగటి పాపడు శ్రీలోలాయ
జోలిన పాపడు జో సూర్యాయ – నందిట పాపడు సహ చంద్రాయ
తారుచు పాపడు తాతారాయ -- బోజన్న పాపడు పూర్ణబ్రహ్మాయ
ఆడిన పాపడు ఆనందాయ"–[3]

– తాను మెచ్చి పూజించెడి దైవమునకు బిడ్డకు తాదాత్మ్యము చెప్పుకొనుట సంప్రదాయ లక్షణమే. "పిల్లలు దేవుడూ ఒక్కటే" అను పవిత్ర భావము ఆమెలో పాదుకొని పోయినది.

---

1. తె. జానపదగేయ సాహిత్యము పుట–506.
2. మిన్నేరు. 3. సెలయేరు–పుట–5;

"తప్పట్లోయి తాళాలోయ్ – దేవునిగుళ్లో బాజాలోయ్
పాలు పెరుగు దేవుడికోయ్ – పప్పు బెల్లాలు పాపాయికోయ్. –[1]

– మున్నగు పాటలను పాడుచు దేవుని గుడిలో వినిపించు చప్పుళ్ళనే గాక దేవునికి నైవేద్య మర్పించుటయు పిల్లవానికి ప్రసాదము లభించు పద్ధతియు తెలియ జేయును. పిల్లలు పెరిగి పెద్దవారైన పిదప ఈ సంప్రదాయమును జీవితములో జీర్ణింప జేసికొందురని తల్లి ఆశయము. తల్లి భగవంతుని ప్రార్థించును పిల్లల హృదయములకు హత్తుకొను రీతిగా లలితమైన పదములతో సూర్యుని ప్రకాశమును పుష్పముల వర్ణనను మిళితముచేసి తెలిపెడి ఈ క్రింది పాట సంప్రదాయమును, ప్రకృతి పరిశీలనమును ఏకకాలముననే తెలియజేయు చున్నది.

శ్రీసూర్యనారాయణా! మేలుకో హరి సూర్యనారాయణా ॥మే॥
పొడుస్తు బాలుడు పొన్నపువ్వూఛాయ
పొన్నపువ్వుమీద బొగడపువ్వూఛాయ ॥శ్రీ॥
ఉదయిస్తు బాలుడు ఉల్లేపువ్వూఛాయ
ఉల్లిపువ్వు మీద ఉగ్రంపు పొడిఛాయ ॥శ్రీ॥
గడియెక్కి బాలుడు, కంబపువ్వూఛాయ
కంబపువ్వూమీద, కాకారి పువ్వుఛాయ ॥శ్రీ॥ –[2]

–ఇది విన్న బాలుడు పుష్పముల ఛాయలను సూర్యుని దశలలోనుండు మార్పులను మరవజాలడు. పిల్లలు ధ్వని కన్నను రంగులకు మిక్కిలి యాకర్షితులగుదురు. ఐదారు నెలల పిల్లలును రంగులను తదేకదృష్టితో చూతురు. కనుక తల్లులు రంగుల పరిజ్ఞానము వారికి కలిగించుటకు ప్రయత్నింతురు. ఏడ్చునట్టి పిల్లలు రంగుబొమ్మలు చేతికిచ్చిననో, చూచిననో ఏడ్పు మానుట మనము చూచుచునేయున్నాము.

పిల్లలను ఆడించుచు, పాడించుచు గోరు ముద్దలు తినిపించుటలో తల్లుల సహనబుద్ధి వ్యక్తమగును. మేత్తని అన్నమును గిన్నెలో కలిపి గోరుముద్దలని, గుజ్జు ముద్దలని పేర్లు చెప్పుచు తినిపించెదరు. చిన్న ముద్దగా చేసి తినిపించిన

1. సెలయేరు–పుట–3; 2. సెలయేరు–పుట–1.

గోరుముద్ద అనియు, గిన్నె అంచునగాని, కంచము అంచునగాని గీచి ఎత్తిపెట్టు దానిని గుజ్జుముద్ద అనియు నందురు. "అసలు కన్న వడ్డీమీద ప్రీతి" యన్నట్లు పిల్లలకు గోరు ముద్దకన్న గుజ్జుముద్దపై ప్రీతి యధికము. పిల్లలు అన్నము తినక మారాము పెట్టిన "అమ్మ ముద్ద, నాన్న ముద్ద, అత్తముద్ద, మామ ముద్ద" అని వారివారి ప్రేమలను గుర్తుచేయుచు ఒక్కొక్కటిగా అన్ని ముద్దలను తినిపించెదరు. ఇంతగా బుజ్జగించినను మారాము చేయుపిల్లలును కలరు. అట్టి పిల్లలకు "దొంగ బువ్వ" ను తినిపించెదరు. ఇందు అన్నము పెట్టువారు ముద్దలు కలిపి కన్నులు మూసుకొని ఒక్కొక్క ముద్దను చూపుచు నిట్లు పాడెదరు :-

"కుక్కే వచ్చి తింటుందో, నక్కేవచ్చి తింటుందో
యెలకే వచ్చి తింటుందో, చిలకేవచ్చి తింటుందో
పిల్లేవచ్చి తింటుందో, బల్లే వచ్చి తింటుందో
మా అమ్మాయే తింటుందో
మా అబ్బామే తింటాడో యెవరు వచ్చి తింటారో యెవరు వచ్చి తింటారో"-[1]

- ఇట్లు పలుకుచు చేతినిటునటు త్రిప్పుచు ఏమియు తెలియని విధముగా బిడ్డ ముఖము దగ్గరకు తీసుకొని పోయిన, తాను కానట్టుగా చిటుక్కున మ్రింగును. అంతా తినిపించిన తరువాత

"చాకలి వాళ్ళ కుక్క వచ్చి - చల్లా అన్నం తినిపోయింది పో -
అమ్మాయి (అబ్బాయి) యింక నీకేది ? - నీకు లేదులే" -[2]

అని ముగించి మూతి చెయ్యి కడుగుదురు. తన గొప్పతనమును తల్లి తెలుసుకొనలేక పోయినదిగదాయని బాలుడు సంబరపడును.

ఈ రకముగా అన్నము తినిపించుటలో "వెన్నెలగుజ్జులు" ముఖ్య మైనవి. వెన్నెల రాత్రులందు పసిబిడ్డలను ఎత్తుకొని చందమామ ముచ్చట్లు చెప్పుచు ఆరుబైట అన్నము తినిపించుట తల్లులకు అలవాటు. "అమ్మాచూడు, చందమామలో ఒక ముసలమ్మ పొయ్యిమీద కుండ పెట్టుకొని అన్నము వండుకొంటూ కూర్చున్నది. చూచావా అదుగో! నల్లగా కనబడుతున్నది" అనుచు

---

1. తెలుగు పల్లెపాటలు-ప్రయాగ నరసింహశాస్త్రి పుట-49.

2. బాలభాష - పుట 75 3. బాలభాష - పుట 76.

చందమామ రావె, జాబిల్లిరావె -- కొండెక్కి రావె గోగుపూలు తేవె
బలవని పండు ఒళ్ళో ఉంచుకొని – బల్చిన పండు చేత బుచ్చుకొని
వెండిగిన్నెలో వెన్న పెట్టుకొని – పమిడి గిన్నెలో పాలు పోసుకొని
అమ్మా, నువ్వూ తిందురుగాని, -- ....
చిన్నయన్నకు శ్రీ రఘు శేఖరునకు – వెండి గిన్నియ లోపల వెన్నపోసి
పసిడి గిన్నియ లోపల పాలుపోసి – చాల దినిపించి పోగదే చందమామ[1]

అనుచు పాడుదురు. తల్లీపిల్లల పాటలలో "చందమామ రావె, జాబిల్లి రావె" పాట పాఠాంతర భేదము చాలాప్రసిద్ధిని పొందినది. చివరకు చిన్న అన్నముముద్ద మిగిలించి పిల్లవాని మీదుగా త్రిప్పివేసి చెంతనున్న కుక్కకు వేయుటయో పారవేయుటయో చేయుదురు. ఇట్లు చేయుటవలన ఎవరి దృష్టియు పిల్లలకు తగులదని తల్లుల నమ్మకము. ఈ "చందమామ రావే" అను పాట ప్రసక్తి పార్వతీ పరిణయమున కలదు.[2]

తల్లి పిల్లలకు తిండివస్తువులపేర్లను నవ్వించుచు చక్కిలిగింతలు పెట్టుచు తెలియజేయుచుండును.

"అన్నంబెట్టి అప్పబెట్టి, అప్పడంబెట్టి దప్పడంబెట్టి
కూర బెట్టి నార బెట్టి గారె బెట్టి బూరె బెట్టి
పాలు బోసి పరమాన్నం బోసి

– అను చరణములచ్చరించుచు ఒక్కొక్క చేతి వ్రేలిని పట్టుకొని చూపెట్టుచు

గుంట గట్టి గుంట నిండ నెయ్యిబోసి
మా అబ్బాయి అత్తవారింటి తోవేదంటే
తాళ్ళల్ల నుంచి తంగెళ్ళ నుంచి – అదేతోవ అదేతోవ చక్కిలిగిలి"[3]

–అని అరచేతిలో గుంటచేసినట్లు గుండ్రముగా చేతితో గీతలు గీయుచు "మా అబ్బాయి అత్తవారింటి తోవేదంటే, తాళ్ళల్లనుంచి, తంగెళ్ళనుంచి అదేతోవ" అనుచు తన చేతిని మెల్లగా శిశువు అరచేతి కడనుండి చంకవరకు ప్రాకించి చక్కిలిగింతలు పెట్టును. చివరి చరణము రాకుండగనేశిశువు జాగ్రత్త పడి తన

1. బాలభాష – పుట 76 (ఇటువంటి పాటయే వేరు విధముగా తె. పల్లెపాటలు పుట. 2లో కలదు)
2. పార్వతీపరిణయము ఆ. 5 ప 27. 3. తె. పల్లెపాటలు పుట 13.

చేతిని లాగుకొని నవ్వుట ప్రారంభించును. ఇందులో "అన్నం, అప్ప, అప్పడం, దప్పడం" మొదలయిన తిండి వస్తువుల పేర్లు చెప్పుటయేకాక, చక్కిలిగింతలతో నవ్వించి అతనిలో చరుకుదనము కలిగించుట కూడ తల్లి ఉద్దేశ్యము. నవ్వువలన నరములు సడలినట్లయి శరీరమున రక్త ప్రసరణ చక్కగా జరుగును.

తల్లి చేతి వ్రేళ్ళను చూపుచు వానికి గల ప్రాముఖ్యమును పసివానికి అర్థమగునట్లు చెప్పును. ఇందువలన చేతి వ్రేళ్ళకు శిశువు దృష్టిలో ఒక ప్రత్యేకత కలుగును.

"చుట్టాల సురభి బొటన వ్రేలు; కొండీల కొరవి చూపుడువ్రేలు
పుట్టు సన్యాసి మధ్య వ్రేలు; ఉంగరాల భోగి ఉంగరపు వ్రేలు
పెళ్ళికి పెద్ద చిటికెన వ్రేలు.[1]
అనియు, ఇట్లే వ్రేళ్ళను లెక్కించుచు
తిందాం తిందాం ఒక వేలు; ఎట్లా తిందాం ఒక వేలు
అప్పుచేసి తిందాం ఒక వేలు; అప్పెట్లా తీరుతుంది ఒక వేలు
ఉన్నాగదా నేను అన్నింటికీ, పొట్టి వాణ్ణి గట్టి వాణ్ణి, బొటన వ్రేలు[2]
– అని చిన్ని చిన్ని కథలల్లు శక్తిని కల్పించును.

పసివారు కొంచెము ఎదిగి ఇటునటు తిరుగుచు నడకలు నేర్చినంతనే తల్లి ఎక్కడ ఏశబ్దమయినను తన కుమారుడే వచ్చు చున్నట్లుగా భావించును.

"ఆడుకొని అబ్బాయి వచ్చె కాబోలు – అందెలా చప్పుళ్ళు పందిళ్ళలోను
చదువుకొని అబ్బాయి వచ్చె కాబోలు – సరస్వతీ చప్పుళ్ళు చావిళ్ళలోను.[3]

అని మురిసిపోవును. తన కుమారునిలోను ఎవ్వరిలోలేని ప్రత్యేకతను ఊహించును.

"పల్లెదాపు మంచి పంట చేసుంది – పల్లెలో అందాల పాపలున్నారు
మాయింటిలో బిడ్డ మారాజు బిడ్డ ॥ప॥[4]

అని తన కన్నుల వెలుగై చక్కని చుక్కయిన కుమారుడు నవ్విన వెన్నెలలో నాట్యమాడునని, పాడిన బంగారు పంట పండునని గొప్పగా తలపోయును. తన కొడుకు పెద్దవాడైన తరువాత

"అందలాలు రెండు పొందు బడిరాగ–ఎవ్వరందలమన్ని నేతొంగిజూతు

1. మిన్నేరు – పుట 9 2. మిన్నేరు – పుట 9
3. సెలయేరు – పుట 23 4. సెలయేరు పుట 23.

చుక్కల చంద్రుడే తాను అబ్బాయి-ననుచూడ వచ్చెనే తాను అబ్బాయి[1]
అని ఊహాచిత్రమును చిత్రించుకొనును.

పిల్లలకు కొంచెము తెలివితో మెలగుదృష్టి రాగానే వారికి బంధు వర్గములో నున్నవారితో పరిచయములు తెలియజేయును. తొక్కుడు మాటలతో మాటలు పలుకుచున్నప్పుడే "అత్త, తాత" యనుచు పదములను పలుక నేర్పును. అన్ని బంధుత్వములలోను తన సంతానమునకు మేనత్త మేనమామలతో అధిక సన్నిహితత్వము కల్పించును. అందులోను మగసంతానమునకు మేనమామతో ఎక్కువ సంబంధమును కట్టిపెట్టును.

"అబ్బాయి మామలు ఎటువంటివారు--నిలువు బొట్టుల వారు నియ్యోగివారు
అంచుపంచెలవారు అంగీలవారు - పట్టు పంచెంలవారు పాగాలవారు
చెవిచెవికి చేరదేసిపోగుల్లవారు - పెసరకాయలవంటి మీసాలవారు
కందికాయలవంటి పెదిమెల్లవారు-వారు మా అబ్బాయి మేనమామల్లు" -[2]

అబ్బాయి మేనమామలు తనసోదరులేగనుక వారిని గొప్పచేసి, వారిని గురించి యంతయు గొప్పగానే వర్ణించును; అందరి మామలకంటెను తన కొడుకు మామలకొక ప్రత్యేకతను ఆపాదించును.

ప్రయోగములు

"మేనమామ పోలిక", "అమ్మ పోయినా మేనమామ ఉండాలి." మేనమామ వుంటే ఏనుగంత బలం. అనే సామెతలు, మేనమామతో, మేన అల్లుండ్లకు, మేనకోడళ్ళకు ఉండే అనుబంధాన్ని తెలుపుతున్నాయి. మాతృస్వామిక వ్యవస్థ నాటినుండిగూడ కుటుంబంలో మేనమాలకు (తల్లి తోడబుట్టిన సోదరులకు) ప్రత్యేకస్థానమున్నది.

"అందరి మామల్లు చందమామల్లు-నాయిన్న మామల్లు రామలక్ష్మణులు"[3]

కూతురు మామగార్లను వర్ణించునప్పుడు ఆమె మనస్తత్త్వము వేరు విధమగును. వారిని గురించి యపహాస్య ధోరణిలో వర్ణించును :

అమ్మాయి మామలు ఎటువంటివారు?-చేపల గంపావద్ద చెయిజాచువారు!
"గుడ్డి గుర్రాన్నెక్కి గోజాడువారు; - పందిపిల్లా నెక్కి పరుగెత్తువారు; చింపిరి తలవారు చీడపేలవారు"-[4]

1. పాతపాటలు పుట. - 21.
2. జానపదగేయ సాహిత్యవ్యాసావళి పు. 51 ఈపాటయే కొద్ది భేదముతో పాతపాటలు- టే. కామేశ్వరరావు. పుట-7లో పేర్కొనబడినది.
3. తె. పల్లెపాటలు. పుట-2
4. జానపదగేయ సాహిత్యవ్యాసావళి-పు.52.

అబ్బాయి మేనమామలను అందలమెక్కించుట. అమ్మాయి మామలను త్రోసి పుచ్చుటలో అబ్బాయి మేనమామలు తనకు అన్నదమ్ములు మాత్రమే కాక పిల్లవాడు పెద్ద వాడయినంతనే, వారితో మనసుపడిన మేనరికపు సంబంధమును కలుపు కొనుటయునుగలదు. అమ్మాయి మామలు అమ్మాయికి మేనరికము వరుసలో వచ్చిన వారయినను, పైసంబంధముగా వచ్చినవారయినను, తనకు పరాయి సంబంధము వారే యగుదురు. అందఱిని సమానముగా ఆదరించువారు ఏకొందఱో ఉందురు.

ఒక తల్లి తన బంధువర్గమునంతయు వర్ణించునొక చక్కని పాటలో బంధుత్వమునే గాక ఆయా వ్యక్తుల స్వభావములు కూడ వ్యంగ్యముగా వర్ణించినది. ఈ పాటలో దశావతారముల పేర్లున్నవి. ఈపాటను తల్లి పాడగా విని విని పసివారికి దశావతారముల పేర్లు కంఠస్థమైపోవును.

మాపాప మామల్లు, మత్స్యావతారం – కూర్చున్న తాతల్లు కూర్మావతారం
వరసైన బావల్లు వరహావతారం – సట్టింట నాయత్త నరసింహావతారం
వాసిగల .... వామనావతారం – పరమ గురుదేవ పరశురామావతారం
రక్షించు మామయ్య రామావతారం – బంటైన బంధువులు బలభద్రావతారం
బుద్ధితో మాచిట్టి బుద్ధావతారం – కలివిడితో మాయన్న కలికావతారం
వర్ధిల్లు పసిపాప వర్ధిల్లు నాతండ్రి – చిట్టి నాకన్నోడ శ్రీకృష్ణావతారం–[1]

– ఈ పాటలో పసివాని మామలు వయస్సును బట్టి మత్స్యములవలె చలించువారనియు తాతలు ముసలివారగుట వలన కూర్మమువలె పొందికగా నుందు రనియు, బావల వరుస పరియాచకములకు ఆలంబనమగుటవలన వారిని వరాహములతోను, అత్తగారికి కోపమెక్కువ కనుక నరసింహావతారము తోను పోల్చి చెప్పుచు వారివారి స్వభావములను ధ్వనింపజేసినది. "చిట్టి నాకన్నోడ శ్రీకృష్ణావతారం "అని సంతానమునకు పసితనమున పోలిక చెప్పుటలో శ్రీ కృష్ణునకే ఎక్కువ ప్రాధాన్యము నిచ్చును. శ్రీ కృష్ణుని చిలిపి చేష్టలకు, బాలక్రీడలకు అధిక ప్రఖ్యాతియున్నది గనుక తల్లి బాలకృష్ణుని తనకొడుకులో ఊహించుకొనుట సహజము. ఈ క్రింది పాటలో కొడుకును కృష్ణునిగా భావించుట చూడనగును.

1. సెలయేరు పుట. 4

"వీడెనమ్మ, కృష్ణమ్మ, వేణువూదే కృష్ణమ్మా
ఆవులకాసే కృష్ణమ్మ; వీడె ముద్దుల కృష్ణమ్మ
కాళ్ళకు గజ్జెలు చూడండి, మొలలో గంటలు చూడండి
మెడలో దండలు చూడండి, తలలో పింఛము చూడండి
చదువుల నిచ్చే కృష్ణమ్మా, సంపదలిచ్చే కృష్ణమ్మ
పాపలకాచే కృష్ణమ్మా బాలబంధుడే కృష్ణమ్మ ॥వీ॥ –[1]

– కాళ్ళకు గజ్జెలు, మొలలో గంటలు, మెడలో దండలు, తలలో పింఛమును పెట్టి కృష్ణుని రూపురేఖలను తన కుమారునిలో ఊహించుకొనుట మనోహరము. ఇంకొకప్పుడు. –

"చిన్నారి గంటల్లు మూగి మూగల్లు–పన్నగాశయనుడే శేషశయనూడు
పందిళ్ళ నాడుకొని పాలుతాగి పండు–[2]

– అని తన కుమారునిలో శ్రీ మహావిష్ణువునే చూచుచున్నది.

అట్లే కూతురు విషయమునను

"శ్రీగౌరిదేవి మాచింతలు దీర్ప – అమ్మాయి రూపునా అవతారమెత్తె
నిత్య కళ్యాణమ్ము పచ్చతోరణము–పాపాయి వూసులే
పండుగలుమాకు–[3]

– అని మురసి పోవుచు కూతురును అపరగౌరీదేవిగా భావించును.

కొండెక్కు పూలు జుట్టవే, అమ్మ నన్ను గోపాల కృష్ణుడనవే
....
కుప్పెకుచ్చుల జడలు వేయవే, అమ్మ నన్ను కూర్మావతారుడనవే
హారం పతకం నాకు వెయ్యవే, అమ్మ నన్ను అయోధ్యరాముడనవే
చేతి వంకీలు నాకు పెట్టవే, అమ్మ నన్ను శ్రీరమానాథుడనవే
వ్రేలి ఉంగరం నాకు పెట్టవే, అమ్మనన్ను వెలలేని కృష్ణుడనవే"–[4]

– అని బాలుడు అమ్మ మనస్సు నెరింగినట్లు తనలో వివిధములైన అవతారములను కల్పించి చెప్పగా పరమానందము ననుభవించును. ఇందు పిల్లల నిత్యాలంకరణ వర్ణింపబడినది. ముద్దుల కుమారుని ముద్దుపలుకులు విని

1. సెలయేరు పుట 2
2. తెలంగాణా పల్లెపాటలు పుట 3
3. పదవాఙ్మయంలో స్త్రీ
4. సెలయేరు పుట 4

"అరటి పండూ తీపి, ఆవుపాలు తీపి
మాచిన్ని అబ్బాయి, మాటల్లుతీపి" – [1]

– అని ఆమె మురిసిపోవును. ఆమె అబ్బాయికి పాట నేర్పి మరల అతని నోటవిని ఆనందించినను అతని ముద్దు పల్కులకు మురసిపోవుటలో వింతలేదు. అమ్మ కొడుకు కొఱకు పాడిన పాటే అయినను అది కొడుకు పాటగా మారిపోయి ఒక తరమునుండి మరొక తరమునకు 'పిల్లల పాటగా' ప్రసిద్ధిని పొందును. శాశ్వతముగా నిలిచిపోవును. అందుకే సోమసుందర్ గారన్నట్లు "మన సాహిత్యంలో అంతర్లీనమై, పిల్లల పెదవులనుంచి పెదవులకు అనుశ్రుతంగా ప్రవహిస్తూ వచ్చిన పాటల తేటవూటలు అపరంజి జిలుగులీనుతూ అమరమై నిలచేవున్నాయి.[2] అట్టి పాటలను వినిన పరవశించని హృదయములుండవుకదా. అందుకనియే

"పాపాయి ముద్దు రూపాయి ముద్దు
పాపాయి పలుకులు పాటలు ముద్దు" – [3]

– పాపాయిని పలికించినా రూపాయిని చూచినా ముద్దూముచ్చట. రూపాయిని మించిన ఆనందమును పాపాయి పలుకులలో ననుభవించు తల్లిదండ్రులు కూడ నుండుటలో ఆశ్చర్యములేదు.

పిల్లలు సామాన్యముగా అలంకరణ ప్రియులు. క్రొత్త వస్తువులు, క్రొత్తరంగులును వారి నాకర్షించును. తల్లులకును వారిని చక్కగా అలంకరించి ఇతరుల మెప్పు పొందవలెనను అభిలాష నుండును. ఈ అలంకరణ మనస్తత్త్వమును గురించిన మంత్రములు ఋగ్వేదమునందుకలవు. పసిపిల్లలను అలంకరించి అందముగా చేయునట్లు యజ్ఞమునుకూడ అలంకరింపవలెనని ఒక మంత్రదృష్ట తన మిత్రులను కోరుచున్నాడు.–[4] మఱియొక మంత్రమున

1. బాలభాష పుట – 29.
2. పిల్లల చిరునవ్వుల్లో తెలుగు వెలుగులు (వ్యా) సోమసుందర్, కిన్నెర డిశంబరు 1952 పుట – 537
3. బాలవాఙ్మయము (వ్యా) గొఱ్ఱెపాటి వెంకటసుబ్బయ్య, కిన్నెర జనవరి 1954 పుట – 25.
4. ఋగ్వేదము 9–104–1

సూర్యచంద్రులు యజ్ఞము చుట్టును ఆడుచున్న పసిపిల్లలవలె తిరుగుచున్నారు.[1] అని కలదు.

తల్లియే కుమారునకు గృహమున పరిసరముల పరిచయమొనరించుటకును, లోకజ్ఞానము కలిగించుటకును పూనుకొనును. ఈమెయే ప్రథమోపాధ్యాయిని, ఆపని వారికి పరిసరములలో కానవచ్చు వస్తువులను, జంతువులను, పక్షులను కూరగాయలను వివిధ రీతులలో వర్ణించుచు వాని స్వరూపము వారి హృదయములలో హత్తుకొనునట్లు చేయుటతో ప్రారంభమగును. మచ్చునకు కొన్ని :-

పిట్ట :-

"పిట్టరావే పిట్ట పిల్లలకు తల్లి - పిల్లలకు పాలిచ్చి పల్లెలకు పోవే
పల్లెలకు పోయొచ్చి బుట్టల్లుకోవే-[2]
- అని పిట్టను గురించి.

ఉడుత :-

ఉడుత ఉడుత హూత్తు - ఎక్కడికెళ్లా హూత్తు
బజారు కెళ్లా నూత్తు - ఏమిటి తెచ్చావూత్తు
బెల్లం తెచ్చానూత్తు - అయితే నీకు కొంచెం నాకు కొంచెం-[3]

- అని ఉడుతను గురించియు పాటలల్లి వారిచేత పలికించును.

కోడి :-

అల్లల్లా కోడి, పిల్లల్లా కోడి - గట్టుమీద కోడి, గవ్వల్లా కోడి.
కొక్కరకోయన్నది, నిద్ర లేచి కూహోమన్నది.-[4]

-అని ప్రతి దినమును, జాము జామున కూయుకోడిని పరిచయము చేసి కాలజ్ఞానమును, వేళ తప్పని తనమును తెలుపును.

1. ఋగ్వేదము 10-85-18
2. తెలంగాణ పల్లెపాటలు పుట-2.
3. బాలక్రీడలు-శ్రీమతి పిండిప్రోలు కొండయాంబగారు భారతి (మాస పత్రిక).
4. నేను సేకరించినది. పాడినవారు పద్మజ. హైదరాబాద్.

కోయిల:-

కొమ్మపైని కోయిల కూయుటమాని-పాపాయి మాట విని ఫక్కున నవ్వె
పాపమ్మ నీపాట బాగున్నదమ్మా - నీముందు నేనింక పాడలేనమ్మా
నీవు నేనూ కలసి పాడుతూవుంటె - మాటలెరిగినవారు మాటాడగలరు
మాటల్లు మనకేల పాటలేగాని - పాట లెరిగినవారు మాటలేలమ్మా
పేట వారల మూట పాటించకమ్మీ - వాటమెరిగి పాట పాడవోయమ్మా
మనవారి మాటలకు మనకేల వులుకు-మన నేలకు నేడు మాధవుండురుకు [1]

- కోకిల మనకు రూపమునకుగాక గుణమునకు ప్రతీక. పసితనము నుండియే పసివారి మనసులలో 'గుణములకు ప్రాధాన్యమను' విషయమునకు నారులు పోయుట ఈపాట వలన వ్యక్తమగును. పసివారు కోకిల కూజితముపై దృష్టితో దాని రూపమును స్మరింపనేస్మరింపరు. పెద్దవారయిన పిదప గుణగ్రహణ స్వభావమేర్పడును. "నుదురు గోడమీద కుదురుగా కూర్చొని ఏవేవో వెర్రికేకలు వేసే కాకుల గురించీ చిన్న వెలుగుతో ప్రారంభించి పుట్టలోంచి బుస్సుమంటూ నాలుకలు సాచి లేచే త్రాచుపామువలె పెరిగి పెద్ద చెట్టులాగ విజృంభించే చిచ్చుబుడ్డిని గురించీ-[2] పాటలలో వారి మనోభావములను పిల్లల గుండెలలో హత్తుకొనిపోవునట్లు చేసిరి తల్లులు.

కాకి:- కాకమ్మతో జానపదులకుండు సంబంధము అధికము. "చుట్ట పక్కాలు" రాకముందే వారి ఆగమన వార్తను కాకమ్మగంతులు వేసి తెలుపునని వారి విశ్వాసము. అందుకే కాకి అరపును విని ఇంటికి వచ్చు చుట్టములు తన ఆత్మీయులై యుండిన బాగుండుననుకొనును.

"కాకమ్మా-కాకమ్మా, కల్లాలమ్మా - చుట్టాలొస్తే చూచిపో
పక్కాలొస్తే పారిపో,- ఇరుగు వారొస్తే ఇంటి మీదెక్కు
పొరుగువారొస్తే పొయ్యిమీదెక్కు ....
నీ కూతురుకి వెన్నముద్ద పెడతా - నీ కాలికి గజ్జెకడతా-[3]

1. నేను సేకరించినది. పాడినవారు సావిత్రీదేవి గునుగల్లు, ఇబ్రహీంపట్నం.
2. పిల్లల చిరునవ్వుల్లో తెలుగు వెలుగులు (వ్యా) సోమసుందర్ కిన్నెర. డిశంబరు. 1952.
3. కాకి-కోయిల (వ్యా) కొత్తా-పాతా (వ్యాస సంపుటి) నార్ల వెంకటేశ్వరరావు. 207 నవోదయ పబ్లిషర్స్ - విజయవాడ-2.

ననియూరించును. కాకి పల్లీయుల నిత్యజీవితమునందు శకునములు పలుకుటకే కాక, పిల్లలు అలిగి ముసుగుదన్నిన సమయమున అలుక తొలగించుటకు తోడ్పడును. "కాకి వస్తుందో కోయిల వస్తుందో, మా అబ్బాయి వస్తాడో" అనుచు తల్లులు చేతులు జాచెదరు, నిద్రకు ఉపక్రమించుటకు ముందు పసివారు "అనగనగా ఒక రాజు కథతో బాటు" "అనగనగా ఒక కాకి" కథను కూడ వినుటకు ఉబలాటపడుదురు. కాకి శకునము, కాకి కబురు మున్నగునవి మనకు రెండు వేల సంవత్సరముల నుండియు సున్నట్లు గాథా సప్తశతి తార్కాణము. దానిలో కాకిని గురించిన ప్రసక్తి పెక్కు చోట్ల కలదు.

గుమ్మడి-గుమ్మా డమ్మా గుమ్మాడీ – ఆకుల్లు వేసింది గుమ్మాడీ
పూవుల్లు పూసింది గుమ్మాడీ – పండ్లు పండిందమ్మ ॥
అందులో ఒక పండు" – ఆపండు యెవరమ్మ ॥
మా చిట్టి తండ్రమ్మ గుమ్మాడీ. –[1] ॥

అని గుమ్మడిని వర్ణించుచు బొద్దుగానున్న కుమారుని పండులో చూచుచు ఆనందించును తల్లి.

పరిసర పశుపక్షులేగాక, కాయగూరలేగాక అనుక్షణము మనవెంబడి యుండు చీమలు, దోమలు, కూడ పిల్లల దృష్టి నాకర్షించును. ముఖ్యముగా చీమలు బార్లుకట్టి వెళ్లుట, వానకాలమున తమ గ్రుడ్లను నోటకరచుకొని సురక్షిత ప్రాంతములకు పరుగులిడుట, ఏ మధుర పదార్థమైనమ పడిన చోట గుంపుగా గుమిగూడుట–ఇవన్నియు పిల్లలను ఆలోచనాపరులను చేయుటయేగాక నూతన జ్ఞానమును కూడ కలిగించును.

"చీమలు చీమలు చీమలు చిన్నవి – చీమలెంతో తెలివైనవి
గింజగింజ కదిపి తెచ్చినవి – కుడుపునిండ తిని బ్రేవుమన్నవి ॥చీ॥ –2

–"బ్రేవు" మన్న ధ్వని వినగనే పిల్లలు అర్థము తెలియకపోయినను నవ్వుదురు.

– చిన్న చీమ దగ్గర నుండి పెద్ద ఏనుగు వరకు వారికి కవితా వస్తువులైనవి. ఏనుగును గురించి

---

1. బాల భాష–66
2. నేను సేకరించినది పాడినవారు రుక్మిణమ్మ. రాయప్రోలు.

ఏనుగమ్మా ఏనుగు - ఏ ఊరొచ్చింది ఏనుగు?
మా ఊరొచ్చింది ఏనుగు - ఏం చేసింది ఏనుగు?
మంచినీళ్లు తాగింది ఏనుగు - ఏనుగు ఏనుగునల్లన్న;
ఏనుగు కొమ్ములు తెల్లన్న - ఏనుగు మీద రాముడు
ఏంతో చక్కని దేవుడు. -[1]

అని పరిచయము చేయుటయేగాక రాముని మీద భక్తిని కూడ కలిగించుటకు ప్రయత్నించును. "నల్లని ఏనుగు మీది రాముడు" పిల్లల కనులలో మెరసినట్లగును.

అంతేగాక పిల్లలకు భక్తిని కలిగించుటకై కొన్ని పుణ్యక్షేత్రముల, నదుల, దైవముల పేర్లు పాటలో తల్లి వారికి నేర్పును.

"శ్రీకాశి విశ్వేశ సిరికొండివాస - కంచి వరదరాజ కాళహస్తీశ
ఏడు కొండలవాడ ఏకాంబరేశ - తుంగ భద్రాకృష్ణ గంగ కావేరి
ఆలంపురీ జోగులాంబ మరి అనుమ - కొండ పద్మాక్ష్మమ్మ అండాళు తల్లి
... . - బొంత పల్లీరన్న పోతలింగన్న
పోచవ్వ మైసవ్వ పొందుగా మీరు - ఎల్ల వాక్కిచ్చియు ఏలరేనన్ను-[2]

అని పిల్లవానితో అనిపించుచు తన కుమారునికి రక్షణ నొసంగి కాపాడుమని సర్వ దేవతలను ప్రార్థించును.

ఇట్లు పరిసర వస్తువులను, తమ యిష్టదైవములను, క్షేత్రములను తమ పిల్లలకు తెలుపుటతో పాటు వస్తుగుణములను కూడ తెలుపుటకు తల్లి పూనుకొనును. రంగులు పిల్లల నాకర్షించునని ఇదివరకే తెలిపినాను. రంగుల తర్వాత పిల్లల నాకర్షించునవి వాసన, రుచి. పిల్లలేయననేల పెద్దలు కూడ వాసనతోను, రుచితోను ఆకర్షితులగుదురు. పిల్లలకు షడ్రసములలో పులుపు, తీపి చాల యిష్టమైనవి. లేత చింతకాయలను దొంగతనముగా తినుట, దానివలన కలుగు పరిణామములకు తల్లిదండ్రులు బాధపడుట మనము తరచు చూచుచునేయుందుము. ఈ రుచి జ్ఞానము గూడ పిల్లలకు తల్లుల వలననే కలుగును. ఉదాహరణమునకొకటి-

1. బాల భాష పుట. 66
2. తెలంగాణ పల్లె పాటలు పుట. 15.

చిమడకే చిమడకే – ఏ చింతకాయ
నువ్వెంత చిమిడినా – నీపులుపు పోదు.
ఉడకకే ఉడకకే – ఓ ఉల్లిపాయ,
నువ్వెంత ఉడికినా – నీ కంపు పోదు.–[1]

చింతకాయకు ఉల్లిపాయకు ఉండు లక్షణము చిన్నపిల్లలకు అర్థమగునట్లు అతినైపుణ్యముతో ఈ పాట చిత్రించుచున్నది. పరిసరములలో నుండు ప్రతి వస్తువును వివరించి చెప్పుటవలన పిల్లలు తాము చూచినట్టి వస్తువుల సంగతులనెఱింగి వానిని మరిచిపోజాలరు. ఇట్లే తల్లులు పిల్లలకు శరీర పుష్టికి కావలసిన తిండితోబాటుగా బుద్ధి వికాసమునకు తోడ్పడు పొడుపు కథలతో మెదడునకు "మేత" వేయుచుందురు. ఉదా: ప్ర: అమ్మఅంటే కలుస్తుంది – అయ్య అంటే కలువదు. జవాబు: పెదవులు; ప్ర: అరచేతి క్రింద అరిసె అప్పచ్చి. జవాబు: సాలెపట్టు. మొ॥

తల్లి పిల్లలను నిద్రపుచ్చుచు సులభమైన రీతిలో కథలెన్నియో చెప్పుచుండును. ఉయ్యాలలూచుచు జోలలు పాడుచు రామకథ మొదలగు కథలను, నీతికథలను తల్లులు నేర్పుదురు.

"ఉత్తముని పేరేమి? ఊరు పేరేమి?
సత్యపురుషుల గన్న సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు, ఊరు అయోధ్య
సత్య పురుషులగన్న సాధ్వి కౌసల్య,
ఇల్లాళ్లు ముగ్గురే ఈ దశరథునకు,
పిల్లాళ్లు నలుగురే, పేరుగలవారు,
అయోధ్యలో వారు, అందరున్నారు,
సయోధ్యలో వారు, సరిలేనివారు.
....
జగతిపై రామయ్య జన్మించినాడు

1. బాలభాష 41.

సత్యమ్ము లోకాన స్థాపించినాడు
తల్లిదండ్రుల మాట చెల్లించినాడు
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు.
అయ్యోధ్య రామయ్య అన్నయ్య మాకు
వాలుగన్నుల సీత వదినమ్మ మాకు. –[1]

అనుచు చిన్న చిన్న మాటలలో పసిగుండెలలో హత్తుకొని పోవునట్లు క్లుప్తముగా రామ కథనంతయు వివరించును. అట్లే నానా దేవతల కథలతో పాటుగా పుణ్యక్షేత్రములను గూర్చియు, జంతువులను గూర్చియు కథలు చెప్పుచుండును.

వానలు పడుట, చెరువులు నిండుట, పంటలు పండుటవంటి విషయములను చిన్న చిన్న వాక్యములలో తల్లి పిల్లలకు విసుగు రాకుండ లోకవృత్తమును, ప్రకృతిలోని మార్పులను వివరించును.

ఎండలు కాసేదెందుకురా? – మబ్బులు పట్టేటందుకురా.
మబ్బులు పట్టేదెందుకురా? – వానలు కురిసేటందుకురా.
వానలు కురిసేదెందుకురా? – చెరువులు నిండేటందుకురా.
చెరువులు నిండేదెందుకురా? – పంటలు పండేటందుకురా.
పంటలు పండేదెందుకురా? – ప్రజలు బ్రతికేటందుకురా. –[2]

– ఇట్లు ప్రశ్నోత్తర రూపమున తానే లౌకిక జ్ఞానమును కలిగించును. అంతేకాక భౌతిక స్వభావము వరుసగా చెప్పబడుట వలన బాలుడు తల్లితోబాటుగా తానును ఆ చరణముల నుచ్చరించుచు తొందరగా అప్పగించగలడు.

కృష్ణమ్మవంటివాడు – కొడుకొకడుపుడితే
కష్టాలు కడతేరు – కన్న తల్లులకు–[3]

– కన్నతల్లులను కాపాడునట్టి కుమారుడు శ్రేష్ఠుడని ప్రతి తల్లియును విశ్వసించును. ఇట్లు ఆటపాటలలో ముద్దు ముచ్చటలతో పెరుగుచున్న పిల్లలు విద్యావంతులు కావలయుననియు, తమకు కీర్తి తేవలయుననియు తల్లులు భావించుట సహజము. తండ్రియును అట్లే కోరును. ఈ క్రింది గేయములో మాతా పితృ సుధావాత్సల్యము అభివ్యక్తమగుచున్నది.

---

1. బాలభాష పుట. 27.
2. బాలభాష పుట. 33.
3. బాలభాష పుట. 31.

ఉంగరమ్ములు పెట్టి ముంగురులు దువ్వి
ఒద్దపెట్టుకు తల్లి ముద్దులాడింది
పలక బలపాలిచ్చి పద్యాలు పాడి
సరస పెట్టుకు తండ్రి చదువు నేర్పాడు. –[1]

– తల్లిదండ్రులు ఇట్లు చదువుపై ఆసక్తి కలిగించుట వలన పిల్లలు పాఠశాలకు వెళ్లుటకు ఉత్సాహపడుదురు.

పిల్లలందరు రండి – బళ్లోకి పోయి
చల్లన్ని గాలిలో – చదువుకొందాము–[2]

–అనుచు కేరింతలతో చుట్టు ప్రక్కల పిల్లలతో పాటుగా సంతోషముతో బడికి వెళ్లునట్లు చేయుదురు. బడిలో పిల్లల ప్రవర్తనను గురించి ముఖ్యముగా ఒక విషయము ఉట్టంకింపవలసియున్నది. "శిశువుకు పిన్న వయస్సులో భద్రతా భావము తల్లిదండ్రుల ప్రేమ వలనను, కుటుంబములో తన స్థాయి వలనను కలుగుచున్నది. వయసు పెరిగిన కొలది అతని ప్రతిపత్తి ఇతరులతో సంబంధము ను బట్టి నిర్ణీతమగును." అని.[3] మాబెల్ ఏ. ఇలియట్ అనినట్లు బడిలో పిల్లల ప్రవర్తనము ఇంటిలోని అతని ప్రతిపత్తిని బట్టి యుండును. ఇంట తల్లిదండ్రులు ప్రేమతో చూచువారైన బడిలోను అతడు ఆత్మ విశ్వాసముతో సాటిపిల్లలతో సమాన స్కంధుడుగా స్నేహముతో ప్రవర్తించును. అట్లు కాక ఇంట ప్రేమ చూరగొనని పిల్లలు బడిలోను బెరుకు బెరుకుగా ఆత్మ విశ్వాసము లేక సాటి విద్యార్థుల ఈసడింపులకు గురియగుదురు. ఆత్మవిశ్వాసముగల పిల్లవానిని చూచుకొని తల్లిదండ్రులు–

"చదువంటె అబ్బాయి – సంతోషపడును. –[4]

– అని చెప్పుకొని మురిసిపోవుదురు. ఇంత చేసినను చదువంటే మొండికి వేయు బాలురును ఉందురు.

---

1. మనగేయ సాహిత్యము (వ్యా) – శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. భారతి మే 1 41 పుట. 580 మరియు బాలభాష పుట. 28.
2. బాలభాష పుట. 28.
3. Social Disorganization...Mael A. Elliot. P. 53.
4. బాలభాష పుట. 29.

"చదువంటె అబ్బాయి - చండికేశాడు
బద్దెపలుపారావె - బుద్ధి చెప్పాలి. -[1]

- అని బద్దెపలుపుతో కొట్టి బుద్ధి చెప్పెదమని బెదిరింతురు. పసివాడు బుద్ధిమంతుడు కావలెనని దండించినను, ఆమె మనస్సున బాధనొందును. అందులకే

"ఇసుక దిబ్బల గాని ఇంకదే నీరు
కన్నతల్లికి గాని కరగదే మనసు-[2]

అనియు

కన్నతల్లిని బోలలేరు చుట్టాలు - పట్టు చీరెలు బోల లేవు చీరెల్లు -[3]

అను వాడుక బయలుదేరినది. కన్నతల్లి మమకారమునకు మరేవియు సాటిరావను సంగతి దీని వలన విదితమగుచున్నది.

ఇట్లు కష్టపడుచునే తన పిల్లలకు - విద్య లేకుంటేను విభవమ్ము రోత వినయమ్ము లేకుంటేను విద్యలూ రోత-[4]

- అని పిల్లలకు హితము ఉపదేశించును.

"బాలబాలికలు బడులలోనుండు సమయముకన్నను ఇంట తల్లియొద్ద నుండు సమయమే ఎక్కువ. కనుక ప్రాథమిక విద్యకు ఆమెయే ఒజ్జ అని చెప్పవచ్చును."-[5]

తల్లిదండ్రులెంతచెప్పినను, పోరు పెట్టినను కూడ ఎంతకును బుద్ధి మార్చుకొనక సోమరిగా నుండి ఏపని చెప్పినను కడుపునొప్పి, కాలునొప్పి అని సాకులు చెప్పువారును ఉందురు.

తల్లి సంతానములో చురుకుదన మున్నను, లేకపోయినను అందరి యెడనూ సమానమైన ఆత్మీయతనే పంచిపెట్టును. అందుకనియే తల్లి పెంచిన మమకారముతో ఆడ సంతానమయినను, మగ సంతానమయినను అంతులేని అభిమానమును ప్రదర్శించును.

---

1. బాలభాష పుట 29 2. సెలయేరు పుట. 113
3. అదే పుట. 113 4. బాలభాష పుట. 30
5. Kinship and Urbanization.......Sylvia Vatuk P. 123.

వయస్సుతో బాటుగా తల్లీపిల్లల మధ్యన అనుబంధము దూరమగు చుండును. ఆడబిడ్డలకు తల్లిపైనుండు మమకారము మగవారిలో కానరాదు, ఉన్నను అది తగ్గు ముఖము పట్టుచుండును. అందులకు తోడుగా వచ్చిన కోడలు అనుకూలవతి కాకపోయిన భర్తకు లేనిపోనివి నూరిపోసి అతనిని అత్తమామల నుంచి వేరుచేయుటకు ప్రయత్నించును. భార్య మాటలను విని కోపోద్రేకమున కుమారుడు

తెల్లని గుడ్లకు తెచ్చె కోపమ్ము - ఎఱ్ఱని గుడ్లకు ఎత్తె కోపమ్ము
"కాటికె కండ్లకు నీళ్లొచ్చినాయి - కలికి మీ కోడలిని ఎవ్వరేమనిరి"

అని తల్లిని ప్రశ్నించునంతవరకు దారితీయును. అందుకు తల్లి

"పొరుగిల్లు పోకన్న జగడమొద్దన్న-రోటికాడి చిట్టునుక తొక్కవద్దన్న
సందెకాడ దీపంబు పెట్టేటివేళ-సప్పుడు కాకుండ పెట్టిరమ్మన్న
మాపుకాడ దీపంపు మలిపెటప్పుడు-మర్లిచూడకుండ మలిపి రమ్మన్న-[1]

అని "నీతిదాయకమైన బోధ చేసిన కోపగించుకొన్నది కోడలు" అని తెలియబరచును. అయినను అతనికి తల్లిమాటలకన్న భార్య మాటలే అధిక ప్రీతిదాయకము అనిపించును. పెండ్లాము బెల్లము తల్లి దయ్యమన్న" సామెత యిట్టివారికేనేమో!

"పులిపాల బద్దావె పుట్టిల్లు మరువు"-[2] మని భార్యను ఓదార్చుచు తల్లిని కుమారుడు పులిని చేసి పలుకుటకును వెనుకాడడు. తల్లి ఆరళ్లు ఏమాత్రము లేని యిట్టి స్థలములోనే యింతగా కొడుకు ఆర్భాటము చేసిన కోడలును హింసించు అత్తల స్థితి చెప్పరానిది. ఈ పరిస్థితులు ఆయా గృహవాతావరణములపై నాధారపడి యుండును.

కొడుకుపై తల్లికుండు మమకారము అపారము. నాడు నేడను భేదము లేక ఏనాడైనను అత్తగారింటిని, అత్తను అభిమానించు అల్లుండ్లుందురు. అయినను తన మనస్సులోని ఆత్మీయత అత్తకు ఉండదని తల్లి తన కుమారునిపై ఆపేక్ష కొద్దీ అనుకొనును.

1. తెలంగాణా పల్లె పాటలు పుట-114.
2. తెలంగాణా పల్లె పాటలు పుట-114.

"ఆవులరచీనట్లు లేగలరుస్తాయా - అమ్మ బిలిచీనట్టు లత్తబిలుస్తా ।
కొడుకరా ఓ కొడుక నాచిన్ని కొడుకా"-[1]

కొడుకు దూరదేశమేగగా కనులలో వత్తులు వేసుకొని కూర్చొను తల్లులు చాలా మంది ఉందురు. ఒక తల్లి కుమారుని గురించి ఆలోచించుచు దండు పోయినవాడు ఎన్నాళ్లకును రాకపోవుటతో అన్య మనస్కురాలగును. ఇరిగింటివారు. పొరుగింటివారు సంగతేమా? యని తెలుసుకొన నెంచి పలుకరింతురు.

పొరుగింటి:- "సీతమ్మ సీతమ్మ చిన్నబోయినావు
సీతమ్మ నీసుతుడు ఎందుబోయినాడు
తల్లి :- పోకుమాను లేసి పొయినాడు దండు-[2]
పొరుగింటి:- పోకమాను పూతబూసె ఎడకాతగాసె
ఏడొక్క నెలలాయె ఏడమ్మా సుతుడు"

- అని ప్రశ్నింతురు. అందులకు జవాబుగా తల్లి

చెయ్యెత్తు గుఱ్ఱాలు చేతిబల్లాలు - చెల్లెండ్ల భూములా ఏలబోయినాడు
మొగులెత్తు గుఱ్ఱాలు మొగ్గల్ల తేజి-మొగనాలి భూముల్ల ఏలబోయినాడు

పందిరెత్తు గుఱ్ఱాలు పక్కల్ల తేజి-పాలివారి భూములు పంచబోయినాడు

ఇల్లెత్తు గుఱ్ఱాలు ఈటెల్ల తేజీ-ఇల్లాలి భూములు ఏలబోయినాడు.-[3]

- అని సర్దిచెప్పును. సైన్యములో చేరిన కొడుకు రాలేదేమాయని ఆమె మనోవ్యధతో నున్నను, ఇతరులు అడిగిన ఆమె మనస్సు చివుక్కుమనును. అందుకని వారి ప్రశ్నకు చెల్లెండ్ల భూములను ఏలబోయినాడని-పాలివారి భూములను పంచబోయినాడని-మొదలయిన సమాధానములతో సర్ది చెప్పజూచును.

---

1. తెలంగాణా పల్లెపాటలు - పుట 101
2. దండు-సేన (శ. రత్నాకరము)
3. తెలంగాణా పల్లెపాటలు - పుట 107

ఇట్లే కూతుర్లపైనను తల్లి మమకారము పెంచుకొనును. కూతుర్లు అత్తవారింటికి వెడలినను పుట్టింటి పైననే మనసుంచుకొనెదరు; ఆమె ఆత్మీయతను మరవకుందురు. అందుకనియే

"ఆకలి వంటి మంట లోకాన లేదు
తల్లివంటి బంధువులు ధరణిలోలేరు"-[1]

అనియు

"ఏరుపారిన పోదు ఏటి మీదిసుక
తలుసుకున్నా పోదు తల్లి మీది మర్లు-[2]

అనియు తల్లిని తలపోయుచుందురు. పుట్టింటివారు తమకు యిచ్చు కానుకలలో లోపములను కూతుండ్రు సమయానుసారముగా నెత్తిచూపుట జరుగుచున్నను, వారికి తల్లిమీది మమకారము అమితము. బాహ్యపరిసర ప్రభావమున ఎన్ని పొరపొచ్చములు కలిగినను, రక్తసంబంధము బలీయముయినది. కనుక తల్లీ, పిల్లలు చివరకు పరస్పరము ప్రేమించుకొనుటయే లోకమున కాననగును.

ప్రపంచ వైచిత్ర్యమున "బాలలు లేని పట్నం బర్లు (బఱ్ఱెలు) లేని కొట్టం" అని ఆవేదనపడు తల్లులు తమ కుమారులు పెద్దవారై భార్యలతో కాపురము చేయుచు తమ మాటను విననప్పుడు వాపోవుట చూచుచునే యున్నాము. అట్టి సంఘటనములను బట్టియే "పుట్టంగ పుత్రులు పెరుగంగ శత్రువులు, అడ్డాలనాడు బిడ్డలు గాని గడ్డాలనాడా" అను సామెతలు సంఘములో వెలసినవి.

పిల్లల ఆటపాటలు

నిన్న మొన్నటివరకు మాంటెస్సరీ, నర్సరీ, ప్రాథమిక పూర్వ పాఠశాలలు లేని కాలములో పిల్లలకు యిండ్లే (ఇళ్లు) పాఠశాలలు, కుటుంబ సభ్యులే గురువులు. అందులో తల్లిదే ప్రధానపాత్ర. పలువురు ఉపాధ్యాయులు.

నానమ్మ, అమ్మమ్మ, అమ్మ, అక్క ఇలా ఎవరి దగ్గరినుండియైన పిన్న వయసులో నున్న బాలికలు ఆటపాటలను నేర్చుకోవడముతోబాటు లోకజ్ఞానమును కూడ పొందుచుండెడివారు.

1. సెలయేరు పుట-114 2. తెలంగాణా పల్లెపాటలు పుట-115

ఉదాహరణమునకు బాలికలు "గచ్చకాయలు" ఆడునప్పుడు

"ఒక్క ఓ చెలియా, రెండూ రోకళ్ళూ, మూడు ముచ్చెలకా, నాలుగు నందన్న

....

....................పది పట్టెదా........

అంటూ సఖ్యల వరసను నేర్చుకొందురు. ఇందులో సంఖ్యలు ముఖ్యము. వాటి వెంబడివచ్చే ఊతపదాలు పిల్లలకు విసుగు కలగకుండా పాడుకోవడానికి అనుకూలముగా చేర్చబడినవి.

ఇక కొన్ని ఆటపాటలలో ఆరోగ్యాంశములు కూడా మిళితమై యున్నవి. అట్టి పాటలలో బాలికల యాటలందు "చెమ్మచెక్క" ప్రసిద్ధిని పొందినది. ఇరువురు బాలికలు ఒకచోట చేరి ఒకరి చేతులొకరు తట్టుతూ కుడియెడమలకు దూకుచూ-

"చెమ్మచెక్క చేరడేసి మొగ్గ,
అట్లు పొయ్యంగ - ఆరగించంగ
రత్నాల చెమ్మచెక్క - రంగులేయంగ
ముత్యాల చెమ్మచెక్క - ముగ్గులేయంగ
పగడాల చెమ్మచెక్క - పందిరేయంగ
పందిట్ల పాపరాయుడు - పరుగులెత్తంగా

అంటూ పాడుదురు. పాడినపుడు అందులో ఉన్న[2] వైద్యాంశములు అర్థము కావు. ఏదో ఉల్లాసముగా పాడినపాటగా గ్రహింతురు. కాని ఈపాటలో వంధ్యలకును, మాచకమ్మలకును మందులు చెప్పబడినవి. చెమ్మచెక్కను దంచి

1. మనుస్మృతి - రెండవ అధ్యాయము - శ్లో. 145
2. చిన్నప్పుడు నేను (6 సంవత్సరముల వయస్సు) మా అక్కయ్య యశోద (8 సంవత్సరముల వయస్సు)తో "చెమ్మచెక్క" ఆట ఆడుతూ నేర్చుకొనినది.

రసమును దీసి, ఆ రసమును వరుసగా నెలరోజులు రోజుకు రెండుపూటల సేవించిన స్త్రీలలో కలుగు ఋతుక్రమ దోషములు తొలగిపోవునని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డా. ఎ.అనంతస్వామిగారు ప్రసంగవశమున నాతో చెప్పినారు.[3]

బొడ్డెమ్మ పాటలు, గొబ్బిపాటలు బాలికల ఆటపాటలే. వాటి వివరణ వ్రతోత్సవ గేయములు" – ప్రకరణమున నీయబడినది.

పదిపంద్రేండేండ్ల ఆడపిల్లలు రెండుజట్లుగా చేరి ఒకపక్షమునుండి మరియొక్క పక్షమునకు వియ్యమందుటకొరకు ప్రశ్నలు, జవాబుల రూపమున పాడుతూ–

"బుజబుజరేకుల పిల్లుందా? బుజ్జారేకుల పిల్లుందా?"

– అంటూ "బుజబుజరేకులు" ఆటను ఆడుకొందురు. ఇది దీర్ఘగేయములు. ఈ పాటలో విదయ్యమందుకొనేరు. యిరుపక్షములవారి సంవాదములు, కట్నకానుకల ముచ్చట్లు మొదలయిన పెండ్లిచూపులకు సంబంధించిన విషయములన్ని యుండి భావిజీవితములో పిల్లలు పెద్దవారై పెండ్లిండ్లు జరిపే పరిజ్ఞానము పిన్నవయస్సు లోనే పొందెదరు. కొన్ని సందర్భములలో ఈ పాట పూర్తయిన తరువాత బొమ్మల పెండ్లిండ్లు చేసి విందు భోజనమును కూడ ఏర్పాటు చేయుదురు. విందు భోజనము ఏర్పాటులో యింటిలోని పెద్దవారు తోడ్పడుదురు.

ఆడపిల్లలు ఆడు ఆటపాటలలో ఇవి మచ్చునకు కొన్ని మాత్రమే.

బాలుర ఆటలు బాలికల యాటలంత సున్నితమైనవి కావు. వీనిలో పరిశ్రమ అధికముగా నుండును. బాలురుకూడా బాలికలవలె దాగుడుమూతలు,

1. డా. ఎ. అనంతస్వామి – ప్రముఖ ఆయుర్వేద వైద్యులు – ఖాళీకబర్ (మలక్‌పేట దగ్గర) హైదరాబాద్.

2. తెలుగు జానపద గేయ సాహిత్యము – పుట.514

ముక్కుగిల్లిపో వంటి ఆటలను ఆడుదురు. గోడిబిళ్ళవంటి యాటలు ప్రత్యేకముగా బాలురకు చెందినట్టివే. గోడిబిళ్ళ ఆటను చెఱ్ఱిగోనె ఆట అని కూడ అందురు. దీనినే తెలంగాణమున ఉర్దూభాష ప్రభావముతో "గిల్లిదండ" అందురు.

తెలంగాణమున "జాడ్‌బందర్" ఆట నాడెదరు. "కోతి కొమ్మచ్చి" "జాడ్ బందర్" ఐనది. బందర్ అనగా కోతి. జాడ్ అనగా చెట్టు. ఉర్దూ ప్రభావముతో తెలంగాణమున నిది ఝా(జా)డ్ బందర్ ఆటగానే వ్యవహరింతురు. ఈ యాటకున్న పాట అంధ్రదేశమంతటను గలదు –

"కొండమీద వెండిగిన్నె – కొక్కిరాజు కాలువిరిగె
దానికేమందూ?
వేపాకు చేదు – వెల్లుల్లిగడ్డ – నూనమ్మబొద్దు నూటొక్కధార"

– ఈ పాటలో భగ్నాస్థి చికిత్స చెప్పబడినది" కోతి కొమ్మచ్చు ఆడుచు చెట్టునుండి క్రిందపడి కాలు విరిగినచో దానికి చికిత్సకై తగినమందు ఈ పాటలో వివరింపబడినది. గచ్చకాయలాట ఆడునప్పుడు కూడ ఈ పాటను పాడుదురు.

ఈ పాటలోని కొక్కిరాజుపై చిన్న వివరణ – కొందరు విమర్శకులు కొక్కిరాజనగా సారంగధరుడనిరి. సారంగధరుని కాళ్ళుచేతులు నరికిన నాడు సిద్ధులు మరల నాతనికి కరపాదములీ మందుచేత నతికించియుందురు. పైన పేర్కొనబడిన రెండు కారణములందేది యీపాట పుట్టుటకు కారణమో సరిగా నిశ్చయించ వీలులేదు. కొక్కిరాజు సారంగధరుడనుట కన్న కొక్కియనగా వంకరయను నర్థము చెప్పుకొని కొంటె కుఱ్ఱవాడని భావించిన సమంజసముగా నుండును.

ఈవిధముగా పిల్లలు పిన్నవయసులో ఆడుకొను ఆటపాటలలో ఆటలు వినోదముకొరకు ఆడునవైనా అందులో విజ్ఞానాంశములు కూడ ఇమిడియున్నవి.

ఆడ మగ భేదము లేకుండా పిల్లలను వరుసగా కూర్చుండబెట్టి కాళ్లు చాపించి లెక్కపెట్టుచు "కాళ్ల గజ్జ కంకాళమ్మ" పాటను పాడెదరు –

"కాళ్ళగజ్జ కంకాళమ్మ, వేగుచుక్క వెలగమొగ్గ
మొగ్గగాదు మోదుగనీరు, నీరు గాదు నిమ్మలవాయ,
వాయగాదు వాయంటకూర, కూర గాదు గుమ్మడిపండు

పండుగాదు........" ఈ పాటయందున్న యర్థము పిల్లలకు యర్థము కాకపోయినను, కేవలము లయ మఱియు ముక్తపదగ్రస్తముగా నడచు చరణము లందలి నాదము వారి నాకర్షించును. ఒకే పదము రెండు మారులావృత్తినందుటచే పిల్లలకు సులభముగా కంఠస్థమగును. ఈపాటలో గజ్జికి ఆయుర్వేదమందున్నది.[2]

బిత్తిదిరుగుడు పాటలలో "ఒప్పులకుప్ప వయ్యారిభామ" పాటలు బాగా ప్రచారములో ఉండినవి. "బిత్తి" దిరుగుట అధికముగా బాలికలయందేయున్నది. బాలికలకిది చక్కని పరిశ్రమ కలిగించును. "ఒప్పులకుప్ప వయ్యారిభామ" పాటలలో స్త్రీపురుషులకు వేరువేరు వాజీకరణ యోగములు పేర్కొనబడినవి.[3]

బొడెమ్మ పాటలు, గొబ్బిపాటలు బాలికల ఆటపాటలే. వాటి వివరణ "వ్రతోత్సవ గేయములు" ప్రకరణమున నీయబడినవి.

కుటుంబములోని యితర వ్యక్తుల పరస్పర సంబంధము :

ఆధునికకాల ప్రభావమునను, పరసంప్రదాయ ప్రభావమునను విభక్త కుటుంబములు నేడు తలయెత్తుచున్నను, అవిభక్త కుటుంబములు పూర్తిగా విచ్ఛిన్నము కాలేదనియే చెప్పవచ్చును. వృత్తుల వలననో, మరే కారణము వలననో తప్పనిసరిగా విడి కాపురము పెట్టువారును అనూచానముగ వచ్చిన అవిభక్త కుటుంబ సంప్రదాయమును నామమాత్రమునకుగాని, లోకాపవాదు భీతితో గాని కొంతకు కొంత పాటించుచునే యున్నారు. అవిభక్త కుటుంబము లోని వారి పరస్పర సంబంధము ఒక్కొక్క చోట సంతోషదాయకమగును. వేరొకచోట కష్టదాయకము గను నుండుట సహజము. ఒకచోట పుట్టి పెరిగిన వ్యక్తి మరియొక చోటికి వచ్చి, కలిసిపోయి సహజీవనమును గడుపుట యొక పద్ధతి; బదనికవలె పరోపజీవి వలె

కాలము వెళ్లబుచ్చుట వేరొక పద్ధతి. ఇట్టి పరస్పర సంబంధముల సాంప్రదాయికతను స్త్రీల పాటలలో పరిశీలింతము.

అత్తాకోడండ్రు :

కోడలు అనగా కుమారుని భార్యయని యిప్పుడు రూఢి అయినది. ఈ కోడలు పదము మూలమును తరచి చూచిన మన సంఘ వ్యవస్థకూడ తేట తెల్లమగును. "కోడె" అను పదమునకు వయసున నున్నయని అర్థము. కోడెదూడ; కోడెనాగు మొదలగు ప్రయోగములను ఉదాహరించ వచ్చును.

కోడలు అనుమాట రెండు పదముల కలయిక–కోడె+ఆలు కోడాలు. కొన్ని శ్రామిక కులములలో "కోడాలు" అను ప్రయోగము కూడా కలదు. దీనిని బట్టి కోడె+ఆళ్–ఆళ్ అని విభజించుట అనుచితము కాదు. అనగా వయసులోనున్న స్త్రీగా నుండి ఇంటికి వచ్చి, ఇంటివారిలో ఒక వ్యక్తిగా కానున్న యువతి అని అర్థము. ఈ పదము మొదట ఇంటికి వచ్చిన సామాన్య యువతికి వ్యవహృతమై క్రమముగా కుమారునికి సేవచేయు యువతి, లేదా కుమారుడు యిష్టపడిన యువతి, అనగా కుమారుని భార్యయని రూఢమయినది.

కొడుకు అను పదములోని పూర్వభాగము కోడలు అను పదములోని పూర్వ భాగము సమానముగా నున్నవి. కనుక కొడుక కూడ అన్య ప్రాంతము నుండి యింటికి వచ్చిన వాడా? అని ఆక్షేపణము కలుగవచ్చును. కాని కొడుకులోని పూర్వ భాగము కూడా యౌవనమును, చిన్నతనమును సూచించు పదమే. ఇంటి యజమాని పెద్దవాడు–అతనికంటె కొండుక(చిన్న) యైన వారందరు కొడుకులు. కనుక చిన్న మగవారు–యువకులు. ఈ పదము మొదట యువ సామాన్య వాచకమయి, పిదప పుత్రునికి పర్యాయముగా రూఢమయి యుండును.

స్త్రీలు వయసు వచ్చువరకు ఒకరింట పెరిగి వయస్సు రాగానే మరొకరి యింటిని మెట్టుట వలన కలిగిన మార్పును వెంటనే తట్టుకొనుట కష్టము. తాను

భర్త అనురాగమును పంచుకొని అధికారము చేయుటకు వచ్చిన దాననని కోడలు, 'ఇదెవతెయో అధికారమును చెలాయించుటకు వచ్చినదని, అంతవరకు అధికారమును నెరపిన అత్తయు పోటీలు పడుట సహజము. ఈ స్పర్ధలు ఎంతో సాహిత్యమును పెంచినవి.

కొత్త కోడలు అత్తవారింట అడుగిడిన క్రొత్తలో ఆ యింటికి నూతన శోభ యేర్పడును. సమష్టి కుటుంబములో అత్తమామలు, బావమరదులు, ఆడబడుచులు, తోడికోడండ్రు - అందరును కొత్తవారే. ఈ వాతావరణము క్రొత్తగా వచ్చిన కోడలునకు బంగారు పంజరమువోలె కనిపించును. పుట్టింటనున్న స్వేచ్ఛ అత్తింటిలో అరుదు. అక్కడి స్వేచ్ఛ ఈ క్రొత్త వ్యక్తులలో లభించదు. కనుక కొత్త కోడలు

"ఆకలికి వేళాయె అమ్మ తలపాయె
అమ్మగారింటికే వెళ్ళ బుద్ధాయె."-[1]

- అనుకొనును, "పుంటికూర తిన్నా పుట్టిల్లు" అనునట్లు అత్తింటిలో స్వేచ్ఛ లేకపోవుట వలన పంచభక్ష్యపరమాన్నములు తృప్తి తిన్నను యుండదు. అందులకే "అత్తింటి సుఖము మోచేతి దెబ్బ వంటిది" అన్నారు.

సమష్టి కుటుంబములో అత్తగారి హయామే యెక్కువ. అందుకనియే కోడలు రాకలో తన పెద్దరికమునకు లోపము రాకుండ చూచుకొనుటకు ప్రయత్నించును. అత్త కొత్తకోడలు తన అడుగులకు మడుగులొత్త వలె ననుకొనును. ఆమె కోడలును ఏ విధముగానైనను వంచి ఇంటి పనులలో దిద్ది తీర్చవలెనని ప్రయత్నించును;

"కొయ్య తోటకూర కొయ్యక్క చెడెను--[2]

---

1. పాత పాటలు టే.కా. పుట-32.
2. పాత పాటలు టేకుమళ్ల కామేశ్వరరావు పుట-116

దంచక్క నలగవేధాన్య రాసుల్లు,
వంచక్క వంగరే వనితకోడళ్లు. –[1]

– అను అభిప్రాయములతో కోడండ్రను సాధించనెంచును. అంతటితో అత్త కోడండ్ర సంబంధము పులి మేక సంబంధమగును.

అత్తా కోడండ్ర మధ్యన సామరస్యము అరుదు. కుటుంబములోని పొరపొచ్చములు కూడ సామాన్యముగా అత్తా కోడండ్ర వద్దనుండియే ప్రారంభమగును. అత్త అదను దొరికినంతనే కోడలిపై కారాలు మిరియాలు నూరుట, నోరులేని కోడలు గ్రుడ్లనీళ్ల గ్రక్కుకొనుట, నోరున్న కోడలు ఇల్లు అదురునట్లు అరచుట సహజము.

ఇంటికి వచ్చుకోడలు వినయము కలిగినదై ఉండవలెనని పెళ్లి చూపులనాడే అపాదమస్తకము "పరీక్షించి కులము, గోత్రము" దగ్గరనుండి ఆరాలు తీసి వియ్యాలవారి కుటుంబ మర్యాదలను, సంప్రదాయమును క్షుణ్ణముగా పరీక్షించి మరీకొడుకు పెళ్లికొప్పుకొనును – అధికారముగల ఇల్లాలు, తనకు నచ్చిన కోడలు వచ్చిన మురసిపోవును. మనసునకు నచ్చిన కోడలులో ఒక ప్రత్యేకత గోచరించును అందుకే ఆమె

"చిలుకల్లు చిలుకల్లు అందురెగాని – చిలుకలకు రూపేమి పలుకులేగాని
చిలుకలు మాయింటి చిన్నికోడళ్లు. –[2]

అని మురసిపోవును. ఆమెకు కోడలి అందము ముందు చిలుకల అందమేమియు గొప్పగా అనిపించదు. అందుకే చిలుకల సొగసును త్రోసిపుచ్చి మాటలకే ప్రాధాన్యమిచ్చినది. అత్తపలుకు పలుకులనే "తూచా" తప్పకుండ ముద్దుముద్దుగా పలుకును కనుక చిన్న కోడలి పలుకులు చిలుక పలుకులయినవి. అట్లే

"కోయిలలు కోయిలలు అందురేగాని–కోయిలలకు రూపేమి; ఘోషలేగాని
కోయిల్లు మాయింటి కొత్తకోడళ్లు. –[3]

1. పాత పాటలు టేకుమళ్ల కామేశ్వరరావు పుట–30
2. జానపదగేయ వాఙ్మయ వ్యాసావళి–నేదునూరి గంగాధరం పుట–50
3. అదే పుట–50

– అని అత్త తన కోడండ్రను గొప్పచేసి చిలుకలను, కోయిలలను త్రోసిరాజనును.

చిన్నకోడండ్రువచ్చి నారన్న పెద్దకోడండ్రు పాతబడి పోదురు. "పాతొకరోత కొత్తొక వింత" అన్నట్లు అత్త మనసు కొత్త కోడలిపై మరలును. దానితో పాత కోడలిపైన కత్తిదూసే అత్తలే ఎక్కువ.

"అత్త గారన్నది తాపెద్దమనిషి – కోడలికి దుడ్డెట్టి తాగెడ్డ తినెను
గెడ్డలు తిన్నత్త గడ్డల పాలాయె – దుడ్డుతిన్న కోడలు దుడ్డల్లె వుండె."–[1]

–కోడళ్లకు తిండి సరిగా పెట్టక తాము పుష్టిగా తిను అత్తల ఆర్భాటమిది.

ఈ అత్తాకోడండ్రపోట్లాటలకు అత్తకు పుత్రునిపై, కోడలుకు భర్తపై నుండు ప్రేమాధికారములు కొంత తోడగును. పరస్పర వైరుధ్యము కలిగిన యిద్దరి మనస్తత్త్వమునకు తట్టుకొన లేక అతడు నలగిపోవుట సహజము.

అత్తగారి అధికారము అధికమయిన అవకతవక బుకాయింపులన్నియు కోడలిపైన నిత్యకృత్యమగును.

"కోడల కోడలా కొడుకు పెళ్ళామా! పచ్చి పాలమీద మీగడలేవి
వేడిపాల మీద వెన్నల్లు యేవి! నూనెముంతల మీద నురగల్లు యేవి?–[2]

–నోటి దురుసున్న కోడలయిన అత్తమాటలకు వెంటనే జవాబు చెప్పును.

అత్తరో! ఓయత్త! ఆఅళ్ళ యత్త! పచ్చిపాలమీద మీగడుంటుందా
వేడి పాలమీద వెన్నలుంటాయా–నూనె ముంతల మీద నురగలుంటాయా![3]

– అని అంతటితో ఆగక యిరుగుపొరుగు వారిని పిలచి

ఇరుగు పొరుగులార. ఓ! చెలియలార–అత్తగారి ఆరళ్ళు చిత్తగించారా పెత్తనం లాగేస్తే పేచీలు పోను–ఆరళ్ళ అత్తయిన, సవతి పోరయిన తల్లిల్లు దూరమైన భరియించలేము.–[4]

1. అత్తాకోడళ్లు (వ్యా) నార్ల వేంకటేశ్వరరావు (కొత్తా–పాతా వ్యాససంపుటి) పుట–9
2. సెలయేరు–పుట–99
3. అందే–పుట–99
4. అందే– ॥ 100

– కేసు (నేరము) విచారణ జరిపినట్లు అత్తగారి ఆరళ్లు వినిపించి పెత్తనము లాగివేయవలెనని తీర్పు చెప్పును. అంతేకాకుండ విధిలేని పరిస్థితులలో యిరుక్కు పోయిన కోడలు

అత్తనువు బెట్టిన ఆరల్లకల్ల – అట్లబోయి అడవిలో మాను గానైతి
మానన్న గానైతి మంచె వేతూరు – ఆకన్న గానైతి మేక లారగించు
కాయన్న గానైతి కాకులారగించు – పండన్న గానైతి పక్షులారగించు
బలుడు మాతండ్రి పాలు బిండంగ – బంగారు చెంబులో ధార గానైతి
సిరిదేవి మాయమ్మ చల్లచేయంగ – చిల్లపోయి కవ్వాన చితుప గానైతి. –[1]

– అని విచారించును. అత్త పెట్టు ఆరళ్లకన్న అడవిలో మానైన మంచెనైన వేతురనుటలో కోడలి బాధయెంతటిదో అర్థమగును. "ఆకునైన మేక లారగించు, కాయనైన కాకు లారగించు, పండైన పక్షులారగించు" ననుట వలన ఆరళ్లు పెట్టు అత్త చేతి క్రింద నుండుటకన్న వ్యర్థమింకొకటి లేదని కోడలు భావించుచున్నది. ఇటువంటి అత్తల ఆరళ్లు అత్తింట అడుగు పెట్టిన కోడండ్రకు కన్నతల్లి దండ్రులను మరిపించేవిగాక అడుగడుగున గుర్తునకు తెప్పించునవై యుండును.

"స్త్రీకి బానిసత్వము ఎప్పుడు పోతుందో, ఆర్థిక స్వాతంత్ర్యమెప్పుడు వస్తుందో అప్పుడే యీ అత్తా కోడళ్ల సమస్య కూడ పరిష్కృతము అవుతుంది." అని శ్రీకొత్తపల్లి రంగారావుగారు పేర్కొనిరి. –[2] ఈ విషయము అత్తింటిలో అణగిమణగియుండు కోడండ్ల విషయమున మాత్రమే సరిపోవును. జానపదులలోను భర్తను స్వాధీన పరచుకొని అత్తతో యుద్ధమునకు దిగువారే అధికముగా కనిపించుచున్నారు, ఇద్దరి పోట్లాటలు సిగపట్టులకు కూడ దారి దీయును.

"కొడుకు బాగుండవలె కోడలు ముండమొయ్యవలె" అని కోరు అత్తలు; "అత్తకూ నాకు ఆరుంబాతిక, అత్తను ఎత్తుకు వెళ్లవే ముత్యాలమ్మ" అని కోరు కోడండ్రును కలరు. ఇటువంటి ఒకకోడలు ప్రతి దినము సంధ్యాదీపము పెట్టగానే

1. తెలంగాణా పల్లెపాటలు–పుట 100
2. పల్లెపదాలు–స్త్రీలపాటలు (వ్యా) శ్రీకొత్తపల్లి రంగారావు. గృహలక్ష్మి – ఆగష్టు 1941

"అత్త ఆరళ్లు నేబడలేను, అత్తపీడ నాకు వదిలించవే తల్లి" అని దండము పెట్టుకొనెడిదట, కొన్ని రోజులకు అత్తకు మారుగా తల్లి చావు వినవలసి వచ్చినదట ఆ కోడలుకు. ఇది ఇంకెట్టి పరిణామమునకు దారి తీసినదో!

అత్త కోడంద్రను గురించిన నానుడులు జానపద సాహిత్యమునంతటను వినిపించును. ఉదాహరణమునకు కొన్ని :

అత్తచేసిన పనులకు ఆరళ్లులేవు – అత్తు మంచీ వేముల తీపూలేదు
కోడలు వట్టిగెందుకుంటుంది దుడ్డె నెత్తుకొమ్మందట....
తెడ్డుండగా (కోడలని అర్థము) చేయెందుకు కాల్చుకోవాలి....
కత్తిమెత్తనా అత్తమంచీ లేదు....
"అత్త పగల గొట్టినకుండ అడుగోటికుండ....
కోడలు పగుల గొట్టింది కొత్తకుండ"....
పెళ్లాం బెల్లం, తల్లి విషం (కొడుకు విషయమున)
కోడళ్ళు తిండికైతే జాణలు, పనికి దొంగలు....
ముందువచ్చిన చెవులకంటె వెనుక వచ్చిన కొమ్ములువాడి....
"కూతుళ్లను కన్నమ్మకు కురిచీపీటలు;....

కొడుకులను కన్నమ్మకు గోడపంచలు"–(గోడపంచలు అనుటకు మారుగా కత్తిపీటలు అనుటయును గలదు)

"అత్తచచ్చిన కోడలేమనీ యేడ్చు?
వంటకాడ చీద్రమ్ము పోతివా అత్త
మామ చచ్చిన కోడలేమని యేడ్చు
మంచాల మరణమ్ము పోతివా మామ"–
అత్త చస్తే కోడలు యేడ్చినట్లు–
అత్త చచ్చిన ఆరుమాసాలకు కోడలికంట నీరు వచ్చినట్లు–
కోడలు గృహ ప్రవేశం "అత్త గంగా ప్రవేశం"

– సామరస్యము లేని అత్తకోడంద్ర రుసరుసలు చెప్పతరము గానివి. నిత్యజీవితములోని ఈ రుసరసలు గేయములందును చోటు చేసుకొనినవి–

"మా అత్త మా మామ! ఊరేగుతుంటె
చుట్టపీకలురెండు చూడొచ్చినాయి. –[1]
మా అత్త కొట్టాది–బిందెత్తి పొమ్మ
....
ఎత్తొద్దు ఎత్తొద్దు వెళ్లండి బాబు"–[2]

"ఇల్లలికి ముగ్గుపెట్టె ఇంటి మగవాడు
పేడకళ్లు దీయు పెదబావగారు–[3]

పుంజమ్మ నూలుకి పోగుతక్కువ
కొండమీద ప్రొద్దున్నది కొట్టబోకత్త. –[4]

కోడలా కోడలా కొలికి ముత్యమా
పచ్చి పాలమీద మీగడేమాయె–[5]

అత్త మెచ్చిన ధనము అతివేల శివధనము
కత్తిమీద కాయ కలదె మాయత్త. –[6]

చీరె అట్లా కట్టకమాన – చింగులట్టే పోయకమాన–[7]

–మొదలైన పాటలు అత్తా కోడండ్ర నితివృత్తముగా అల్లబడినవి. రాట్నము, విసరురాతి, దంపుళ్ళ పాటలను కదలించిన ఈ పాటలు ఉప్పెనవలె ఉబికివచ్చును. –

చాల చెదురుగా తప్ప అత్తకు కోడలితో పొత్తు కుదరదు. పొత్తే కుదిరిన నడిస్తే కందిపోగలదనునట్లు కోడలిని ప్రేమగా చూచుకొనును. కోడలనిన ప్రాణమిచ్చు అత్తగారు.

---

1. సెలయేరు పుట–162
2. పల్లెపదాలు పుట–98
3. అందే 101
4. సెలయేరు–పుట–17
5. తెలంగాణా పల్లె పాటలు పుట–99
6. తెలంగాణా పల్లె పాటలు–పుట 110
7. తెలంగాణా పల్లె పాటలు–పుట 175

"కొడకంటూ పుట్టాడు కొంటె కోణంగి
కోడలంటూ వచ్చింది రవ్వల్ల రాణి

– అని మనసార అనగలుగును. అట్లే కోడలు

"మన్నెరాజు వంటివాడు మామ గురవయ్య
అధిక చక్కని దమ్మ అత్త గురువమ్మ–[1]

– అని అనగలుగును. ముచ్చట గొలుపు ఇట్టి కోడండ్రను చూచి

"కాపురము సిరిగలిగి కడుపుబండిన
కమతకు కన్నీరు ధ్యానమేలేదు–[2]

– అని చుట్టు ప్రక్కల వారనుకొనుటలో ఆశ్చర్యము లేదు. ఇట్టి వాతావరణము సీతాదేవి రుక్మిణీ దేవి వంటి యిల్లాండ్రు మెట్టిన గృహములకే పరిమితము.

మామకోడండ్ర మధ్యన, బావ (భర్త అన్న) మరదలు మధ్యన మాటలు తక్కువ. మాటలు తక్కువనిన పాటల విషయము వేరుగా చెప్పనవసరము లేదు. అనాది సంప్రదాయము ననుసరించి మామ, బావల కెదురుగా వచ్చి కోడలుపిల్ల మాట్లాడదు. వారి మాట విన్నంతనే ప్రక్కకు తొలగిపోవుట. వారెదురు పడిన తలకొంగు సవరించుకొని తప్పుకొనుట, విధిలేని పరిస్థితులలో ఎదురుపడినను నేల చూపులు చూచుచు నిల్చుండుట పరిపాటి. పుట్టింటికి వెళ్ల దలచిన కోడలు ఇంటిలోని సభ్యులందరితో బాటు మామను, బావను అనుజ్ఞనడుగు ఘట్టములలో మాత్రమే మామ బావలను సంబోధించు పాటలు కలవు.

–అత్తతో బాటుగా మామను, బావలను, ఆడిపోసుకొను కోడండ్రు అక్కడక్కడ కనిపించక పోరు. సంస్కారమును బట్టి, పరిస్థితులను బట్టి వారి ప్రవర్తనలోను మార్పులు వచ్చును. ఒక మామ కోడలు మధ్యన సంభాషణము ఇట్లున్నది.–

1. అత్తాకోడళ్ళు (వ్యా) – కొత్తాపాతా – పుట 13
2. అందే

మామ :- కాకర చెట్టు మేకల్ మేసే ఓ కోడలా
నువ్వుయాడికి పోయినవె ఓ కోడలా?

కోడలు :- నిన్నన్న మాటలకు ఓ మామలో
మల్లె మొగ్గ లేర బోయిన ఓ మామలో

మామ :- పోతే పోతీవిగాని ఓ కోడలా
నువు పోయినోని పేరు చెప్పు ఓ కోడలా

కోడలు :- గుండు పోగులోడు ఓ మామలో
దండకడియాలోడు ఓ మామలో
.... –1

– ఈ పాట అంతయు హద్దుమీరిన కోడలు జవాబుతోనే నిండినది. ఈ పాటలోని మామకోడంద్రు–ఇద్దరూ నీతి బాహ్యమైన మాటలు మాట్లాడుటకు వెనుదీయ లేదు.

సవతులు :-

పూర్వము పురుషుని ఆధిక్యమును ప్రదర్శించుటలో స్త్రీలను ఒక సాధనముగా నుపయోగించిరి. పురుషుడు ఎంత మంది స్త్రీలను వివాహమాడిన నంత గొప్ప వాడుగా సంఘమునందు గౌరవమును పొందెడి వాడు. పరపతి హెచ్చునను భావముతో కాక పోయినను, మొదటి భార్యకు సంతానము కలుగలేదను దృష్టితోనో లేదా ఆమెలో నేదొనొక దోషమును కనబరచి మరల వివాహమాడుట జరుగు చుండెను. సంఘము కట్టుబాట్లు అధికమై బహు భార్యాత్వము నిషేదింప బడిన నేటి కాలమున నిట్టి వివాహములు అరుదైనను పూర్వకాలమున చాల సామాన్యముగా జరుగు చుండెను. ఆ విధముగా వివాహమాడగా వచ్చిన స్త్రీలు పురుషునకు భార్యలనే వ్యవహరింప బడినను, పరస్పరము తోటి భార్యలు సవతులు, సపత్నులు అనియు వ్యవహరింపబడుదురు. సపతులు ఏర్పడుట తప్పదను కొనినప్పుడు కలసి మెలసి ఉండిననే ఇంతయో అంతయో సుఖము లభించును. అట్లు కలసి మెలసి ఉండుటనే ప్రాచీనులు ప్రోత్సహించిరి. గొబ్బి గౌరమ్మను "మొగలి

1. తెలంగాణా పల్లెపాటలు–పుట–142.

పువ్వంటి మొగనివ్వావే" అని కోరుకొనుట సామాన్యము. కాని అందరి జీవితములు వడ్డించిన విస్తరులే కాజాలవు కదా. దురదృష్టము కొద్ది సవతి పోరు తప్పక పోయిన, అట్టి పరిస్థితిని కూడ సహనముతో ఎదుర్కొన ప్రేరేపించుచు తల్లులు పిల్లలకు ఒక గొబ్బి పాటలో ప్రబోధించినారు.

"గంగమ్మ గౌరమ్మ అప్ప సెల్లెంద్రూ గొబ్బీయళ్లో గొబ్బీయళ్లో
ఒక తల్లి బిడ్డలకు వైరమూలేదు ,, ,, ,,
అక్కనూ చెల్లినీ ఒక్కరి కిచ్చె ,, ,, ,,–[1]

– దీనిలో ప్రధాన వస్తువు కన్యల వివాహము. అక్క చెల్లెండ్రు ఒక్కనినే మనువాడినను గంగా గౌరులవలె సామరస్యముతో నుండ వలయునను భావము ధ్వనించుచున్నది. ఎదురుచెప్పు సాహసము లేని కన్యలు ఆనాటి సాంఘిక పరిస్థితులను సంతృప్తితోనే స్వీకరించినారు.

రాను రాను కాలము మార్పు వలన ఒక పత్నియుండగా మరొక్కరిని వివాహమాడుట హర్షించని కాలమాసన్నమయినది. "చేటు కాలమట శంకరుడనీకు, ఆలి మీది పెండ్లి యెట్లాడినావు?" అని భగవంతుని తప్పిదమునే వేలెత్తి చూపుటకు వెనుకాడ లేదు లోకము.

"సవతుల" పాటల నాధారముగా కుటుంబ స్థితి గతులనిట ఊహా మాత్రముగా చిత్రించ వచ్చును, అధికారము చేజిక్కించుకొనిన సవతి మాటలను తక్కిన భార్యలు వినుట, ఆమె చెప్పినట్లు ప్రవర్తించుట గోచరించినను. ఒకరిపై నొకరు ఈర్ష్యపడుట, ద్వేషమును పెంచు కొనుట సహజము. అట్టి పరస్పర స్పర్ధలు గల స్త్రీలలో నుండెడి మనస్తత్త్వమును జానపదులు చక్కగా వ్యక్తీకరించినారు.

మొదట వచ్చిన భార్య సామాన్యముగా కొంతకాలము భర్త అనురాగముతో పాటు యౌవనమును కూడ అనుభవించినదై యుండును. ఆ తరువాత వచ్చిన భార్యకు ఆ పురుషుడు తన్ను ఎంత ప్రేమించు వాడైనను కొంత కొరత కనిపించును. అదే భావము ఈ క్రింది పాటలో చక్కగా వ్యక్తీకరింపబడినది.

---

1. మిన్నేరు. పుటలు 15, 16.

వడ్లు దంచిన బియ్యం నీవుంచుకుంటె–ఉత్త ఊకాకేల? ఈ వాదులాట,
చల్ల జేసిన వెన్న నీవుంచుకుంటె – చల్ల నీళ్లా కేల? ఈ వాదులాట
విడెము జేసిన కల్మి నీవుంచుకుంటె-వట్టి పిప్పీకేల? ఈ వాదులాట
పట్టె మంచము పరుపు నీవుంచుకుంటె–నులక కుక్కీ కేల? ఈ వాదులాట
వయసు ప్రాయమెల్ల నీవుంచుకుంటె–వార్థక్యానికా? ఈ వాదులాట–[1]

– ఇందు నిత్య జీవితములో నుండు సంఘటనములతో బాటుగా ధ్వన్యాత్మకముగా తనకన్న పెద్దదియైన సవతి యెడల గల ఈర్ష్యను చిన్న భార్య సూచించు చున్నది. వడ్లు దంచిన బియ్యమనగా కండపుష్టి కలిగిన యౌవనమును తన కన్న ముందు పెండ్లాడిన స్త్రీ అనుభవించిన దనియు, వడ్లుదంచగా మిగిలిపోయిన ఉత్త యూక యనుట నీరసపడి వృద్ధాప్యములో నున్న వాడు తనకు మిగిలినను ఇంక ఎందులకు వాదులాట అని వృద్ధుని చేపట్టిన స్త్రీ తన సవతిని దూషించు చున్నది. పెరుగును చల్ల చేయగా వెడలిన పుష్టికరమైన వెన్న రూపములో నున్న భర్తను అనుభవించినది మొదటి భార్య–వెన్న వెడలగా మిగిలిన చల్ల మజ్జిగ నీళ్లుగా నున్న భర్తను అనుభవించినది రెండవ భార్య అను అర్థమును గ్రహించవలెను. ఇట్లే పాటలో నంతయు తన సవతి యెడగల అక్కసును వెళ్లగ్రక్కు చున్నది. "ఒక్క ఒరలో రెండు కత్తులిముడవు" అను నట్లు ఒక భర్తను పెండ్లాడిన సవతులలో పొత్తు కుదురదు. ఒకరిని ఒకరు సాధించుకొను సాధింపులు అమితము.

మొదట ఏదో సుఖముననుభవించ వచ్చునని భ్రమసి వివాహమాడినను భార్యల సాధింపులతో సుఖమనునది భర్త యెరుగడు. అట్టి భర్తకు "ఉభయ భ్రష్టత్వము, ఉపరి సన్యాసము" అను గతియే ప్రాప్తించును. అందుకనే "ఇద్దరి పెళ్లాల మగడు ఇరుకున పడి చచ్చాడు" అని వాడుక.

> "ఈ లాగు వాదమ్ము సవతులు జేయ – యిద్దరిని వోదార్చ లేకనే శివుడు
> శిరస్సున జాలరి గంగనేవుంచి – తొడలపయి పార్వతీ దేవినేవుంచి
> వెళ్లెను ఆ శివుడు కైవల్య గిరికి–[2]

---

1. సెలయేరు–పుట 109.
2. సెలయేరు పుట 110.

– సామాన్యముగా సవతుల కయ్యములలో శివుని నాయకుని గను, కక్షలు ఇద్దరు భార్యల వలననే రగుల్కొనును గావున నాయికలుగా గంగా గౌరీలను ఉదాహరింతురు.

బహు పత్నీకుడు గాక ఏక పత్నీకుడైన పురుషుడు పరిహాసమునకు తన భార్యను "తాను ఇంకొక పెండ్లి చేసుకొనెదననియు, ఆమెతో కాపురము పెట్టెదననియు" బెదరించు చుండును. "ఏలా తెస్తావో చూస్తాను, నీపని దానిపని పడ్తానని" భార్య గద్దించుటయు, "నీవట్లానే అనుకొంటుండు ఓనాటికి తెస్తానా లేదా చూడు" మని భర్త భయపెట్టుటయు సామాన్యముగా జరుగుచుండును. ఇది అన్యోన్య దాంపత్యము కలిగి పరిహాసమునకు పలికిన బాగుగానే యుండును. కాని అనుకూలత తప్పిన సంసారములో యిట్టి మాటలు చిచ్చుపెట్టినట్లుగా యుండును.

కొన్ని ప్రాంతములలో "సవతిని" ఏరాలు, యారాలు అని వ్యవహరించుటయు కలదు – 1 శబ్ద రత్నాకరమున ఏరాలునకు ఎరవు+ఆలు అని వ్యుత్పత్తి కలదు. ఎరువు=అన్యము అని శబ్దరత్నాకరమున పేర్కొనబడినది. ఇంటి ఆడబడుచుకాక అన్యమైన స్త్రీ అని అర్థం చేసుకోవచ్చును. ఇర్ కాని ఈర్ కాని "రెండు" అనే అర్థములో ద్రావిడ భాషలన్నింటిలో సమానముగా కనిపించుచున్నది. ఈర్+ఆలు=ఏరాలు–అని వ్యుత్పత్తి చెప్పుట ఉచితము. అనగా ఇంటికి వచ్చిన రెండవస్త్రీ, కాపురము చేయుటకు వచ్చిన తనవంటి కోడలే గనుక తోడికోడలు కూడ అయినది. మొదట ఏరాలు పదము సామాన్యముగా ఇంటికి వచ్చిన రెండవస్త్రీకి వ్యవహృతమై, పిదప తోడికోడలు అను అర్థమున స్థిరపడిపోయి యుండును. ఏరాలు అను పదమునకు సవతి అను అర్థము గూడ ఈ క్రిందిపాటలో ఉండుటను బట్టి ఇంటికి వచ్చిన రెండవ స్త్రీయను అర్థము చక్కగా పొసగుచున్నది.

---

1. శ్రీకాకుళం ప్రజలభాష – వి సి. బాలకృష్ణశర్మ యార్లు–యారలు(సవతి) ఉదా:– దానికిద్దరు యార్లు, ఒకర్తె పెళ్ళాడినది–ఇంకొకర్తె ఉంచుకున్నది. ఇంకేటి కాపురం? పుట 209

పు:- ఏరాల్ని తెస్తాను - యింటిలో పెడతాను, ఏ
రాలి మాట లినాలె - సుందరి పిల్ల, ఏ
రాలి మాటలినాలి - నాయుడోలమ్మ ॥

స్త్రీ:- ఏకులొడుకుతాను - ఏరొండి పెడతాను, ఏ
రాలి పోరు పడలేను - సుందర మగడ, ఏ
రాలి పోరు పడలేను - సోకుదారి మగడ

- ఏరాల్ని తెచ్చెదననిన భర్తతో "ఏరాలి పోరు పడలేను" అనియు "కాని మాట లాడ బోకు మనియు" ఇల్లాలు హెచ్చరిక చేయును. అంతటితో ఆగక భర్త

బంగారపు బొమ్మ బెంగుళూరు గుంట, దాని
నడుము నాగ బంధములే సుందరి పిల్ల, దాని
నడక హంస నడకలే - నాయుడోలమ్మ"

- అని ఉవ్విళ్ళూరించును. అందుకుగాను-

"దాని మాయలోను పడబోకు - నాయుడు బావ, దాని
సోకులోను దిగబోకు - సుందర మగడ దాని
మాటలైన యినబోకు సోకుదారి మగడ"

- అని భార్య పలుకగా భార్య మాటలను పాటించిన వాడుగా

"వడ్డాణమిదిగోనె - వయ్యారి భామ, నీ
నడుముకైన పెట్టుకోయె - సుందరిపిల్ల, నీ" [1]
నడుము చక్కగుంటాది - నాయుడోలమ్మ"

-అని బెంగుళూరు గుంట కొరకు తెచ్చిన వడ్డాణమును భార్యనే తీసుకొను మనును. ఇది విను వారికి "నాటక సన్నివేశమును స్ఫురింపజేయు చుండును.

సవతులు కొందరు తోడ బుట్టువులవలె ఎంతయో ప్రీతితో నుండుటయు కలదు. జానపదులు యిటువంటి సంఘటనలను గూడ గంగా గౌరి సంవాదములో చేర్చినారు: జానపదులు తమ నిత్య జీవితములో చూచిన ఏ ఉదాత్త సపత్ని కథకో "గంగా గౌరి సంవాదము" ను ప్రతీకగా చెప్పి యుందురు. -[2]

1. మిన్నేరు-పుట 202 మరియు పల్లె పదాలు - పుట 104.
2. గంగా గౌరి సంవాదము, స్త్రీల పౌరాణికపు పాటలు - పుటలు 295-299

ఇద్దరేకాక పెక్కుమంది భార్యలున్న వారి స్థితి చెప్పనలవి కాదు. శ్రీమంతులైనపుడు వారి నిత్య జీవితమునకు లోపము లేకుండును. మనోవ్యథ మాత్రముండును. సవతుల సంతానము కలహించి రాజ్యములను కూలి పోవుట చరిత్రలో కనిపించుచున్నది. ఈ బహు భార్యలు గల వారి వైభవమును, పారవశ్యమును అష్ట భార్యలు గల కృష్ణుని సాకుతో వర్ణించుట జానపదుల పాటలలో కలదు. దానికి గొప్ప ఉదాహరణము "సవతుల కయ్యము". –[1]

తోడి కోడండ్రు :-

తోడి కోడలును "ఏరాలు, యారాలు" అని వ్యవహరింతురు. ఏరాలు పద ఉత్పత్తి ఇంతకు మునుపే చర్చింపబడినది. ఏరాలనగా బావ లేదా మరది భార్యయై యుండును, వీరు వేరువేరు ఇండ్లలో పుట్టి పెరిగి వచ్చి మెట్టినింట కలసి మెలసి సహజీవనమును గడుప వలసినవారై యుందురు. వీరు ఒక్కొక్కమారు మనసు కలసినవారై యుందురు; లేదా అత్తపోరును పడలేక ఒకటై పరస్పరము కలసి మెలసి ఒక్కమాటగా నుండి ఒకరికొకరు చేదోడు వాదోడుగా నుందురు. సమాన శత్రుత్వము గూడ స్నేహమునకు కారణ మగును. "తోటి కొడలు రావె,[2]–తోడాడుదాము–[3]" అని ఆత్మీయతను ప్రదర్శించుకొను చుందురు. ఏరాలు పదము పాండురంగ మహాత్మ్యమున పేర్కొనబడినది. –[4]

ఏరాలు తోడైన పని పాటలలో సహాయపడుటయే కాకుండ. అత్త పెత్తనములో కష్టములననుభవించువారై ఆహారము సరిగా లభింపకుండ యున్న దొంగతిండి తినుటలోను ఒకరికొకరు సహాయకారులుగా నుందురు.

"తోడి కోడలు నాకు తోడాయెనమ్మ
దొంగతిండ్లకు మాకు సందాయెనమ్మ"–[5]

1. సవతుల కయ్యము–స్త్రీల పౌరాణికపు పాటలు–పుట 336–341
2. తోటికోడలు – తోడికోడలు – ట.డ–లు పరస్పరము మారుచుండును.
3. సెలయేరు – పుట 107.
4. పాండురంగ మహాత్మ్యము – తెనాలి రామకృష్ణకవి – ఆ. 3. ప.62.
5. పాతపాటలు – టే, కామేశ్వరరావు – పుట 33.

అత్త తరువాత యింటి పెత్తనములో పెద్దకోడలుకు అధికారములు ఎక్కువగా నుండును. అందుచేత పుట్టింటికి వెళ్ళదలచిన యిల్లాలు అత్తమామలు, బావ, భర్తల అనుమతులతోపాటుగా ఏరాలు అనుమతియును, పొందుచుండుట పరిపాటి. ఏరాలు తనకన్న పెద్దదైన ఆమెను 'అక్క, అని వ్యవహరింతురు.

"తోటలో దవనమా తోడికొడండ్లా (లా)
మాయన్న లొచ్చారు నన్నంపవలెను"–[1]

– అని తనకంటె పెద్దవారైన తోడి కోడండ్రను తాను పుట్టింటికి వెళ్ళుటకు అనుమతినివ్వమని ఒకయిల్లాలు కోరుచున్నది. తోడి కోడండ్రు అటుయిటు అనకుండ సామాన్యముగా "నేనెరుగ నేనెరుగ నీభర్తనడుగు"–[2] అనుచు పంపవలసిన బాధ్యతను యితర కుటుంబ సభ్యులపై మోపెదరు. అవిభక్త కుటుంబములలోని సభ్యులందరును సామాన్యముగా నిట్లే యుందురు అందటి అనుమతిని పొందిననేగాని అణకువగల స్త్రీ అడుగుముందుకు వేయజాలదు; అత్తమామలు, బావ – అధికార బాధ్యతాయుతులైన వారిని మొదట అడుగుచు అటుపిమ్మట తోడికోడలును అడుగును. తోడికోడలు "అవును, కాదు" అనకుండగా "నీ భర్తను అడుగుమని" బాధ్యతను మరది పైన వేసి తప్పుకొనును. ఇంటిపనులలోను, బయటి పనులలోను ఏరాండ్ల మధ్యన ఎవరెక్కువ యనునట్లు పోటీలుండును. ఒకరిని మించి ఒక్కరు 'భళీ' యనిపించుకొనవలెనని యత్నింతురు. అయినను కొందరు స్త్రీలు బద్ధకించి పని దొంగలుగా నుందురు. అట్టివారికి అత్త హెచ్చరికలు జరుగుచుండును.

"సాటెడు బియ్యంబు సరిపోటువేసి–సాటియారాలుతో సరితూగుమన్న"–[3]

– అను అత్త పలుకులు కోడలుకు కర్ణకఠోరముగా నుండును; భార్యా విధేయుడైన కొడుకునకును కటువుగానే తోచును.

ఉన్నను లేకున్నను అందచందములలోను, పనిపాటలలోను ఏరాండ్ర కన్న గొప్పగా కీర్తింపబడవలెనని స్త్రీలు కాంక్షించెదరు.

---

1. మిన్నేరు – పుట 187.
2. పల్లెపదాలు – పుట 111.
3. తెలంగాణా పల్లెపాటలు–పుట–114

"నీలి చీరె కట్టినావు - నీలాల పేరేసినావు
నీసటి యారాండ్లకల్లనో - ఓ దొరుసాని - నువ్వె మీరి మించివున్నవో
నీలి చీరె మేలిముసుగు - నీనడుము పిడికెడైన
నీసటి యారాండ్ల కల్లనో-ఓ దొరుసాని-నువ్వె మీరిమించివున్నవో"-[1]

- ఇట్లు సాటియేరాడ్లంలో అధికముచేసి సేవక బృందము యజమాను రాలిని ఉంబ్బించి లాభములను పొందుచుండును.

"యారాలు పోరు యాపకాయ చేదు అనుభవిస్తేనేకాని తెలిసేదికాదు" "యారాలు పోరు సవతి పోరుకంటె ఎక్కువ" అనునవి సామెతలు ఏ విషయములో నైనను ఒకరికంటె ఒకరు మెరుగుగానుండుట భరించలేరు. దానితో మనస్పర్ధలు బయలు దేరి పోట్లాడుకొనుట జరుగుచుండును. ఆ పోట్లాటలను ఇల్లాండ్రు చిలువలు పలువలు చేసి భర్తలకు మొరపెట్టుకొనుట సహజము.

వదిన-మరదలు :-

వదిన మరదండ్ర పాటలు పరిహాసములతో కూడినవి. వారి వేళాకో ళములు చూచువారికిని కనులపండుగ కొల్పుచుండును. పనిపాటలో శ్రమను తొలిగించు కొనుటకేగాక కాలక్షేపమునకును--అందులోను వారు వరుస కుదిరిన వారు గనుక చమత్కారపు విసురులు విసురుకొనుచుందురు.

దంపుళ్లు, విసరుట, రాట్నమువడకుట-స్త్రీల ప్రత్యేక వృత్తులు గనుక అట్టి పనులను చేయునప్పుడు శ్రమోపశమనమునకు వారు పాటలను పాడుకొనుట పరిపాటి. అట్టి పనులలో వదిన మరదండ్రు, కలిసిన పాతరలోనుంచి తీసినట్లు పాటలకు కొదవ ఉండదు.

వదినమరదండ్రు పరిహాసములలో ఒకరికి మరియొకరు తీసిపోకున్న చమత్కారపు జల్లు కురియు చుండును.

దంపు దంపు అనియేరు, అది యెంత దంపు
ధాన్యరాసులమీద చెయ్యేసినట్లు
వంట వంట అనియేరు, అదియెంత వంట

1. తెలంగాణా పల్లెపాటలు-పుట 67

వదినెతోమరదళ్లు వాదాడినట్లు. –[1]

–దంపుడు పని చాల శ్రమతో కూడినది. అయినను ఉత్సాహవతులయిన స్త్రీలు అది ఒక పనిగా భావింపరు. దంపు అనునది ధాన్యరాసుల మీద చెయ్యేసినంత సులభమైన పనిగాను, తొందరగా చేయగలిగిన పనిగాను భావించుచున్నదీ పడతి. అట్లే "వంటవంట అనియేరు అది యెంత వంట; వదినెతో మరదళ్లువాదాడి నట్లు" అని వంటచేయుట, వదినతో మరదండ్రు వాదులాడుట ఒకటిగానే భావించినారు. ఈ వాక్యమును విమర్శనాత్మకమైన దృష్టితో గమనించిన ఒక చక్కని భావార్థము స్ఫురించుచున్నది. వంటను ఎంత సులభమైన పనిగా భావించినను, అది కుదిరి రుచిగా నుండిన బాగుగానే యుండును. ఉప్పో, కారమో ఎక్కువయో తక్కువయో అయిన యెడల రుచి చెడును. అట్లే వదిన మరదండ్రు మనసు కలిసి పరిహాసము లాడిన బాగుగానే యుండును. మనసు కలవని పరిహాసములు ములుకులవలె హృదయములను బాధించును.

హాస్యములు సామాన్యముగా సున్నితముగా నుండవు. అందులోను జానపదుల హాస్యములో మోటు దనము ఎక్కువ పాలు.

వదినెకు వగదర – బిందెకు బిగదర
బంగరు కుచ్చుల మా వదినే
గోడపొంటి రెండు నల్లులు పారుతె, ఉలవలంటదీ మా వదినే
బుక్కుతనంటది మా వదినే
నరాలపొంటి తేళ్లు పారుతె – సేవాలంటది మా వదినే
తింటనంటది మా వదినే – దూలాలపొంటి పాములు పారుతె
కడియాలంటది మా వదినే – పెట్టుకుంటనంటది–[2]

–ఈ పాట ఈ విధముగ సాగును.

ఎంత అమాయకురాలైన వదిన యయినను నల్లులను ఉలువలని, తేళ్లను సేవియలని (సేవియాలు–తిండి పదార్థము), పాములను కడియములని భ్రమపడి

1. సెలయేరు–పుట–16 2. పల్లెపదాలు–పుట–90

వాని చెంతకు వెళ్లదు. వెళ్లినను తాకుటకు వెనుకాడును. ఇది అంతయు మరదలు పట్టించు హాస్యమే కనుక వదిన మందహాసముతో వదలించుకొనును

ఇట్టి హాస్యముతో కూడినదే మరొక్క పాట :

వైశాఖ మాసాన వారింట పెళ్లి–వల్లభుడు అన్నయ్య పెళ్లి చేయించె
మిల్లి తడియకుండ, బొట్టు పడకుండ–నేర్పుగా పెద్దవదినె నేతులొడ్డించె
చేతి చిత్రాలది, చిన్నన్న వదినె–ఆకాశాన మిల్లి ఆడించిపోయె.
మా వదిన గడుగాయి, దండుసిపాయి–ఇల్లెక్కి వండింది, యీనె బూరెల్లు
పొయ్యెక్కి వండింది పొంగు బూరెల్లు–దీనజేసి వండింది దోసెడుగారెలు
నీళ్లతో వండింది, నూలగారెల్లు–వదినెకు వగదర, బిందెకు బిగదర
....–వాసాలంట, తేళ్లు పారితే
జిలేబి యంటది మా వదినే–తింటాసంటది మా వదినే ॥వ॥

–పై పాటలో తేళ్లను సేవియలుగా భ్రమపడుటకన్న, ఈ పాటలో తేళ్లను జిలేబీలుగా భ్రమపడుట ఆకారముల పోలిక ననుసరించి చక్కగా నున్నది. వదిన పెదవి మెదపక పోయిన హాస్యము సాగుచునే యుండును.

వదినా! వదినా! వేవిల్లా? – నీతో ఎవ్వరు సెప్పేరు
నాతో మా అన్న సెప్పేడు – వదినా, వదినా, వల్లంగి పిట్టా
గదిలో పెట్టా, గంజి నీళ్లొయ్యా – నీకొడుకుట్టా, నా పేరెట్టా
మా అన్నకొట్టా, నువ్వేడ్వా నేనవ్వా – వదిన, వదిన, వాసింత
పన్నేండేళ్ల కడుపంట – పత్తిగింజ కొడుకంట
తిరుపతి రాయుడు పేరంట – తిరిగి చూస్తె లేడంట
మల్లి చూస్తే – మంచాన్నున్నాడంట. –[1]

– ఇట్లు అంతులేని పరిహాస ప్రవాహములో పరుగిడుదురు వదినా మరదండ్రు. ఈ వదినా మరదండ్ర వరుసలు మేనరికములో నున్నవైన చిన్ననాటి నుండియే పరిహాసములాడు చుందురు. మచ్చునకొకటి ;

1. సెలయేరు పుట. 96.

మందగట్టుల మీద అన్నల్ను జూచి - మచ్చికలు చేసేరు మామ కూతుళ్లు
చేను గట్టులమీద అన్నల్నుజూచి - చిరునవ్వు నవ్వేరు అత్తకూతుళ్లు. -[1]

వదిన మరదండ్ర మధ్యన సహనము లోపించక ఎంతటి పెద్ద మాటలను విసరుకొనినను పాడుకొనువారితో బాటుగా వినువారికిని, చూచువారికిని వినోదముగానే యుండును. ఏ ఒక్కరికి కోపమువచ్చినను "నవ్వులుపోయి నువ్వులయిన" వను సామెతకు దారి తీయును. ఈ హాస్యములలో "ఆడబిడ్డ అర్ధమొగడ"ను రీతిగా అధికారమును చెలాయించ చూచిన అది జుట్లు జుట్లు పట్టుకొను బేరమునకు వచ్చును.

వదిన-మరది :

స్త్రీలు వయస్సులో తనకన్న చిన్నయైనను పెద్దయైనను భర్త యొక్క తమ్ముండ్రను "మరది" వరుసతో పేరు పెట్టి పిలచుట పరిపాటి. గొప్పింటి వారైన పేరుకు తోడుగా దొరగారు, మరిదిగారు, అయ్య అను పదములను చేర్చి పలికెదరు.

భారతీయ వ్యవస్థలో సమష్టి కుటుంబములకే ఎక్కువ ప్రాధాన్యము కలదు. కావున వదిన ఒకేయింట మెలగ వలసిన వారగుటచే పరస్పరము వారిద్దరికిని తల్లి-కుమారుల సంబంధమును భావింపజేసెదరు.

వదిన పెరయింటినుండి వచ్చి, అంటు మామిడి వలె మరొక ఇంట చిగిర్చి పూచవలసిన వ్యక్తి గనుక ఆమెను తల్లి యని భావించుటకు ఎంతయో మనః పరిపాకము కావలెను. దుర్బుద్ధి కలవారయినను కుటుంబ గౌరవమును పాటించియో, లోక భీతితోనో ఆమెను మర్యాదగ చూచుట అలవరచు కొందురు. కొందరికి సహజముగను, మరికొందరికి ఆమె సత్ప్రవర్తనమును బట్టియు క్రమముగా తల్లియను అభిప్రాయము ఏర్పడును. దుర్బుద్ధితో తన వెంటబడిన తన మరదిని ఒక యిల్లాలు కుటుంబ విచ్ఛేద భయముతో తన యింటి గోడలమీది

1. మిన్నేరు పుట. పుట 169

రామానుసారి యగు సౌవిత్రి బొమ్మను చూపి బుద్ధి చెప్పినట్లు గాథా సప్తశతిలో ఒక గాథలో నున్నది–[1]. ఈ ప్రవర్తన ఉభయుల సంస్కృతికి సంబంధించినది.

మన్నింప నేర్చితే, మరిదియే కొడుకు
వడ్డింప నేర్చితే వదినయె తల్లి –[2]

– తల్లి వంటి వదినలును, కొడుకు వంటి మరదులును అచ్చటచ్చట కాన్పించెదరు. అట్టి వదిన మరదిని కొడుకుగానే భావించును. కనుక కొడుకు నెడల కనబరచు వాత్సల్యమునే మరిది యెడ కనబరచును. అతని వ్యక్తిత్వములో ప్రతిది గొప్పగానే భావించును.

పక్కలోది సూరకత్తి । బాలుడు వీరన్న
నామరిది సూరన్న కుంచసిగ జాస్తె
ఓ మరిది సిగలోను వెండి మెరిసింది
ఓ మరిది పక్కలోను పమిడి మెరిసింది
గుత్తి వెయ్యి జేసు కుందనం వెయ్యి జేసు
నామరది సూరన్న మాట వెయ్యి జేసు
మాటలు నేరని, మానవరాలు; మరది దేవుడని మరివేడుకొందు
మరది మరది యందు మత్స్యమనీ యందు
సారల్ల పులియందు చందమామందు
వయ్యారి గాడమ్మా వక అత్తకొడుకు
వరుగు బిళ్లలమీద వరిగి నట్లుండు
వాడు మల్లె పువ్వులు, సిగజుట్టుకొని
వాడలను వచ్చేడు వదినెల మరది.–[3].

–ఇందు మరది యెడల నుండు ఆత్మీయత వెల్లువలై ప్రవహించినది. మరది వీరత్వమునకు పక్కలో నుండు సూరకత్తి వాడి తనముతో పోలిక చెప్పినది. అంతటి వీరత్వమును బాలుడుగా నున్న వయస్సులోనే కనబరచుట వలన తన మరది చాల గొప్ప వీరుడని చెప్పక చెప్పినట్లున్నది. ఇందులో వీరసత్వమునే

1. గాథాసప్తశతి. 1–35
2. సెలయేరు పుట (113 ఇవే చరణములు సెలయేరు నందే పుట 17లోను కలవు.)
3. సెలయేరు పుట 97

గాక మరది మాట వెయ్యి జేయునని, చంచలత్వములో మత్స్యమని, ఆకర్షణలో చారలు కలిగిన పులి యని, అందము నందు చందమామ యని వర్ణించినది. అంతటి గణనీయుడైన మరది వచ్చుటను "మల్లెపువ్వులు సిగజట్టుకొని వాడలను వచ్చేడు వదినెల మరది" అనుటవలన తల్లి చిన్న కుమారునిలో కృష్ణుని ఊహించుకొను దృశ్యము గోచరించు చున్నది.

వయస్సు ఎదుగుచున్న కొద్దీ మరదిలో చిలిపి తనము అధికమగు చుండును. అందుకే "చెట్టు మీద కోతివంటి మరది కావాలి"–[1]. అని కోరుకొనును ఒక వదిన.

మరది బాగోగులను అతి జాగ్రత్తగా చూచుకొను వదినలు యుక్తవయస్సు వచ్చిన మరదుల చంచలత్వమును ఒక కంట కని పెట్టుచునే ఉందురు. "ఊరెల్లిన" మరది తిరిగి వచ్చుటకు ఆలస్యమైన స్త్రీవ్యామోహమునకు గురియైనాడేమో యని

మర్ది కొలా లేసి మర్లి రాలేదేమొ
ఆలునూరి గట్ల మీద ఆరెనేమో ఆడినెమిలి
ఆడిదాని మరి గుబ్బలమీద పొదిగెనేమొ మరి పోతునెమలి–[2].

అని ఊహించు ఆదర్శ గృహిణియై ఆత్మీయురాలైన వదిన మరది వివాహితుడై నను, కాక పోయినను అతని ప్రవర్తనలో నుండు చంచలత్వమును గమనించి అతనిని చక్కదిద్ది మంచి మార్గములో పెట్టుటకు ప్రయత్నించును. ఇంతటి ఆత్మీయతను పంచి పెట్టు వారు చాల అరుదుగా నుందురు. ఎవరి స్వార్థమును వారు ఆలోచించువారే అధికముగా నుందురు. స్వార్థమెక్కువగుట వలన అత్తగారి వైపు వారందరి యెడల నిరసననే వ్యక్తపరచును. ఈ జాతికి చెందిన ఒక వదినగారు తనప్రియునకు తనకొరకై పంపవలసిన వస్తువులను పేర్కొనుచు–

"చీరలంపు మాడలంపారా నా సామిరంగా
చిన్న మరిది చిత్త పిడుగురా నసామిరంగా
చీరలోన మూర చింపూరా నాసామిరంగా

3. సెలయేరు పుట 101 2. తెలంగాణా పల్లె పాటలు పుట 171.

నేను నీకు మంచి దాననే నాసామి రంగా
నీవారి కెల్లను చెడ్డ దానినిరా నాసామిరంగా–[1]

– అనుచు చిన్న మరదిని చిత్త పిడుగుతో సమానము చేసినది. చిత్తకార్తిలో పిడుగులు అధికముగా పడి నష్టమును కలిగించుట సహజము. చీరలోన మూర చింపునంతటి నీచునిగా మరదిని భావించుచున్నది. ఇటువంటి స్త్రీలు కుటుంబములలో కలసి మెలిసి యుండజాలరు. ఒక వేళ అత్తగారి అధికారము చెల్లుబడి జరిగిన కొంత కాలము వారి ఆజ్ఞలో అణగి ఉందురేమో కాని లేకున్న వీరి ఆర్భాటము చెప్పతరము కానిది.

"మా అత్తా మామాపు ఊరేగినాక
వడ్లు దంచ నొక మరిది, వండ నొక మరిది
వంటకుండల కాడ కావలొక మరిది
పేడ కల్లాపుచల్లు పెద బావగారు
ఇల్లలికి ముగ్గెట్టు యింటి మగవారు."

– అని యనుకొనును. అత్తమామల అధికారము తొలగి పోయిన మరదులతో, బావతో, మగనితో అన్ని పనులు చేయించుకొన వచ్చునను కొనుచు వారు ఇంటి పనులను చేయుచు నుండిన తాను హాయిగా ప్రొద్దెక్కిన తరువాత నిద్ర మేల్కొన వచ్చునను కొనును. మేల్కొనిన పిదప–[1].

"పనగార పుల్లయేది? పంచటరుగేది
జారి చెంబుతో నీళ్లేవి చాయపసుపేది
కంచములో అన్నమేది? కట్ల పీటేది
పండాన మంచమేది? పట్టు పరుపేది?–[2].

అని సకలోపచారములు సమృద్ధిగా లేవేమని ప్రశ్నించు ధోరణి అలవడును. చూచువారు "ఏమిరా! ఆడదాని ఈ వింత పలుకు లేమి?" అని ఆశ్చర్యపడు స్థితికి వచ్చును. ఊహలోనేగాక గడుసు కోడలు మెట్టిన యింటి గతి అంతే అగును.

1. సెలయేరు–పుట 118.
2. సెలయేరు–పుట 103.

మరొక రకము వదిన ప్రొద్దుటనే నిదుర లేచి చీపురు బట్టుకొని సందులోనికి పోవు వేళకన్న ముందే మరదులు లేచి బట్టలుతుకుచునుండగా తనకన్న ముందు నిద్ర లేచి తనను అత్తగారితో తిట్లు తినిపింతురను ఆలోచనలో మరదులను. –

"దోసకారి మరిది, పాపకారి మరిది"–[1]. అని నిందించినది. ఇట్టి వదినలు దొరికిన మరదులకు ఇంటిలో మనశ్శాంతి లోపించును.

సమిష్టి కుటుంబములలో అణకువ కలిగిన కోడలైనను అణకువలేని దైనను పుట్టింటికి పోవలెననిన అత్త, మామ, తోడి కోడలు బావ, భర్తల అనుమతితో పాటు మరది అనుమతిని కూడ గైకొనుట సహజము. మంచివాడైనను, దురుసు తనము కలిగిన మరదియైనను వదినను పుట్టింటికి పంపు బాధ్యత ఇతర సభ్యులపైననే యుంచును.

వదిన :– ఎద్దుల్ల కాసేటి ముద్దుల మరది
మాయన్న లొచ్చారు మమ్మంపుతారా
మరది :– ఏరి మీ యన్నలు, ఏవి గుఱ్ఱాలు
వదిన :– బంకుల్ల అన్నలు బైట గుఱ్ఱాలు
మరది :– నాకెరుక లేదమ్మ మాయన్నగాని–[2]

–అన్నా చెల్లెంద్ర సంబంధపు పాటలలో నిట్టి సమిష్టి కుటుంబమును చిత్రించు పాటలు కొన్ని పేర్కొనబడినవి.

పొలముగట్టున వదినకు మరదికి జరిగిన సంభాషణాత్మక మైన పాట యిట్లున్నది. వారి మాటలలో నుండు ఏసను మారకుండగా వ్రాయుచున్నాను.

వదిన :– ఆవులు పాయెరా అర్క చేన్లల్లకు చిన్నమరదీ నాముద్దులయ్య
కోడెలు పాయెరా కొఱ్ఱ చేన్లల్లకు చిన్నమరదీ నాముద్దులయ్య
దూడాలు పాయెరా తుక్కి చేన్లల్లకు చిన్నమరదీ నాముద్దులయ్య
అన్ని పోయిందాకా ఏమి చేస్తివిరా చిన్నమరదీ నాముద్దులయ్య
మరది :– అన్ని పోయిందాకా మడుగు జల్తోదినె నాముద్దులమ్మ
వదిన :– మడుగు జల్లిన చాపలు యాడ యుండయిరా చిన్ని మరిది నాముద్దులయ్య

1. తెలంగాణా పల్లె పాటలు–పుట 102.
2. నేను సేకరించినది–పాడినవారు జంగమ్మ రాయిప్రోలు.

మరిది :- ఆకలిగొని సేను కాల్చుక తింటొదినే చిన్నవదినే నాముద్దులమ్మ
వదిన :- కాల్చుకతిన్న బూడిద యాడ యుండదిరా చిన్న మరిదీ నాముద్దులయ్యా
మరది :- తిన్నప్పటి నుండి వానగాలి వరదలై పారె ॥చిన్న॥
వదిన :- వానగాలివొస్తె నాని లేవేమిరా ॥చిన్న॥
మరది :- చిన్నప్పటినుంచి దేవుని కొడుకునే ॥చిన్న॥
వదిన :- వరిపొట్టు చాతాడు పేనేవా మరది ॥చిన్న॥
మరది :- వరిపొట్టు చాతాడు పేన నావశమా ॥చిన్న॥
వదిన :- వానగండ్ల పొయ్యి పెట్టి వండేవా మరదీ
మరది :- వాన గండ్ల పొయ్యి పెట్టి వండ నావశమా
వదిన :- జమ్మాకు విస్తారు కుట్టేవా మరదీ
మరది :- జమ్మాకు విస్తారు కుట్ట నావశమా-[1].

- మొదట పొలములో పడిన పశువులను కాపలా గాయుటలో జాగ్రత్తగా నుండని మరదికి హెచ్చరికతో వదిన సంభాషణ మొదలిడినది. మరది చిన్నప్పటి నుండి దేవుని కొడుకునె "అనుటతో" దేవుని కొడుకైన ఎడల వరిపొట్టుతో చేతాడు పేనగలవా అని, పడగండ్ల పొయ్యి పెట్టి వండగలవా అని, జమ్మి ఆకుతో విస్తరాకు కుట్టగలవా అని అసాధ్యమైనవిషయములను సాధించగల సమర్థత ఉన్నదా లేదా అని వదిన ప్రశ్నించినది. మరది తక్కువ వాడేమి కాదు. ఆమెతో ఆ పనులు తాను చేయలేనని చెప్పి "వుసిరికాయల దొంతి పెట్టగలవా అని, జిల్లెడు కొమ్మలలో నీరు తేగలవా" అని ఎదురు ప్రశ్నలు వేసినాడు. ఈ పాటలో హాస్యముతో బాటు వారి పరిసరవస్తువుల పరిశీలనాత్మక దృష్టియు వ్యక్తమగు చున్నది.

హాస్యము ప్రధానమైన చమత్కారములతో వదిన మరదుల సంబంధము లను తెలుపు పాటలు హృదయమునకు ఆనందమును చేకూర్చును. ఇందు సామాన్యముగా మేనత్త మేనమామ పిల్లల వరుసలోని వారేయై యుందురు.

మేనత్త కొడుకమ్మ నామేన మరది-నన్ను చూడా వచ్చి పాతర్ల బడెను
పాతర్ల బిడ్డవాణ్ణి రోకళ్ల కుమ్మి - మూల మంచము వేసి ముంత పొగబెడుదు
కంద కడిగిన నీళ్లు కాళ్ల కందించి-చేమ కడిగిన నీళ్లు చేతి కందించి
దువ్వ కడిగిన నీళ్లు దాహానికిచ్చె-[2].

1. పాడినవారు జానమ్మ, మామిడిపల్లి
2. పాతపాటలు - టేకుమళ్ల కామేశ్వరరావు

ఇందు మేన మరదిని హాస్యము పట్టించుటకే రోకళ్లతో కుమ్ముట, ముంత పొగవేయుట, దురదను కలిగించు కందకలిగిన నీళ్లు, చేమ కడిగిన నీళ్లు, దువ్వ కడిగిన నీళ్లు పేర్కొనబడినవి.

మేనత్త మేనమామ పిల్లలు ఈడుజోడు ఉన్నప్పుడు వివాహబంధముతో ఏక మగుట తెలుగువారి సంప్రదాయము. వారెప్పటికైనను ఏకమగువారేనను అభిప్రాయము ప్రబలియుండుట వలన ఈ హాస్యములును విస్తరించియున్నవి. ఏ కారణము వలననైన వివాహసంబంధము కుదురకపోయినను హాస్యమునకు విచ్ఛిత్తి ఉండదు. అట్టివారికి పెరవారితో వివాహము జరిగినను వారి భర్తలు గాని, వీరి భార్యలుగాని "మేనత్త మేనమామ పిల్లలు" అను దృష్టితో వీరి హాస్యములకు అపోహ పడరు.

వివాహానంతరము స్త్రీలకు పుట్టింటివారితో సంబంధము పలుచబడి పోవును. తాను, తన భర్త, అతని సన్నిహితులు, తన సంతానము-ఇట్లు మరియొక ప్రపంచమే యేర్పడును. పుట్టింటివారితో సంబంధము పండుగలకు పబ్బములకు పుట్టింటికి వెళ్లి విందులారగించుట, వారు కానుకలిచ్చిన తీసికొని వచ్చుట వరకే పరిమితమగును.

వివాహానంతరము స్త్రీలు తమ పుట్టింటివారి యెడల చూపు మమకారమును తెలుపు పాటలలో వారి యభిజాత్యము, చిన్ననాటి ముచ్చట్లు, సోదరులు తమను పిలచుకొని వెళ్లవలెనను ఆకాంక్ష-మున్నగు భావములు తెలుపు గేయములనిట స్థాలీపులాక న్యాయముగ పేర్కొందును.

ఇట్టి సంబంధపు పాటలలో ముఖ్యముగా చెప్పదగినవి అన్నాచెల్లెలు, అక్కాచెల్లెలు, బావ (అక్క భర్త) మరదలు పాటలు. వివాహానంతరము జీవిత విధానము వేరగును గనుక ఆప్యాయత ఎక్కువగును. జీవిత విధానము ఒకటిగా నున్నవారిలో స్పర్ధలు, పొరపొచ్చములు రావచ్చునుగాని జీవితమార్గములు వేరయినప్పుడు ప్రేమాదరములకే అవకాశమెక్కువగా నుండును.

అన్నాచెల్లెండ్రు, అక్కాచెల్లెండ్రు :-

చిన్ననాటినుండియు ఒక్కచోట పెరిగినవారు అరమరికలులేకుండ అనుబంధమును పెంచుకొందురు. అట్టివారు అన్నాదమ్ములు, అక్కాచెల్లెండ్రు. అక్కా

1. పాత పాటలు-టేకుమళ్ల కామేశ్వరరావు.

చెల్లెండ్రు వివాహామయి అత్తింటికి వెళ్లినను అన్నదమ్ముల పైనుండు మమకారములో కొరతయేర్పడదు. చిన్ననాటి నుండి చనువు కొద్ది ఏ విషయమును సంప్రదించవలెనన్నను, ఏ కోరిక కోరవలెననుకొనినను తండ్రి తరువాత అన్నలకే ప్రాధాన్యముండును. తండ్రి దగ్గరలేని చనువు అన్నల దగ్గర నుండును. సోదరీ సోదరుల మధ్యనుండు అనురాగమునకు ప్రతీకగా నిలచినది "రాఖీ బంధనము" అను శ్రావణ పూర్ణిమనాడు జరుపు పండుగ. దీనినే "రాఖీ పూర్ణిమ" అందురు. ఈ పండుగకు ఔత్తరాహులలో ప్రచార మున్నంతగా తెలుగువారిలో, అందున పల్లెపట్టులలో అసలే లేదు. నేటి కాలమున కొన్ని కుటుంబములలో దాని ప్రాముఖ్యమును తెలిసికొని ఆ వేడుకను ఆచరించుచున్నారు.

అన్నా చెల్లెండ్ర అనుబంధములను తెలుపు పాటలు ఉత్తర హిందూ దేశమునందే అధికముగానున్నవి. పంజాబీ భాషలో "భ్రా" మరియు "భాపా" అను రెండు పదములు సోదరుడను అర్థములో నున్నను లోక ప్రియతననుసరించి "వీర్" అను పదమే ప్రచారమును పొందినది. సోదరి "వీర్" అనుపిలుపుతో సోదరుల చుట్టు మమతానుబంధమును పెనవేయును. పంజాబులో వీర గీతములు ప్రసిద్ధి. అచ్చట యుద్ధములు అధికముగా జరుగుటవలన "వీరగీతములు" ఎక్కువగా బయలుదేరినవి. ఇందలి "వీర" పదము వీరత్వమునకు సూచకమైనను యౌవనములో నుండి దేశరక్షణకు తోడ్పడవలసిన యువకులను "వీర్" అను పదముతో సంబోధించుటలో ఆశ్చర్యములేదు. ప్రతిదినము "వీర్" అను పిలుపుతో సోదరులలో వీరత్వమును దీపింపజేసి, వీరులుగా తయారగుటకు దోహదము చేసిన వారైరి. దేవేంద్ర సత్యార్థిగారు "పంజాబీ కూతురు తన సోదరుని "వీర్" అని పిలిచిన, ఆమె మనస్సులో నుండి ఆ శబ్దము యొక్క ఆత్మ నాట్యము చేయుచు బయలుదేరి నట్లుండును అని పేర్కొనినారు–[1]

అపరిచితులను కూడ అన్న అను పిలుపుతో, వరుసను గలపి ఆత్మీయులుగా నొనరించుకొందురు మహిళలు. ఇప్పుడు నేను పేర్కొనుచున్న పాటలలో నున్న అన్నాచెల్లెండ్రు ఒక్కతల్లి రక్తమును పంచుకొని పెరిగి పెద్దనైన వారు, పల్లెపట్టులలో జీవితమును గడుపువారు.

---

1. ధీరెబహెూగంగా (హిందీ)–దేవేంద్ర సత్యార్థి–పుట–87 రాజకమల్ ప్రకాశన్, ఢిల్లీ–1948

మిల్లుల వ్యాప్తి అధికముగా లేని ఏబది సంవత్సరముల క్రిందటి వరకును వడ్లు దంచి బియ్యమును తయారు చేయ వలెననిన రోలు రోకలి పైననే ఆధారపడియుండువారు. అట్టి కాలమున పోటీలు పడి ధాన్యమును దంచుచుండెడివారు. దంచుటకు ఉపయోగించు చేవ రోకళ్లను చేయించి వెండి పొన్నులు వేయించుమని అన్నను చెల్లెలు ఈ క్రింది పాటలో కోరు చున్నది.

"నా చేతి రోకళ్లు నల్ల రోకళ్లు–చేయించు అన్నయ్య చేవరోకళ్లు

వేయించు అన్నయ్య వెండిపొన్నుల్లు"–[1]

అడిగినంతనే ఆదరించి కోరిన కోరికను తీర్చుటలో వెనుకాడని అన్నలున్న ఆమె సంతోషమునకు అవధులుండవు. అట్టి అన్నచుట్టు ప్రక్కల నుండు పురుషులందరిలోను మిన్నగా కనిపించును. అదే భావపరంపరలో పెరిగి పెద్దవారైన అన్నాచెల్లెండ్ర ఆత్మీయతలో వారి వివాహములు కొంత ఎడబాటును కలిగించును. తరువాతి కాలము ఎట్లు మారినను, వదినతో సామరస్యము ఎట్లు పరిణమించునదైనను అన్నపెండ్లి అనిన చెల్లెలు అనిర్వచనీయమైన ఆనందమును పొందును.

"ఆకాశబాణాలు, చంద్ర దివిటీలు–అచ్చమౌ పువ్వొత్తులు అన్నపెళ్లిళ్లు"[2]

అని చెల్లెలు మురిసి పోవుట వర్ణనాతీతము.

– ఎంతమంది అన్నలున్న అంత ముచ్చట పడును చెల్లెలు. తమ్ముండ్లకు అక్కగా జన్మించుట కన్న అన్నలకు చెల్లెలుగా జన్మించుట అదృష్టముగా భావించును.

ముగ్గురన్నల తోడ నే బుట్టినాను–నానడుము మువ్వంచు చీరగోరింది
నలుగు రన్నలతోడ నేబుట్టి నాను–నా నడుము నల్లంచు చీరగోరింది
అయిదుగు రన్నల తోడ నేబుట్టినాను–నాఘొళ్లు అద్దాల రవిక గోరింది."–[3]

1. పల్లెపదాలు–పుట–46
2. సెలయేరు–పుట–20
3. పల్లెపదాలు–పుట–47

-అని పలుకుటలో అన్నలతో గూడిన జీవితమును, అట్టి జీవితమున వారు అనుభవించ గోరు వాంఛలును వ్యక్తమగు చున్నవి.

చిట్టీ బొట్టు పట్టావాలే - సిరిగలయింటా పుట్టావాలె
ఏడుగురు అన్నలతోడా బుట్టావాలే - ఏకాచక్రం ఏలావలె.-[1]

-చిట్టి బొట్టునోము పట్టి కన్యలు కాంక్షించు కోరికలు చిత్రమైనవికదా.

చెల్లెండ్ర ముద్దు మురిపములను అన్నలు సామాన్యముగా తీర్చెదరు. తీర్చలేక పోయినను చెల్లెండ్రు అన్నలపైన అలిగి సాధించుకొందురు.

"అందమ్మ అందమ్మ ఏమి అందమ్మ-జరి అంచు చీరకట్టిన అందమ్మ
సన్నచీర చిరిగిన అందమ్మ-అన్నలపై చెల్లెండ్లు అలిగితె అందమ్మ
చెల్లెండ్ల కోరికలు తీర్చితే అందమ్మ"-[2]

-అన్నలపై చెల్లెండ్రు అలుగుటలోను ఒక అందమునే తిలకించినారు జానపదులు.

చెల్లెలు అన్నతో నేర్పడిన మమతకు చిహ్నముగా అన్నల ప్రవర్తనలో నేదైన తప్పిదమున్నను అది అన్నల తప్పిదముగా గాక పరుల తప్పిదముగానే చూచును.

ఆడవారి బుద్దులు అపర బుద్దులు-అన్న నీవు నీలాటి రేవుండ వద్దు
మగవారి బుద్ధులు మరుగు బుద్ధులు-వదిన నీవు వజ్రాల గడప దాటొద్దు.[3]

అన్నతో పలుకునప్పుడు ఆడవారి బుద్ధులు పెడబుద్ధులయినవి. వదినతో మాటలాడునప్పుడు మగవారి బుద్ధులు మరుగు బుద్ధులయినవి. చెల్లెలు తన వారికి అనుకూలముగా భావించునేకాని వ్యతిరేకముగా భావించుటకు నిష్టపడదు.

అత్తింటిని మెట్టిన స్త్రీలు తమను చూచి యోగ క్షేమములు అరసికొని పోవుటకు తమ్ముండ్లకన్న అన్నలు-అందులోను పెద్దన్నలు వచ్చిన అధికముగా సంతోషింతురు.

1. సరాగాలు-చిట్టి బొట్టు నోము పాట-పుట-57
2. నేను సేకరించినది. పాడినవారు అనసూయమ్మ-రాయిప్రోలు
3. సెలయేరు-పుట-115

"నేరేడు పండంటి, అన్న నాయన్న–నేడు వస్తానని నెలకన్నరాడు
తాను వస్తానని, తమ్ముణ్ణి పంపు–ఏమోయి పెద్దన్న, ఎన్నటికి రావు
ఏటేట పెళ్లిళ్లు, కుప్పనూర్పుళ్లు – ఎడ లేదు చెల్లెలా, నిను చూడరాను.–[1]

–ఈ పాట అన్న చెల్లెండ్ర మధ్యన సంవాదరూపముగా చెప్పబడినది. తీరిక లేని పెద్దన్న రాలేక పోవుటకు గల కారణములు ఈ పాట వివరించుచున్నది.

అత్తవారింట ఎంత ఐశ్వర్యమున్నను స్త్రీలకు పుట్టింటిపై మమతపోదు. తన అన్నయో, తమ్ముడో, కనిపించగనే ప్రాణములు లేచి వచ్చినట్టనిపించును. ఒక కలవారి కోడలు మనస్తత్త్వమును ఈ పాట చక్కగా విశదీకరించినది.

"కలవారి కోడలు కలికి కామాక్షి–కడుగుచున్నది పప్పు కడవలో బోసి
అప్పుడే వచ్చేడు ఆమె పెద్దన్న–కాళ్లకు నీళ్లిచ్చి కన్నీరు నింపె."–[2]

–అన్న చెల్లెలి ఆ కన్నీరును చూచి కరగి పోవును. తన చెల్లెలు కడవలో పప్పుపోసి కడుగు చున్నదియును చూచెను. కష్టపడు చున్నట్లు అతనికి తోచెను. కనుక

"ఎందుకూ కన్నీరు ఏమి కష్టాలు–తుడుచుకో చెల్లెలా ముడుచుకో కురులు
పెట్టుకోసొమ్ములు కట్టుకో చీరె–చేరి మీ యత్త మామలకు చెప్పిరావమ్మ"

అని చెల్లెలితో చెప్పెను. చెల్లెలు ఎంతకలవారి కోడలయినను కోడలే కదా! ఇంటిలోని పెద్దలందరి అనుమతితో పుట్టినింటికి వెడలుట మంచిఇంటి సంప్రదాయము. కనుక అత్తమామలను, బావలను, తోడి కోడండ్రను అనుమతి కోరును. కాని ఇంటిలోని వారు ఎంత పెద్దవారైనను భర్త అనుమతించనిచో తప్పిదము తమదే అగునని మాకు తెలియదు మాకు తెలియదని ఆమె అభ్యర్థనను దాటవేయుదురు. చివరకు భర్తను అడుగగా అతడు అనుమతించెను. ఈ సంభాషణమును ఈ పాట క్రింది విధముగా వర్ణించుచున్నది.

కోడలు :– కుర్చీపీట మీద కూర్చున్న అత్త
మా యన్నలొచ్చేరు మమ్మంపుతార
అత్త :– నేనెఱుగ నేనెఱుగ నీ మామ నడుగు

1. సెలయేరు–పుట–19 2. సెలయేరు–పుట–105

కోడలు :- పట్టెమంచం మీద పడుకొన్న మామ.
మా యన్న లొచ్చేరు మమ్మంపుతారా
మామ :- నేనెఱుగ నేనెఱుగ నీ బావ నడుగు
కోడలు :- భారతం చదివేటి బావ పెదబావ
మా యన్నలొచ్చేరు మమ్మంపుతారా
తోడి కోడలు : నేనెఱుగ నేనెఱుగ నీభర్త నడుగు
కోడలు :- రచ్చలో కూర్చున్నరాజేంద్రభోగీ
మాయన్న లొచ్చేరు, మమ్మంపుతారా
భర్త :- పెట్టుకో సొమ్ములు, కట్టుకో చీరె
పోయిరా సుఖముగా పుట్టి నింటికిని.
కోడలు :- ఇరుగు పొరుగు లార ఓ అమ్మలార
చెల్లెళ్ల పెళ్లిళ్లు సేవించ బోయి
మరదుల పెళ్లికి మరలివచ్చేను."–[1]

– ఈమె కలవారి కోడలు. "కుర్చీపీట మీద కూర్చున్న అత్త, పట్టెమంచం మీద పడుకొన్న మామ, భారతము చదివేటి బావ, వంటలు చేసేటి అక్క, రచ్చలో కూర్చొని పెట్టుకో సొమ్ములు, కట్టుకో చీరె" అను భర్త ఆమె ఐశ్వర్యమును తెలుపు చున్నారు. మరొక్క పాటలో ఒక కోడలి పుట్టినింటి వారు కలవారు. మెట్టినింటి వారు సామాన్యులు, ఎద్దులు కాచుట, వ్యవసాయము చేయుట వారి వృత్తి. కోడలు తన అన్నలు గుఱ్ఱములపైన పుట్టింటికి పిలుచుకొని పోవుటకు రాగానే అత్తమామలను అడుగును. కలవారింటి బిడ్డ కనుక సామాన్యపు అత్తవారింటి కాపురముతో విసిగి వేసారినది. ఇంటిలోని పెద్దల అనుమతి తీసికొనినది. ఎప్పుడు తిరిగి వచ్చెదవని భర్త అడుగగా;

"బండ మీద ముత్యాలు పండిన్ననాడు–పదిపుట్ల మనగాద నిండిన్ననాడు
ఏటి మీద ఎఱ్ఱజొన్న ఏసిన్ననాడు–ఏడు పుట్ల మన గాద నిండిన్ననాడు
పట్టుమీద పచ్చజొన్న ఏసిన్ననాడు–పదిపుట్ల మనగాద నిండిన్ననాడు
ఇంగులానికి ఈగల్లు ముసిరిన్ననాడు–కోడికి చన్నులు వచ్చిన్ననాడు
గుండ్రాయి గిరగిర నడచిన్ననాడు."–

తిరిగి వచ్చెదనని భర్తకు సమాధానము చెప్పును. ఇవన్నియు గగనకుసుమములు. వెనుకటి పాటలో ఐశ్వర్యమును సూచించినట్లే ఈ పాటలో "వొత్తూకు వొరిగిన్న ఓ అత్తగారు, అంబళ్లు కాసేటి ఓ సాటి యారాల, ఎద్దుల్ల కాసేటి ముద్దుల మరది, మోటల్లు కొట్టేటి ఓ మొగలి రేకు (భర్తను) అని సంభోదించుట వలన మెట్టినిల్లు కలవారిది కాదనుట సూచింపబడినది. దారిద్ర్యమునకు పరాకాష్ట ఈ పాట మొదటి పాదములలోనే కనిపించును.

సున్నాపు కుండల్ల జొన్నాలు పోసి,-సూర్యుడు చంద్రుడు చుట్టమై రాంగ
చేతికి నీలిచ్చి చెయ్యిపార చూసె-కాళ్లకు నీలిచ్చి కన్నీరె తీసె"-[1]

అను మాటలలో ఆమె కటిక దరిద్రము కానవచ్చుచున్నది.

ఇట్టిదే మరొక పాట. ఈ యింటి వారికి తోటలు వేయుట ముఖ్యవృత్తి. తోటలు, వ్యవసాయము వృత్తిగా గలవారు కనుక పెందలకడనే లేచి పొలమునకు వెళ్లి పోవుట పరిపాటి. అట్టి వాతావరణములో కూడిన యింటిని మెట్టినది ఈ యిల్లాలు.

పొద్దు పొద్దున లేచి వెన్నియ్యలో చీపుర్లూ బట్టి వెన్నియ్యలో
చీపుర్లు బట్టుక వెన్నియ్యలో సందిలకు బోయెటాలకు వెన్నియ్యలో
ఏడుగూరన్నల్లు వెన్నియ్యలో ఎదురయ్యి వచ్చిరి వెన్నియ్యలో

-అన్నలు ఎదురై వచ్చినంతనే "చీపుర్లు పడవేసి, చెంబు చేత బట్టి కాళ్లకు నీళ్లు దెచ్చి కన్నీరు దీసినది. చెల్లెలి కన్నీరు చూడగానే అన్నలు కరిగిపోయినారు. ఎందుకేదుస్తవు చెల్లె, తీసుకపోతాగాని "అని పలికిన అన్న మాటలతో కుదుటచెంది పుట్టినింటికి వెళ్లుటకు అనుమతిని కోరుటకు ఇంటిలోని సభ్యుల చెంతకు వెళ్లినది. ఈమెకు మామగారు లేనట్టున్నారు. అతనికి సంబంధించిన సంబోధనమేదియు పాటలో లేదు. బంతితోటలోనున్న బావగారిని, మల్లెతోట లోనున్న మరదిగారిని, అనుపసాలులోనున్న అత్తగారిని. చల్లచేసే సాటి ఏరాండ్లను, మొగిలితోటలోనున్న మగనిని అనుమతి కోరినది. పుట్టింటికి వెళ్లుటకు కారణమేమని అందరును ప్రశ్నించిరి.

1. నేను సేకరించినది. పాడినవారు- జయమ్మ, హైదరాబాదు.

"పడమట మాయి తల్లి, పారుతీగె నోములు
కడగొట్టు తమ్మునిది కార్తీక లగ్గాలు"

-అని సమాధానము పలికినది. పోతే బోతివికాని, మల్లెప్పుడొస్తావు" అని అడిగిన భర్తతో

మార్గశిర మాసాన-మల్లదిరిగొస్తాను
కుక్కలూ గుంటుకలు-కొట్టిన్నానాడు
నక్కలూ నాగండ్లు-దున్నిన్నానాడు
ఎలుకాలు ఏకులు-పడికిన్నానాడు"-[1]

- మల్లి దిరిగొస్తాను అని మారుపలికినది. ఇందులో పేర్కొనిన మార్గశిరమాసము ఏడాదికొక మారు రావచ్చును గాని కుక్కలు గుంటుకలు కొట్టుట, నక్కలు నాగండ్లు దున్నుట - అనునవి అసంభవము. అసంభవము సంభవమైనను అట్టి పరిస్థితి కలుగుట వ్యవసాయపు సాగుబడికి అవసరమైన పశుసంపద నశిస్తేనేగాని సంభవమగునదికాదు. అట్లు పలుకుట మెట్టినింటి దౌర్భాగ్యమును సూచించుటయే యన్నమాట. అసంభవములు సంభవములగుట ఎంత దుర్లభమో తాను మరలివచ్చుట అంత దుర్లభమని, మెట్టినింటిని తానెంతగా రోసియున్నది. వ్యంగ్యముగా పలికినది. అన్నా చెల్లెంద్ర సంబంధమును వ్యక్తీకరించు ఈ శీర్షికలో సమష్టి కుటుంబమునింత వివరముగా వర్ణించుట అనుచితమైనను ఈ పాటలలో నొక ప్రత్యేకత కలదు. అందుకనియే వివరించితిని. ఆచారవ్యతిక్రమణములో పై పాటలలో సామ్యము ద్యోతకమగుచున్నది. సామాన్యముగా పుట్టినింటికి చెల్లెలిని తీసికొని పోవనెంచిన అన్నలు చెల్లెలు గృహమునందలి పెద్దలను తామే మొదట అనుమతి కోరుట హైందవ సంప్రదాయము. కాని ఇందు అన్నలు పెద్దలను అడుగక ముందే చెల్లెలే పోయి అత్త మొదలైన సభ్యులను పుట్టింటికి వెళ్ళుటకు అనుమతిని కోరుట చిత్రముగా నున్నది. పుట్టినింటికి వెళ్ళుటకు నెంత ఉత్కంఠకలదైనను, ఒకవేళ అత్త మామల చెంత చనవు అధికముగా కలిగిన కోడలని సరిపెట్టుకొనినను వచ్చిన అన్నల కన్న ముందుగా తానే అనుమతిని కోరుట అంత సమంజసముగా లేదు.

1. తెలంగాణా పల్లెపాటలు-పుటలు-102-105

అన్నాతమ్ముంద్రమధ్యను, అన్నాచెల్లెంద్ర మధ్యను చిన్ననాడుండు ఆత్మీయత వయసుతో బాటు, అందులోను వివాహానంతరము తగ్గుముఖము పట్టుట సర్వవిదితము, కాని అక్కా చెల్లెంద్రలో నుండు ఆత్మీయత వయస్సుతో బాటు అధికమగును. వివాహానంతరము ఎవరికాపురములు వారికయి ఎడబాటు సంభవించుట వలనను, ఎవరి సంసారములు వారికేర్పడి ఒకరితో నొకరికి సంబంధములు దూరమగుట కారణమయి ఉండును. అది కారణముగా ఒకరినొకరు చూచుకొనవలెనను, కష్టనిష్ఠూరములను చెప్పుకొనుటకు తోడుగా నుండవలెనను కాంక్ష వారిని సన్నిహితులను చేయును.

జె. జె. బాకోఫన్ అక్కాచెల్లెంద్ర పరస్పరప్రేమను పేర్కొనుచు మాతృ స్వామిక సంస్కృతిలోని ఉత్తమ లక్షణములలో నొక దానికిది ఉపలక్షణ మనిరి. –[1]

ఒకే ఊరికి ఇద్దరు అక్కచెల్లెంద్ర నిచ్చిన వారి సంతోషము అపరిమితము. సామాన్యముగా పెండ్లి సంబంధములను చేయునప్పుడు దూరపు ప్రాంతముల సంబంధములకుగాక, సమీప గ్రామములలో నుండు సంబంధములకే ప్రాధాన్యమునిచ్చెదరు. ఒక్క ఊరి సంబంధమే ఇద్దరక్క చెల్లెంద్రకు లభించిన ఒకరికొకరు తోడుగా నుండగలరను తృప్తి తల్లిదండ్రులకే గాక అక్కచెల్లెంద్రలోను కలుగుట సహజము. వారిద్దరు అత్తింటిలో కాపురములు చేయుచు ఒకరితోనొకరు ఎప్పుడైన కలుసుకొనిన వారి ప్రసంగములలో అత్తింటి కాపురములతో పాటు పుట్టింటి ముచ్చట్లును దొరలును. పుట్టింటి వారువచ్చి వీరిని తీసికొని పోవుట ఆలస్యమయిన వారి ఆతురతకు అంతు ఉండదు.

"ఇద్దరక్క చెల్లెండ్లను ఉయ్యాలో–ఒక్కూరి కిచ్చి ఉయ్యాలో
ఒక్కడే మా యన్న ఉయ్యాలో-వచ్చున్న పోదు ఉయ్యాలో

అని పరితపించుచుందురు. అక్కచెల్లెండ్లుగాక మరెవ్వరును సహృదయ ముతో ఒకరినొకరు అర్థము చేసికొనుట సాధ్యపడదు. అదే పాటలో అన్న

"ఎట్లొత్తు చెల్లెలా ఉయ్యాలో–ఏరడ్డమాయె ఉయ్యాలో"–[2].

1. Myth, Religion and mother right J.J. Bachofan-Page-79
2. నేను సేకరించినది.-పాడినవారు భారతమ్మ-రాయిప్రోలు.

అని సమాధాన పరచినంతవరకు వారిలో ఓదార్పు కలుగదు. అడ్డంకులను తొలగించుకొని వచ్చిన అన్నగారిని చూచిన చెల్లెండ్ర ప్రాణములు లేచివచ్చి నట్లుండును క్రొత్త కాపురమునకు వెళ్ళి క్రొత్త వాతావరణములో మసలుకొను వారిలో నిట్టి స్వభావమధికము. అత్తింటిలో సుఖమున్నను కష్టమున్నను పుట్టింటిపై ధ్యాస ఆడవారిలో సహజము.

అక్కాచెల్లెండ్రు ఒకరినుద్దేశించి మరొక్కరు పాడు పాటలధికముగా లేక పోయినను వారి ఆత్మీయతాభావమును అర్థము చేసికొనవచ్చును. కన్నతల్లితో కూడ చెప్పజాలని రహస్యములనైనను అక్కాచెల్లెండ్రు పరస్పరము అరమరికలు లేకుండగా చెప్పుకొన గలుగు సన్నిహితత్వము వారిలో నుండుననుటకు ఒక వ్యంగాత్మకమైన పాటనుదాహరించెదను. పిన్న వయసులో నున్న ఇద్దరక్కక చెల్లెండ్ర సంభాషణ రూపములో నున్నది ఈపాట-

ఆకుచిన్న అడవిలోనా-నాకు చిన్న దండదొరికె
అక్క రావె మనము గూడి-ఆడు (నోము) కుందామూ.

- అని ఒక చెల్లెలు అక్కతో తనకొక యువకుడు కానిపించినట్లుగా ధ్వన్యాత్మికముగా పలుకగా అందుకు సమాధానముగా వయసు చేత పెద్దదైన అక్క ఇది ఇద్దరు పొందదగినది కాదని తెలిసికొని.

ఆకు చాటు అరటి పండూ-అడిగెనేమొ రాము మనసూ
కొమ్మచాటు నిమ్మపండు-కోరెనేమొ రాము మనసూ
....
బాయిచాటు పనస పండు-భ్రమిసెనేమొ రాము మనసూ.-[1]

- అని నిగూడార్థమును ధ్వనింపజేయుచు పలుకును. అందు మూలముగా నిన్నతడు కోరుచున్నాడేమో "నను భావమును వ్యక్తీకరించు చున్నది". పల్లెపడుచులు అమాయకులేగాక ఆరిందలనుటకిదొక మచ్చుతునక.

బావా మరదలు; బావా మరది :-

బావ మరదండ్ర పాటలును వదినా మరదండ్ర పాటల వలెనే హాస్యభరితములు. బావ మరదలును హాస్యము పట్టించుటకన్న మరదలు బావను హాస్యము పట్టించుట అధికముగా నుండును. మరదలుకు సైదోడు ఆమె

1. తెలంగాణా పల్లెపాటలు-పుట-42

అన్నదమ్ములును కలుతురు. ఈ పాటలలో ప్రసక్తమగు బావ-స్త్రీకి వరుసలో తన భర్త అన్నయైన బావకాడు. అట్టి వరుసలో నున్న వారికి మామతో సమానముగా గౌరవమిచ్చుట ఉమ్మడి కుటుంబములలోని ఆచారమని, ముందేపేర్కొంటిని. ఈ హాస్యము పాటలలో సంబోధింపబడు బావ అక్క భర్త యైనను, మేనత్త మేనమామ కొడుకులై బావ వరుస కుదిరిన వారును నైనకావచ్చును. అక్కభర్తయై అల్లుడుగా అత్తవారింటికి వచ్చిన వానికి మరిదీ మరదంద్ర హాస్యము లేనిదే విందారగించినను కడపునిండదు. వీరి హాస్యమునకు చిరాకును వ్యక్తము చేయు బావలుఅరుదు.

అక్కపెండ్లి అయిన అనంతరము బావ క్రొత్తగా అత్తవారింటికి వచ్చినప్పుడు మరదంద్రు హాస్య మాడుటలో పలురకములు; మచ్చునకుకొన్ని-

"అత్త వారింటికి కొత్తల్లు డొస్తేను-కొత్త సున్నం దెచ్చి మెత్తరమ్మ
కొత్త సున్నంతోను కోపంబు వస్తేను-పల్లేరు దెప్పించి నలుపరమ్మా
నల్లేరు చేతను నసనస లాడితే-దూల గుండాకుతో దులపరమ్మ
దూల గూండాకుతో దుఃఖమ్మువస్తేను-బజ్జె పలుపులు దెచ్చి బాదరమ్మా
బజ్జె పలుపుతోను బాధలు వస్తేను-కొరడాలు తెప్పించి కొట్టరమ్మా
అత్తోరి యింటికి వస్తే సుఖమేమంటే?-వచ్చిన దారిని పట్టమనండమ్మా[1]

- ఇందు కొత్తల్లుడుగా అత్తవారింటికి వచ్చిన బావను అపహాస్యము పట్టించుటకు గాను కొత్తసున్నం, నల్లేరు, దూలగుండాకు, బజ్జె పలుపులు కొరడాలు పేర్కొనబడినవి. ఇట్టి మర్యాదలకు కోపము వచ్చి "అత్తోరియింటికి వస్తే సుఖమే మనుకుంటె వచ్చిన దారిని పట్టమనండమ్మా "అనుటవలన నిజమునకు అల్లునికి కోపము రావలసినదే. కాని అదంతయు నవ్వుతాలునకనియే అర్థము చేసికొన గలడు. కనుక వచ్చిన అల్లుడును నవ్వుచు తీసి వేయును.

లోకములో అల్లునికి అత్తగారిల్లనినను, అత్తగారింటి సభ్యులన్నను మక్కువ ఎక్కువ. కనుకనే ఆలితట్టువారు ఆత్మ బంధువులగుదురు.

1. సెలయేరు పుట 91.

బావా, బావా, పల్లేరు–బావను పట్టుక తన్నేరు
మూడు గుద్దులు గుద్దేరు–మూల మంచ మేసేరు
ముంతెడు గంజి యిచ్చేరు ॥బావా॥

వీధి వీధి తిప్పేరు–వీసెడు గంధం పూసేరు
చావిడి గుంజకు కట్టేరు–చప్పిడి గుద్దులు గుద్దేరు
పదేళ్ల నాటిదే పాతదూలమ్మ్మ–పడిపోయె మాబావ పల్వరుస మీద
పళ్లన్ని పిప్పాయె నోరె(్రనాయె–వీధిలో బావ గారికి విన సిగ్గులాయె
రచ్చలో మాబావకు రాసిగ్గులాయె–సభలోను మాబావకు తలవంపు లాయె[1]

– బావను పట్టుక తన్నుట, వీధి వీధి త్రిప్పుట, వీశెడు గంధము పూయుట, చావడి గుంజకు కట్టుట మొదలైన వర్ణన పరిహాసమునకు మాత్రమే పేర్కొనబడినవి.

పై పాటలోని "బావా, బావా, పల్లేరు" అనుటకు మారుగా "బావా బావా పన్నీరు" అను పాఠాంతరమును ప్రచారమునందున్నది.–[2]

బావా బావా పన్నీరు – బావను పట్టుక తన్నేరు
పండ్లు రాల గొట్టేరు – నెత్తికి సున్నం మెత్తేరు–[3].

అనియు

"బావా బావా పన్నీరు – బావను పట్టుక తన్నేరు
మూలా మంచం వేసేరు – మూడు గుద్దులు గుద్దేరు

1. సెలయేరు పుట 98.
2. సాగర ప్రాంతమున "బావా! బావా! బన్నేరు" అనియు పాఠాంతరము కలదు. హాస్యమునకు మరదలు బావను "బన్నేరు" అని పిలుచుటలో నొక విశేషమున్నది. బన్నిరి అనగా కన్నడ భాషలో "రండు" అని అర్థము. మరదలు బావను పరిహాసము పట్టించుటకు, కన్నడ భాషా ప్రభావము వలన, చమత్కారముగానుండునని "బన్నేరు" పదములో పిలిచియుందురని భావింపవచ్చును. బన్నిరి క్రమముగా బన్నేరు అనియు పన్నీరు అనియు మార్పు చెంది యుండును.
3. నేను చిన్ననాడు నేర్చుకొనినది.

నులకా మంచం వేశేరు - నూరు గుద్దులు గుద్దేరు"[1]

అనియు

"బావా ! బావా ! బక్ - పొయిల బూడిది బుక్

తెచ్చిన పుట్నాల్ బెట్, వచ్చిన దారి బట్-[2].

- అనియు నానా రకములైన పరిహాసోక్తులతో బావను మరదండ్రు, మరదులు కలిసి నవ్వు పట్టించెదరు. తెలుగు గేయములలోనే గాక ఇతర భాషలలోను వీరి అనుబంధము అధికముగా నుండును. -[3].

మేనత్త మేనమామ పిల్లల వరుసలో నుండి అవివాహితులైన స్త్రీ పురుషుల మధ్యన నుండు "బావమరదండ్ర" పాటలు కొన్ని శృంగార మిశ్రితములై యుండును. కావున వానికిక్కడ ప్రసక్తి లేదు.

పై వరుసల వారితో శృంగారము మాత్రమేగాక సరసత, సభ్యమగు హాస్యము తొణికిసలాడు సంఘటనలను వర్ణించు పాటలును కలవు. సంభాషించు వారు సహృదయులు చతురులు నైన యెడల వారి సంభాషణము చమత్కార జనకమై చక్కని హాస్యరసమును పోషించును. ఆ సంభాషణమును వినువారు కూడ ఆనందింతురు. అట్టి చతుర సంభాషణమునకు క్రింది పాట ఉదాహరణము-

"నవ్వుల నారాజు అత్త కొడుకొచ్చి

నువ్వులు నూర్చాలని నూరెడ్లసడుగు

పాలుదాగి మాయెడ్లు ప్రత్తి నూర్చ వెళ్లె

నూరు పుట్ల ధాన్యమ్ము నూర్చేముగాని

ప్రత్తి చేనెన్నడూ నూర్చియేమెరుగ

నూరుపుట్ల ధాన్యమ్ము నూర్చేముగాని

---

1. మిన్నేరు పుట 171.
2. నేను చిన్ననాడు నేర్చుకొనినది.
3. అవధీలోక గీత ఔర్ పరంపరా, పుట 33 ఖుదాకి ఖుదాయి ఏక్ తరఫ్ జోరూకా బాయి ఏక్ తరఫ్ "భగవంతుని సృష్టి ఒకవైపు, భార్య సోదరుడు ఒకవైపు" అను సామెత ఏర్పడినది.

నువ్వు చేసెన్నడూ నూర్చియేనెరుగ
అత్త కూతురువని అడిగితిగాని
అతిజాణవే యౌట నిన్ను నేనెరుగ
మామ కొడుకువని మన్నించితిగాని
మాటకారివి యోట నిన్ను నేనెరుగ"–[1]

– వారిద్దరు వ్యవసాయ పద్ధతులను ఎరింగినవారు గనుక నూర్పిడి విధానములో నున్న పొరపాటును తెలిసికొని పరిహాసమాడుకొనగలిగిరి. ఈ పరిహాసములు శ్రుతిమించి రాగాన పడిన

"మేనమామ కూతురు మేళమ్ముగట్టి
మేళంబులాడుతూ మేడ దిగనీదు"–[2]
–అని అనుకొను పరిస్థితులకు దారి తీయును.

బావ మరదండ్ర పాటలన్నియును హాస్యరసమును పోషించునవి. ఇట్లే "తాత – మనమలు, అవ్వ – మనుమలు", –పాటలును హాస్య ముట్టి పడునట్టివి. తాత, అవ్వ మనుమల వయసున రెండు తరముల సంబంధముండును గనుక వారి సంభాషణములు, ప్రవర్తనము విన ముచ్చటగను, చూడ ముచ్చటగను ఉండును.

"ఊచకట్టోచేత ఉగ్గమొక చేత–ఊగుతా వచ్చిన తాతెవ్వడమ్మా
అని ఊగుచు వచ్చుచున్న తాతను చూచి మనుమరాలు ఎగతాళి చేయుట, దానికి తాత–

"మానికానిండాను మాదలేసుకొని
మనుమ రాలా నిన్ను మనువడుగ వస్తి–[3].

అని తాత మేలమాడుట యెవరికైనను నవ్వు పుట్టించును. ఇట్లే మనుమలు, మనుమరాండ్రు ముసలవ్వలను హాస్యము పట్టింతురు.

1. మిన్నేరు–పుట–170 2. మిన్నేరు–పుట–170
3. మిన్నేరు–పుట 176.

"అద్దము చెక్కిళ్లంటివే ముసలవ్వా
నీ మొగమేలవాడె చెప్పవే ముసలవ్వా ?"

అని చుట్టూ మూగిన మనుమలు, మనమరాండ్రు ప్రశ్నించగా, ముసలవ్వ

"జగము సూర్యుడు మాసె పావనచంద్రుడు మాసె
నా మొగము శృంగార మేమిరా–ఓరి మనుమడా"–[1].

అని వేదాంతము రంగరించి సమాధానము చెప్పును. వారికి ఆ మాట తత్కాలమునకు పూర్తిగ అర్థముకాక పోయినను, ఉత్తర జీవితమున "కానవచ్చున దంతయు అనిత్యము, పరమార్థము మరియొకటి యున్నది" అనుతత్త్వము బోధపడును.

* * *

1. మిన్నేరు పుట–177.

ఆచారప్రదర్శక గేయములు

వ్యక్తిపరముగా ఒక పని ప్రతినిత్యము చేయబడిన అది అలవాటగును. అదే ఒక జాతిపరముగానో, సంఘముపరముగానో చేయబడిన అది ఆచారమగును. ఆచరింపబడునది ఆచారము. అలవాట్లు వ్యక్తికీ వ్యక్తికీ మధ్యన భేదించవచ్చును. అలవాట్లు పరిస్థితులవల్ల కొలదికాలమునకే మారవచ్చును. కాని ఆచారము లట్లుగాక పెక్కుతరములవరకు మారవు. వానిని అప్రయత్నము గానే ప్రజలనుసరింతురు.[1] సంప్రదాయసిద్ధమైన పద్ధతులను ఆచరించుటలో ఎంత ప్రయాసకైనా వెనుకాడరు. రాజకీయ వ్యవస్థ వలననో, నూతన సిద్ధాంతముల వలననో దేశమునను, సంఘమునను మార్పులు ఎన్ని వచ్చినను వాని ప్రభావము స్త్రీలపై వెంటనే పడదు. ఆ ప్రభావము పడుటకు ఎన్నియో శతాబ్దములు పట్టుననినను అతిశయోక్తి కాదు. కొన్ని తరములుగ తాతమ్మలనుండి అనూచానముగ వచ్చుచుండు ఆచార పద్ధతులను స్త్రీలు వదలుటకు సంకోచింతురు. వానిని వదలుట వలననో వానిలో మార్పులు చేయుట వలననో అరిష్టములేర్పడునను భయము కూడ వారికి కలదు.

వర్ణవ్యవస్థ అనునది నాడు ఏర్పడినదియోగాని ఉపనిషత్ప్రవక్తలును, గౌతమ బుద్ధుడు, మహావీరుడు-వంటి సంఘ సంస్కర్తలును అవతరించినది మొదలు నేటి వరకు ఎన్ని సంస్కరణోద్యమములు జరిగినను అంతగా సడలలేదు, కాని ఉపనిషత్తులు, బుద్ధమహావీరుల ఉపదేశములు, ఆళ్వారాచార్యుల భక్తి ప్రబోధములవలన వర్ణవ్యవస్థలోని కరకుదనము మాత్రము చాల వరకు తగ్గిన దనవచ్చును. సృష్టిలోగాని, ప్రాచీన గ్రంథములలోగాని భేదములు లేవనియు, మానవుడు స్వార్థముతో వర్గములుగా నేర్పడి యితరులపై పెత్తనము చేయుటకు విభేదములు కల్పించినాడనియు ఇప్పటి వారు గ్రహింపగలుగుచున్నారు. జానపదులు ఈ జోలికిపోక అనాదిగా తమ పూర్వులు నడచుచున్న దారిలోనే నడచుచున్నారు. నేటికాలములో నాగరికులమనుకొనేవారు సహితము పుట్టుక మొదలు గిట్టుట వరకు కులాచారమునసరించి పాతపద్ధతులను తూచా తప్పక

పాటించక పోయినను కొంతకు కొంతైనను అనుసరించుచున్నారు. మన ఆచారవ్యవహారములు క్రొత్తగా వచ్చు ఆటుపోట్లకు తట్టుకొని పాతను కొంత సంస్కరించుకొని, కొత్తను కొంత చేర్చుకొని, ఎప్పటికప్పుడు ఒక మొత్తముగా ఏర్పడుచు సంఘమునకు ఆదరణీయములగుచున్నవి.

ఒక వివాహవిషయమునే పరిశీలించిన అది పొందిన పరిణామములు పాత కొత్తల కలయికతో నేడున్న దానిస్వరూపము మనకు స్పష్టమగును. పూర్వము సంఘసమ్మతమైన అష్టవిధ వివాహములలో రాక్షస పైశాచికాది వివాహములు నేడు సంఘసమ్మతములు కావు. ఇప్పుడట్లు వివాహము చేసికొనిన వారిని మనము విచిత్రముగా చూతుము. కాని మనకీ వివాహ వ్యవస్థలో భారతీయేతర మతముల వారి సంబంధముతో "రిజిష్టరు వివాహ" మను క్రొత్త పద్ధతి యేర్పడినది. దీనికి ప్రభుత్వపు ముద్రకూడ నున్నది. దీనిని అవైదికమని అనుశాసన దూరమని చెప్పలేము. చెప్పిన అపరాధమగును. అట్లే పుట్టిన రోజు పండుగవంటి శుభకార్యము లలో పాశ్చాత్య పద్ధతియగు దీపములు వెలిగించి నోటితో ఆర్పి వేయుట మున్నగు ఆచారములు మన సంఘములో దూరినవి. భారతీయ సంప్రదాయము ప్రకారము నోటితో దీపమార్పుట ఇంటిని ఆర్పుసంతటి అశుభకార్యము. కాని ఇప్పుడిది క్రమముగా వేరూనుచున్నది. ఇట్టి వానిని తొలగించుట కష్టము. భాషలో పరభాషాపదములు చేరి రాజ్యము చేసినట్లే విదేశ సంప్రదాయ సంపర్కము వలన విడ్డూరమైన క్రొత్త ఆచారములు మరొక సంఘములో చేరుట సహజము. వానిని నిమిడ్చుకొన గలిగి, సమన్వయ పరుచుకొన గలిగి పాత పద్ధతులను వదలని సంఘము చాలాకాలము నిలచును. అట్లు కానిది పరసంప్రదాయమునకు లోబడి లుప్తమై పోవును.

ఇట్లు లుప్తము కాకుండ కాపాడువారు జానపదులు

"ఊరిమీద నూరు పడినను కరణము మీద కాసు పడదు" అను సామెతగా జానపదులపై పరస్పర్శ పడుటకు చాలకాలము పట్టును. ఒకవేళ ఆస్పర్శ కలిగినను దానిని వారు తమలో మేళవించుకొని తమదిగా చేసికొందురు. జానపదులలో ముఖ్యముగా స్త్రీలలో ప్రాచీనాచారములు ఇంకను మిగులుటకు ఇదియే కారణము. ఈ ఆచారములను జానపద స్త్రీల గేయములలో ప్రస్ఫుటముగా మనము చూడవచ్చును.

మానవులకు పుట్టుట మొదలు గిట్టుట వరకు జరిపింపబడు సంస్కారములలో పాటలు ప్రధానముగా గల సంస్కారములందలి ఆచారములను మాత్రమే ఈ ప్రకరణమున పేర్కొనుచున్నాను.

నామకరణము

నామకరణమనునది షోడశ సంస్కారములలో రెండవది. "పేరులోన నేమి పెన్నిధి గలదయ్యా "అని వేమనయోగి వెక్కిరించినను పేరులోనే పెన్నిధి కలదు అను నమ్మకము కలవారును కలరు. ఆకర్షణీయమైన పేరు లేని అందమును కూర్చక పోయినను వినుటకు ఇంపుగా నుండ ఆ పేరు కలవారి అభిరుచిని, పేరు పెట్టిన వారి సంస్కారమును తెలుపును. తెలుగు దేశమున ప్రాంతీయ దేవతల ప్రభావము మిక్కుటముగా నున్నందున వారి పేరులే పెట్టుట పాతవారి పద్ధతి. కనుకనే మునుపటి తరము వారి పేరు విని, వారు ఏ ప్రాంతము వారో చెప్పుట సుకరము. "మునెయ్య" మునెమ్మ" అనగానే వీరు చిత్తూరు వారని గ్రహించ వచ్చును: అగ్రవర్ణముల వారును ఆధునిక నామధేయములకు గూడ ముని అను పదము తుది చేర్చుట కలదు. పైడి రాజు, పైడమ్మ, చిన్నపైడి, పెద్దపైడి అనగానే వారు విశాఖ జిల్లా వారో, శ్రీకాకుళము వారో అయియుందురని మనము సులభముగా గ్రహించవచ్చును. పైడితల్లి అక్కడి ప్రధానదేవత. యాదయ్య, యాదమ్మ, నర్సిములు, రాజయ్య మొదలైన పేర్లు వినగానే పశ్చిమాంధ్రులని మనము స్పష్టముగా గ్రహించవచ్చును. తూర్పు కోస్తాలలో కనకదుర్గ మున్నగు దేవతల ప్రాధాన్య ముండుట వలన దుర్గ పేరు చేర్చబడిన పేర్లు సామాన్యము. ఉదా:- దుర్గా లక్ష్మి, దుర్గా భవాని, దుర్గాశంకరి మొదలగునవి. రామ, కృష్ణ, వెంకట, శంకర, ఈశ్వర వంటి నామములు తెలుగు దేశమంతట సామాన్యము. ఇట్లే వంశములోని పెద్దల పేర్లను తరువాతి తరముల వారికి పెట్టుట కలదు.

కాని ఆధునికులు పూర్తిగా ప్రాచీన సంప్రదాయములను మాని కవితా దృష్టితో పేర్లు పెట్టుకొనుట వలన భావసమైక్యము రాష్ట్రమంతట వ్యాపించుచున్నది. అయినను వ్యవహారమున కొత్త పేర్లున్నను పాతపద్ధతులను వీడని పెద్దలు మాత్రము తమ పిల్లలను పాత పేర్లతోనే పిలుచుట పెక్కిండ్లలో కలదు.

సంతానము కలుగని తల్లిదండ్రులు తమ యిష్టదైవములకు ప్రత్యేకముగా మ్రొక్కుబడులు మ్రొక్కుకుని ఆయా దేవతల పేర్లు తమ పిల్లలకు పెట్టుకొందురు.

కలిగిన సంతానము దక్కక పోయిన తల్లిదండ్రులు కొందరు ఏవిధముగానైనను వారిని దక్కించుకొన వలయునను తలంపుతో పెంటయ్య, పెంటమ్మ, తిప్పయ్య, తిప్పమ్మ వంటి పేర్లను పెట్టుదురు. ఇట్టి సంతానమునకు ఊయెలలో వేయుట వంటి ఉత్సవ వేడుకలను చేయుటకు జంకుదురు. ఎక్కువ సంతోషపడిన ఎటువంటి అనర్థములకు దారితీయునో యను భయము వారినట్లు చేయనివ్వదు. ఇట్లు భయ భీతులగు వారు శిశువు జనించినంతనే పెంట కుప్పపై వేయుట లేదా కడుపునిండ కనిపెంచిన సంతానవతి ఒడిలో వేయుట చేయుచుందురు. అట్లు చేయుట వలన తమ సంతానమునకు తమకు సంబంధము లేదను దృష్టిని గోచరింప చేయుదురు. ఆ తరువాత వారిని మరల తెచ్చుకొని పెంచుకొందురు.

పేరును పెట్టుటకు జరిపించు మహోత్సవమే నామకరణ మహోత్సవము. శిశివు జన్మించిన పదకొండవ దినమున పురుడు చేయుదురు. పురుడునాడు తల్లీ పిల్లలకు అభ్యంగ స్నానము చేయించి ఓమము (నాము), ఎల్లిగడ్డ పొట్టు కలిపిన సాంబ్రాణి పొగతోను ధూపము పట్టి, దృష్టి దోషములు తగులకుండ దిగదుడుపులు తుడిచి మసిబొట్టు పెట్టెదరు. పూర్వకాలమున పురుటి స్నానము చేయించుటకు ఇరుగింటి పొరుగింటి ముత్తైదువలువేడినీళ్ళ కడవలు తీసికొని వచ్చి తల్లి బిడ్డకు స్నానము చేయించి తాము ను పురిటింటనే స్నానములుజేసి వెళ్ళెడివారట. ఇప్పుడాయాచారము కనిపించుట లేదు. గ్రామప్రాంతములలో నేడు పురటి స్నానమును మంత్రసాని చేయించుట కలదు. స్నానానంతరము మంత్రసాని ఎన్నెమ్మ కథ చెప్పును. ఈ కథను ఈ నాడేగాక శిశువు జన్మించినది మొదలు ఇంటిలోని ముసలమ్మలు తమ తీరుబాటు సమయమున పురిటింటిముందు కూర్చొని పెక్కు మారులు చెప్పుదురు. చివరన

"రావేరావే ఎన్నెమ్మా, నీవు పోవే పోవే ఎన్నెమ్మా...."-[1]

అనుచు ఎన్నెమ్మను పారద్రోలినామందురు లేకపోయిన ఎన్నెమ్మ పురిటింట నుండి పురిటి బిడ్డను బాధించునని జానపదుల విశ్వాసము. తల్లీపిల్లల క్షేమమును కాంక్షించి కుమ్మరి చేత గ్రామదేవతాలయములలో సాకలు పెట్టింతురు.

1. మిన్నేరు-పుటలు-68-69.

ఈనాడు శిశువునకు పురుటి దీపములను చూపెట్టుట ప్రధానముగా పాటింపబడు ఆచారము. పదకొండు విస్తరాకులలో అన్నమును, ఆకు కూరలు కాయకూరలు కలిపి (కలెగూర) వండిన కూరను పెట్టెదరు. తడిపిన గోధుమపిండితో పదకొండు ప్రమిదలను చేసి అదు జ్యోతులను వెలిగించి ప్రతి విస్తరాకులోని అన్నము మధ్యన ఒక్కొక్క దీపముగా పొందించెదరు. ఈ జ్యోతులను పురటి దీపములందురు. విస్తరాకులను వర్తులాకారములో అమర్చి వాటి మధ్యన శిశువుతో పాటు తల్లిని కూర్చుండజేసెదరు. ఇట్లు చేయుట పురటి అన్నమును శిశువుపై నుండి త్రిప్పి వేయుటగా భావింతురు. అట్లు చేయక పోయిన పిల్లలు తిండిపోతులగుదురను నమ్మకము జానపదులలో కలదు. పిల్లలు పెద్దవారైన పిదప తిండి పోతులుగానుండిన వారిని "పురటి అన్నము తిప్పేయ (త్రిప్పివేయ) లేదా యేమి, ఒకటే బూకటి" (ఆకలి) అని అనుచుందురు.

జ్యోతుల మధ్యన కూర్చొనిన బాలెంతరాలునకు, శిశువునకు మెడలో పసుపు దారమునకు వెల్లుల్లి పాయలుతో గ్రుచ్చిన దండలను వేయుదురు. మగపిల్లవాడయిన నడుమునకు కట్టుదురు. వెల్లుల్లిపాయ గంధమును బొడ్డుకోసిన కొడవలికి రుద్ది (ఈ ఆచారమును పాటించు పట్నవాసులు కొడవలి సదుపాయములో నుండక పోయిన కత్తిని వాడుదురు) ఆముదపు నూనెతో జ్యోతి వెలిగించి కాటుకను పట్టి తల్లీపిల్లలకు పెట్టెదరు. వచ్చిన పేరంటాండ్రను మంత్రసాని గురిగిలో "లింగాలను" (ఒక్కొక్క గ్రామదేవత పేరును ఉంచుననుపైన గులక రాళ్లు) వేసి గలగల లాడించుచు తల్లీపిల్లల చుట్టు ఎగురుచు దేవతలను స్మరించుచు "కప్పోలే ఎగురుతా, ఎమోలే పాకుతా, గుఱ్ఱుమోలె ఉరుకుతా" ననుచు తిరుగుచుండును. చుట్టు మూగిన పేరంటాండ్రు తమకు తోచినంత డబ్బును తల్లీపిల్లల మీదుగా త్రిప్పుచు మంత్రసాని గురిగిలో వేయుదురు. వినోదించు తత్త్వముగల పిల్లలు మంత్రసానికి డబ్బు ఆశను గొలిపి మరిమరి గంతులు వేయింతురు. పిదప శిశువునకు పురుటి దీపములను చూపెట్టెదరు. శిశువు నిద్రించుచున్నను కండ్లు బలవంతముగానైన తెరచి, అరికాలు అరి చేతులను రాయుచు మేల్కొలిపి వాటిని చూపెట్టుదురు. పురటి దీపములను చూడకపోయిన "దిష్టికండ్ల" వారగుదురని పెద్దవారయిన పిదప ఇట్టివారు ఎవరిని చూచిన వారికి దృష్టిదోషము తగులునను విశ్వాసముతో పసివాని కన్నులలో

దీపముల వెలుగును మెరిపింపజేతురు. తరువాత తల్లీ పిల్లలపైన నల్లగొంగడిని లేదా దట్టమైన దుప్పటిని కప్పుదురు. పురటి గదిలోనున్న పేరంటాండ్రను పిల్లలనందరిని అచ్చటనుండకుండ బయటకు పంపించెదరు. ఎవ్వరును చూడకుండ మంత్రసాని పదకొండు అన్నము దీపములతో గూడిన విస్తరాకులను ఒక గంపలో పెట్టుకొని వేపమండలను చేత బట్టుకొని వెనుకకు తిరిగి చూడకుండ వెళ్లిపోవును. ఆమె వెనువెంట ఇంటి పెద్దమనిషి చెంబులో నీళ్లను తీసికొని చిలకరించుచు బయటి వాకిలి వరకు వెళ్లి తిరిగి వచ్చును. దానితో తల్లీపిల్లలకు పురుటి పీడ పోవునని స్త్రీలు విశ్వసింతురు. ఈ వేడుక సాయం సమయమున జరుపుట పరిపాటి. తరవాత తల్లీ పిల్లలకు వేడినీటితో ఒళ్లు తుడచి బట్టలు మార్పించి, కనుబొమ్మల మధ్యన మసిబొట్టు పెట్టి వచ్చిన పేరంటాండ్రకు గుగ్గిళ్లు పంచుదురు. పురుటినాడును, నామకరణపు వేడుక జరుపునాడును గుగ్గిళ్లను పంచుట ఆచారము.

కొన్ని కుటుంబములలో పురుడు పూర్తి అయిననాడు, మరికొన్ని కుటుంబములలో ఇరువది యొకటవనాడు నామకరణము చేయుదురు. దీనిని బారసాల అందురు. డా॥ ఎల్దండ రఘుమారెడ్డిగారు "బాలసాల" "బారసాల"గా–[1] మారియుండవచ్చుననుట సముచితముగా నున్నది. ఈనాడు బాలెంత పుట్టింటివారు. మెట్టినింటివారు తల్లీ పిల్లలకిద్దరికిని క్రొత్త బట్టలను తెచ్చెదరు. శిశవునకు జన్మించినది మొదలు ఈరోజె మొదటిసారిగా క్రొత్తబట్టలు వేయుదురు. అంతవరకును ఇతర శిశువులెవ్వరివైన పాత బట్టలను వేయుదురు, విధిలేని పరిస్థితులలో క్రొత్తబట్టలు వేయవలసి వచ్చినను వానిని ముందుగా నీళ్లలో తడిపి వాడుదురు. శిశువునకు దృష్టిదోషము తగులకుండ చేతులకు దిష్టిపూసలను పేరుగల నల్ల పూసలను కట్టెదరు. ఈనాడే శిశువును తొలిసారిగా ఊయెలలో వేసి ఊపెదరు. జన్మంచినది మొదలు శిశువు తల్లిప్రక్కననే ఉండును. బంధువులు తల్లీ పిల్లలకు తెచ్చుకానుకలతో బాటుగా పసుపు కుంకుమలను, ఐదు వెల్లుల్లి గడ్డలను, వాముపొడిని తెచ్చుట మరువరు. వెల్లుల్లి గడ్డ పొట్టును, వాము పొడిని తల్లీబిడ్డకు పట్టు ధూపములో వేయుట తెలిసిన విషయమే. శిశువునకు కనీసము ఆరు నెలల వయస్సు వచ్చు వరకు ఈ ధుపమునుపట్టుట ఆచారము.

1. పల్లెపదాలలో ప్రజాజీవనము–చతుర్థ ప్రకరణము (అముద్రితము)

"శ్రీరామ జననము" పాటలో సప్తఋషులు రామాదులు జన్మించిన పదిదినముల పిదప నామకరణము చేయించిరి. దశరథుడు "పచ్చల కలము దెచ్చి" రామలక్ష్మణ భరత శత్రఘ్నులని నామములు వ్రాసెనట.-1

సాధారణమైన జానపదుల యిండ్లలో జరుగు వేడుకలలో శిశువును ఉయ్యాలలో వేసి అవ్వతాత వరుసలో నున్నవారు శిశువు చెవిలో మొదట కులదేవతల మరియు ఇష్టదేవతల పేర్లు పిలచి తరువాత తల్లిదండ్రులు ముచ్చట పడు పేరును పెట్టెదరు. ప్రామాణికత్వము కొరకు జానపద గేయములలో పేర్కొనబడిన కొన్ని పేర్లనిట మచ్చునకుదాహరింతును.

పురుషుల పేర్లు :- కోటయ్య-1ఎ, లింగడు-2, నాగన్న, రంగయ్య-3. రామదాసు-4. చందురన్న, అగన్న-5. మల్లయ్య-6, సుబ్బయ్య-7, బలరామయ్య-8, గంగారాం-9, అల్లుమ్మరాజ-10, కిట్టయ్య-11, సాయన్న-12, రామయ్య-13, సాకిరెడ్డి-14, దుర్గయ్య-15, సూరయ్య-16, మొదలగునవి.

---

1. స్త్రీల రామాయణపు పాటలు-56. ఎ. సెలయేరు-పుట-122.
2. సెలయేరు-పుట-120
3. సెలయేరు-పుట-143
4. సెలయేరు-పుట-133
5. తెలంగాణా పల్లెపాటలు-పుట-72
6. తెలంగాణా పల్లెపాటలు-పుట-73
7. తెలంగాణా పల్లెపాటలు-పుట-120
8. తెలంగాణా పల్లెపాటలు-పుట-130
9. తెలంగాణా పల్లెపాటలు-పుట-139
10. తెలంగాణా పల్లెపాటలు-పుట-165 (అల్లుమ ప్రభువు పేరునవచ్చియుండును)
11. తెలంగాణా పల్లెపాటలు-పుట-173
12. తెలంగాణా పల్లెపాటలు-పుట-180
13. తెలంగాణా పల్లెపాటలు-పుట-182
14. తెలంగాణా పల్లెపాటలు-పుట-182
15. తెలంగాణా పల్లెపాటలు-పుట-184
16. తెలంగాణా పల్లెపాటలు-పుట-191

స్త్రీల పేర్లు:- రాజమ్మ -1, ఈరమ్మ-2, వెంకమ్మ-3, శాంతమ్మ-4, లచ్చిమి-5, గంగి-6, రామక్క-7, ఎంకూ-8, చెన్నమ్మా-9, గంగమ్మ-10, మొదలగునవి.

– ఇట్లే నిత్యజీవితములో మనము వినునట్టి ఇతరములైన పేర్లను ప్రసక్తానుప్రస్తక ముగా పాటలలో వినిపించును.

శిశువును ఉయ్యాలలో వేయుటకు మునుపు అందు ముదుసలివారినెవరినైన కూర్చుండబెట్టి ఊపుదురు. అదే ఉయ్యాలలో ఊగు తమ పిల్లలు వారివలెనే ముసలి వయస్సు వచ్చువరకు జీవించవలెనని జానపదుల కాంక్ష. శిశువును ఉయ్యాలలో వేసి తల్లిని బావి చెంతకు తీసుకొని వెళ్లుదురు. ఇట్లు చేయుటను "బాలెంతను బావికి తీయుట" అందురు. ఈనాడు శిశువును ఉయ్యాలలో వేసి ఊపుటకు, బాలెంతరాలును బావికి తీయుటకు గల ప్రాధాన్యమును బట్టియే "ఉయ్యాలలో వేసినారా? తొట్టెలలో ఎప్పుడు వేస్తారు? బావికి తీసినారా? బాయికెప్పుడు తీస్తారు"-అని పరిచయస్తులు ఇంటివారిని ప్రశ్నించుచుందురు. ఇట్లడగుట "బారసాల ఎప్పుడు?" అని ప్రశ్నించుటయే. బాలెంత తలపైన ముసుగు వేసికొని ఒడిలో నవధాన్యములను తీసికొని బావికి బయలుదేరును. బావికి పోవుచు మూడు గడపలను పసుపు కుంకుమలతో అలంకరించుచు గడపలపైన నవధాన్యములను పెట్టి నమస్కరించుచు వెళ్లును. బావికి పసుపు కుంకుమలతో బొట్టుపెట్టి దేవతలను స్మరించుచు ఐదు లింగములను (రాళ్ళను) బెట్టి తన ఒడిలో మిగిలిన నవధాన్యములను వాటి చెంతనుంచి పూజించును. బాలెంతకు తోడుగా తమలపాకులో పసుపు ముద్ద ఆకారములో తీర్చిన గౌరమ్మను తీసికొని వచ్చెదరు. సంతానవతులుగాని స్త్రీల చేత బావిచెంత ఈ గౌరమ్మను మ్రింగించెదరు. అట్లు చేసిన సంతానములేని వారు సంతానవతులగుదురని నమ్ముదురు. బాలింత బావిలో మూడు లేదా ఐదు చేదలు వేసి ఒక బిందెను, ఒక చిన్న చెంబును నీళ్ళతో నింపును.

1. తెలంగాణా పల్లెపాటలు పుట 36.
2. తెలంగాణా పల్లెపాటలు పుట 128.
3. తెలంగాణా పల్లెపాటలు పుట 41.
4. తెలంగాణా పల్లెపాటలు పుట 73.
5. తెలంగాణా పల్లెపాటలు పుట 120.
6. తెలంగాణా పల్లెపాటలు పుట 139
7. తెలంగాణా పల్లెపాటలు పుట 152
8. తెలంగాణా పల్లెపాటలు పుట 172
9. తెలంగాణా పల్లెపాటలు పుట 184
10. తెలంగాణా పల్లెపాటలు పుట 184

ఒంటి చేద చేదకూడదని ఒంటి బిందెను నింపగూడదను విశ్వాసముతో నట్లు చేయుదురు, సామాన్య దినములలోను ఒక చేదను వేసి చేదుట, ఒక బిందెను మాత్రమే నింపుట చేయరు. శిశువు పుట్టినది మొదలు తల్లి ప్రక్కన ఉండువానిని ఊయెలలో వేసి ఊపుట, ఇన్నిరోజులు ఇంటి పనులలో పాల్గొనని బాలెంతను "బావికి తీయుట"–ఈ నాటితో ఆమె నిత్యకృత్యములు ప్రారంభమగునని తెలియజేయు చున్నవి. ఇంటిలో బావిలేని వారును ఈ ఆచారమును పాటింతురు. గ్రామములో ఉమ్మడిగా వాడబడు బావి ఇంటికి చెంతనే ఉన్న అక్కడికి వెళ్లుదురు.

బాలింత వచ్చినది బావి నీళ్లకు–ఏదేది బాలెంత ఎంత చక్కనిదో–1

– అని ఇరుగింటి పొరుగింటి వారు ఆమెను చూచుట ఈ విషయమునే వ్యక్త పరచుచున్నది. బావి దూరమైన వెళ్లుటకు వీలు లేకపోయిన ఇంటిలోనె ఒక పెద్దబిందెను నీళ్లతో నింపి దానిని బావిగా భావించి, చిన్న చెంబును బొక్కెనగా భావించి దాని మూతికి త్రాడుకట్టి బావి నీళ్లను చేదినట్లు బిందె నుండి నీళ్లను చేదెదరు. ఏది ఏమైనను ఆచారమును మాత్రము ఉల్లంఘించరు.

బావిలోనుండి నీళ్లను చేది బిందెను నింపుచు బాలెంత "నీటిదార నీకు, పాలదార నాకు" అని మూడు మార్లు పలుకును. నీళ్లతో నింపిన బిందెను, చెంబును తీసికొని వచ్చి ఊయలక్రిందబెట్టును. అప్పుడు బాలెంతతో బాటుగా పేరంటాండ్రును ఊయెల నూపుచు పాటలు పాడుదురు.

ఊయలలో వేయు సందర్భమున పాడు పాటలు ఈ సాహిత్యమున కొల్లలు. వీనికి తోడు రాముని కౌసల్య ఊయలలో వేసెననియు, కృష్ణుని యశోద ఊయలలో వేసెననియు కథలను పాడువారు జోడించెదరు. తల్లి తన కుమారుని రామునిగనో, కృష్ణునిగనో, తన కూతురును సీతగనో, రుక్మిణిగనో భావించుట సహజము. వారివలె తమ బిడ్డలు గొప్పవారు కావలెనని ప్రతి తల్లియును ఆశించును. అందుకనియే ఈ పిల్లల ఉయ్యాల పండుగను రాముని డోలోత్సవముగను, కృష్ణుని డోలోత్సవముగను వర్ణింపబడినది.

---

1. సెలయేరు–పుట–82.

"జోజో దశరథ రాజకుమార-కౌసల్య వరపుత్ర కరుణా కటాక్ష
రఘుకుల భూషణ రాజపూజితుడా"

– అని ప్రారంభింపబడిన ఈ పాటలో శ్రీరామచంద్రునిని తల్లి కౌసల్యాదేవి ఉయ్యాలలో వేయు సందర్భము వర్ణింపబడినది.

"ఒత్తుకొని పాపణ్ణి ఎత్తుకొని వచ్చీ-మెత్తని ఆ పట్టు పొత్తుల్లు పరచీ
ముత్యాల కుల్ల–[1] తాముందుగా గట్టీ-రత్నాల రాములకు తీర్చే
కూర్పుర ధూపమున కాకమర వేసీ
పీతాంబరము గట్టె బింబోష్ఠునకునూ ॥జోజో॥

విశ్వబ్రహ్మను పిలిచి వేగ కౌసల్యా
కుందనముగల తొట్లె ముందుగా తెమ్మీ
పలుకలను ఆ పసిడి ప్రతిమలను వ్రాసి
హంసలా చిలుకలా నమరించె బ్రహ్మ ॥జోజో॥

పెద్ద ముత్తైదలా ప్రేమతో బిలిచీ
పసుపు కుంకుమలునూ పరిమళాలిచ్చీ
దొడ్డ ముహూర్తమని తొట్లెలో ఉనిచే ॥జోజో॥
ఇన్నాండ్ల వాండ్లమే ఇంతిరో మనమూ
ఇటువంటి సుందరుని ఎన్నడెరుగామూ
గుంపు తెమ్మెదలు గదె కొడుకు ముంగురులూ
ఆజాను బాహుపులు అతని హస్తములూ ॥జోజో॥

పాదంబులను పద్మకులిశరేఖలు మెరయు
సర్వాంగసుందరుండమ్మ నీకొడుకూ
మా జన్మ సఫలంబు మరి-నేటికాయే
ఇండ్లకూ పోయేము ఇంతిరో మేమూ
పసుపు కుంకుమలునూ పరిమాళాలిచ్చీ
గుగ్గిళ్లు పంచెనే కుసుమ శ్రీగంధి ॥జోజో॥–[2]

1. టోపీ 2. తెలంగాణా పల్లెపాటలు-పుట-4.

– ఇందు ఉయ్యాలలో వేయునప్పుడు జరుపబడు తంతును, ఉత్సవమును తిలకించుటకు వచ్చిన పేరంటాండ్రు బాలుని చూచి పసివాని కనుముక్కు తీరు వర్ణించుట, పేరంటాండ్రను ఇంటివారు ఆదరించు పద్ధతి – మొదలైన సంఘటనలు వర్ణించబడినవి.

రామ జననముతో బాటు అడవులపాలై అష్టకష్టముల ననుభవించిన సీతమ్మ కుశలవుల నుద్దేశించి పాడు పాటలు కూడ ప్రసిద్ధము. ఈ పాటలు భవనములలో నివసించు ధనిక వర్గముతో బాటు గుడిసెలలో నివసించు నిరుపేదల వరకును ఆదర పాత్రమైనవి.

జోజోకుశవీర జో లవకుమారా–జో వీర జో వీర జో సుకుమార ॥జోజో॥
ఏల నాగర్భంబునందునా మీరూ--బాలకా జన్మించి జాలినొందేరూ
నీలలోచన మీరు నిద్రలూ పోరూ ॥జోజో॥

–మహారాణిగా రాజ్యభోగములననుభవించి తన కుమారులను బంగారు తూగుటుయ్యాలలో ఉంచవలసిన సీత తన గర్భంబునందు జన్మించుటయే తన సంతానము యొక్క దురదృష్టముగా భావించి బాధపడుచున్నది. పుట్టింటి వారిని, అత్తింటి వారిని తలచుకొని వారందరి పేర్లతో వారు తెచ్చు కానుకలను వర్ణించుచున్నది. –

“అయోధ్యలో నున్న అత్తశాంతమ్మా
తొయ్యలి పులిగోరు గొలుసులా బొమ్మా
మీ అత్త శాంతమ్మ తెచ్చు సత్యముగా ॥జో॥
మాతల్లి భూదేవి మన్ననాతోనూ
నీతితో అంగీలు కుల్లాలు దెచ్చూ ॥జో॥
కాళ్లగజ్జెలు గొనుచు కడియాలు గొనుచూ
కౌసల్య మీ అవ్వ వచ్చు ఊర్కుండు ॥జో॥
దండ కడియాల్గొనుచు దస్తీలు–[1] గొనుచూ
దశరథుడు మీతాత వచ్చు సత్యముగా ॥జో॥
కంకణాలు గొనుచు కంఠీలు గొనుచూ
కైకేయి సుమిత్ర లొచ్చేరు నిజమూ ॥జో॥

1. చేతి రుమాలు.

ఉగ్గు గిన్నెలు గొనుచు ఉయ్యాల గొనుచూ
పెగ్గె ఊర్మిళదేవి పినతల్లి వచ్చూ ॥జో॥
మంగళ హారతులతో మణిహారములతో
హంగుగా మాళవి శృతకీర్తి వచ్చూ ॥జో॥
రాయ బారము గొనుచు రావిరేక గొనుచూ
మీ బంటు హనుమాండ్లు వచ్చు సత్యముగా ॥జో॥
భరత శత్రఘ్న లక్ష్మణులు గొలువంగా
మీ బాపు రాఘవులు వచ్చు ఊర్కుండు-[1]

– సీతాదేవి తన కుమారులను లాలించునప్పుడు అందరిని పేరుపేరున స్మరించెనో లేదో గాని ఈ జానపద స్త్రీమాత్రము సీతమ్మకు దగ్గరి వారినెవ్వరిని మరువలేదు. ఏయే బంధువుల నుండి ఏయే వస్తువులు కావలెనని ఆమె కోరునో అవి యన్నియు సీతమ్మ "చుట్టాలు వక్కాలు" తీసుకొని వత్తురని నుడివినది.

రామాయణ పాటలతో బాటు కృష్ణుని బాలలీలలును విశేషముగా వ్యాప్తిలో నున్నవి. వానికి భాగవత హరివంశములు మూల గ్రంథములు. భాగవతమునందలి దశమస్కంధము నాధారముగా కృష్ణలీలల పాటలు అసంఖ్యాకముగా నున్నవి. వానిలో జోల పాటల సంఖ్య కూడ ఎక్కువే.

ఉయ్యాలలో నూచుచు కృష్ణుని జనన ఘట్టమును, జీవిత చరిత్రను తెలుపు పాట తెలుగు తల్లుల మధుర కంఠముసుండి యిట్లు వెలువడును.

"కస్తూరి రంగరంగా నాయన్న కావేటి రంగరంగా
శ్రీరంగ రంగా నిను బాసియెట్లు-నేమరుచుందురా
కంసుని సంహరించి సద్గురుడు అవతారమెత్తెనపుడు
దేవకీ గర్భముననను విష్ణువు కృష్ణుడై జన్మించెను
ఏడు రాత్రుళ్లు ఒక రాత్రిగా, ఏకరాత్రిగా చేసెను
ఆదివారం పూటనూ అష్టమీ దినమందు జన్మించెను
తలతోటి జననమైతే తనకు బహు మోసంబు వచ్చుననుచు
యెదురు కాళ్లన బుట్టెను ఏడుగురు దాదులను జంపెనపుడు
నెత్తురుతొ నుండునపుడు ఆ బాల కావు కావున ఏడ్చుచు
....

1. తెలంగాణా పల్లెపాటలు-పుటలు-6-8.

తన రెండు హస్తములతో దేవకి బాలుణ్ణి యెత్తుకొనెను
అద్దాలపై వేసుక ఆబాల చక్కదనమును చూచెను
వసుదేవ పుత్రుడమ్మ యా బాల వైకుంఠవాసుడమ్మా
నవనీత చోరుడమ్మా యా బిడ్డ నంద గోపాలుడమ్మా
సీతా కళత్రుడమ్మా యా బిడ్డ శ్రీ రామ చంద్రుడమ్మా
....
నీ రూపు నీ చక్కనా ఆ బ్రహ్మ యెన్నాళ్లు వ్రాసె తండ్రి
మాయన్న-కంసుడునూ నిచ్చటికి వచ్చు వేలాయెరన్నా
నిన్ను నేనెత్తుకొని ఏత్రోవబోదురా కన్న తండ్రి
ఆ చక్క దనము చూచి దేవకీ శోకింప సాగెనపుడు
తల్లి శోకము మాన్పెను మాధవుడు తానిట్లె చేసెనపుడు
పెద్ద బొబ్బలు పెట్టుచు మాధవుడు గట్టిగా నేడ్వసాగె
శోకంబు చాలించియు దేవకీ బాలుణ్ని యెత్తుకొనెను
....
నిన్ను నేనెత్తుకోని ఏ త్రోవ బోదురా కన్న తండ్రి
మాయన్న కంసుండును నిటువచ్చు వేలాయె చిన్నబాలా
నాకేమి భయములేదే ఓ తల్లి నాకేమి కొదువలేదే
....
మామ నను హింసింపను యా వేళ తాను వెరపించ వచ్చితె
నా మామ నాచేతను మరణమై పొయ్యేది నిజము సుమ్మి
....

– అని కృష్ణుడు జన్మించినది మొదలు జరిగిన ఘట్టములను వర్ణించుచు పాడెదరు. గేయములోని తరువాత భాగమున వసుదేవుడు వచ్చికృష్ణుని రేపల్లెవాడలో గోపమ్మ (యశోద) యింటిలోనుంచి గోపమ్మ పుత్రికను అతిత్వరగా తీసికొనివచ్చి దేవకీదేవి చేతిలో నుంచినాడు. కంసుడు వచ్చి ఆడకూతురను దయకూడ లేకుండగా బాలికను తీసికొని యెగురవేసి నరక బోవగా ఆబాలిక

"నన్నేల జంపేవురా నాయబ్బ రేపల్లె వాడలోను
పెరుగుచున్నాడు వినరా కృష్ణావతారమై జన్మించెనూ"–[1]

1. స్త్రీల పాటలు.ఎస్. వి. గోపాల్ అండ్ కంపెనీ, పుట-3-8.

–అని పలికెను. పిదప కంసుడు కృష్ణుని వెదకి చంపించుటకు ప్రయత్నించుట, కృష్ణుని పౌరుష కార్యములు, కృష్ణుడు గోపికల నేడిపించుట వరుసగా ఈ పాటలో వర్ణింపబడినవి. ఇందు సగము భాగవత కథానుసారమును జోడించి పాడుకొని ఆనందించినారు స్త్రీలు.

రామ జననము కృష్ణ జననమునకు సంబంధించిన పాటలు తెలుగు వారి నోళ్లలో నానిపోయినవని వేరుగా చెప్పనపసరము లేదు. కృష్ణుని జననతిథి అయిన అష్టమినాడు ఎవరైన జన్మించిన మేనమామ గండమనుచు భయపడునట్టి తల్లులు చిన్ని కృష్ణునిగా తమ కొడుకును గారాబము చేయుట చిత్రముగా నుండును. రోహిణి నక్షత్రముతో కూడిన అష్టమినాడు జన్మించిన బాలుని ముఖము మేనమామలు "శాంతి" పెట్టనిదే చూడరు. శాంతి పెట్టుట అనగా జన్మ నక్షత్రమునకు సంబంధించిన గ్రహదోషములను తొలగించుటకు, గ్రహములను శాంతింప జేయుటకు జేయు పూజలని యర్థము. శాంతి పెట్టిన పిదప శిశువు ముఖమును నూనెలో నీడ రూపమున చూచెదరు. అష్టమి, అమావాస్య, వర్జము వంటి చెడు సమయములో జన్మించిన శిశువులకు గ్రహశాంతి చేయుదురు. శిశువు జన్మకు సంబంధించిన గండములు సామాన్యముగ తల్లిదండ్రులకు మేనత్త మేనమామలకు, అవ్వ తాతలకు సంబంధించినవై యుండును.

మరొక పాటలో నిద్ర పోవక పోరు పెట్టుచున్న బాలుని తల్లి కృష్ణుని సాకుతో ఇట్లు అనునయించు చున్నది.

జో దేవకి తనయ జోరమా హృదయా
జో రమాకృష్ణయ్య జోనల్లనయ్యా ॥జో॥
జోలపాడెద పోరు చాలించవయ్యా
చాలించి వేగమే శయనించవయ్యా ॥జో॥
కాలాతీతంబాయే కరుణించవయ్యా
పాలవెన్నల దొంగ పవళించవయ్యా ॥జో॥
సుధతి దేవకీదేవి సుతుడవై పుట్టి
వదలకును కంసున్ని ఒడిసి మెడబట్టి
చెదరకును యామూర్ఖుని శిరము నటుకొట్టి

తుదకు తల్లిదండ్రుల దుఃఖమణచితివీ
నాల్గు ప్రక్కల సభను చూచి పాండవులచే మేలు పొసగదని తలచి
పాహి కృష్ణాయనిన బాధ బాపితివీ ॥జో॥
స్వామీ నీ బాల్య నెచ్చెలి కుచేలునకు
ప్రేమ నీవిచ్చితివి పిడికెటటుకులను
లేమి బాపియు పరంధామ విప్రునకు బూమిపతి
అష్ట భాగ్యముల నిచ్చితివీ ॥జో॥
వరద కోటీశ్వరా వినుత సర్వేశా
నరకాసుర ధ్వంస నిదుర పోవయ్యా ॥జోజో॥–[1]

–ఈ పాట కృష్ణుడు పాలవెన్నలను దొంగలించుట, కంసునిని సంహరించుట, ద్రౌపదీ దేవికి మానభంగము కలుగకుండ రక్షించుట, బాల్య స్నేహితుడైన కుచేలుని చేరదీయుట, నరకాసురుని ధ్వంస మొనర్చుట వంటి కథలను స్ఫురింప జేయుచు అల్లబడినది.

ఇట్లే "రామాలాలీ మేఘ శ్యామ లాలీ తామరసనయన తనయాలాలీ" "జో అచ్యుతానంద జోజోముకుంద రావె పరమానంద రామగోవింద"–వంటి పాటలును అధిక ప్రచారమునందున్నవి.

మతమునకు ప్రాధాన్యమునిచ్చు కుటుంబములలో రామ కృష్ణుల జోలపాటలను వైష్ణవులు పాడగా శివపరమైన పాటలను శైవులు పాడుదురు.

"లాలి శంకర సదాలాలిత కుమారా–లాలి పటుతాండవోల్లాస ఘనదీరా
లాలి సంచాస్య కైలాస సంచారా–లాలి మధురాలాప లాలి గంభీరా
పతిత పావన రుద్ర ఫణి రాజ భూషా–జిత కాలకూట వర్ణిత భవ్యవేశా"–[2]

"ఉయ్యాలో జంపాలో మా ఉమామహేశునకు
సయ్యన పార్వతీ సరసజేరి యూపె పయ్యెద చెంగు చేపట్టి ॥ఉ॥
...."–[3]

1. నేను సేకరించినది. పాడినవారు. ఇందిర, గడ్డమల్లాయగూడెం, ఇబ్రహింపట్నం.
2. తెలుగు జానపదగేయ సాహిత్యము పుట –444
3. మిన్నేరు పుటలు – 85, 86.

– అను శివవర్ణనలు గల పాటలు శైవులలో ప్రచారమునందున్నవి. ఇట్లే ఆయా మతస్థులను తమతమ మతమునందలి శ్రేష్ఠులను పేర్కొనుచు ఈ ఉత్సవ వేడుకలలో పాటలుగా పాడుకొందురు. ఈ పాటలలో బాలికల సంబోధనతోనుండు ఊయెల పాటలు అరుదుగా నుండును. "అపుత్రస్య గతిర్నాస్తి" అని విశ్వసించిన ప్రాచీనులు పుత్ర సంతానమునెడ మమకారమును జూపుటయేగాక పాటలలోను వారికే ప్రాధాన్యమిచ్చుటలో ఆశ్చర్యము లేదు.

కృష్ణశ్రీ గారు పుత్రోత్సవము, పెండ్లి వంటి వేడుకలలో పాడు పాటలను "మంగళ కవన" మని పేర్కొనినారు.--[1]

అన్నప్రాశన, చౌలము, ఉపనయనము వంటి ఇతర సంస్కారములు ఆచరింపబడుచున్నను వాటికి సంబంధించిన పాటలు జనపదములలో ప్రచారము నందులేవు. అట్టివేడుకలలోను సర్వ సాధారణమైన మంగళహారతి పాటలనే పాడుదురు.

బాలికల జీవితము పుష్పవతి యగుటతో నూతనమైన మార్పులకు లోనగును. దీనినే "సమర్తలాడుట" అందురు. ఈపాటలు విశేష ప్రచారము నందున్నవి, వానిని పరిశీలింతము.

సమర్త :– ఆడపిల్లల శారీరకమైన ఎదుగుదలలో పది మొదలు పదిహేను సంవత్సరముల మధ్యవయస్సున చాల మార్పుకనిపించును. ఆ వయసులో వారు తొందరగా ఎదిగిపోయెదరు. వారిలో అందచందములు అతిశయించు చుండును. అట్టి వయస్సులో బాలికలు ఋతుమతులగుదురు. అప్పుడు జరిపింపబడు వేడుకయే సమర్త–[2] ఈమార్పుతో బాలికలు జీవితమున యౌవన దశలో అడుగు పెట్టెదరు. ఈ సమర్తనే రజస్వల, పుష్పవతి, పెద్దమనిషి యగుట – మొదలగు మారు పేరులతో వ్యవహరింతురు, ముద్దుపళని ఈ వేడుకను కదు రమ్యముగా వర్ణించినది. –[3]

---

1. స్త్రీల పాటలు (వ్యా) కృష్ణశ్రీ, భారతి, ఏప్రిల్, 1953. పుట–317.
2. సమర్త అను పదము విచిత్రముగా నున్నది. దీనికి సమానార్థములుగా తెలుగు తోబుట్టువులగు తమిళ కన్నడములలో వేరు పదములున్నవిగాని సమాన ధ్వని గలవి లేవు. కనుక ఇది "ఋతు" అను సంస్కృత పదసాహచర్యముతో ఏర్పడినదని భావించుచున్నాను.
3. రాధికా సాంత్వనము. ఆ 1. పద్యములు–71–77.

సమర్తలాడిన బాలికను ఎవ్వరును తాకకుండునట్లు దూరముగా నిల్చుండజేసెదరు. ఇంతలో చాకితను పిలిపింతురు. చాకిత వచ్చి గదిలోని ఒక మూలగోడను శుభ్రపరచి తెల్లనిగుడ్డ పరచును. ఇంటి చుట్టుప్రక్కల వారిని పేరంటమునకు పిలచెదరు. వారు నువ్వులు, నూకలు, కొబ్బెర, బెల్లము, పసుపు, కుంకుమ తీసికొని వచ్చెదరు. వీరందరు తెచ్చిన వస్తువులను ఒక్క దగ్గర కలపి ఒక ముత్తైదువ పిడికిలితో పిడికెడుగా ఐదు పిడికిళ్లు పట్టి పరచి ఉంచిన గుడ్డపైన ఐదు కుప్పలుగా పోయును. ఆ కుప్పల మధ్యన బాలికను కూర్చుండజేసి పసుపు కుంకుమలనిచ్చి అలంకరించుకొనుమందురు. బాలిక తలపై నుండి క్రిందికి జారిపడునట్లుగా పేరంటమునకు వచ్చిన పెద్దముత్తైదువ వంకరలులేని ఎండుకొబ్బెర కుడుకను విరచును. ఆ కుడక నాలుగు ముక్కలుగా విరిగి బాలికకు నాలుగువైపుల పడిన ఆ బాలిక అదృష్టవంతురాలగునని చెప్పుకొందురు. అందుచేతనే మనస్సులలో ఎట్టి అపశకునపు శంకలు కలుగకుండునట్లు బాగుగా ఎండి పొడిపొడిగా సున్న కుడుకను ఎన్నుకొందురు. బాలిక చేతిలో మరొక కుడుక నుంచి అందులో పసుపును నూనెను వేయుచు ముత్తైదువలు పాటలు పాడుదురు. నూనెను వేయునప్పుడు చేతితో గాక గడలు గలిగిన చొప్ప (సొప్ప) కట్టెను తెచ్చిదాని చివరన సూదిని గ్రుచ్చి సూదిని నూనె పాత్రలో ముంచుచు చుక్కలు చుక్కలుగా కుడుకలో వేయుట ప్రత్యేకమైన ఆచారముగా పాటించెదరు. కుడుకలో వేసిన పసుపు నూనెను ప్రతిదినము ఆ బాలిక ఈ సుమర్త వేడుకలు పూర్తి యగునంతవరకు ముఖమునకు రుద్దుకొనుచుండవలెను. బాలికను కూర్చుండ బెట్టిన మూలలో చెక్క బొమ్మకు పసుపు బట్టకట్టి బంగారు నగలతో అలంకరించి యుంచెదరు. గది ముందు ఇనుప గరిటెను నిప్పుకుంపటిని ఉంచి ద్వారమునకు వేప కొమ్మలను చెక్కెదరు. అట్లు చేయుట వలన భూతప్రేతము లేవియు దరిదాపులకు రావని గ్రామీణుల విశ్వాసము. గదిలో బాలికను కూర్చుండ బెట్టిన మూల కిరువైపుల బాలిక చేత నూనెపసుపు అలదిన హస్తముద్రికలను వేయించెదరు. దీనితో బాలికకకు దృష్టి దోషము తగులదని వారి నమ్మకము. వచ్చిన పేరంటాండ్రకు తాంబూలముతో బాటుగా నువ్వులు నూకలు కలిపిన మిశ్రమమును పంచిపెట్టెదరు. ఈ సందర్భమున పంచబడిన ఈ మిశ్రమమును మాచకమ్మలుగా నుండిన బాలికల కిచ్చిన వారును ఋతుమతులగుదురని

గ్రామీణుల నమ్మకము. ఈ మిశ్రమమును రజస్వల అయిన బాలిక చేతను తినిపించెదరు. అట్లు చేయుట వలన మిశ్రమములోగల నువ్వులు, కొబ్బెర, బెల్లము ఋతుస్రావమును చక్కబరచునని వైద్యగ్రంథములు చెప్పుచున్నవి.

గ్రామములోనున్న ఆత్మీయులు పూటకొకరుగా పిండి వంటలను చేసి తీసికొని వచ్చి రజస్వలయిన బాలికకు పెట్టెదరు. భోజన పదార్థములలో పాలు, పెరుగు, మాంసమును పెట్టరు. తీపి పదార్థములను విరివిగా పెట్టెదరు.

చుట్టుప్రక్కల గ్రామములోనున్న సన్నిహిత బంధు వర్గమునకు మంగలి చేత నువ్వులు నూకలు కలిపిన మిశ్రమమును, కుడుకలనిచ్చి వార్తపంపుదురు. వార్త తెలసికొనిన వెంటనే బంధువులు సీమంతపు వేడుకలలో తెచ్చునట్లుగా "సూడిద"–[1] లను తీసికొని వచ్చెనరు. నీడ పట్టున నుండుట వలనను, పసుపు సమృద్ధిగా శరీరమునకు రుద్దుకొనుట వలనను, ఇష్టమైన పిండివంటలను తినుటవలనను బాలికలకు ఈ దినములలో ఒక నూతన వర్చస్సు వచ్చును.

ఐదవ రోజున తెల్లవారక పూర్వము ముత్తైదువలు బాలికకు తలంటు స్నానము చేయించి తామును శిరస్స్నానము చేయుదురు. ఈ రోజు సూర్యోదయమునకు ముందే శిరస్స్నానము చేయించుటలో మిక్కిలి పట్టుదలగా నుందురు. ఈ స్నానమును "దొంగనీళ్లు పోయుట" అందురు, దొంగ చుక్క పొడవక మునుపు దొంగనీళ్లు పోయవలెననునది వాడుక. తొమ్మిదవనాడు లేదా పదకొండవ దినమున మరల శిరస్స్నానము చేయించెదరు, స్నానానంతరము మంగలి వచ్చి బాలిక కాలిగోర్లు తీసి గోర్లను రంగుతో అలంకరించును. బాలికతో బాటుగా పేరంటాండ్రును గోర్లు తీయించుకొని గోర్లకు రంగును పూయించుకొందురు, ఈ గోర్లు తీయించుటకొక ప్రత్యేకత కలదు, గ్రామీణ బాలికలు పుట్టినది మొదలు కాలిగోరును కత్తిరించుట (తీయుట) ఎరుగరు, ఈ రోజే మొదటిసారిగా కాలిగోరుపైన గోరుగల్లు (మంగలి గోళ్లు తీయు ఇనుప సలాక) పడును. కాలిగోర్లు తీయించి మరల తలంటి స్నానమును చేయించెదరు. స్నానానంతరము బాలిక చేత నిప్పుకణమును త్రొక్కించి కూరాడులో చేతని వెట్టించెదరు, ఇట్లు చేయుటను బాలికను "ఇంటిలోనికి తీసికొనుట" అందురు.

1. సూడిదలు–కానుకలు–శ.రత్నాకరము–కాని సూడిదలనగా సీమంతమునకు చేయు వివిధములైన పిండివంటలని జనవ్యవహారమున కలదు.

ఆ తరువాత బాలిక నోటిలో ఉప్పును వేసికొని ఇంటిలోని వారిని తాకవచ్చును. ఈనాడే ఆమె ఋతుమతి అయిన కాలదోషము లేవైన యున్న "శాంతి" పెట్ట (జరుపింప)బడును. సాయంత్రము పేరంటము చేసి బాలికకు క్రొత్తబట్టలు కట్టించి, చక్కగా అలంకరించి బంధువులను విందు భోజనముల చేత తనరింప జేయుదురు. ఈనాటి వంటలలో నువ్వులు బెల్లము కలిపి వండిన పులగము ముఖ్యమైన వంట. నేటికిని తెలంగాణ గ్రామములలో ఈ ఆచారములు పాటింప బడుచున్నవి.

ప్రథమ రజస్వల అయినప్పుడు పాటించవలసిన ఆచారములను ధర్మసింధువు ఇట్లు పేర్కొనినది. "ప్రథమ ఋతువునందు నక్షతలచే నాసన మేర్పరచి యందట్టి ప్రథమ రజస్వలా స్త్రీని గూర్చుండబెట్టి పతి పుత్రులు గల పుణ్యస్త్రీలు పసుపుకుంకుమము, గంధము పుష్పమాలికలు, తాంబూలము మొదలగునవి యిచ్చి దీపములచే నీరాజనమిచ్చి దీపముతో గూడిన గృహమందు నామెనుంచవలెను, సువాసినులకు గంధ పుష్ప తాంబూలాదు లిచ్చి లవణము, ముద్గము (పెసలు) మొదలగునవి యీయవలెను. మూడు దినముల పర్యంతము స్పృశింపగూడదు. అభ్యంగము, కాటుక, స్నానము, పగలు నిద్రించుట, అగ్నిని స్పృశించుట, మాంసాశనము, సూర్యావలోకనము, భూమియందు రేఖలు గీయుటయు వర్జింపవలెను. క్రింద పండుకొనవలెను. ప్రయాణము, గంధమాల్యములు, తాంబూలము, గోవుపాలు, పెరుగు, చల్ల మొదలగునవి భక్షించుట, పీట మొదలగునవి ఎక్కి కూర్చుండుట విసర్జింపవలెను.–[1] ఇట్టి ఆచారములను అనుసరించుట ఆచారపరాయణులయిన వారియింట నేటికిని చూడవచ్చును.

బాలిక రజస్వల యగుటతో ఆమె జీవితములోనే క్రొత్త మార్పు వచ్చును. ఈ సందర్భమును పురస్కరించుకొని జీవితానుభవముతో మేళవించిన పాటలు చాల కలవు.

"హరిదిని జనకుల్ల కూతురై బుట్టె
పెరుగుచున్నది సీత పెంపు దీవెనలు
పెంపాయె సందాయె ముఖమున కళలొచ్చె

1. ధర్మసింధువు–తెలుగు అనువాదము. కొల్లూరి రామశాస్త్రి–పుట–204.

కళలొచ్చె మొఖమున ఒక చిన్న మొటిమొచ్చె
నీరజాక్షి వచ్చి నిజమాని పలికె
పొన్నజాక్షివచ్చి "జాన" అని పలికె
నిజమాయె సమర్తలు నిలిచివుండు సీత"

– మొటిమ బాలికల ఋతుదశను తెలుపు చిహ్నము, బాలికలు పుష్పవతులగు దురను భావము కలిగిన నాటినుండియు తల్లులు బాలికల ముఖమువైపు పరిశీలనగా గమనించుచుందురు. "చిన్న మొటిమను" చిత్రముగా తిలకించెదరు. బాలిక సమర్తలాడినదను నిర్ధారణ జరుగగానే ఇరుగింటి పొరుగింటివారిని పేరంటమునకు పిలిచెదరు. వచ్చిన పేరంటాండ్రు బాలిక నిటునటు కదలకుమని ఎవ్వరిని తాకకుండ ఓరగా ఓ ప్రక్కన నిల్చుండ జేసెదరు. క్రొత్తనైన మార్పునకు అలవాటులేక, పేరంటాండ్ర పరిహాసములకు సిగ్గుమొగ్గె ఏమియు తోచని స్థితిలో బాలిక చేతులు విరుచుచు, పాదమును నేల రాయుచు నిలబడును. వెంటనే పేరంటాండ్రు

"కాళ్లు ముదురకు సీత కలియుంగ మునుగు
పుల్లలిరువకు సీత పుట్టిల్లు మునుగు
గోర్లు గొరుకకు సీత గొర్లన్నివురుము.

–అని హెచ్చరింతురు. ఇంతలో

పాయెనే రాముడు బ్రాహ్మణ వాడలకు
రాముండ్ల రాకండ్లు బ్రాహ్మండు చూచి
వచ్చిరీ బ్రాహ్మండ్లు రామునకూ అడ్డమూ
కుర్చీ పీటల మీద కూర్చుండ బెట్టి
ముట్టిరీ పంచాంగం ముత్యాల చెయితో
పట్టిరీ పంచాంగం పగడాల చెయితో
విప్పిరీ పంచాంగం యిగ చెప్పెదమంచు

– ఈ పాటలో రాముడు బాధ్యత తెలిసిన మగవాడుగా బ్రాహ్మణుల చెంతకు వెళ్లినాడు. బ్రాహ్మణులు వచ్చిన రాముని ఆహ్వానించి, కుర్చీపీటల మీద కూర్చుండబెట్టి పంచాంగమును విప్పిరి. వచ్చిన రాముని విషయమేమని వారు అడుగలేదు. అడుగకనే సంగతిని గ్రహించినారు. గ్రామవాసులకు ఒకరింటి

అవసరములు మరొకరికి బాగుగా తెలిసి యుండుట సామాన్యము. విప్పిన పంచాంగమును చూచి రామునితో బ్రాహ్మణులు విడమర్చి వివరములు చెప్పిరి.

"ఆదివారం నాడు నష్టం గిష్టి
గురువారం నాడు పుత్రులు కలుగు
శుక్రవారం నాడు వచ్చు సంపదలు
సోమవారం నాడు మనసీత సమర్త
సకల శుభములు కలుగు.

–బ్రాహ్మణుని మాటలు విని సీత మంచి దినమున సమర్తి లాడినందులకు రాముడు సంతోషపడెను. కౌసల్య చెంతకు వెళ్లి బ్రాహ్మణుల వార్త తెలిపెను. అంత కౌసల్య వాడవాడలకు వెళ్లి ముత్తైదువలను ఆహ్వానించినది.

"కౌసల్య వాయెనే బాపనోడలకు
బాపనక్కలారా మా రాములా సీత సమర్తలాడింది
చూసివత్తురు రండి ఓ వనితలార
పాయెనే కౌంసల్య కోమటాడలకు
కోమటి వనితలార, మా రాములా సీత సమర్తలాడింది
చూచివత్తురు రండి ఓ సుదతులార

– ఆహుతులైన ఆడవారు పరుగు పరుగున వచ్చిరి.

"పసుపు కుంకుమ దీసుకు పణతులొచ్చీరీ
కొబ్బెర బెల్లము దీసుకు కాంతలొచ్చీరీ
నువ్వులూ నూకలూ దీసుక నళినాక్షులొచ్చిరి
నాన బియ్యమూ దీసుక వణిజాక్షులొచ్చిరి

– వచ్చిన పణతులు నిండు వందిరిలో నిలుచుండి

"తెల్లన్ని బట్ట పరువరే సీతకు–కుడికాలు ముందుంచి కూర్చోవే సీత
పచ్చన్ని పసుపు పులుముకోవే సీత–చెంపనా మసిబొట్టు పెట్టవే సీత
నూనెల్ల పసుపుల్ల తేలవే సీత–చిన్నారి రామున్ని మెప్పించవే సీత

అయోధ్య పట్టణం ఏలుకోవే సీత
సక్కన్ని బాలున్ని కనుక్కోవే సీత–[1]

– అని పలికిరి. ఏ శుభ కార్యమునందైనను కుడికాలు ముందుంచి కూర్చుండుట తెలుగువారి ఆచారము. సమర్తలాడిన కన్యలను ఇతరులెవ్వరును తాకరాదు కనుక ఆమెనే పసుపు పులుము కొను మనియు, మసిబొట్టు పెట్టుకొను మనియు సూచనలు చేసిరి. ఈ పాట పూర్తిగా గ్రామవాతావరణములో అల్లబడినది. "గోర్లు కొరుకకు సీత గొర్లన్ని వురుము", పాయెనే రాముడు బ్రాహ్మణ వాడలకు, కౌసల్య పాయెనే బాపనోడలకు, పాయెనె కౌసల్య కోమటాడలకు" –మొదలైన చరణములు సామాన్య ప్రజల జీవితము ను తెలుపుచున్నవి. సీత జనక మహారాజు కూతురు. ఆమెకు గొర్రెల మందతో ప్రత్యక్షముగా సంబంధమేదియు లేదు. గోర్లు కొరికిన ఎడల గొర్రెలు నశించునని హితము చెప్పనక్కరలేదు. గోర్లు కొరికిన మీ కోటలు కూలి పోవుననియో, మరియొక నష్టము సంభవించుననియో చెప్పుట రాజవంశము నకు తగినది. కాని ఇట సామాన్య గ్రామ వాతావరణమే కల్పింపబడినది.

అట్లే అత్త కౌసల్య తన పెద్దకోడలు పుష్పవతియైనట్లు తెలిసి సంతోషము పట్టలేక బ్రాహ్మణ వాడలకు, కోమటుల వాడలకు స్వయముగా వెళ్లవలసిన అవసరము లేదు. ఆమె, దశరథ మహారాజు పట్టపు దేవి. కనుసైగతోనో, చేసైగ తోనో తన పనులు చేంయిచుకొనగలిగిన పరిజనము అంతఃపురమంతటను కలిగినది.

కాని ఈ పాటను సృష్టించిన జానపదమాతలు రాణివాసములోని సీతమ్మను రాజకుమార్తెగా కాక తమ సామాన్య దృష్టితోనే చూచినారు. కనుక ఈ పాటలను మనము ఔచిత్య దృష్టితోగాక జనపద పరిసర దృష్టితోనే ఆస్వాదింపవలెను.

పై పాటలో వలెనే సీత అత్తింట సమర్తలాడినట్లు "స్త్రీల రామాయణపు పాటలలోను" కలదు. అంతేగాక ఈ పాటలోని సీత గూడ సమర్తలాడిన దినము సోమవారము–

1. నేను సేకరించినిది. పాడినవారు, అరుణ–రాంనగర్. హైద్రాబాదు.

"అప్పుడు పంచాంగమ్ములు విప్పిజూచి మునులెల్లా
మంచిది హస్తనక్షత్రము పంచమి సోమవారమ్మా
మంచిదైన నభిజితు మంచి ముహూర్తమె రామచంద్రా
పరమపతి వ్రతయై యుండును పలువురు పుత్రులగనును
పట్నపురాణై రాజ్యము పాలించును రామచంద్రా"-[1]

- సోమవారము దినము సమర్తలాడుట మంచిదను నమ్మకము ప్రజలలోనున్నట్లు గమనింప వచ్చును. ఈ పాటలోని కౌసల్య పైపాటలో వలె తానే స్వయముగా వాడవాడలకు వెళ్లలేదు.

"కడువేడుక కౌసల్య ప్రేమతో చెలులను బిలచి
పేరంటాండ్రను బిలువమని వేడుక జేయగవలెనూ"-[2]

- అని పేరంటాండ్రను బిలుచుపని చెలులకే అప్పజెప్పినది. ఈపాట లోని వివరణయంతయు రాజోచితముగా నున్నది.

"సువ్వి రామ చంద్ర సువ్వి-సువ్వి కీర్తి సాంద్ర సువ్వి
సువ్వి సీతమ్మ మాకు శుభములిమ్మా
సృష్టిలోను సీతమ్మ సమర్త కొట్నాలుదంచ
వేడ్కతో పేరంటాండ్రు వేగవచ్చిరి."-[3]

ఇదే పాటలో

పువ్వుల బంతులు జుట్టిరి పొలుపుగ జానకికపుడు
పాడుచు దంచిరి చిమ్మిలి ...."

అని చిమ్మిలి ప్రసక్తి వచ్చినది.

చిమ్మిలి అనగా నువ్వులు బెల్లము కొట్టిచేసిన ఉండలు-[4] సమర్త సమయమున నువ్వులు, బెల్లముతో బాటుగా కొబ్బరను కూడ దంచి చేసిన ఉండలని గ్రహింపవలయును. తెలంగాణ ప్రాంతమున ఈ సందర్భమున వాడు నువ్వులు,

---

1. స్త్రీల రామాయణపు పాటలు - పుట - 93 2. అందేపుట-93
3. స్త్రీల రామాయణపు పాటలు-పుట-94 మరియు స్త్రీల పాటలు-ఎస్.వి.గోపాల్ అండ్ కంపెని, మదరాసు-1, పుట 66
4. శబ్ద రత్నాకరము.

నూకలు, కొబ్బెర, బెల్లము, పొడిపొడిగానే ఉంచుదురు. కనుక నచ్చట "చిమ్మిలి" అను పదమునకు ప్రాధాన్యము లేదు. చిమ్మిలి అను పదమునకు తాపీ ధర్మారావుగారు వ్యుత్పత్తి చెప్పిరి-గ్రీకు భాషలో నువ్వులకు వాడె "సిసీం", తేనెకు వాడె "మిలాయ్" అను పదములు సమాసమైన "సిసెమ్మిలాయ్" అను పదము చిమ్మిలికి మూలము.-[1] వీరు పేర్కొనిన తేనెకు మారుగా నేడు బెల్లము వాడుట ఆచారములో కనిపించుచున్నది.

మధ్య తరగతి కుటుంబములలో బాలిక వుట్టింటిలో సమర్తలాడిన సంబరమును క్రింది పాటలో చూడవచ్చును.

"సువ్వియనుచు పాడరమ్మా-సుందరాంగులు చూడరమ్మా
నవ్వుమాటగాదు కొమ్మా-నాతి సంర్తలాడెనమ్మా
యవ్వనంబు చాలదమ్మా-ఏమి ఎరుగని బాలికమ్మా
తెల్ల చీరె కట్టెనమ్మా-తోయజాక్షి ఎరుగదమ్మా
తల్లి జూచి చెప్పెనమ్మా-తలపంచి నవ్వెనమ్మా
విప్రవరుని బిలువరమ్మా-విడియము సమర్పించరమ్మా
విప్పి పంచాంగము చూడగనే-యుక్తమైన నక్షత్రమానె
భాసురాంగి అత్తవారికి-శుభరేఖలు-[2] పంపేరమ్మా
పచ్చికొబ్బెర పంచదార-పణతులందరు త్రొక్కిరమ్మా
మంచి శెనగలు పంచదార-పంచిపెట్ట సాగిరమ్మా-[3]

- పై పాటలన్నింటిలోను బాలికలు వివాహనంతరమే సమర్తలాడినట్లు కలదు. ఈ పాటలు బాల్య వివాహములు ప్రచారమునందున్న సమయమునుండి పాడబడుచున్నవై యుండును. పూర్వము రజస్వలా పూర్వ వివాహములను జరిపెడివారు. "అష్టవర్షా భవేత్ కన్యా" అనుట ఈ విషయమునే బలపరుచుచున్నది. పరాశరుడు సమర్త కాక పూర్వమే వివాహము చేయవలెనని పేర్కొనెను.-[4]

---

1. పెళ్లి-దాని పుట్టు పూర్వోత్తరాలు-పుట-124
2. శుభలేఖలు (లకారము రకారముగా పలుకుట కొన్ని మండలములలో గలదు)
3. తెలంగాణా పల్లెపాటలు-పుట-109
4. పరాశరస్మృతి-ప్రాయశ్చిత్త కాండము. అధ్యా, 7 శ్లో. 6.

థామస్ జె. హాప్కిన్స్ వివాహ వ్యవస్థను తెలుపుచు ఇట్లు వివరించిరి "వేదకాలములో కన్యలకు రజస్వలానంతరమే వివాహములు చేయువారని తోచుచున్నది. కాని ధర్మ శాస్త్రముల కాలమున, కనీసము బ్రాహ్మణకన్యలకు రజస్వల యగుటకు పూర్వమే వివాహము జరుపవలసి యుండెను. వివాహము నేర్పాటు చేయుట తండ్రి బాధ్యత. అవివాహితయగు రజస్వల ప్రతి ఋతుకాల మున ఒక భ్రూణహత్య చేసిన పాపము తండ్రికి కలుగునని ధర్మశాస్త్ర గ్రంథములు నిందించినవి. క్రీస్తువశము ఆరేడు శతాబ్దములలో బ్రాహ్మణ కన్యలకు వివాహము ఉపనయనసంస్కారముగ భావింప బడినది. అందుచేత వివాహము ఎనిమిది-పది సంవత్సరముల మధ్యన జరుపుట ఆచారమయినది. కాని వివాహఫలమైన పునస్సంధానము మాత్రము రజస్వలానంతరమే జరుగుచుండెను. -[1]

పూర్వము రజస్వలా పూర్వ వివాహములు జరిగిన కన్యలకు ప్రథమ రజస్వలానంతరము చేయు వేడుకలలోనే శోభనమును జరిపించెడివారు. కనీసము పదునెనిమిది సంవత్సరములకు తరువాత పెండిండ్లు జరుగ వలయుననియు, కుటుంబ నియంత్రణమును పాటింప వలెననియు భావింపబడుచున్న నేటి కాలమున ఈ ఆచారము వింతగా కనిపించును. వివాహ మంత్రములలో "దశాస్యాన్ పుత్రాన్ అధేహి పతిం ఏకాదశం కృధి" అని పేర్కొనబడినది. అనగా పదిమందిని కని భర్తను పదునొకండవ పుత్రునిగా భావింపుము అని అర్థము. కనుక సంతానమును ప్రధానముగ భావించు కాలమున బాల్య వివాహములు జరిపించుట, తొలిసారిగా రజస్వల అయిన వెంటనేగర్భాదాన ముహూర్తమును నిర్ణయించుట సామాన్యవిషయము. అందువలననే "సమర్త" వేడుకలు ఘనముగా చేయబడుచుండెను. నేటికిని వివాహము కాని కన్యల విషయమునను ఈ వేడుకలు వివాహపు వేడుకలను మించి జరిపించువారు కలరు.

వివాహము :

వివాహమనునది పవిత్రమైన సంస్కారము; స్త్రీ పురుషులనిద్దరిని చతుర్వర్గ సాధనమునకై కలుపునట్టి సంస్కారము, షోడష సంస్కారములలో వివాహము ప్రధానమైనది.

1. The Hindu Religious Tradition-Thomas J. Hopkins Page-78.

వివాహమునకు మన భాషలో పెక్కు పర్యాయ పదములేర్పడినవి. ఈ పర్యాయపదములు వివాహవ్యవస్థ చరిత్రను గూడ తెల్పుచున్నవి. అమరకోశ కారుడు "…. …. ….వివాహెూపయమౌ సమౌ; తథా పరిణయెూ ద్వాహెూపయామాః పాణిపీడనం"–[1] అని పర్యాయములను పేర్కొనెను. విశేషేణ వహనం వివాహః. 1. వహప్రాపణే ఉపయమనం ఉపయమః 2. పరిణయనం పరిణయః ణీఞ ప్రాపణే; 3. ఉద్వహనం ఉద్వాహః వహప్రాపణే; 4. ఉపయమః , ఉపయామః యమ ఉపరమే. 5. వరపాణి నా వధూపాణే; పీడనం గ్రహణం పాణి పీడనం. వరుని హస్తముచేత వధూహస్తమును బట్టుట పాణిపీడనము.

మనువు గృహస్థాశ్రమ ప్రాశస్త్యమును ముక్త కంఠముతో చెప్పినాడు. "సకల జీవులకును వాయువు ఎట్లు ముఖ్యాధారమే గృహస్త్రాశ్రమముగూడ అన్ని ఆశ్రమములకును ఆధారము. బ్రహ్మచర్య. వానప్రస్థ, సన్యాసాశ్రమముల వారు గృహస్థాశ్రమము నుండియే జ్ఞానమును, ఆహారమును పొందుచున్నారు. అందువలన గృహస్థాశ్రమము శ్రేష్ఠమైనది. స్వర్గమును, ఐహిక సుఖములను కోరునట్టివారు గృహస్థాశ్రమమును ఆశ్రయించవలెను"–[2] ఇతర ధర్మశాస్త్ర కారులును గృహస్థాశ్రమ ప్రాశస్త్యమును ఇట్లే కొనియాడిరి.

గృహస్థాశ్రమమున నడుగిడుటకు వివాహసంస్కార మత్యవసరము, వివాహ సంస్కారము లేనిది సంఘమున కుటుంబమునకు పరిగణనము ఉండదు. వివాహమును గురించిన అభిప్రాయములు ప్రాచ్యపాశ్చాత్య విద్వాంసులలో పెక్కు విధములుగ నున్నవి. డా॥ విద్యా చౌహాన్‌గారు వివాహము సృష్టి వికాసమునకు ఒక ధార్మిక సాధనము కాని కేవలము శారీరక వాంఛలను తీర్చుకొనుటకు కాదు"–[3] అని పేర్కొనినారు. డా॥ సి.బి. మమోరియా గారిట్లభిప్రాయపడు చున్నారు. "మన సాంఘిక వ్యవస్థలో ప్రధానమైన, రెండు లక్షణములు– కుటుంబము మరియు వివాహము. కుటుంబములేక జాతి రక్షణ సంస్కృతి రక్షణ జరుగదు; వివాహము లేక కుటుంబముండదు. వివాహమునకు కారణములు

1. అమర కోశము,
2. మనుస్మృతి. అధ్యాయము 3. శ్లో. 77–79.
3. లోక్‌గీతోంకీ సాంస్కృతిక్ పృష్ఠభూమి (హిందీ)–విద్యాచౌహాన్ పుట–111.

రెండు, ఒకటి సాహచర్యము, రెండు సంతానోత్పత్తి. చాల మంది సాహచర్యమునే ఎక్కువ వాంఛింతురు."–[1].

ఆధునిక శాస్త్రజ్ఞులలో పి. గిస్బర్ట్ అనునతడు ప్రజలు వివాహమాడుటకు గల కారణములను, వాంఛలను తెలుపుచు "కామప్రేరణము, పితృవాత్స ల్యము, తమ పేరును ఆస్తిని తరువాతి తరములకు అందజేయవలెనను వాంఛ. ఆర్థిక భద్రతావశ్యకత, సహకారము, వృద్ధాప్యమున స్నేహ సహాయములకభయము, జీవితములోని సుఖదుఃఖములను, జయాపజయములను పంచుకొనగల భాగస్వామిని పొందవలయునను ఆశ మొదలైనవి"–[2] అని పేర్కొనిరి.

వివాహమును గురించి ఇతడే మరియొక చోట ఇట్లు అభిప్రాయపడెను: "ఇటీవల సాంఘిక శాస్త్రములలో జరిగిన పరిశోధనలను బట్టి వివాహమను పదమునకు అర్థము క్లిష్టమైనది వివాహమనగా రెండు విభిన్నజాతుల (స్త్రీ పురుషుల) చేరిక. ఇది పవిత్రమైన బంధము. అన్నిటి కన్నను రెండు ఆత్మల సమాగమము. ఫ్రాయిడ్మనస్తత్త్వ శాస్త్రప్రకారము వివాహము తృతీయ పురుషార్థశక్తి విడుదల, వివాహము శారీరకమైన అవసరమునకే గాక జీవితాశయముయొక్క పరిపూర్తిని పొందుటకు గూడ తోడ్పడును. ఈ సంధ్భములో వివాహ సాధారణ లక్షణమును చెప్పుట కష్టము"–[3]

వెస్టర్ మార్క్ వివాహమును సాంఘిక వ్యవస్థగా పేర్కొనుచు ఇట్లు నిర్వచించెను :– "ఒక పురుషునికిగాని పురుషులకుగాని, ఒక స్త్రీ తోగాని పెక్కుమంది స్త్రీలతోగాని ఆచారము (custom) వలననో, చట్టము (Law) వలననో గుర్తింపబడిన సంబంధము వివాహము. ఉభయులు చేరుట వలనను,

---

1.Social Problems and social Disorganisation in India Dr. C. B. Mamoria - Page - 172.

2. Fundamentals of Sociology - P. Gisbert pages-88-89 "........Such are the sex impules, parer tal affection, the wish to transmit ones name and property to posterity" the need for economic security and co-operation, to guarantee help and friendship forold age, and to have a partner in life with whom one man share life's joys and sorrows, sucess and failure."

3. Sociology - George A. Lunde Berg & others-Page-552

వారికి జనించు సంతానము విషయమునను కొన్ని హక్కులును, విధులును ఈ సంబంధమునందుండును.......వివాహమనునది క్రమబద్ధమైన లైంగిక ప్రవర్తనములకన్నను విశిష్టమైనది. ఇది ఉభయ వర్గముల అధికారమును వివిధరీతులలో ప్రభావితము చేయు ఆర్థిక వ్యవస్థ కూడ"–[1]

బ్రిఫ్ఫాల్ట్ మరికొందరు విద్వాంసులు తప్ప తక్కిన సమకాలిక శాస్త్రజ్ఞులందరును వివాహోద్దేశ్యమును గురించి "వివాహమూలోద్దేశ్యము సంతానోత్పత్తి, తద్వార కుటుంబమును శాశ్వతముగా కొనసాగించుటయే" యని అభిప్రాయపడుచున్నారు. –[2]

ఆంగ్లమున "Marriage" అను పదమును మనమిప్పుడు వివిధార్థములలో వాడుచున్నాము. వాస్తవముగా "Marriage" అను పదమును "Wedding, nuptial or matrimony" అను పదములకు పర్యాయముగా వాడుచున్నందున ఆ మాటలు వివాహపు అస్పష్టతను ప్రతిబింబింప చేయుచున్నవి. చివరి Matrimony అను పదము మాత్రమే ఒక వ్యవస్థ కావచ్చును. –[3]

హిందువుల వివాహ, కుటుంబముల విషయమునను పైన పేర్కొనిన ఆలోచనలు సాధారణముగా అన్వయించును. ఎందుకనగా వివాహము వలన ఒక వ్యక్తి గృహస్థాశ్రమమున తన జీవితమును ప్రారంభించుటకై సమర్థుడగుటకు వెళ్లవలసియున్నందున వివాహము అతి ముఖ్యమైన కర్మకాండ అనియు, లాంఛనము అనియు చెప్పవలసియున్నది. "వివాహము అను పదమునకు అర్థము వధువును వరుని యింటికి మోసుకొని పోవుట (వి + వహ్ = మోసుకొనిపోవుట).

---

1. A short History of Human marriage by E. Westermarck Page-26
2. Social organisation-Lowie Robert H-Page. 93.
3. Folkways- W G. Sumner - Page-349 "Marriage" has always been an elastic and variable usage, as it now is Infact the use of of language reflects the vague ness of marriage, for we use the word "marriage" for wedding, nuptial or matrimony (wedlock) Only the last can be an institution.

కాని ఈ పదము తన పరిమితార్థమును కోల్పోయి అనాది కాలము నుండియు "వివాహ తంతు అంతటికిని వాడబడుచున్నది."–[1]

పై చర్చము బట్టి "సాహచర్యము, భరించుట, సంతానవాంఛతో స్వీకరించుట" అనునది వివాహ లక్ష్యములని స్పష్టమగుచున్నది.

వివాహ సంప్రదాయములు రెండు విధములు. ఒకటి శాస్త్రాచారము రెండు లోకాచారము. శాస్త్రాచారము ప్రకారము వివాహము వేద కల్పసూత్ర నిబంధ ప్రయోగ గ్రంథములలో చెప్పబడు తీరున జరుగును. సామాన్యముగా మను ధర్మ శాస్త్రము ఏర్పరచిన నిబంధనలే వివాహ విషయములలో అనుసరించెదరు. లోకాచారము ప్రకారము జరుగు వివాహము వాగ్రూపమున సాధారణముగా కులపెద్దలు మరియు కులస్త్రీలు సంప్రదాయ సిద్ధముగా జరిపించునది. ఇందు ముఖ్యముగా స్త్రీలకే ప్రాధాన్యముండును. దీనిని స్త్రీ అచారమని కూడ చెప్పవచ్చును.

ప్రాచీన ధర్మ శాస్త్రకారులందరును బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య, అసుర, గాంధర్వ, రాజస, పైశాచములను అష్టవిధ వివాహములను పరిగణించిరి.–[2] సాధారణముగా భారతీయ వివాహములన్నియు ఈ విభాగము ననుసరించినవి యైనను జనపద ధర్మములు ఈ పరిధిలోనికి రావు, జనపద ధర్మములను పాటించి వివాహములు జరుపుకొన వచ్చునని అశ్వలాయన గృహ్యసూత్రము–[3] పారస్కర గృహ్యసూత్రము–[4] ఒప్పుకొనినవి. గ్రామ వచనము ప్రకారము వివాహమరణాదికర్మలు జరుగవలెననియే వారి అభిప్రాయము.

"అసపిండా చయా మాతురసగోత్రా చయాపితుః
సాప్రశస్తాద్విజాతీనాం దార కర్మణి మైథునే

1. Hindu Social organization - A study in Socio-Psychological and idelogical foundations-Pandarinath H Prabhu Page-148-9
2. మనుస్మృతి. 3–21 ;
3. ఆశ్వలాయన గృహ్య సూత్రము 1–7–1
4.. పారస్కర గృహ్యసూత్రము 1–8, 11–13

-తేన మాతామహాది వంశజా జాయనభవతీత్యర్థః"-[1]

-అనగా ఏడు గోత్రములకు భిన్నమైన వంశములో పుట్టినదియు, ప్రశస్త కులజురాలును అగు కన్యనే భార్యగా స్వీకరించవలెనని మనువు చెప్పెను. మాతా మహాది వంశజురాలిని స్వీకరించరాదని స్పష్టపరచెను. గౌతమ ధర్మ సూత్రముగూడ ఇట్లే చెప్పెను.[2]- కాని దేశములోని ఒక ప్రాంతమున ఆచారములోనున్న "దాతుల పుత్రీ" వివాహమును వాత్స్యాయనుడు కామసూత్రములలో ప్రస్తావించెను. మాతుల పుత్రీ వివాహము దాక్షిణాత్యులలో ముఖ్యముగా తెలుగువారిలో ప్రబలముగా నున్నది. -[3]

ఆసుర, రాక్షస, పైశాచ వివాహములను పరిశీలించినప్పుడు అనాది జాతులలోని కొన్ని విచిత్రమైన వివాహ సంప్రదాయములు అట్టివేమో అనితోచుచున్నది. ముండా మున్నగు అనాది జాతులలో కొన్ని వింత వివాహ సంప్రదాయములున్నవి. కన్యను బలవంతముగా ఎత్తుకొని పోయి పెండ్లాడుట కన్య స్వయముగా అభిసారికవలె వచ్చి వరుని యింటిలో గృహకృత్యములు చేయుచు వరుని తల్లి దండ్రులు మున్నగు పెద్దలను మెప్పించి పెండ్లాడుట, కన్యను శుల్కమిచ్చి ఇంటికి తీసికొని వెళ్లుట, పరస్పరాభిప్రాయముతో కలసిపోవుట మున్నగు పద్ధతులు చాలగలవు. ఇట్టి అనిశ్చిత వివాహ పద్ధతులకే ధర్మశాస్త్రజ్ఞులు అష్టవిధ వివాహములని శాస్త్రముద్రవేసి యుందురు."-[4] అని డి.ఎస్. మజుందార్ అభిప్రాయపడుచున్నారు.

పాశ్చాత్యులలోను మనదేశములోని కొన్ని ప్రాంతములలోను ఉన్న దేశీయాచారములను విలియమ్ గ్రాహామ్ సమ్నర్ ఇట్లు తెలిపినాడు. "గ్రీకులలో పురుషుల పునర్వివాహముపట్ల వైముఖ్యము ఉండెడిది, గ్రీసులోని కొన్ని ప్రాంతములలో సంతానమున్న పురుషుడు రాజకీయనిబంధనల వలన ద్వితీయ వివాహము చేసుకొనక నిషేధింపబడినాడు. కుటుంబముపై ప్రేమలేని వానికి

1. మనుస్మృతి 3-5 ; 2. గౌతమ ధర్మ సూత్రములు - 4-1
3. Some aspects of Social Life in Ancient India-Sandhya Mukherjee. Page-200
4. Races and Cultures of India - D.N. Majumdar, Pages-197-198

దేశముపైనను భక్తి శ్రద్ధలుండవని ఆనియమములలో తెలుపబడినది. –[1] మరియొక విచిత్రము దక్షిణ భారతములోని బ్రాహ్మణులు వృక్ష వివాహము చేయుట. సోదరులలో చిన్నవాడు పెద్దవానికి ముదు వివాహము చేసుకొనకూడదను విశ్వాసము దక్షిణ భారతములో గలదు. చిన్నవానికి పెండ్లాడవలెనను నభిప్రాయ మున్నను, ప్రయోజనము లేదు. చిన్నవాడు తప్పనిసరిగా పెద్దన్నకు ముందే వివాహమాడదలచిన ఒక పద్ధతి కనుగొనబడినది. పెద్దన్న ఒకచెట్టుతో వివాహము చేసుకొనును (బహుశా దీని అభిప్రాయము వృక్షాధిష్ఠాన దేవతతో వివాహము కావచ్చును) దీని వలన చిన్న తమ్ముని మార్గమునుండి అతను తొలగినట్లగును; చిన్న తమ్ముడు నిరాఘాటముగా వివాహమాడవచ్చును. –[2] ఇట్లు దేశీయాచార ములు పలువిధములు.

కమలాకర భట్టు నిర్ణయసింధువు, నారాయణ భట్టు ప్రయోగరత్న. సంస్కార కౌస్తుభమను ధర్మశాస్త్ర గ్రంథములందు స్థానిక ఆచారములతో షోడశ సంస్కారములు జరుపుకొన వచ్చునని సెలవిచ్చియున్నారు. కావుననే ఒక వర్గమువారి వివాహాచారములు రెండవ వర్గము వారి ఆచారములకంటె భిన్నముగా గోచరించు చుండును. ఆచరణలో తరతమ భేదములు పైకి కనబడినను ప్రధాన సూత్రములో మార్పుండదు.

వివాహములలో శాస్త్రాచారము, లోకాచారము లెట్లుండునో తెలుపుటకు నీ క్రింది పట్టిక తోడ్పడగలదు.

శాస్త్రాచారము	లోకాచారము
1. లిఖితగ్రంథ ప్రామాణ్యము	– వాగ్రూపమైన పరంపరాగత సంప్రదాయము
2. ధర్మశాస్త్ర గ్రంథానుశాసనము	– ముదుసళ్లు, తక్కిన పెద్దల అధికారము
3. పురుషుల ఆధిక్యము	– స్త్రీ ప్రాధాన్యము
4. మంత్ర హెూమాదుల ఆచరణ	– పాటలు, తంతువులు
5. దర్భ, యజ్ఞోపవీతము,	– నూనె, పసుపు, తమలపాకులు.

1. Folkways-W G. Graham-Page-390.
2. Ibid. Page 393

శాస్త్రాచారము	లోకాచారము
చందనము, నేతి దీపము ప్రధానము.	– కాటుక, పువ్వులు, కుంకుమ, సుగంధద్రవ్యములు.
6. దైవజ్ఞుడు నిర్ణయించిన వివాహకాలము.	– నిర్ణయింపబడిన కాలమొకటి యున్నను స్త్రీలకు వీలగుకాలము
7. వధూవరులలోనెవరి ఇంటనైనను వివాహము జరుపవచ్చును.	– సాధారణముగా, కన్యాదాత గృహమునందు.–[1]

ఈ విధముగా శాస్త్రాచారము. లోకాచారము భేదించుచున్నను సామాన్యముగా రెండును కలపి మన వివాహాచారములలో కనబడుచున్నవి. అంతేగాక మన సంఘమునందు ఆర్య ద్రావిడ జాతి జనుల కలయిక వలన వారి ఆచారములును సమ్మేళనముచెంది ఒక నూతన సమన్వయమేర్పడినది. మన సాంఘికాచారములన్నింటిలోను ఆర్యుల సంప్రదాయములును, దేశీయ సంప్రదాయములును సమ్మిశ్రితములైనవి.

ఋగ్వేద కాలమునాటికి కొద్దిపాటిగా నున్న వివాహాచారములు అధర్వవేదము నాటికి ఎక్కువై, గృహ్యసూత్రముల కాలము నాటికి లోకాచారము ననుసరించి ఆచారములనంతములుగా బయలుదేరినవి.

హిందువుల వివాహాచారములు కాలానుగుణముగా మారుచు వచ్చినవి. నేటికాలమున వివాహమునందు ఆర్యాచారములు, దేశీయ పద్ధతులు కలగలుపుగానుండి విడదీయరాని విధముగా ప్రచారమునందున్నవి. పాణిగ్రహణము, సప్తపది, సన్నెకల్లు ద్రొక్కుట–మున్నగునవి ఆర్యాచారములు. కావుననే వీనికి వైదికమంత్రములున్నవి. మంగళ సూత్రధారణము దేశీయాచారముగా పాటింపబడుచున్నది. దీనిని మంత్రములలోగాక శ్లోకములతో నడుపుచున్నారు. తాళికట్టుట అను సంస్కారము జనులలో బహుళవ్యాప్తినందినట్లు కనిపించును. క్రైస్తవ కుటుంబములు గూడ కొన్నికొన్ని వధువునకు మంగళ సూత్రధారణము చేయించుచున్నవి.–[2] మంత్రభాగ మంతయు సంస్కృతములో

1. Brahmanic Ritual Tradition - B. N. Saraswati Page-165-6
2. లక్ష్మీరంజన వ్యాసావళి. పుటలు–118, 119.

నుండుట చేతను, ఆ భాష ప్రాంతీయ భాష మాట్లాడు ప్రజలకు దురవబోధమగుట చేతను కేవలము వాని యందుగల గౌరవముచేత పురోహితుని పిలిపించి వానిచో నాలుగు మంత్రములను చదివించి పుస్తెగట్టు సమయము వరకు ఆ పురోహిత సహాయమును పొందెదరు. వివాహాచారములు కొన్ని ఆయా దేశభాషలలో వాగ్రూపములు గాను, పాటల రూపమునను నిలచినవి.

నేటి కాలమున అనుకూలము లేకనో, ఆర్థిక స్థితి లోపము వలననో మరియే యితర ఆకస్మిక కారణముల వలననో వివాహ సంప్రదాయములు పాటించుట తగ్గిపోవు చున్నది.

లోకాచారము నందు వివాహ సంప్రదాయములకు స్త్రీల పాటలు పట్టుగొమ్మలై నిలచినవి. ఈ భాగమున స్త్రీల పాటలలోని గేయముల నాధార పరచుకొని సంప్రదాయములను పేర్కొనుట జరిగినది.

గృహ జీవనములో జరుగు వేడుకలు చాల వరకు స్త్రీలకు సంబంధించి నవిగనే యుండును. పసుపు, కుంకుమ, పరిమళములు, అలంకరణములు, నగలు మొదలగునవన్నియు వారి సొమ్ములైనట్లుగానే, వివాహసమయము నందలి పాటలును వారి ప్రత్యేకతనే వ్యక్తపరచును. స్త్రీల పాటలలో పెండ్లి పాటలు ఒక విశిష్టమైన స్థానమును సంపాదించుకొనినవి. నలుగుపాటలు, కొట్నముల పాటలు, నాగవల్లి పాటలు, అల్లుని మీది పాటలు, అత్తగారి మీది పాటలు, అలుక పాటలు. తలుపుదగ్గర తగువు పాటలు, వియ్యపు రాండ్ర విందుల పాటలు–మొదలగునవి యెన్నియెూయున్నవి. నిత్యజీవితములో కంటెను వివాహసందర్భమున హాస్యపుపాటలు అధికము. ప్రాచీన సంప్రదాయపు కట్టుబాట్లలో బంధింపబడిన సాహిత్యములో పెండ్లి పాటలు ఒక ప్రామాణికమైన శాఖయై విలసిల్లినది.

యుక్తవయస్సు వచ్చిన కూతురునకు తగిన వరునిని వెదకుటతో పెండ్లి సంభ్రమము ప్రారంభమగును. వరుడు ఎట్టివాడు కావలయునను విషయమున చర్చలు జరుగును. ఈ సందర్భమున సంస్కృత చాటువొకటి అనుసంధింప దగినది.

"కన్యావరయతే రూపమ్, మాతా విత్తమ్, పితాశ్రుతమ్
బాంధవాః కులమిచ్ఛంతి, మిష్టాన్నమితరే జనాః"

– కన్య వరుని రూపమును కోరును, తల్లి వరుని ఆస్తిని కోరును. తండ్రి వరుని విద్యను కోరును, బంధువులు నుంచి కులమయిన చాలునందురు. తక్కినవారు కోరునది పిండివంటల భోజనము.

వరుని వెదకుట :–

కన్య తల్లిదండ్రులు మొదట తమ కూతురుసకనుకూలమైన సంబంధమును నిర్ణయించుటలో కడు జాగరూకతతో ప్రవర్తించెదరు. కన్య పుట్టింటిలో మెలగిన పరిస్థితులెటువంటి వయినను, మెట్టినింటి జీవితము అతి ముఖ్యమైనది. తాను అనుభవించు సుఖసంతోషములు, కష్టనష్టములన్నియు మెట్టినింటివారితోనే ముడిపడి యుండును. అందులోను చేబట్టిన వరునిపైననే ఆమె భవిష్యత్తంతయు ఆధారపడి యుండును. అందుకనియే వివాహమనునది నూరేండ్ల వంట.

పెండ్లి అనిన వధువు వరుడు ఇద్దరూ ముఖ్యమే అయినను పెండ్లి సంప్రదింపులలో వధువువైపు వారు ముందడుగిడుట సంప్రదాయము, వధువు తల్లిదండ్రులు తెలిసిన వారితో అమ్మాయికి తగిన వరుని వెదుకుమని కోరెదరు.

కన్యకు ఈడుజోడైన కాంతున్ని వెదకిరండి
రూపుగలవాని, కీర్తికాంతుని, ఆచారవంతున్ని అరసిరండి
వరదక్షిణెంతైన ప్రీతితో ఇత్తుమని ఒప్పుకొని రండి
తేజీలు గజములు ఎన్ని గావలసిన కాదనక ఇత్తుమనుడి
వస్తువాహనములు వరుసతో భూమియును అడిగినంత అవుననుడి
యివ్వగల పైడిసొమ్ముల నిత్తుమనుడి--కావలెననిన కట్నములు కలవనుడి–[1]

– నచ్చిన వరుడున్న వధువు తల్లిదండ్రులు కట్నము వీలయినంత ఎక్కువగా ఇచ్చియైనను వరుని తమ అల్లునిగా చేసికొనుటకు వెనుకాడరు. అందులోను ధనవంతులై యున్న చెప్పనవసరములేదు. వరుని అరయవెళ్లిన పెద్దల రాకను పసిగట్టిన వరుని పక్షము వారు తమ అబ్బాయి యొక్క గొప్పతనమును చెప్పుదురు.

1. నేను సేకరించినది. పాడినవారు : శశిరేఖమ్మ–మలక్‌పేట,

వరుని విచారింప వస్తిరో మీరు
వరుడు మా అబ్బాయి-వజ్రాలహారము,
విద్యబుద్ధులు మీరు అరయంగ వస్తిరా
సరసుడు చదువంగ సభ యంత మెచ్చు
సుందరంబును మీరు చూడంగ వస్తిరా
పున్నమ చంద్రుని బోలు మావాడు
వస్తువాహనముల వరుసలు జూస్తిరా
ధనకుబేరుండు తన యందు దాగియుండు
చిన్నవాడు, సిరిగలవాడు, చీకాకు లేనివాడు
వియ్యమందిన మీకు విభవంబు గూడు-[1]

ఇంతేగాక ఆడుపెండ్లివారు మగపెండ్లివారు కులగోత్రములను గురించి లోతుపాతులనెరుంగుటలో అతి జాగరూకులై యుందురు. అందువలననే "గోత్రమెరిగి పిల్లను, పాత్రమెరిగి దానము ఇయ్యవలె" నను వాడుక ఏర్పడినది.

పిల్లవాడు, పిల్లవాని వంశము నచ్చిన యెడల పిల్ల తల్లిదండ్రులు సంప్రదించుకొని సంబంధము చేయుటకు నిశ్చయించుకొని

అల్లపూరీవారు పిల్లనడిగేరు-పిల్లవానికీ రూపురేఖలున్నాయి,
ఏటేట పండేటి భూములున్నాయి-ఊరి పొలిమేర తోటలున్నాయి,-[2]
చుట్టు కొల్లారంపు మిద్దెలున్నాయి-కుఱ్ఱవానికి మంచిసేద్యమున్నాది,
పిల్లవానికి తగిన-[3] ఈడుజోడేను-కన్నెనిస్తామని కబురంపుదాము ఇల్లలికి
ముగ్గెట్టి పెళ్లిసేతాము-[4]

-అని ఆడ సంబంధము వారు ఉత్సాహపడుదురు. వారి నిశ్చయమును

"బొమ్మల్ని బొబ్బిలోరు అడుగొచ్చినారు
ఇద్దమా! అన్నయ్యా, ఇవ్వద్దా! వదినా"

1. నేను సేకరించినది. పాడినవారు : శశిరేఖమ్మ-మలక్‌పేట.
2. ,, ,, ,, ,,
3. కొల్లారమనగా నడుమ బయలును నాలుగు ప్రక్కల కట్టడమునుగల యిల్లు-తెలుగు జానపదగేయ సాహిత్యము. పుట-447.
4. సెలయేరు-పుట-24.

– అని సన్నిహితవర్గముతో సంప్రదించి ఒక నిర్ణయమునకు వచ్చెదరు. వరుడు నచ్చినంతమాత్రముననే సరేయనుకొనక వరుని తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను గూర్చి అరసికొందురు. ముఖ్యముగా అత్త మంచితనమును తెలిసికొందురు.

"అత్త మంచిదైతే, అనుకూలమైతే
మామ మంచివాడైన, మాటకారైన
కాముడు లేతైన కన్నెనిత్తాము"–[1]

– అని తెలిసికొని నిశ్చయమునకు వచ్చెదరు. అత్తలు గయ్యాళులై యున్న తమ పిల్లలకు సుఖముండదని తలచి అత్తల ఆర్భాటమెక్కువని విన్నప్పుడు అత్తమంచిదేనా యని తెలిసికొందురు. "కత్తిమెత్తనా అత్తమంచీ ఉండదు. అత్తమంచీ, వేములు తీపూలేదు"–అని చాల మంది వాడుక. క్రొత్త కోడలునకు కాపురమున సుఖములెన్నియున్నను అత్తవారి యారడి యున్నచో ఆమె జీవితము దుఃఖమయమే.

కన్య తల్లిదండ్రులు తమ నిర్ణయమునే తుది నిర్ణయముగా గైకొనక గ్రామపు పెద్దల తోడను సంప్రదించెదరు.

"ఊరిలో పెద్దలను అడిగి చూతాము
అందరికి మెప్పుగా అతివనిత్తాము
ఊరిలో పెదరెడ్లు ఉన్నారుగదా
పెదరెడ్ల నడుగక పెండ్లిచేదామా
కరణాలు గొప్పగా కలరు ఊరంతా
కరణాల నడుగకా కన్నె పెండ్లవునా"–[2]

– ఊరిలోని పెద్దలను సంప్రదించి మంచీచెడు నిర్ణయమునకు వచ్చుట పరిపాటి. పెదరెడ్లతో, కరణాలతో సంప్రదించుట అనునది గ్రామీణులు గ్రామాధికారులకిచ్చు గౌరవమును పరస్పర సహకార భావమును తెలుపుచున్నది.

---

1. సెలయేరు–పుట–94.
2. పల్లెపదాలలో ప్రజాజీవనము – ఎల్దండ రఘుమారెడ్డి, చతుర్థ ప్రకరణము (అముద్రితము)

వివాహ సంబంధములందు మేనరికములకు అధిక ప్రాధాన్యము కలదు. పూర్వము కొందరు తొట్టెలకే బాసికములు గట్టి ముచ్చటలను తీర్చుకొనెడివారు. మధుర ప్రాంతవాసులైన ఉప్పిలియన్ తెగలోను ఇట్టి మేనరికపు మక్కువలు కనిపించుచున్నవి. –[1] మేనరికపు వివాహములలో సుభద్రార్జున, శశిరేకాభిమన్యుల వివాహములు ప్రసిద్ధములు. శశిరేఖాభిమన్యుల వివాహము తెలుగు కన్నడులలో శశిరేఖా పరిణయముగను, తమిళులలో వత్సలాకళ్యాణముగను ప్రచారములోనున్నది. మనువు మేనరికముల నిరసించినను, శాస్త్రములు కాదన్నను తెలుగువారిలో మేనరికముల యెడ మక్కువ అధికముగా కనిపించును. మాతృత్వములో పుత్రుని పొందుట పూర్వజన్మ సుకృతముగా భావించెదరు. అట్లే అన్నతో వియ్యమందుటను గొప్పగా భావించినారు.

"కంటేను కొడుకుల్ల కాన్పేకనాలి
అందితే అన్నతో వియ్యమందాలి"–[2]

– అనుట ఈ భావమునే తెలుపుచున్నది.

ఇల్లాలికి ముగ్గెట్టి యింతపనిజేసి
ఈ యింటి యిల్లాలు యెందుబోయింది
అన్నలతో వియ్యము అందబోయింది
వదినతో వరసాలు దంచబోయింది"–[3]

– స్త్రీలలో చెల్లెలుకు అన్నకూతురును చేసికొనవలెనను ఆసక్తి యున్నంతగా తనబిడ్డను ఆడుబిడ్డకుమారుని కిచ్చుటలో నుండదు.

"మేనరికమునకిచ్చేకంటే, మేడిబాయిలెయ్యాలె
మేనోల్ల కియ్యరాదు, మెప్పించరాదు."–[4]

– అనునట్టి వాడుకలేర్పడినవి. కుటుంబకలహముల వలనగాని, కట్నకానుకల విషయమునగాని మనస్పర్థలు కలిగినను మేనబావ మాత్రము మరదలును అంత సులభముగా వదలుకొనజాలడు. చిన్ననాటినుండియు భావించిన రీతి

1. Castes and Tribes of southern India.

2. సెలయేరు పుట 81 3. సెలయేరు పుట 94.

4. పల్లెపదాలలో ప్రజాజీవనము–చతుర్థ ప్రకరణము

కనుగుణముగా మేనబావ తన మరదలును తన సొంతమనియే భావించును. అందుకనియే.

"అబ్బాయి కాచేడు మామయ్య యిల్లు
కానకుండ పుస్తెకట్టేదా మని,
తెలయకుండ తలంబ్రాలు పోసెద్దామని"–[1]

–మేనమామ కూతురును పెద్దల కానకుండ రాక్షసవివాహమాడుటకును వెనుకాడని అల్లుంద్రుకూడ నక్కడక్కడ నుందురు. తెలుగువారిలో కోమటులందు ఈ మేనరికపు పెండ్లిండ్లకు ప్రాముఖ్యమధికము. ఇందులకొక కథ కలదు. కన్యకామ్మవారని పిలువబడు కన్యకా పరమేశ్వరి వైశ్యులకిలవేల్పు. వైశ్యులిండ్లయందు కన్యకామ్మవారి కథగాని పాటగాని తెలియని వారుండరు. పెనుగొండ యను పట్టణమున కుసుమ శ్రేష్ఠికి, కుసుమాంబకు కన్యకాంబ జన్మించెను. ఆమె సౌందర్యరాశి. ఒకప్పుడు విష్ణువర్ధనుడను రాజు పెనుగొండ చూడవచ్చినప్పుడు కుసుమశెట్టి తనకూతురును గూడ వెంటనిడుకొని పోయి దర్శించెను. విష్ణువర్ధనుడామె అందమునకు ముగ్ధుడయ్యెను. అతడామెను పెండ్లియాడ నిశ్చయించి సంబంధమునకై రాయబారమంపెను. కుసుమశెట్టి యంగీకరించెనేగాని అతని కుమారులుగాని, కన్యకాంబగాని కులము వారలుగాని మెచ్చరైరి. మెచ్చక పోవుటయేగాక మేనరికము వైశ్యులకును మేలటంచునూ" పలికిరి. రాజు గారికీ వార్త తెలసి వైశ్యులొనర్చిన ధిక్కారమునకు ప్రతీకారముగా దాడివెడలెను. కాని కన్యకాంబ తన కులము వారితో గలసి అగ్నికాహూతి కాదలచేనేకాని రాజుచేతిలో మాత్రము చిక్కదలంచలేదు. కొందరు వైశ్యులామెతో చచ్చుటకు సిద్ధమైరి. అగ్ని గుండములు సిద్ధమయ్యెను. అగ్నిగుండమున దూకుటకు ముందు కన్యక

"పశుపతి చరణములు మదిలోననుంచి–వసుమతీనాధుని వేగ శపియించి నేడు
మొదలుగ యార్యకులము లోపలనూ–చేడియల కతి చక్కదనమున్ననూ పణతికేమైన
వంకరయుండవలయు–ధరణిలోయంచు కన్యక బలికియునూ మన కులమునందు
జన్మించినవాడు–మేనరిక మివ్వనీ వారికి కీడు"

1. సెలయేరు–పుట–91

– అని శపించెను. కోమటులందు మేనరికమధికముగా నుండుట కిదియే కారణమని వైశ్యుల నమ్మకము. –[1]

ఊరిలోపల సంబంధములు నిశ్చయించుకొన వలసివచ్చిన ఊరిలోపల వియ్యమందుట మంచిది కాదందురు. "ఊరిముందరి చేను కాకుల్ల పాలు, ఊళ్లోన వియ్యమ్ము మాటలాపాలు" అని సామెత గనుక ఇట్టి సంబంధముల వలన కూతురు ఉన్న ఊరిలోనే ఉండి కన్నుల ముందుండునన్న ఆలోచన తప్ప మరెట్టి సుఖమును కనిపించదు. ఈ విధముగా సంబంధమనుకొని నంతనే పలువిధములుగా ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చెదరు. అట్లే మగ పెళ్లివారును ఆడ పెళ్లివారి యోగ్యతను గమనించి నిర్ణయమును తీసికొందురు.

"శ్రీరామ చింతల్ల పండు బండింది-చూచిరావే సీత కోసుకుందామే
బీరెల్లి వారింట్ల కన్య పుట్టింది-చూచిరావే లక్ష్మి చేసుకుందామే! –[2]

– కట్నమునకే గాక ఆడపిల్ల పుట్టి పెరిగిన పరిసరములకును ప్రాధాన్య మిచ్చెదరు. సామాన్యముగా పురుషులు తమకు కావలసిన వధువును నిర్ణయించుకొనుటలో అభిప్రాయములను వెలిబుచ్చెదరు. అచ్చటచ్చట కొందరు కన్యలును తమ అభిప్రాయానుసరణముగా కోరికలను ప్రకటింతురు.

సామల దేశానికి నన్నియ్య బోకవ్వ-నేను తినలేను సామల బువ్వ

కొఱ్ఱల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను కొఱ్ఱాలబువ్వ
తైదల దేశానికి నన్నియ్య బోకవ్వ
నేను తినలేను ఆ తైద రొట్టె
యారాండ్ల మీదికి నన్నియ బోకవ్వ
యాపకాయ చేదు నేను పడలేను
బావల మీదికి నన్నియ్య బోకవ్వ
భారిదొడ్ల పెండ (పేడ) నేదీయలేను
మరదుల దేశానికి నన్నియ బోకవ్వ

1. తెలుగు జానపదగేయ సాహిత్యము-పుటలు-593, 594.

2. త్రివేణి పుట 102

మల్లె చెట్టుకు నీళ్లు నేపోయలేను
సముతుల మీదికి నన్నియ్య బోకవ్వ
సముద్రంలోతు దిగి నే చూడలేను–[1]

– ఈమె అతి సుకుమారిగా నున్నట్లున్నది, ఏరాండ్ల మీదికి, మరదుల మీదికి, సవతుల మీదికి తనను ఇవ్వబోకు మని తల్లిని అడుగుటలో తన సుఖమును గూర్చి తానేయొక నిర్ణయమునకు వచ్చుటను బట్టి విడికాపురము కాంక్షించుచున్నది, ఇటువంటివారు అవిభక్తకుటుంబమును ఏమాత్రము కాంక్షింపరు. ఇట్టిదే మఱియొక పాట :–

"ఊరు పక్కాచేను, ఉడుతాలా పాలు గోగునార సీతన్న
బావల్లమీదికి నన్నీయకన్న ,, ,,
బాయెంత లోతో దిగిచూడన్నా ,, ,,
యారాండ్ల మీదికి నన్నీయకన్నా ,, ,,
యేరెంత దూరమో ఈదిచూడన్నా ,, ,,
మరదుల మీదికి నన్నీయకన్నా ,, ,,
మడుగెంత లోతో దిగి చూడన్నా ,, ,,
సౌతుల (సవతుల) మీదికి నన్నీయకన్నా ,, ,, –[2]

– ఈ కన్య ఈ పాటలో పేర్కొనినట్టి సంబంధములుగలవారు పడు పాట్లను చూచి, పెద్దల వలన విని అనుభవము పొందియుండును. కనుకనే తనకు ఇష్టములేని పెండ్లిచేసి మడుగునను, ఏటిలోను, బావిలోను తోయకుమని అన్నకు ధ్వనింపజేయుచున్నది. ఇట్టి వారికి బలవంతముగా తమకిష్టములేని వివాహము చేసినను "పోలులో యేరాయె – పోలుకుండలు రెండాయె" అను సామెత ననుసరించునట్లు మెట్టినింట చిచ్చుపెట్టుదురేకాని మరేమియును లేదు. ఇట్టి వారివలన పుట్టినింటికిని, మెట్టినింటికిని అపకీర్తియే కలుగును. ఇట్లుగాక వివాహపు అధికారమును పెద్దలకప్పగించి కన్నులాడించు కన్యలును ఉందురు. ఇట్టివారి సంఖ్యయే అధికము. కన్నె ప్రాయములో నున్న జానపద కాంతల కిట్టి స్వభావము నైజము.

1. త్రివేణి పుట 100;
2. త్రివేణి పుట 103.

"కన్నవారి కనుసన్నల పెరిగింది కన్య
కన్నవారి కష్టసుఖాల తెలిసికొంది
కన్నతండ్రి తెచ్చిన కామున్నే కట్టుకొంది
కన్నతల్లి యిచ్చిన పట్టుబట్టలే కట్టుకొంది
కన్యను గన్న తల్లిదండ్రులు మరెవ్వరోగారు
అయోధ్య రాజు దశరథుడమ్మా-[1]

-కన్నవారి కనుసన్నలలో పెరిగి పెద్దవారై, వారి కష్టసుఖములను తెలిసికొని, అనుకూలముగా ప్రవర్తించు బిడ్డలను కనిన దంపతులు అదృష్టవంతులుగా భావింపబడుదురు. నన్నయ భట్టు కూడ మహాభారతములో గాంధారి వివాహమును గూర్చి చెప్పునప్పుడును పై ఆచారమునే వ్యక్తపరచెను. పుట్టంధుడగు ధృతరాష్ట్రునకు గాంధారినిమ్మని భీష్ముడు గాంధారి తండ్రియైన సుబలరాజునకు వర్తమానమును పంపెను. తండ్రి ఆజ్ఞను శిరసావహించుట తన ధర్మమని గాంధారి తండ్రి నిశ్చయించిన వరునే వివాహమాడెదనని తెలియజేయుచు

"పితృవచన దత్తగా నన్ను నిశ్చయించి నాకు
పతి యిమ్మహిపతి గాని యొరులనొల్ల"-[2]

- అని నుడివినది.

ప్రేమించిన పురుషులున్నను పెదవి విప్పి కోరికను వెళ్లబుచ్చక తల్లిదండ్రుల నిర్ణయమునకు ఎదురు చూచు ఆడుబిడ్డలును ఉందురు.

కనకమ్మ మెచ్చింది కాముడ్ని
కనులలోనే నింపుకుంది, కడుపులోనే దాచుకుంది
పెదవి విప్పలేదు పేరు చెప్పలేదు
పెత్తనం తండ్రిదనుకుంది పేరాశతో చూచింది. -[3]

---

1. నేను సేకరించినది. పాడినవారు, సావిత్రీదేవి, గునగల్లు, ఇబ్రహింపట్నం.
2. ఆంధ్రమహా భారతము - ఆదిపర్వము.
3. నేను సేకరించినది. పాడివారు, సావిత్రీదేవి. గునగల్లు, ఇబ్రహింపట్నం.

-మనసునకు నచ్చిన వరుని చూచినను అతని రూపును కనులలోనే నింపుకొని అతని ప్రేమను కడుపులోనే దాచుకొనినది ఒక కన్య. కాని పైకి బాధ్యత నంతయు తండ్రిపైననే వదలినది. నన్నెచోడుడు కుమార సంభవములో మునీశ్వరులు పార్వతిని శివునకు వధువుగా నిర్ణయించుటకు హిమవంతుని చెంతకు వెళ్లి శివుడే తమనాపనికి నియమించినట్లు తెలిపిరి. ఆమెరాగానే ఆమెకు గల సౌందర్య స్వభావ సమస్త లక్షణములను పరీక్షించి తప్పక ఆమె శివునికి తగిన వధువని నిశ్చయించిరి.-[1] దీనిని బట్టి మరియొక విషయము తెలియునదేమనగా వధువు అంతకు ముందే ఒకనిని వరించినప్పటికిని, తండ్రి యనుమతి లేనిదే సాధారణముగ వివాహమాడెడిది కాదు. పార్వతి మొదటనే శివుని వరించి అతనిని ప్రసన్నుని చేసికొనుటకు ప్రయత్నించినది. శివుడు కూడ బ్రహ్మచారి రూపమున వచ్చి పార్వతిని పరీక్షించి ఆమె మనస్సు గ్రహించి, సంతోషించి తన అభిప్రాయమును వ్యక్తపరచెను. అంతట పార్వతి అతని యుద్దేశ్యమును తన తండ్రియైన హిమవంతునకు తెలియపరచి, అతని అనుమతితోనే వివాహమాడుట ఉచితమని శివునకు చెప్పగా, శివుడు సప్తఋషులను హిమవంతుని వద్దకు రాయబారము పంపెను. కవి కావ్యమున తను జీవించిన కాలము నాటి ఆచారవ్యవహారములనే పొందుపరచినాడనిన సమంజసమే కదా.

వరకట్నము, ఓలి :- సంబంధము నిశ్చయమగుటతో బాటు కట్నముల ప్రసక్తివచ్చును. వరునికి కట్నమిచ్చు సంప్రదాయమునకు స్మృతి గ్రంథము లందు ప్రమాణములు లేవు. వధువునకు వివాహానంతరము వరుని యింటికి వెళ్లునప్పుడు తల్లిదండ్రులు దుస్తులు, ఆభరణములు, పాడిపశువులు, పాత్ర సామగ్రి, ధనము, భూమి మొదలగునవి యిచ్చిపంపుట పరిపాటి. ఇట్టి పద్ధతియే అరణము అనబడు చుండెను.

విదర్భమహారాజగు భీముడు దమయంతికి వివాహానంతరము అత్తవారింటికి పోవునప్పుడు పెక్కు వస్తువులను అరణముగా నిచ్చినట్లు శ్రీనాథుడు వర్ణించినాడు.-[2]

1. కుమార సంభవము-నన్నెచోడుడు
2. శృంగారనైషధము-ఆ 7. ప. 11

కలవారు తమ బిడ్డలకు గొప్పనైన కానుకలిచ్చిన, పేదవారు తమ అనుకూలమునుబట్టి చేతనైన కానుకలిత్తురు. ఈ కానుకలిచ్చు పద్ధతియే కట్నముగా మారినది. కట్నము కూడ వధువు ప్రమేయము లేకుండ వరుని ఉద్దేశించియే యిచ్చుటను బట్టి వరకట్నమను పేరు ఏర్పడి యుండును.

భూస్వాములు కొంత భూమిని "కూతురునకు పసుపు కుంకుమల" కొరకని యిచ్చుట ఇప్పటికిని కొన్ని కులములందు ఆచారముగా కలదు. కుమార్తెలకు తండ్రి ఆస్తిలో భాగము అనాది కాలముగా నున్నట్లు ఋగ్వేదమున ప్రస్తావింప బడినది. ఈ భాగమును తండ్రి కుమార్తె వివాహ సందర్భమున ఇచ్చుచుండెను. శ్యాలకుడు తన బావకు ఇచ్చిన సంపదను గురించిన ప్రస్తావన కూడ ఋగ్వేదమున నున్నది. కుమార్తెలకు నగల రూపమున విడిగా ఆస్తి కూడ నుండెను. ఆ నగలను వారు తమ యిష్టము వచ్చినపుడు అమ్మివేయగలిగి యుండిరి. –[1] కుమార్తెలకు తల్లుల నగలు సంక్రమించునని బోధాయనుడు చెప్పినట్లు సంధ్యా ముఖర్జిగారు పేర్కొనిరి. –[2] వరకట్న మిచ్చు పద్ధతియేగాక కన్యకే శుల్కమిచ్చి వివాహమాడు ఆచారము కలదు. ఈ కన్యాశుల్కమునిచ్చు పద్ధతినే "ఓలి" అని కూడ వ్యవహరింతురు. పరస్పరము రెండు పక్షముల వారు సంబంధములు సరేయనుకొనిన పిదప ఓలి ప్రసక్తి వచ్చినప్పుడు వధువు పక్షము వారు

"ఓలేమి తెచ్చారు–ఓ పెద్దలారా" అని వరుని పక్షము వారి నడుగగా
"అరుగుమీద అరవై ఓలి ముప్పై
తల్లిగట్టే చీరతోటే తగునమ్మ ఓలి"–[3]

– అని వరుని పక్షమువారు సమాధానమిత్తురు. ఈ పాటలోని విధముగానే గాక వరుని అంతస్తును బట్టి ఓలి యిచ్చుకొనుట జరుగును. ఇప్పటికిని వివాహములలో "తల్లిచీర" అను పేరుతో వరుని పక్షమువారు వధువు తల్లికి నొకవిలువైన చీరను తెచ్చుట కలదు. మనువు కన్యాశుల్కమును నిషేధించెను. శూద్రుడైనను ఓలి పుచ్చుకొనరాదని శాసించెను. –[4]

---

1. ఋగ్వేదము – 1–109–2; 10–85–29
2. Some aspects of Social Life in Ancient India - Sandhya Mukerjee, page.154
3. సెలయేరు–పుట–94.
4. ఆదదీత నశూద్రో–పిశుల్కం దుహితరం దదన్, శుల్కంహి గృహ్ణన్కురుతే ఛన్నందుహితృ విక్రయమ్. మనుస్మృతి అధ్యాయం 9, శ్లో 98

ఓలి కొన్ని కులములలో నేడును ప్రబలముగానున్నది. ఓలి ప్రాచుర్యమును బట్టి సామెతలు కూడ బయలుదేరినవి.

"ఓలి యిచ్చిన మొగుడికంటె కూలియిచ్చిన మొగడెక్కువ"

"ఓలి తక్కువని గ్రుడ్డిదానిని పెండ్లాడుతే నెలకు ఆమలకుండలయినట్లు"

"సీతరామ కళ్యాణము" పాటలో అమ్మలక్కలు "ఓలేమి సాలేమి ఓయమ్మలారా?" అని ప్రశ్నించగా జానపద స్త్రైణమంతయు సమాధాన మిచ్చినట్లున్న గొప్ప వాక్యమును ఏ కవికిని తోచని దానిని జానపద స్త్రీలు చెప్పిరి. –

"శివు విల్లు విరిసిన సిరియే వోలనిరి
సొగసు పాయమే మంచి సుగుమంచి–[1] అనిరి"–[2]

– రామాయణములో ఓలి ప్రసక్తియే లేదు. కాని జానపదులలో కొన్ని వర్గములలో నున్న ఈ ఓలి రామాయణ కథలోను ప్రవేశించెను.

"సుభద్ర సారె" పాటలో కృష్ణుని తల్లి తనకుమారునికై భార్యను "ఓలి" యిచ్చి కొని తెచ్చినట్లున్నది. కృష్ణుని భార్యలలో ఒకతె సుభద్రను దూషించగా సుభద్ర అన్న వద్ద మొరబెట్టెను. అందుకు కృష్ణుడు

"కొన్న బానిస అంటె కొదువేమి మనకు
మన అమ్మ కొన్నాది మాయమంధరను"–[3]

– అని ఆమెనూరడించును. దీనిని బట్టి ఓలి యిచ్చి తెచ్చుకొనిన భార్య బానిసవంటిదను భావము వ్యక్తమగుచున్నది.

ఓలి స్థిరపడిన ప్రాంతములలో "ఓలిగా నిచ్చిన డబ్బును స్త్రీ దురదృష్టవశమున విధవ అయినచో తల్లిదండ్రుల నుండి తీసికొని వాడుకొన వచ్చును"–[4] అని సంధ్యా ముఖర్జీ గారు పేర్కొనినారు.

---

1. సంభార రూపమగు కన్యాశుల్కము అని డా॥ దొణప్పగారు వివరించిరి. జానపద కళా సంపద పుట–71.
2. జానపద కళాసంపద పుట–71; 3. స్త్రీల పౌరాణిక పాటలు పుట 231
4. Some aspects of Social Life in Ancient India - Sandhya Mukerjee. page.154

మెసపొటేమియాలో పూర్వము "పెండ్లివేళ కన్యాదాన శుల్కము ఎంత నీయవలెనో వధువే నిర్ణయించుట పరిపాటిగా నుండెను"–[1]

తెలుగు స్త్రీ వాచక శబ్దములలో తెఱవ అను పదమున్నది. ఇది నేడు స్త్రీ సామాన్య పర్యాయవాచకమైనను విశిష్టమైన అర్థము కలది. "ఈ పదం మన ప్రాచీన సాంఘికాచారాలకు సాక్షి. కన్యాశుల్కం పాతపుంతల్లో నడచిందనడానికి నిదర్శనం. తెఱవ – శుల్కంతో కొన్నస్త్రీ. క్రింది జాతుల స్త్రీల మారుమనువు చేసుకొనునప్పుడు కులస్థులకు చెల్లించే దండుగ తెఱవు. తెఱవు చెల్లించు ఆచారము ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలోని బళ్లారి జిల్లాలో ఇంకా పాతుకొని యున్నది. కన్నడ భాషలోను ఈ పదమున్నది. దీనికి తెఱవు– కన్యకిచ్చే శుల్కం అని కన్నడ నిఘంటుకారులు అర్థం చెబుతున్నారు."–[2] కన్నడ ప్రాంతములో మారుమనువుకే గాక మొదటి మనువుకిచ్చు కన్యాశుల్కమును గూడ తెఱవు అనుచున్నారు.

నేడు వరకట్నము ఒక పిశాచముగా పరిణమించినది. కన్యాదాత సంతోషముతో వరుని సత్కరించుట వేరుమాట. అది నిర్బంధమయినప్పుడు సంఘమున అసహ్యాభావము కనిపించును. ఈ వరదక్షిణాచారము ప్రబంధకాలమునను విశేషముగా నున్నట్లు మన్నారు దాస విలాసప్రబంధమున వర్ణితమైనది. –[3] వరకట్నమిచ్చిన భార్య తన భర్తను కొనినయట్లు అభిప్రాయపడుట సహజము. పార్వతీ పరిణయమున నున్న ఈ క్రింది పద్యము తార్కాణము.

కొన్న మగవాడు చూడగ
వన్నియ తరుగగను ముందు పయనము నడిచే
కన్నియ కన్నయ వెనుకను
మన్నకు మన్ననమదేటి మాట వసంతా–[4]

కట్నములు నిశ్చయమైన పిదప సంబంధములను స్థిరపరచుకొనుటకు వరుని పక్షమువారు వధువు గృహమునకు వచ్చి వధువునకును, వధువు తల్లి

1. మెసపొటేమియా సాహిత్య సంగ్రహం–కృష్ణచైతన్య–పుట–26.
2. సాహితీసుగతుని స్వగతం–తిరుమల రామచంద్ర–పుట–15.
3. మన్నారుదాస విలాస ప్రబంధము–రంగాజమ్మ–5–44.
4. పార్వతీ పరిణయము–రాయ రఘునాథ తొండమాన్– 3–113.

దంద్రులకును నూతన వస్త్రముల రూపమున కానుకల నర్పించుకొందురు. ఎంత పేదవారైనను బంగారముతో కూడిన ఏదియో నొక వస్తువును వధువునకు పెట్టెదరు. ఈ కార్యక్రమము "వధువుపూజ; లక్ష్మీపూజ; పూలుపండ్లు" అను పేరున పిలువబడును. ఇట్లే వరునకు వధువు పక్షము వారిచేత సత్కారము జరుగును. దీనిని "వరపూజ" అందురు. ఇంతటితో వివాహము నిశ్చయమయినట్లుగా భావించబడును. ఈ సమయములందే లగ్నదినమును కూడ నిశ్చయించుకొందురు. పురోహితుని చేత వ్రాయబడిన లగ్న పత్రికలను పసుపు కుంకుమలచేత పూజించి వధువు తండ్రి "పప్పన్నము పెట్టడము మావంతు, బాలను పోషించడము మీవంతు అనుచును, వరుని తండ్రి "పప్పన్నము పెట్టడము మీవంతు బాలను పోషించడము మా వంతు" అనుచును ఒకరి చేతిలోనుండి మరొకరు తీసికొని ఇరుపక్షములవారు ఎవరి పత్రికలను వారు గుండ్రని కొబ్బరి కుడుకలోనుంచి పసుపు బట్టలో కట్టి భద్రపరచుకొందురు. వరపూజానంతరము వెంటనే వివాహమును చేయుటకు వసతి లేకపోయిన కనీసము సంవత్సరములోనైన వివాహము జరుపుదురు. అందుకును పరిస్థితులు అనుకూలించకపోయిన మూడవ సంవత్సరమున చేయుదురు. అంతేగాని రెండవ సంవత్సరమున చేయరు. నేటి కాలమున ఈ పట్టింపులకు సడలింపులు జరిగినవి. వధూవరుల పూజలు పెండ్లిలోనే జరుపబడుచున్నవి.

ముహూర్తమును నిర్ణయించుకొనిన పిదప పెండ్లిపనులకు దొడంగెదరు. వివాహమునకు కావలసిన వస్తువులను వివరముగా ఒక పట్టికగా వ్రాసికొనుట అవసరము. కనుక పెండ్లి పెద్దలు తీరికగా కూర్చొని ఆలోచించి, ఆలోచించి ఈ పట్టికను తయారు చేయుదురు. అట్లయినను కొన్ని ముఖ్యమయిన వస్తువులను మరచిపోవుట వాని ఆవశ్యకత వచ్చినప్పుడు పది మందిని పంది దిక్కులకు పరుగెత్తించుట ప్రతి పెండ్లియందును జరుగుచుండును. ఇట్టి తొందరను నివారించు నుద్దేశ్యముతో శ్రీ పెరుంబూదురు రాఘవార్యుడను కవి వివాహమున కవసరమగు సర్వ వస్తువులను తెలుపు సీసమాలికను రచించుచు

"…. …. …. …. …. …. …. …. …. …. …. ….
పెండిండ్లకును దెచ్చు వివిధ వస్తువులన్ని

మరచిపోదురటంచు మదిని దలచి
గూర్చి చెప్పెద మర్త్యకోటికి తెలియంగ
భాసురంబగు నొక్క సీసమాల"-1

- అని అతడు పేర్కొనినాడు, దీనిలో భాజా భజంత్రీల మొదలు తేనె. సాన, అత్తరు, పన్నీరు వరకు గల అన్ని వస్తువులను తెలిపినాడు.

వివాహమంగళ కార్యక్రమము వధూవరులకు వారివారి నివాసస్థలము లందు నలుగు పెట్టుటతో ప్రారంభమగును. నలుగు పెట్టుటను వైద్యశాస్త్రజ్ఞులు "ఉద్వర్తనమని" యందురు. ఇది శరీరకాంతికిని అంగసౌష్ఠవమునకును, ఆరోగ్యమునకును నిత్య విధిగను అనుసరించుట అవసరమనియు ఆ గ్రంథముల ఉపదేశము. కాని విశేష దినములనాడే ఈ పద్ధతిని అనుసరించుచున్నారు. ఆ సంప్రదాయ పరిరక్షణమే వివాహమును నలుగుతో ప్రారంభించుట.

నలుగు పెట్టుట:- "నలుగులు పెట్టుట నాగవల్లినాడు తలగడుగుట" అనునది వాడుక. నలుగులతో ప్రారంభమగు మంగళ స్నానములు నాగవల్లి తలంటుస్నానముతో పూర్తియగును. పాటలతో ప్రారంభమయిన పెండ్లి తంతు అప్పగింతల పాటలతో సమాప్తమగును.

నలుగిడుదు రావయ్యా, నలుగురిలో నీవు వదలక నలుగిడు
మధుర మీనాక్షితో ॥న॥
కమ్మలు, జుమికీలు కంఠసరమ్ములు కమ్మలు కదలగ
ఘనత మీనాక్షితో ॥న॥
కుచ్చుల దండలు కుచముపై జారగా మచ్చికలాడేటి
మధుర మీనాక్షితో ॥న॥
చేతి చేకట్లు జగమెల్ల వెలుగగ శాంకరియైన మా
చెలియ మీనాక్షితో ॥న॥ [2]

అనుచును-
"నలుగిడరారే నలుగిడరారే, నలుగిడరారే, నలినాక్షులార
నలిననాభునకు నవమోహనాంగునకు ॥న॥

1. చాటు పద్య రత్నావళి-సంపాదకుడు శ్రీరంగాచార్య పుట 141
2. జానపద గేయ వాఙ్మయ పరిచయము-హరి ఆదిశేషువు పుట 205.

అత్తరులోన మేలి మత్తరులోన అంబరును గూర్చి
క్రొత్త సంపంగితో గోవిందునకును ॥న॥
....
అంబుజాక్షుకునను, అలివేణులార ఆనందమొందుచు ॥న॥ [1]

– అని పాడుచు ముత్తైదువలు నలుగిడుదురు.

నలుగాడు పెండ్లి పడుచా–నలుగాడవమ్మా
దేవాన దేవతలు తెచ్చినా నలుగు
పార్వతి పరమేశ పంపినా నలుగు
విష్ణు ఈశ్వరుడు ఇచ్చినా నలుగు
మీయింటి పెద్దాలు చేసినా నలుగు
తాతాల వాకిట్ల పీటాలు వేయించి
తాతాల రామయ్య చేయించె నలుగు
పెద్దనాన్న వాకిట్ల పీటాలు వేయించి
పెద్దనాన్న.... ....చేయించె నలుగు
చిన్ననాన్న.... .... [2]

– ఇట్లే పాటయంతయును సన్నిహితబంధువర్గములో నున్న పెద్దనాన్న, చిన్నాన్న, మేనమామ, మేనత్తల పేర్లను పేర్కొనుచు వారి యింటిముందు పీటలు వేయించి నలుగు పెట్టినట్లుగా వర్ణించబడినది. ఈ వర్ణనను గమనించిన పూర్వ కాలమున గ్రామములలోని వధూవరుల బంధువులు వారివారి యిండ్లకు వీరిని పిలుచుకొని పోయి నలుగులు పెట్టుట ఆచారముగా నుండినట్లు గ్రహింపవచ్చును. నేటి కాలమున పెండ్లి కూతురును, పెండ్లి కుమారునిని అలంకరించిన పిదప గ్రామములోని సన్నిహిత బంధువర్గము వారిని తమయిండ్లకు తీసికొని వెళ్లి తాము ఇవ్వ దలచిన నూతన వస్త్రములను కట్టించి పసుపు, కుంకుమ, పుష్పములు, గంధము మొదలయిన సుగంధ ద్రవ్యములతో అలంకరణ చేయుదురు. వారిచేత తీపి పదార్థములను భుజింప జేయుదురు. ఈ పద్ధతిలో పూటకొక్కరుగా పిలుచుకొని పోయెదరు. ఈ ఆచారమును గమనించిన దగ్గర బంధువులు తమ యిండ్లలో వధూ వరులను అలంకరించుటకు ముందు మంగళ స్నానములను కూడ చేయించెడివారని భావింపవచ్చును.

---

1. సెలయేరు – పుట – 25.
2. నేను సేకరించినది – పాడినవారు – సుమిత్రాదేవి, యం.ఎల్.ఎ.

తలంటు–స్నానము:– పసుపు, నూనె, సున్ని పిండితో నలుగురాచి ముత్తైదువలు వధూవరులకు ఎవరింట వారికి తలంటెదరు. తలంటు సమయమున

"శ్రీగౌరి నాథునకు శీతాంశుధారునకు
ఆగమవేద్యునకు మీరంటుడీతలను
కరపద్మములయందు కంకణంబులు మెరయ
అరమేని సామికి మీరంటు డీతలను..."–[1]

– అను పాట అధిక ప్రచారమందున్నది. తలంటిన పిదప మంగలి చేత కాలిగోర్లు తీయించి గోర్లకు రంగు పెట్టించి ముత్తైదువలు మంగళ స్నానము చేయించుట ప్రాచీనాచారము. మంగళ స్నానము చేయించునప్పుడు తెలంగాణములో ఈ క్రింది పాట ప్రచారమునందున్నది.

నాలుగుమూలలబాయి(వి)–నందనాల బాయి(నందనవనములోని బావి)
నందనాల బాయికి–ఏమి విసిరాలు (వస్తువులు)
కాంచూది బొక్కాన–కంది చేతాడు
ఎల్లవారి బొక్కాన – వెండి చేతాడు
పగిడిది బొక్కాన–పట్టు చేతాడు
ఆడూత చేదేరు అక్కచెల్లెండ్లు
పాడూత చేదేరు వదిన మరదండ్లు
కాగబెట్ట కందనూరి కడవకావాలె
తార్లీయ (వేడి చన్నీళ్లు కలుపుటకు) తొలకొండ తొట్టీ కావాలె
కూర్చుండ గురుజాల వేట కావాలె
ముంచిపోయ ముత్యాల ముంత కావాలె
పెయిదోమ (ఒడలు రాయుటకు) పెద్దమామ బిడ్డ కావాలె

(వధువునకు మంగళ స్నానములు చేయించిన, పెద్దమామ బిడ్డ అనుటకు మారుగా మేనత్త కొడుకు కావలెనని వాక్యమును మార్చెదరు)

వధువు నుద్దేశించి
నీళ్లుబోసుకో సీతమ్మ–నిలుచున్నచోట
నిలువుటంగులజోడి అందీయి బావ
నీళ్లు ఆరినదాక నీలంచు చీర

1. సెలయేరు – పుట – 26

పెయ్యి (శరీరము) ఆరినదాక పేటంచు చీర
పెయ్యి ఆరినంక పట్టంచు చీర"–[1]

– అని పాడుచు వధువుచేత తీరొక్కతీరు చీరెలు కట్టించినట్లుగా పాట పూర్తిచేయుదురు

తలంటి స్నానము చేయించి వెంట్రుకలను చిక్కుతీసి జడ అల్లుటను గూడ పాట రూపముననే పాడుదురు.

వెండి దువ్వెన తోటి–ఎల (పూర్తి) చిక్కుతీసి
పగిడి దువ్వెన తోటి–పైచిక్కు తీసి
వెంటికాల (వెంట్రుకలలో) వెయ్యేసి–ముత్యాల దాపి–[2]
వేసిరి సీతమ్మకు–వైనాల జడ (అందమైన జడ)

– ఇట్లు నిదానముగా వరుస ప్రకారము వధూవరుల నలంకరించుచు ఒక పాట తరువాత మరియొక పాటను కలిపి పాడుచునేయుందురు.

కావ్యములందును మంగళస్నానముల ప్రసక్తి కలదు. ఈ స్నానము పిదప వధువు కేశములకు ధూపమువేసి పువ్వులను ముడుచుటను పార్వతీ పరిణయము పేర్కొనినది.

తోయజానన మరియోర్తు ధూపమొసఁగి
గోవజవ్వాది పంకించి కురులు దువ్వి
గంటుగావైచి యందు మాంగల్యమగుట
నిప్పుపూవుల దూర్వాల నెత్తి చెక్కె"–[3]

చంద్రాంగద చరిత్రయందును వధువునకు స్నానము చేయించి దౌతవస్త్రము తలకు చుట్టి నీరు పోవునట్లు తుడచి, ఒడలు తడియొత్తి, సాంబ్రాణి ధూపము వేసి తడియార్చుట విపులముగా వర్ణింపబడినది.–[4]

అలంకరణ :– స్నానానంతరము వధువును అలంకరింతురు. ఈ అలంకరణ మొదట ముఖమునకు పసుపు అలదుటతో ప్రారంభమగును.

"పసుపు పుయ్యరాదటే భామా శ్రీకృష్ణునకు.... ...."–[5]

---

1. నేను సేకరించినది. పాడినవారు – సుమిత్రాదేవి, యం.ఎల్.ఎ.
2. నేను సేకరించినది, పాడినవారు, సుమిత్రాదేవి, యం.ఎల్.ఎ.
3. పార్వతీ పరిణయము, ఆ5.ప.129
4. చంద్రాంగద చరిత్ర – ఆ 6 ప 22–28
5. సెలయేరు. పుట–27.

– అని ముఖమునకు పసుపును అలది

గంధం పొడి చల్లీరిటు గౌరిశంకరుల్
అందముగా సుందారులు ఆనందమున వేగ–[1]

– అని గంధము పొడిని చల్లి

తిలకము దిద్దరే పెండ్లి తిలకము తీర్చరే
కలకల లాడేటి ఎలనవ్వు మొగమున....–[2]

– అని కళ్యాణ తిలకమును దిద్దుదురు. ఈ పాటలు లెక్కకు మిక్కిలిగా నున్నవి. ఇవియే ఒక పెద్ద గ్రంథమంతయగును.

పెండ్లి కవసరమగు వస్తువులన్నింటిని ముందే సిద్ధము చేసికొని యున్నను ఈ రోజుతో పెండ్లి ప్రారంభింపబడు చున్నదను అర్థముతో పేరునకు ముత్తైదువల చేత కొన్న వడియములు పెట్టించుట, పసుపును దంపించుట వంటి పనులను చేయుదురు. ఈనాడు కుమ్మరి పుట్టమన్నును పూజచేసి తీసికొని వచ్చి పెరటిలో వంటల నిమిత్తము "గాడిపొయ్యిలు" వేయును. వాని పైననే పెండ్లి వంటలను వండుదురు. గాడి పొయ్యిలు వేయగా మిగిలిన పుట్టమన్నును లగ్నమండప మును–[3] వేయుటకుపయోగించు మన్నులో కలుపుదురు. లగ్నమండపముపైన చిన్న పందిరిని, దానిపైభాగమును కలుపుకొని పెద్దపందిరిని "పెండ్లిపందిరి" అని వేయుదురు. ఈ పందిరికి వాడు పందిరి గుంజలకు మఱ్ఱి. మేడిచెట్ల కొయ్యలను వాడుదురు. పందిరిపై నీడకు ఈ చెట్ల మండలతోబాటుగా చొప్ప కఱ్ఱను కూడ వాడుదురు. లగ్నమండపమునకు వాడు కొయ్యలలో తల్లి గుంజ అని ఒక మఱ్ఱి కొయ్యను. పిల్ల గుంజ అని ఒక మేడి కొయ్యను వాడుదురు. పెండ్లి కూతురును చేసినది మొదలు "పదాహార్లపండుగ" ను జరుపునంతవరకు ప్రతిదినము లగ్నమండపమున అలికి ముగ్గులు వేసి రాత్రి సమయమున దీపము వెలిగింతురు.

ఉత్తర భారతములోని ఛత్తీస్ గడ్ ప్రాంతముననను వివాహసందర్భమున మొట్ట మొదట క్రొత్త మన్ను తెచ్చి పొయ్యి వేయుట ఆచారము. దీనిని "చులామాటీ"

---

1. సెలయేరు. పుట–27.
2. సెలయేరు–పుట–26
3. లగ్న మంటపము అని కూడ వ్యవహారము.

అని యందురు –[1] మరికొన్ని ప్రాంతములలో దీనినే "మట్‌మంగరా" అందురు. అనగా మృత్తికా మంగళము (మంగళ కార్యములకు మృత్తికను తెచ్చుట) అని అర్థము. ఈ మృత్తికతో పొయ్యిని, వివాహ వేదికను సిద్ధపరతురు –[2]

గుజరాత్ రాష్ట్రములో పెండ్లికిముందు సంక్రాంతిదినములలోని గొబ్బెమ్మవంటి పేడకుప్పలను చేసి యింటిలో ప్రతిష్ఠించి పూజింతురు. దీనితో వివాహకార్యము ప్రారంభమగును. దీనిని ఉకరడీ బేసాడవి అనగా "గోమయ పర్వత దేవి" అని అందురు. ఈ సందర్భమున పెక్కు పాటలు పాడుదురు. ఈ ఉకరడీ దేవిని ఇంటిలో వివాహకార్యములు పూర్తి యయిన పిదప ఉద్వాసనము చేయుదురు. –[3] ఔత్త రాహులు పెండ్లిపాటలను "సోహాగ్ గీతము" లందురు.

నలుగులు, తలంటు స్నానములు, అలంకరణలు పూర్తి యయిన పిదప వధూవరులకు ఎవరింట వారికి తల్లిదండ్రులతో బాటుగా పెండ్లికి వచ్చిన బంధువర్గము నూతన వస్త్రములను, బంగారు, వెండి వంటి ఆభరణములను ఇతర కానుకలను తమతమ తాహతును బట్టి సమర్పించుకొందురు. ఈ తతంగమునంతయు "పెండ్లిపిల్ల" ను చేయుట, "పెండ్లి పిల్లవానిని" చేయుట అందురు. వివాహములలో వధూవరులు ఒకరి ప్రక్కన నొకరు కూర్చుండు వరకు వధువునకు తోడుగా "తోడి పెండ్లిపిల్ల" వరునకు తోడుగా "తోడిపెండ్లి పిల్లవాడును" ఉందురు. వధూవరులకు జరుగు అలంకరణయంతయు వారికిని జరుగును. వీరు వధూవరులకు మరదులు మరిది వరుసలోని వారై యుందురు. ఈనాడు పెండ్లి కుమారుని చేతికి ఒక అడకత్తెర నిచ్చెదరు. దీనిని పెండ్లిపూర్తియగు నంతవరకు అతడు తన హస్తమునందే పట్టుకొనవలెను. ఈ అడకత్తెర వీరోచితమైన కత్తికి ప్రతిరూపము కావచ్చును.

పెండ్లి కూతురును చేసిన దినము మొదలు వివాహతంతు పూర్తియగు నంతవరకు పెండ్లియింటిలో మంగళవాద్యములు మ్రోగుచునేయుండును. నలుగుల తరువాత కొట్నములను దంచుట ప్రారంభమగును.

1. ఛత్తీస్‌గఢీ లోక్ జీవన్ ఔర్ లోక్ సాహిత్యకా అధ్యయన్ (హిందీ) పుట–128.
2. సోహాగ్ గీత్–(హిందీ)–పుట–36.
3. ప్రొఫెసర్ పి. చందేర్ వాకర్ ప్రసంగము. Folklore Fellows of India, Annual meeting, Mysore. 5-11-78.

కొట్నములను దంచుట గార్హాస్థ్యజీవితమునకు ప్రాచీనులుద్దేశించిన సంకేతము కావచ్చును. క్రింద పేర్కొనిన పాట వంటి సువ్వి పాటలను పాడుచు తెలుగు దేశమంతటను కొట్నములు దంచుట ఆచారమై యున్నది.

సువ్వి సువ్వి రామచంద్ర సువ్వి సువ్వి కీర్తిసాంద్ర–[1]

పెండ్లి మండపమున వడ్లతో లేదా బియ్యముతో ప్రోలు వ్రాసి పెండ్లి పీటలమీద వధువింట తోడు పెండ్లికూతురుతో కూడిన వధువును, వరుసయింట తోడు పెండ్లి కుమారునితో కూడిన వరుని కూర్చుండ బెట్టి ముత్తైదువలు ముఖ్యముగా ఐదుగురు ముత్తైదువలు అలంకరించిన కుందెన యందు లేదా కుదురునందు పసుపును, ధాన్యమును దంచుదురు. కుంది అను మాటకు కుందియన, కుందెన అను రూపాంతరములును కలవు.

కొన్ని ప్రాంతములలో కొట్నములను దంచునప్పుడు "అల్లోనేరెడల్లో" అను పల్లవి గల పాటలను పాడుదురు.

"అల్లోనేరెడల్లో అల్లల్ల నేరాటి అల్లో నేరడల్లో
పుట్టెడు ఉప్పుల–పుట్టెనొక మాను ॥అల్లో॥
అల్లనేరేడి కింద–సల్లన్ని చెలిమె ॥అల్లో॥
నల్లన్ని చెలిమాల–సద్దారగించి ॥అల్లో॥
సద్దిదిన్నాగుడ్డ–సల్వలో (చల్లనీళ్లలో) పిండి ॥అల్లో॥
చెంబుతో నీళ్లుబోస్తే–చెట్టాయె మాను ॥అల్లో॥
కుండతో నీళ్ల బోస్తే–కురుసాయె మాను ॥అల్లో॥
పేర్పుతో నీళ్ల బోస్తే–పెద్దాయె మాను ॥అల్లో॥
మా యింట్ల (టిలో) సితమ్మ పెండ్లిల్ల నాడు ॥అల్లో॥

– ఇచ్చట సీతమ్మ అను పేరు స్థానమున "పెండ్లికూతురు" పేరేది యుండిన దానిని పేర్కొనవలెను, మగపిల్లవాడైన అతని పేరును పేర్కొనవలెను.

ఆ మాను చెక్కాలు పెండ్లి పీటాలు ॥అల్లో॥
ఆ మాను ఆకుల్లు శ్రీ దోరణాలు ॥అల్లో॥
ఆ మాను కాయాలు పెండ్లి పోకాలు ॥అల్లో॥–[2]

---

1. సెలయేరు–పుట–42
2. నేను సేకరించినది, పాడినవారు శ్రీమతి సుమిత్రాదేవి, ఎమ్. ఎల్. ఎ. ఇబ్రహింపట్నం

ఈ పాటలో "అల్లో నేరడల్లో" అను పల్లవిని ఉపయోగించుటయేగాక నేరేడు చెట్టునకును ప్రాధాన్యమివ్వబడినది. నేడు గ్రామములలో నేరేడు కట్టెతో గాక పెండ్లి పీటలను మఱ్ఱి కట్టెతోనైనను లేదా మేడి కట్టెతోనైనను తయారు చేయుచున్నారు. తోరణములకు గట్టు ఆకులలో మామిడి ఆకులకే ప్రాధాన్యము గలదు. కొట్నములను దంచుటకు "ఉలూఖలపూజ" అందురు. ఉలూఖల మనగా రోలు; రోలును పూజించుట అని అర్థము. కొట్నముల నొకవైపు దంచుచుండ మరియొక వైపు కొందరు పుణ్యాంగనలు అలంకరించిన విసరురాతిలో పసుపుతో గూడిన బియ్యమును విసరుదురు. దీనిని "పచ్చపిండి" అందురు. విసరుట గూడ కొట్నములు దంచుట క్రిందనే పేర్కొనబడును.

సీతాకళ్యాణము పాటలో కొట్నములు దంచునప్పుడు "బాలరో నువురావె పసుపుదంచేము" అని వనితలు పరస్పరము పిలుచుకొనుచు వడ్లు దంచుట వర్ణింపబడినది. పసుపు దంచుటకును, వడ్లు దంచుటకును కూడ పసుపు దంచుట అను వ్యవహారము–వివాహ సమయమున శుభసూచకముగా భావింపబడుచున్నట్లు తోచుచున్నది. ఆ స్త్రీలు క్రింద పేర్కొనిన ధాన్యములు దంచినట్లు ధాన్యములకు సంబంధించిన పెక్కు పేర్లు ఈ పాటలో నున్నవి.

"గరుడ వాహనాలు గౌరికుంకాలూ
కురవ బాణములు కృష్ణ భోగాలూ
వగంక సన్నలు పెద్ద వడ్లాణములూ
కంకణములు లక్ష్మీనారీయ మణులూ
మాదేవి కాటుకలు మల్లె చిన్నాలూ
దూది భోగాలును దొంతి మల్లెలునూ
కొత్త వరి ధాన్యములు గొడబ ధాన్యాలు
ముత్యాసరి ధాన్యాలు ముక్క ధాన్యాలు
బంగారు తీగెలు ....
.... కామ భోగాలు
శాలి ధాన్యములు నారీయమణులు
వివరించి దంచేరు వేడ్కతో నపుడు
పవుడంపు రోకళ్లు బంగారు కట్లు
మివుల చంద్రుని మించు మోములు మెరియా

మంచి ముత్యము చేర్ల మించు ముగ్గాలూ
భాసిల్లు రత్నాల బావిలిలొరయ
గంధకస్తురి పూత కరగి చెమరింప
సందిటి దండల జారు పయ్యదలు
కుడి ఎడమ బాహువుల కూడి పట్టుచును
ఎడలేక దంచేరు వేడ్కతో నపుడు
నట రాగములతో ఆడిపాడుచు
పాటలు పాడేరు పణతు లందారు
సువ్విసువ్వన్న లారా సువ్విసువ్వన్నలారా
సువ్వనీ పాడేరు సీతారాములకూ. –[1]

ఈ పాటలో "నాటరాగములతో ఆడిపాడుచు" అనియుండుట వలన కొట్నముల పాటలు నాటరాగములో పాడెడి వారని తెలియుచున్నది. దీనిలో కొట్నములు దంచునప్పటి స్త్రీల హొయలును, చేష్టలును కవయిత్రి ఎంతో అందముగా వర్ణించినది. పైటలను మూర్చిమార్చిసర్దుకొనుట, తోడి యిల్లాండ్రను పిలచుట స్వాభావికముగ నున్నది.

కొట్నములను దంచుట భల్లాణ చరిత్రమున మనోహరముగా వర్ణింప బడినది. –[2] కొట్నములను దంచిన పిదప సుంకులు చెరుగుదురు. సుంకు అనగా "పెండ్లియందు పళ్లెరమున బోసి వధూవరుల మీద చెరుగు బియ్యము"–[3] ఈ బియ్యము కొట్నములో దంచిన బియ్యముగా భావించవలెను. బియ్యముతో బాటుగా విసరురాయిలో త్రిప్పిన పచ్చ పిండిని కూడ వాడుదురు. సుంకులు చెరుగుటకు శబ్దరత్నాకర కారుడు రామాభ్యుదయములోని ప్రయోగమును పేర్కొనెను. –[4]

సరంకులు చెరుగునప్పుడు
"తరుణలా దోలరే తల్లులా బిలువ
తనరాములా మీద సుంకులా చెరగ
అతివలా దోలరే అక్కలా బిలువ

1. స్త్రీల రామాయణపు పాటలు–పుట–65
2. భల్లాణ చరిత్రము–వారేశ్వరుడు. ఆశ్వాసము–4; పద్యము–3.
3. శబ్దరత్నాకరము;
3. రామాభ్యుదయము. ఆశ్వాసము–8.

అల్లవారీమీద సుంకులూ చెరగ,
వనితల దోలరే వదినలా బిలువ
వరదరాయనీ మీద సుంకులూ చెరగ
మగువలా దోలరే మరదండ్ల బిలువ
మన రాములా మీద సుంకులూ చెరగ–[1]

– తల్లి మొదలు మరదండ్ర వరకెవ్వరైనను సుంకులు చెరగవచ్చుననిపై పాటల వలన తెలియుచున్నది. కొట్నము పెట్టించి సుంకులు చెరుగుట యన్నది మన్నారు దాస విలాసమునను–[2] పార్వతీ పరిణయమునను ప్రస్తావింప బడినది.–[2]

కొన్ని యక్షగానములలో "సుంకులు దంచే పాట" సువ్వి గను, "సుంకులు చెరిగే పాట" సువ్వాలగను కన్పట్టు చున్నది. సుంకులు చెరిగే పాట అల్లో నేరేడుగను పరిగణింపబడినది.–[4]

తెలంగాణమున కొట్నములను దంచునప్పుడు జరుపబడు వేడుకలలో "మైలపోలు" ఒకటి. మంగలి మామిడాకు తోరణములతో అలంకరింపబడిన ఒక అరుగుపైన వడ్లతో పోలు రచించును. దీనినే "ప్రోలు వ్రాయుట" అని కూడ అందురు. పోలులో పీటలనువేసి తోడిపెండ్లి కూతురుతో కూడిన వధువును కూర్చుండ జేసెదరు. ఈ సమయమున వీరు ధరించిన వస్త్రములు మంగలికి యివ్వబడును. కనుక పెండ్లికూతురు సహజముగా పెండ్లి దినములలో ధరించు క్రొత్తబట్టలను వదలి పాతబట్టలు వేసికొని పోలులో కూర్చొనును. మంగలి ఆమె తలంటి దక్షిణ తీసికొనును. ముత్తైదువలు కొట్నములను దంచి వధువుపైనను తోడి పెండ్లికూతురుపైనను సుంకులు చెరుగుదురు. పిదప వీరికి మంగళ స్నానములు చేయించెదరు. పోలులో వ్రాయబడిన వడ్లను మంగలి తీసికొనును. పెండ్లి కూతురు పైనుండి త్రిప్పి పనిబాటల వారికందరికిని డబ్బు పంచబడును. దీనిని "సత్కా" తీయుట అందురు. మంగళ స్నానానంతరము అలంకరింపబడిన తోడి పెండ్లి కూతురుతో గూడిన వధువును, వధువు తల్లిదండ్రులను పీటలమీద కూర్చుండబెట్టి వధువు మాతామహులు కట్నములనిచ్చెదరు. వధువు తల్లికి "ఒడి

1. జానపద గే. వాఙ్మయ పరిచయము–హరి ఆదిశేషువు. పుట–295.
2. మన్నారు దాసవిలాస ప్రబంధము–రంగాజమ్మ, ఆ. 5 ప. 26.
3. పార్వతీ పరిణయము. ఆ. 5 ప. 121.
4. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర. పుట–349.

బియ్యము" నింపెదరు. ఒడిబియ్యము నింపుకొని కన్యాదానమును చేయుట ఆచారము. భార్యాభర్తలిద్దరును ఒడి బియ్యమునకు పుట్టింటి వారు తెచ్చిన వస్త్రములనే కన్యాదాన సమయమున ధరించి కూతురును కన్యాదానము చేయుదురు. వధువు పైన మైలపోలు లోనే సుంకులు చెరగ బడినవి గనుక మంగళస్నానానంతరము మరల కొట్నములను దంచుట. సుంకులు చెరగుట జరుపబడవు. పోలులో మంగలి తలంటులు, ముత్తైదువలు సుంకులు చెరగుట, మంగళ స్నానములు చేయించుట--వంటి పరిశుభ్రతను తెలుపు పనులు చేయబడును గనుక ఈ కార్యక్రమమునకు "మైలపోలు" అను పేరు వచ్చియుండును. ఈ మంగళ స్నానము నలుగులతో కూడిన స్నానము వంటిదే. పిదప ముత్తైదువలు మంగళ వాద్యములతో కుమ్మరింటికి పోయి ఐరేని కుండలను తెచ్చెదరు. అంతవరకు ఐరేని కుండలు తెచ్చు ప్రసక్తి లేదు. ఇట్లే వరుని యింటను, కొందరి వంశములలో వరునకు వరునింటగాక వధువింటనే మైలపోలు వ్రాయుట కలదు. వీరి ఆచారమును బట్టి పోలు వ్రాయకమే కొట్నములను దంచుదురు. ఐరేణి కుండలను నిలుపరు. ఇట్టి పెండ్లికొడుకును "నల్లపెండ్లి కొడుకు" అందురు. పోలు వ్రాయబడి మంగళ స్నానము చేయించబడిన పిదప "తెల్లపెండ్లి కొడుకు" అందురు. ఈ ఆచారము నేటికిని పాటించబడుచున్నది.

ఐరేణి పూజ :- ఐరేణి అను పదమును "అవిరేణి, అయిరేణి" అని వ్యవహరించుట కలదు. ఐరేణి కుండలను మనోజ్ఞముగా రంగులలో నలంకరింతురు. ప్రాచీన వివాహాచారములలో శచీదేవి (ఇంద్రాణి) పూజ కలదు. ఇంద్రాణి ఇంద్రుణి భార్య ; భారతీయ మహిళలకు గృహములో నుండు స్థానమును అనగా గృహిణి అయిన పిదప పతి గృహమున తనకుండుస్థానమును సూచించు దేవత "ఈమెపురుషునకు జవసత్త్వములు ప్రసాదించుచున్నది. ఒక ఋక్కులో ఈమెయే తన గొప్పతనమునిట్లు చెప్పుకొనినది– "నాకు ప్రతి ద్వంద్వులు లేరు. నేను శత్రువులులేని దానను"–ఈమె పెక్కుమంది సపత్నులను పోరాడి జయించును"–1 కొన్ని వ్రతములలో కలశమును ప్రతిష్ఠించి దేవతను ఆవాహనము జేసిపూజలు జరుపునట్లు ఈ ఐరిణీ దేవతను గూడ కలశములో ఆవాహనజేసి పూజించుట ఆచారమైయుండును. ఈమె పురుషునికి జవసత్త్వములను, స్త్రీకి

1. యుగయుగాలలో భారతీయ మహిళ పు. 86

గృహములో స్థానమును ప్రహరించు దేవతగనుక వివాహములందు ఈమె పూజకు ప్రాధాన్యమేర్పడి యుండును. ఆ పూజకు చిహ్నామే నేడు ఐరేణి కుండలలో శేషించినట్లు నేను భావించుచున్నాను. ఇంద్రాణి అనుపదము అయిరాణి అని ప్రాకృతమున అయి– తెలుగున అయిరేని, అవిరేణి అని మారినది.–[1] ఐరేణిని లక్ష్మీ దేవిగా భావించి పూజించుట కూడ ప్రచారమునందున్నది.

ఈ ఐరేణి భాండములు వివాహమునకు సంబంధించినవి గనుక వీనిని చిత్రవిచిత్రముగా అలంకరించుట ఆచారమై యుండును. ఆ ఆచారమే క్రమముగా నేడు గూడ అనుసరింపబడుచున్నది.

బ్రాహ్మణేతర వివాహ తంత్రమునందు వీనికెక్కువ ప్రాముఖ్యము కలదు. కుండలపై వేయు చిత్రములందు ఒక్కొక్కప్పుడు వధూవరులను చిత్రించుట కూడ కలదు. సామాన్యముగా పత్రములు, ఫలములు, పుష్పముల రేఖాచిత్రములు, ముగ్గులు చిత్రింపబడును. దీనిని "చిత్తరి, చిత్తారి" అందురు. ఐరేణి కుండలను తెచ్చుటకు వెళ్లు ముత్తైదువలు వదినా మరదండ్ర వరుసలోనున్న వారై యుందురు. వీరు మంగళ వాద్యములు తోడుగా కుమ్మరింటికి పోయి కుమ్మరికి కానుకలిచ్చి అవిరేణులను (రెండు కుండలు) తెచ్చెదరు. మధ్యన ఇరువురు వానిని మోయుచుండగా నాలుగు ప్రక్కల నలుగురు అవిరేణులకు క్రొత్త గుడ్డలతో నీడను పట్టెదరు. వానిని ఇంటికి తెచ్చి దేవునింటిలో అడుగున ధాన్యమునుబోసి ధాన్యముపై పొందుగనింపి ఐరేణి కుండలకు వెండి లేక బంగారు నగలను తగిలించి కుండలపైన మూకుడుల (ళ్ల)లో ఆముదమును పోసి ప్రత్తితో చేయబడిన వత్తిని వేసి వెలిగించెదరు. దీనిని మహాలక్ష్మి నావాహన చేయుట అందురు. బాసికములను (బాసింగములను) ఐరేణి కుండల కెదురుగా బెట్టి పూజించెదరు. వధువు లగ్నమునకు ముందు గౌరీపూజను ఐరేణుల కెదురుగా కూర్చొని జరుపును. వివాహానంతరము వధూవరులను ఐరేణికెదురుగా కూర్చుండ బెట్టి "నెయ్యితో గూడిన పాలను ఒకే గిన్నెలో ఉంచి ఇద్దరి చేత త్రాగించి, బాసికములను విప్పిఐరేణు కెదురుగా నుంచి వధూవరుల చేత నమస్కరింప చేయుదురు.

1. పాఈ శబ్దమహార్ణవ.

ఐరేణిపైని మూకుడులోని దీపమును ఎల్దండ రఘుమారెడ్డిగారు "దీనిని హోమ శిఖగా భావింప వచ్చునేమో! వివాహములో వైదిక సంప్రదాయమైన హోమాగ్ని ప్రదక్షిణమిట్లు మిగిలి యుండవచ్చును."–[1] అని పేర్కొనినారు. వరుని యింటను ఐరేణి పూజ జరుపబడును. పెండ్లి పూర్తి అయిన పిదప ఐరేణుల అడుగుననున్న ధాన్యమును (సామాన్యముగా వడ్లనే ఉపయోగించెదరు) తీసి భద్రపరచి పంట విత్తనములలో కలుపుదురు. కొందరు నాగవల్లి సమయమున ఈ అవిరేణులనే నాగబలి ప్రోలునకు ఎదురుగా నుంచెదరు. కొంధరు నాగవల్లిలో పోలు ముంతలను మాత్రమే నుంచుదురు. అవిరేణి కుండలను తెచ్చుటకు వెళ్లిన ముత్తైదువులు కుమ్మరి యింట ఈ క్రింది పాట పాడెదరు.

"కుమ్మారి కుమ్మరి ఓయి కుమ్మారి, రాజులు పిలిసీరి రావు కుమ్మారి
నను బిలువ రాజూలకు ఏమికారణము
నిను బిలువ రాజూలకు పెండ్లి కారణము
ఊరూరకుమ్మర్ల ఊరి పా(పే)ద పిలచి
తన ఊరి కుమ్మరిని దాయంగ (ప్రేమతో) బిలచి
ఊరూరు కుమ్మార్లకు ఉంగరాల జోడు
తన ఊరి కుమ్మారికి దండగడియాలు
ఐరేండ్లు జేయమాని ఆజ్ఞానిచ్చే
పాయనే కుమ్మారి పొలము బాటల్ల
ఎఱ్ఱగుంట్ల మన్ను వెయ్యి తట్టల్ల
పచ్చగుంట్ల మన్ను పది తట్టల్ల
నల్లగుంట్ల మన్ను నాలుగు తట్టల్ల
ఆమన్ను ఈమన్ను కలరాసి బోసి
తొక్కేనే కుమ్మారి తొడలు కదలంగ
పిసికేనే కుమ్మారి తొడలు కదలంగ
చేసెనే కుమ్మారి చేయి కదలంగ
మలిపేనే కుమ్మారి మట్ట కదలంగ

–ఇట్లు పాట పాడుచు

1. పల్లెపదాలలో ప్రజాజీవనము–ఎల్దండ రఘుమారెడ్డి–చతుర్థ ప్రకరణము.

పటవయ్య కుమ్మారి నీ కట్నాలు బట్టు
మా ఐరేండ్లు మాకు ఇచ్చేయవయ్య
ముత్యాల అటువంటి అచ్చంతలతోని (అక్షతలతో)
ముత్తైదల కందించే ముద్దు ఐరేండ్లు"–[1]

– ఐరేండ్ల నిచ్చినందుకుగాను కుమ్మరికి కట్నములనిచ్చి ఐరేణి కుండలను తీసికొని వచ్చెదరు.

కుమ్మరి యింటినుండి ఐరేణులను తెచ్చి లక్ష్మీదేవిని ఆవాహనము చేసిన పిదప లక్ష్మిని పూజించుచు ఈ పాట పాడెదరు.

జయ మంగళం నిత్య శుభ మంగళం
దివ్యాంబరములు గట్టి దీపాలవెలుగున
నవ్వుచు మహాలక్ష్మి నాట్యమాడా
ఇలవేల్పు నీవు వెలసితివి మాయింట ॥జ॥
సిరిగజ్జెలను గట్టి శ్రీమహాలక్ష్మి మాతల్లి
చిందులు త్రొక్కుచు స్థిరముగాను
ఏక చిత్తంబున యెప్పుడు మాయింట
పాయక భక్తితో నుందువమమ్మ ॥జ॥
....
ఉల్లాసముతోను ఊరుపాలించుచు
ఎల్లప్పుడుప్పొంగు తుందువమ్మా
....
అడిగినప్పుడు మాకు అభయమిచ్చి
కోరిన కోరికలు కొనసాగింతువని
బలువయిన పట్టునే పడితినమ్మా
....
అందముతో నీవు అవిరేణిలో నిల్చి
తప్పులు యెంచక దయను జూచి
ఎప్పుడు నీపాద సేవజేసేమమ్మ
గొప్పగా దయజూచి కోరికలు తీర్చులక్ష్మీ ॥జ॥ –[2]

1. నేను సేకరించినది. పాడినవారు – సుమిత్రాదేవి, ఎమ్.ఎల్.ఎ.
2. సెలయేరు. పుట–35–37.

– ఇట్టి అవిరేణి పాటలెన్నియో కలవు. [1] వానిని బట్టి వివాహమునందు ఐరేణి కుండల ప్రాముఖ్యము, వాని యెడల ప్రజలకు గల భక్తి విశ్వాసములు వెల్లడి యగుచున్నవి.

తెలంగాణా పల్లెపాటలలోని ఐరేణి పాటలలో
"అయితే నిను గన్న తల్లి అవిరేణి మంగు
మంగు నిను గన్నతల్లి మామిడాల ఎల్లి
ఎల్లి నిను గన్నతల్లి ఏకాంబ్రజ్యోతి
ఏకాంబ్రజోతమ్మ ఎవ్వరాడపదుచు
మాదిగోరి ఆడబడుచు మధుపుటేనుగ
గోసంగి చెల్లెలమ్మ కొమ్ముటేనుగ – [2]

– అని యున్నది. ఈ పాటలో ఐరేణిని ఎల్లమ్మగను, ఏకాంబ్రజ్యోతి (అరుంధతి) గను చెప్పుటవలన ఐరేణి పూజలలో కొన్ని వంశములవారు వీరిని పూజింతురని స్పష్టము. ఎల్లమ్మను వివాహములలో కులదేవతగా గల బ్రాహ్మణులు వివాహసమయమున ఎల్లమ్మ పూజారులగు గోసంగులను (మాల పూజారులను) పిలిపింతురు. ఆ గోసంగి యెదుట వధూవరులు, వారి తల్లిదండ్రులును పరాఙ్ముఖముగా నిలబడుదురు. గోసంగి వేపమండతో వారిపై ఎల్లమ్మ నభిషేకించిన జలమును ప్రోక్షించును. ఆ జలమును తుడిచి వేసికొనక వారందరును పెండ్లి పీటలపై వచ్చి కూర్చుందురు. గోసంగికి బహుమానము లిచ్చి పంపుదురు. ఈ ఆచారము రాయలసీమలో ఎల్లమ్మ ఇలవేల్పుగా గల వైదిక బ్రాహ్మణ కుటుంబములలో నేటికిని ఉన్నది. దీనిని బట్టి మొదట ఐరేణి-వేదకాలపు ఇంద్రాణిగను, పిదప లక్ష్మీదేవిగను, అరుంధతిగను, ఎల్లమ్మగను ఆరాధ్య దైవమయినట్లు భావింప వచ్చును. గోసంగులు పూజారులగుట వలన సందేహించినను వివాహాది శుభకార్యము లందు పూజింపకున్ననేమి విప్రతిపత్తి యుండునో యను సందేహముతో, ఎల్లమ్మను పూజించు ఆచారము గల బ్రాహ్మణులలో ఇప్పటకిని ఎల్లమ్మను లాంఛనముగ పూజించుట జరుగు చున్నదనియు మనము భావింపవచ్చును. థర్స్టన్ కూడ ఎల్లమ్మకు గోసంగులు

1. పల్లెపదాలు పుటలు–84–85 తెలం. పల్లెపాటలు పుటలు–115,116,117
2. తెలంగాణా పల్లెపాటలు–పుటలు 116, 117.

పూజారులని పేర్కొనెను.[1] ఈ ఆచారమును పరిశీలించిన ఎల్లమ్మ నేడున్నట్లు గ్రామ దేవతగను, కడజాతివారి దేవతగను గాక అగ్రజాతివారి ఆరాధ్య దైవముగా నుండినట్లు స్పష్టమగు చున్నది.

కుమ్మరింటి నుండి ఐరేణి కుండలతో బాటు గడియ బుడ్లను (రెండు), పోలు ముంతలను (నాలుగు) కూడ పెండ్లింటికి తెచ్చుట ఆచారము. ముందే పేర్కొనినట్లు పోలు ముంతలను నాగవెల్లి సమయమున పెండ్లిమండపములో బెట్టి వధూవరుల చేత పూజింప జేయుదురు.

"పొడిసేటి సుక్కాలు–పోలు ముంతాలు
....
అట్లొచ్చె సందమామ–ఐరేని కడువ
ఘనమైన చంద్రుడు–అదిగరిగె బుడ్డి"–[2] నాగవల్లి సమయమున వివాహమండపమునకు నాలుగువైపుల నాలుగు పోలు ముంతలనుంచి వాని యంచులను కలుపుచు నాలుగు ప్రక్కలను ఐదు వరుసలుగా దారము చుట్టి యొక చవికెవలె నేర్పాటు చేయుదురు. వాని మధ్యన పంచవన్నెల పిండితో ముగ్గులను తీర్చెదరు. ఆ దారమును పోలు దారమనియు, ఆ ముగ్గులను పోలనియు జానపదులు వ్యవహరింతురు. పోలులో ముగ్గులను కులములను బట్టి రచించెదరనియు ఉదాహరణమునకు బలజ కులమువారు కంచెర గాడిద ఆకారమునను, కుర్మకులమువారు గొఱ్ఱె ఆకారమునను రచించెద రనియు అందుకు కారణమైన కథలను డా॥ నాయని కృష్ణ కుమారిగారు పేర్కొనినారు.–[3] గడియ బుడ్డినే గడియకుడుక, గడిగ బుడ్డి, గరిగె బుడ్డి అని కూడ వ్యవహరింతురు. పూర్వకాలమున గడియారములు లేనికాలమున ఈ గడియబుడ్డికి అధిక ప్రాధాన్యముండెడిది. ఇది వివాహ ముహూర్తమును తెలుపుటకు తోడ్పడు చుండెను. సామాన్యముగా పగటి వేళ సూర్యగమనమును బట్టియు, రాత్రివేళ నక్షత్ర గమనమును బట్టియు జానపదులు వేళలను గుర్తుపట్టుదురు. కాని ముహూర్త గడియలకు ఎటువంటి అవాంతరములును కలుగకుండ నుండునట్లు ఈ గడియ

1. Castes & Tribes of Southern India by Edgar Thurston VI Volume. Madras 1909. page.105.
2. నేను సేకరించినది. పాడినవారు; సుమిత్రాదేవి; ఎమ్.ఎల్.ఎ.
3. తెలుగు జానపద గేయ గాథలు–డా. నాయని కృష్ణకుమారి పుటలు–142, 143.

బుడ్లను తెచ్చి యుంచు చుండెడివారట. ఇవి రెండు బుడ్లు బుడ్డికి చిన్న రంధ్రముండును, రంధ్రమున్న బుడ్డిలో నీళ్లనుబోసి రంధ్రము లేని బుడ్డిపైన నుంచెదరు. పై బుడ్డిలోని నీళ్లు క్రింది బుడ్డిలోనికి దిగువరకు ఒక గడియ కాలము అగునట్లు ఏర్పాటు చేయుదురు. అట్లు పై బుడ్డి ఖాళీ అయినంతనే మరల క్రింది బుడ్డిలోని నీరును పై బుడ్డిలోనికి పోయుదురు. అట్లు గడచు గడియలను లెక్కించుటకు బుడ్డిపైన రంగుతో గుర్తులుగా గీతలను గీయుచుండిరి. బుడ్లు గీతలతో నిండిన, ఐరేణి కుండలపైన గీయుచుండెడి వారట. ఒక వ్యక్తి ప్రత్యేకము ఈ లెక్కలను గమనించుటకే వాటిచెంత నుండెడివాడు. ఈ నీళ్లకు లోపము జరుగకుండ పూర్వమువారు ఐరేణి కుండలలోను నీళ్లను నింపి ఉంచెడి వారట. ఇప్పుడు నీళ్లకు మారుగా ఐరేణి కుండలలో నవధాన్యములను నింపుచున్నారు. నేడు గడియారములు వచ్చుట వలన గడియలను లెక్కించుచు గీతలు గీయుటకు మారుగా కుండలపైన కుమ్మరి ముందుగనే గీతలను (చిత్తారిని) గీసి తీసికొని వచ్చు రూపమున ఈ ఆచారము మిగిలినట్లు తోచుచున్నది.

ఐరేణి కుండలను ముత్తైదువలు కొన్ని తెచ్చుట, బాసింగములు కట్టుట, తలంబ్రాలు పోయుట మున్నగు వివాహ పద్ధతులను చేమకూర వేంకటకవి విజయ విలాసమున సుభద్రా పరిణయ ఘట్టమున కడు రమ్యముగా వర్ణించినారు.

సీ॥ కుల దేవతను దెచ్చి నిలిపిరి మాణిక్య
　　　చకచకల్ గలపెండ్లి చవికెదండ
నైరేని గొనివచ్చి రైదువల్ పాటలు,
　　　పాడుచు శుభవేళ వేడుకలరఁ
బులు గడిగిన ముత్తెములు బాసకంబులు,
　　　సరవిఁ గట్టిరి నేర్పు సంఘటిల్లఁ
దల బ్రాల కేర్చి ముక్తామణుల్
　　　పసిడి పళ్లెముల సంభ్రమము మీఱఁ
....
　　　నంతి వురమున నుత్సవం బయ్యెనపుడు. –[1]

1. విజయ విలాసము. ఆ.3 ప. 94.

ఊరిలోని సంబంధమైనను, ఇతర గ్రామములలోని సంబంధమైనను మగపెళ్లి వారిని పిలచుకొని వచ్చుటకు ఆడుపెళ్లి వారివైపునుంచి కొందరు పెండ్లికి ముందురోజే వెళ్లుదురు. వరునకు వధువు వైపునుంచి వచ్చిన పెద్దలలో నొకరు (సామాన్యముగా వధువు తండ్రి అయినను, సొదరుడయినను అయియుందురు) పట్టు శాలువా కప్పి పెండ్లికి ఆహ్వానింతురు. మగపెళ్లివారు ఆడుపెళ్లివారి ఊరును చేరు సమయము సామాన్యముగా సాయంకాలమే అయియుండును. సమయ వేళ సూచనను ఈ క్రింది పాదములు సూచించుచున్నవి.

"చెండువే పువ్వులు కొయ్యనేళాయె (వేళాయె)
చెందురుని బాసింగం కట్టనేళాయె
మల్లెవే పువ్వులు కొయ్య నేళాయె
మన్మధుణి బాసింగం కట్టనేళాయె
భీముణి బాసింగం కట్టనేళాయె

పూర్వము వలె బండ్లలో ప్రయాణమై వచ్చినను, నేటి కాలములోవలె బస్సులు, మోటారు బండ్లలో ప్రయాణమై వచ్చినను పెండ్లికూతురు ఊరు సమీపించినంతనే ఊరి ముందు మఱ్ఱి చెట్ల నీడనో, వేపచెట్టునీడనో కొన్ని గంటలు విశ్రమించెదరు. ఆ ప్రదేశమును ఆడుపెళ్లివారు ముందే శుభ్రపరచి

"జోడు కంబళు రెండు జాడించి పరిచి
రత్నకంబళు రెండు రమణతో పరిచి

ఉంచగా

వచ్చరోకట్టు కాడ పెద మఱ్ఱికాడ
పెంపుగా దిగినారు పెండ్లి వారంత"
ఆడు పెళ్లివారు ఎదురుగా వెళ్లి

"కూరిమితో రాముణ్ణి కూర్చుండ బెట్టి"–[1]

మర్యాద చేయుదురు. విడిచియున్న వరుని బాసింగములను మరల నుదుట అమర్చి, అతని పాదములను వధువుయొక్క అన్నావదినలు కడుగుదురు, దీనిని

1. త్రివేణి–పుట–35,;

"దుమ్ముకాళ్లు కడగుట" అందురు, వియ్యంపు వారి పెండ్లి మర్యాదలు "ఎదురుకోళ్లతో" ప్రారంభ మగును. పిదప ఇరు పక్షములవారు బుక్కాగులాలు ఒకరిపైనొకరు చల్లుకొని వినోదింతురు. వదిన మరదండ్ర, బావ మరదుల వరుసలు కలసినవారి హాస్యములకు అంతే ఉండదు. దీనినే "బుక్కా గుల్లాలు ఆట" అనియు "ఎదురు కోళ్లనియు" అందురు. బాజా భజంత్రీలతో మగపెళ్లివారిని పిలచుకొని "గుఱ్ఱం మీద పెండ్లి కొడుకు కూర్చుండ"-[1] గ్రామములోని దేవళమునకు తీసికొని వచ్చెదరు. అచ్చట దేవునికి పూజలు జరిపి పెండ్లివారిని విడిదిగృహమునకు తీసికొని వెళ్లి అచ్చట విశ్రమింపచేయుదురు. లగ్న ముహూర్తము సమీపించినంతనే మగపెళ్లివారిని సత్కారములతో ఆహ్వానించి వైభవోపేతముగా నూరేగింపు దీసి పెండ్లి పందిటికి తోడ్కొని వచ్చిన వెంటనే అతివలు "మెరవణితో వచ్చిరే మా పెండ్లివారు" అని ఎదురేగి

"పగిడి పళ్లెంలోన పాదాలు గడిగి
అపరంజి పళ్లెంలో ఆర్తి పట్టీ
పచ్చన్ని పచ్చన్ని పందిల్ల"-[2]

లోనికి కుడిపాద మెత్తించి, గడపదాటించి పెండ్లికుమారుని తీసికొని వచ్చి పెండ్లి మండపమున వివాహవేదికపై కూర్చుండ జేసెదరు.

లగ్నము రోజున వధూవరులు కన్యాదాతలిచ్చు వస్త్రములను ధరింతురు. పూర్వకాలపు ఆచారమును బట్టి ఇవి పసుపు నీటిలో ముంచిన బట్టలయియుండెడివి. పసుపు వర్ణము దృష్టిదోషమును తొలగించునను నమ్మకము కలదు. అంతేకాక ఈ వస్త్రములు పీతాంబరములకు ప్రతి రూపము కావచ్చును. లగ్నమండపమును ప్రవేశించుటకు పూర్వము వధూవరులకు కట్టిన జంట బాసికములలోనుంచి ఒక్కొక్క బాసికమును పరస్పరము మార్చికట్టుదురు. గ్రామములలో బాసికములను మంగలి తయారు చేయును.

బాసికానికి వెళ్లిన బావలను జూచి
మంగలి సుబ్బయ్య మంటలో (?) దిగును"

బాసికములు వధూవరులను పెండ్లి కూతురుగా, పెండ్లి కుమారునిగా అలంకరించునంతవరకు యింటిలోనికి తీసికొని రాబడవు. నేడు బాసికము

1. త్రివేణి-పుట-35;
2. త్రివేణి-పుట-35.

లను పట్నముల నుండి కొని తీసికొనువచ్చువారును ముందే తీసికొని వచ్చిన వాటిని తమ యింటికి తీసికొని రాకుండ ఊరిలోనెవరి యింటిలోనైన నుంచి తరువాత అవసరమునకు తీసికొని వచ్చెదరు. గౌరీదేవి చెంత పూజించి పెట్టిన పసుపుకొమ్ములతో కట్టిన కంకణములను వధూవరులు, వారి తల్లిదండ్రులు ధరింతురు.

కన్యాదానము :- వివాహములో ప్రధాన ఘట్టములైన కన్యాదానము, జిలకర బెల్లము తలపైన పెట్టుట, తాళి కట్టుట మొదలగు దృశ్యములను జరిగిపోయినవిగనో, జరుగనున్నవిగనో వర్ణించు పాటలనే సామాన్యముగా పాడుదురు. కాని వర్తమానమును తెలుపు పాటలరుదు. బ్రాహ్మణుల మంత్ర ఘోషలో, బంధువుల సరససల్లాపములలో, మంగళ వాద్యముల మారు మ్రోతలో చాల సందడిగా నుండు ఆ సమయములో జానపదులకు పాటలు పాడుటకు తీరిక చిక్కలేదేమొ! పెండ్లి మండపమున వేదికపై కూర్చుండిన వరుని కాళ్లను వధువు తల్లిదండ్రులు వెండి లేదా ఇత్తడి పళ్లెరములో కడిగెదరు. పిదప పెండ్లికూతురును వచ్చి పెండ్లికుమారునికి అభిముఖముగ గూర్చుండ బెట్టెదరు. వధువును కొందరు మేనమామలు గంపలో ఎత్తుకొని వచ్చుట కలదు. (పెండ్లికూతురును లగ్నమంటప మునకు తీసుకొని వచ్చు బాధ్యత మేనమామది.) తాలిబొట్టు (పుస్తె)ను పెండ్లికి వచ్చిన పెద్దల ఆశీర్వాదము కొరకు మేనమామయే కుడుకలు పెట్టుకొని పెండ్లిపందిరిలో తిరిగి వరునిచేత వధువు మెడలో కట్టించుటకు పురోహితునికి అప్పగించును.

కన్యాదాతలు తమ కుమార్తె హస్తములను వరుని హస్తములలో నుంచి నీటిధారతో దానము చేయుదురు. ఇట్లు కన్యాదానము చేయుట మోక్షప్రదమని విశ్వాసము.-[1] అందుకే "కాళ్లుగడిగి కన్యాదానము" అను వాడుక గలదు. వివాహోములో కన్యాదానమునకు ఈ విధముగ చాల ప్రాధాన్యము గలదు. కన్యాదానమును ఓఘవతీ పరిణయమున అక్కినేపల్లి నృసింహకవి వర్ణించెను.-[2]

---

1. కన్యా మేపృష్ఠతో భూయాత్ (ధర్మసింధు పరిచ్ఛేదము-3, పుట-394. తద్దానా న్మోక్షమాప్నుయామ్) -కన్య నావెంట సుండుగాక! ఆమెను దానముచేసి మోక్షమును పొందుదునుగాక! అని తండ్రి ఆకాంక్ష.
2. ఓఘవతీ పరిణయము-ఆశ్వాస-3; పద్యము-236.

సన్నెకల్లు ద్రొక్కించుట :- గంపలో గూర్చుండ బెట్టుట, కాడినీళ్లు పోయుట, జీలకర్ర బెల్లము నెత్తిపై బెట్టుట లాజకట్నము లిచ్చుట, సన్నెకట్లు ద్రొక్కించుట మొదలగు నాచారములలో గొన్ని నవనాగరిక లోకమున మాయమగు చున్నవని చెప్పనవసరము లేదు.

"శాంత గోవిందనామము" లను పాటలో వరుడు కాశీయాత్రకు బయలుదేరుట, దశరథుడు "కాశీకెల్లొద్దు మాకన్యనిస్తాము" అని బ్రతి మాలుట, పెండ్లి కూతురునకు పెద్దబొట్టు పెట్టి చెక్కీట చుక్కనుంచుట, కన్యను గంపలో బెట్టి అంబారిపై దీసికొని వచ్చుట-మున్నగువిషయములు తెలుపబడినవి.-[1]

కాల్దొక్కి కంకణం కట్టడం అని జానపదుల వ్యవహారము. లక్ష్మమ్మ కథలో పెండ్లి కుమారుడు పెండ్లి కూతురు "కాలు ద్రొక్కి కంకణము కట్టె" నట-[2]

సన్నెకల్లు మీద పాదము బెట్టి ద్రొక్కించుటను గూర్చి ఋష్యశృంగ దశరథుల సంభాషణమొకటి వ్యవహారమున నున్నది. సన్నెకల్లు ద్రొక్కించు వేళ ఋష్యశృంగుడు దశరథుని "ఆడదాని పాదం బెట్టుట ఏ ఋషులు చెప్పిరి?" అని ప్రశ్నించును. దశరథుడు "మీరు తప్పిస్తేను, మరి ఒకరు పడతారా?" అని అనును. అప్పుడు ఋష్యశృంగుడు "శాంతపాదము మీద పోక చెక్క నుంచి సన్నెకల్లు త్రొక్కెను"-[3] ఋష్యశృంగుని వంటి ముని పుంగవుడును ఆచారమును అతిక్రమింప సాహిసింప లేదు. సన్నెకల్లు త్రొక్కుటనె కాళ్లు త్రొక్కుటయందురు. కాళ్లు ద్రొక్కునప్పుడు వధూవరుల మధ్యనతెర పట్టబడును. పరస్పరము కాళ్లు త్రొక్కిన పిదప తెర తొలగింప బడును.

"సీరాలసందున సీత వచ్చింది శ్రీరామచంద్రుడ కాలు త్రొక్కయ్య
కోకాల సందున గోపివచ్చింది గోపాలకృష్ణుడ కాలు త్రొక్కయ్య"-[4]

---

1. స్త్రీల రామాయణపు పాటలు-కృష్ణశ్రీ-పుట-32.
2. లక్ష్మమ్మ కథ-పుట-5; వెస్ట్‌వార్డ్ అండ్ కంపెనీ.
3. స్త్రీల రామాయణపు-పాటలు; పుట-36.
4. నేను సేకరించినది. పాడినవారు; శ్రీమతి సుమిత్రాదేవి; ఎం. ఎల్.ఎ.

– అను పాట సామాన్య గృహస్థులయింటి పెండ్లిండ్లలో వినవచ్చుచుండును.

ఆయా స్థలములను బట్టి ఒకచోట కంకణ ధారణము ప్రధానముగా భావించిన, మరొకచోట జీలకర్ర బెల్లము నుంచుట ప్రధానముగా నెంచబడుచున్నది నేటి కాలమున పూలమాలలు మార్చుకొనుటయే ప్రాధాన్యము వహించినది.

తాళి కట్టుట :– తాళి యనునది తాళ–తాడ–తాటి– అను పదము నుండి వచ్చినట్లు పరిశోధకులు భావించు చున్నారు. పూర్వము ఆభరణ రూపముగా ఆకులను, పూవులను, ధరించినట్లే తాటి యాకులను గూడ కంకణములుగను, దండ కడియములుగను ధరించుచుండిరి. నేటికిని ఆదిమ జాతులలో ఈ ఆచారము గలదు. దుద్దులు పెట్టుకొనుటకై చెవి తమ్మల రంధ్రములు వెడల్పగుటకు తాటికమ్మ ముక్కను చుట్టి ఆ రంధ్రములో పెట్టుకొందురు. అది స్ప్రింగువలె వదులగుచు ఆ రంధ్రమును వెడల్పు చేయును. తాటాకుతో చేసిన ఆభరణములనుగాని, పెద్ద కాడలుగల వెండి బంగారు దుద్దులనుగాని ధరించుట ఆచారము. పెద్ద రంధ్రములతో భుజములవరకు వ్రేలాడు తమ్మలుగల మహిళల చిత్రములను, శిల్పములను మనము అజంతా, ఎల్లోరా అమరావతి, నాగార్జునకొండ మున్నగు ప్రాచీన కళాక్షేత్రములలో చూడవచ్చును.

కర్ణాభరణములకు కమ్మలు అను పదము తెలుగునాట వాడుకలో నున్నది మొదట చెవులకు తాటాకుతో చేసిన ఆభరణములను ధరించుటను ఈ పదము సూచించుచున్నది. తాటాకు ఆభరణముల యలవాటు పోయినను కర్ణాభరణములకు ముత్యాలకమ్మలు, బంగారు కమ్మలు, వజ్రాల కమ్మలు అను వ్యవహారము పోలేదు.

తాటాకు రంగు సాధారణముగ మారదు. సౌమాంగల్యము వధూవరుల జీవిత పర్యంతము విరాజిల్లవలెనను భావమునకు ప్రతీక కాగా తాటాకును వధువు మెడకు కట్టుచుండెడి వారేమో! ఈ తాటాకే క్రమముగా తాళియయి, బంగారు బొట్టయినను పేరు మాత్రము తాళిబొట్టుగానే మిగిలిపోయినది.

మాంగల్యమునకు మారు పసుపుకొమ్మును కట్టుటయును గలదు. పసుపు కొమ్ము కూడ రంగుమారని వస్తువు. ఎల్లప్పుడు పచ్చగానుండును, ఈ పచ్చని

వస్తువు దాంపత్య జీవితము నిత్యకళ్యాణము పచ్చ తోరణముగా నుండవలెనను ఆశాభావమునకును, శుభాకాంక్షకును సంకేతము.

తాటాకును ఆభరణముగ ధరించు నాచారము తెలుగు దేశమున రెండు వేల యేండ్లనుండి యుండినట్లు గాథాసప్తశతి వలన తెలియుచున్నది. బ్రతికి చెడిన యొక మహిళ తన యైశ్వర్యమును, గణజీవితమును తల వోయుచు బంగారు కుండలములు ధరించిన చెవులలో "తాళవేంట యుగం" తాటాకు చుట్టలు పెట్టుకొనవలసిన దుర్దశ ఏర్పడినదని వాపోయినది. –[1]

"సూత్రధారణ రూపములో వధువును బంధించు ఆచారము వెనుక ప్రాచీన కాలమునకు సంబంధించిన రజ్జుతంత్రము (cord magic) ఇమిడి యున్నదని నృశాస్త్రవేత్తల యభిప్రాయము. ఒక వ్యక్తిని మరొకరికి సన్నిహితునిగా నొనరించుటకు, లోబరచకొనుటకు, జబ్బుగా నున్నవాని నుండి వ్యాధులు దూరమగునట్లు చేయుటకు గాలి, ధూళి వంటి అభౌమాంశములు మనుషులను ఆశించకుండా ఉండునట్లు చేయుటకు ఈ రజ్జుతంత్రము ఉపయోగింపబడు చుండెను"–[2] ఈనాటికిని జబ్బుగానున్న వ్యక్తుల చేతికో, మొలకో ఒక త్రాడును కట్టి తరువాత దానిని తీసి పచ్చని చెట్టుమీద వేసిన ఆ జబ్బు ఆ వ్యక్తినుండి దూరమగునని నమ్మకము కలదు. అదేవిధముగా ఒక వ్యక్తి తాను స్వీరింపబూనిన వ్యక్తికి తాయత్తు రూపములోను, ఉంగరము లేదా కంకణము రూపములోను ఒక బంధమును వేయగలిగిన ఎడల ఆవ్యక్తి తన చెప్పు చేతలలో నుండక తప్పదను నమ్మకమును కలదు. వివాహములో సూత్రధారణమునకు గూడ ఈ విధమైన తాంత్రిక ప్రాధాన్యమున్నట్లు మనము గ్రహించుటకు వీలుకలదు. శ్రీలంకలోని వెడ్డాతెగ (తెలుగు వడ్డెతెగ) వారు చెట్టు నారచేత తయారు చేయబడిన తాటిని పెండ్లికూతురు నడుమునకు బంధించెదరు. వైదిక వివాహతంత్రములో గూడ రజ్జువునునడుమునకు బంధించు చర్యయు, దానికి మంత్రమును గలవు. ఈ బంధమే వివాహబంధము.

నేటి కాలమున హైందవులలోనేగాక ఇతర మతస్థులలోను మంగళ సూత్రమును మెడలో గట్టుట సామాన్యమైనది. మంగళ సూత్ర ధారణమునకు పురోహితులు ఈ క్రింది మంత్రమును పఠించుట ఆచారము.

1. గాథాసప్తశతిలో తెలుగు పదాలు–పుట–15.

2. తెలుగుజానపద గేయ గాథలు–పుట–316.

"మాంగల్య తంతునా అనేన మమ జీవన హేతునా,
కంఠేబధ్నామి శుభగే త్వం జీవ శరదశ్శతమ్"

– ఓ సౌభాగ్యవంతులారా! ఈ మాంగల్య తంతువును–మంగళ సూత్రమును నీ మెడలో కట్టుచున్నాను. ఇది నా జీవనమునకు హేతువు. దీనితో నీవును నాతోబాటు నూరేండ్లు జీవించుము" అని దీని అర్థము. వైదికాచారమున మాంగల్యధారణ లేదనియు కంకణధారణము, సప్తపదియు మాత్రమే కలవనియు కొందరి వాదము. కాని వింధ్య పర్వతమునకు ఈవలి దక్షిణాపథము నంతటను వైదిక సంప్రదాయము ననుసరించు అన్ని కులముల వారిలోను మాంగల్యధారణాచారము కలదు. లలితాసహస్రనామములో లలితాదేవికి పరమశివుడు మంగళసూత్రము కట్టినట్లు ఒక నామము గలదు. –[1]

వివాహ బంధమును గూర్చి ఋగ్వేద మంత్రములిట్లు చెప్పుచున్నవి.

"గృభ్ణామితేసౌ భగత్వాయ హస్తం
మయాపత్యా జరదష్టిర్ యాథాసః
భగో అర్యమా సవితా పురంధ్రి
ర్మహ్యాం త్వాదుర్ గార్హపత్యాయ దేవాః"–[2]
ఇహైవస్తం మా వియౌష్టం
విశ్వమాయుర్ వ్యశ్నుతమ్
క్రీడంతౌ పుత్రైర్ నప్తృభిర్
మోదమానౌ స్వేగృహే. –[3]

వరుడు వధువుతో నిట్లు చెప్పును. "నేను సౌభాగ్యమునకై నీ హస్తమును గ్రహించుచున్నాను. పతినైన నాతో నీవెట్లు వృద్ధావస్థను పొందుదువో నేనును అట్లే నీతో వృద్ధుడనగుదును. ఐశ్వర్యవంతుడును, న్యాయము చేయువాడును, సర్వ ప్రపంచమును ధరించు వాడును అగు పరమేశ్వరుడును, దేవతలును గృహస్థ ధర్మము నిర్వహించుటకు నాకు నిన్ను, నీకు నన్ను యిచ్చినారు. మన మిరువురము

1. లలితా సహస్రనామావళి.
2. ఋగ్వేదము. 7–3–27–1
3. ఋగ్వేదము. 8–3–28–2

ఈ గృహస్థాశ్రమమును నిర్వహించుచు విడిపోక సంపూర్ణాయుపుతో, పుత్రులతో సంతోషమున జీవితమును గడపుదము."

వివాహమునకు వరునికి మారుగా కత్తిని పంపు ఆచారము క్షత్రియులందును, వెలమలందును ఉండెను. పాము పాటలో

"కత్తికిని బాసింగము కట్టి తర్లించుకొని
కత్తికిని కాంతకును కరమొప్ప తలబ్రాలు
పోయించి తగపెండ్లి చేయింతురపుడు
ఇలు వరస నడవడి ఇలలోన నెవరైన
తప్పింప జాలరు నెప్పటికైన--[1]

– అని మంత్రి పాముదూపములోనున్న రాజకుమారునికి మారుగా కత్తిని పంపుటను సమర్థించెను.

వరుడు వేద మంత్రోక్తముగా వధువు గళసీమ "పొంగుచు మంగళ సూత్రము" కట్టును. పెండ్లికివచ్చిన బంధువులు వధూవరులను అక్షతలు చల్లి దీవించెదరు. "నూలుపోగు దారాన--తాళి బొట్టు పసుపు కొమ్ము" కట్టించిన తరువాత వధువునకు మెట్టెలు ధరింప చేయుదురు. అప్పటినుండి కాలిమెట్టె, తాళిబొట్టు–ఆలుమగల గుర్తులాయె"–ఇవి ద్రావిడాచారములు–[2] కొన్ని కులములలో మెట్టెలను వరుడే వధువు కాళ్లవ్రేళ్లకు తొడుగును, మరికొన్ని కులములలో కంసాలి తొడుగును.

తాళి బొట్టును వరుడే వధువునకు కట్టవలెనను సంప్రదాయము తెలుగు వారిలోను కన్నడులలోను ఉండగా కొన్ని తెగలలో ఈ సంప్రదాయము వేరు విధముగా నున్నది. మధుర ప్రాంతవాసులైన ఉప్పిలియన్ తెగలో వివాహముల యందు పెండ్లికూమార్తెకు తాళిబొట్టును ఆ ఊరిలో నివసించు ప్రత్యేక వనిత కట్టుట ఆచారము, ఆమె పేరు "సీర్‌కారి". కొన్ని ప్రాంతములలోని తమిళ కులములలో పెండ్లి కుమారుని సోదరి తాళికట్టుట ఆచారము.–[3]

---

1. తెలుగు జానపదగేయ గాథలు–పుట–169.
2. పల్లెపదాలలో ప్రజాజీవనము–చతుర్థ ప్రకరణము (అముద్రితము)
3. Castes & Tribes of South India-Thurstone VOL.VII Page.238

మన్నారు దాసవిలాస ప్రబంధమున-

"ఎలమిని మదీయ జీవనహేతువైన
యట్టి మాంగల్య తంతువు నమరఁబూని
కోరికలు మీరనను గూడి వారిజాక్షి
యింపు తోడుత ధాత్రి వెయ్యేండ్లు మనుము",-[1]

- అని పలుకుచు వరుడు వధువు గళసీమను మంగళ సూత్రధారణ చేయు సుందర ఘట్టము వర్ణింపబడినది.

తలంబ్రాలు :- తలంబ్రాలు పోసికొనుట మిక్కిలి ప్రాచీన కాలము నుండియు వచ్చుచున్న వేడుక.

"ముక్తాస్తాశ్శుభదా భవంతు భవతామ్ శ్రీరామ వైవాహికాః" అని చెప్పుదురు. అక్షతలుగా జొన్నలువాడుట కొన్ని కులములలో కలదు. రాజ వంశీయుల వివాహములలో నవరత్నమిళితమైన (ముఖ్యముగా ముత్యములు) తలంబ్రాలను వాడినట్లు వర్ణనలు కలవు. సామాన్య కుటుంబములలో నేడు శాస్త్రమునకు అక్షతలలో ఐదు ముత్యములను కలుపుదురు.

వధూవరులు పరస్పరము తలంబ్రాలు పోసికొను వేళ పేరంట్రాండ్రు
"తలవంచి నరసింహ తాళిబొట్టుకట్టె
తలవంచి నరసింహ తలబాలు బోసె
అమర చిలుకల కొప్పు తగునమ్మ నీకు
ముద్దురుడు నరసింహ మొగడమ్మ నీకు"-[2]

- అనుచు పాడుదురు. ఈ పాట గుత్తి తాలుకా అనంతపురము జిల్లాలో వ్యవహారమందున్నది.

"తలువలు (తలంబ్రాలు) పడగానే తన్నేంత బలతురు" అనునది జానపదుల సామెత. అనగా పెండ్లిలో ప్రధానమైన వానిలో నొకటి తలంబ్రాలు. తలంబ్రాలు పోయగనే వధూవరులలో ఆత్మీయత పల్లవించి ముఖ్యముగా వధువుకు

1. మన్నారు దాసవిలాస ప్రబంధము-ఆ. 5 ప. 49
2. త్రివేణి-పుట-37

ఎక్కడలేని బలము చేకూరును. తన భవిష్యజ్జీవనమునకు పెద్ద యాధారము దొరికినదను భావముతో ఆమె ఉబ్బిపోవును. వివాహమనునది వాస్తవ జీవితారంభమునకు ప్రథమ ఘట్టము గనుక వధూవరులకు నూతన ఆలోకలోకములే సాక్షాత్కరించును.

తలంబ్రాలను గురించి తెలుగు కవులు పలువురు కావ్యములలోని నాయికానాయకుల వివాహములలో వర్ణించి యున్నారు. విజయ విలాసమున పెండ్లి చవిక నలంకరించి వివాహ సామగ్రిని చేకూర్చు సందర్భమును తలంబ్రాలకై ముత్యములను పసిడి పళ్లెరములో నింపినట్లు వర్ణింపబడినది.

"తలబ్రాలకేర్చి ముక్తామణుల్ నించిరి
పసిడి పళ్లెముల సంభ్రమము మీఱ" [1]

కళాపూర్ణోదయమునను తలంబ్రాలు పోయు ప్రసక్తి కలదు. [2]

వివాహసందర్భమున జరుగు వేడుకలను, వైదిక కార్యములను, కన్యాదానము, మాంగల్యధారణము, లాజహోమము, సప్తపది మొదలైన వానిని- ప్రాచీన ప్రబంధకారులు కళాపూర్ణోదయము.-3 పార్వతీ పరిణయము.-4, మన్నారు దాస విలాస ప్రబంధము-5, ముక్తికాంతా పరిణయము-6, చంద్రాంగద చరిత్రము-7, విజయవిలాసము--8, మొదలగు కావ్యములలో విపులముగా వర్ణించినారు.

తలంబ్రాలు పోసికొనిన యనంతరము బంధుమిత్రాదులు కట్నములను, కానుకలను సమర్పించుకొందురు.

---

1. విజయ విలాసము. ఆ. 3 ప. 9
2. కళాపూర్ణోదయము, ఆ. 7 ప. 73.
3. కళా పూర్ణోదయము-ఆ. 5 పు. 69-81
4. పార్వతీ పరిణయము-ఆ. 5 పు. 203
5. మున్నారు దాసవిలాస ప్రబంధము-ఆ. పు. 40. 52
6. ముక్తికాంతా పరిణయము-పుటలు-30-34.
7. చంద్రాంగద చరిత్రము ఆ. 6, ప. 4, 22-28.
8. విజయవిలాసము ఆ. 3 ప. 76-112.

వివాహ మండపంలో వధువునకు ఐదుగురు లేదా తొమ్మండుగురు పసుపు కలిపిన పచ్చని బియ్యముతో ఒడి బియ్యము పోయుదురు. పెండ్లిండ్లు ఒక్క రోజులోనే జరుగుచున్న నేటి కాలమున ప్రధానము, నాగవెల్లి లగ్నమంటపములోనే వెంటవెంటనే జరుపబడుచున్నవి. తరువాత వధూవరులకు కొంగులు ముడివేసి (దీనిని బ్రహ్మముడి అందురు) లగ్నమండపము చుట్టు ప్రదక్షిణ చేయించి పురోహితుడు అరుంధతీ నక్షత్రమును చూపెట్టును.

అరుంధతి దర్శనము :- అరుంధతి మహాపతివ్రత. వశిష్ఠుని యిల్లాలు అరుంధతి మాలెతయనియు; ఆమె వశిష్ఠుని వివాహమాడి ఋషిస్థాయిని అందుకొనినదనియు చెప్పుదురు. అరుంధతీ నక్షత్రము సప్త ఋషి మండలమున వశిష్ఠ నక్షత్రము సమీపమున మినుకుమినుకు మనుచుండును. అరుంధతి మహాపతివ్రతయై శరీర త్యాగానంతరము నక్షత్రరూపమును ధరించెనని ఐతిహ్యము కలదు. పూర్వగాథాలహరిలో ఈమె దేవహూతి కర్దమ ప్రజాపతుల పుత్రిక యనియు, ఈమెను వశిష్ఠుడు గైకొనెననియు కలదు.-1 ఈమె మహా పత్రివత కనుక ఈమె పేరుననున్న నక్షత్రమును చూచిన వధువులు ఈమెవలె కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకొందురనియు ప్రజలు విశ్వసింతురు. కనుక వివాహసమయము లందు ఈమెను వధూవరులు దర్శించుట ఆచారము. ఈ సమయమున స్త్రీలు ఈ క్రింది పాట పాడుదురు.

"జాము జాము ఒక సాయ (ఛాయ) జామొక్క ఛాయ
జామూన సూర్యుడుజామ పువ్వు సాయ
మాపు, మాపు ఒక సాయ మామొక్కసాయ
మాపూన సూర్యుడు మామిడి పండు సాయ
సూర్య నమస్కారంబు సూటిగా జేసి
భార్యతో రామచంద్రుడు అడుగుముందూకేసే-[2]

- ఈ పాటలో అరుంధతి ప్రసక్తి యేమాత్రములేక సూర్యుని వర్ణనమే యున్నది. సూర్యదర్శనము అరుంధతీ దర్శనము కాదుకదా. కాని అరుంధతి నక్షత్రము చాల చిన్నదిగా నుండుట వలన సామాన్యముగా కంటికి కనిపించుట సాధ్యముకాదు. మఱ్ఱి చెట్టుక్రింద మరే చెట్టును బ్రతుకదన్నట్లు గ్రహరాజగు

1. పూర్వాగాధాలహరి-పుటలు 24, 25
2. నేను సేకరించినది : పాడినవారు; సుమిత్రాదేవి, ఎం. ఎల్. ఎ.

సూర్యుని కాంతిలో మరియే గ్రహ నక్షత్రములును అగుపించవు. సూర్యునికి నమస్కరించిన అరుంధతికి నమస్కరించినట్లే అను తలంపుతో ఈ పాటలో సూర్యుని వర్ణన యున్నట్లు తోచుచున్నది.

అరుంధతి దర్శన వర్ణనము ప్రాచీన ప్రబంధములలో వివాహ ఘట్టముల యందు ప్రసక్తమగుచున్నది. వసుచరిత్రకారుడు గిరికావసురాజుల వివాహవర్ణన సందర్భమున వధువు అరుంధతిని చూచిన తీరును ఇట్లు చెప్పెను.

చ॥ సిరులు ఫలింప దంపతులు, చెంత నరుంధతిఁ జూచుచోఁబర
స్ఫుర నయనాంతముల్గదియ బాలిక చూపులు పర్వెనప్పుడ
ప్పురమ సతీ పదాబ్జములపై భవదీయ సువాసినీత్వ వై
ఖరిఁగరుణింపుమంచు విరిగల్వలఁబూజలు సల్పెనో యనన్-[1]

నేటి వివాహములు ఎవరో తరుముకొని వచ్చుచున్నట్లు చాల తొందరగా జరుగుచున్నవి. అరుంధతి దర్శనము నిజమాలోచించిన రాత్రియే జరుగవలసియున్నది. కాని వివాహ కార్యకలాపమంతయు నేడు కొన్ని గంటలలోనే ముగియుచున్నది గనుక పురోహితుడు వివాహానంతరము వెంబడే పట్టపగలే అదిగదిగో అరుంధతి అని ఆకాశమువైపు వ్రేలుతో చూపును. అరుంధతి కనడలేదనుట అశుభమట. అరుంధతి చాల చిన్న నక్షత్రము గనుక అర్థరాత్రి యందు మినుకు మినుకు మన్నట్లుగా నుండును. పట్టపగలు కానవచ్చుట అసంభవము. అయినను వధూవరులు ఆ నక్షత్రము కనబడలేదనుట అశుభము గనుక పురోహితుడు చూచితిరా అని ప్రశ్నించిన "అవును చూచితిమి" అని సమాధానము చెప్పుదురు.

అరుంధతి నక్షత్రమును చూపినట్లే ధ్రువనక్షత్రమును కూడ వధూవరులతో నమస్కరింప చేయుట కలదు. ఈ ఆచారమును కళాపూర్ణోదయము వర్ణించినది. -[2]

ప్రత్తిగింజలలుకుట :- బ్రాహ్మణేతరులందు ప్రత్తి విత్తులు నాటించు ఆచారము కలదు. ఈ ఆచారము వ్యవసాయ ప్రాధాన్యమును తెలుపుచున్నది. నాకబలి ముగిసిన తరువాత. -[3] కొందరును, పెండ్లినాడే నాకబలి

1. వసుచరిత్ర. ఆ. 6 పద్య. 33.
2. కళాపూర్ణోదయము. ఆ. 7 ప. 81.
3. తెలుగు జానపదగేయ సాహిత్యము. డా॥ బి. రామరాజు. పుట-453.

చేయకపోయినను వివాహానంతరము పెండ్లి మండపమునుండి వధూవరులు వచ్చిన వెంబడినే మరికొందరును పెరటిలో ప్రత్తి విత్తులను నాటుట పరిపాటి.

రామన్న లక్ష్మన్నరథము దోరెడ్లు–.... ....
కుంకుమ్మ రేగళ్లు కుదుర దున్నించి–చంద్రంపు రేగళ్లు చెదర దున్నించి
.... –పన్నెండు స్తంభాల పందీరి క్రింద
ప్రత్తి విత్తుల గుమ్మి మెత్తైన దీసి–.... ....
వెండీది తక్కెడ పైడిదే బాటు–జోకిరీ అన్నల్లు జోడు పందట్ల
ఎత్తరీ విత్తనాలు ఎత్తు గుల్లల్లా (గంపకన్న చిన్నది)–.... ....
శ్రీరామ గొట్టెత్తు సీత గంపెత్తు–పరమేశు గొట్టెత్తు పడతి గంపెత్తు
.... –శ్రీరామ దున్నంగ సీత చారేసు
.... –పల్లెరు గాయొలెపత్తేరు పడెను
కోండ్ర నిస్తావన్న కోక బెడుతావా–కోండ్ర నేమిచ్చేను కోక బెడుతాను
.... –బిడ్డనిస్తావన్నా పడ్డ నిస్తావా
పడ్డ నేమిచ్చేను బిడ్డనిచ్చేనూ–నీమాట నామాట వొక్కటేగాని
ఆలుతో వొకమాట అనిపించరన్నా– ....
తమ్మల పాకోలె తలవంచుకోని–ఇస్తానని పలుకవే ఇ(వి) య్యంపురాల
నీకూను నాకూను ఎవ్వరూ సాక్షి–బాసింగం గట్టినా బ్రాహ్మడే సాక్షి
పెండ్లీకి వచ్చినా పెద్దలే సాక్షి.–[1]

– ఈ పై పాటలోని భావముననుసరించి ఇప్పటి సంబంధమేగాక పుట్టబోవు సంతానమునకును ప్రేమబంధమును స్థిరపరచుట ఉద్దేశ్యమై యున్నట్లు తోచుచున్నది. అన్న నుండి కట్నములను కానుకలను ఆశించక అతనికి పుట్టబోవు కుమార్తెను తన కుమారునకివ్వుమని కోరుట, దానికి పెండ్లికి వచ్చిన పెద్దలను సాక్షిగా చూపుట, ఇవి మేనరికముపై ఆమెకు గల మక్కువను, పుట్టినింటితో సంబంధమును పెంచుకొను ఆసక్తిని స్పష్టపరుచుచున్నవి. ఈ సమయమున ఆడుబిడ్డలకు వధూవరులు క్రొత్త బట్టలనిచ్చి గౌరవించుట ఆచారము. ఇట్టి మేనరికపు మక్కువను తెలుపు పాటలే తలుపు దగ్గరి పాటలలోను ఉండును.

1. తెలంగాణా పల్లెపాటలు–పుటలు–97–99.

ప్రతి విత్తులు నాటుట అను ప్రక్రియ నూతన జీవితారంభమునకును, నూతన సంబంధముతో వంశాభివృద్ధికిని సంకేతమైనట్లు తోచుచున్నది. ప్రత్తియు, ప్రత్తివల్లనేర్పడు దారము, పెక్కు పదార్థములను ఒకటిగా బంధించును. దారముతోనేర్పడిన వస్త్రము పెక్కుమందిని ఆచ్ఛాదించును. ఈ దృష్టితో ప్రత్తివిత్తులు నాటుట ఆచారమే యుండును.

తలుపుదగ్గరి పాటలు - పెండ్లి మంటపము నుండి లేచివచ్చి బరేని కుండల ముందు బాసింగములు విప్పిన తరువాత నూతన వధూవరులను ఆ గదిని దాటనీకుండ తలుపు మూసి పేరంటాండ్రు పాటలు పాడి భార్యాభర్తల చేత వారివారి పేర్లు చెప్పించి తలుపు తీయుదురు, పెండ్లి వేడుకలలో నిది ఒక సరదా. ఈ తలుపు దగ్గరి పాటలకు సంస్కృత సాహిత్యములోని కృష్ణలీలలును, అమరకుడు, జయదేవుడు మున్నగువారు వర్ణించిన శృంగార నాయికల లీలలును మూలమై యుండునని భావించుచున్నాను. ఖండిత నాయికలు, కలహాంతరిత నాయికలు తమ ప్రియునిపై అలిగి కోపగృహమున ప్రవేశించి తలుపులు మూసికొనుట, భర్తలు బ్రతిమాలుట ప్రబంధవేత్తలకు తెలసిన విషయమే. జానపదరీతులలో వేలకొలది సంకీర్తనములను రచించిన అన్నమాచార్యుడు నేడు వివాహములయందు స్త్రీలు పాడు తలుపు దగ్గరి పాటల వంటివి రచింపలేదు కాని కృష్ణశ్రీ గారన్నట్లు

"లకుమమ్మకేమైన లంచమిమ్మనవొ-శుకవాణి తలుపు మూసుక తియ్యదు"

- అనిన అన్నమాచార్యుని కీర్తనను బట్టి తలుపు దగ్గరి పాటలకిది సూచన కావచ్చును. విడిగా తలుపు దగ్గరి పాటలు కనిపించుట లేదు. తమిళ సాహిత్యములో చోళుల నాటికే తలుపు దగ్గరి పాటలున్నవట.-[1]

ఈ తలుపు దగ్గరి పాటలలో భార్యాభర్తల సంవాదమునకే ప్రాధాన్యమున్నను కాలక్రమమున అన్నాచెల్లెండ్ర అక్కా తమ్ముండ్ల మధ్యన జరుగు సంవాదమునకు ప్రాధాన్యము వచ్చినది. నేడు జానపదములలో ఈ పాటలకే విశేష ప్రచారమున్నది. ఈ సంవాదములలో వరునికి పుట్టబోవు కూతురును వరుని చెల్లెలు మేనరికము వరుసలో తమ కొడుకున కిమ్మని కోరుట ఒక ప్రత్యేకత. ఇది మేనరికములలో నుండు మక్కువను తెలుపును.

1. తలుపు దగ్గరి పాటలు - జాజర పాటలు (వ్యా) కృష్ణశ్రీ. భారతి. జులై, 1954 పుటలు-28-29.

అక్కాతమ్ముని సంవాదము :-

తమ్ముడు: - శ్రీగిరిజేశు కృపము చెలగి పెళ్లాడి వస్తి
తలుపు దియ్యుమక్కా నాకు తడవాయె వచ్చి
అక్క : - శ్రీగిరిజేశుని కృపను చెలగి పెళ్లాడివస్తే
తలుపెట్లాదీతు తమ్ముడ తగవులుండంగ
తమ్ముడు: - పట్టు చీరెయు రవికె పసుపు కుంకుమలిస్తు ॥త॥
అక్క : - పట్టు చీరెయు రవికె పసుపు కుంకుమనొల్ల ॥త॥
తమ్ముడు: - చేతికి చాకట్లిస్తు చెంగల్వ దండలిస్తు

- ఈ విధముగా తమ్ముడు ముక్కుకు ముంగరి, చెవులకు ముత్యముల కమ్మలు, కాళ్లకు కడియములు, కలవెండి మట్టెలు, కూర్చుండ కుర్చీలు, కుందనపు పాందాను, మొదలయిన కానుకల నెన్నింటిని ఇచ్చెదనన్నను అక్క అసమ్మతినే ప్రకటించును. తమ్ముడు అంతటితోనాగక ఎక్కుటకు ఏనుగులు, ఏలుటకు రాజ్యమును గూడ నిత్తునని ఆశచూపును. అయినను అక్క త్రోసిపుచ్చినది. అక్క మనసు పడినది వేరే కానుక, అపురూపమమైన కానుక. దానిని తమ్ముడు తెలసికొనలేక,

"అడిగిన కట్నాలన్ని అలాగే యిచ్చేనుగాని
తలుపు దియ్యుమక్కా నాకు తడవాయె వచ్చి"

- అని పలుకును

అక్క - అడిగిన కట్నాలన్ని అలాగె యిస్తువుగాని
తమ్ముడూ నీ బిడ్డనిచ్చి అరణాలివ్వరా

- అని మనసులోని మాటను వెళ్లబుచ్చినది.

తమ్ముడు - అందులకు పెత్తనము ఆడదానిదేకాని
అక్కా! మీ మరదలునడుగు అదేమి చెబుతుందో.

- అక్క తనకే ప్రాధాన్యమునిచ్చి యింతటి సంవాదమును కొనసాగించినను, కలుగబోవు కూతురు పెండ్లి మాట ఏనాటిదో అయినను తమ్ముడు పెండ్లి పెత్తనము భార్యకే అప్పచెప్పినాడు. లేకపోయిన భార్యకు నచ్చకపోయిన ఆ సాధింపులననుభవించుటకన్న సామరస్యముతో అర్ధాంగికి అధికారమును అప్పచెప్పిన సుఖము కదా!

అక్క:- మరదలా! మా తమ్ముని మనసు కుదిరేను
నీ పట్టినిస్తావా, ఈయనంటావా-1

- వదినగారి ఆ మాటలు వినగానే ఇంతవరకును తన ప్రమేయమేమియు లేదనినట్లు ఊరుకొనిన పెండ్లి కూతురు "ఇస్తానంటె ఎదురెవ్వ రొస్తారు" అని పలికినది. పెత్తనమును తనకు అప్పజెప్పినందుకు అటు వదిన మనసుకు తృప్తిని, ఇటు భర్త ఆదరణకు గౌరవమును కల్పించినది. భారతీయ స్త్రీలో నుండు అణకువ స్వభావమును చాటి చెప్పినది.

కట్నములు కానుక లిచ్చుటలో భేదముండవచ్చుగాని మేనరికమునకు మనసు పడుటలో ధనవంతులు, పేదవారను తారతమ్యము లేదు. ఒక పేద కుటుంబములోని అక్కాతమ్ముల సంవాదములో నిట్టిభావము వెల్లడి యగుచున్నది

తమ్ముడు:- చిట్ట చిట్టా చినుకులొచ్చె చిన్నీ కొంగూలు దడిసే
అక్కాల రాంబాయి తలుపూ దీయవే
అక్క:- చిటపట చినుకులొస్తే నాకేమి, చిన్నకొంగులు దడిస్తే
నాకేమి; తలుపయితే నేదీయ
తమ్ముడు:- పటపట చినుకులొచ్చె పడతీకొంగూలు దడిసె
అక్కాల రాంబాయి తలుపూ దీయవే
అక్క - పటపట చినుకులొస్తేనాకేమి, పడతీ కొంగూలు దడిస్తే
నాకేమి; తలుపయితే నేదీయ
తమ్ముడు - ఆరెలిస్త, సారెలిస్త, కూసుండ పీటలిస్తా; కుర్మదారి
(కంచు) గిన్నెలిస్తా, నూటొక్క సకినాలిస్తా ॥అక్కాల॥
అక్క - ఆరలొద్దు, సారెలొద్దు, కూసుండ పీటలొద్దు
కుర్మదారి గిన్నెలొద్దు, నూటొక్క సకినాలొద్దు ॥తలుప॥
తమ్ముడు: ఏటికి ఎద్దునిస్తా, పాడికి బఱ్ఱెనిస్తా
ఏటేట పంటకు ఆడపిల్ల గంపలిస్తా ॥అక్కాల॥
అక్క - ఏటికి ఎద్దునొల్ల,-పాడికి బఱ్ఱెనొల్ల
తమ్ముడు: మరేం కావాలె
అక్క:- నీకు పుట్టె బిడ్డ కావాలె.

1. సెలయేరు-పుట-39.

– ఈ పాటలో ఒక విశేషమున్నది. దీనిలోని అక్కా తమ్ములు జీవితములోని తమ పరిధిని దాటిపోలేదు. శక్తి సామర్థ్యములు లేకపోయినను ఎక్కేటందుకు ఏనుగులు, ఏలేటందుకు రాజ్యములు ఇచ్చెదనని గొప్పలు పలుకక తమ్ముడు తన శక్త్యానుసారము పీటలు, కంచు గిన్నెలు, నూటొక్క సకినాలు, ఎద్దు, బఱ్ఱె, ఆడుబిడ్డ గంపలనిస్తానని అక్కతో పలుకుచున్నాడు. ఇక్కడ కుర్మదారి గిన్నె అనగా గొల్లకుర్మ తెగవారిలో భోజనము చేయు కంచు పాత్ర. ఆడబిడ్డలకు సారె పెట్టి పంపునప్పుడు సకినాలతో కూడిన సారె కూడ పెట్టెదరు. దానిని వేల సంఖ్యలో పలుకక నూటొక్క సకినాలనే పేర్కొనుట ఉచితముగా నున్నది. వ్యవసాయమే వృత్తిగా కలిగిన కుటుంబములలో పంటను రాశిగా పోసి, అందు ముందు గంప ధాన్యమును ఆడుబిడ్డలకు ఇచ్చుకొనుట ఆచారము. దానినే "ఆడపిల్ల గంప" అందురు. ప్రతి పంటకును మొదలు ఇట్లే చేయుదురు. ఎన్ని రకముల చెప్పినను అక్క కాదని తన కోరికయైన మేనకోడలును తన కొడుకు కొరకు ఇమ్మని కోరినది. తమ్ముడు సులభముగానే సరేనెను. అయినను మరదలేమనునోయను అనుమానముతో ఆమెనోట కూడ అవుననుపించుకొనవలెనను ఉద్దేశమున తమ్మునితో

"నీమాట నామాట ఒక్కటేకాని
ఆలితో నొకమాట అనుపించవన్న"

అని అడుగును. తలుపులు బంధించి తమాషా చూచుచున్న పేరంటాండ్రు

"నా మొదటి బిడ్డను నీకే ఇస్తనని పలుకవే"–[1]

అని పెండ్లికూతురును తొందరు పెట్టుదరు. సిగ్గు మొగ్గయి ఆమె

"నా మొదటి బిడ్డను నీకే ఇస్తనను" అప్పుడు పేరంటాండ్రు తలుపు తీయుదురు.

మరొక్క పాటలో చెల్లెలు అన్న వదినలతో నోటిమాటగా బిడ్డను ఇచ్చెదమని పలుకుటతో ఆగక చిట్టీ రాసివ్వు" మని అడుగును. ఈ చెల్లెలు అందరి చెల్లెండ్రకన్న అధిక ఉపాయశాలిని. అందుకనియే ముందు జాగ్రత్తగా అన్నా వదినలు కాదన్నను వారు వ్రాసియిచ్చిన కాగితమును చూపెట్టి తగవులాడవచ్చుననుకొనినది. అన్న

1. నేను సేకరించినది, పాడినవారు, సుమిత్రాదేవి, ఎం.ఎల్.ఎ.

అందులకు సమాధానముగా "మామిడాకు తెంపిస్తా"నను-[1] ఇతని సమాధానము సమయోచితముగా నున్నది. మామిడాకు తెంపించుటలో ఒక ప్రత్యేకతయున్నది. కాగితము వ్రాసియిచ్చుట సామాన్యము. కాని శుభ సూచకమైన మామిడాకును ఇచ్చి వియ్యమందుట యను శుభకార్యము తథ్యమనుభావమును వెల్లడించినాడు.

తలుపు దగ్గర సంవాదములలో నాయికా నాయకుల సంవాదములుగా కృష్ణ సత్య సంవాదము-[2]. గోపికాకృష్ణుల సంవాదము-[3] "శ్రీ వేంకటేశ్వర్లు అలివేలుమంగల సంవాదము, లక్ష్మీనారాయణుల సంవాదము" మొదలగునవి కలవు. -[4]

స్త్రీల పాటలలో జాలువారు మాధుర్యమునకు లొంగిన పండితులును వాటిననుకరించి పెక్కుపాటలను వ్రాసినారు. 19 వ శతాబ్దములో వనపర్తి వాస్తవ్యులును, పిదప శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర యతీంద్రులుగా మైసూరులో పరకాల మఠాధీశ్వరులుగా వేంచేసిన వారును. కవి గండ భేరుండాది బిరుద విరాజితులును, రామేశ్వర విజయ, శ్రీనివాస విజయ చంపూ ప్రబంధకావ్యాలంకాగ మణిహారాద్యలంకారశాస్త్రకారులును అగు హొూస దుర్గం కృష్ణమాచార్యులవారు కూడ స్త్రీల పాటలను సంస్కృత భాషలో రెండు సంపుటములుగా రచించిరి. వానిలోని ప్రతి పాటయును మహాకావ్యము అనదగినది. ఆపాటలలో తలుపు దగ్గరి పాట కృష్ణ సత్యభామ సంవాదముగా

"జఘనతల విజిత పులినే లలనే
విఘటయారరం బాలె సఖి; బాలచంద్ర సమఫాలే"

- అని ప్రారంభమై వివిధాలంకారములతో రసవత్తరముగా సాగును.-[5] మహా విద్వాంసులును స్త్రీల పాటల రచనకు కడంగిరనిన, వానిలోని యాకర్షణమును గురించి చెప్పనక్కరలేదు.

---

1. నేను సేకరించినది. పాడినవారు, రాసులోల్ల బుగ్గమ్మ, రాయిప్రోలు.
2. సెలయేరు-పుట-40
3. తెలంగాణ పల్లెపదాలు-పుట-151
4. స్త్రీల పాటలు. ఎస్.వి. గోపాల్ అండ్ కంపెని. పుటలు-114-120
5. మంగళ గీతములు-శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర పరకాల స్వామి.

పెండ్లి వేడుకలు పూర్వమువలె నేటికాలమున జరుపబడకపోవుట వలన వేడుకలను ఒక క్రమపద్ధతిలో చేర్చి చెప్పుటకు వీలుగానుండదు. అయినను నాటి కాలపు నేటి కాలపు వేడుకలను దృష్టియందుంచుకొని ప్రాచుర్యమును పొందిన వేడ్కలనిట పేర్కొందును.

పూల చెండ్లాట – పెండ్లి తంతువు పూర్తి అయిన పిదప వధూవరుల చేత పూలబంతుల నాడింతురు. జీవితము బంతులాటవలె ఇరుప్రక్కల సహకారముతో కొనసాగునట్టిదనియు, సుఖదుఃఖములను సమానముగా చూడవలెననియు దీని ఉద్దేశమై యుండును. అంతియేగాక నూతన వధూవరులు పూలచెండ్లవలె మృదుమనోహరులు. వారి పరస్పరానురాగమును వృద్ధిచేయుట, పువ్వుల వలె సదా సర్వకాలము సంతోషముతో నుండుట, వానివలె పరిమళముతో, పారిశుద్ధ్యముతో జీవితము గడపుట వధూవరులు గ్రహించునట్లు చేయుటయును దీని ఉద్దేశమై యుండును. పరస్పర సన్నిహిత భావము గలుగజేయుటయు దీని పరమార్థము కావచ్చును.

పూలచెండ్లాడవె పూబోణిధవునితో – బాలికామణి మల్లెపూల బంతినివెస
కేలదాల్చి చెల్వునికేల రహినుంచుమ ॥పూ॥
ధరణీదేవులు మంత్రార్థములను జదువగ
సురదుందుభీని స్వనములు మ్రోయగ ॥పూ॥
వారాంగనామణులు వరనాట్య విధులను
మేరమీద జూపగా మృగనేత్రలు గొనముగ ॥పూ॥ –[1]

– ఈ పాటలో పెండ్లి దృశ్యములు–బ్రాహ్మణుల మంత్రపఠనము, వాద్యముల ఘోష, నట్టువకత్తుల నాట్యము, పెండ్లికి వచ్చిన స్త్రీల సంబరము మొదలయినవి చెప్పబడినవి. ఈ వాతావరణములో పూల చెండ్లాడుట నూతన వధూవరులకేగాక చూచువారికిని వినోదము కలిగించును.

"బంతులాడిరీ బాలకృష్ణులు. మరివింతగ చేమంతి పూలబంతిచేబట్టి ॥బం॥"–2

– ఈ బంతులాట దేవతల పరముగా నున్నను ఆడునట్టివారు మానవులే గనుక దేవతల స్థానములో వధూవరుల పేర్లు చేర్చుటయును కలదు.

1. మిన్నేరు–పు–113, 2. సెలయేరు – పుట. 28

బంతులాడునప్పుడు వరుని పరిహాసమాడుచు నిట్లు పాడుదురు.

బంతులాడెనే పూలబంతులాడెనే మేల్
బంతులాడెనే, యెగసి గంతులాడెనే ॥బంతు॥
బుఱ్ఱముక్కు, తొఱ్ఱినోరు, బఱ్ఱెగొంతు పెండ్లికొడుకు
చిఱ్ఱుముఱ్ఱులాడి పూలచెండులాడెనే ॥బంతు॥
కొంగకాళ్లు వంగువేళ్లు బొంగజొల్లు పెండ్లికొడుకు
చెంగు చెంగుమనుచు పూల చెండులాడెనే ॥బంతు॥
గోరులెల్ల చేయితీట గీరుకొనుచు పెండ్లికొడుకు
పారపండ్లు తెరచి-పూలచెండులాడెనే
గోచిపాత వీడ జనులు చూచి నవ్వపెండ్లికొడుకు
పాచి పండ్లతోడ పూలచెండులాడెనే
సిగ్గుపడుచు పెండ్లిబాల మ్రొక్కి మ్రొక్కి చేతులెత్త
సిగ్గుయింత లేక పూల చెండు లాడెనే ॥బంతు॥-[1]

- బంతులాడు పాటలనే "చెండ్ల పాటలు" అను పేరున నందిరాజు చలపతి రావుగారు పొందుపరచిరి.-[2]

వధూవరులు తాంబూలమందుకొనుట :- పెండ్లిలో ప్రతిదియు వేడుకయినట్లే వధూవరులు పరస్పరము తాంబూలమిచ్చుకొనుటయు గొప్పవేడుకగా భావింతురు. తమలపాకులు చీల్చుట, ఈనెలు తీయుట, సున్నము రాచుట, వక్కపొడి పెట్టి చిలుకలుగా చుట్టుట-ఇవన్నియు స్త్రీలు, పిల్లలును మహోత్సాహముతో వధూవరుల చేత చేయించుదురు. ఇటువంటి ఘట్టములను నేడు ఫోటోలు తీయటయు కలదు. వధూవరులు పరస్పరము తాంబూలము పుచ్చుకొనునప్పుడు పాడు పాటలు అసంఖ్యాకములు. వానిలో వధువు వరుని తాంబూలమునకు పిలుచుపాటయిది-

"ఆకువక్కా మణుపు లందిచ్చేరారా మణుపులిచ్చేరారా
నాకులదైవమా రాజగోపాలా ॥ఆ॥
ఏలాలవంగమన ఎందుకొబ్బెరనా ॥ఆ॥
ఫాలలోచననుత బాగు సున్నమున ॥ఆ॥

1. మిన్నేరు-పుటలు-113, 114.
2. స్త్రీలపాటలు-మొదటిభాగము. పాటల సంఖ్య 142-157.

ఏలాలవంగమున యెందు కొబ్బెరను ॥ఆ॥
తెల్లనాకుల మడుపు తెచ్చిచ్చెరారా ॥ఆ॥
జాజికాయ జాపత్రి సంకోచమున ॥ఆ॥
మాధవ శొంఠియు మరిలవంగమున ॥ఆ॥
అత్తరువు పన్నీరు అతివలందియ్యా
వేణుగోపాల నీవు వేగరావయ్యా ॥ఆ॥ –[1]

ఇట్లే వరుడును వధువునకు తాంబూలమందించుచు పాడును–

"ఆరు మడుపులందవే అంగననాపై కోపమేలనే?
తుంబురునారదులే పాడ తూర్య ఘోషములెల్ల చెలగ
రంభాదులెల్ల నాట్యమాడ రమణులెల్ల అందివ్వగా॥ ।
కంఠహారము కౌస్తుభ కంకణములు ఘల్లుఘల్లున మ్రోయ
వెంట జంటగాను చెలులు జంబుగీతములె పాడ॥ ।
వేద పాఠకులకు నెల్ల వేదవేద్యుడగుచుధీర
నెలతరోఘన వాడిని ఆదిదేవుడనుచు నెల్ల॥ ।–[2]

–ఈ పాటలన్నియు వధూవరులే పాడనక్కరలేదు. వచ్చిన పేరంటాండ్రే వారి పక్షమున పాడుదురు.

తాంబూలము నందు శరీరారోగ్యమునకుపయోగపడు గుణములు చాలకలవు. కనుకనే వైద్య గ్రంథములు తాంబూలమును చాల ప్రశంసించినవి. అప్పన మంత్రి అను కవీశ్వరుడు తాంబూల గుణములను దానిని సిద్ధపరచురీతిని వర్ణించిన విధమున తాపీధర్మరావుగారు పేర్కొనిరి.

"మదన వికాస సౌరభ వివర్ధనకారి, లసన్మదాపహం
బుదర విశేష సౌఖ్యకర, ముద్ధత దోష బలప్రహారి, స
మ్మద జనకంబు, తమ్ములము, మానవతీపరిభోగ వేళలన్
మదన పునర్నవీకరణ మంత్రము తుల్యమె దానికెద్దియేన్–[3]

1. మిన్నిరు–పుట–111
2. మిన్నేరు–పుట–112
3. సాహిత్య మొర్మారాలు–పుటలు–19, 20.

– తాంబూలము నోటికి సువాసన నిచ్చును. క్రొవ్వును కరిగించుచును .... కామమును హెచ్చించును. అనగా రాగవర్ధకము వధూవరులకు పరస్పరాను రాగమును వృద్ధిపొందించుటకు చిహ్నముగా వివాహమునందు ఈ వేడుకను చేర్చియుందురు. వరుడు సగము కొరికిన తమల చిలుకను వధువు అందు కొనుట, వధువు కొరికిన దానిని వరుడు అందుకొనుట చూడగా సతీపతుల మధ్యభేదమును పాటింపకూడదనుటకును బహిరంగముగా తాంబూల చర్వణము సంకేతమై యుండును.

ఈ వేడుక పూలబంతులాట కంటెను వధూవరులను సన్నిహితులను చేయుననుటను వేరుగా చెప్పనవసరము లేదు. ఇట్టి వేడుకలలో వసంతములాడుట మరియొకటి.

వసంతములాడుట :– వసంతము గూడ నూతన జీవితమునకు చిహ్నము. కనుక వివాహసమయములందు నూతన జీవితమునకు సంకేతముగా వసంతము లాడుదరు ఆ సమయమున

"పూల వసంతము లాడెనే! దమయంతి యాడెనే దమయంతి
రాజాధిరాజా శ్రీ నీల మహారాజుతో ॥పూ॥
చుట్టూ జల్తారు చీరె మల్లె మొగ్గాల రవికా
సంపంగి దండాలు ఘుమాఘుమా పరిమళింప ॥పూ॥
యిద్దరూ చేరి వనమున కేగిరి, ముత్యాల పానుపుపయి
ముదముతో కూరుచుండి, వజ్రాజ వాహిరి మెరయూచునిద్దరు ॥పూ॥
పున్నమ చంద్రుని వంటి ముఖా కమలాములందు
కలువరేకుల వంటి కన్నులాతో బూచుచు ॥పూ॥–[2]

– అనుచు అమితోత్సాహముతో పాడుదురు. ఐదు దినముల వివాహములో నాలుగు దినములయిన పిదప వివాహ కంకణములను విసర్జించి వసంతము లాడెడివారు. నేడు వసంతములాడుట నాగరికత ముదిరిన కుటుంబములలో కనుమరుగై పోయినది. వీరిలో వసంతము లాడు ఆచారము రంగునీళ్లలో వ్రేలునద్ది అందరిపైన చిలుకరించుటగా మిగిలిపోయినది. నన్నెచోడుడు వసంతములాడు

2. సెలయేరు–పుట–28.

ఆచారమును ఉమామహేశ్వరుల వివాహమహోత్సవ ఘట్టమున వర్ణించినాడు. –[1]

వదినగారి వందనము:– "వదినగారి వందనము" పెండ్లి హాస్యములలో ముఖ్యమైనది. పెండ్లి విందు ముగిసిన తరువాత మగపెళ్లివారు విడిదిలో విశ్రాంతి తీసుకొనుచుండ వధువుతల్లి క్రొత్త వస్త్రములను తీసికొని విడిదికి వెళ్లి వరుని తల్లిని చిత్ర విచిత్రముగా నగలని కూరగాయలతో అలంకరించి, బుక్కాగులాలులని ఉప్పుకారము పొడులను చల్లి వియ్యపురాలిపై "మంగళం" పాడును. అదియే "వదినగారి వందనము".

"మంగళం జయా మంగళం
మా వదినెగారీ వన్నెలాకూ
జయామంగళం మం
వన్నెలాడి వదినెగారూ
వయ్యారముతో పెండ్లికివస్తే
పెండ్లి పందిరి గడగడవణికే మం
మడికట్టుకు వదినెగారూ
తులసి పూజకు వెడుతూవుంటే
గాలివేసి పయ్య తొలిగెనే
చూచినవారు ప్రక్కసందు దూరిరే మం
ప్రేమాతో అరటిపండూ
వియ్యపురాలీ చేతికిస్తే
తినుటా ఎరుగని వియ్యపురాలు
తొక్కతో మ్రింగి కక్కుకొనేనూ మం

– అనుచు వియ్యపురాలితో వధువుతల్లి మేలమాడును. ఆమెకు తోడుగా ఆమె అక్కచెల్లెండ్రును సహాయపడి వియ్యపురాలును కదలనివ్వక చెవులకు వంకాయలు, మెడకు కాకరకాయలు కట్టి వినోదించెదరు. ఇట్టివి వినోదమున కేగాని అసలు మర్యాదలలో ఎట్టిలోపములును ఉండవు. పెండ్లికి వచ్చిన మగపెళ్లి వారికి వేడినీళ్లు, పండ్ల పుల్లలు, సబ్బు పౌడర్లు, అద్దము దువ్వెనలు–వంటి వస్తువులను విడిదింటికి

1. కుమార సంభవము–నన్నెచోడుడు. ఆ. పద్యములు 51–67.

పంపించుట వంటి మర్యాదలను చేయుటలో ఆడు పెళ్లివారు జాగరూకులుగానే ఉందురు.

మర్యాదకు మర్యాద, హాస్యమునకు హాస్యము అన్నట్లుండును వీరి ప్రవర్తన. వియ్యాల వారిని పరిహాసమాడుటలో వెనుక ముందులాలోచింపక దుయ్యబట్టుటకును వెనుకాడరు. ఇరు పక్షముల వారును పరిహాసములను తేలికగానే తీసికొందురు.

"వెలదిలో ఈ వియ్యపువారిది ఎరుకలి కులమమ్మి

....

గజ్జెల గుర్రాలనెక్కి కదలి రాగాను ॥వె॥

– వియ్యమందిన వారు తమతో సాటివారనుకొని వియ్యమందిన తరువాత వారి ప్రవర్తననుసరించి ఎరుకలి కులమని తెలసికొనినామని హాస్యమాడుట వినువారికి కడుపుబ్బ నవ్వు పుట్టించును. వియ్యపువారితో బాటు పెండ్లికొడుకునుకూడ

"వరహావతారుడు, కాళ్ల భైరవుడు పెళ్లికొడుకు

హడలు కొంటూ వీధులంట అట్టె పరుగెత్తూ" ॥వె॥–[1]

– అనుచు హాస్యము పట్టించెదరు.

నాగబలి :– నాకబలి, నాగవలి, నాగవల్లి, నాగవెల్లి, నాగెల్లి అనుపేర్లతో వ్యవహరింపబడును. పూర్వము వివాహము ఐదురోజులు జరుపబడుకాలమున నాకబలి పెండ్లిలో నాల్గవనాడు జరుగు శుభకార్యము. కాని నేటి కాలమున వివాహానంతరము వెంబడే పెండ్లి మండపములోనే నాగబలి జరుపబడును. నాగబలినాడు నాగప్రతిమలను పూజించుట ఆచారము. గోధుమ పిండితోగాని, జొన్నపిండితోగాని, బియ్యపు పిండితోగాని, నువ్వులపిండితో గాని ఈ నాగప్రతిమలను చేయుదురు. నాగప్రతిమల పూజావిధానము ధర్మ సింధునందు వర్ణింపబడినది–[2] ఈ పూజ వలన వధూవరులు శుభ సంతతిని పొందెదరని నమ్మకము. నాగబలి చివరన దిష్టికుంభమును పెట్టి (పళ్లెరములో గాని కొత్త చేటలోగాని అన్నమును రాసిగా నుంచి దానిపైన తొమ్మిది దీపములను వెలిగించుదురు. దాని పైనుండి వధూవరులను దాటించెదరు. వీరు వెనుకకు

1. సేలయేరు–పుట–35.
2. ధర్మసింధు. పరి. 3 పుట–222.

తిరిగి చూడకుండ వెళ్లి పోవలెను. సామాన్యముగా ఒక్కనాటి పెండ్లిండ్లలో వివాహానంతరము లగ్నమండపములోనే ఈ కార్యక్రమము జరిపించి, అరుంధతీ నక్షత్రమును చూపెట్టుటకు తీసికొని వెళ్లెదరు. పూర్వపు పద్ధతి ననుసరించి నాగబలి ఒకనాడు ప్రత్యేకముగా జరుపబడుచుండెను.

అలుకబోయిన అల్లుని బ్రతిమాలి పెండ్లికిచ్చెదమని వాగ్దానము చేసిన కట్నకానుకలన్ని యిచ్చుటయేగాక అదనపు కానుకలను సమర్పించుకొని మామగారు అల్లుని "నాగబలి" కి తీసికొని వచ్చెదరు. ఒక్కనాటి పెండ్లిలో మంగళ సూత్రధారణకు నాగబలికి మధ్యన వ్యవధి అధికముగా నుండదు గావున "అల్లుడు అలుక పోవుట", అప్పగింతల సమయమున జరుగుటయో; తరువాత జరుగటయో, లేదా కట్నకానుకలతో బాటు అలుక కట్నమును కూడ ముందుగానే ఏర్పాటు చేసికొనుటయో జరుగుచున్నది.

గొల్ల, కుర్మ కులములలో వరుడు వివాహానంతరము కట్నము తక్కువ అని ఒక గొంగడి భుజానవేసికొని, చెంబుచేతబూని విడిదినుండి వెడలి తనకు తెలిసిన వారింటికివెళ్లి యుండును. అల్లుడెక్కడ నున్నది తెలుసుకొని మామగారు వెళ్లి అల్లుని అలుక తీర్చవలెనని అభిప్రాయము అట్లు చేసిన అల్లునిని బాగుగా గౌరవించినట్లుగా భావించవలెను.

ఈశ్వరుని వీధిలో దొంగజొచ్చిండు
దొంగగాదుర కొడుక దొరకొడుకుసుమ్మీ
బంగారు పాకోళ్లు కాళ్లకు దొడిగించీ
ముచ్చాల (ముత్యాల) గొంగడి ముదిముసుకు (నిండుముసుగు) బెట్టి
శిద్దాము (సిద్ధము) చెంబుతో శిక్నీ (చిక్నీ) పోకాలు
ఇదినీకు వరణంబు (అరణంబు) లేచి రావయ్యా
ఐదేళ్ల బటువులు ఔ పట్టుశాలు
అత్త మామలచ్చింద్రు (వచ్చినారు) లేసి (లేచి) రావయ్యా!
నాలుగేళ్ల బటువులు నడుము గొలుసుల్లు

వదినమర్దండ్లచ్చింద్రు లేచిరావయ్యా

....

పదేళ్ల బటువులు పాగశెల్లాలు

బావమర్దులచ్చింద్రు లేచి రావయ్యా

ఏడేళ్ల బటువులు ఏళ్ల కుంగ్రాలు

ఇరుగు పొరుగులచ్చింద్రు లేచిరావయ్యా! –[1]

– అత్త మామలతో బాటు వదినెమరదండ్రు, బావమరదులు అలుకబోయిన అల్లుని బ్రతిమాలుటకు వచ్చుట బాగుగానే యున్నది. అంతేగాక ఇరుగు పొరుగు వారు ఏడు వ్రేళ్లకు ఉంగరాలు తీసికొనివచ్చినారట. దీనివలన పూర్వపు జానపదుల పరస్పర సహకార మైత్రీ భావములు వెల్లడియగు చున్నవి.

నాగవల్లి అలుకకు పోవు అల్లుడుగాని తని వెంటనుండు మగపెళ్లి వారుగాని పెండ్లింటనున్న వస్తువులను యథాలాభముగా పట్టుకొని వెళ్లుదురు. దీనికి "దొంగ చెంబెత్తుక పోవుట" అని జానపదుల వ్యవహారము. నేటికాల మున ఈ ఆచారము కనుమరుగైపోయినను ఆడపిల్ల వైపువారు అల్లునికిచ్చు నాగవల్లి కట్నములలో దొంగచెంబు అను పేరున ఒక చెంబును ఇచ్చుట మాత్రము మిగిలినది.

జానపదులు రామునంతటి వానికిని అలుకబోవుట నంటగట్టిరి. రాముడు పెండ్లిలో బంగారు చెంబును చేతబట్టుకొని అలిగి అయోధ్యకు వెళ్లిపోయెను. మగ పెండ్లివారి వెంటనున్న పడతుల చేతికి వచ్చిన వస్తువులను చేతబట్టుకొని వరుని వెంబడి బయలు దేరిరి.

"అప్పడము వడియము అతివ తాబట్టె

లడ్డువము, మోరుండు లక్షణంబుగను

కొబ్బరి కుడుకలే గొంతి తాబట్టె

బంగారు చెంబుతో పానకము బట్టె

....

రఘుకులపుంగవుడు రామచంద్రూడు

చెంబుచేతాబట్టి అలగి పోదలచె

1. త్రివేణి – పుట – 64

ఆప్తులయిన వారలు, వరుస వారలును
తప్పట్లు జఅచిరి రామ చంద్రునకు

అప్పుడు ఆడు పెళ్లివారు వచ్చి అతనిని బ్రతిమాలుట మున్నగు వేడుకలు జరిగినవి. రాముడు ఏవేవో కోరికలు కోరెను

"వెండికాగులు మంచి భమిడిగోలెములు
అరణమిస్తేగాని లేచిరాననెను
పచ్చలా పతకములు జోడధనాలు
అరణమిస్తేగాని లేచిరాననెను
పట్టేమంచము పరువులు భటులు దాసీలు
అరణమిస్తేగాని లేచి రాననెను

– ఆడుపెళ్లివారు బ్రతిమిలాడి, బ్రతిమిలాడి చివరకు అన్నిటికిని ఒప్పుకొని

"వెండిత్రాళ్లను మంచి పసిడి త్రాళ్లను
రామునీ మెడ వేసి లాగిరపుడు
....
రమణులెల్లను ఇట్లు రమ్మనుచు బలక
రామచంద్రుడు సీత విడిదికి జనిరి. –[1]

– రామునంతటి రాచబిడ్డడును జానపద రాముడై దొంగ చెంబెతుకొని పోవుట, కనీసపు కోరికలుగా కానిపించు పట్టేమంచము పరుపు కావలెనని అడుగుటను తప్పించుకొన లేక పోయెను.

అలుక బోయిన అల్లుని నాగబలికి ఆహ్వానించుచు
"వేగ రావోయి పెళ్లికొడుక, నాగవల్లికి ॥వే॥
....
యేవేళ చూస్తామన్నను యిల్లువిడిచి బైటికి రావు ॥వే॥
మంచివాడవని నీవు మాళ్లు పడుచునిస్తే
పంచల తిరిగేటి బుద్ధి కొంచమైన మానక పొయె ॥వే॥ –[2]

1. స్త్రీల రామాయణపు పాటలు – పుటలు – 78–80
2. సేలయేరు – పుట – 43

– అని పాడుచు వరునితో మేల మాడెదరు.

"నాగవల్లి నిష్ఠూరమ" ను లోకోక్తి మనకు వాడుకలోనున్నది. ఆడుపెండ్లివారు ఎన్ని మర్యాదలు చేసినను సంతృప్తి పడని మగపెండ్లివారి వైఖరిని బట్టి ఈ లోకోక్తి ఏర్పడే యుండును. ఆడు పెండ్లివారు ఎంతటి ఉపచారములు చేసినను మగపెండ్లి వారికి లోకువయే. విజయ విలాసమున "లోలకయింక నాకబలి నిష్ఠురమేల పల్కగన్" అని నాకబలి నిష్ఠూరము పేర్కొనబడినది.

నాగబలిని కళా పూర్ణోదయము–[1], పాంచాలి పరిణయము–[2], ఓఘవతీ పరిణయము–[3], ముక్తికాంతా పరిణయమును–[4] వర్ణించినవి.

నాగవల్లికి వధువింటికి వచ్చిన వరునివైపు వారు పెండ్లికుమార్తెను చూచి

"ఇంతా పెంకె తనమేల చెలియా,
నీయంతరంగమంత తెలిసే లలనా,
నల్లఛాయ మెల్లకన్నుదాన చెలియా
నీ చొట్టుబుగ్గ మిట్టి నొసలుగా
సొంగకారు నీరుదాన చెలియా,
నీ బట్ట తలయు చొట్టకాలుగా ॥ఇంతా॥–[5]

– అని పరిహాసమాడగా, ఆ పరిహాసములను విని వధువు పక్షమువారు వరునిని ఉద్దేశించి

"ఎక్కడ దొరికినాడమ్మా ఈ పెళ్లికొడుకు
అడ్డెడు మానెడు పోసినాము

1. కళా పూర్ణోదయము. ఆ. 7
2. పాంచాలి పరిణయము - ఆ. 4
3. ఓఘవతీ పరిణయము – అ. 3 ప. 242.
4. ముక్తికాంతా పరిణయము. పుట – 34
5. సెలయేరు – పుటలు – 34, 35

అరిసెలైన వండినాము
అందమైన చూపడాయె
అరమొగము పెళ్లికొడుకు"

– అని గేలి చేయుచు

"లక్షవేలు పోసినాము – లక్ష్మివంటి బాలనిచ్చినాము
ఏలుకోవడం చేతికాదు – బేలమొగం పెళ్లికొడుకు"–[1]

అనునంతవరకు వెళ్లుదురు. ఈ వేళాకోళాపు పాటలలో వర్ణనలన్నియు అత్యుక్తులే. పాడువారుగాని, వినువారుగాని దీనిని నిజమని నమ్మరు.

బువ్వము బంతి :– ఐదునాళ్లు జరుగు వివాహములలో నాలుగవ నాటి రాత్రి బంధువులు – మగవారును ఆడువారును ఒకటిగా వేడుకగా బంతులు తీరి భుజించుటను బువ్వము బంతి అందురు. –2 దీనిని హరి బువ్వము అనియు బూజంబంతి అనియు వ్యహరింతురు.

బువ్వ అనగా అన్నము, భోజనము అని అర్థము. బంతి అనగా వరుస. కనుక "బువ్వంబంతి" అనగా వరుసగా కూర్చుండి భుజించుట అనునర్థమున నుండు ఈపదబంధము వివాహమున జరుగు ప్రత్యేకమైన విందుకు కాలక్రమమున వ్యవహారమై యుండును. దీనిని కొన్ని ప్రాంతములందు భూజం బంతి అనుటయును కలదు. భుజములు భుజములు రాసుకొని ఒక్క వరుసలో కూర్చుండి భుజించుట కావచ్చును. నేటి కాలమున వివాహనంతరపు విందు భోజనమునే బువ్వము బంతిగా గ్రహింపవలెను.

స్త్రీల పాటలలో బువ్వము బంతి వర్ణనలు పెక్కు కలవు.

"సుందరమగు బువ్వము చూడగ ఆనందము
యిందువదన లార రారె సుతను గొందము ॥సుం॥
అపరంజరిటాకులే అందముగ వేసిరే
చపలాక్షులార రారె శాకాన్నము వడ్డించిరి ॥సుం॥

1. సెలయేరు – పుట – 34.
2. శబ్ద రత్నాకరము.

కదళిచూత ఫలములు ఘన చక్కెర మిళితములు
దధిమధుపల రసములతో తరుణులు వడ్డించిరిహో ॥సుం॥
భక్ష్యాపూప సూపములు పాయస ఘృతమమరగా
సాక్షాన్మోక్ష ప్రదుండు శంకరుడారగించి మించే [1] ॥సుం॥

– విందు భోజనమును ఏర్పాటు చేయుటలో నెట్టి లోపములును లేవనునట్లుగా "ఆ భోజన పదార్థములను శంకరుడే ఆరగించి మెచ్చుకొనెనని ఈ పాట చివరన చేర్చినారు. పసందైన వంటలతో విందు ఏర్పాటుచేసి ఊరుకొనక, వియ్యాలవారు విందునారగించుచు పరిహాసము లాడెదరు. వధువు పక్షమువారు

"ఎక్కడ దొరికినారు, యింత చక్కని వియ్యాలవారు
నెయ్యంతా నేడే తీర్థంవలె డ్రాగినారు
హెచ్చైన పప్పులు వేస్తే మెచ్చరమ్మా యేమో వీరు ॥ఎ॥
నన్నబియ్యపన్నము వీరు ఎన్నడు యెఱుగరేమో
ఎన్ని సార్లు వడ్డించిన యింకా తెమ్మని అడిగేరు ॥ఎ॥
అరిటాకుల అలవాటులేక చిరుగులు చేసుకున్నారు
పెరుగు పాలు కలగలిపి జుఱ్ఱు జుఱ్ఱు జుఱ్ఱేరు ॥ఎ॥
పప్పుకూరలు వద్దు, పచ్చళ్లే తెమ్మనేరు
చెప్పుకుంటే సిగ్గుచేటు, గొప్పవారని వీరికి పేరు –[2] ॥ఎ॥

– అడవినుండి పట్టుకొని వచ్చిన వారిని అపహాస్యము చేసినట్లుగా వరుని పక్షమువారిని పరిహాసము పట్టించెదరు. అందుకు మగపెండ్లి వారేమి తీసిపోకుండ సిద్ధముగానే ఉందురు.

వియ్యాలవారింట్లో విందూ చేసిరంటా
దండిగా ప్రాణాలు మెండుగానే లేవు ॥వి॥
వట్టి కందీపప్పు వడ్డించి వెళ్లేరు
ములక్కాయ యిగురు ముడిబియ్యపన్నాము ॥వి॥
పచ్చీ తామారాకు బంతూలు వేశారు
వడిగా వారు వడ్డించి వెళ్లారు ॥వి॥
పుచ్చీపోయిన చక్కా వాడిపోయిన ఆకు

1. సెలయేరు – పుట – 29.
2. సెలయేరు – పుట – 30

పొట్లీపోయిన సున్నం ఇచ్చీపోయారు ॥వి॥
బావగారి జుట్టుకూ బంతీపూలు జుట్టేరు
వీధివీధులదిప్పీ వింతగా జూచేరు–[1] ॥వి॥

వియ్యాలవారి పరిహాసము లిట్లుండగా ఆయా యింటి ఆడబడుచుల పరిహాసములు మరికొన్ని–

"వైశాఖ మాసాన, వారింట పెళ్లీ
వల్లభుడు అన్నయ్య పెళ్లి చేయించే
మిళ్లి తడియకుండ, బొట్టు పడకుండ
నేర్పుగా పెద్ద వదినె నేతులొడ్డించె
చేతి చిత్రాలది చిన్నన్న వదినే
ఆకాశాన మిళ్లి ఆడించి పోయె
మా వదిన గడుగాయి దండు సిపాయి
ఇల్లెక్కి వండింది యాసె బూరెల్లు
పొయ్యెక్కి వండింది పొంగు బూరెల్లు
దీనజేసి వండింది దోసెడు గారెలు
నీళ్లతో వండింది నూరు గారెల్లు.–[2]

– అన్న మంచివాడే అక్కాచెల్లెండ్రకు, వదినలతో నేయున్నది పేచి; దొరికిన వీలును వదలక సాధించెదరు. ఈ పరిహాసములలోను మగవారికన్న ఆడవారిదే పై చేయి, ఎంత మూగవారినైన కదలించి నోరు విప్పించును వీరి హాస్యములు. పరస్పర పరిహాసములతో పరిమళపుష్పములు పెదజల్లి నట్లుండును. "సుందరమగు బువ్వము, చూడగ అనందము" అందరికిని కలుగును.

బువ్వముబంతి విసరులలో వియ్యాలవారితో బాటు వధూవరులను కూడ చేర్చి పరిహాసమాడుదురు. వరుని చూచి పేరంటాండ్రు

"యేమయావో పెండ్లి కొడుకా యెంత కీరితి తెస్తివీ ॥యే॥
పొంతకాగిని నీళ్లమేమూ పోసి చూస్తామంటిమీ

1. సెలయేరు పుట – 44
2. త్రివేణి – పుట – 32

తొట్టిలోని ముసురు నీళ్లూ నాకి (నాకు) కావాలెనంటివీ ॥యే॥
సన్నబియం కోడిపెట్టా మేము పెడతా మంటిమీ
రాగిముద్దా పులవచారా (చారు) నాకి కావలెనంటివీ ॥యే॥
తూగుటుయ్యేల వొరుగుదిండూ మేము యిస్తామంటిమీ
పాతచాపలు పంచటరుగులు నాకి కావలెనంటివీ ॥యే॥
తట్టుమంచం లేపుదిండూ మేము యిస్తామంటిమి
నులకమంచం కమిటీ కోరి -1 నాకి కావలె నంటివీ-2 ॥యే॥

- అని అతనిలో అల్పబుద్ధులను ఆరోపించి మేలములాడుదురు. నిజముగా అల్పబుద్ధులు అతనిలో నున్నను లేకపోయినను వినువారు మాత్రము ఆనందముతో నవ్వక మానరు.

అప్పటి విందులలోని భక్ష్యభోజ్యములను తెలుపు మరియొక పాట శ్రోతలకు నోరూర జేయును.

"మహారాజ శ్రీనివాసు బువ్వము మహిమా చూడారే
మంగళాంగి అలివేలు మంగతోడ నేడు
లడ్లు, పేణి ముడిగమల్ సూరత్ ఫేణీలు
చక్కెర లడ్డు పేణి ముడిగము సూరత్ ఫేణీలు
బాదము హల్వా బజ్జీలు ॥మహా॥
పొంగల్ విడిదోసె ఇడ్డెన్ పులిహోరల్
చక్కెర పొంగల్ విడిదోసె ఇడ్డెన్ పులిహోరల్
వంగీబాత్ కేసరిబాత్ బంగాళా బాత్ అన్నీనూ ॥మహా॥
పనస పండు మామిడి పండు పచ్చి ద్రాక్షా
కమ్మకిచ్చియల్ ఆఫీసువనెర్ కదళీఫలముల్-[3]"

పెండ్లి భోజనములన్ని ఒకయెత్తు, బువ్వము బంతి భోజనము ఒకయెత్తు.

బువ్వము బంతిలో వధూవరులు అరమరికలు లేకుండ భుజించు పద్ధతిని మన్నారుదాస విలాస ప్రబంధము కడు చక్కగా వర్ణించినది.

---

1. చీలికలు పేలికలయిన కంబళి 2. త్రివేణి - పుట - 229.
3. జానపద గేయ వాఙ్మయము - పరిచయము - పుట - 295

బంగరు పళ్లెములోపల
రంగుగ పరమాన్నమునుప రాజసమున న
య్యంగనయు దాను మది ను
ప్పొంగుచు బువ్వము భుజించె భూవిబుడెలమిన్–[1]

– దీనిని బట్టి ఒక విషయము మనకు తెలియుచున్నది. భార్యాభర్తలు సంసారరథమును సమానముగా నిర్వహించు సమస్కంధులు గనుక వారిలో నేవిషయమునందును భేదభావము కూడ దనుటకు ఈ బువ్వము బంతి ఆచారముగా నేర్పడి యుండును. వధూవరులతో బాటు ఆత్మీయులగు బంధువర్గమును అమితోత్సాహముతో ఈ విందు భోజనము నారగింతురు.

వధువింట వివాహపు వేడుకలు పూర్తి అయిన పిదప వధువును వరునితో వరునింటకి వంపుదురు. ఈ ఘట్టమునే "అంపకము పెట్టుట, అప్పగింతలు పెట్టుట, ఒప్పగింతలు చేయుట" వంటి నామములతో వ్యవహరింతురు.

అంపకములు:– వధువును అత్తింటికి పంపుటకు ముందు ఆమెను తల్లిదండ్రులు వరుని పక్షము వారికి ఒక్కొరొక్కరికి పేరుపేరున అప్పగింతురు. అప్పగించునప్పుడు వరుని పక్షమువారిని నూతన వస్త్రములతో సంతృప్తులను గావించి, ఒక కుడుకలో పాలనుంచి పాలలో వధువు చేతిని ముంచి ఒక్కరొక్కరి చేతులలో పెట్టుదురు, వధువు జీవితము "పాల ముంచిన" విధముగా నుండటకు ఇకపైన వారిదే భారమని తెలుపుట కిట్లు చేయుదురు. వారు వధువు నోటిలో చక్కెరను వేయుదురు. భవిష్యత్తు కాలములో వధువుతో వారి సంబంధములు తీయతీయగా నుండెవలెనను కాంక్షకిది ప్రతిరూపము, పిదప వధువు చేత వరుని అక్కాచెల్లెంద్రకు కొబ్బెర వాయనములిప్పింతురు.

ఆడపిల్లలు ఎన్నియేండ్లు తల్లిదండ్రుల చెంత పెరిగినను వివాహానంతరము అత్తింటికి వెళ్లవలసినవారే. ఆడు పిల్లలు ఎదిగి వివాహము కాకుండు యుండిన గుండెలమీద కుంపటివలె బాధపడుచు వారికి వివాహము కావించిన పిదప సంతోషముతో తేలికపడిన హృదయముగల తల్లిదండ్రులునూ కూతురును

1. మన్నారు దాస విలాస ప్రబంధము. ఆ. 5, ప. 57.

అత్తవారింటికి పంపునప్పుడు హృదయ భారముతో కన్నీరు నింపెదరు. వివాహ సందర్భమునందు అదియొక విషాద సన్నివేశము. కాళిదాసు శాకుంతలమున కణ్వునంతటి బ్రహ్మచారి యగు ఋషితోను శకుంతలను దుష్యంతుని వద్దకు పంపు సందర్భమున కంటతడి పెట్టించెను. "శకుంతల నేడు అత్తవారింటికి వెళ్ళుచున్నదని నా హృదయము ఉత్కంఠాకుల మగుచున్నది. కంఠము గద్గదమగుచున్నది. చూపు నిలువకున్నది. అరణ్యములో నివసించుచున్న నాకే పెంచిన మమకారముతో ఇంత బాధ కలుగుచున్నది కదా! కన్నవారు ఎట్లు బాధపడుదురో ఈతనయా విశ్లేష దుఃఖముతో" అని కణ్వుని సంతాపమును కాళిదాసు సహజ సుందరముగా వర్ణించినారు.–[1] తాపసియగు కణ్వుడెగాక ఆశ్రమమంతయు శకుంతలా వియోగమునకు విలపించినట్లు కాళిదాసు వర్ణించినాడు. శకుంతల వెళ్లుచున్నప్పుడు జింకలు మేయుచున్న దర్భకడిని వదిలి ఆమెవైపే చూచినవట. నాట్యము చేయుచున్న నెమళ్లు నాట్యమాపి ఎంతో దిగులుగా చూచినవట. చెట్లు పండుటాకులను రాల్చి దుఃఖించినవట! అయినప్పుడు కనిపెంచి ఒక అయ్య చేతిలో బెట్టు తల్లిదండ్రుల విచారమును వర్ణించుట అలవి కానిది.

జానపద స్త్రీలును గ్రామములలో తరచు సంభవించు ఈ అంపకము లను కరుణామయముగా, స్వాభావికముగా వర్ణించినారు. కూతురును అత్తింటికి పంపునప్పుడు తల్లిదండ్రుల బాధ సమానమే అయినను, పాటలలో మాత్రము తల్లులకే ప్రాధాన్యము కలదు. అంపకముల సందర్భమున పాటలు పాడువారు స్త్రీలగుట, స్వభావమును బట్టి పురుషులు ఎంతటి దుఃఖమునైనను దిగమ్రింగగలుగుట, స్త్రీలు తమ బాధను వెంబడే వెళ్లగ్రక్కుట – ఇందుకు కారణమైయుండవచ్చును.

అన్నిదేవుల పూజ అతి భక్తితో చేసి
పతి కరుణచే నేను పడతిని గంటీ
సుకుమారమైనట్టి కురులు నున్నగ దువ్వి
కోరు జడ బంగారు కరుణతో బెట్టి

1. అభిజ్ఞాన శాకుంతలము. అంకము -- 4.

చెంప బిల్లలు చుంచు ఇంపుగా కనిపెట్టి
సొంపుగా వినిపించి సౌందర్యమణికి
చిన్న జరివల్లెయి మన్ననతో కట్టి
మంచి రవికెలు దొడిగి మరి సంతసించి
సర్వాలంకార సమముగా నేజేసి
పతి పాలించితి అతి మోదమునను
నెయ్యి అన్నము పెరుగు తియ్యని పాలను
తిని సుఖించిన ఈ తీగబొమ్మ
ఎనిమిది వర్షములు ఘనముగా సాకి నే
ఈ దినము ఇస్తి నీ నా జనని నిన్ను
చిన్న నాటను గోలె మన్ననతో నేసాకి
అన్నయ్య నీకిస్తీ నా చిన్ని కన్య
నీళ్ల ముంచిన మీరె పాల ముంచిన మీరే
ఏనీళ్ల ముంచిన మీదె భారముగా
అక్కటక్కట ఎట్లు అరయ పాలింతురో
పరమాత్ముడెరుగును మీ పాలనమును
అప్పగించితి వదినె అతి భక్తితో నీకు
ఆదర పూర్వకముగ అతివను జూడు"–[1]

– ఈ పాటలో గ్రామీణులైన తల్లుల హృదయము స్పష్టము. "కాకిపిల్ల కాకికి ముద్దు" అనునది సామెత. ఏమియులేని తల్లిదండ్రులు కూడ తమ పిల్లల భవిష్యత్తును ఆశించి వారిని ప్రేమతో పెంచుట సహజము. అప్పగింతల పెట్టుచున్న ఈ తల్లి కొంత కలిగిన దానివలె కనిపించుచున్నను పేదవారును ఇట్టి భావములనే ప్రదర్శింతురు. కనుకనే పిల్లల నెట్లు పెంచినను జడకు బంగారు కుచ్చులు వేసి, చెంప బిళ్లలు పెట్టి, చిన్న జరీవల్లెలు కట్టి, మంచి రవికెలు దొడిగి, సర్వాలంకార సహితముగా ఇచ్చితిననియు. నెయ్యి, పెరుగు, తియ్యని పాలు పోసి ఘనముగా సాకితిననియు చెప్పుటకును వెనుకాడరు.

1. తెలంగాణా పల్లెపాటలు పుటలు – 106, 107.

పిదప తల్లియు, మేనత్తయు, మొదలైన పెద్దలును అంపకములప్పుడు వధువునకు చెప్పుహితవు చాల ముఖ్యమైనది. కన్య పుట్టింటిలోనున్నప్పుడు ఎన్ని ఏండ్లుగా ఎన్ని చెప్పినను ముఖ్యమైన సందర్భమున చెప్పు మాట మనసులో నాటునను భావముతో అప్పగింతల సమయమున చెప్పుట ఆచారము. కొన్నేండ్లుగా అలవడని బుద్ధి కొన్ని నిముషములలో అలవడునా? అని సందేహింపనక్కరలేదు. ఎన్నేండ్లు పుట్టింట పెరిగినను తాను మెట్టినింటికి వెళ్లుట తప్పదని గ్రహించిన వధువు వారి హితవును శ్రద్ధగా వినును. మననము చేసికొనును. అదియే ఆమెకు మెట్టినింటికి, పుట్టినింటికి కీర్తి తెచ్చుటకు దోహదకారియగును. ఈ క్రింది పాటలో తల్లి హితవాక్యములను జానపద స్త్రీలు ఎట్లు గుదిగుచ్చిరో మనము తెలిసికొన గలము.

అత్తవారింటికి అంపించవలెనిన్ను
అతిబుద్ధి గలిగుండు అమ్మరో నీవు
నీతవాక్యములను నిర్మించి చెప్పెద
ఖ్యాతితో నుండుము నాతిరో నీవు
బిడ్డరో వినవమ్మ బిరుసుమాటలు నీవు
అరయ బల్కకు తల్లి అత్తవారింట్ల
ఓర్పు సిగ్గులు గల్గి ఒరుల ఇంటికి బోక
ఒప్పితంబుగా నుండు ఓ బిడ్డ నీవు
తల్లిమారుగ అత్త తగ జూడవె బిడ్డ
జగడ మాడకు తల్లి జవ్వనుల తోడ
తండ్రి మారు మామ తనవలె వదినెను
కనవలె ఈరీతి కపటంబు లేక
మగువ కొడుకుల మారు మరదులను భావించి
కలిగుండవే కరుణాక్షి నీవు
ఎవ్వరికి ఎదురుగా బదులు మాట్లాడక
బెదరి ఉండుము తల్లి భేదంబు లేక
తత్తరంబది విడిచి అత్తగారీ మాట
చిత్తమున జేర్చుకో చిత్తారు బొమ్మ
తలకొంగు మరువకు తల ఎత్తి చూడకు

పొలతులతో వాదువలదు మాయమ్మా
పెద్దలు పిన్నలు వచ్చుమార్గము దెలసి
గద్దెపై గూర్చున్న గ్రక్కున్న దిగవే
హరి పగిది నీమె గుడు అరయ దేవుండతడు
ధరణి యిద్దరు నీకు దైవసములమ్మ–[1]

– ఈ పాటలో తల్లి తనకుమార్తెకు "గద్దెపై గూర్చున్న గ్రక్కున దిగవే. తలకొంగు మరువకు తలఎత్తి చూడకు, ఎవ్వరికి ఎదురుగా బదులు మాట్లాడకు అని చాల చిన్న విషయములను కూడ చెప్పినది. ఈ హితవు ప్రకారము మసలుకొనిన "ఖ్యాతితో నుండుము నాతిరో నీవు" అను మాట సార్థకము కాకుందునా?

తలకొంగు మరువకు అను హితవును మనము కొద్దిగా పరిశీలించుట అవసరము. ఔత్త రాహా వనితలకును దక్షిణా పథమున మహారాష్ట్ర వనితలకును తప్పనిసరిగా తలకొంగుండును. తెలుగు దేశమున తూర్పు ప్రాంతమునను. దక్షిణ ప్రాంతమునను తలకొంగు కన్పించదు. పెద్దల యెదుటనున్నప్పుడో, ఎచ్చటికైన వెళ్లునప్పుడో శరీరోర్ధ్వభాగమును కనబడనీయక కొంగు పూర్తిగా కప్పుకొనుట వినయ మర్యాదా సూచకము. తలకొంగు మహారాష్ట్ర ప్రాంత సరిహద్దులలోని కన్నడ తెలుగు ప్రాంతపు స్త్రీలకు మహారాష్ట్రుల సంప్రదాయ సంపర్కముతో నేర్పడినట్లున్నది. కాళిదాసు శాకుంతలమున ఐదవ యంకమున శకుంతల దుష్యంతుని యాస్థానమునకు అవగుంఠనముతోనే వెళ్లినట్లు వర్ణించెను. పై పాటలోని తల్లి వినయమును వ్యక్తికరించు ఈ ఆచారమును బిడ్డకు చెప్పినట్లున్నది.

పై పాట పూర్తిగా ద్విపదలోను, మంజరీ ద్విపదలోనుండుట వలనను అక్కడక్కడ ద్వితీయాక్షర ప్రాస యుండుట వలనను ఇది కొంత ప్రబంధగంధముగల స్త్రీయో, పురుషుడో రచించినట్లు తోచుచున్నది.

---

1. తెలంగాణా పల్లెపాటలు – పుటలు – 107, 108.

జానపద స్త్రీలు తమ స్థాయి వారి యింటి వధువుల అంపకమలనే గాక పై స్థాయి వారి యింటిలో జరుగు అంపకములను రామాయణ కథతో ముడిపెట్టి పాడిన పాటలును కలవు. ఒక బతుకమ్మ పాటలో రాముని తల్లి కౌసల్య శాంతను మెట్టినింటికి పంపుచు ఇట్లు బుద్ధి చెప్పుచున్నది.

"నా తల్లి శాంతమ్మ ఉయ్యాలో నాముద్దు పట్టిరో ఉయ్యాలో
అత్తవారింటికి ఉయ్యాలో ఆనందముగ బొమ్ము ఉయ్యాలో
అత్తమామల భక్తి ఉయ్యాలో చిత్తంబులో నిలుపు ఉయ్యాలో
....
పేదరికమును జూచి ఉయ్యాలో ప్రీతి దప్పకు తల్లి ఉయ్యాలో
....
తనచక్కదనమును ఉయ్యాలో దాచుకొని తిరగాలె ఉయ్యాలో
సాధు సత్పురుషులు ఉయ్యాలో సమయానికికొచ్చిన ఉయ్యాలో
అన్నపానాదులు ఉయ్యాలో ఆదరించుము తల్లి ఉయ్యాలో
మాటజారినంక ఉయ్యాలో మళ్ళింకా రాదు ఉయ్యాలో
అందుకే ముందుగా ఉయ్యాలో ఆలోచనుండాలె ఉయ్యాలో
....
చెడిపోయినంకను ఉయ్యాలో చింతింప ఫలమేమి ఉయ్యాలో
అత్తగారింటికి ఉయ్యాలో అమ్మగారింటికి ఉయ్యాలో
మంచి పేరు తెమ్ము ఉయ్యాలో నాతల్లి శాంతమ్మ ఉయ్యాలో
....
ఆకాశమందున ఉయ్యాలో అల్లెను మేఘాలు ఉయ్యాలో
మేఘాల నడుమను ఉయ్యాలో మేలైన కాంతి ఉయ్యాలో
అందులో గౌరమ్మ ఉయ్యాలో అందాలు మీరగ ఉయ్యాలో
కనుల కింపుగా ఉయ్యాలో కనిపించె బాగాను ఉయ్యాలో
....
పతిభక్తియే మీకు ఉయ్యాలో పచ్చలా పతకమ్ము ఉయ్యాలో
అత్తమామల భక్తి ఉయ్యాలో అందెల గజ్జెలు ఉయ్యాలో
కష్టాలలో ఓర్పు ఉయ్యాలో కంకణాలు చాకట్లు ఉయ్యాలో
చుట్టాల అదరణ ఉయ్యాలో పట్టాగొలుసులు మీకు ఉయ్యాలో

కులాభి మానంబు ఉయ్యాలో బులాకి సొమ్ములు ఉయ్యాలో
వంశాభిమానంబు ఉయ్యాలో వజ్రాల కమ్మలు ఉయ్యాలో
దేశాభిమానంబు ఉయ్యాలో కాసులా దండలు ఉయ్యాలో
ఈ సొమ్ములు మీరు ఉయ్యాలో ఇంపుగా వలవండి ఉయ్యాలో
ఈ సొమ్ములా పాటి ఉయ్యాలో ఏ సొమ్ములుగావు ఉయ్యాలో
చదువులు శాస్త్రాలు ఉయ్యాలో చక్కగా నేర్వండి ఉయ్యాలో
చదువులాచే మీకు ఉయ్యాలో సద్గుణంబులు గలుగు ఉయ్యాలో –[1]

–ఈ పాటలో తాను చక్కదానవని విఱ్ఱవీగుట తగదని, చక్కదనము దాచుకొని తిరుగవలెనని, పేదరికమునుజూచి ఈసడింప కూడదని, మాట జారగూడదని భక్తి, ఓర్పు, కులాభిమానము, వంశాభిమానము ముఖ్యముగా దేశాభిమానము – ఇవియే సొమ్ములని, ఈ సొమ్ములపాటి ఏ సొమ్ములు కావని కౌసల్య చెప్పుట తన అంతస్థుకు తగినట్లు ఉన్నది. వెనుకటి పాటలోని హితవునకును, ఈ పాటలోని హితవునకును కొంత తారతమ్యము కనిపించుచున్నది.

తమ పిల్లలను సారెలతో అత్తవారింటికి పంపు ఘట్టమును ఒక జానపద వనిత కన్నుల గట్టునట్లు చిత్రించినది.

"పన్నెండు గుఱ్ఱాల బగ్గి పోతాంది
బగ్గిలో మ్యానత్త బిడ్డ పోతాంది
బిడ్డతో బిందెడు నీళ్లు పోతున్నాయి
నీళ్లతో నీలంచు చీరె పోతాంది
చీరెతో విక్కల రైకెపోతాంది
రైకెతో రత్నాల పేరు పోతాంది
పేరుతో పెట్టెడు సొమ్ము పోతాంది
సొమ్ముతో సోమంద గరిగె–[2] పోతాంది
గరిగెలో గంధపుచెక్క పోతాంటి
చెక్కతో చారెడు బుక్క పోతాంది

1. తెలంగాణా పల్లెపాటలు – పుటలు – 35, 86.
2. గరగ బుడ్డి (గడియ బుడ్డి);

బుక్కతో బుడ్డెడు నూనె పోతాంది
నూనెతో నూరు సకినాలు-[1] పోతున్నాయి-[2]

- ఈ పాటలో అత్తవారింటికి పోవు పెళ్లికూతురు మనోవేదనతో బాటు విలాస వినోద వస్తువులను గూడ రచయిత్రి కవితామయముగా జెప్పినది. వస్తువుల నన్నింటిని బగ్గీలో పెట్టి కూర్చున్న వధువును చూచినవారు ఆమెను ఆమె పరిసరపు వస్తువులతో బాటు ఎట్లు ఊహింతురో ఆధునిక చిత్రకారునివలె ఈ రచయిత్రి చెప్పినది. నీళ్ల బిందె ప్రక్కనే ఉన్న నీలంచు చీరె. దానికి తగిన రైక, ప్రక్కనే కనిపించు రత్నాల పేరు-పేరుతో బాటు, సొమ్ములు పెట్టుటకు కావలసిన పెట్టె, పెట్టె ప్రక్కనే ఉన్న సోమంద గరిగె, గంధపు చెక్క, బుక్క-వంటి సుగంధ ద్రవ్యములు చెప్పుట సహజముగా నున్నది. కాని నూనె ప్రయాణము చేయునప్పుడు వెంబడి తీసికొని వెళ్లుట అశుభసూచకముగా భావింపబడును. మరి అది ఎందుకు పేర్కొన బడినదో! నూనె సాహచర్యముతో కవయిత్రికి చక్కిలములు జ్ఞాపకమునకు వచ్చినవి. ఇట్లు ఈ పాట నేటి అతి వాస్తవిక కవితవలె, ఆధునిక చిత్రమువలె పైకి కార్యకారణ భావము, సంబంధము, కనిపించక పోయినను అంతస్సూత్రముతో సంబద్ధమై రచయిత్రి ఊహాశక్తిని ప్రశంసింపజేయుచున్నది.

పెళ్లికూతురి తల్లి తన కుమార్తెను అప్పగించునప్పుడు వియ్యంపు వారితో చెప్పుమాటలు మిగుల కరుణ రసపూరితముగా నుండును. ఆమె వధువు చేతులను వియ్యపురాలిచేతులలో నుంచి ఇట్లు పాడును.

వదినరో మా బాల నిదెనప్పగింతు
సదయవై గయికొమ్మ సరగునారమ్మా
ఎన్నినోములు నోచి కన్నాము దీని
కన్నులలో బెంచుకున్నాము తల్లి
ఎంతోగారాబున నెత్తిబెంచితిని

1. చక్కిలములు.
2. తెలంగాణా పల్లెపాటలు-పుట-118.

గొంతెత్తి గట్టిగా కోపించియెరుగ
....
నీలవేణిరో దీని నీటముంచెదవో
పాలముంచెదవో నీ పాల వైచితిని
బిగ్గరగా బిల్వ బెదరి చూసేను,
దగ్గర రమ్మన్న తరతరలాడు
మాయ లెరుంగదు మర్మమెరుగాదు
పాయక నీనలుసు బ్రతికించుకొమ్మా,
నల్లనివి నీరు తెల్లనివే పాలు
కల్లగాదనియెంచు చల్లగా నేలు
తనకు మిక్కిలి నొప్పి తగిలియుండినను,
మనసు మర్మము చెప్పుకొన జాలదమ్మా
పనులేమి నేరదీ పసిబాల యబల
కనిన బిడ్డగా నేర్పి కావుమో యమ్మ

– ఇట్లే వధువును మామకు, బావలకు, మరదులకు, ఆడుబిడ్డలకు, దగ్గరి బంధువర్గమునకు అప్పగించుట జరుగును. చివరన వరునికి అప్పగించెదరు, నిజమాలోచించిన వధువు భావి జీవితములోని మంచి చెడులకు కారణమగు ప్రధానవ్యక్తి వరుడే కావున అతనికి ముందప్పగించుట ఉచితము. అయినను అతనికి ముందు అప్పగించక పోవుటలో అవిభక్త కుటుంబములలో వరుని కన్న ముందు పెద్దలను గౌరవించుట, బంధువర్గమును సంతృప్తులను చేసిన తమ కూతురునకు సుఖముండునని భావించుట–వంటి వినయ సూచకమైన, ఆలోచనాత్మకమైన విషయములతో కూడిన ఆచారము వ్యక్తమగును.

శర్మిష్ఠను యయాతి మహారాజున కప్పగించు దృశ్యము యయాతి చరిత్రలో వర్ణింప బడినది. –[1]

తల్లి కూతురునకు అత్తింటికి పంపువరకును నీతులు బోధించుచునే యుండును. తల్లికి మారుగా ఇతరులెవరైనను పాట పాడవచ్చును.

1. యయాతి చరిత్రము–పొన్నకంటి తెలగన్న. ఆ.4. ప.146–148.

"అత్త ఇంటికి బోయి వత్తువాయమ్మా
చిత్తమందున భీతి జెందాకుమమ్మా
పోయిరావోయమ్మ బుద్ధితో నుండి
మా యందరికి మంచి మర్యాదతెమ్మ
అత్తమామల మాట కడుగు దాటకుము,
చిత్తము మెప్పించి చెలగుమీ తల్లి
బావలు మరుదులు బంధుజనంబు
లెవ్వారి యెడమాట లేమిరానీకు
పతిని దైవముగా భక్తితోనమ్మి
మతిమంతురాలివై మనుము మాయమ్మ
పోయిరా ముద్దుల ముల్లె షూ తల్లి
పోయిరావే చిలుక మురిపెంపు మొలక

– ఈ బుద్ధులలో ఎంత సహజత్వమున్నదో సహృదయులు గమనించగలరు. ఈ బుద్ధులు చెప్పుటలో తమకూతురు మంచిపేరును సంపాదించుకొనవలెనను తల్లి ఆరాటము వ్యక్తమగును. పుత్రికావియోగమును తలంచుకొనిన తల్లి మనసు వికలమై పోవును. అప్పుడు

"ఎన్నడు నిను విడిచి యెడబాయ నయితి
కన్నతల్లిరో నేడు కడతేరుటెట్లు
బొమ్మరిండ్లను గట్టి పొలతులను పిలచి
అమ్మరో యెవరింక నాటలాడుదురు
పేర్పేర బొమ్మల పెండ్లిండ్లు జేసి
వేరెవరింక వియ్యమందెదరు
చిట్టిచిట్టి నోముల చేడియలతోగూడి
యిట నెవ్వరికను మాయింట నోమెదరు
నిండు తనయుల గూడి నిండు వేడుకను
ఉయ్యాల లెవ్వారలూగుదురింక"

– అని తన కుమార్తె చిన్ననాటి ఆటలన్నియు జ్ఞప్తికి తెచ్చుకొని పరితాపపడును. చిట్టచివర తాను దుఃఖ పడుచునే తన కుమార్తెను దుఃఖ పడవద్దని సమాధాన పరచుచు–

"ననుగన్న యమ్మ నానాణెపు సొమ్మ
చిన్నమాణిక్యము చింతించకమ్మా
కన్నీరు దుడుచుకో కనకంపు బొమ్మా
జంటగా పతితోడ జని సుఖించమ్మా"–[1]

– అని దీవించుచు సాగనంపుటకుద్యుక్తురాలగును.

అత్తగారింటికి సాగనంపునప్పుడు కూతురుకు నూతన వస్త్రములనిచ్చి ఒడిబియ్యము పోసి సారెపెట్టి చద్దిగట్టి పంపుదురు. చద్దిలో పెరుగన్నముతో బాటు అల్లము ముక్కనుంచెదరు. అత్తింటికి వెళ్లిన పిదప చద్ది అన్నమును వధూవరులు భుజించవలెను. అల్లము ముక్కను పెరటిలో నాటవలెను. అది మొలకెత్తి చెట్టగుట శుభసూచకము. వధువు తెచ్చిన సారెలోని కొబ్బెర, పసుపు, కుంకుమ, పచ్చపిండిని గ్రామములోని గృహస్తులకు పంచుదురు. వీటితోబాటు కొన్ని కుటుంబములతో చకినముల వంటి పిండిపదార్థములను గూడ పంచుదురు. వధువు తరువాతి జీవితమున మూడు లేదా ఐదు సంవత్సరముల కొకమారు పుట్టినింటినుండి ఒడిబియ్యమును పోసికొని సారె తీసికొని వచ్చుట ఆచారము. ఇది ఆమె ఐదవ తనమును వృద్ధి చేయునను విశ్వాసము ప్రజలలో కలదు. అత్తింటికి వెళ్లుటకు ముందు వధువు పుట్టింటి వైపు వారి దగ్గర అనుమతిని తీసికొనుచు, కూరాడులోను, ఉప్పుచిప్పలోను చేతిని ముంచి తల్లి కడుపునకు అదె చేతినానించి తల్లిదగ్గర వీడ్కోలు తీసికొనును. వరుసగా మూడు గడపలను కడిగి పసుపు కుంకుమలతో అలంకరించి పుట్టింటివారిని వదలివెళ్లు దుఃఖమును దిగమ్రింగుకొనుచు వరునితోబాటు బండి ఎక్కును. అప్పుడు పేరంటాండ్రు ఈ పాటను పాడుదురు–

"పున్నామ ఎన్నాడు మముగన్న తల్లి,
పూదింతు నీచేత పుష్పాగందాన॥
అమాస ఎన్నాడు మముగన్న తల్లి
అలికింతు నీచేత అష్టగందాన॥
కలికుండల చెయ్యి ఏసి, కడుప బూదించి,

1. స్త్రీల పాటలు. యస్. వి. గోపాల్ అండ్ కో. పుట–149. 150.

కాతానీ–[1] పుట్టినిల్లు కడుప బైలెల్లు॥
కాసుతోటదాక కన్న తండ్రీ వచ్చే,
కాతానీ కన్నతండ్రిని పొమ్మన రాదా॥
కందిచేనుదాక కన్నతల్లి వచ్చె,
కాతా నీకన్న తల్లిని పొమ్మసరాదా॥
ఆకుతోటదాక అన్నలొచ్చీరీ.
అతివ నీ అన్నలను పొమ్మసరాదా॥
చెరుకు తోటదాక చెల్లెండ్లొచ్చిరి
చెలియ నీ చెల్లెండ్లను పొమ్మనరాదా॥–[2]

పిదప వధూవరులును ఊరేగింపు తీసి ఊరి పొలిమేరలు దాటువరకు సన్నిహిత బంధువర్గము వారివెంబడి వెళ్లి బాజాభజంత్రీలతో సాగనంపి తిరిగి వచ్చెదరు. వధువుతోబాటు, ఆమెవైపు సన్నిహిత బంధువర్గము కూడ ప్రయాణమగుదురు.

నూతన వధూవరులను, వధువుతో వచ్చిన ఆమె బంధువులును ఊరిలో ప్రవేశించుటకు ముందు మఱ్ఱిచెట్టు వంటి చెట్టునీడన విశ్రమించుదురు. పెండ్లికి ముందు మగపెండ్లివారిని ఆడు పెండ్లివారు సత్కరించినట్లుగానే ఇప్పుడును "ఎదురుకోళ్లు" సత్కారములు జరుగును. ఎదురుకోళ్ల అనంతరము పల్లకీలోనో, బండిలోనో ఊరేగింపు తీసి వధూవరుల పైనుండి దిష్టితీసివేసి, వధువు చేత కుడి పాదము ముందుంచి అత్తింటిలో అడుగు పెట్టింతురు.

మరునాడు సత్యనారాయణ వ్రతమును జరుపుట, ఒడిబియ్యము వండుట, గ్రామదేవతలకు నైవేద్యములతో కూడిన సాకలు పెట్టుట, సారెపంచుట వంటి కార్యక్రమములు జరుగును. తరువాత పాటలతో కూడిన ప్రధాన ఘట్టము శోభనము.

శోభనము:– శోభనమునే గర్భాధాన సంస్కారమందురు. వివాహోద్దేశము సత్సంతానప్రాప్తి, కనుక వధూవరుల పునస్సమాగమము శుభముహూర్తమున

1. కాంతా.
2. నేను సేకరించినది. పాడినవారు; అరుణమ్మ, మిర్యాలగూడ.

జరిగిన యెడల కోరిన సత్సంతానము కలుగునని మన పూర్వుల విశ్వాసము. సంతానప్రాప్తి శుభ కార్యము గనుక శోభనమని దీనికి పేరు వచ్చియుండును. కొన్ని ప్రాంతములలో దీనిని "ప్రస్తుతము" అందురు. ఈ ప్రస్తుతమను మాట సామాన్య వ్యవహారమున "ప్రస్థము" అయినది. మరికొన్ని ప్రాంతములలో దీనికి "కార్యము" అను వ్యవహారము కలదు. ఇది ఒక సమాసమునుండి విడిపోయిన ఉత్తర పదమని భావింతును. అనగా ప్రస్తుతకార్యము లేక శోభన కార్యము అను సమాసములోని పూర్వ పదము వ్యవహారపు తొందరలో భ్రష్టము కాగా ఉత్తర పదము మాత్రము మిగిలి కార్యము అను వ్యవహారము కలిగి యుండును. అట్లే యుత్తర పదము విడిపోయి శోభనము, ప్రస్తుతము అను వ్యవహారములు కలిగియుండును.

ఈ శోభన కార్యమును ఒక తరము క్రిందట పెండ్లివలె వైభవముగా జరిపెడివారు. చిన్ననాడే వివాహములు జరుగుచుండుట వలన వధువు పుష్పవతియై మరల భర్తతో కలియును గనుక దీనికి "పునస్సంధానము" అని వైదిక వ్యవహారము. దీనికి గర్భాధానమనుటయు వైదిక వ్యవహారము. గర్భాధానమనగా గర్భధారణము. గర్భాధాన సంస్కారము సత్సంతాన ప్రాప్తికై పూర్వులు యజ్ఞముగా భావించిరి గనుక కర్మకాండను నిర్వహించి గొప్ప యుత్సవముగా జరిపెడివారు. వాస్తవమున ఇది వధూవరులకు తృతీయ పురుషార్థమున శిక్షణ యిచ్చుట వంటిది. గర్భాధాన మంత్రములను పరిశీలించిన ఇది తేట తెల్ల మగును.

కొన్ని కులములలో పెండ్లి సందర్భములోనే వధువింటనో, వరుని యింటనో శోభనము జరుపుదురు. సామాన్యముగా పెండ్లిలో వధువు అత్తింటికి వచ్చిన పిదప జరుపబడును.

శోభనము గదిని అలంకరించి పండ్లు, పాలు, కొబ్బెర, బెల్లము, మున్నగు పదార్థముల నుంచెదరు. ఈ సందర్భమున "బొమ్మనందించుట" యను వేడుక కూడ కలదు. అప్పుడు ఈ క్రింది సంవాద రూపముననుండు పాటలను వధూవరులు పాడుచున్నట్లుగా పేరంటాండ్రు తామే పాడుదురు.

భార్య:- శ్రీకరధరణీశ శోభిత, వోరాజ! శిశువును పట్టండి

భర్త:- చేకొని రాజకచేరుకె పోవాలె నీవద్దనే వుండనీ

భార్య:- పాలుపోయగ పొద్దు బాయె చిన్ని గోపాలుని పట్టండి

భర్త:- నీలవేణిలో రాజ్యమేలగ పోవాలే నీపద్దనే వుండనీ

భార్య:- మెత్తని అభిలాషపొత్తులు బరువాలె పుత్రున్ని బట్టండి

భర్త:- వెయ్యారు పనులు నాకియ్యాళ గలవింక నీ వద్దనే ఉండనీ" –[1]

– అని పాడుచు చెక్క బొమ్మను వారి చేతికిచ్చి వారిలో సంతానాపేక్షను కలిగించి, సమాగమమునకు పురికొల్పుచు పడుచు కోరికలను రేకెత్తించెదరు. మన్నారు దాస విలాస ప్రబంధమున ఈ వేడుక వర్ణించబడినది.–2 భార్యాభర్తల మధ్యన బొమ్మను ఒకరితోనొకరికి ఇప్పించుటయే గాక వధువు చేత అచ్చటనున్న ముఖ్య బంధువర్గమందఱి చేతులలోను పెట్టించెదరు. బొమ్మను వధువు కూతురుగా భావించి బంధువులు తమ యిష్టానుసారము డబ్బును కానుకగా పళ్లెరములో నుంచెదరు. ఈ బొమ్మ వివాహ సమయమున లగ్నమండపములో మధ్య భాగమున పందిరికి ఉయ్యాలగా బట్టకట్టి అందుంచబడును. వివాహానంతరము సారెతోబాటు ఈ బొమ్మను కూడ నుంచి వధువు వెంబడి పంపుదురు. ఈ బొమ్మ నందించు వేడుక కొన్ని కుటుంబములలో అప్పగింతల సమయముననే జరుపబడును.

శోభన సమయమున ముత్తైదువలు హారతులిచ్చుచు హాస్యము చేయుచు పాటలు పాడుదురు.

ముత్యాల హారతులు ముదితలు మీరివరమ్మ
ముద్దుల రంగయ్యకు ముదిత శ్రీరంగ నాయకీకి శోభనమే ।శో।

---

1. పల్లెపదాలలో ప్రజాజీవనము–చతుర్థ ప్రకరణము.
2. మన్నారు దాస విలాస ప్రబంధము–ఆ. 5 ప. 70.

పగడాల హారతులు పణతులు మీరివరమ్మా
పలికొండరంగయ్యకూ పణతి శ్రీరంగనాయకికీ ।శో।

వజ్రాల హారతులు వనితలు మీరివరమ్మా
వైభోగ రంగనికీ వనిత శ్రీరంగ నాయకీకి ।శో।
మాణిక్య హారతులూ మగువలు మీరివరమ్మా
మా కావేటి రంగయ్యకు మగువ శ్రీరంగనాయకీకి ।శో।
నీలాల హారతులూ నెలతలు మీరివరమ్మా
నెల్లూరి రంగయ్యకు నెలత శ్రీరంగ నాయకీకి ।శో।–[1]

– ఇటువంటి పాటలతో మంగళ హారతుల నిచ్చెదరు.

శోభనమునకే గృహ ప్రవేశమనియు కొన్ని ప్రాంతములలో వ్యవహారము కలదు. పెండ్లికుమారుడు నవ వధువును తమ యింటికి పిలచుకొని వచ్చీ రాత్రులు గడుపుటను గృహప్రవేశమందురు. చాల పూర్వకాలమున బాల్యమునందు కాక వయస్సు వచ్చిన పిదపనే పెండ్లియగు చుండెడు గనుక వరుడు వధువుతో కూడి తన యింట ప్రవేశించిననాడే శోభనము జరుగుట వలన ఈ పేరు వచ్చియుండును.

"కోటివేల దివిటీలు కొమరొప్ప వెలుగ
కొమరుడి గృహ ప్రవేశంబులాయె
వేవేల దివిటీలు వేడుకతో వెలుగ
రాముడీ గృహ ప్రవేశంబులాయె"–[2]

ఈ శోభన కార్యము స్త్రీలకు మిగుల ఆసక్తికరముగ నుండెడిది. ముసిముసి నవ్వులతో సిగ్గును అభినయించుచు ముసలి ముత్తైదువలు మొదలు ముద్దు కొమరితల వరకు శోభనపుగది చుట్టు మూగుట ఫల తాంబూలములను స్వీకరించుట, శోభనపు గదిని సింగారించుట, వధూవరుల ఆరోగ్యమును పాటించిప్రత్యేకమైన భక్ష్యభోజ్యములను సిద్ధపరచుట– ఇవన్నియు చాల ముచ్చట

1. సేలయేరు – పుట – 44.
2. మున్నీరు – పుట – 19.

గొలుపును. ఇవి ప్రేమ సౌహార్ద సూచకములు, సుఖ దుఃఖ పర్యవేక్షకములే కాని అసభ్యములేమాత్రమును కావు.

శోభనము నాటి రాత్రి వరుడు బంగారపు వస్తువునేదైనను వధువు కొంగులో ముడివేయును.

"హెచ్చుమెడనున్న పచ్చల హారములిచ్చేనే

....

చేతి ముద్దుటుంగరమున్నయమున దీసి"

ఇచ్చేనే అనుట ఇట్టి ఆచారమును వ్యక్తమొనరించుచున్నది. ఈ బంగారు వస్తువును ఆభరణ రూపమున వధువునకు ధరింపజేయ వచ్చును. అయినను కొంగుముడిలో బంధించుటకొక ప్రత్యేకత కలదు. అతడిచ్చిన కానుక ఎటువంటి దయి యుండునా అని పేరంటాండ్రు వధువును పరిశీలనగా శోధించనవసరము లేకుండ కొంగుముడిని చూచిన తెలసి పోవును. బంగారము రంగు, విలువ తగ్గని లోహము. వారి అనురాగము శాశ్వతముగను, స్థిరముగను ఉండుటకు ఉపలక్షకముగా బంగారము కొంగున కట్టుట ఆచారమై యుండునని భావింతును.

మూడు రాత్రులు గడచిన తరువాత వధూవరులు తిరిగి వధువింటికి వెళ్లెదరు. దీనిని "మనుగడుపు" లందురు. అచ్చటి నుండి వరుడు ఒక్కడే తన యింటికి వెళ్లిపోవును. తరువాత మంచి దినమును చూచి వధువును తీసికొని వెళ్లుదురు.

పెండ్లి అయిన పిదప పదునారవ దినమున "పదారునాళ్ల పండుగ" "పదహోర్ల పండుగ" జరుపబడును. పదారునాళ్ల పండుగ నాడు "అట్లు" పోసి "పానకము" చేసి పెండ్లి పందిరిలోని ప్రధానమైన తల్లిగుంజకు, పిల్లగుంజకు నైవేద్యముపెట్టి పెండ్లి పందిరిని కదలింతురు. దానితో పెండ్లి పూర్తి అయినట్లు లెక్క. పెండ్లికి వచ్చిన బంధువులకు కట్నములు పెట్టి సాగనంపుదురు. నేటి కాలమువారు ఈ వేడుకను జరుపుటలోని వేగమును వేరుగా చెప్పనవసరము లేదు.

వివాహము జరిగిన మొదటి సంవత్సరమున ఆషాడ మాసమున అత్తింటివారు "ఆషాఢ పట్టి" గా వధువునకు నూతన వస్త్రములు, పిండివంటలను తీసికొని వచ్చెదరు. ఆషాఢ మాసమున అత్తకోడండ్రు ఒక్క గడప త్రొక్కకూడదను నియమము ననుసరించి నూతన వధువును అత్తింటికి తీసికొని వెళ్లరు. అట్లే వధువు వైపువారు వరునకు ఆషాఢ పట్టి తీసికొని వెళ్లుదురు. శ్రావణ మాసము ప్రవేశించినంతనే "శ్రావణ పట్టి" నూతన వధువునకు తీసికొని వెళ్లి వధువును అత్తింటికి తీసికొని వచ్చెదరు. అప్పటినుండి పుట్టింటికి, మెట్టినింటికి వధువు ప్రయాణములు ప్రారంభమగును. నేటి కాలమున వివాహములు కార్తీక మాసమున జరిగినను, మరేనెలలో జరిగినను ఆషాఢ, శ్రావణ పట్టీలు ఆయా మాసములు వచ్చునంతవరకు ఆగక వాటి పేర్లతో వివాహములోనె రాకపోకలు జరుపుదురు. ఇట్టి వేడుకల సందర్భమున సామాన్యముగా మంగళహారతి పాటలనే పాడుదురు.

మంగళహారతులు:– పెండ్లివంటి శుభకార్యములోనే గాక నామకరణాది శుభకార్యములన్నింటి చివర మంగళహారతులు పాడుట ఆచారము. ఈ పాటలు మూడు విధములు 1. దేవతా సంబంధమైనవి. వీనిలో కేవలము దేవతాస్తోత్రములే గాక వారిని వరములు వేడుటయును నుండును. 2. మానవ సంబంధమైనవి– వీనిలో ఆయా శుభకార్యములలో ప్రాధాన్యముగల వ్యక్తులను సంబోధించుచు పాడునవి. 3. ఆయా వరుసల వారిని హాస్యము చేయుచు పాడునవి

హారతులివ్వరే నారీమణులార
వారిజాక్షులు మాతల్లి ఆండాలుకు ॥హా॥
పచ్చాలు దాపిన బంగారు పళ్లెములో
ముచ్చటాలు దీర మచ్చెకంటులార ॥హా॥
తల్లి తాయారుకు శ్రీదేవి భూదేవి
ఎల్లకోరికలిచ్చు కర్పూరాండాళుకు ॥హా॥
తల్లి చంద్రమతీ ద్రౌపది మానసతీ
తలపు కోరికలిచ్చు తల్లి యాండాళుకు ॥హా॥
కోరిన వారికి కొంగు బంగారమయి
కోరికలిచ్చేటి తల్లి యాండాళుకు ॥హా॥

1. సెలయేరు – పుట – 30,

– ఇందు దేవతారాధన కలదు. దేవతారాధనమున కుంభహారతి, పచ్చల హారతి, కర్పూర హారతి, పెక్కుదీపములతో నక్షత్రహారతిని యిచ్చెదరు. –[1] ఆయాదేవతలను సంబోధించుచు–

"హరి సిరులకు జయహారతులివ్వరే,
అంబ అంబరవేణి అంబ కంబుకంఠి"–[2]
"మంగాళామా నీకు మంగళామమ్మ శ్రీ
రంగా నాధునీకోమ్మా రక్షించావమ్మా",
"రామ చంద్రాయజనక రాజజా మనోహరాయ
మామకాభీష్ట దాయ మహిత మంగళం"–[3]

– అని పాడునట్టివి– అనేకములు. –[4]

"హారతి గైకొనుమా, శ్రీరామ చంద్ర
కర్పూర హారతి కరుణతో గైకొనూ"
....
"మంగళంబనరే రగు (ఘు) పుంగవునికిపుడూ
చెలంగుచు పాడరే, చక్కని స్వామికి చెలగము తోడుతను"
....
"తల్లిగారింటినుంచి ఏమి తెచ్చినవు గంగ
చెప్పవలెను మాదోటి సిగ్గు పడకా
...."

"అన్నిటిలో ఘనమైనది పెండ్లి నీవేమెచ్చిన కార్యములు శుభకార్యములు పన్నుగ నరుదెంచుము పావనుడా, ఈ శుభదిన పెండ్లికి"–[5]

మానవసంబంధమైన హారతి పాటలలో వారి వేషభూషణ వర్ణనములతో బాటు వారి భవిష్యత్తును కోరుటయు గలదు.

1. సెలయేరు–పుట–31; 2. సెలయేరు–పుటలు–32,33
3. మిన్నేరు–పుటలు–150, 153.
4. మిన్నేరు–పుటలు–154, 158; స్త్రీలపాటలు, ఎన్.వి. గోపాల్ అండ్ కో పుటలు–24–27
5. నేను సేకరించినవి. పాడినవారు;లలితాబాయి, సుల్తాను బజారు, హైద్రాబాదు.

నీలి చీరలుకట్టి, నీలిరైకలు దొడగి
నిలువెల్ల బంగారు సొమ్ముబెట్టిన
నీకిదే జయమంగళం నిత్యశుభమంగళం
నీలగిరి రాజుకు ఒక్కటే ముత్యాము
నిల్చిపాడరమ్మ నీలవేణికీ ॥జయ॥
వెండి పళ్లేరములోన, వెలలేసి ముత్యాలు
పొందుగ నీలాలు కలియ బోసి
మెండైన హారములు మెడనిండ ధరియించి
దండిగ నీకిత్తు దవళాహారాతి ॥జయ॥ –[1]

– ఈ పై పాటలో దేవతా సంబంధమేమియును లేక ఏనీలవేణికైనను అనగా ఏ పెండ్లి కూతురునకైనను హారతి యిచ్చునట్లుగా నున్నది.

శుభ జయామంగళం దంపతులు ఇరువురూ
సభలో నేడుండగను శోభాన మంగళం మంగళమే,
క్షితిలోన సతతమును ఉత్తములై వెలగుటకును
నూతన దంపతు లిరువురు శక్తులై ముక్తులై నెగడగను ॥శుభ॥
వరుడు శ్రీరాములు వధువు సీతాదేవికిని
అలను మేలనముతో వెలయు సొలము మంగళమే
పెండ్లి అని ఆనందముతో జరపిన
జనని జనకులకును సతతము మంగళం మంగళమే
సరిగమా రిగమా పా సారివిగా నిరువురీని
ధరణీ సంసారములో తీరుగ ధీరులై నెగడగను" –[2]

– ఈ పాట అట్లు కొనసాగును. దీనిలో వధూవరులకును, వారి జననీ జనకులకును, ఇతరులకును గూడ మంగళము కోరబడినది. ఇందు వధూవరులు సీతారాములుగా పేర్కొనబడినారు. సీతారాములకు మారుగా వధూవరుల నామములను గూడ చేర్చి పాడెదరు.

---

1. నేను సేకరించినవి. పాడినవారు; పద్మజ, మలక్‌పేట్, హైద్రాబాదు.
2. నేను సేకరించినది. పాడినవారు; లక్ష్మమ్మ, మలక్‌పేట, హైద్రాబాదు.

హాస్య సంబంధమైన పాటలలో హాస్యము హద్దుమీరి యుండును. ఇట్టి పాటలు పాడుచు పరస్పరము హాస్యముతో ఛలోక్తులు విసరుచు హారతులిత్తురు. నాగరికత తక్కువయున్న ఇండ్లలో ఈ క్రింది పాటలు వినిపించును:-

గౌరీ కల్యాణ వైభోగమే
లక్ష్మీ కల్యాణ సౌభాగ్యమే
పెళ్లి పెళ్లన్నాడు పెరుగూతున్నాడే
కన్నమ్మ బాస్కాలు కదలమాన్నాడే ||గౌరి||
వోలేది వొంకేది వోపెళ్లీకొడకా
వొడికట్టు బియ్యమేవి హెూపెళ్లి కొడకా ||గౌరి||
మా బాబు గడ్డాము బవిరి గడ్డము
యీనుండె పేలుండే ఈత ముల్లుండె ||గౌరి||
అవిరేణి కుండలకి అంచులే లేవూ
పెళ్లికొడుకు అబ్బాయికి పెదవులే లేవు ||గౌరి|| -1

- పై పాటలో ప్రధానముగా పెండ్లి కొడుకును వెక్కిరించుటయే కలదు.

జయాజయ మంగళం, నిత్య శుభమంగళం
ఈవూరిది ఒగ(ఒక్క) కుక్క, ఆ వూరిది ఒక కుక్క
పొరుగూరిది ఒక కుక్క పోతుకుక్క
అండ్లనే (అందులోనే) ఒక కుక్క అంది అంది కరువంగా
అడ్లనే మా బావ రేసుకుక్కా ||జయ||
దుడ్డు మేము ఒల్లము, దుగ్గాని ఒల్లము
ఆకు పోక మేము ఒల్లమమ్మ
హారతులు ఇచ్చేవారక్క చెల్లెండ్లు
అక్కా చెల్లెండ్లకు ఆవుల్యాగనిచ్చి అంపవయ్యా ||జయా||-2

- ఈ పాటలో వధూవరులను కుక్కలతో పోల్చినారు. హారతి పట్టిన ఆడబిడ్డలకు కానుక లిచ్చుట ఆచారము.

1. పల్లెపదాలు-పుట-124.
2. నేను సేకరించినది; పాడినవారు; రాసులొల్ల బుగ్గమ్మ-రాయిప్రోలు.

"ఇల్లు కట్టి చూడు పెండ్లి చేసి చూడు" అనునది సామెత, అనగా ఈ రెండింటీ యందును మన ఊహకు మించిన వ్యయమగునని భావము. పెండ్లి జరిగిన కొన్నాళ్లకే అప్పులవారు వచ్చి అప్పు చెల్లింపు మని పీడింతురు, ఇట్టి పరిస్థితిని పరిహసించుచు చెప్పిన మంగళ హారతి ఈ క్రింది పాట:-

ఇరిగింటి మంగళం, పొరిగింటి మంగళం
మా ఇంటి మంగళం మంచి మంగళం
అప్పులోడు వచ్చి మరి అప్పునె అడుగంగ
అపుడే మా వదిన పప్పునాకెనూ ॥జయా॥
పుట్టమీది కొమ్మ పూతరించిన కొమ్మ
నరకి వేసిన కొమ్మ నందికొమ్మా ॥జయా॥
అంట్లనే ఒగ(ఒక)కొమ్మ హారతులివ్వంగ
శ్రీరామ చంద్రులకు జయాజయ మంగళం నిత్యశుభమంగళం. -[1]

ఈ హాస్యపు హారతి పాటలు వదిన మరదండ్ల వరుసలో నున్నవారు వివాహాది శుభకార్యములందేగాక ఇతర వేళలయందును పాడెదరు.

కృష్ణశ్రీ అన్నట్లు "ప్రేమ, భక్తి అనే అందపు భావాల సమ్మేళనము వల్ల ఆవిర్భవించిన మంగళ గీతాలు ఏ ఇంటిలో పాడిన అక్కడికక్కడ చక్కగా అమరిపోతాయి. -[2]

వివాహ సమయమున పాడునట్టి స్త్రీలను చూడగా వారిలో సంగీత శాస్త్రముకన్నను శ్రావ్యతే ఎక్కువగా నుండునట్లు తోచును. డా॥ నాయని కృష్ణకుమారి గారు "పాట పాడునట్టి హక్కు స్వతహాగా స్త్రీలది. పురుషులు దానిని గుత్తగొని సాధన జేసిన ఆ మనోహరతరాదు. వారిలోని మొరటుతనము, తెంపరితనము వారి పాటలలో ప్రతిబింబించి గేయమునకు సహజగుణమైన సుకుమారతను నాశనము చేయును. -[3] అని చెప్పుట సంభావ్యముగా నున్నది.

1. నేను సేకరించినది; పాడినవారు; సాతాన రంగమ్మ, గడ్డం మల్లయ్యగూడెం.
2. మంగళగీతములు (వ్యా) కృష్ణశ్రీ, భారతి, మే, 1953
3. జానపద వాఙ్మయం (వ్యా) డా. నాయని కృష్ణకుమారి, సుజాత, ఆగష్టు, 1953.

చూలింత

వివాహానంతరము మహిళల జీవితమున ప్రధానమగు ఘట్టము మాతృత్వమునకు కారణమైన గర్భధారణము. ఇది స్త్రీ సామాన్యలక్షణమే అయినను అందోళనమునకును, ఆశ్చర్యమునకును ఆలవాలమైనట్టిది. మహిళ "తన గర్భములో నూతన ప్రాణమును ధరించుచున్నట్లు గ్రహించినప్పుడు ఆమె సంతోషము, కృతార్థత ఆశ్చర్యముతో మిళితము కావచ్చును. కాని గర్భధారణము ఆమెకు సహజమనియే ఆమె భావించును. స్త్రీకి గర్భధారణ, ప్రసవములు ఆమె స్వభావములోని అభిన్నాంశములు. –[1] గర్భిణీస్త్రీని చూలాలు, చూలింత అని వ్యవహరింతురు. చూలు అనగా గర్భము. చూలాలు, చూలింత అనగా గర్భమును ధరించినట్టిది.

గర్భధారణముతో మహిళలలో మార్పులు ప్రారంభమగును.

ముఖము వెలవెల బోవుట, చిక్కిపోవుట, నిద్రపైన ప్రీతి, అలసట చెందుట, చూచుకములు నల్లబడుట, కాళ్లువాచుట–మున్నగు మార్పులు వారిలో గోచరించు చుండును. ఈ మార్పులతో బాటు వారి మనసులోను వికారములు కలుగును. ఈ వికారములకు వారు భయపడకుండ నుండుటకు ముసలమ్మలు తమ పని పాటలలో గర్భిణీస్త్రీలకు వినపడునట్లు కూనిరాగములు తీయుచు పాడినపాటలే మరల మరల పాడు చుందురు.

ఒక్కేసి నెలలాయె	ఓరెల్లు పుట్టె రామరామ
రెండేసి నెలలాయె	రోసిల్లు పుట్టె రామరామ
మూడేసి నెలలాయె	ముద్దేర్పడే రామరామ
నాలుగేసి నెలలాయె	నగసందులాయె–2 రామరామ
ఐదేసి నెలలాయె	ఆవుసుల్లు పోసె–3 రామరామ
ఆరేసి నెలలాయె	అడ్డము తిరిగే పిండం రామరామ
ఏడేసి నెలలాయె	ఎగుసాడ బట్టె పిండం రామరామ

1. The way of all Women-E. Esther Harding.page.179
1. నవ్వుటకు వీలయ్యేను;
2. ఆయుస్సు.

ఎనిమిదేసి నెలలాయె మలిచాడె బాలుడు రామరామ
తొమ్మిదేసి నెలలాయె పడసిద్ధమాయె బాలుడు రామరామ–[1]

– ఈ పాటలో నెలలవారిగా గర్భిణి గర్భమున పిండములో కలుగు మార్పులు చెప్పబడినవి. ఇట్టి పాటలను వినుటవలన శరీరములో కలుగు మార్పులను గర్భిణులు సహజముగా నెంచి నూతనమైన అనుభవమునకు భయపడకుండుట జరుగును.

కొందరు స్త్రీలకు నెలతప్పినంతనే ఏది తినినను సహించక పోవుట వాంతులగుట వంటి వికారములు కలుగును. ఇట్టి సమయమున వారు మనసునకు నచ్చిన కొన్ని పదార్థములను మాత్రమే తినుటకిష్టపడుదురు. ఇట్టి స్థితిని "బయికలనియు, వేవిళ్లనియు" అందురు.

ఒక్కోమాసం నెలతన గర్భిణి–ఓనగాయగోరె–[2]
చెలియా–ఓనగాయగోరే
రెండోమాసం నెలతన గర్భిణి–రేగుబండ్లు గోరే
చెలియా–రేగుబండ్లు గోరే
మూడో మాసం నెలతన గర్భిణి–ములకపండ్లు గోరే–[3]
చెలియా ములక పండ్లు గోరే
అయిదో మాసం నెలతన గర్భిణి–అరటిపండ్లు గోరే
చెలియా అరటిపండ్లు గోరే
ఆరోమాసం నెలతన గర్భిణీ–ఆవుపాలు గోరే
చెలియా–ఆవు పాలు గోరే
ఎడో మాసం నెలతన గర్భిణి–యెన్నముద్ద గోరే
చెలియా–యెన్నముద్ద గోరే
ఎనిమిదో మాసం నెలతన గర్భిణి–ఎలగపండు గోరే
చెలియా–ఎలగపండు గోరే
తొమ్మిదవ మాసం నెలతన గర్భిణి–దోసపండ్లు గోరే
చెలియా–దోస పండు గోరే

1. నేను సేకరించినది; పాడినవారు కుర్మ చిన సత్తమ్మ, అజీజ్‌నగర్.
2. లేత చింతకాయ; 3. రామములుక.

పదియవ మాసం నెలతన గర్భిణి–పాపడు జన్మించే
చెలియా పాపడు జన్మించే.

– ఈ పాటలో ఒకటి మొదలు తొమ్మిది నెలల వరకును వరుసగా లేత చింతకాయ, రేగుపండ్లు, ములక పండ్లు, నారికేళము, అరటిపండ్లు, ఆవుపాలు, వెన్నముద్ద, దోసపండ్లు చెప్పినను యతిస్థానములు కుదిరించుటకు అట్లు చెప్పుటేగాని ఆయానెలలలో వాని ప్రత్యేకతేమియు లేదు. మొత్తము మీద పులుపు పదార్థములపై ఆసక్తి, మనసునకు నచ్చిన వంటలపై మక్కువ ఇట్టి పాటలలో అధికముగా నుండును. వారివారి స్థితిగతుల ననుసరించి కోరికలను తీర్చుకొనుట జరుగును.

కొందరు నిరుపేదలు తమ భార్యల వేవిళ్లను తీర్చలేని స్థితిలో నుందురు. అది గ్రహించిన మంచి ఇల్లాండ్రు ఏమియు వలదనియే చెప్పుచుందురు; తమ భర్తలను బాధింపదలపక. గాథాసప్తశతిలో ఒక పేద చూలాలి వేవిళ్ల గాథ దయనీయముగా వర్ణింపబడినది. "దరిద్రుని ఇల్లాలునకు వేవిళ్లు వచ్చాయి. వేవిళ్లలో ఎన్నో ఆశలు పుడుతాయి స్త్రీలకు. కాని భర్త దరిద్రుడు. ఏమి తెచ్చి పెట్ట గలడు? కనుక ఏమి కావాలి?– అని అడిగినప్పుడల్లా మంచినీళ్లు కావాలి–అనేదట ఆ యిల్లాలు పాపం." –[1]

కాంతలు గర్భిణులుగా నున్నప్పుడు పుట్టింటివారి ఆప్యాయతను అధికముగా వాంఛించెదరు. ఒక పడుచు పుట్టింటివారిని తలపోయుచు–

ఏగుళ్లు బడేది ఎరుగరు కాబోలు
వేరు వెలగ పళ్లు తేరు కాబోలు
కడుపుతో నున్నాది కానరు కాబోలు
కావడేసి నీళ్లు తేరు కాబోలు
చూలాలి కోరికలు తెలియరు కాబోలు
నొప్పులు బడేది ఎరుగరు కాబోలు

– అని వాపోయినది. ఈమె పుట్టింటివారి నుండి ఆశించుటయే కాని సమాధానముగా వారు ఎట్టి ఆసక్తిని చూపినట్లు లేరు.

---

1. గాథా సప్తశతిలో తెలుగు పదాలు–తిరుమల రామచంద్ర. పుట–111

వదిన మరదంద్ర వరుసలో పరిహాసములధికము. అందులోను గర్భిణులుగా నుండిన ఎకసక్కెముల కంతుండదు. ఈ క్రింది పాటలో-

వదిన:- గోధుమల్లు ఏరేటి ఓగోపిదేవి
నీవు యాకట్లాయి-1 ఎన్ని నెలలాయె

అని హాస్యముగా అడిగినది. అందుకు ఆడబిడ్డ

"ఒక రెండు ఒకమూడు ఐదు నెలలాయె
ఐదునెల్ల సందున ఏమి మనసాయె

- అని అడిగినది. వదిన గూడ పిల్లలను కన్న తల్లేగనుక ఆమె అనుభవములో ఐదవ నెలలో ఏమి మనసైన కోరికలు కలిగినవి ఎదురు ప్రశ్నించినది.

వదిన:- నాగువాముల నల్ల, ఎనెగండ్ల-2 పెరుగు"

- వదిన హాస్యముగా నాగుబాము పాలు వంటి అసంభవ విషయములను చెప్పగా మరదలు అంతకన్న తెలివిగా వెంటనే-

"అట్లయితే మాయమ్మ నడిగన్నవస్త" నని తల్లి దగ్గరికి వెళ్లి నిజము తెలుసు కొందమనుకొనినది. తల్లితో

"అమ్మరో మాయమ్మ మముగన్న తల్లి
మము గన్నవారు ఏమి మనసాయె" అని అడిగినది.

తల్లి బిడ్డతో

"ఉట్టిమిని-3 అంబల్లు, ఊరుగాయ తొక్కుల్లు
గుల్ల చింతపండు, మనసాయె నాడు

- అని నిజము పలికినది. సహజమైన కోరికలను తెలిసికొనినది ఆడుబిడ్డ. వదిన మరదంద్ర పరిహాసములలో సత్యముకన్న హాస్యమే అధికముగా నుండును. అదే పాటలో

---

1. వేకటి యొక్క భ్రష్టరూపము, గర్భము.
2. దున్నపోతు కావచ్చును. 3. మీది (పైని).

"సాతి వానలు గురిసె సన్నొడ్లు పండె
సాతీ-[1] కి సన్నొడ్ల-[2] సద్ది-[3] మనసాయె
మాగి వానలు గురిసె మనబాయి మీన
మగువాకు మన బాయి నీళ్లు మనసాయె-[4]

– అని కలదు. చూలింతలకు పులిహోర భోజనములు మనసగుట సహజము. వానకు తడిసిన మంటివాసన, వానకు క్రొత్తగా చేరిన బావినీరు రుచిని గొలుపును.

చూలింతలుగా నుండు స్త్రీలు వేవిళ్లు అధికమైన తిను ఆహారము సహించక చిక్కి శల్యమగుదురు. అట్టి స్థితిలో చూచువారు సులభముగా ఆమె గర్భిణి యని గ్రహించెదరు. ఎవ్వరికిని చెప్పక పోయినను నిజము దాగదు. రుక్మిణిని నాయికగా నెంచి "రుక్మిణీ దేవి వేవిళ్లు" అని వర్ణించినను, ఆవేవిళ్లు దరిద్ర ధనిక భేదము లేక అందరు అనుభవించెదరు. ముద్దు ముచ్చట్లను తీర్చుకొనుటలో మాత్రమే భేదముండును.

చిన్ని చక్కని ముద్దు చేడెయ్యకీ-గర్భ చిన్నెల్లు కనిపించెనూ
వేవిళ్లు తరుచాయె వాచవికి-పచ్చళ్లు తేరమ్మ యా కొమ్మకూ
గుట్టు తెలియదు గాని యెన్ని నాళ్లాయెనో-కొమ్మ కొన్నాళ్లకిపుడు
....
నెలతలందురు కూడి గుసగుసలాడగా-నెలలు రెండాయె సతికీ
మూడు లోకాలకూ మాటల్లు అందగా-మూడు నెలలాయె సతికీ
అందారు బంధువులు ఆనందమొందగా-అయిదు నెలలాయె సతికి
గౌరూను సరస్వతీ అరుంధతీ-గంగ మొదలయిన సతులు
రారమ్మ పోదాము అమ్మరో-రుక్మిణి రమణినీ చూడవలెను.

– రుక్మిణీదేవి యిక్కడి పాత్ర కనక పార్వతి, సరస్వతి మొదలగు పడతులు విచ్చేసినారు. మామూలు స్త్రీలకు పుట్టింటివారు, బంధువర్గము, స్నేహితురాండ్రు వచ్చెదరు. వచ్చువారు ఉత్తచేతులతో రాక నానా విధములగు పిండివంటలు, చద్దులు, పండ్లు, మిఠాయిలను తీసికొని వచ్చెదరు.

---

1. సతికి; 2. సన్నవడ్లు; 3. సద్దులనగా పులిహోర భోజనము.
4. శ్రీ ఎన్, గోపాల్ సేకరించి నాకిచ్చినది; పాడినవారు పెంటమ్మ, తిమ్మసానిపల్లి. (మహబూబ్‌నగర్)

"ఆ రాజముఖి(ని) నడుమ వుంచుకొని ఈవలా-ఆవలా కూర్చుందురూ,
కొందరూ బూరెలూ కొందరూ గారెలూ-కొందరు అట్లు మొదలూ
కొందరూ లడ్వాలు కొందరు మోరుండలు-1-కొందరు పరమాన్నమూ
వూరగాయలు చద్ది కొసరి వడ్డించగా-కోరు రుచులు గానుచునూ
కొసరి వడ్డించగా వూరుగాయలతోను-కొరికి రుచులూ చూచుచూ"

- కడుపార భుజించినది రుక్మిణి.

గర్భపు చిహ్నములు "రుక్మిణీ దేవి సీమంతము"లో చక్కగా చెప్పబడినవి.

"ఇంతికి గర్భపు చిన్నెలు వింతలుగా గైకొనెనూ
ఓకిలింతలు ఘనమాయెను శ్రీకాంతుని రాణికినీ
చేకొని గోడల మృత్తిక భక్షించుచుండె

- గోడల మృత్తికను తినుట చాలామంది గర్భిణీ స్త్రీలలో కానవచ్చును. సుదక్షిణా దేవి మట్టితిన్నట్లు రఘువంశకారుడు వర్ణించినాడు.-[2]

అన్నము యించుక తినదూ--ఆకలి పలుమారనదూ
పేట్టెడి దర్భైగైకొని నెలతరో ప్రొద్దులు బుచ్చూ
శుభకంఠము సన్నమాయెను శుభకోమలాంగికినపుడూ
స్వారపుఫలములు మీదనే కోరికలగ్గలమాయె
ఆవులింతలు ఘనమాయెను శ్రీకాన్తుని రాణికినీ
పణతీ పట్టె మంచముపై పలుమారూ పవళించూ
....
కుచముల చందము కులగిరులూ హేమకలశమ్ముల బోలూ
బింబము పాందుర వర్ణము బోలున్నది."-[3]

- ఈ పాటలో తిండి సహించక వేవిళ్లతో బాధపడు కాంతలు కనులకు కట్టినట్లు వర్ణింపబడినారు.

వేవిళ్ల ననుభవించు సమయమున కౌసల్యాదేవి గూడ సామాన్య కుటుంబిని వలెనే సామాన్యపు కోరికలను వెలిబుచ్చినది. అప్పుడు "పొందూగ పొగిచిన

1. పప్పు బెల్లముతో కూడిన లడ్డూలు.
2. రఘువంశము-సర్గ-3. స్త్రీల పౌరాణికపు పాటలు-పుట-150

పుల్లని చల్లా, నిమ్మరసముతోనూరు మామిడల్లంబూ, పుల్లా దానిమ్మ పండు ఖజ్జూరములను"–[1] పల్లవ పాణులు కొల్లలుగా తెచ్చి యిచ్చిరి.

సీతాదేవి వేవిళ్లు అను పాటలో సీతమ్మ గర్భము దాల్చినది. "నెలా రెన్నెళ్లూ" గడచినవి ఆమెకు

వేవిళ్లు ఘనమాయె లోపలుకులాయె
తలవాల్చి కుడిచేయి తలక్రిందనుంచి
పాన్పుమీద పవళించి పద్మాయతాక్షి
అన్నము ముట్టదూ ఆ రామ సీత
....
మధురాల మామిడి పండ్లయిన గోరు
....
చింతకొమ్మలమీద చిగురైన గోరు
దోర చింతలు గోరు యా పద్మ గంధి
ఈ రీతి కోరికలు కోరుచుండగను
ముగుదకు ముత్యాల పట్టెడే సడలె
నాతి నడుము వడ్డాణమే సడలె
పణతి చేతి బాజు బందులే సడలె"

– ఈ పరిస్థితిలో రాముడామె వద్దకు వచ్చెను. ఆ దశయేమిటో ఆతనికి అర్థము కాలేదు.

"ఎండలోనే యెండి వానలోనే తడసి
ఆనాడు యారీత వదిలుండలేదుట
పండుటాకు వలె వాలియున్నావు
పారుటాకుల వలె పవ్వలించావు

– అని ఆమెను అతడు కారణమడిగెను. ఆమె పలుకలేదు. ఉలుక లేదు. ఈ స్థితిని రాముడు లక్ష్మణున కెరగించి కారణమరసికొనవలెనని తలపోసెను. ఇంటిలోనున్న ఆడదిక్కు ఏమయినారో! అడవులలో తోడుగానున్న తమ్ముడే

1. స్త్రీల రామాయణపు పాటలు – పుట – 52.

అంతఃపురమునందును గుర్తునకు వచ్చినాడు. అన్న పిలుపువిని లక్ష్మణుడు వెంటనే

గాజుల మరించిన గడపలు దాటి
ముత్యాలమర్చినా ముంగిళ్లు దాటి
పగడాలమర్చినా పందిళ్లుదాటి
పచ్చల మరించిన రచ్చల్లు దాటి"

– రఘురాము కడకు వచ్చి అతనికి సాష్టాంగమెరగి అతని నుండి సీత పరిస్థితిని తెలిసికొని వాస్తవమరయుటకు వదిన మేడలకు వచ్చెను. సీతాదేవి మరదిని పిలచి ఆమె ఏమి చెప్పకున్నను సంగతి గ్రహించి "అమ్మమేము పోతాము అజ్ఞ యివ్వండి" అని సెలవు తీసికొని రాముని కడకు వచ్చెను. వచ్చి ఆమె గర్భిణి యని ప్రకారాంతరముగ నిట్లు చెప్పెను.

"మీకంటె ఘనులిక పుట్టనున్నారు
మీరేలు రాజ్యమ్ములేల నున్నారు
మీరెక్కిన సింహాసనం యెక్కనున్నారు
మీరు పట్టు ఆయుధం పట్టనున్నారు"

రాముడు ఆ మాటలువిని భార్య గర్భిణి యని తెలిసికొని పాలు పొంగినట్లు సంతోషముతో పొంగిపోయెను. అప్పుడతని కనులకు సీత ఇట్లు కనిపించినది.

"నక్షత్ర పర్వతము నడచి నట్లుండె
చుక్కలా పర్వతం చూచినట్లుండె"–[1]

– పై పాటలో గర్భిణీ స్త్రీల శరీరస్థితి, తొలిసారిగా గర్భిణి అయిన కాంతముగ్ధత్వము, తాము చెప్పకయే తమ హావభావములతో తమ పరిస్థితిని తెలుపు పద్ధతి స్త్రీల దృష్టతో వివరింపబడినవి.

"సీతమ్మవేవిళ్లు" పాటను పోలిన జానపద గేయము కన్నడ జానపద సాహిత్యములోను కలదు. సీతమ్మకు ఆరునెలలు నిండినవి. పుల్లని పదార్థములపై

1. స్త్రీల రామాయణపు పాటలు–పుటలు–254–256.

గర్భిణులకు కోరిక యుండుట సహజము గనుక ఆమెకు చింతకాయలపై మనసు పోయినది. ఆమె చింతకాయలను తెమ్మని రాముని కోరినది. రాముడామెను ఒంటరిగా విడిచి వెళ్లుటకు నిష్టపడలేదు. లక్ష్మణుని బిలిపించి

'నిన్న అత్తి గెయాదంత సీతమ్మనవరు
ఏళు తింగళ గరుబవతి
అవుళిగే ఏళే హుణిసేకాయి తందుకాడ బేకు
అదక్కాగి నానుహెూయ్తిద్దీని
మనేకడే జ్వాపానప్ప అంత
అగ్నెయన్ను మాడ్బుట్టు" –[1]

– మీ వదిన అయిన సీతమ్మగారు ఏడు నెలల గర్భవతి. ఏడే ఏడు చింతకాయలు ఆమెకు తెచ్చి యివ్వవలెను. అందుకు నేను వెళ్లుచున్నాను. ఇంటికడ నీవు భద్రముగా నుండుము అని ఆజ్ఞాపించి రాముడు వెండి రథముపై కూర్చుండి బయలుదేరి ఉద్యానవనము చేరెనట. ఉద్యానవనములో మల్లెలు, జాజులు కనిపించినవే గాని చింతకాయలు కనిపించలేదు. చింతకాయలను వెదకుచు ఉద్యానవనములో గడిపెనట,

కన్నడ జానపదులు కూడ పురాణ పాత్రలను తమ అభిరుచులకు అనుగుణముగా ఔచిత్యమును చూడకయే మలచుకొనిరనుటకు ఈ పాట తార్కాణము. బంగారు లేడి కనిపించినప్పుడు లక్ష్మణుని పర్ణశాలకు కావలి పెట్టినట్లే యిప్పుడుగూడ సీతానివాసమును భద్రముగా చూడుమని లక్ష్మణునకు నాజ్ఞ యిచ్చినాడు.

గర్భిణి లక్షణములను గంగాపురమాహాత్మ్యము,–[2], గర్భధారణమును సింహాసన ద్వాత్రింశిక–[3] కావ్యములు పేర్కొనినవి.

---

1. జనపద రామాయణ (కన్నడ) రా. గౌ. వి. కె. రాజశేఖర, బసవయ్య. పుట–55.
2. గంగాపుర మాహాత్మ్యము ఆ. 2. పద్యములు 48, 49.
3. సింహాసన ద్వాత్రింశిక – ఆ. 3; ప. 39.

గర్భిణి స్త్రీలకు విధి నిషేధములెన్నియో కలవు. నేరేడు పండుతినిన పుట్టబోవు పిల్లలకు నల్లని రంగు వచ్చుననియు, బొప్పాయి పండు తినిన గర్భము చెడుననియు, అరటిపండు తినిన పిల్లలకు మూర్ఛరోగము వచ్చుననియు, గ్రహణ సమయమున పనిచేసినను, గ్రహణమును చూచినను, గ్రహణ కాలమున నిద్రించినను వికలాంగులు పుట్టుదురనియు, శూన్య గృహమున అడుగిడిన గర్భస్రావము జరుగుననియు – మొదలగు విశ్వాసములు జానపద మహిళలలో వ్యాపించి యున్నవి. ఇవి మూఢ విశ్వాసములు కావచ్చును. దేశమంతటను ఇట్టి నిషేధములను ఏదోరూపమున గర్భిణులు పాటించుచునే యున్నారు. "గర్భిణి మిట్ట మధ్యాహ్నముగాని మునిమాపువేళ గాని ఒంటరిగా వెళ్లరాదు. వెళ్లిన భూతములు ఆవహించును. గర్భిణి నదిని గాని వంతెననుగాని దాటరాదు."–[1]

ఆహార పానీయములందును గర్భిణీ స్త్రీలు పాటింపలవసినవి ఆయా ప్రాంతములలో ఆచారముగా వచ్చుచున్నవి. మామిడిపండు, కుంకుమపువ్వు. గోరింటాకు తినిన యెడల పుట్టబోవు పిల్లలకు ఎఱ్ఱని రంగు వచ్చుననియు, పచ్చి గ్రుడ్డుత్రాగి అంతటి ప్రమాణముననే నేయి త్రాగిన పుట్టబోవు పిల్లల చర్మము నునుపుగనుండుననియు విశ్వసింతురు.

సీమంతము

గర్భమును ధరించినప్పుడు స్త్రీలకు ఏమియో చెప్పరాని భయసంకోచము లేర్పడును. వానిని తొలగించుటకును గర్భస్థ శిశువు సక్రమముగా అభివృద్ధి చెందుటకును వైద్యశాస్త్రమున కొన్ని ప్రక్రియలు చెప్పబడినవి. వానినే ధర్మ శాస్త్రకారులు ఆచార రూపమున విధించిరి. అట్టివానిలో పుంసవనము, సీమంతము ముఖ్యమైనవి. గాజులు తొడిగించుట, పూల ముడుపు, సూడిదలు తెచ్చుట వంటి వేడుకలు కూడ స్త్రీలతో ఆచారముగా పరిణమించినవి. సీమంత మును నాలుగవ, ఐదవ, ఆరవ, ఎనిమిదవ మాసములలోగాని చేయవచ్చునని ధర్మసింధు (వు) చెప్పుచున్నది. ఈ నెలలలో సీమంతము జరిపించుట సాధ్యము కానప్పుడు తొమ్మిదవ మాసమునందును చేయవచ్చుననియు ఒకవేళ సీమంత విధి లేకయే స్త్రీ ప్రసవించిన ప్రసవానంతరము పుత్రునితో కూడ నీ సంస్కారము

1. Folk Culture and Oral tradition - S.S. Srivatsava. pages - 68,69.

చేయవచ్చునని ధర్మసింధు చెప్పుచున్నది.–[1] వైదిక ధర్మమును పాటించు వారందరును ఈ సీమంతపు వేడుకను చేయుదురు. ఉత్తర భారతమున ఏడవ నెలలోగాని, ఎనిమిదవ నెలలోగాని చేయు ఇట్టి సంస్కారమును "అథవన్ పూజన్" అందురు.–[2] తెలుగు వారి సంప్రదాయము ననుసరించి ఐదవగాని, ఆరవగాని, ఎనిమిదవ మాసములోగాని సీమంతపు వేడుక జరిపించెదరు. సీమంతమును "పూవెన" అనుటయు కలదు.

ధర్మశాస్త్రముననుసరించి చేయు సీమంత శుభకర్మమున స్త్రీలకు ప్రాముఖ్యము తక్కువ. సీమంతమను పదమునకు పాపట అని అర్థము. భర్త ఒక శుభదినమున వేదోక్తమగు తంతువుతో గర్భిణి అయిన భార్యకు ఏదుపంది ముల్లుతో పాపట తీర్చును. గర్భములోని పిండమునకు స్త్రీ పురుషాకారము ఏర్పడు సమయమున ఈ విధి చేసినతప్పక శిశువునకు పురుషాకార మేర్పడునని ప్రాచీనుల విశ్వాసము. ఈ సీమంత సమయముననే "లక్ష్మణా" అను మూలిక రసమును గర్భిణి ముక్కులో పిండుదురు. ఈ మూలిక పిండమునకు ఆకారమేర్పడు దశలో పురుషాకారము తీర్చి దిద్దునని ఆయుర్వేదజ్ఞుల విశ్వాసము.–3 పుంసవన మను ప్రత్యేక సంస్కారము పురుష సంతతి యెడగల ప్రీతిని తెలుపుచున్నది.

సీమంత సంస్కారపు వైదికత్వమెట్లున్నను నేడు ఇది స్త్రీల వేడుకగానే జరుగుచున్నది. అన్ని పాటలలో వలెనే ఈ సీమంతపు పాటలలోను పౌరాణిక పాత్రలలో తమ అభీష్టమును నెరవేర్చుకొనుట కానవచ్చుచున్నది. "రుక్మిణీదేవి సీమంతము" అను పాటలో

---

1. "నవమే మాసి వాకుర్యాద్యావద్గర్భ విమోచనం
 స్త్రీయద్య కృత సీమంతా ప్రసూయేత కదాచన
 గృహీత పుత్రా విధివత్సాతం సంస్కార మర్హతి."– ధర్మసింధు

2. Folk Culture and Oral tradition - page -69.

3. చార్మినార్ (హైద్రాబాద్) ఆయుర్వేద వైద్యశాలలోని వైద్యపుంగవులు ఇట్టి మూలిక నొకదానితో ప్రయోగము చేయుట, ఆ ప్రయోగము విజయవంతమగుట జరిగినది. తెలియజేసిన వారు–డా॥ అనంతస్వామి.

మరి ఆరునెలలాయెనా – మన రుక్మిణి దేవికిని
చెలియకు సీమంతంబులు సేయగవలెనని”

– నిశ్చయించిరి. రుక్మిణీ దేవికి పుట్టింటివారి యిష్టప్రకారము జరిగిన వివాహము కాదు గనుక వేడుకలన్నియు అత్తింటిలోనే జరిగినవి. సామాన్యముగా మొదట గర్భిణి పుట్టింటి వారు సీమంతము చేయుటకు వియ్యంకుల యింటికి కట్నకానుకల తోను, సూడిదలతోను వత్తురు. సీమంత సంస్కారము పిదప గర్భిణి పుట్టింటికి వెళ్లును. అప్పుడు అత్తింటివారు సూడిదలతో గర్భిణి పుట్టింటికి వెళ్లెదరు. ఇట్లు పరస్పరము వేడుకల వినిమయము జరుగును.

రుక్మిణిని వివిధ భూషణాలంకృతను గావించి పట్టు వస్త్రములను ధరింప జేసి సవతులు

“వేడుకతో శృంగారమ్ములు జేసిరి శ్రీరుక్మిణీదేవికినీ
సీమన్తపు పీటలపై గూర్చుండా తమరున్నిరీ,
పండ్లు ఫలమ్ములు రుక్మిణి వడి నింపిరి”

సామాన్యముగా ముత్తైదువలు ఈ సమయమున ఐదు లేదా తొమ్మిది రకముల ఐదేసి పండ్ల తోను అదే సంఖ్యలో తీపి పదార్థములతోను ఒడినింపుదురు. ఆ ఒడినింపిన పండ్లను, పదార్థములను గర్భిణియే భుజించవలెనను నియమము కలదు.

“దివ్యాన్నమ్ములు, పెక్కు పిండి వంటలు.
పంచ భక్ష్య పరమాన్నములు”

– మొదలైన వంటకములతో వచ్చిన బంధువులకు దేవకీదేవి విందు భోజనము లేర్పాటు చేసెను. ఈ నాటి వంటలలో చిత్రాన్నములకు–ముఖ్యముగా పులిహోరన్నమునకు ప్రాధాన్యముండును.

వచ్చిన బంధువులు

“సీమంతము జూడగను కన్నుల కరువులు దీరే,
సంతోషంబులు మాకు సెలవులు యొసగవె యని”

– అడిగి దేవకీదేవి చెంత

"సెలవులు పుచ్చుకొని చెలులూ ఆనందము తోడుతనూ
అందరు గూడుక తమ తమ గృహములకే చనుదెంచ్రీ"–[1]

సన్నిహిత బంధువులు, ఇష్టులు, మిత్రులు కూడ గర్భిణీస్త్రీలకు సూడిదలు తెచ్చి యిచ్చుట ఆచారము.

సామాన్యముగా "సీమంత" సమయమున పాడు పాటలలో ఈ క్రింది పాట ఒకటి –

అగరు గంధం పునగు జవ్వాజి అత్తరు మెడపూయరే
కాజుఖర్జూర నారి కేళాలు కాంతకు ఒడినించరే ॥
అత్త కౌసల్యతెచ్చిన కొబ్బరి మిఠాయిలు ఒడినించరే ॥అగరు॥
మామ దశరధుడు తెచ్చిన మామిడిపండ్లు ఒడినించరే
వదిన శాంతమ్మ తెచ్చిన సకినాలు కాంతకు ఒడినించరే ॥కాజు॥
....
వందనమైన కొడుకును కనుమని కాంతకు ఒడినించరే ॥అగరు॥ –[2]

– ఇట్లే నానారకములైన పండ్లను, వంటలను పాడు వారు తమ ఓపికను బట్టి పేర్కొనుచు పాటను పొడిగించి పాడుదురు.

ధనిక వర్గముల యింటి స్త్రీలును, సుఖముగా జీవనయాత్ర గడిచిపోవు కుటుంబము లందలి స్త్రీలును, చూలింతలుగా కాని బాలెంతలుగా కాని యున్నప్పుడు ఎక్కువ పని చేయక విశ్రాంతితో నుందురు. వేగముతో కూడిన నడకను కూడ నడువక అతి జాగ్రత్తతో నుందురు.

"నాతిరొ స్త్రీలకు నెల్లా మెల్లగ నడువగవలెను
గర్భిణి స్త్రీలకు నెల్లా కదలక నడువగవలెనూ"–[3]

– ఇట్టి సూచనలు రెక్కాడనిదే డొక్కాడని కుటుంబములలోని స్త్రీలకు పనికిరావు. చెమటోడ్చి రోజంతయు కష్టించిననేగాని గడుపని వారుందురు. దంపుళ్ల పాటలలో వారు కావించు శ్రమ వర్ణింపబడినది

1. స్త్రీల పౌరాణికపు పాటలు–పుట–164.
2. నేను సేకరించినది. పాడినవారు; భారతమ్మ, రాయిప్రోలు.
3. స్త్రీల పౌరాణికపు పాటలు–పుట–159.

"పండేయి మాచేలు పల్లంపు భూమి
నూర్పించి తెచ్చేరు నూరు గరిసెల్లు
పండించి తెచ్చేరు పంటకాపుల్లు
ఎక్కలేని గట్లు, దిగలేని మెట్లు
చూలింత పోశారు చుక్కల్ల పొడుగు
బాలింత పోసేరు పర్వతాల పొడుగు
నూనెతో పులగాము మాయెడ్లు మేసె.

– ఎక్కలేని గట్లు ఎక్కి, దిగలేని మెట్లు దిగి పంటను ఇంటికి చేర్చుట సహజమే. కాని ఆ పంట గంపలను ఎత్తి మోసినవారు చూలింత, బాలెంతలనుట విశేషము. పల్లెప్రజలకు పంటను చూడగానే ప్రాణములు లేచివచ్చినట్లుగా నుండును. ఆ ఉత్సాహములో నూతనోత్తేజముతో చూలింతలు. బాలింతలు గంపలను మోసినారు. వివరణలో కొంత అతిశయమున్నను కాలు చేతులనాడించి కష్టపడి పనిచేసిన సుఖప్రసవమగునని ఆరోగ్య శాస్త్రవేత్తలు నుడువుదురు. –1

సీమంత పుంసవనాది సంస్కారములను ప్రబంధములు ఆయా సందర్భములలో పేర్కొనినవి. సీమంతమును విజయవిలాసము –2. పుంసవనమును జైమినీ భారతము –3. సారంగధర చరిత్ర –4 ప్రస్తావించినవి.

నవమాసములు నిండిన పిదప గర్భిణీ స్త్రీలు ప్రసవించుట సర్వసామాన్యము. నవమాసములు నిండుటను "నెలలు నిండుట, పొద్దులు పడుట" అందురు. అంతకుముందే పుట్టింటివారు గర్భిణీయైన తమ కుమార్తెను పురుడు పోయుటకు తమ యింటికి తీసికొని వెళ్లెదరు. దీనిని "కాన్పుకు తీసికొని వెళ్లుట" అందురు. తొలిచూలులో నెల తక్కువమోసిన ఆడుబిడ్డ పుట్టుననియు, నెల ఎక్కువ మోసిన మగబిడ్డ కలుగుననియు ప్రజాసామాన్య విశ్వాసము. కాన్పునకై పుట్టింటివారు తీసికొని వెళ్లు ఆచారము సర్వసామాన్యమైనను ఇరుగు పొరుగు

1. గర్భిణీహితచర్య–శ్రీవావిలికొలను సుబ్బారావు, ఒంటిమిట్ట,
2. విజయవిలాసము – చేమకూరవెంకటకవి – 2–37.
3. జైమినీ భారతము – పిల్లల మఱ్ఱి పినవీరభద్రుడు – ఆ. 6.
4. సారంగధర చరిత్ర (వచనము) – సముఖము వెంకటకృష్ణప్ప నాయకుడు.

అమ్మలక్కలు గర్భిణియందుగల ప్రేమతోనో, స్త్రీ సహజమగు ఉత్కంఠతోనో ఆమెను "పురుడెవ్వరు పోయుదురు" ఎప్పుడు పుట్టినింటికి వెళ్లుదువు? అని ప్రశ్నించుట పరిపాటి. పొరుగింటివారు అట్టి సమయమున

"కడుపుతో నున్నావు కమలాక్షినీవు
పురుడెవ్వరోసేరు ఓ పుణ్యశాలి"

అని ప్రశ్నించగా జవాబుగా ఒక గర్భిణీస్త్రీ

పురుడు పుట్టింటోరు చల్లాగనుంటే
నా పురుడు పున్నము వెన్నెలైకాచు. –[1]

– అని జవాబిచ్చినది.

గర్భిణీ స్త్రీలు మూడవ, ఏడవ కాన్పులకు తప్ప మిగతా కాన్పులకు పుట్టింటికే వెళ్లుట గ్రామములలో సామాన్యము.

బాలెంత

ప్రసవము పునర్జన్మ వంటిది. పూర్వము ఇప్పటివలె తగినంత వైద్య సౌకర్యము లేదు గనుక, ఏమంత్రసానియో, ఏముసలమ్మయో అసన్న ప్రసవకు ఏడుగడ అయ్యేడిది. పూర్వపు వైద్యక శాస్త్రములో చూలింత బాలెంతలను గురించి, శిశు పోషణమును గురించి తగినన్ని గ్రంధములున్నను, అవి సామాన్య ప్రజలకే కాదు, మధ్య తరగతి ప్రజలకు కూడ అందుబాటులో నుండెడివి కావు. ఆధునిక వైద్యశాస్త్రము వ్యాప్తిచెందిన తర్వాత ప్రసూతి మరణములును, శిశుమరణములును తగ్గినవనుటలో సందేహము లేదు.

భారతీయ వైద్యశాస్త్రమున ప్రసూతి చికిత్సకును, కౌమారభృత్యమునకును కొరత లేకపోయినను అవి వంశపారంపర్యముగా కొందరికే తెలియుటవలనను, కాలానుగుణముగా వృత్తులు మారుటవలన అనువంశికముగా వైద్యులయినవారి వంశీయులు తమ విద్యను అధ్యయనము చేయనందునను ఆ శాస్త్రములు లుప్తప్రాయమయి సామాన్య ప్రజలకు ఏ ముసలమ్మయో, మంత్రసానియో దిక్కు

---

1. సెలయేరు–పుట–96.

కావలసి వచ్చినది. ఆ మంత్రసానియు స్వార్థపరురాలయిన గర్భిణికి ఏదియో భయము కలిగించుట, దానితో ప్రాణాపాయము కలుగుట సంభవించెడిది. ఇట్టి సన్నివేశమున ప్రాతస్మరణీయులు శ్రీ వావిలకొలను సుబ్బారావుగారు తమ గర్భిణీహితచర్య పీఠికలో ఆనాటి అస్తవ్యస్తమైన పరిస్థితులను పేర్కొని, గర్భిణీ హితచర్య వ్రాయుటకు అదే కారణమని అనినారు.-[1]

గర్భిణీ స్త్రీకి ప్రసవవేదన ప్రారంభము కాగానే పలువురు ఆప్తులు ఆమె చుట్టును చేరి సమాశ్వసింతురు. ఆ సమాశ్వాసము వలన నొప్పి తగ్గకున్నను గర్భిణికి మనోధైర్యమును, నిబ్బరమును కలుగును.

చలికుట్టు పులికుట్టు రాగనే-తరుణపుడు గాలిపైనే వ్రాలెనూ

ఝుడియకుమనేవారు-వెరవకు మనేవారు తత్తరించేటివారూ-[2]

- ధైర్యమును చెప్పుదురు.

ప్రసవపు నొప్పులు భరింపరానివి గనుక ఆ నొప్పులను భరించుటకన్న మరణము మేలను వేదాంతమునకు దిగుదురు. అందుకే ప్రసూతి వైరాగ్యమను లోకోక్తి యేర్పడినది. గర్భిణి

"నొప్పులధికంబాయెనమ్మా! ఓయమ్మ!
నేనిప్పుడేయిక తాళనమ్మా!ఓయమ్మ! ॥నొ॥
కనిపెంచిన తల్లులార! ఓయమ్మ!
నా కష్టము కడతేర్చరమ్మా! ఓయమ్మ! ॥నొ॥
మంత్రసానిని బిల్వరమ్మా! ఓయమ్మ!
నాకు మంత్ర తీర్థము లివ్వరమ్మా! ఓయమ్మ! ॥నొ॥-3

- అని బాధపడుచు దగ్గరనున్న వారిని కోరును. దగ్గరనున్నవారు

1. గర్భిణీహితచర్య పీఠిక - వావిలికొలను సుబ్బారావు;
2. స్త్రీల పౌరాణికపు పాటలు-పుటలు-148.
3. సెలయేరు-పుట-77;

"పాలుజావలు గాచరమ్మా! ఓయమ్మ!
పట్టి పణతి నోటికివ్వరమ్మా! ఓయమ్మ! [1]

– అనెడివారును, పాలజావాగాచి–నెయ్యి చాలా బోసి పణతికిచ్చేటి వారు–[2] ను చుట్టు చేరుదురు. నేయితో గూడిన వేడిపాల వలన గర్భస్త శిశువులో చలనము బాగుగా కలుగును.

ఆ బాధలో "సైచదోయమ్మ–తాగలేననుచూ ధరణిపైనే వ్రాలెదరు"–[3] మనసు రుచిని, ఆకలిని కోరని స్థితిలో నుండును.

"చెలులార నేనేమి సేతు, ఓయమ్మ–నాశ్రమలెవరికి యెరుకసేతు, ఓయమ్మ
తలకురులు విప్పరోయమ్మా, ఓయమ్మా–నానోటికందియ్యరమ్మా, ఓయమ్మా
పిండమే గదిలె నోయమ్మా, ఓయమ్మ
అండబాయక నుండరమ్మా, ఓయమ్మ
దూరభారము చూడరమ్మా, ఓయమ్మ–దూలాన తాడేయరమ్మా, ఓయమ్మ
ఉరుములే ఉరిమి నట్లాయె, ఓయమ్మ–మురిపాల బిడ్డగలిగేను, ఓయమ్మ ॥నా॥ [4]

– ఇదంతయు గ్రామీణ వాతావరణములో ప్రసూతి గృహములు, డాక్టరులు అందుబాటులో లేని పరిస్థితులలో జరుగుతంతు.

మరియొక గర్భిణి పడు పాట్లును ఆమెకు చేయు ఉపచారములును ఈ క్రింది పాట కనుల గట్టించుచున్నది.

"చిన్నంగ మెల్లంగ పొట్టల్లు నొచ్చె
కనిపెంచిన తల్లులార నా దగ్గరికి రండి

– అని గర్భిణీస్త్రీ పురిటి నొప్పులననుభవించుచు కనిపెంచిన తల్లులను తోడుపిలచినది. దగ్గరనున్న వారు అప్పటి ఆమె స్థితిని ఇట్లు వివరించిరి–

రాగికొమ్మలు పట్టి రాగాలు తీసె రామరామ
చింతకొమ్మలు పట్టి చింతరిల్లేనా రామరామ

1. సెలయేరు – పుట – 78
2. స్త్రీల పౌరాణికపు పాటలు – పుట – 148.
3. స్త్రీల పౌరాణికపు పాటలు – పుట – 149.
4. సెలయేరు – పుట – 78.

కానుగు కొమ్మలు పట్టి కనెను బాలున్ని రామరామ

ఏడుగూరు దాసీలు ఏమి పనులు జేసిరి రామరామ

ఏడుగూరు మంత్రసానులు ఏమి పనులు జేసిరి రామరామ

....

దట్టంగ తలకొంగు తలనిండగట్టీ రామరామ

దౌవుడల్ల యిడెము" దండిగా బెట్టి రామరామ

బంగారు పొన్పుల్ల రామరామ తల్లిని పండబెట్టిరి రామరామ"[2]

– కాన్పయినంతనే పల్లెలలో బాలెంతలకు తలకొంగు తలనిండ గట్టి దౌడ క్రింద పెట్టుకొనుటకు తాంబూలమును ఇచ్చెదరు. తలనిండ గుడ్డ కట్టుట వలన గాలిసోకి జలుబగుట, తలవాపు వచ్చుట మొదలగు దోషములు అణచివేయబడును. తాంబూలము నోటిలోని పండ్లకు గట్టితనము నిచ్చును, వేడిమి నిచ్చును, జీర్ణకారియునగును.

సుఖ ప్రసవమగుటకు పాలు జావలు గాచి త్రాపుట మంత్ర తీర్థము లిచ్చుట, తలకురులు నోటికందించుట. దూలమునకు పగ్గములు కట్టి చేతికందించుట, ఇంటి కప్పుపైన తుపాకిని ప్రేల్చుట, గుడిలోని నందిని త్రిప్పుట, ఆవు శిరసు పుణికెను సూతికా గృహముపై నుంచుట, వెదురు వేపచెట్ల త్వక్కును, తులసిచెట్టు వేరును, వెలగాకును, పచ్చగన్నేరు బీజమును సమభాగములుగా గేదెపాలచే మర్దించి నూనెతో కలిపి జఘనమునకు పూయుట, గ్రామదేవతలకు సాకలు పెట్టుట, ఇష్టదైవములకు పుట్టబోయె శిశువు నీలములర్పించుకొనుట వంటి మ్రొక్కులు మ్రొక్కుకొనుట చేయుదురు. జలమును అభిమంత్రించు వేదవాక్యములను ధర్మసింధు పేర్కొనినది."[3]

దేవతల పుట్టుకను గురించి వింత వింత కథలున్నవి, భక్తులు తమ దేవతల యెడలను, తాము గౌరవించు మహాపురుషుల యెడలను గలభక్తి గౌరవములతో చిత్రవిచిత్రములగు నూహలు చేయుదురు. గౌతమ బుద్ధుడు పుట్ట

1. విడెము – తాంబూలము.

2. నేను సేకరించినది. పాడినవారు; కుర్మ చినసత్తమ్మ; అజీజ్‌నగర్.

3. ధర్మసింధు – పరిచ్ఛేదము–3 పుట – 243.

గానే ఏడడుగులు వేసినట్లు గలవు.–[1] పురాణ పురుషుల పుట్టుకను గురించిన కథలు చెప్పనే యక్కరలేదు. అద్భుతములు అసంఖ్యాకములు. జానపదులు తమ ఇష్టదైవములకును, వీరులకును ఇట్టి విచిత్రములనే ఆపాదింతురు. దీనికుదాహరణ ముగా బీరప్ప కథను పేర్కొనవచ్చును.

బీరప్ప కురుమ కులమువారి ఇష్టదైవము. ఇతడు విష్ణ్వాదిస్వరూపులగు దేవతలు పుట్టినట్లు పుట్టెనట. ఇతడు పుట్టునప్పుడు

తొమ్మిది నెల్లలు తల్లికి పడే,
తొమ్మిది నెల్లల్ల తొలికాడుతున్నాడు
ఈనాటి ఓ (వా) రికి తొమ్మినెల్లూరా
ఆనాటి వో (వా) రికి తొమ్మిది గడియాలె
తొమ్మిది గడియాలె తొలుకాడవట్టె
అయ్యో మాతల్లి సూరమ్మనే మగువా సూరమ్మనే
కన్నతల్లి సూరమ్మనే కాంతార సూరమ్మనే
కళకళా నొప్పులే నడుముల్ల పుట్టేను
నడుముల్ల నొప్పుల్లు కడుపుల్ల కొచ్చేను
కడుపుల్ల నొప్పులే నడుముల్ల తేలేను,
అయ్యో అమ్మమ్మా అంటావా, అడ్డము పడ్తాదా
ధరణి మీదనే తల్లి వడ్డాది–దామరాకోలే తల్లడిల్లు తున్నాది
సక్కాదనము సొక్కూతున్నాది
సత్తువల్లు లేవురా నారాయణమూర్తిరా.
సొప్పాకు రీతిగా సోలుగుతున్నాది.
ఆ ఎడమన ఏడుగూరు దాసీలున్నారు.
ఈ కుడినా ఏడుగూరు దాసీలున్నారు.

– ప్రసవవేదనలో నొప్పులననుభవించుచున్న సూరమ్మను తారాకుతో, చొప్పాకుతో పోల్చి చెప్పుట సహజముగా నున్నది, జానపదుల వర్ణన పరిసరములను దాటిపోదు.

---

1. లలిత విస్తరము.

"యా(వే)పాకొమ్మలే తల్లి పట్టేనా
యాపాతులిగ- [1] తియ్యావట్టేను,
కలిమికొమ్మలు తల్లీ పట్టేనే,
కష్టాలయితే తల్లి పడుతున్నదీ
చింతాకొమ్మలే అమ్మవోరు పట్టేను,
చింతకూడ చెయ్యావట్టేను
కడుపుల దేవుడూమాట్లాడుతున్నాడే
మరియేమని జ్ఞానాము దేవుడూ పలికేనా

– వేపాకొమ్మలు, కలిమికొమ్మలు, చింతకొమ్మలు పట్టిసూరమ్మ నొప్పులను తీయుచున్నది. సూరమ్మ మామూలు స్త్రీ గనుక సహజమైన నొప్పులను తీయు చున్నది. కాని జన్మించువాడు బీరప్ప కనుక అతనిలో మానవాతీతమైన మార్పును చూపెట్టవలెనని జానపదుల తపన. అందుకనియే దేవుడు కడుపులోనే మాట్లాడుచుండెనని వర్ణించినారు. అంతేగాక అతని జన్మకును నూతనత్వమును కల్పించినారు.

బీరప్ప శంఖ చక్రగాదాద్యాయుధములతో, వీపున వింజామరలతో వామనావతారమును స్ఫురింప జేయుచు పుట్టెను. జానపదులు తమకు తెలిసినంతలో తమ ఆరాధ్యదైవములను తక్కువ చేయక వర్ణించెదరు.

దేవుడు పుట్టంగ యేమేమి పుట్టేరా.–ఏదుము బండారు ఎన్నున బుట్టేరా
పందుం బండారు పక్కనా పుట్టేరా–పుట్టెడు బండారు పుక్కిట పుట్టేనా,
మచ్చాసి (మైసాక్షి) పొగల్లే మస్తుగ–[2], పుట్టేనా
గుగ్గిలము కంచుల్లే గుర్తుగ పుట్టేరా.–నిలువుగ కోసెటి నిమ్మకాయలల్లే,
పక్కున పగిలేటి పాలకాయల్లే,–పుట్టావట్టేరా దేవుని యొంబాడి,
గదాశులమ్మే చేతుల వట్టేనా–బంగారి ఈరగోల(త్రాడు)బాగుగ పుట్టేనా,
దేవుడు పుట్టంగ శివసత్తూలకే(శక్తులకే)సిగ్గుపుట్టేరా
చెలరేగి భూతాలే చెట్టూ వట్టేనా,–ఘనరేగి భూతాలే గట్టు వట్లేనా
గట్లల్ల పెద్దపులి గాండ్రు కొట్టేరా–నీళ్లల్ల పుట్టారా పెరుగా వట్టేను,

1. ఆపదలు + ఇక ;

2. అధికముగా. ;

పుట్టకు చెదలూరా ఎక్కావట్టేను,-దేవుడు పుట్టంగా సుక్కలన్నిరా,
పెక్కటిల్లేరా,- ఆరంజ్యోతి(అరుంధతి) రా అదిరి పడేరా
ఆకాశమంతారా అదిరిపడేరా-భూదేవంతా బుగులూ -[1] పడేరా
ఉప్పు స(చ)ప్పాన, యా(వే) పాకు తియ్యానా
రచ్చల మీదారా రాజులంతాను-ఉయ్యాల జంపాల ఊగాపట్టిరి.
దేవుడు పుట్టంగ ఏమేమిపుట్టేరా,-ఏడుగురు ధీరులే బీర్లోలు పుట్టిరి

– ఇంతటి సరంజామాతో దేవుడు బీరప్ప జన్మించాడు. తల్లి సూరమ్మ దట్టముగ "తలకొంగు చుట్టుకొని, దవుడల్ల యిడేము" మామూలు బాలెంత మాదిరిగానే ఉంచుకొనినది. బీరప్పను దాసీలు "పట్వేడు నీళ్లల్ల పన్నీరు గలపి, కడివెడు నీళ్లల్ల కస్తూరి గలిపి, పేర్పెడు నీళ్ల పెయ్యి జిడ్డూ కడిగి, పట్టు బట్టలు పొత్తిళ్లుగా పరచి, పొత్తిట్లో పొందుగ పండేసిరి". అప్పుడు బాలున్ని చూస్తే " ఎడమ కంట్లేరా చింతామణిరా, కుడికంట్లేరా పద్మరేఖరా, బొడ్డున సూస్తేర మాణీక్యమున్నాదిరా, వీపుల చూస్తేను వింజమణిరా, అరచేతూల అంజనం పుట్టేను, నాలికమీదనే అక్షరం పుట్టేనా, పండ్లమీదనే పలుకబలుపమా"–[2] ఇన్ని విశేషణములతో పుట్టినాడు బీరప్ప. పాట పాడిన స్త్రీని " బీరప్ప నిజము గానే వీటన్నిటితో పుట్టినాడా?" అని ప్రశ్నించ "అయ్యో! దేవుడుకదా, నిజంగానే అవన్ని ఉండినవి" తాను చూచివచ్చిన రీతిగా జవాబిచ్చినది. అది వారి అమాయకతను తెలుపును.

ప్రసవించుటకు "నీళ్లాడుట" అని గ్రామీణుల వ్యవహారము. నీళ్లాడుట యనగా స్నానమొనరించుట యని యర్థము. నీళ్లాడు అను పదమును స్నానమాడు అను అర్థమున తిక్కనయు ప్రయోగించెను. –[3] కాని క్రమముగా ఈ పదము "ప్రసవించుట" అను అర్థమున రూఢమయినది. "దేవకి నీళ్లాడె" –[4] అని పోతన ప్రయోగించెను. కవి ప్రయోగములు రెండర్థములలో నున్నను కాలక్రమమున

1. భయము.
2. నేను సేకరించినది, పాట-బీరప్పజననము; పాడినవారు; బొడ్డు సత్తమ్మ గడ్డం మల్లయ్యగూడెం – ఇబ్రాహిం పట్నం (తా)
3. శ్రీమదాంధ్ర మహాభారతము – శల్యపర్వము. ఆ.2 ప. 16
4. శ్రీమదాంధ్ర మహాభాగవతము – దశమస్కంధము – ప. 147.

ప్రసవించు అను అర్థమున రూఢి అయినది. ఈ రూఢికి కారణమిట్లు ఊహించ వచ్చును; ఈ పదము మన అనాగరిక దశకు ఉదాహృతి. ప్రసవించిన స్త్రీ మావి మొదలగు వానితో చూచుటకు అసహ్యముగా నుండును. అందువలన నవ ప్రసూతకును, శిశువునకును నీళ్లుపోయుట పూర్వపు ఆచారము. నేడు కూడ అనాదివాసులలో ఈ ఆచారము ప్రబలముగా నున్నది. ఈ స్నానము ప్రత్యేక స్నానము గనుక ప్రసూత్యనంతర స్నాన విశేషముగ రూఢియై యుండును. –[1]

శిశువు జన్మించిన వెంటనే మంగలి మంత్రసాని కొడవలితో బొడ్డుకోయుట ఆచారము. ఎవరైన తమకన్న చిన్నవారు అమర్యాదకరముగా పేరుతో పిలిచిన "బొడ్డు గోసి పేరు బెట్టినావా?" అని ఆక్షేపించుట తరచుగా వినుచుందుము. గొప్పలు చెప్పుకొనువారిని " నీ బొడ్డు గోసిన కొడవలి నా చేత ఉండ" (నీ పుట్టు పూర్వములు నేనెరుగుదును) అని దెబ్బిపొడుచుటయును మనము వినుచుందుము. కొడవలితో బొడ్డు గోయుటను భానుమద్విజయము పేర్కొనినది. –[2] శిశువు బొడ్డును వేరుచేసి మావిని క్రొత్తకుండలో పెట్టి భూమిలో పాతిపెట్టుట పూర్వాచారము. ఇట్టి ఆచారమే " పుట్టంగకుండ చావంగ కుండ " అను సామెతలోని, పుట్టంగ కుండ అనుటకు కారణమయినది.

శిశువు జన్మించగనే ఏడ్చుట పరిపాటి, ఒకవేళ ఏడువక పోయినను, చెవిటి అను అనుమానము కలిగినను ఇత్తడి చేటను లేదా ఇత్తడి తాంబాళమును శిశువు చెవి దగ్గర గట్టిగా వాయింతురు. శిశువు యొక్క కర్ణకుహరమునందీ చప్పుడు చొరబడి వినికికడ్డముగ నున్న యడ్డును తొలగించునను నమ్మకము కలదు. ఇట్లే కోయలు పుట్టిన శిశువు చెవిటిగా కనబడిన జనన సమయానంతరము నెల్లప్పుడు నొక ఇత్తడి గిన్నెను గట్టిగా చప్పుడు చేయుచుందురు. –[3]

1. నుడి – నానుడి – తిరుమల రామచంద్ర – పుట – 127.
2. భానుమద్విజయము–వెలగపూడి కృష్ణయామాత్యుడు. ఆ. 1 ప. 56.
3. తెలుగువారి చరిత్ర 7000 ఏండ్ల క్రిందట నారంభమైనది (వ్యా)– టేకుమళ్ల రామచంద్రరావు. భారతి. శ్రావణమాసము, ఈశ్వర సంవత్సరము. పుట–231.

పుట్టిన శిశువునకు వెంబడే వేడినీళ్లుబోసి స్నానము చేయించి చేటలో గాని జల్లెడలోగాని ధాన్యమును బోసి అందు పరుండబెట్టి బొడ్డునకు చిట్టాముదమును రుద్దుదురు. తరువాత ఆ ధాన్యమును మంగలి తీసికొని వెళ్లును. బొడ్డునకు చిట్టాముదమును రుద్దుటను కాళహస్తి మాహాత్మ్యము పేర్కొనినది. –[1]

"కౌసల్య వేవిళ్లు" పాటలో రామ జననానంతరము కౌసల్యాదేవి రామునకు స్నానము చేయించెను.

వెండి కాగులతోను వేణ్ణీళ్లు భమిడికాగులతోను చన్నీళ్లుతోడి
చన్నీళ్లు వేన్నీళ్లు సమముగా దొల్చి, మూడు దోసిళ్ల నీళ్లు ముందుబోసె,
జలకమాడించెనే తల్లికౌసల్య, మెత్తని వస్త్రమున మేనుతళ్లొత్తెను"–[2]

– సామాన్య కుటుంబములలో శిశువునకు జననానంతరము ఎవ్వరైన పెద్దలు స్నానము చేయించుట పరిపాటియై యుండగా ఈ పాటలో దాసదాసీజనము కలిగియున్న కౌసల్యాదేవి స్వయముగా నీళ్లు పోయుట చూడగా తల్లితో బిడ్డకు నీళ్లు పోయించినగాని జానపదస్త్రీలకు తృప్తి కలుగ లేదని భావింపవచ్చును. సామాన్యపు పద్ధతులతో బాటు రాజరికమును తెలుపు "వెండికాగులు, భమిడికాగులు" చేర్చబడినవి.

రెండవనాటి నుండి శిశువునకు స్నానము చేయించునప్పుడు–
"మాడపట్టుకు మంచినూనె–కను చెవి ముక్కుల కమ్మని నూనె
డెబ్బెసిబ్బముల గబ్బుననూనె–ఎడపెడ తొడలకు మడిగెల నూనె
రొమ్ము దిమ్మెసెల రొఖ్ఖం నూనె–రంధ్రం పట్టలరాసిన నూనె
తలపొర యంటుల గిద్దెడు నూనె– కందున పూసిన గానుగ నూనె
సన్ననలుగుతో సాదిన నూనె–పచ్చ పసుపుతో వండిన నూనె–[3]

1. కాళహస్తి మహాత్మ్యము, ఆ. 3. ప. 27.
2. స్త్రీల రామాయణపు పాటలు – పుట – 52.
3. పల్లెపదాలలో ప్రజాజీవనము. ద్వితీయ ప్రకరణము.

– మొదలగు నూనెలతో మర్దనజేసి శిశువునకు మాడ పట్టునను, కనుకొలుకులలోను, చెవి ముక్కు రంధ్రములలోను మంచినూనె యంటించి యితరావయములకన్నింటికిని నూనె చక్కగా పూసి

"వేన్నీళ్లు చన్నీళ్లు సమముగా బోసి
ముక్కువొత్తి, చెవ్వొత్తి రాసి పోసినగాని నిదురబోడు"–[1]

– అనుచు గోరువెచ్చని నీటితో స్నానము చేయించెదరు. బాలునికి మంచి గంధము, మాచికాయ, కప్పురము, గుగ్గిలము, సాంబ్రాణి, ఓమము(వాము), వెల్లుల్లి పొట్టు కలిపి దంచిన చూర్ణముతో ధూపమును వేయుదురు. పైవస్తువులలో అన్నియు లేకపోయినను ఓమము, వెల్లుల్లి పొట్టు, సాంబ్రాణి చూర్ణము కలిపిన ధూపమును తప్పక వేయుదురు.

ప్రసవానంతరము బాలెంతకు దేహమునిండ నూనెలో ఉడికించిన వేపాకు పసుపు పూసి స్నానము చేయించెదరు. బాలెంతరాలి ఆరోగ్యమునకై ముందుగనే తయారు చేసి యుంచుకొనిన బాలెంత కారమును (దీనిని మోడి అనియు పెద్దమందు అనియు అందురు) ఆమెకిత్తురు. దీనిని పిప్పళ్లు, సొంటి, మిరియాలు, లవంగములు, జాజికాయ, జాపత్రి, తాటి బెల్లము, యింగువలతో తయారు చేయుదురు.–[2] చరక సంహిత–[3] అష్టాంగ హృదయము మున్నగు ఆయుర్వేద గ్రంథములలో నవ ప్రసూతకు నొసంగు ఔషధయోగములు పెక్కు గలవు. వీని వలన బాలెంతలకు సూతికావాతము వంటి బాలెంతరోగములు నివారణ మగుటయే గాక శరీర పుష్టి. స్తన్యవృద్ధి కలుగును.

మరణ సదృశమైన యంతటి ప్రసవవేదనయు శిశువును చూచినంతనే మటుమాయమగును, కళాపూర్ణోదయ కావ్యమున బాలెంత తానుకనిన బిడ్డను చూచి ప్రసవవేదనను మరచి ఆనందించుట వర్ణించబడినది.[4]

---

1. నేను సేకరించిన పాటలోని భాగము. పాడినవారు; ఇందిరమ్మ, చెంపాపేట.
2. తెలుగు జానపదగేయ సాహిత్యము–పుట – 750.
3. చరకసంహిత – సూత్రస్థానము – అన్నపాన విధిరధ్యాయము (అధ్యా–27) ఆహారయోగి వర్గః శ్లో. 297 – 300 ! పల్లెపదాలలో ప్రజాజీవనము – చతుర్థ ప్రకరణము.
4. కళాపూర్ణోదయము – ఆ. 2 ప. 130–133

"ఆ మగువ నీళ్లాడి–కొడుకును గనెనమ్మ అది మంచి దినమందునా
పేరు వీనికి మనము–పెట్టుదామనుచును కందర్పుడని బిలుతమూ
....మన్మథుడని బిలుతమూ
....మారుడనీ బిలుతమూ. "[1]

అనుచు ప్రసవపు గండము కడతేరినంతనే ఆనందము మీర పుట్టిన శిశువునకు పేరెన్నుకొనుటలో బంధువులతో బాటు బాలెంతరాలు లీనమగును.

మామూలు స్థితిలో కంటెను చూలింత, బాలెంత దశలలో స్త్రీలకొక నూతన విధమైన అందము చేకూరును. కొడుకు నెత్తుకొనిన తల్లికి నిండుదనము వచ్చును. "గొడ్రాలు బ్రతుకేల కోటిధనమేల" అని గొడ్రాలు జీవితమును నిరసించుటలో స్త్రీ కి మాతృత్వముపై నుండు అపేక్ష వ్యక్తమగును. మాతృత్వముతో స్త్రీకి పరిపూర్ణత్వము సిద్ధించును.

మాచిన పట్టుచీర, మడుమలకు పసుపు
కళ్లకు కాటుక పళ్లకు యెఱుపు
మావాడ బాలెంత, అబ్బాయి తల్లి–[2]

– పసుపుతో మడుమలు పచ్చనై, కాటుకతో కండ్లు సోగదేరి, తాంబూలముతో దంతములు ఎరుపెక్కి బాలెంత చూపరులను ఆకర్షించుట సహజము. పసుపు నూనెలో బాలెంతలు మునిగి తేలినట్లుందురు.

"నీలాటి రేవంత నిగ్గుతేరింది
ఏచేడె గడిగింది ఈ ఛాయ పసుపు
....
కొట్టు పసుపు కొమాళ్ళ తల్లి యాడింది".[3]

– పసుపు సౌందర్యసాధనమేగాక ఆరోగ్యకరమనియు వేరుగా చెప్ప బని లేదు.

బ్రాహ్మణ కుటుంబములలో పదిదినములు గడచిన పిదప సూతికయగు స్త్రీ పురిటి శుద్ధి కలిగి స్పృశింప దగినదగుటయు, జాతకర్మ నామకరణాది

1. స్త్రీలపౌరాణికపు పాటలు – పుట – 149.
2. సెలయేరు–పుట–82 ; 3. పల్లెపదాలు–పుట–91.

సమయప్రాప్త కర్మలయందు అధికారమును పొందుటయు జరుగును. పది దినములును ఆమెనెవరు తాకరాదు. మైలస్నానము చేయవలసినదే. ఉన్ని బట్టలనుగాని, పట్టుబట్టలనుగాని ధరింపజేసిన శిశువును తాకిన తప్పులేదు. ఆ బట్టలకు "అంటు మైల" ఉండదట.

పురిటి బిడ్డను బాధించుకుండ ఇంటిలోని ముసలమ్మలు పురిటింటి ముందు కూర్చొని "ఎన్నెమ్మ" కథను పాడుదురు. "ఎన్నెమ్మ" పాట. ఇదే ప్రకరణములోని నామకరణములో సూచింపబడినది.

సూతికా గృహమునకు భూత బాధగాని, అంటురోగముల ఆపదగాని కలుగకుండ యుండుటకు జానపదులు వేటగాని వలను కట్టుట, ఇనుప గరిటెను గాని గడ్డపారనుగాని గడపలో నుంచుట, కుంపటి వెలిగించి గదిముందుంచుట, ద్వారమునకు వేపాకు మండలు కట్టుట మున్నగు ప్రక్రియలను ఆచరింతురు. తల్లి తల దిండు క్రింద వేపాకు మండలను, శిశువు బొడ్డుకోసిన కొడవలిని ఉంచెదరు. ఆమె పురుటి స్నానమునకు వెళ్లునప్పుడు కొడవలిని వేపాకు మండలను చేతిలో పట్టుకొని వెళ్లవలెను. ఈ ఆచారమును "కుశలవకుచ్చల కథ" సవిస్తరముగా చెప్పినది. పురుటి స్నానము మొదలు సూర్యునకు నమస్కరించు వరకును గల ఆచారమునకు ఈ ఘట్టము మణిముకురాయమానము. దానినిచ్చట పొందు పరచుచున్నాను. పిల్లకు నీళ్లు పోసిన పిదప అతివలు సీతకు తలయంటి నీళ్ల పోయుట చక్కగా వర్ణింప బడినది.

"పవళింప బెట్టిరి యపుడు–పచ్చగవేసిన పందిటి క్రిందను
ముత్యాల పీటను ముందుగ వేసిరీ–రావే జానకి రమ్మని పిలిచిరి
నడికట్టుకట్టి సంతోషముగను కుడిపాదమునకూర్చుండ బెట్టిరి
ఉల్లివేసి కాచిన నూనెలను సీతకు సిరసంటి వారు
పచ్చాకు కచ్చూరాలు వేసిన–వొంటి పిండి నలుగులు పెట్టించె
చన్నీళ్లు వేణ్ణీళ్లు సమముగ చేసి మజ్జనమాడించిరి సీతకును
పట్టువస్త్రముల తరుణులు తళ్లొత్తిరీ సాంబ్రాణి దూపములువేసిరి
సఖియకుతల కురులారులార్చి వారు–కుసుమ పువ్వులా చీరగట్టిరీ
నడికట్టుకట్టిరి నాణెముతోను–చిలుక రవికెలు సీతకుదొడిగిరీ
తలవాశనమ్ములు గట్టిరివారూ–సోగకన్నుల కాటుకబెట్టిరీ

ముక్కుకు ముంగరము ముగుదకు నుంచిరి–కొట్టుకాయము కొట్టిదెచ్చిరి
అప్పుడు కాచిన ఆవులపాలూ–బంగారు గిన్నెలో పోయించిరి
పణతులు పాదమ్ములు తొడగించిరి–బొడ్డు కోసినా కత్తిచేతికియిచ్చిరి
వేప కొమ్మలా వెలదికి యిచ్చిరి తూర్పువైపునా నిలువవే జానకి
మ్రొక్కవె జానకి భాస్కరు కయినా, మ్రొక్కెను జానకి భాస్కరుకైన
ఏటనేట చూలింత బాలింతా–దయచేయుమియో భాస్కరయనెను. అక్కడ
నున్నా యతివల కెల్లా–పసుపు కుంకుమా పణతులు యిచ్చిరీ".

– ఈ పాటలోని సీతాదేవి స్నానము సామాన్యపు బాలింతల కందరకును చేయించు స్నానమే. పురుటినాటి విశేషములు "నామ కరణము" అను శీర్షికలో పేర్కొనినాను.

పొత్తిళ్ల అడుగునను క్రిమి సంహారమునకై వేపాటు నుంచుట ఆచారము. ఈ ఆచారము "ఎల్లమ్మకథ" పాటతో ప్రసక్తమైనది.

"పుట్టంగ యాపాకుండె
పెరుగంగ మామిడాకు లేని కారణమేమి చెప్పమ్మా"–[2]

అని ఎల్లమ్మ ఎన్నాళ్లకు తనకు పెండ్లిగాని కారణమును తల్లి పార్వతితో ప్రశ్నించును. పుట్టినప్పుడు వేపాకు ఆరోగ్యకరమనుట. పెరిగి పెద్దయైన పిదప మామిడాకు పెండ్లికి సూచకమగుట ఈ పాటలో ధ్వన్యాత్మకముగా నున్నది.

సంతానోత్సవమునందు సంతోష సూచకముగ తల్లిదండ్రులు విందులు వినోదములు చేయుట సీమంతులయిన వారు అమూల్యమైన కానుకలను పరిజనమునకిచ్చుట నేటికిని కలదు. "శ్రీరామ జననము" పాటలో దశరథుడు తనకు పుత్రజన శుభవార్తను చెప్పిన వారలకు

"మెప్పైన వస్త్రంబులు, బహుమాన మిప్పించి యుప్పొంగిరి
....

1. స్త్రీల రామాయణపు పాటలు–పుట–288.
2. నేను సేకరించినది. పాడినవారు; కుర్మబొడ్డు సత్తమ్మ, గడ్డం మల్లయ్య గూడెం.

పంతుగల ధన ధాన్యము బ్రాహ్మణులకు".... ....–[1]

ఇప్పించెను. పుత్రజననము వార్త తెలసినప్పుడు గ్రామమునందలి యాచకులు వచ్చి విజయదశమి, హోళి మున్నగు పండుగల యందువలెనే యాచించెదరు. తెలంగాణా ప్రాంతమున "కొజ్జాలు" వచ్చి ఇంటివారిని బహుమానముల కొరకు పీడించుట నేటికిని కానవచ్చు దృశ్యము. ఈ సందర్భమునకు సంబంధించిన ఒక విచిత్రగాథ అవధీ జానపద గేయములలో కలదు. ఒక రాజుకు పుత్రుడు ఉదయించెను. యాచకులతనిని బహుమానములకై పీడింపసాగిరి. అతడు వారి బాధకు తట్టుకొనలేక బాలెంతరాలిని అమ్మివేసెను. కాని బాలెంతరాలు లేకపోయిన ప్రసూతి గృహము శోభించదని మరల ఆమెను ఇంటికి పిలచుకొని వచ్చెను.–[2]

ప్రాచీన కావ్యములలో ఆసన్న ప్రసవకు చేయు ఉపచారములు, బాలెంతరాలు, సూతికాగృహము, బాలెంతరాలుకు చేయు చికిత్సలు మున్నగువానిని గురించిన వర్ణనములు కడు రమ్యముగా నున్నవి. కాళిదాసు–[3].

భానుడు–[4] సూతికా గృహమును, అప్పటివారనుసరించు ఆచారములను సవిస్తరముగా వర్ణించిరి. తెలుగు కావ్యములలో జైమినీ భారతమున పుత్రోదయాచారములు–[5] (పుత్ర జననమునకు పూర్వమునను, అనంతరమును జరుపు ఆచారములు). భానుమద్విజయమున ప్రసవదశ బాలెంతరాలు పథ్యము–6, శివరాత్రి మహాత్మ్యమున పురుడు పుణ్యాహవాచనములు.–7 శకుంతలా పరిణయము.–8 వాసవదత్తా పరిణయము.–9 హంసవింశతి.–10 కావ్యములలో బాలెంతరాలి సొబగు వర్ణించబడినవి.

1. స్త్రీల రామాయణపు పాటలు– పుట – 55.
2. అవధీలోకిగీత్ ఔర్ పరంపరా (హిందీ) పుటలు – 37, 38.
3. రఘువంశము.
4. కాదంబరి;
5. జైమినీ భారతము. ఆ. 6
6. భానుమద్విజయము ఆ. 1; ప. 56, 57
7. శివరాత్రి మహాత్మ్యము ఆ 2 ప. 67, 76
8. శకుంతలా పరిణయము. ఆ. 3 ప. 90
9. వాసవదత్తా పరిణయము. ఆ. 2 ప. 59
10. హంసవింశతి. ఆ. 2 ప. 95

బాలెంతలు చాల ఆకర్షణీయులుగా నుందురు. అప్పుడు పురుషులు ప్రలోభపడుట వలన దాని దుష్పరిణామములు అప్పుడప్పుడు సోకి బహిరంగమగు చుండును. జానపదులు ఇట్టి ఘట్టములను తమ గేయములలో పొందుపరచుట వదలలేదు. ఈ శృంగారమును శ్రీకృష్ణునకే యంటగట్టి తమ కుతుకములను దీర్చుకొనిరి. అట్టిపాటలలో నొకటి ఆదిలక్ష్మి కృష్ణ సంభాషణము పాట :

కృష్ణుడు :- పడతి నువు నీళ్లాడి పదిదినములాయె
నెలత నిన్నెడబాసి నిద్రకంటికిరాదు
అలివేణి పానుపున ఒంటిగుండ లేను
కలికి కన్నుల జూడవే - ఆదిలక్ష్మి అంది ముచ్చటలాడవే.

ఆదిలక్ష్మి :- వినవయ్య గోపాల బాలింతరాలను
కట్టిన తలకొంగు కడకు తీయనేరాదు
పుక్కిట విడియము పక్కన బాలుడు
బాలెంతరాలనయ్యా ముద్దుల కృష్ణ-బాలెంతరాలనయ్యా

- పదిదినముల బాలెంతరాలి ప్రక్కజేరవలెనని కృష్ణుడు ఉబలాట పడెను. మంచి మాటలతో కృష్ణుని మందలించ జూచినది ఆదిలక్ష్మి. శ్రీకృష్ణునిలో వలపు ఎక్కువయినది. ఆమెను వదలునట్లు లేదు.

కృష్ణుడు - శ్రీలక్ష్మి పురిటిల్లు చిలుక లోగిలి నాకు
నీ పురిటి మంచము హంసతూలిక నాకు
పొత్తిళ్ల బాలుని పోలికలే చూతు ॥కలికి॥

ఆదిలక్ష్మి :- ఒల్లెల్ల-[1] పసుపోయి నూనంటు చీరోయి
కల్లగాదు యింక కాయంపు వాసనలు-[2]
ఇక్కడ మీరుండ ఇంపుగాదయ్యయ్యో ॥బాలెంత॥

- పురుటింటిని చిలుక లోగిలిగా, పురిటి మంచమును హంసతూలికగా భావించు కృష్ణునిని ఆదిలక్ష్మి ఒడలంత పసుపు, నూనె అంటిన చీర. కాయపువాసనలు - అని బెదరించజూచిన లాభములేదు. ఈ పాటలో బాలెంతలు పసుపు నూనెలో

1. ఒడలంతయు; 2, బాలింతల కిచ్చెడు మందు (తెలం. ప. పాటలు 124)

మునిగి తేలుట, శరీరము ఆరోగ్యముగా నుండుటకు ప్రసూతి తర్వాత మందును వాడుట చెప్పబడినవి.

కృష్ణుడు :- నీ ఒంటి పసుపంత పునుగు జవ్వాజి నాకు
నూనంటు చీరెలు పట్టు పీతాంబరము
కాయంపు వాసనలు కస్తూరి వాసనలు ॥కలికి॥

- ఆదిలక్ష్మి కృష్ణునకు ఈసడింపు కలుగుటకు ఎన్ని వస్తువులను ఎత్తిచూపినను వానిలోనొక అందమునే తిలకించుచున్నాడు కృష్ణుడు

కనులాది కాటుక కాయంపు వాసన
ఉల్లి పూసల దండ ఊబిది -[1] బొట్టోయి

- అని ఎన్ని విధముల చెప్పినను కృష్ణుడు త్రోసిరాజనుచుండెను కదాయని భావించి

"బాలచంద్రుడ నేను బావికె పోలేదు
చక్రధరుడ నేను చేద విడువలేదు"

- అని పచ్చి బాలెంతరాలనను అర్థమును ధ్వనింపజేసినది. (బావికి పోవుట, చేద విడచుట అను ఆచారములు "నామకరణము" అను శీర్షికలో చూడదగును) ఇంతగా నచ్చచెప్పినను అతడు వినడేమో యని

"అత్త గడుసుమారి - ఆడుబిడ్డ కావలున్నది" -[2]

- అని హెచ్చరిక చేసినది. బాలెంతరాలునకు తోడుగా నెవరైనను కాపలా యుండుట సహజము. వారిని కూడ లెక్కించక కృష్ణుడు దుడుకు తనము చూపునేమోయను భయముతో తనయెడ తప్పు ఏమాత్రము లేదనునట్లుగా "అత్త గడుసుమారి ఆడుబిడ్డ కావలున్నది" అని తప్పించుకొనినది. ఈ పాట వలన బాలెంత అలంకరణ, బాలెంతరాలు పాటించవలసిన నియమములు విదితములు.

1. విభూతి.
2. తెలంగాణా పల్లె పాటలు - పుటలు - 124, 125.

అత్త ఆడుబిడ్డలు కాపలాయున్నారని భార్యాభర్తలు మదనపడుట సహజమే అయినను, బాలెంతగా నున్నప్పుడు ఎవ్వరైనను ఆమెకు తోడుగా నుండవలెను. లేకపోయిన "నీళ్లాడి నిలుచుంటె నీళ్లిచ్చె దిక్కులేదు" –[1] అని వాపోవలసినదే గదా !

కృష్ణపాత్రకు శృంగారములో అదుపు ఆజ్ఞలనునవిలేవు. ఎవ్వరినైనను కొంగుపట్టి లాగవచ్చును. పరిహాసమాడవచ్చును. ఎటువంటి వారితోనైనను సరసము లాడవచ్చును. కృష్ణుడు కోయనిన కోటిమంది గోపికలు వచ్చెదరు. అయినను అతని మనస్సు బాలెంతరాలివైపు మరలినది.

బాలెంత :- బాలెంతరాలనురా కృష్ణయా
ఆలీకి మొగనివలె అట్టె పట్టొచ్చినావు
కృష్ణుడు : బాలెంతరాలవు కావే గోపికా
బాలెంతరాలవైతె ఈ వింతలేటికి
కండ్లాకు కాటికేల పండ్లాకు దాశెనేల
ముండ్లరీతిగ చండ్లు ముందుకు పొడిచినావు

– బాలెంత తనను పట్టుకొనవచ్చిన కృష్ణుని "ఆలీకి మొగనివలె అట్టె పట్టొచ్చినావు" అని బెదిరించినది. ఇది చక్కని బెదరింపు. భార్యను పట్టుకొనుటకు భర్తకైనను కొన్ని కట్టుబాటులుండ వచ్చును కాని కృష్ణునకు అట్టి నియమము లేవియు నుండవు. బాలెంతరాలి అలంకరణము కృష్ణునిని కన్నుగీటు కాంతవలె భ్రమగొలిపినది. భ్రమను తొలిగించుటకు బాలెంతరాలు –

కండ్ల పండ్ల నొప్పులాకు కాటికె దాశెన పెట్టినాను
చండ్లనిండ పాలునిండి ముండ్ల రీతి పొడిచినావి

– అని సమాధానమిచ్చినది. అయినను కృష్ణుని మనస్సు సంశయములోనే ఉండి పోయినది. అందులకే–

ఆటా లాడుటేల పాటాలు బాడుటేల
మాటి మాటికి నగు మాటలాడేవేల

1. తెలం, ప. పాటలు – పుట – 185.

– అని అడిగినాడు. ఆట పాటలతో కాలము గడపుట. మాటి మాటికి అవసరము లేకపోయినను మాటలాడుట, నవ్వుట కులస్త్రీ లక్షణములు కావని గ్రామీణుల అభిప్రాయము.

బాలెంత – అటాలు పాటాలు అప్పుణ్ణె పొద్దుబోక
సాటివారిలో నగుబాటు జేయబోకు

-- అని బాలెంతరాలు ఎన్ని రకముల నచ్చచెప్పజూచిన లాభము లేకపోయెను. కృష్ణుడు ఆమెపై కన్నువేసినాడు.

కృష్ణుడు:- ఆరునెలలు దాటినట్టులయ్యున్నాది
ఊరకైన ఒక్కసారి చెల్లించావె

– అని అడుగనే అడిగెను. బాలెంతరాలు మంచి మాటలతో నచ్చ జెప్పజూచుట ప్రయోజన కరముకాదని

"ఒక్కనెలైనాను నిక్కము దాటలేదు
ఊరికె గీరికె లేదు ఊరక పోవోయి"–[1]

– అని కసరి కొట్టినది. పరస్త్రీతో కృష్ణుని పేర పరిహాసము లాడుటకు ఏ మాత్రమును జానపద శృంగారులు వెనుకాదరు.

పై పాటలో "ఆరునెలలు దాటినట్టులైయున్నాది" అను వాక్యములో ఆరోగ్య సూత్రమిమిడియున్నది. పిల్లలకు పన్నులు వచ్చు వరకు భార్యాభర్తలు శయ్యా పథ్యము ఆచరింపవలెనని అంతలోగా ప్రలోభపడిన ఆరోగ్యము చెడునని వైద్య శాస్త్రము చెప్పుచున్నది. సామాన్యముగా ఆరునెలల వయస్సు వచ్చునప్పటికి ఒకటి రెండు పన్నులేర్పడును. ఇట్టి సన్నివేశమును తెలుపు రమణీయ ఘట్టము గాథా సప్తశతిలోనున్నది, ఒక పని పిల్లవానికి అప్పుడే పాలపండ్లు వచ్చినవి. వానితో వాడు రేగుపండును కొరికెను. ఆ రేగుపండుపై పడిన పిల్లవాని పంటికాట్లను ఆమె మహానందముతో భర్తకు చూపి చిరునవ్వు నవ్వెనట. శయ్యాపథ్యము ఇక అక్కరలేదని దాని ధ్వని–[2]

1. తెలంగాణా పల్లెపాటలు–పుట–168.
2. గాథా సప్తశతిలో తెలుగు పదాలు–తిరుమల రామచంద్ర– పుట–116.

ఈ ఆరోగ్య సూత్రమునకనుగుణముగనే జానపదులలో "బాలెంతకు ఆరునెలల దాక అరికాలు (యొక్క) పచ్చి ఆరదు" అను వ్యవహారము కలదు. దీనిలో బాలెంతరాలు అన్ని విధముల ఆరోగ్యము కాపాడుకొనవలెనను హెచ్చరిక యును కలదు.

మహిళల జీవితము సమర్తతో మలుపు దిరిగి, వివాహము, సంతానము, కుటుంబ నిర్వహణము మున్నగు ఘటనములతో కొనసాగిపోవుచునే యుండును. వారు తమ సంసారమున నిమగ్నులై పుట్టినింటివారి నుండి కోరుకొనునవి కేవలము చిన్న చిన్న కానుకలు. అట్టి వానిలో పుట్టింటివారికి ఆమెను, ఆమెకు పుట్టింటి వారిని నిరంతరము తలపింప జేయునది "ఒడిబియ్యము" అను ఆచారము.

ఒడిబియ్యము

మామూలుగా తల్లిదండ్రులుగాని, అన్నదమ్ములుగాని ఆడుబిడ్డను అప్పుడప్పుడు పుట్టినింటికి పిలచుకొని వచ్చి నూతన వస్త్రములతోను, కట్నముల తోను, ఆదరించుదురు. అట్టి సంప్రదాయమున్నను మూడేండ్లకొక మారుగాని ఐదేండ్లకొక మారుగాని పురోహితుని సంప్రదించి మంచిదినమును చూచి ఆడుబిడ్డను పిలచి ప్రత్యేకముగా ఆదరించుటను ఒడిబియ్యమును పోయుట అందురు. అనగా ఒడిలో బియ్యమును నింపుట అని యర్థము. ఇది ఆమె ధనధాన్యములతో తుల తూగవలెననుటకును, పుట్టింటి వారు నిరంతరము ఆమెను ఆదరించు స్థితిలో నుండవలె ననుటకును, ఆమె ఐదువ తనమునకును సూచన కావచ్చును. ఒడిబియ్యమును పోయు దినమునకు ముందుగనే పుట్టినింటివారు తమ వసతి ననుసరించి ఆడుబిడ్డను పిలచుకొని వచ్చెదరు. ఒడిబియ్యము పోసికొనుటకు వెనుకటి దినము పుట్టింట ఆమె తప్పక ఒక నిద్ర చేయవలెనని ఆచారము. ఒడిబియ్యమునాడు ఆమె అభ్యంగ స్నానము చేయుట, కొత్త గాజులు తొడుగుకొనుట, కాలిమట్టెలు అరిగియుండిన అందుకొంత వెండిని చేర్చి కొత్త మట్టెలను ధరించుటమొదలగు నియమములు పాటింపబడును. కొత్త మెట్టెలను కంసాలి చేసియిచ్చువరకు మెట్టెవ్రేళ్లకు పసుపు దారమును కట్టుకొనుట. మెట్ట

లేని కాళ్లతో కడపదాటకుండుట. పచ్చిమంచినీరైనను నోట పోసికొనకుండుట పూర్వుల ఆచారము.

పెండ్లి అయిన మొదటి సంవత్సరమున "తొలి ఒడిబియ్యమును" పోయుదురు. మరు సంవత్సరమున "మలి ఒడిబియ్యమును" పోయుదురు. ఈ రెండు ఒడిబియ్యములకు ఘనముగా సారె బెట్టెదరు. సారెలో కుడుకలు, ఐదు లేదా మూడు రకముల పిండివంటలు, పసుపు, కుంకుమ, పచ్చపిండిని పెట్టెదరు. ఇవన్నింటిని పెట్టు పెట్టెను "సారెపెట్టె" అందురు. తొలి, మలి ఒడిబియ్యముల పిదప పైన పేర్కొనినట్లు మూడు సంవత్సరములకుగాని ఐదు సంవత్సరములుగాని ఆడు బిడ్డలకు ఒడిబియ్యమును పెట్టుట పద్ధతి. ఒడిబియ్యము పెట్టుట, సారె పెట్టుట అనుపదములు పర్యాయముగా వాడబడును. బియ్యములో పలుచగా పసుపునూనెలను కలిపి ఐదు లేదా తొమ్మిది సంఖ్యలో దువ్వెనలను, కాటుక కాయలను, కుంకుమ బరిణలను, కొబ్బరి గిన్నెలను, ఎండుఖర్జూరపు క్రొత్తపండ్లను, వక్కలను, తమలపాకులను, వెల్లుల్లి గడ్డలను, లక్కపూసలను, బట్టల మడుపులను కలుపుదురు. వీనితో ఒడిబియ్యము తంతు పూర్తియగును. తెలంగాణా ప్రాంతమునందు క్రొత్త అల్లుని, కూతురును, మొదటి దీపావళికి తీసికొని వచ్చినప్పుడు తొలి ఒడిబియ్యమును పోయుట పరిపాటి.

ఒక పెండ్లి అప్పగింతల పాటలో ఒక తల్లి బిడ్డకు నీతులు గరపుచు–

" ....

వదినాలు మరదులు వరుసకేమియన్న ఓపికలు కలిగి ఉండాలమ్మ నీవు

నీ తోటి యారాలు గిలకున ఏమన్న గలుకున ఎదురాడరాదమ్మ నీవు

ఏడాదికొక దినం దీపావళి పండుగనాడు తోలుక వత్తుమమ్మ నిన్ను

నీలిపట్టు చీర నిండుమొగ్గల రవిక వడి (ఒడి) నింతుమమ్మ నీకు

...."–[1]

– అని దీపావళి సందర్భమున ఒడిబియ్యమును పోయుటను పేర్కొనినది.

1. నేను సేకరించినది; పాడినవారు భారతమ్మ, రాయిప్రోలు.

ఒడినింపునప్పుడు పీటలపైన భర్తగాని వదిన మరదండ్ర వరుసలో నుండు స్త్రీలు గాని ఒడినింపుకొను స్త్రీకి తోడుగా కూర్చుందురు. ఆమెకు తల్లి నూతన వస్త్రములను కట్నమిచ్చును. కొత్త చీరెలో ఆమెకు ఐదుగురు ముత్తైదువలు ఒడినింపుదురు. ఆమెతో బాటు ఆమె అత్తమామలకును, ఆమె ఆడు బిడ్డలకును కట్నములను పెట్టుట పరిపాటి.

ఒడినింపునప్పుడు పాడు పాటలలో నొకదానినిట ఉదాహరించుచున్నాను.

పర్ణశాలల ఆడుదాము పనతి జానకీ
సౌసు ఆటలు ఆడుదామ సొగసూల జానకి
ఐదు ఐదుపోక వద్దలు (వక్క ముక్కలు) ఐదు తెచ్చిరి
బ్రాహ్మణుడు చెప్పిన గడియలకే ఓడినించిరి ॥పర్ణ॥
ఐదు ఐదుఖజ్జరిపండ్లు ఐదుతెచ్చిరీ
అమ్మ అవ్వలు మంచి గడియలకే ఓడినించిరి ॥పర్ణ॥
ఐదు ఐదు కొబ్బరి గిన్నెలు ఐదుతెచ్చిరి
వదిన మరదలు సంతోషంగా ఓడినించిరి ॥పర్ణ॥
ఐదు ఐదు రయికలు – ఐదు తెచ్చిరి
అనుకున్న యాళకే (వేళకే) ఓడినించిరి ॥పర్ణ॥
ఐదు ఐదు చీరలేమొ – ఐదు తెచ్చిరి
ఆనందముగా పాడుచు అతివకు ఓడినించిరి ॥పర్ణ॥-1

చివరన ముత్తైదువలు మంగళహారతి పట్టి పాటలు పాడుదురు.

ఒడి బియ్యమును పోసికొని ఆనాడే ప్రయాణమై అత్తింటికి వెళ్లవలెను. ఆనాడే వెళ్లుటకు వీలులేనివారు ఒడిబియ్యముతో బాటు (ప్రధాన ద్వారమును, వాకిలిని వెనుదిరిగి మరల యింటిలోనికి వచ్చెదరు. (ఒడి బియ్యముతో గడపలను దాటుచు గడపలను అలంకరించునప్పుడు పాడుపాటలను "అంపకములు" అను శీర్షికలో పేర్కొనినాను).

1. నేను సేకరించినది, పాడినవారు, బుజ్జమ్మ, కోయెడ.

అత్తింటికి వెళ్లి మంచి దినమును ఎన్నుకొని తన ఆడుబిడ్డలను, పుట్టింటివారిని, సన్నిహిత బంధువర్గమును పిలచి ఒడిబియ్యమును వండుదురు. మొదట గృహములోని ప్రధాన పరికరములైన రోలు, కుదురు, రోకలి, విసరురాతి, చల్లగుంజతో గూడిన కవ్వములను అలంకరించి విస్తరాకులలో ఒడిబియ్యపు అన్నమును, అన్నముపైన పెరుగు, బెల్లము, కొబ్బెర పొడిని పెట్టి నైవేద్యము పెట్టెదరు. కొందరు వీనితో బాటు కూరాడును కూడ పూజించెదరు. పిదప ఆ నైవేద్యములను ఇంటి ఆడు బిడ్డలు భుజించెదరు. ఈ ఆచారములో పరికరములు పవిత్రమైన భావముతో గౌరీదేవిగా పూజింపబడుటయు, ఆడు బిడ్డలు అధిక ప్రాధాన్యముతో గౌరవింపబడుటయు విశేషము. (పరికరములను పూజించు ఆచారమును "శ్రామిక గేయములు" అను ప్రకరణములోని "విసరురాతి పాటలు" అను శీర్షికలో పేర్కొనినాను).

భోజనానంతరము పేరంటాండ్రకు, గ్రామములోని కుటుంబములకు పుట్టింటినుండి తెచ్చిన సారెను పంచిపెట్టుదురు. జనులలో వ్యవహారమునందున్న "చీరెసారెలు పెట్టుట" అను ప్రయోగమును బట్టి స్త్రీ జీవితమున సారెకు గల ప్రాధాన్యము తెలియు చున్నది.

పుట్టింటి నుండి సారెతీసికొని వచ్చిన పిదప త్వరలో మరియొక మారు స్త్రీలు పుట్టింటికి పోయి నిద్రజేసి వచ్చెదరు. వరుసగా పండ్రెండు సంవత్సరములు పుట్టింటికి వెళ్లుటకు వీలుపడకపోయిన స్త్రీలు జీవితములో అటుపైన పుట్టింటి గడపను త్రొక్కకూడదు అను నియమము గలదు.

సాధారణముగా ప్రతి యువతియు మెట్టినింటి నూతన జీవితమునకు ఉవ్విళ్లూరుచుండును. కన్నవారింట ఎంత సుఖమున్నను మెట్టినిల్లే తనకు శాశ్వత స్థానము కనుక ఒకవైపు ఆందోళనమును, మరొకవైపు ఆనందమును పెనుగొనగ అత్తవారింటికి వెడలుటకు ఉబలాట పడుచుండును. ఇది స్త్రీ సహజము. ఆనందమునకు అవాంతరములుగా భయాందోళనములు ముంచెత్తినప్పుడు అత్తవారింటికి పోవుటకు భయపడు ఆడుబిడ్డలును కలరు. ఇది కేవలము భయమేకాని మెట్టినింటిపై ద్వేషముతో కాదు. అట్టి అకారణ భయమును జానపద స్త్రీ ఒడిబియ్యమును పోసికొని అత్తింటికి వెళ్లవలసిన ఒక అమాయకురాలి నోటినుండి ముచ్చటగా చెప్పించినది.

"చందమామ చీరగట్టి-సారబియ్యము ఒళ్లోబోసి
అమ్మనేను చిన్నదాన్ని-అల్లుడొస్తే అంపబోకు
డిల్లీ కోట సల్లగుంటె-దినానికి టంకం-[1] తెస్తా
చందమామ చీరగట్టి-సన్నబియ్యం ఒళ్లోబోసి
అమ్మనేను చిన్నదాన్ని-అల్లుడొస్తే అంపబోకు
మామవస్తే మల్లి రమ్మను-చద్దిగట్ట గుడ్డలేదు
సాగనంప ప్రొద్దులేదు-ఇరుగు పొరుగు అక్కలారా
ఒక్కటే తుమ్ము ఆచ్" -[2].

- ఈ అమాయకురాలికి కాపురమనిన గాబరా. కనుకనే అల్లుడు వచ్చినను, మామ వచ్చినను తనను పంపకుమని తల్లిని ప్రాథేయపడు చున్నది. తాను తల్లికి బరువుగా నుండననియు, ఢిల్లీకోట (ఢిల్లీ సామ్రాజ్యము అని అర్థము కాబోలు) చల్లగా నుండిన కాయకష్టముతో న్యాయమైన మార్గమున రోజుకొక్కరూపాయి సంపాదింతుననియు నమ్మబలుకు చున్నది. తల్లి తన ప్రార్థన వినక మొండిగా తనను అత్తివారింటికి బంపునేమోయని భయపడి అపశకునము లను సూచించుచు చద్దిగట్ట గుడ్డలేదనియు, సాగనంప ప్రొద్దులేదనియు, ఇరుగుపొరుగు అమ్మలక్కలను "ఆచ్"అని ఒక తుమ్ము తుమ్మి అపశకునమును సూచింపుమనియు పలుకుచున్నది. ఒంటి తుమ్ము కార్యవిఘ్నకారమని మనవారి విశ్వాసము.

"చద్ది" గట్టుట "అంపకములు" అను శీర్షికలో ప్రస్తావింపబడినది. నేటి కాలమునకు ఒడిబియ్యమును బోసి సాగనంపునప్పుడు ఈ ఆచారము పాటింప బడుచున్నది. పూర్వము నూతన ప్రయాణ సౌకర్యములు అందుబాటులో లేకపోవుట వలన బండ్లపైన, కాలినడకపైన ప్రయాణము చేయుచుండెడివారు గనుక ఒక ఊరినుండి మరొక ఊరికి ప్రయాణము చేయవలెననిన కనీసము కొన్ని గంటలు పట్టెడిది. దూరప్రయాణములైననిక చెప్పనే పనిలేదు. అటువంటి సమయమున మార్గమధ్యమున భుజించుటకు చద్దిని గట్టి సాగనంపెడి వారని ఊహింపవచ్చును. ఈ చద్దిలో పెరుగుతో కూడిన చద్దినే కట్టుట ఆచారము. పెరుగుభోజనము

1. టంకము - రూపాయి, టాకా అని హిందీలోను, బెంగాలీలోను వ్యవహరింతురు.
2. సెలయేరు - పుట - 92.

మార్గాయాసము వలన కలుగు బడలికను, ప్రయాణమునందు తగులు ఎండ వేడిమిని తగ్గించుననను దృష్టితో పెరుగు చద్దిని కట్టెడివారేమో, చద్ది మార్గములో భుజింపనవసరము లేకపోయినను నేటికాలమున చద్దిగట్టి పంపు ఆచారము మాత్రము మిగిలిపోయినది. చద్దిగట్టిన గుడ్డను "పాతగుడ్డేకదా" యని అలక్ష్యము చేసి పారవేయక ఉతికించి భద్రముగా తిరిగి పుట్టింటివారికి ఇచ్చివేయుదురు. ఒకవేళ మరచిపోయినను ఒడిబియ్యము వండిన నాడు భోజనమునకు వచ్చిన పుట్టింటివైపు వారు "ఆడు బిడ్డకెన్ని యిచ్చినను తక్కువేకాని చద్ది కట్టిన గుడ్డను, ఖాళీ అయిన ఫలహారముల గంపలను ఇవ్వగూడదు" నుచు చద్దిగట్టిన గుడ్డను, ఖాళీ చేసిన ఫలహారముల గంపలను మరచిపోకుండ అడిగి తీసికొని వెళ్లుదురు.

జీవిత చక్రము పిల్లలనుకని పెంచి పెద్దచేసి వివాహములు చేయుట, చీరె సారెలతో వారిని సంతృప్తి పరచుట-వంటి కార్యములతో సాగి పోవుచుండును. స్త్రీపురుషుల జీవితమున పాటలలో ప్రవక్తమగు చివరి ఆచారప్రదర్శక ఘట్టము మరణము.

మరణము

జనన మరణములు జీవితములో విడదీయరాని ద్వంద్వము. జన్మించిన వారు మరణించక తప్పదు. చిరంజీవులుగా ప్రసిద్ధిచెందిన ఏ అసాధారణ వ్యక్తిత్వము గలవారో తప్ప ఎంతటి దేవాంశసంభూతులైనను మరణింపక తప్పలేదు. జీవితము మూడునాళ్ల ముచ్చటైనను బ్రతుకు దెరువునకు ముప్పదియారుకోట్ల పద్ధతులను అవలంబించెదరు. జీవితమొక నాటకము, ఈ నాటకమునకు జననము నాంది పలికిన మరణము భరత వాక్యము పలుకును.

మరణము జీవి పరిణామ దశలో ఒక ఘట్టమనియు, మరణముతో మానవుని భావి దుఃఖములు కడతేరుననియు, మరణము పునర్జన్మయనునవి పాతపేలికను వదలి క్రొత్త గుడ్డను ధరించుట వంటిదనియు పలువిధములు విశ్వసించువారున్నను మరణముతో మన కట్టెదుట నున్న మానవుడు మాయమయి పోవును గనుకను మరుజన్మలో పూర్వజన్మ జ్ఞానముతో పుట్టుటయు, పెరుగుటయు

మనము చూడము గనుకను దుఃఖము పెల్లుబుకుట సహజము. అందునను స్త్రీలు కరుణామయులగుట వలన మరణము వంటి ఘోరాఘాతమునకు తట్టుకొనజాలక విలపించుట సహజము. స్త్రీ సహజముగ సంఘమున అన్ని దశల యందును ఇతరులపైన నాధారపడియుండుటవలన ఆమె మనసులోని ఆత్మరక్షణ భావమునకు భద్రత లేకపోవుటవలన సామాన్యమగు కష్టము గూడ విశేష దుఃఖమును కలిగించును. పురుషుడు దుఃఖమును సహించునుగాని సహజకోమల స్వభావియగు స్త్రీ దుఃఖమును సహింపనేరదు. ఆమెలోని వాత్సల్యముగూడ దుఃఖమునకు కారణమగును. "అతిస్నేహః పాపశంకీ" (స్నేహమెక్కువగా నున్నప్పుడు కీడునే శంకించును) అనులోకోక్తి ఆమెకు పూర్తిగా వర్తించును. తన భర్తకు, తన సంతానమునకు, ఆత్మీయులకు, నెచ్చెలులకు - ఏ చిన్న ఆపద కలిగినను ఆమె మనస్సు కలవరపడును. కనుకనే స్త్రీల పాటలలో కన్నీటి పాటలకు కొరత లేదు. పాంచభౌతికమైన యిష్టులదేహము మరణానంతరము పంచభూతములలో కలసిపోయిన వారి స్మృతి వీరిని వెన్నంటుచునే యుండును.

మరణము గురించియు, పరలోకమును గురించియు తత్త్వశాస్త్ర గ్రంథములేమి చెప్పినను జానపద స్త్రీకి తెలిసినది ఒక్కటియే-అది యిష్టజనుల వియోగము అనగా దుఃఖము.

మరణమును గురించి జానపదులలోను ఆదిమవాసులలోను విచిత్రమైన విశ్వాసములు గలవు. మరణించిన వారి ఆత్మ జీవించియున్నవారి భవితవ్యమును నిర్ణయించునని అటవిక జాతులవారు విశ్వసించుచున్నారు. కనుక పితృదేవతల శ్రాద్ధ కర్మలను జాగరూకతతో నిర్వహించుచున్నారు. సంవత్సరమునకొక్కసారిగాని అప్పుడప్పుడుగాని ఆర్థిక సౌకర్యము కలిగినప్పుడుగాని పితృదేవతారాధనము చేయుచున్నారు. అట్లు చేయని యెడల పితృదేవతలు తమకు స్వప్నములో దర్శనమిత్తురనియు తమకై పూజలు బలులు నిర్వహింపవలెనని తమ బంధు వర్గము నిర్బంధింతురనియు విశ్వసింతురు.-[1] పితృదేవతారాధనము వలననే

1. The Tribal Culture of India by L.P.Vidyarthy & B.K.Rai. page-246

మానవునికి విశేషశక్తులు లభించుననియు వారి విశ్వాసము. పితృదేవతలు ఐహిక విషయములలోను జోక్యము కలిగించుకొని మానవుని జీవిత గతిని మార్చెదరనియు వారి నమ్మకము. కనుక పితృదేవతారాధనము అటవిక జాతుల మతములో ప్రధానాంశమైనది.

నేడు ఆత్మ, పరమాత్మ విచారమెంత పెరిగినను, ఆ అనాదిజాతుల సంస్కార ప్రభావము వలననే శ్రాద్ధాదుల యందును శ్మశాన సమాధుల యందును భారతీయులకు ప్రబల విశ్వాసము కలిగినదని వాదించువారును గలరు. దానికి తార్కాణముగా వారు నేడు కొన్ని మతముల వారు సమాధులను, శ్మశానములను పవిత్రముగా భావించుటను చూపుచున్నారు. శ్మశానము హిందూమతమున శివుని నివాస స్థలము. అనగా భగవంతునికి ఆవాసమైన పవిత్రస్థానము. మరణించిన వారు అదే దేహముతో "బొందితో కైలాసమునకు వెళ్లెదరు" అను సామెతగా మరల జన్మించరను విశ్వాసము ప్రబలముగానున్న ఆచారమునకు ఇది నిదర్శమని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. "మరణించిన వారికిని బ్రతికియున్న వారికిని సంబంధము నిరంతరముగా నుండుననియు ఆ సంబంధమును కొనసాగించుటకు శ్మశానములను పవిత్రముగా నుంచుకొనవలెనను" విశ్వాసము కొన్ని ఆదిమ జాతులలో నేటికిని కలదని డబ్ల్యు జె. గూడే గారు పేర్కొనినారు. –[1]. పూర్వము తెలుగు దేశమునను నవీన శిలాయుగ దశలో ప్రజలు జీవి మరణానంతరము కొంతకాలము జీవించుననియు పిదప మరొక లోకమునకు పయనించుననియు విశ్వసించుచుండిరి. అందువలననే మృతుని శరీరమును అన్ని హంగులతోను సమాధి చేయు ఆచారముండెను. –[2]. ఈ ఆచారము ప్రాచీన కాలమున ముఖ్యముగా ఈజిప్టులో నుండినట్లు పిరమిడ్ల పరిశోధకుల వలన తెలియవచ్చినది.

ఈజిప్టులో మరణించిన వారిని ఒకచాపలో చుట్టి గొయ్యిత్రవ్వి మృతునికి సంబంధించిన అన్ని వస్తువులను ఆ శవము ప్రక్కన పెట్టి ఇసుకతో కప్పెడివారు. ఈ సమాధులలో అమూల్యమైన వస్తువులు గూడ నుండెడివి. ఈజిప్టు

1. Religion among the primitives - William J. Goode. page.187
2. మతములు–దర్శనములు(వ్యా). ఏటుకూరు బలరామమూర్తి. ఆంధ్రప్రదేశ్ దర్శిని, పుట–843

వాతావరణము పొడిగా నుండుట వలన సమాధులలోని శవములు ఎండిన ఎడారుల ఇసుక తగిలి రూపుచెడకుండెను. వస్తువులు కూడ ఉన్న రూపముననే ఉండెడివి. సమాధులను దోచుకొను దొంగలు వానిలోని వస్తువులను దొంగిలించి శవములను పారవేసినప్పుడు విజ్ఞాన శాస్త్రజ్ఞులు వానిని పరిశీలించి శవములు చెక్కుచెదరకుండ ఉంచుటకు వీలున్నదని గ్రహించిరి. ఇది "మమ్మీ" సంప్రదాయమునకు దారి తీసినది. ఈ పద్ధతి ద్వార ఈజిప్టు రాజవంశముల వారి శవములను భద్ర పరచెడివారు. దీనికి కారణము ఆ దేహము వారి పరలోక యాత్రకు సాధనమగునను విశ్వాసమే. మమ్మీ అనగా మైనముతో కలిసిన కొన్ని రసాయన ద్రవ్యములతో శవమును భద్రపరచు ప్రక్రియ. ఈ ప్రక్రియలో తొలిదశ యందు తేనె మైనమువాడెడివారు. పిదప రసాయన వస్తువులతో భద్రపరచు పద్ధతి కనుగొన బడినది. మొట్టమొదట మైనము వాడుట వలన తరువాత దానిని వాడక పోయినను ఈ ప్రక్రియకు "మమ్మీ" అను పరిభాష యేర్పడినది. రాజవంశీయులు వారి వైభవమున కనుగుణముగా ఈ సమాధులపై మహోన్నతములగు కట్టడములను కట్టిరి. వానికే పిరమిడ్లని పేరు. –[1]

మృతకళేబరములను చెడిపోకుండ భద్రపరుచుట మన దేశమునను ఉండినట్లు భాసుని ప్రతిమా నాటకము వలన తెలియు చున్నది. "రామ సుధార్ణవమున శ్రీరామ వియోగమున మరణించిన "దశరథుని శరీరంబు తైలంబులోన పక్వంబు" జేసి భరతుడు వచ్చునందాక కాపాడియుంచిరట. –[2] కోయలలో గూడ శవములను కాపాడుటకు నొక రకపు లేపము వాడుకలో నుండెను. చనిపోయిన వాని దేహము మొట్టమొదట పరిశుభ్రముగా కడిగి వేయబడు చుండెను. పిమ్మట మృత కళేబరముపై పాలను ఒత్తుగా చిలికి, బొగ్గును పసుపు కొమ్ములను వేరువేరుగా పొడియగునట్లు చేసి ఈ రెండు పొడులను ఇప్పనూనెలో కలపి రంగరించి శవమునకు పట్టించెడి వారు. –[3]

1. సాహితీసుగతుని స్వగతం–తిరుమల రామచంద్ర. పుటలు–203, 204
2. తెలుగు జానపద గేయ సాహిత్యము పుట–750.
3. తెలుగువారి చరిత్ర 7000 ఏండ్ల క్రిందట నారంభమైనది. (వ్యా) టేకుమళ్ల రామచంద్రరావు, భారతి, శ్రావణమాసము, ఈశ్వర సంవత్సరము. పుట 225.

జీవులు పంచభూతాత్మకమగు శరీరమును వదలి ఎన్నియో యుగములు దాటిన పిదప ఈ శరీరమునే మరల ఆశ్రయించుననియు అవి తిరిగి వచ్చునప్పటికి ఈ శరీరము కానరాకపోయినా దిగులు పడుననియు తలచి ఈజిప్టు దేశీయులు చేసినట్లు శవములను చాలాకాలము భద్రపరచక భారతీయులు దహన సంస్కారము చేసినను ఆ జీవులు వేరే లోకములో నుండియు తమ మీద ఆపేక్ష పెట్టుకొనియే యుందురనియు తలచి తద్దినములు, మంత్రములు, పిండములు, తర్పణములు, తీర్థవిధులు మొదలైన యెన్నో ఆత్మశాంతి ఉపాయములు నిర్మించి నేటికిని పాటించుచునే యున్నారు. –[1]

భారతీయులు పూర్వము మరణించిన వారిని ఖననము చేసిరా, దహనము చేసిరా అను చర్చ చాలాకాలము సాగినది. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఈ విషయమున తమ అభిప్రాయమునిట్లు ప్రకటించిరి. "సింధూనది తీర నాగరికతలోని అవైదికమైన మరియొక ముఖ్యాంశము– మృత కళేబరములేమి చేసిరి అనునది త్రవ్వకములలో కళేబరములు బయటపడుటచేత శవములను కాల్చలేదు. పాతిపెట్టారని తెలియుచున్నది. వైదిక సంప్రదాయము దహనము చేయుటయే. జీవాత్మ తిరిగి ఈ లోకమునకు వచ్చి తన శరీరములో ప్రవేశించునను నమ్మిక వలన పాతిపెట్టుచుండెడివారేమో! పునర్జన్మ సిద్ధాంతమునకిది ఆరంభదశయేమో!" –[2]

శవమును దహించుట వైదికార్యుల విశిష్టాచారము. ఒకప్పుడు ఆర్యులుగా నుండి పిదప వారినుండి విడిపోయిన ఈరాన్ దేశపు పార్సీ మతస్థులు (జరథుస్త్రాసుయాయులు) శవములను దహించుటగాని పూడ్చిపెట్టుటగాని చేయ కుండిరి. వానిని ఎత్తైన ప్రదేశముపై వదలి వచ్చుచుండిరి. నేటికిని పార్సీలలో ఈ ఆచారమున్నది. ఆర్యులలో అతి ప్రాచీన కాలములో శవములను బయలులో వదలి వచ్చుట ఉండెనేమో! దానిని ఈరానీలు అనుసరించి యుండవచ్చును.

1. భూతములు–భౌతికశాస్త్రములు–(వ్యా) గరిమెళ్ల సత్యనారాయణ. భారతి, శ్రావణమాసము, యువసంవత్సరము. పుట 287.
2. ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర చరిత్ర–ప్రథమ భాగము– మూలం–సర్వేపల్లి రాధాకృష్ణన్ అనువాదం సరిపెల్ల విశ్వనాథశాస్త్రి. పుట 29.

మహాభారతములో పాండవులు అజ్ఞాతవాసమునకు వెళ్లునప్పుడు తమ ఆయుధములను శవాకారముగా కట్టి జమ్మిచెట్టుపై వ్రేలాడగట్టిన కథ కలదు. దానిని "గొల్లలు మున్నగు క్షుద్రజనులు చూచి అదేమని ప్రశ్నించినప్పుడు

"ఇది శతవృద్ధు. మాజనని, యిప్పుడు మృత్యువు బొందె, ఇట్లు సే
యుదుము, కులప్రవృత్తమగుచున్న సనాతన ధర్మమిత్తెఱం
గ, దహన కర్మ మొల్లమదిగా నిదిగా మును నిశ్చయించి మా
మొదలిటి వారొనర్చు విధముం గొనియాడితి మేము నియ్యెడన్" –[1]

– అని పాండవులు సమాధానమిచ్చిరి. దీనిని బట్టి శవములను చెట్లకు కట్టుట భారతీయార్యుల ఆచారమై యుండెననియు కాలక్రమమున దానిని వారు వదలుకొనిరనియు పార్సీలు మాత్రము దానిని వదలుకొనలేదనియు మనమూహింపవచ్చును. రాక్షసులు శవములను పూడ్చుచుండిరని రామాయణము నందున్నట్లు సురవరం ప్రతాపరెడ్డిగారు తెలిపినారు.–[2]

శవములను కాల్చకుండటకు కారణము పునర్జన్మతోబాటు, కర్మసిద్ధాంతములపై విశ్వాసము కావచ్చును. మొట్టమొదటి వేద భాగములలో అనగా ఋగ్వేదములో కర్మ సిద్ధాంతము ఛాయా మాత్రముగనే యున్నది. కాని ఉపనిషత్తులలో కర్మ, పునర్జన్మ సిద్ధాంతములు సర్వేసర్వత్ర కననగును. మృతజీవి తన భవిష్యత్తును నిర్ణయించుకొని ఈ లోకమునకు వచ్చునను విశ్వాసము వలన శవములను కాల్చు ఆచారము లేకుండెను. సన్యాసుల శవములను భూస్థాపితము చేయుట ఈనాటికిని ఆచారము. వారి శవములను కాల్చరు. ఒకప్పుడు సర్వసాధారణముగానున్న పద్ధతియే ఈ సన్యాసులలో ఛాయామాత్రముగా మిగిలినదని మనము భావింపవచ్చును. సన్యాసులు యోగశక్తి వలన తిరిగి ఈ లోకమునకు వచ్చి తమ శరీరమునే ఆశ్రయింతురను నమ్మిక వలననే వారి శరీరములను దహించు ఆచారము లేనట్లు కనబడుచున్నది.–[3]

1. శ్రీమదాంధ్ర మహాభారతము. విరాటపర్వము. ఆ. 1 ప. 178.
2. రామాయణ విశేషములు–సురవరం ప్రతాపరెడ్డి
3. ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర చరిత్ర–ప్రథమ భాగము. పుట–30.

తెలుగువారి సంప్రదాయమునసనుసరించి అవివాహితులను ఖననము చేయుట, వివాహితులను దహనము చేయుట నేడు ప్రచారము నందున్నది. దీనిని బట్టి దహన సంస్కారమున ఆర్య అర్యేతర, వైదిక వైదికేతర సమన్వయము జరిగినట్లు మనమూహింప వచ్చును.

మరణించినవారి ఉత్తమలోక ప్రాప్తికై చేయు అంత్యక్రియలు, మాసికములు, వార్షిక శ్రాద్ధములు మున్నగు పితృమేధమంతయు ప్రేతారాధన అవశేషమేనని కొందరు భావించుచున్నారు. మొదటి వార్షిక శ్రాద్ధమును తెలుగున "ఏడూడి" అనియు, తరువాతి వార్షికములను "శ్రాద్ధము, లేక తద్దినమ" నియు అందురు. శ్రాద్ధము దుఃఖకరమైనది గనుక చనిపోయిన దినమని చెప్పుటకు సంకోచించి దానిని ఆ మాటతో ఉచ్చరింపక తద్దినము (తత్ + దినము - ఆ దినము - చనిపోయిన దినము అను నర్థము స్ఫురించునట్లు) అను వ్యవహారము తెలుగు దేశమున కలిగినది. ఈ అర్థవిపరిణామము తెలుగులో జరిగినదేగాని సంస్కృతము లోనిది కాదు.–[1] ఇట్టి కర్మలేగాక పితృ పక్షముల యందును శ్రాద్ధ కర్మలు చేయుదురు. కొన్ని ప్రాంతములలో వార్షిక శ్రాద్ధములను కూడ మహాలయ పక్షము నందు వారు చనిపోయిన తిథినాడు ఆచరించుట కలదు. భాద్రపద బహుళ పాడ్యమి మొదలు ఆశ్వయుజ శుక్ల పాడ్యమి వరకు పదునారు రోజులు మహాలయములు. మహాలయములను గూర్చిన విశ్వాసము తెలుగువారిలో నిట్లున్నది:– మహాలయ పక్షమున అగస్త్యుడు, వాతాపి, ఇల్వలులను చంపి పితృతృప్తి చేసినందున ఈ పక్షమున పితృదేవతల గూర్చి పెట్టినది అక్షయ మగుననియు, కుశ, యవ. తిలాదులు పితృప్రీతికరమైన వనియు పితరులు వరమిచ్చిరి. ఈ పదునారు రోజులుగాని, శక్తి లేని వారొక్క రోజైనగాని పితరుల గూర్చి శాద్ధము చేయుట సకల సంపత్తుల నిచ్చును. లేనిచో పితృదేవతలు శపింతురు. అందును ద్వాదశినాడు యతుల గూర్చియు, చతుర్దశినాడు కత్తి దెబ్బలతో గాని నూతిలో పడిగాని చనిపోయిన వారి గూర్చియు, ఆశ్వయుజ పాడ్యమినాడు దౌహిత్రుడు మాతామహుల గూర్చియు పెట్టుట ముఖ్యమైనది."–[2]

1. అర్థ విపరిణామ పద్ధతి–దువ్వూరి వేంకటరమణ శాస్త్రి.
2. మన పండుగలు – తర్కాచార్య భాషాప్రవీణ కంభంపాటి రామగోపాల కృష్ణమూర్తి పుట – 81.

మరణాసన్న కాలమున గంగాజలమును సేవించుట, గోదానము చేయుట వంటి పనులపై హిందువులకు విశ్వాసము మెండు, హిందువులకు గంగానది, గోవు చాల పవిత్రమైనవి. గంగలో ఒక్కమారు స్నానము చేసినను సకల పాపములు తొలగిపోవునని హిందువుల విశ్వాసము. అందుకే "గంగా స్నానము, తుంగాపానము" అనునానుడి యేర్పడినది. మరణాసన్నుడు తన ఉత్తమ గతి ప్రాప్తికై గంగాజలమును సేవించుట ఆచారము. అట్లే ఉత్తమ గతికై గోదానము చేయుదురు. నేడు రవాణా సౌకర్యములు విస్తరించుట వలన గంగస్నానము సులభతరముగాని, పూర్వము గంగాస్నానము చేసి వచ్చుట యనిన పునర్జన్మ వంటిదే. అందుకనియే "కాశికి పోయినవాడు కాటికి వెళ్లిన వాడు" ఒకటే యను సామెత యేర్పడినది. ప్రతివానికిని గంగాస్నానము సంభవము కాదు గనుక ఎవరైనను తెచ్చియిచ్చు గంగాజలమును భద్రపరచుకొని మరణాసన్నులకు ఒకటి రెండు ఉద్ధరుణులు నోట పోయుదురు. అట్లే తులసీదళ జలమును గూడ పోయుదురు.

మరణించిన వ్యక్తిని గడ్డిలో వేయుట, అతని తలగడ చెంత దీపము వెలిగించుట, గడప చెంత గడ్డపారను వేయుట, ఇంటిముందు ఆరని మంటను రగుల్చుట ఆచారము. దీని వలన భూతప్రేతములు తమకు హాని కలిగించవని జానపదుల విశ్వాసము. ఉత్తర ప్రదేశమునందలి తూర్పుభాగమున మరణించిన వాని ప్రక్కన నిప్పుచేసి ఒక ఇనుప ముక్కయు, ఒక ఉల్లిగడ్డను ఉంచుదురు. దీని వలన మరణించిన వాని భూతము గూడ వచ్చిన చెంతనున్న వారికి ఏమియును హాని చేయదని వారి విశ్వాసము.–[1]

జగత్తంతయు మిధ్యయనునది తెలిసినను బంధువులు తమ ఆత్మీయుల పుట్టుకనాడు సంతోషమును, చచ్చిననాడు దుఃఖమును అనుభవింపక మానరు. నిష్కల్మష హృదయములతో నుండు జానపదులు తోటి మానవుల పుట్టుక చావులకు చలించెదరనుటలో సందేహము లేదు. చచ్చినవారి ఆత్మబంధువుల దుఃఖమునకు చూడవచ్చిన గ్రామీణుల సానుభూతి తోడగును. చచ్చినవారితో అనుబంధ

1. Folk Culture and Oral Tradition - Sahab Sing, Srivastava. page.127

ముందు ఊరిలోనివారు రాగముతీసి కరుణాత్మకముగా వినువారి గుండెలు తరుగుకు పోవునట్లు చచ్చిన వ్యక్తి మంచిని పేర్కొందురు. మరణించిన వారిలో చెడువున్నను ఆ సమయమున వారి దృష్టి నుండి తొలగిపోయి మంచి మాత్రమే వారి కనులకు కనుపించగా చచ్చిన వ్యక్తికి లేని గొప్పతనమును గూడ ఆపాదించి మరీ యేడ్చెదరు. వ్యక్తి శవమున్నంత వరకును గతమును స్మరించుకొనుచు విలపించుచునే యుందురు.–[1] కొందరు కడుపులోలేని దుఃఖమును గూడ వెళ్లగ్రక్కుచు "చచ్చినవాని కండ్లు చా (చే)రడేసి" అను విధముగా చచ్చినవారి గొప్పను గోరంతలు కొండంతలు చేసి ఏడ్చుచుందురు. "మనివుండంగ మల్లి చూడలేదు గాని చచ్చినంక సమాధిమీద పాడి బఱ్ఱెను కట్టేసింద్రట" అను సామెతగా కల్ల బొల్లి యేడ్పులేడ్చు వారును నుందురు. మరణించినవారి ఆత్మీయులకు దుఃఖముతో ఏమియు తోచక విలాపముతోనే కాలము గడచిపోవును. ఈ సమయమున పాటలు పాడు తీరికగాని, ఆలోచన గాని, ఓపిక గాని వారికుండదు. ఆశ్రితులైన పాటక జనము పరామర్శకు వచ్చి మరణించినవారి గుణగణములను కీర్తించుచు పాడుచుందురు.

మరణించినవారు మగవారైయుండి, ఊరిలో ఏ కొద్దియో గొప్పయో పేరు ప్రసిద్ధులు గడించిన వ్యక్తులై యుండిన వారిని ఆశ్రయించుకొనియుండు పాటక జనము వారి గొప్పదనమును మరింత గొప్పజేసి చెప్పుదురు.

చిలుకోయమ్మ చిలుక ఓరామ చిలుకా
పుట్టిండు పులిపిల్ల ఓరామ చిలుకా గుజ్జవారింట్ల ఓరామ చిలుకా
ధీరుడు నారాయణరెడ్డి " వీరుడు నారాయణరెడ్డి ఓరామ చిలుకా"
దేవదేవన్నాడు రామ " దేశాలు ఏలిండు "
రామరామన్నాడు రామ " రాజ్యాలు ఏలిండు "
ఏడమ్మ మీనాయన " ఏడగాన రాడు "
పాపకారి శివుడు " పాపుకు పోయిండు "
దోసకారి శివుడు " దోసుక పోయిండు ఓరామ చిలుకా "

1. పెండ్లికి వాద్యాలు, చావులు ఏడ్పులు అందము – అని జానపదులలో వాడుక

మీనాయన మీకుంటె	"	మీకెంత నయముండు	"
పండుగన్న రాబోదు	"	పబ్బమన్నా రాబోదు	"
ఎనుక ఏడునూర్ల మంది	"	ముందల మున్నూరు మంది	"
ఏడమ్మ మీనాయన	"	ఏడగానరాడు	"
సూసుకుందామంటే	"	సుట్టాలల్ల లేదు	"

పాడుకుందామంటే ఓరామ చిలుకా బలగముల లేదు ॥పాప॥

రామరామన్నాడు రామ	"	రాజ్యమేలిండు	"
దేవదేవన్నాడు రామ	"	దేవలోకమేలిండు	"
పదిమంది మోయంగ	"	వేయిమంది ఎంటనడువంగ ఓరామ చిలుకా"	
అన్నాల నెడబాసి రామ	"	కొడుకులా నెడబాసి	"
పోయిందు నారాయణరెడ్డి	"	పోయిన నారాయణరెడ్డి	"
మళ్లొస్తె బాగుండు	"	మీనాయన మీకుంటె బాగుండు	"–[1]

పై పాటలో తండ్రి మరణించిన దుఃఖించు బిడ్డలచెంత వారి పొలములో కాయకష్టము చేయు కూలీ జనము చేరి పాడు పద్ధతి తెలుపబడినది. ధీరుడు నారాయణరెడ్డి అను పాదములోనున్న నారాయణరెడ్డి అను పేరు వ్యక్తి పేరుగాను "ఏడమ్మ మీనాయన" అను పాదమున మరణించిన ఆ వ్యక్తితో సంబంధము గలవారిని సంబోధించుట గలదు.

ఆడవారు మరణించిన ఆడవారికి సంబంధించిన విశేషణములను ప్రయోగింతురు.

---

1. నేను సేకరించినది. మా చిన్నాన్నగారి మరణకాలమున రాసులోల్ల బుగ్గమ్మ పాడినది. రాయిప్రోలు. (ఇట్టి పాటలను మరణకాలమునందే కాని యితర సమయములలో పాడరు. పాడిన ఏదైన అశుభము జరుగునని భావించెదరు.)

లచ్చువరాల రామారే అనంతరామారేరామ

బాలగదా రాములమ్మ రామారేరామ బంగారు బొమ్మ రామారేరామ

చిత్తారి చిన్నికదా " చిన్నారి రాములమ్మ "

రాపోలు ఊరిల " రంగైన మేడల "

రత్నాల రాసుల్ల " వజ్రాలామెరుపుల్ల "

కదలాడింది కాంత రాములమ్మ రామారేరామ రాదమ్మయింక "

బంగారు కడియాల రామారేరామ బాలకదరాములమ్మ "

కడియాల గణగణల " కదిలివచ్చింది "

కండ్లల్ల దీపమోలె " కనిపిచ్చిన "

కానరాకుండ పోయింది " కానలను దాటింది "

సూసుకుందామంటె " చూపలకైనా లేదు "

నలుగురూ మోయంగ " పదిమంది చూడంగ "

నూరుమంది నడవంగ " ఊరంత ఏడువంగ "

కన్నపిల్లలను రాములమ్మ " కాదని పాయె (పోయె) "

పండుగన్న రాబోదు " పబ్బమన్న రాబోదు "

మీయమ్మ మీకుంటె " మీకెంత నయముండు "

చీరెట్ల కట్టింది " చిక్కుడు పూవలె "

రైకెట్ల తొడిగింది " రంగు ఎలవకుంట "

బంగారి బొట్టు " బారి బొమ్మల సందున "

కురుస బొమ్మల సందున " కుంకుమ్మ బొట్టు "

చిన్ని రెప్పల సందున " సల్లన్ని కాటికే "

మీయింటి లచ్చిమి " మీయమ్మ–రాములమ్మ "

మిమ్ములను కాదని " మమ్ములను కాదని "

మీ యమ్మ రాములమ్మ " దేవతలల్ల కలిసింది "

ఏడువకుండ్రి బిడ్డ " ఉన్నంతసేపు "
మీయమ్మ మొఖము " నూసుకోండ్రిబిడ్డ "
యియ్యాల తప్పుతే రామారే రామ మల్ల(మరల)కానరాదు రామారే రామ పుణ్యం
చేసుకుంది రాములమ్మ" ముత్తయిదువ చావు
చచ్చింది రాములమ్మ.-[1]."

– ముందు పాటలో వలెనే "రాములమ్మ" అను చోట మరణించిన వ్యక్తుల పేరును పేర్కొందురు. ఆ మరణించిన వ్యక్తుల బంధువులు ముందుగనే దుఃఖమున నుందురనిన ఈ చూడవచ్చిన వారి పాటరూపమైన పలకరింపులతో మరింతగా బాధ పడుదురు. కొందరి దుఃఖము శ్మశాన వైరాగ్యముతో తొలగిపోదు. వారిని నిరంతరము బాధించుచునేయుండును. మరణించినవ్యక్తి స్మృతి పథమున వచ్చినప్పుడెల్లను దుఃఖము పొంగుచునేయుండును. తల్లి, తండ్రి, భార్యా, బిడ్డ మొదలగు ఆప్తులు మరణించినప్పుడు కలుగు దుఃఖము నిరంతరము బాధించుచునే యుండును. ఒక జానపదుని భార్య మరణించినది. ఆమె అందచందములను, పనులను స్మరించుకొని విలపించినప్పటి దుఃఖ భారమును ఈ క్రింది పాటలో మనము కనవచ్చును. ఈ పాట పురుషుడు పాడినదైనను అతని ప్రాణప్రదమైన భార్యకు సంబంధించినదై, భార్యనెడ అతనికిగల అనురాగమును వ్యక్తీకరించుచుండుట వలన నిట గ్రహించితిని.

"సుద్ధ బొందలకాడ –[1] నీ
సుద్ధి –[2] దియ్యంగానే
సద్ది –[3] దిన్నట్టాయెనే సిలకా–సిన్నారి సిలకా
ఇంతెల్ల –[4] మెడ బాసెనే సిలకా
ఎంత పాపపు దేవుడే సిలకా

1. నేను సేకరించినది పాడినవారు – రాసులోల్ల బుగ్గమ్మ – రాయిప్రోలు.
2. మాట
3. చద్ది
4. ఇంత వేగిరముగా.

సమర్తయై నీవు సాటుకు-[1] కూకుంటె-[2]
సత్తె భామానందురే సిలకా-సిన్నారి సిలకా
పసిద్దెయి-[3] నువ్వొక్క పందిట్ల గూకుంటె
పార్వతీ దేవందురే సిలకా-సిన్నారి సిలకా
ముత్తైదవై నువ్వొక మూలకు గూకుంటె-
ముద్దబంతివందురే సిలకా-సిన్నారి సిలకా
ఇద్దరము తినేటి ఆ బొడ్డు గిన్నెలా
ఒక్కనికి ఒనరాయెనే సిలకా-సిన్నారి సిలకా
ఇద్దరము కప్పేటి మద్దికాయల దుప్పటి
ఒక్కనికి ఒనరాయనే సిలకా సిన్నారి సిలకా-[4]

– ఈ గీతములో జానపదుడు తనకు పరిచితమైన నుడికారముతోను, మాటలతోను దుఃఖమును వెళ్లబోసుకొనుట అతి కరుణాత్మకమై శ్రోతలకు కన్నీరు దెప్పించును. చనిపోయిన భార్య ప్రసక్తి వచ్చినంతనే ఆ జానపదునికి చద్దితిన్నట్లు కడుపునిండి సంతృప్తియైనదట. డా॥ బి. రామరాజుగారు ఈ వాక్యములోని నుడికారమును "కడుపునిండుగా నేడ్చిన యాజానపదుని భావము నంతటిని పుణికి పుచ్చుకొనినది" అని జానపద నుడికారమును ప్రశంసించిరి. –5 సమర్థయైన భార్యలో సత్యభామను, "ప్రసవించిన భార్యలో పార్వతీదేవిని తిలకించిన ప్రేమైక జీవి. ఆమె ఐదువరాలై యలంకరించుకొనినప్పుడు ఆమెలో తాను నిత్యము తిలకించు ముద్దబంతి పూవును చూచినాడు. దంపతులిద్దరును కలసి భుజించిన బొడ్డు గిన్నె, కప్పుకొనిన మద్దికాయుల దుప్పటి ఇప్పుడు తానొక్కడే వాడుచున్నందులకు దయనీయంగా విలపించినాడు. ఆత్మీయుల వియోగ దుఃఖము వర్ణనాతీతము.

1. చాటుకు
2. కూర్చుంటె
3. ప్రసవించి
4. త్రివేణి – పుట – 275. ఇదియే పాటను నేను సాతని రంగమ్మ (గడ్డం మల్లయ్య గూడెము) పాడగా సేకరించితిని.
5. తెలంగాణా జానపద గేయములు (వ్యా) డా॥ బి. రామరాజు, తెలంగాణం (మొదటి భాగం) పుట – 148.

ఇట్లే తల్లిని కోల్పోయిన పిల్లల దుఃఖమును–[1] తనతో ఆడుకొనిన చెలికాడు చనిపోగా విలపించు బాలిక కరుణార్ద్ర హృదయమును–[2] వ్యక్తముచేయు గేయములును, ఇతర దుఃఖ గేయములును స్త్రీ సాహిత్యమున అపారముగా గలవు. అచ్చటచ్చట పిల్లిమీదను, దూడమీదను–3 మిషపెట్టి వలపుకాని చావునకు శోకించు పడచుల ధర్మేతర సంబంధములలోని విలాప గేయములును ఇందు తావు చేసికొనినవి.

భార్యా భర్తలలో నేయొక్కరు చనిపోయినను గొడ్డలిపెట్టువంటి ఆ దుఃఖ భారము మరొకరిని జీవితాంతము కృంగదీయుచునే యుండును. దానికి తోడు స్త్రీ జీవితమున సంఘము అడుగడుగున ఆమె దురదృష్టమును ఎత్తి చూపుటకు చెరగని ముద్ర వేయును. అదియే వైధవ్యము. దానితో స్త్రీలు వివాహ సంప్రదాయముననుసరించి పొందిన నల్లపూసలు, మంగళ సూత్రము, మట్టెలతో బాటు పసుపు కుంకుమలు, పుష్పములు, గాజులు–వంటి అలంకరణ వస్తువులకు కూడ దూరమై వికృతరూపమును దాల్చెదరు. సంఘ సంస్కర్తల పుణ్యమా యని స్త్రీలకు నేడు కొంత మేలు జరిగినను జనపదములలో మాత్రము వారి స్థితి వ్రేలెత్తి చూపెట్టునట్లుగానే మిగిలిపోయినది. ముందే పేర్కొనినట్లు జానపదులు మార్పును తొందరగా స్వీకరించరు. జనపదములోని స్త్రీలలో అనాదిగా వచ్చుచున్న సంప్రదాయములలో నెట్టి మార్పులను చేసినను తనతో బాటుగా తన వంశమునకు కీడు సంభవించునను విశ్వాసము ప్రబలముగా నుండుట వలన నూతనమైన మార్పులకు వారు ఒప్పుకొనక ప్రాచీన సంప్రదాయము ననుసరించియే ప్రవర్తించుచుందురు.

విధి వక్రించి వైధవ్యము ప్రాప్తించకుండ జానపద మహిళ బుద్ధి తెలసినది మొదలు తాను భర్త కనులముందు సుమంగళిగా మరణించుటను కాంక్షించి భగవంతుని వేనోళ్ల ప్రార్థించుచుండును. ఆమె లోకమంతయు తన భర్తతో కూడిన

1. త్రివేణి పుట – 276.
2. త్రివేణి పుట – 277.
3. త్రివేణి పుట – 247.

కుటుంబమే కనుక తనభర్త ఎట్టివాడైనను తాను "ఉత్తమ యిల్లాలు" గా మనుట వలన సద్గతులు కలుగుననియు తనకు ముత్తైదు చావు ప్రాప్తించిన చాలుననియు భావించును.

"ముత్తైద కుంకుమ నొష్టికుంటె జాలు
చేతెడు గాజులు చేతుల కుంటె జాలు
నాకు బెట్టిన పసుపు చెంపల కుంటెజాలు
నాయొక్క మంగళ సూత్రం గట్టి గుంటెజాలు
నాయొక్క నల్లపూసలు మెడ నుంటె చాలు –[1].

– పాటలో ముత్తైదువ తనముపై స్త్రీకి గల కోరిక ఎంత దృఢమైనదో మనం చూడవచ్చు.

పై పరిశీలన గమనించిన సంఘమున ఆచార పరిరక్షణలో స్త్రీలపాత్రకు గల విశిష్టత విదితమగును. అణకువ తోడుగాగ జాతీయ సంప్రదాయమునకు భద్రపేటికలై "భారతీయ ఉత్తమ సంస్కృతికి నెలవులు–తపోవనములు, జానపద ములు" అని తపోవనములతో బాటుగా జానపదములును కీర్తింపబడుటకు కారకులైనారు జానపద మహిళలు.

1. త్రివేణి పుట – 301.

వ్రతోత్సవ గేయములు

మానవుడు సహజంగా సగుణోపాసకుడు. తన మనోభావాలను, వాంఛలను తీర్చుకొనుటకు తన ఊహననుసరించియే దైవస్వరూపమును నిర్ణయించుకొని ప్రార్థనలను జరుపును. ప్రకృతిలో సంభవించు వైపరీత్యములు, సూర్యచంద్రుల ఉదయాస్తములు, అంబరమును చుంబించు పర్వతములు, మనము చూచుచుండగనే ఎన్నియో ఆకారములు సంతరించుకొని ఎక్కడికో పరుగిడుచు, గర్జించుచు, వర్షించు మేఘములు, కంటికందని దూరముల వరకు వ్యాపించిన సముద్రములు, ఏదియో పనియున్నట్లు, తీరికయే దొరకనట్లు పరుగిడుచున్న నదీనదములు మానవునకు సగుణోపాసనమున ఉపదేశకములై యుండును. ఈ ఉపాసనములు, ప్రార్థనలు వ్రతములకును, నోములకు కారణమై యుండును. తన ఇష్టదైవమును సంతృప్తిపరచి అభీష్టసిద్ధి పొందుటకు మానవుడు కొన్ని నియమములను పాటించుట పాడి అని భావించును. పరిశుద్ధ మనస్సుతోను బాహ్యపారిశుద్ధ్యముతోను చేయు ప్రార్థనకు తన ఇష్టదైవము సంతృప్తిచెంది తనను అనుగ్రహించునని విశ్వసించి ఉండును.

ఇవన్నియు ఏకాకారమై ఒక ఆచారముగా నేర్పడియుండును. ఈ ఆచారములు ప్రాంతీయ భేదములతో సమాజమున రూఢమై సంప్రదాయ స్వరూపమును సంతరించుకొని యుండును. దానిని పాటించు వారు తరువాతి తరములవారి సౌలభ్యమునకై, సంప్రదాయము అవిచ్ఛిన్నముగా కొనసాగుటకై కొన్ని కట్టు దిట్టములు చేసిరి. నేటి వ్రతోత్సవముల స్వరూపమునకు మూలమిదియే యని నా అభిప్రాయము. ఆ కట్టుదిట్టములే ధ్యానం, మంత్రం, జపం, పూజ, ఉద్యాపనము మున్నగు సంప్రదాయములుగా తరువాతి వారికి లభించినవి. స్థూలముగా వ్రతములు, పండుగలు, తిరునాళ్ళు, జాతరలు మున్నగు ఉత్సవముల స్వరూపమిదియే, ఈ దృష్టితోనే మన వ్రత పూజాగ్రంథములు వీనిని నిర్వచించినవి.

వ్రతములు

మన నిఘంటుకారులు వ్రతమునిట్లు వివరించిరి. వాచస్పత్య నిఘంటుకారుడు "భక్షణభేదే....పుణ్యసాధనే ఉపవాసాది నియమభేదే చ"-పుణ్యసాధనము కొరకు ఉపవాసాది నియమములతోచేయు కార్యమునకు వ్రతమని అర్థము చెప్పెను. దానినే అతడిట్లు వివరించెను- "వ్రతమనగా దృఢసంకల్పముతో అనుష్టింపదగిన పని. అది ప్రవృత్తి నివృత్తి రూపములుగా రెండు విధములు. భోజనము, పూజ మొదలగునవి ప్రవృత్తి రూపమగు వ్రతములు. ఉపవాసములు జరుపుట మొదలగునవి నివృత్తి రూపవ్రతములు. ప్రవృత్తిరూపమనగా కొన్ని పనులకు పూనుకొనుట. నివృత్తి అనగా కొన్ని పనులను మానివేయుట, ఈ వ్రతములు నిత్యనైమిత్తిక కామ్యములని మూడు విధములు. తప్పనిసరిగా చేయవలసిన ఏకాదశి వంటి వ్రతములు నిత్యవ్రతములు. చాంద్రాయణము మొదలగునవి నైమిత్తికములు-అనగా అప్పుడప్పుడు కలుగు కారణములను బట్టి చేయునవి. కామ్యములనగా ఏవియో కోరికలతో ఆయా తిథులలో చేయునవి."-[1] "పత్రం పుష్పం ఫలం తోయం" అన్నట్లు భక్తికొలదిగా, శక్తికొలదిగా ఈ పూజలాచరింపవచ్చును.

ఈ వ్రతములు వందలకొలది ఉన్నవి. డాక్టరు పుష్పేంద్ర కుమారన్నట్లు "వ్రతములనొనర్చుట స్త్రీ పురుషులిరువురకును విధి అయినను ముఖ్యముగా స్త్రీలకే - వివాహితలుకాని, అవివాహితలుకాని, విధవలుకాని-ఉద్దేశించినట్లు తోచుచున్నది. తమ ఇష్టదైవములను స్త్రీలు పూజించుటవలనను, వారి అనుగ్రహమునకు వ్రతములు చేయుటవలనను పతిసుత బంధుమిత్రాదులకు సకల సౌఖ్యములు, సకలైశ్వర్యములు కలిగి వారి ప్రేమాదరములు తమకు కలుగునని విశ్వసించుచున్నారు. ఇట్లు ఈ వ్రతములు ఇహ పరలోకములలో వివిధ సుఖములు కలుగునను వాగ్దానములతో స్త్రీ లోకమును కుటుంబ జీవితమునకే కట్టుబడి యుండునట్లు చేయుచున్నవి."-[2]

---

1. వాచస్పత్యము.
2. Shakti cult in Ancient India - Dr. Pushpendra Kumar (Bharatiya Publishing House Varanasi (1974) pages.213-214.

శ్లో ॥ వ్రతోపవాసాన్ ఖలుయో విధత్తే
దారిద్ర్యపాశం సభినత్తి చాశు,
వ్రతోపవాసేషు రతస్య పుంసః
సైనాపద శ్శాంతి ముశంతి తజ్జ్ఞాః-[1]

– అనగా వ్రతములు ఉపవాసములు చేయువారు తన దారిద్ర్యమును పోగొట్టు కొనుచున్నాడు. వ్రతోపవాస నిరతుడైన మానవునికి ఆపదలు సంభవింపవని ప్రాచీనులు చెప్పుచున్నారు. ఈ విశ్వాసము అనాదిగా అన్ని దేశముల వారికిని ముఖ్యముగా స్త్రీలకు కలదు. కనుక పురోహితులు స్త్రీలకున్న ఈ విశ్వాసమును చక్కగా నుపయోగించుకొందురు. రావు బహద్దూర్, బె. ఎ. గుప్తే అన్నట్లు "ప్రపంచమందంతటను మహిళలే పురోహితుల వ్యాపారమునకు అనువైన సరకు. కనుకనే హిందూ స్త్రీల ప్రత్యేక వినోదార్థమై గోపద్మ, పంచదేవ, శుక్రవారవ్రత, నాగపంచమి వంటి అనేక వ్రతములు కల్పింపబడినవి. అట్లే శాస్త్రమునందు పండుగలు కొన్నియే యున్నను పురాణములలో వాని సంఖ్య పెరిగినది. పిదప సామాన్య ప్రజలు అనేక గాథలను త్రవ్వి వానికి ఎన్నియో కథలు కల్పించి వానిని అసంఖ్యాకముగా పెంచిరి.–[2]

ఐతాంబ సంతానము లేక ఎన్నో నోములు నోచెను. ఎన్నో దానము లొనరించెను. పేద బ్రాహ్మణుల వివాహముల నొనరించెను. అయినను లాభము లేకపోయెను. ఆమె విష్ణుకాంత నోము, సంధ్యవర్తి నోము, చీకటింటి నోము మొదలయిన నోములను నోచెను. అయినను లాభం లేకపోయెను. చివరకు 'గజనిమ్మ నోము' వలన తన కోరిక నెరవేరునని విని ఆ వ్రతమునకు పూనుకొనెను. ఈ వ్రతము ఒక సంవత్సరము జరుపబడునట.–[3]. ఇట్లు నోములు తమ వైశిష్ట్యమును పెంచుకొనినవి.

---

1. హిందువుల పండుగలు – సురవరం ప్రతాపరెడ్డి, పుట–4.
2. హిందువుల పండుగలు – సురవరం ప్రతాపరెడ్డి – పుట – 8.
3. పల్నాటి వీర చరిత్ర–శ్రీనాధుడు, పుట – 53 – 58. సంపాదకుడు – పండిత శ్రీ ఉమాకాంత విద్యాశేఖరు.

వందల సంఖ్యలోనుండు వ్రతములను, నోములను చూచిన వానిని ఆచరించు వారికి నిత్యకృత్యములు చేయుటకును తీరిక లభింపదేమో యను సంశయము కలుగును. దీనికి తార్కాణముగా నేడును తెలుగుదేశమున పెక్కురు ఇల్లాండ్రు నిరంతరమును ఏవియో వ్రతములు ఆచరించుట, నోములు నోచుట చూచుచుందుము. ఇట్లు చేయుట కొందరికి కొంత ఛాందసముగా తోచినను వాని పరమార్థము తమకేగాక ఇరుగు పొరుగు వారికి కూడ సుఖసంతోషములు, పరలోకమున మోక్ష ప్రాప్తి కనుక వానిని నిత్యజీవితము నుండి తొలగించుటకు వీలుపడదేమో యని భావింపవలసియున్నది.

తెలుగువారి నోములు వ్రతములు మన ప్రాచీనుల విశ్వాసములకును, ప్రాచీన సాంఘిక చరిత్రమునకును దర్పణములై కానవచ్చుచున్నవి. మన పూర్వులు ఆటవిక స్థితియందుండి నాగరికతా దశకు వచ్చిన వైనము ఈ వ్రతములలో ప్రస్ఫుటమగుచున్నది. వీనిని చారిత్రక దృష్టితో చూచినచో సంప్రదాయ పరిరక్షణములుగా కన్పించును. ముఖ్యముగా జానపద సాహిత్యములోని స్త్రీల పాటలు మనకు అనూచానముగా సంప్రదాయ విజ్ఞానమును అందించుచున్నవి. కనుకనే ముసలి ముత్తైదువలు వేదమువలె ఈ పాటలను చిన్న వారికి నేర్పుట, వారు ఆ పాటలను మంత్రమువలె ఆయా నోములలో, పూజలలోగాని, పూజానంతరముగాని పఠించుట నేటికిని చూచుచున్నాము.

కృష్ణశ్రీగారన్నట్లు "ఈ వ్రతముల పాటలు కేవలము ప్రభు సమ్మితముగా వ్రతములను చేయుట వలన కలిగే ఫలితమును బోధించును."-2 వ్రతము లొనరించుట వలన కలుగు లాభములను, వనరించకపోయిన కలుగు కష్టనష్టములును ప్రజల మనస్సులలో నాటుకొనిపోయి వారిని వ్రతములొనరించు వైపునకే మరలించును.

---

1. స్త్రీల గేయ కథలు(వ్యా) కృష్ణశ్రీ-భారతి, జూన్ 1953 పుట-33.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారన్నట్లు "స్త్రీలకు బాల్యము నుండియు సదాచార సంపత్తినలవరచుటకే ఈ నోములు అచారము ఏర్పడినదని ఊహింపనగును. ఈ వ్రతములలో బాల్య, యౌవన, కౌమార, వార్ధక్యములనెడి చతుర్వయో దశలందును ఆచరించు వ్రతములున్నవి. చిరుత ప్రాయమున స్త్రీలు కోరవలసిన సామాన్య సుఖసంతోష ప్రాప్తి మొదలుకొని వార్ధక్యమున వాంఛించు కైవల్య ప్రాప్తి వరకు ఆచరింపదగిన వ్రతములు ఉండుట చూడ స్త్రీలకీ వ్రతములనే సకలార్థ సారస్వతమున మున్నూటరువది వ్రతములు కలవని ప్రతీతి. కాని మన తెలుగునాట దాదాపు రెండువందల వ్రతముల కంటె ఎక్కువ ప్రచారమునలేవు."-1 అందులోను అందరికి తెలిసినవి కొన్ని మాత్రమే.

ఈ వ్రతములలో కొన్ని సంవత్సరము పొడగునను చేయునవి, కొన్ని పెక్కు సంవత్సరములు ఆచరించునట్టివి. ఏక సంవత్సర వ్రతమనగా రథసప్తమిగాని శివరాత్రినాడుగాని ప్రారంభించి ఏడాదిపాటు చేయునవి. పెక్కు సంవత్సర వ్రతములనగా సంవత్సరములో ఒక మాసముగాని ఒక దినమునగాని పెక్కు సంవత్సరములపాటు ఆచరించునవి.-2 వీనిలో వయోభేదము ననుసరించి కన్యలు పట్టు నోములు, వివాహితలు పట్టు నోములు, వృద్ధులు పట్టు నోములు పెక్కు గలవు. కొన్ని వయోభేదము లేక తిథివార నక్షత్ర నియమము లేక అందరును చేయదగినట్టివి. ఇవి శృంగార వర్ధకములు. సౌభాగ్యకరములగు నట్టివి. స్త్రీలాచరించు నిత్య శృంగారము నోము, ఉదయ కుంకుమ నోము, దంపతి తాంబూలము నోము - మొదలగునవి ఈ శ్రేణిలో చేరును. నిత్య శృంగారపు నోములో ప్రతి సాయంకాలమున ఒక ముత్తైదువను పసుపు పారాణులతో అలంకరించి తల దువ్వి యద్దము చూపి తాంబూలమునిచ్చి ఆశీర్వాదమును పొందుదురు. ఉదయకుంకుమ నోములో తెల్లవారకమునుపే యొక ముత్తైదువకు కుంకుమ బరణినింద కుంకుమనిచ్చి తాను గూడ కుంకుమ పెట్టుకొని అలంకరించుకొనవలెను. దంపతి తాంబూలము నోము దాంపత్యము

1. నోములు (వ్యా) - కనుపర్తి వరలక్ష్మమ్మ - విజ్ఞాన సర్వస్వము - 4వ సంపుటము పుట - 904.
2. మిన్నేరు - పుట - 219.

అన్యోన్యముగా నుండుటకు ఆచరింతురు. ఈ నోములో దంపతులకు తాంబూలము నిచ్చి వారి ఆశీర్వాదమును పొందుదురు – పొందుదురనుటకన్నను పొందెడివారను భూతకాలిక సమాపక క్రియను వాడిన సమంజసముగా నుండును. ఇవన్నియు పాతకాలపు ముచ్చట్లు.

స్త్రీలు తమ ఆదర్శములను సాధించుటకు పట్టుదలతో, భక్తి శ్రద్ధలతో, దీక్షతో, నోములనో వ్రతములనో ఆచరించి ఒక విశిష్టమైన శారీరక మానసిక క్రమశిక్షణను అలవరచుకొనినారు. –[1] అంతేగాక వానిని స్త్రీలు తమ జీవితములో పరమ పవిత్రమైన కార్యములుగా నెంచినారు. వ్రతనియమముల ననుసరించి ఉపవాసాది కఠోర నియమములను పాటించుటకు వెనుకాడలేదు. నియమ భంగమైన వ్రత భంగమయినట్లే, వ్రత భంగమయిన ముసలి భర్త లభించుటయు, సవతి పోరు ఏర్పడుటయు, కుంటీ, గ్రుడ్డి వంటి అవకతవకలు గల పిల్లలు కలుగుటయు వంటి శిక్షలకు గురియగుదుమను భయము వారిని వెన్నంటు చుండును. కనుక వ్రతభంగము జరుగకుండునట్లు జాగ్రత్త పడెదరు. వ్రత భంగమయిన వ్రతము పునరావృతమగును. రాను రాను కాలముతోపాటు వ్రత నియమములోను మార్పులు కలిగినవి.

స్త్రీలు సంతానవతులగుటకు, కలిగిన సంతానము చల్లగా నుండుటకు పోలాల అమావాస్య, కందగౌరి; ముసలిభర్త రాకుండుటకు అట్లతద్ది; వివాహమునకు కల్యాణ గౌరి; భర్త ఆరోగ్యము కొరకు ముని కార్తీక వ్రతము; భార్యాభర్తలు విడివడకుండ నుండుటకు దంపతి తాంబూలములు; వైధవ్యము రాకుండుటకు శ్రావణ మంగళవారము, మంగళ గౌరి, సావిత్రి గౌరి, కాటుక గౌరి, మాఘ గౌరి, సంపదలకు వరలక్ష్మి వ్రతము, వావిలి లక్ష్మీవారము, వెలగ గౌరి, ములగ గౌరి, గుమ్మడి గౌరి, మొదలయిన వ్రతముల నాచరింతురు. ఇక వ్రతములనాచరించుటలో సంభవించిన లోపములు తొలగిపోవుటకు లక్షవర్తి వ్రతము, అన్నంముట్టని ఆదివారము; రజోరోష నివారణము కొరకు ఋషి పంచమీ వ్రతములు సలుపుదురు.

---

1. తెలుగు మహిళ – వ్యాసము – ఇల్లిందల సరస్వతీదేవి – తెలుగువాణి– ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, ఉగాది–1975.

ప్రస్తుతము వృక్షపూజ ప్రాధాన్యములేని వ్రత గేయములను మొదట పేర్కొని తరువాత వృక్ష ప్రాధాన్యము గలిగిన వ్రతగేయములను పేర్కొందును.

శ్రావణ మంగళవారం – మంగళగౌరి వ్రతం :

మన సంప్రదాయమున వర్ష ఋతువునకు విశేష ప్రాధాన్యమున్నది. ఆకాశమున ఎటుజూచినను పరుగిడు నల్లని మబ్బులు, వర్షపు జల్లులుపడి జలకము లాడినట్లు పరిశుభ్రముగా కనిపించు చెట్టుచేమలు, అప్పడే మొలకలెత్తి కన్నుల పండువగానుండు పచ్చని పంటచేలు, నిండుగా ఎంతో వేగముతో గంభీరముగ పారు నదులు, ఎటుచూచినను మనకు ప్రకృతి ఆనందమును కలిగించును. ఒకప్పుడు – ఒకప్పుడేమి ఇప్పుడును వానకాలమున పనులు సాధారణముగా ఎవ్వరును తలపెట్టరు, చేయరు. ఇప్పుడున్న రహదారులుగాని, ప్రయాణ యానములుగాని పూర్వము లేనందున మన పూర్వులు ఉన్నచోటనే ఉండి తమ వృత్తులకు అనుగుణమైన శిక్షణను పొందుటయో, తమకు తెలిసినవానిని ఆ వృత్తి చేయుటయో, తమ శిష్యవర్గమునకు తెలుపుటయో చేయుచుండిరి. ఇది దాదాపు నాలుగు నెలల కాలము జరుగుచుండెను. దీనికి "చాతుర్మాస్య" మని పేరు. దీనిని చాతుర్మాస్య వ్రతమని సంప్రదాయకులు వ్యవహరింతురు. ఇది ఆషాడశుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు జరిపెడివారు. చాతుర్మాస్య ప్రాముఖ్యము రామాయణ కాలమునాటికే ప్రసిద్ధము.–[1] ఈ ఋతువులలో వానలు పడుట, వానలు ఆగిన వెంటనే మబ్బు విడిచిన ఎండలు తీవ్రమగుట వలన శరీర ఆరోగ్యము చెడకుండా ఆహార పానీయములలో మార్పులను వైద్యశాస్త్రజ్ఞులు చెప్పిరి. ఏయే కూరగాయలను తినవలెనో, ఏయే పండ్లను భుజింపవలెనో అను నియమములను ధర్మశాస్త్రజ్ఞులు కూడ వైద్యక మతానుసారముగా తెలిపియున్నారు. భీష్ముడు శేష ధర్మములలో చాతుర్మాస్యము స్త్రీలకు ముఖ్యమని చెప్పినాడు. స్త్రీలకేగాక సన్యాసులకు ఇది ముఖ్యము.–[2]

చాతుర్మాస్యవ్రత దీక్షలో "బెల్లము విడిచిన మధుర సర్వసిద్ధి, నూనె వర్జించిన నంగసౌందర్యము, యోగాభ్యాసముచే బ్రహ్మపదము, శాకము త్యజించిన పక్వాన్న

1. కిష్కింద కాండము – 27 – 48.
2. మన పండుగలు – కంభంపాటి రామగోపాల కృష్ణమూర్తి – పుట – 50.

సిద్ధి, పాదాభ్యంగము విడిచిన సుగంధ దేహసిద్ధి, దధి, దుగ్ధము, తక్రము విడిచిన విష్ణుసాలోక్యము, స్థాలీయందు వండిన యన్నము విడిచిన మిగుల వంశాభివృద్ధి, భూమిపై దర్భశయ్యను శయనించిన విష్ణు భక్తుడును, భూమియందు భుజించిన నృపత్వము, మధుమాంసములు విడిచిన ముని యగును" అని పేర్కొనబడినవి. –[1].

వైదిక ధర్మమును అనుసరించని బౌద్ధజైన ధర్మానుయాయులు కూడ ఈ వ్రతమును చేసెడివారు. అనగా నాలుగు నెలలు ఎచ్చటికిని కదలక పూజలు–పురస్కారములు, ఉపన్యాసములు– ఉపదేశములు చేయుచుండిరి. బుద్ధుడు చాతుర్మాస్య వ్రతము ఆచరించుచుండినట్లు జాతక కథలలో పెక్కుచోట్ల కలదు. బౌద్ధులు చాతుర్మాస్య సమాప్తిలో కార్తీక పూర్ణిమనాడు గొప్ప ఉత్సవమును జరుపుచుండిరి. దీనిని కత్తిక సక్ఖత, కత్తికరత్తి, కత్తికఛనకార్తీక నక్షత్ర, కార్తీక రాత్రి, కార్తీకక్షణ (ఉత్సవము) అని వ్యవహరించుచుండిరి. జైనులు నేటికిని చాతుర్మాస్య వ్రతములను నియమనిష్ఠలతో ఆచరించుచున్నారు. చాతుర్మాస్యమున జైనులు స్నానోత్సవము నొకదానిని మిగుల వైభవముతో నడపుచుండిరి. దీనిని "చాతుర్మాసియమజ్జణాయ ఉత్సవ"–"చాతుర్మాస మజ్జనోత్సవ" అని వ్యవహరించు చుండిరి. –[2]

ఈ చాతుర్మాస్య వ్రతము. మాతురూపమే ఈ నాలుగు నెలలలోను నేడు పలువర్ణములవారు జరుపు నోములు, వ్రతములు మున్నగునవి. కనుకనే, నేటికిని ఆషాఢమాసములో కొన్ని పనులు చేయకుండుట, ఇల్లు కదలకుండుట ఆచారమై యున్నది. ఈ చాతుర్మాస్య వ్రతములో భాగమై శ్రావణ మంగళ, శ్రావణ శుక్రవారము మున్నగు పెక్కు వ్రతములు గలవు.

పచ్చగ కనిపించు ఈ శ్రావణమాసమును మన పూర్వులు హిరణ్యవర్ణన లక్ష్మీదేవిగాను, గౌరీదేవిగాను భావించినారు. అట్లే సరస్వతిగాను భావించినారు.

ఎటుచూచినను శ్రావణమాసము మొదలుకొని నాలుగైదు నెలలు పేరంటాంద్ర సంభ్రమముతో తెలుగువారి యిండ్లు కలకలలాడుచుండును. "పసుపు

1. ధర్మసింధువు – బ్రహ్మశ్రీ కాలూరి రామశాస్త్రిగారు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు 1954, పుట – 80.
2. హిందువుల పండుగలు – పర్వములు పుట – 108 – 111.

కుంకుమకు పదామడలైన పోవలెన"ను నమ్మకము కలిగిన తెలుగు మహిళలు పేరంటమునకు ఎంతదూరమైనను వెళ్ళుటకు వెనుకాడరు.

శ్రావణ మంగళవారము నోము వివాహితలు, కన్యలును పట్టెదరు. వివాహమయిన మొదటి సంవత్సరము మొదలు వరుసగా ఐదు సంవత్సరములు శ్రావణ మాసములోని ప్రతి మంగళవారమునాడును ఈ నోము నాచరించెదరు. వ్రత నియమమునసుసరించి యథావిధిగా మంగళగౌరిని పూజించి మొదటి సంవత్సరము ఐదుగురు ముత్తైదువులకును, రెండవ సంవత్సరము పదిమందికిని, మూడవ సంవత్సరము పదునైదుగురికిని, నాలుగవ సంవత్సరము ఇరువది మందికిని, ఐదవ సంవత్సరము ఇరువదైదు మందికిని పసుపుబొట్టు, తాంబూలము, పచ్చి శనగలు ఇచ్చి నమస్కరించి ఆశీర్వాదములు పొందవలెను. ఈ వ్రతము ఐదు సంవత్సరములు జరిపినవారు మట్టెలు, మంగళసూత్రము ముప్పయిమూడు జతల అరిసెలు కొత్త కుండలోపెట్టి రవికగుడ్డతో దానికి వాసెనకట్టి దక్షిణ తాంబూలములతో వివాహ కాలమందు క్రొత్త పెండ్లి కుమార్తెకు వాయనమివ్వవలెను. అట్లు క్రొత్త పెండ్లి కూతురు చేత వ్రతమును ప్రారంభింపజేసి నట్టగును. కాని ఈ పద్ధతిలో మార్పులు చేర్పులు అవసరములనుబట్టి స్త్రీలు చేయుచున్నను వ్రతము నాచరించుటయందు మాత్రము లోపమును కల్గించరు.

దీనికొక చిత్రమైన కథ కలదు. సంతానములేని రాజదంపతులు శివునిగూర్చి తపమును చేసిరి. శివుడు వారికి జంగమవేశముతో ప్రత్యక్షమయ్యెను. రాజపత్ని భిక్షము వేయుటకురాగా "పుత్రపౌత్రులు లేరు, మీ చేతి భిక్షంబు హరహర అంటరాదు" అని నిరాకరించెను. రాజ దంపతులిద్దరును బ్రతిమాలుకొనగా అతడు ప్రసన్నుడై వారి యిష్టానుసారము పుత్రుని ప్రసాదించెను. కాని అతడు అల్పాయుష్కుడు, మంగళగౌరి వ్రతమునకై పూవులు కోయుటకు వచ్చిన ఒక రాజకుమార్తెతో అతనికి వివాహమయ్యెను. ఆ రాజకుమార్తె పేరు సత్యవతి. వారి శోభనమునాటి రాత్రికే రాజకుమారుని ఆయువు మూడెను. రాజకుమారి స్వప్నమున మంగళగౌరి ప్రత్యక్షమై మేలుకొలిపెను. ఆయుస్సు మూడిన

రాజకుమారుని చంపుటకు ఒక పాము అక్కడ కనిపించెను. రాజకుమార్తె బంగారు బిందెను తెచ్చి అటనుంచగా ఆ పాము ఆ బిందెలో ప్రవేశించెను. సత్యవతి ఒక క్రొత్త రవికెతో బంగారు బిందెకు వాసనగట్టి యుంచెను. ఇట్లు గండము తప్పిన పిదప– ఈ గండము సంగతి అతనికేమియు తెలియదు– రాజకుమారుడు కాశీకి వెళ్ళెను. అతడు తిరిగివచ్చిన పిదప సత్యవతి బంగారు బిందెను చూపి తన భర్తను కాపాడుకొనిన విధమును తెలియజేసి "సత్యంబు తప్పక మాంగల్యములు గల మంగళగౌరిను పూజించితిని" కనుకనే మంగళగౌరి తన భర్తను రక్షించెనని చెప్పెను. అప్పటినుండి ఈ వ్రతము లోకమున ప్రచారమందినది.–[1] కొన్ని మార్పులతో ఈ కథయే "స్త్రీల వ్రత కథలలో" కలదు.–[2]

అందుకనియే ఈ వ్రతము వైధవ్య నిరాకరణ వ్రతముగా ప్రశస్తిని బడసినది. వ్రత రత్నాకరము ఈ వ్రత వైశిష్ట్యము నిట్లు పేర్కొనుచున్నది. "సర్వలోకపాలని యగు పరాశక్తి యనుగ్రహమున వైధవ్యము తొలుగునని, ఆమె మంగళగౌరి యను నామమున ముత్తైదువులచే పూజింపబడుచున్నది. ఆమెను ప్రతి మంగళవారం పూజింపవలయును. విశేషించి శ్రావణ మాసమున మంగళ వారములయందు తప్పక పూజింపవలయును. ఆమెను హరిద్రా, కుంకుమ, పుష్ప, సుగంధాది మంగళ ద్రవ్యములయందును, గోఘృతముతో వెలిగింపబడిన దీపమున జ్యోతి రూపమునను ధ్యానించి పూజింతురు.

త్రిపురాసుర సంహార సమయమున ఆమెను ఈశ్వరుడు పూజించి జయమందెను. అంగారకుడీ దేవతను పూజించుటచే తారామండలమున నొక గ్రహరాజమై విరాజిల్లుచు మంగళవారమునకధిపతియై యున్నాడు. మనువంశ మున మంగుడను ప్రభువీజననిని పూజించి పుత్రపౌత్ర సంపత్సమృద్ధి కలిగి తడవుకాలము సుఖమనుభవించెను. –[3].

శ్రావణ మంగళవారము పాట సుప్రసిద్ధమైనది ఒకటి కలదు.

---

1. తెలుగు జానపదగేయ సాహిత్యము, పుటలు – 421, 422.
2. స్త్రీల వ్రత కథలు – పుటలు – 25 – 30.
3. వ్రత రత్నాకరము – ద్వితీయ భాగము – వావిళ్ల రామస్వామి శాస్త్రుల అండ్ సన్స్ మద్రాసు, పుట – 386.

"ఈశ్వర పుత్రునకు గజావతారునకు
పార్వతీ తనయునకు భక్తితోను
వాక్యశుద్ధి నిచ్చు వైభోగరాయునకు
శారదాంబను నేను సన్నుతింతు"
జయమంగళం నిత్య శుభమంగళం
మంగళ గౌరీ కథ మహిమీద వెలసిన
పాటగావించె తా భక్తితోను
మహిమీద ఒక రాజు సంతానములేక
సౌభాగ్యవతి పదవి తానేలు చుండె ॥జయ॥

– అంతట పరమేశ్వరుని అనుగ్రహమువలన ఆ రాజునకు పుత్రుడు కలుగును.

"సూర్యతేజంబుతో నొప్పేటి సుతునికి
పుత్రోత్సవము పుట్టె పుణ్యశాలి(కి)
సంతోషమున రాజు నామకరణము వ్రాసె
నారాయణ యని నామమిడిరి.
– అని కథ సాగును. విషయము తెలియని అత్తగారు
"ఏమినోమి నోచితివి, ఏవ్రతము చేసితివి
పుత్ర భిక్షంబెట్టె పుణ్యశాలి"

– అని కోడలును ప్రశ్నించగా కోడలు

"భాగీరథిని చాల భక్తితో పూజిస్తే
మీవంటి అత్తమామలు కలుగుటకు
ఎక్కువ రాజ్యము మిక్కిలి సంపదా

– కలుగుటకు మంగళ గౌరిని పూజించితినని సమాధానము చెప్పును. ఈ పాటలో ఫలశ్రుతి కూడ చెప్పబడినది.

"ఈ కథను పాడిన వారికి విన్నవారికి
ఆవును విభవంబులు
ఇష్ట సంపదలిచ్చు రాజపదవినిచ్చు
సత్ఫలంబు నిచ్చు సర్వేశు రాణి ॥జయ॥ –[1]

శ్రావణ మంగళగౌరి వ్రతములను వివాహమైన సంవత్సరము నుండి ప్రారంభించి అయిదు వత్సరములు చేయుదురనుట విదితమే. నియమ నిష్ఠలతో నాచరించు వారి ఆచరణలో నుండు నియమములు క్రింద పేర్కొనబడినవి; అయిదవ సంవత్సరమున శ్రావణ మంగళవారమునందు పగలు యథావిధిగా మంగళగౌరీ పూజసమాచరించి దంపతులుపవశించి రాత్రి మంటపాదికమును నిర్మించి యందు పదునారు కలశములను స్థాపింపవలయును. ఆ కలశములయందు ఉమామహేశ్వరులను, బ్రహ్మను, గణపతిని, స్కందుని, శచీ పురందరులను, సప్త మాతృకలను, లక్ష్మీనారాయణులను, సావిత్రిని, సమస్త దేవతలను నవగ్రహములను పూజింపవలయును. అశక్తులగు వారైదింటి నుంపవలయును. లేకున్న రెండైన నుంపవలయును. ప్రతి యామమునందు జాగరణ యుక్తులై పూజింపవలయును. మరునాడు సుస్నాతులై శాస్త్రోక్త విధానమున బెల్లము, జీలకర్ర, పరమాన్నము, నెయ్యి, రావి సమిధలు, దూర్వాంకురములు వీనితో హోమము చేయవలయును. "సర్వ మంగళ మాంగల్యే" అను మంత్రము ప్రధానము. పదునారు వెదురు పాత్రలయందు మంగళ ద్రవ్యములనుంచి సువాసినులకు వాయనముల నివ్వవలయును."–2

ఇప్పటికిని తెలుగువారి కుటుంబములలో నూతన వివాహితులాచరించు "మంగళ గౌరీ" వ్రతములో ఈ నియమములు ఛాయా మాత్రముగానైన మిగులుట ఆంధ్రులకు గల సంప్రదాయాభిలాషను వ్యక్తమొనరించుచున్నది. నూతన వధువు శ్రావణ మంగళవారములలో నొక మంగళవారము పుట్టింటను మిగిలిన మంగళవారములత్తింటను జరుపుకొనుట పరిపాటి. ప్రొద్దుట వ్రతపూజను గావించి

1. స్త్రీల పాటలు – పుటలు – 44 – 47 ఎస్.వి. గోపాల్ అండ్ కంపెని.
2. వ్రత రత్నాకరము – ద్వితీయ భాగము – పుట – 396.

సాయంత్రము పేరంటాండ్రను ఆహ్వానింతురు. పూజానంతరము వీలుననుసరించి వచ్చిన ముత్తైదువులకు తాంబూలముతో కూడిన గుగ్గిళ్లను (నానబోసిన శనగలు లేదా పెసర్లు) వాయనముగా నిచ్చెదరు. ఇచ్చునప్పుడు వ్రతమాచరించిన స్త్రీలు "వాయనమిస్తి" ననియు వాయనము తీసికొను స్త్రీలు "వాయనము పుచ్చుకొంటి, లేదా తీసుకుంటి" ననియు పలుకుదురు. అయిదు సంవత్సరములు వరుసగా ఆచరించిన పిదప చివరన పది మొదలు పదునారు, జంటలకు (దంపతులకు) నూతన వస్త్రములనిచ్చి భోజన తాంబూలములతో వారిని తృప్తిపరుచవలెనను నియమము కలదు. ఇట్లిచ్చుటకు శక్తి లేనివారు ఆ సంవత్సరపు శ్రావణ మాసములోనేగాక ఆ సంవత్సరము తమ యింటిలోనయినను, బంధువుల యింటిలోనయినను జరుగు వివాహ సందర్భమున ఒంటినిండ వస్త్రములను ఇచ్చుటకు మారుగా స్త్రీలకు రవిక గుడ్డలను, పురుషులకు ఉత్తరీయములను సమర్పించుకొందురేగాని వ్రత నియమములు ఉల్లంఘించరు.

ఈ వ్రతములో స్త్రీలు వ్రతగ్రంథములు చెప్పిన ప్రకారము పదునారు దీపముల పొగమసిని తమ భ్రూమధ్యమునందు పెట్టుకొని దానిని తమ బంధుమిత్రులకును ఆహుతులైన ముత్తైదువలకును పంచుదురు. "ఈ భ్రూమధ్య ప్రదేశము కుండలినియొక్క ఆజ్ఞాచక్రము. ఈ ప్రదేశము కుండలిని సూచించును. అంతేగాక జ్ఞాన విజ్ఞాన వివేక బుద్ధులకు మార్గదర్శకమగును. దీనిని జ్యోతిగను చెప్పుదురు. యోగముద్ర మూలమున జ్యోతిని లక్ష్యముగా పెట్టుకొని ఉపాసించవలెను. యోగాభ్యాసమునకు నాసాగ్రమున దృష్టి నిలుపవలెను.-[1] అనుట శాస్త్రవిదితము.

గౌరీదేవి జనులచేత యెల్లప్పుడును పంటల నొసగు దేవతగ పరిగణింప బడుచున్నది.-[2] అందుకు నిదర్శనముగా ఆ మాసములో లభించు ధాన్యపు గుత్తులతోను, పుష్పములతోను గౌరీదేవిని ఆరాధించుట, వచ్చిన పేరంటపు స్త్రీలకు మొలకలెత్తిన పెసలుగాని, శనగలుగాని స్త్రీలచే పంచిపెట్టబడుట

1. Universal Religion by R.N.Suryanarayana. P.P.40-41.
2. మన పండుగలు - వ్రతములు (వ్యా) శ్రీమండ నరసింహం. భారతి జనవరి 1946, పుట - 135.

గ్రహింపవచ్చును.

ఆంధ్రులలో మంగళగౌరి వ్రతమింతగా ప్రాచుర్యమును పొందినను ప్రత్యేకముగా మంగళగౌరీ దేవాలయము లెచ్చటను కానరావు. కాని గయా క్షేత్రమున మంగళగౌరీ యను నొక శక్తి గుడి యున్నట్లు ఏనుగుల వీరాస్వామిగారు పేర్కొనిరి. –[1]

శ్రావణ మంగళవారమునాడు చేయు గౌరీ వ్రతములేగాక పెక్కు గౌరీ వ్రతములు–పసుపుగౌరి, కుంకుమగౌరి, గాజులగౌరి, కాటుకగౌరి, కళ్యాణగౌరి, కైలాసగౌరి–మొదలగునవి వ్రత కథలలో కానవచ్చును.

శ్రావణ శుక్రవారము నోము :– వరలక్ష్మీ వ్రతము :

శ్రావణమాసమున నోములు నోచుటకు మంగళ, శుక్రవారములు విశిష్టమైనవి. శుక్రవారమున లక్ష్మీదేవిని, మంగళవారమున గౌరీదేవినీ సమారాధించెదరు. శ్రావణ శుక్రవారములలో శ్రావణ పూర్ణిమకు ముందువచ్చు శుక్రవారమునాడు వరలక్ష్మి వ్రతమాచరింపబడును. వరలక్ష్మి వ్రతము ప్రతి తెలుగు మహిళ ఆచరించు కమ్మని నోము. ఇది ఆయురారోగ్యైశ్వర్య సత్సంతాన సౌభాగ్యాది సమస్త సుఖముల కొరకు చేయునోము. లక్ష్మీదేవి సకల సౌభాగ్యదాయిని కనుక తమ కలలన్నియు పండునని తెలుగు మహిళలు భావించెదరు. ఈ వ్రతమువలననే తమ కోరికలన్నియు ఈడేరుననియు వారి విశ్వాసము. తక్కిన వ్రతములవలె దీనికి కఠోర నియమములులేవు. మాంగల్యవతులయిన సర్వవర్ణముల స్త్రీలు దీనిని నోచుకొనవచ్చును.

ఈ వరలక్ష్మి పూజా విధానములో నొక విశేషము కలదు. పరిశుద్ధముగా అలికి ముగ్గులు తీర్చి మంటపము కట్టి వర్షఋతువులో లభించు ఫలపుష్పములను ఐదు రకముల మధుర పదార్థములను, ఐదు రకముల తక్కిన పిండివంటలను మంటపమునకు వ్రేలాడగట్టెదరు. మంటపమధ్య భాగమున ఒక కొలతలో బియ్యము పోసి దానిపై కలశము స్థాపించి, కలశమున కొబ్బరికాయను పెట్టి దానికి కనులు, ముక్కు తీర్చి సకల ఆభరణములతో అలంకరింతురు. వర్షఋతువులో లభించు అన్ని పుష్పములతోను పూజించెదరు. నైవేద్యమునకు హెచ్చుగా ఆవిరితో తయారగు కుడుముల వంటి భక్ష్యములను నివేదించుట

1. కాశీయాత్ర – ఏనుగుల వీరాస్వామి, పుట – 231.

ప్రత్యేకముగా గమనింపదగినది. ఈ వ్రతమును పరమేశ్వరుడే గౌరీదేవికి చెప్పెనని వ్రత గ్రంథములు చెప్పుచున్నవి. ఆ వరలక్ష్మి నోమునకు సంబంధించిన పాటలు పెక్కుకలవు. వరలక్ష్మి పిలుపు, వరలక్ష్మి మంగళహారతి, వరలక్ష్మీదేవి లాలిపాట మున్నగునవి ప్రసిద్ధములు.

వరలక్ష్మి పాట :-

కైలాస గిరిలోను
కల్పవృక్షము క్రింద
ప్రమథాది గణములు కొలువగాను

– పార్వతీ పరమేశ్వరులు కొలువైయుందురు. అప్పుడు పార్వతి పరమేశ్వరుని

"ఏ వ్రతము సంపదలు ఎలమితోడుతనిచ్చు,
ఏ వ్రతము కామితార్థము నొసగు
ఏ వ్రతము పుత్రపౌత్ర అభివృద్ధి నొసంగు"

అని ప్రశ్నింపగా శంకరుడు ఈ వ్రత కథను చెప్పెనట – "కుందిన అని యేటి పట్టణములోపల చారుమతి అని యేటి చేడియ గలదు. అత్తమామల సేవ అతి భక్తితో చేసి, పతి భక్తి కలిగియుండు భాగ్యశాలి" – ఆ భాగ్యశాలినికి వరలక్ష్మి దేవి కనులలో కనిపించి ఈ వ్రతము చేయుమని చెప్పెనట. చారుమతి తన స్వప్న వృత్తాంతమును మరునాడు తన పరివారమునకంత వినిపించి సక్రమముగా పూజచేసి నైవేద్యములు పెట్టెనట.

"నిండు బిందెలలోను నిర్మలోదకములూ
పుండరీకాక్షులకు వారు పోసి
తొమ్మిది పోగులా తోరమొప్పగ పోసి
తల్లికి కట్టిరి సంభ్రమమున

– మూడు లేదా ఐదు లేదా తొమ్మిది పోగులతో కూర్చబడిన తోరమునకు పసుపు రాసి, పసుపు కొమ్మును లేదా తమలపాకును చుట్టగాచుట్టి తోరముతో బంధించి వ్రతము నాచరించువారు చేతి మడికట్టుకు ధరించుట ఆచారము. ఆ తోరమును అట్లే చేతినుండి విడువక ఉంచుకొందురు. అట్లుండుట మెటుగా భావించువారు

మంచి తిథివారములతో గూడిన దినమున ఆ తోరమును విప్పి పచ్చని చెట్టునకు కట్టుదురు.

వరలక్ష్మి పూజానంతరము వేదవిదుడైనట్టి విప్రుని పూజించి ఈ వ్రతమును చారుమతి పూర్తిచేసెనట. వరలక్ష్మీదేవి ఈ పూజకు సంతసించి

"వరలక్ష్మి తానపుడు పరుసతోడుతనిచ్చె
సౌభాగ్య సంతాన సంపదలను."–[1]

– ఈ వ్రతము చేసిన వారికి సకల సౌభాగ్యములు కలుగునని ఫల శ్రుతిలో చెప్పబడినది. లక్ష్మి ధనాధి దేవత. ఆమెను పూజించిన దారిద్ర్యము తొలగును. సౌభాగ్యము కలుగునను విశ్వాసముపై నాధారపడినదీ వ్రతము.

'ఈ వ్రతము చేసినా యింతులందరికి తా
వరలక్ష్మి చేకూర్చు ఫలములన్నియును'

– "వరలక్ష్మి పిలుపు" అను పాటలో దేవిని ఆహ్వానించుట సూచింపబడినది.

"లక్ష్మిరావే మాయింటికి క్షీరాబ్ధి వరపుత్రి
వరలక్ష్మిరావే మాయింటికి ॥లక్ష్మి॥
లలితవై నెలకొన్న సూక్ష్మదేహ ధారిణి
అసురాలి బృందావన విహారిణీ ॥లక్ష్మి॥
కుంకుమ పచ్చ కర్పూరం
లంకితముగ నలరు గంథం ॥లక్ష్మి॥
సంచితముగ సాంబ్రాణి ధూపం
మాతా నీకు ప్రేమతో భక్తితో ॥లక్ష్మి॥
సమర్పించెదమమ్మా
సన్నజాజులు జలలతలూ ॥లక్ష్మి॥

1. తె. జా. గేయ సాహిత్యము – 422, మిన్నేరు పుట – 220.

తీరైన గొజ్జంగి రేకులూ
మేలైన సాధుజాతంబులు ॥లక్ష్మి॥
కోమలాంగిరో యిడుదునీకు
అందముగా గవ్వాక్షులచీర ॥లక్ష్మి॥
కుందనపు పూవుల రవిక
మందగమనరో గైకొమ్మా –[1]. ॥లక్ష్మి॥

–దీనిలో మంత్రములలో చెప్పు పూజా విధానం, అర్చన విధానం చెప్పబడినది. ఈ వ్రతము చివరన పాడే మంగళహారతి పాట. "వరలక్ష్మి మంగళ హారతి" అను పేర ప్రసిద్ధమైనది –[2] మంగళహారతికి ముందు వరలక్ష్మిని ఊయెలలో పెట్టి ఊచునట్లు నటించుచు వరలక్ష్మిదేవి లాలిపాటను పాడుదురు. ఈ పాటను పండితులు పరిష్కరించినట్లు తోచును.

"పచ్చలు తాపించిన బంగారు పట్టెమంచం పాన్పునా
హంసతూలికా శయ్యపై సిరిదేవి హరితోడ పవళించరమ్మా "
చతుర వేదములు కాళ్లు, చతుర దిక్కులు పట్టెలుగావించినా
దూది పరుపు లేసురో శేషాద్రి శయనుపై పవళించరమ్మా –[3].

పాండితీ ప్రకర్షలేని క్రింది పాటలో జానపదుల సహజ ధోరణిలోని మృదుత్వము గోచరించును.

"మ్రొక్కేను నాపాలి శుక్రవారపు లక్ష్మి
ఒక చిత్తమందున హృదయమందు
చక్కగా కూర్చొని సౌభాగ్యముల నొసగు
అక్కరకు రావమ్మ ఆదిలక్ష్మి"

– అని ప్రారంభించిన ఈ పాట మల్లెలు, మొల్లలు, మంచి సంపెంగలు మున్నగు పుష్పములతో లక్ష్మిని అలంకరించుట, పూజించుట, ఆమె మంటపమునకు

1. మిన్నేరు – 223. 2. మిన్నేరు – 220.
3. సెలయేరు – 46.

కట్టిన పాలవెల్లికి నిమ్మపండ్లు, దానిమ్మపండ్లు, అల్లనేరేడు పండ్లు, అరటి పండ్లు కట్టుట వర్ణించి

"వెలయకిచ్చితి పండ్లు, వెలయ బంగరు పండ్లు
సరిపోయె మాలక్ష్మి వేడుకలర"–[1]

– అను చరణములతో సమాప్తమగును. దీనిలో జానపద భక్తురాలి శ్రద్ధాసక్తమైన హృదయము ప్రత్యక్షమగును. ఈ వ్రతములోని పూజా విధానమును పరిశీలింపగా శ్రావణ ప్రకృతి లక్ష్మి ఆరాధనయే ఇది యని మనకు స్పష్టమగును. ఆయా ఋతువులలో పుష్పించు పుష్పములతో పూజించి పండునట్టి పండ్లను, ఆవిరితో ఉడుకు పదార్థములను నైవేద్యము పెట్టుట, ఫల పుష్పములను భక్ష్యములను పూజా మంటపమునకు కట్టి అలంకరించుట – ఇదంతయు ప్రకృతి లక్ష్మి ఆరాధన మనుటకు నిదర్శనము. ఈ వ్రతమును శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చు శుక్రవారమునాడు ఆచరింప వీలులేనివారు తరువాతి శుక్రవారములలో అనుకూలమును చూచుకొని జరుపుకొందురు.

వరలక్ష్మి వ్రతమును శ్రావణ శుక్రవారమునంటే జరుపుకొనినను లక్ష్మీ పూజలను అశ్వయుజ బహుళ అమావాస్యనాడును, కార్తీక బహుళ అమావాస్య నాడును, మాఘ శుద్ధ పంచమినాడును, చైత్రశుద్ధ పంచమినాడును జరుపు కొందురు. ఇవిగాక లక్ష్మి వ్రతములను పెక్కింటిని వ్రత గ్రంథములు పేర్కొను చున్నవి.

శ్రావణ మాసము ఆంధ్ర స్త్రీలకు అతి వేడుకైన మాసము. శ్రావణ మంగళవారం, శుక్రవారం పూజలతో, పేరంటములతో తెలుగువారి గృహములు కనులవిందు గొలుపుచుండును.

గౌరీ నోము :

హేమాద్రి పండితుడు స్త్రీల సౌమంగల్య వర్ధకములైన గౌరీ పూజలను పెక్కింటిని పేర్కొనెను. అవి అన్నియు ఇంతో అంతో భేదముతో దక్షిణ

---

1. మిన్నేరు – పుటలు – 222, 223.

భారతమునంతటను ఆచరణలో నున్నవి. ప్రతి మాసమునందును గౌరీ వ్రతములు గలవు. వీనిలో కొన్ని పౌర్ణమినాడు చేయు వటసావిత్రీ వ్రతము వంటివియు, తక్కిన తిథులలో చేయునవియు కలవు. వటసావిత్రీ గౌరీవ్రతము కర్ణాటక, మహారాష్ట్రములలో ప్రచురముగా నున్నది. తెలుగు దేశమున కార్తీక మాసమున గౌరమ్మ పండుగ అనుపేర ఆచరించుచున్నారు. ఈ పండుగలో విశాఖ శ్రీకాకుళ మండలములలో ప్రచారములోనున్న పాట ప్రయాగ నరసింహశాస్త్రిగారు పేర్కొనినారు. దీనిలో తెలంగాణ ప్రాంతములలో బ్రతుకమ్మ పండుగయందు గౌరీదేవిని ఓలలాడించిన విధముగా ఓలలాడించుటయును కలదు.

ఎంత చక్కని తల్లివే గౌరమ్మ
ఎంత చల్లని తల్లివే గౌరమ్మ
ఒక్కొక్క పోకందునా గౌరమ్మ
ఒక్కొక్క ఆకందునా
కస్తూరి చలమందూనా గౌరమ్మ
రాచ బాటాలందూనా ॥ఎంత॥
నిను జూచి మాయన్నలూ గౌరమ్మ ఏడు మేడలెక్కిరీ
ఏడు మేడల మీదికి " ఏడాదికొక దీపమూ
తబుకుతో తబికేడు గౌరమ్మ, ముత్యాలు తీసుకొని
ఇమ్మడి కుచ్చులతో " సొమ్ములతో వచ్చిరీ
సొమ్మూల పెట్టూకొని గౌరమ్మ ఇమ్ముగనూ "
గుమ్మడీ పూలన్నీ " గుత్తూల కట్టుకునొచ్చే, ॥ఎంత॥
ఈడనే పెండ్లాడవే గౌరమ్మ, ఈడనే పసుపాడవే
వాడవాడల జనమూ గౌరమ్మ వాలలాడింతురమ్మ ॥ఎంత॥ –[1]

– ఈ పాటలోని "ఏడు మేడలు", తబికెడు ముత్యాలు, గుమ్మడిపూలు, గుత్తుల కట్టుకొనుట, ఈడనే పెండ్లాడు మనుట, ఈడనే పసుపాడు మనుట ఇవి యన్నియు సౌభాగ్య సంపత్సూచకములు. ఇదియే పాట తెలంగాణా ప్రాంతమున బ్రతుకమ్మ పండుగ సందర్భమున బ్రతుకమ్మను నదిలో కలిపి గౌరీదేవిని ఓలలాడించునపుడు

1. తెలుగు పల్లె పాటలు – ప్రయాగ – పుట – 18.

పాడెదరు. విశాఖ, శ్రీకాకుళం మొదలు తెలంగాణం వరకును వ్యాపించినదీ పాట.

మరొక్క గౌరీదేవి పాటలో మంత్రరహితముగా, మంత్రములకు మారుగా పాటతోనే సంప్రదాయానుసారముగా పూజించు విధానము, ఆయా ఋతువుల పువ్వులతో అర్చించు పద్ధతియు వివరింపబడినవి. జానపద మహిళ నిష్కపట హృదయము భక్తి మిలితమైన ఈ పాటలో జాలువారినది :-

శ్రీగౌరి నీపూజ చేయబూనతినమ్మ
కాపాడి మమ్మేలు కాశీపుర రాణీ
శాంకరీ పార్వతీ శంభునీ రాణీ
తల్లి నిన్నెపుడు ధ్యానింతునమ్మ
కలహంస నడకల కదలిరావమ్మ
సింహ పీఠంబున చెలియరో కూర్చుండ
బంగారు చెంబుతో గంగ నీళ్లు దెచ్చి
కాంత నీ పాదాల కడిగి తడియొత్తెద
అంబికా నీకిదే అర్ఘ్యంబునిత్తును
ఆకాశ గంగతో అర్పింతు తల్లి
పంచామృతంబిదే పడతిరో నీకిత్తు

– అని పాడుచు అంబకర్పించదలచిన అద్దాలరవికెను, జల్తారు చీరెను, రతనాల సొమ్ములను పేర్కొని, పూజకు అవసరమగు పసుపు, కుంకుమ, పూలు, పత్రీ సమకూర్చుకొను విధము చెప్పబడినది. పుష్పములలో పారిజాతంబులు, తమ్మిపూలు, గన్నేరు, చేమంతి, కలువ, సంపెంగ, బంతి, సన్నజాజులు, మంకెన, గొనుగు, తంగేడు, మల్లె, మొల్ల–ఇత్యాదులు పేర్కొనబడుట సుందరమైన ఉద్యానవనమునే దేవి పాదముల చెంతకు రప్పించినట్లు గోచరించును. అంతేగాక

"సాంబ్రాణి ధూపంబు శాంకరీనికిత్తు
దేవి నీసన్నిధి దీపంబు లెలిగింతు
సారపల్కుల పప్పు నారికేళములును
నాతిరో నీకిదే నైవేద్యమిచ్చెద

పార్వతీ నీకిదే పానీయమిచ్చెద
శంభురాణీ నీకు తాంబూలమిచ్చెద
దాక్షాయణీ నీకు దక్షిణల నిచ్చెద
మానినీ గైకొమ్మ తిరిగివచ్చీ నీకు
సాగిల మ్రొక్కితిని సావిత్రీ దేవీ
అంగనామణి నీకు మంగళాహారతి
భువనేశ్వరీ నిన్ను పూజింతునమ్మ
మమ్ము గాపాడుమా మాతల్లి గౌరమ్మ
తప్పులన్నీ గాచి తల్లితో మమ్మేలు
జయ జయము గౌరమ్మ జయమహో తల్లి

– ఈ పాటలో దేవిని కలహంస నడకలతో నడిపించుకొనివచ్చి సింహపీఠమున కూర్చుండబెట్టుట, అర్ఘ్యము, పాద్యము పిదప పంచామృతమును, పన్నీటితో అభిషేకము, వస్త్రధారణము, ఆభరణముల అలంకరణము, చందనచర్చ, అక్షంతలతో అర్చన, పునుగు జవ్వాదులను అలదుట, పసుపు కుంకుమలు, పత్రి, పారిజాతము మొదలు మొల్లల వరకు వివిధ పుష్పములతో పూజించుట మెడలో పుష్పదామమును అలంకరించుట ధూపదీప నైవేద్యములు, పానీయము, తాంబూల దక్షిణలు పిదప మంగళహారతి–ఇట్లు సక్రమముగా పూజా విధానము ననుసరించి ఆవాహనముతో ప్రారంభమై మంగళహారతితోను జయ జయ ధ్వానములతోను సమాప్తమగును. పురోహితుని అవసరము లేకయే పూజను నిర్వహించవచ్చును.

గౌరీ నోములు లెక్కకు మిక్కిలిగా నున్నవని ఇదివరకే పేర్కొనబడినది. వ్రతములలో గౌరీదేవికి ప్రాధాన్యమధికముగా నుండుటను మనమూహింప వచ్చును. కఠోరమైన నియమనిష్ఠలకు పాల్పడి వ్రతములలో ఉత్తమమైన వ్రతమాచ రించి పార్వతీదేవి ఈశ్వరునిలో అర్ధ భాగమునకు అధికారిణి అయినదను పురాణ గాథపట్ల ప్రజలకు గల ప్రగాఢమైన విశ్వాసమే ఆమెనీవిధముగా పూజింపజేయు చున్నదనవచ్చును. పాతివ్రత్యము మూర్తీభవించిన పార్వతీ భారతీయులకు ఆదరపాత్రయై ఆదర్శప్రాయురాలయినదనిన ఆశ్చర్యము లేదు.

1. సరాగాలు.

"ఉరుతర గద్య పద్యోక్తులకంటె సరసమై పరగిన జానుదెనుంగున గూర్చెద ద్విపదలు" అని కృతకృత్యుడైన పాల్కురికి సోమనాథుని పద్ధతి బాగా ప్రచారము లోనికి వచ్చి ఉండును. "వీరశైవమతములో మన ఆడపిల్లలు నోచే నోములలో నూటికి తొంభయి గౌరి నోములే. ఈ నోములూ, కథల పాటలూ వీరశైవంతో కుప్పలు కుప్పలుగా బయల్దేరి ఉంటాయని నా ఊహ" అని కృష్ణశ్రీగారభిప్రాయ పడిరి. –[1]. మతవ్యాప్తికై పాటుబడు కాలమున శైవమత ప్రభావముతో 'గౌరి' కథ జనులలో వ్యాపించినదనిన సమంజసముగానున్నది.

ఏ మాత్రము నాగరికతా వాసనలు సోకని ఒక జానపద స్త్రీ నోటితో వినిపించిన పార్వతి ప్రశంస వినిన, జనులలో పార్వతీ దేవికిగల ప్రాధాన్యము గోచరించును. పుట్టింటి ప్రయాణము కట్టిన ఈ మహిళ పుట్టింటికి వెళ్ళుటకు కారణము తెలుపుచూ –

"పడమట మాయితల్లి
'పారు తీగె' నోములు
కడగొట్టు తమ్మునివి
కార్తీక లగ్గాలు" –[2]

– అని పలికినది. తల్లి ఆచరించు పారుతీగె నోములతో పాటుగాకడగొట్టు తమ్మునికి జరుగు కార్తీక లగ్గములను కూడ పేర్కొనుట వలన ఈ పారుతీగె నోములు కార్తీక మాసములో, లేదా కార్తీక మాసముతో సంబంధమున్న చాతుర్మాస్య వ్రతములలో ఒకటైయుండును.

'పార్వతి' అను పదము పారువతి–పారోతి–మున్నగు వికృతి రూపములను చెందుచున్నది కనుక పారు తీగయును అట్టి తద్భవమేయేమో! జనుల వాడుకలో ఎన్ని పదములు అపభ్రంశరూపమును పొందుట మనము చూచుటలేదు! ఈ ఊహ సమంజసమైన యెడల ఇది ఏగౌరీవ్రతమో అయియుండును. గౌరీ వ్రతమును ఎవ్వరైనను, ఎప్పుడైనను ఆచరింపవచ్చును. కనుక నోరు తిరుగని గౌరీ పదమును స్పష్టముగా పలుకజాలని జానపదులను ఆచరింపవచ్చును కదా!

1. స్త్రీల గేయ కథలు (వ్యా కృష్ణశ్రీ – భారతి, జూన్, 1953, పుట–39.
2. తెలంగాణా పల్లె పాటలు–పుట–103.

తెలంగాణములో బతుకమ్మ, సర్కారులో గౌరీదేవి, గైరమ్మ, రాయలసీమలో గౌరమ్మ–వీరిని పూజించుటలోను, గౌరమ్మను నీళ్ళలో ఓలలాడించు పద్ధతిలోను, ఏకత్వము గోచరించును.

కేదార గౌరి నోము :

కేదారగౌరి నోము ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు ఆచరింపబడును. ఆనాడు వీలుకానివారు కార్తీక పూర్ణిమ వరకు ఏదినమైనను జరుపుకొనవచ్చును. కేదార గౌరిని ఆదిలక్ష్మి అపర రూపముగా భావించెదరు. ఈ వ్రతాచరణము వలన సకలాభీష్టములు నెరవేరుననియు, దీర్ఘసుమంగళీత్వము సిద్ధించుననియు, సత్సంతానమును పొందగలరనియు స్త్రీల విశ్వాసము. శైవ వైష్ణవ మత సంప్రదాయములలో సమైక్యము తెలుపుచు గౌరీదేవికి లక్ష్మీదేవికి ఏకత్వమును ఆపాదించి ఈ నోము నిర్వహింపబడును. ఐదు లేదా తొమ్మిది రకముల పండ్లు, పువ్వులు, కూరగాయలు, పిండివంటలు తయారుచేసి దేవికి అర్పించి పూజానంతరము మంగళహారతి, నీరాజనమును పట్టెదరు. తొమ్మిది రకములకు మారుగా ఇరువదియొక రకములను వాడుటయు గలదు. మంగళహారతిగా

"శుక్కురావారాన (శుక్రవారము) సక్కంగ శ్రీలక్ష్మి
అవతారమెత్తేనే ఆదిలక్ష్మి
సిరితోడ వచ్చెనూ మానగరికీ
వచ్చి తన శాలలో వలపటొలేసుక
పుట్టినింటికి పోయి యేమి తెస్తివి గౌరి
సిగ్గుపడక నాతో చెప్పమందూ
పసుపు కుంకుమాలు పుసుపురంగు చీర
మావారు పెరవారు మాకు యిచ్చినవి
మిరపకాయ పట్టుచీరె
మిరుమిట్లు గొలుపంగ
అల్లమో బెల్లమో అరటిపండ్లు
తెప్పించి యిచ్చినవి కేదారగౌరికి

రంగైన పచ్చటి రయిక తొడిగి
వెన్న కాచిన నెయ్యి గిన్నెలో బోసుక
అన్నలకు బోసి నేతలనంటు కొనగ
నిండు పున్నమనాడు నేనొకపొద్దుండి
నిండయిన కోనేళ్ల స్నానమాడి
నేను దెస్తూ నమ్మ వజ్రాల రాశి
తేనెతో మాగిన తియ్యమామిడి పండ్లు
తెప్పించి యిస్తునే కేదారగౌరికి" –[1]

అని పాడి అక్షతలు వేసుకొని పేరంటాండ్రకు వాయనము లిచ్చెదరు.

అశ్వయుజ అమావాస్య, కార్తీక ప్రారంభమునకు కొన్ని ప్రాంతములలో కొన్ని పంటలు, పండి ఇంటికి వచ్చును. కొన్ని పంటలు చేలమీదనే యుండి కనులపండువగా నుండును. కనుక ధాన్యలక్ష్మియు, సస్యలక్ష్మియు – లక్ష్మివలె గౌరీవలె మన పూర్వులకు దర్శనమిచ్చియుండును. లేదా వారట్లు భావించి యుందురు. సర్వమును భగవత్స్వరూపముగా భగవదనుగ్రహముగా భావించు మన పూర్వులు ధాన్యరాశిని, ధాన్య క్షేత్రమును లక్ష్మిగాను, గౌరిగాను భావించుటలో ఆశ్చర్యమేమియు లేదు. కేదారమనగా సస్యక్షేత్రము. ఆ క్షేత్రమున నుండు సస్య సంపదయే కేదారగౌరి. ఇట్టి గౌరిని ఆరాధించుట సహజాతి సహజము. ఈ నోమునే కేదారేశ్వర, కేదారేశ్వరి, కేదారి–నోము అను పర్యాయ పదములతో వ్యవహరించెదరు.

కేదారగౌరీ వ్రతము పద్ధతిని పరిశీలించినను ఇది ప్రకృతి దేవి ఆరాధనముగానే మనకు స్పష్టమగును. ప్రారంభములో సూచించినట్లు లక్ష్మీగౌరుల సమైక్య మూర్తి ప్రకృతిదేవి. ఈ నోములో తొమ్మిదిరకముల పండ్లు, తొమ్మిది రకముల పువ్వులు, తొమ్మిది రకముల కూరగాయలు, ఆ ఋతువున పండు ధాన్యములతో తొమ్మిది రకముల పిండిపంటలు అను నియమమును పరిశీలింపగా ఇది పూర్తిగా శారదా నవరాత్రులవలె శరదృతు ప్రకృతి సంపూజనమే యని

1. మిన్నేరు–పుటలు–229–230.

స్పష్టమగుచున్నది. కేదార గౌరి వ్రతము కథ మా అమ్మమ్మగారు చెప్పగా విని వ్రాసుకుంటిని. ఈ ప్రకరణమున వ్రతము లన్నింటికిని వచన రూపమైన కథలకుగాక గేయములకే ప్రాధాన్యమివ్వబడినది. కాని ఇక్కడ ఈ వ్రత కథ వచన రూపమునను పేర్కొనుట ఉచితమని తోచినది. ఈ కథ వలన వ్రతముల నాచరించునాడు పురోహితుడు చెప్పు వ్రత కథను విని వానిని జానపదులు మనసులలో ఎట్లు నిలుపుకొందురో తెలుపుటకు పేర్కొనుచున్నాను. భాషను కూడ మా అమ్మమ్మగారి శైలిననుసరించియే వ్రాయుచున్నాను.

"ఉజ్జయిని పట్నంలో మహాంకాళి పట్నమున్నది. ఆ దేశాన్ని ఏలే రాజుకు ఇద్దరు బిడ్డలు పుట్టింండ్రు, వాళ్ళు కపల పిల్లలు. వాళ్ళ పుట్టుక రాజుకు చెడుపు చేస్తుందని జ్యోతిష్కులు చెప్పింండ్రు, అందుకని వాళ్ళను తీస్కపోయి అడవిల యిడ్చిరమ్మని భటులకు చెప్పిండు. వాళ్ళు రాజుమాటకు మంచిదని ఆ పిల్లలను అడవిల ఒక చెట్టు నీడన వదిలి వచ్చింండ్రు. ఆ పిల్లలు కావురు కావురుమని ఏడుస్తుంటే మొగులుమీది నుంచి పోతున్న పార్వతీ పరమేశ్వరులు చూసింండ్రు (చూసినారు). అయ్యో పిల్లలకు ఎంత గతి పట్టిందని పార్వతిదేవికి దయొచ్చింది. దయొచ్చి తేనెను పిల్లల నోట్ల పోశేటందుకు తేనె టీగను, పిల్లలనెవ్వరు తాకకుండ ఉండేటట్లు పామును కావలుంచింది. పిల్లలు మంచిగనే పెరుగుతున్నరు. ఇంతల ఒక బ్రాహ్మణుడు అటొచ్చి పిల్లలను చూసిండు. ఆయన పేరు కేశవభట్టు. ఆయనకు ఎక్కడెక్కడ ఏం జరుగుతుంది సూశె తెలివుంది (దివ్యదృష్టి కలవాడని అర్థము). సూశి (చూచి) సత్యం తెలుసుకుండు. రాజు బిడ్డలని ఆయన కెరుకయింది. ఆ పిల్లలకు నీడపట్టిన చెట్టు చుట్టు మూడుసార్లు తిరిగిండు (ప్రదక్షిణ చేసినాడు). ఆ పాము, తేనెటీగ మాయమయినవి. ఆ బిడ్డలనిద్దరిని ఇంటికి తెచ్చి పెంచిండు, పెద్దపిల్ల పేరు భాగ్యవతి, చిన్నపిల్ల పేరు పుణ్యవతి. ఇద్దరు అక్కా చెల్లెండ్లు మంచిగ కలిసిమెలసి ఉంటున్నరు. ఇంతల వాళ్ళు పెండ్లీడుకొచ్చింండ్రు. పెండ్లీడుకొచ్చిన వాళ్లను సాదింది(సాకినది) బ్రాహ్మణ్ణయిన, వాళ్ళను మట్టుకు రాజులకే యియ్యాలెగదా, లేకపోతె కులం తప్పుతదాయె. అందుకని మంచి రాజులను దేవులాడి (వెదికి) తూర్పున బళ్ళారి మారాజుకు

(మహారాజుకు) భాగ్యవతిని, ఉత్తరాన సుల్తాను మారాజుకు పుణ్యవతిని ఇచ్చి రాజలాంఛనలతోటి పెండ్లిజేసింధు. పెండ్లికి ఎక్కడెక్కడి రాజులందరు వచ్చింద్రు. పెండ్లి అయిన కొత్తేడు భాగ్యవతిని పుణ్యవతిని దీపావళి పండుగకు బ్రాహ్మణ్ణి పిల్చుకొచ్చింద్రు. రాజ్యాలను యిడ్చి వచ్చేటట్టులేక రాజులు రాలేదు. భార్యలను పంపింద్రు. పెండ్లయినంక వచ్చిన భాగ్యవతికి, పుణ్యవతికి ఒకసారి అడవికి పోయి సూడబుద్ధయింది. ఎల్లింద్రు, అక్కడ ఆయాల (అరోజు) కేదారి నోము, ఋషుల భార్యలందరు నోము నోచుకుంటుంద్రు, వాళ్ళ దగ్గరికి పోయి ఏందని అడిగింద్రు, వాళ్ళు అందుకు బదులుగా (జవాబుగా) ఇయ్యాల ఆశ్వయుజ అమాస కదా, అందుకని కేదారి నోము నోచుకుంటున్నమని చెప్పింద్రు. వాళ్ళను చూస్తుంటె మనము కూడ చేస్తె బాగుంటది కదా అనుకున్నరు. పూజకు ద్రవ్యం లేదుకద అనుకున్నరు. ఉన్నవిటి (ఉన్నవాటి)తోనే పూజ చేతామనుకున్నారు. కట్టుకున్న బట్టలే పీతాంబ్రమని, ఉష్క (ఇసుక) బియ్యమని, మర్రాకులు తమ్లపాకులని, మర్రికాయలు పోకచెక్కలని, రేగడి బురద బూరెలని, మఱ్ఱిఊడలు తోరాలని మనసులనుకొని పూజ మొదలు పెట్టింద్రు. పూజ మొదలు పెట్టింద్రో లేదో అనుకున్న యన్ని నిజమయ్నవి. పండుగయిపోయింది. ఎవ్వరి అత్తగారిండ్లకు వాళ్ళు ఎల్లిపోయింద్రు. ఏడాదేడాది దీపావళి పండుగనాడు నోము నోసుకుంటనే ఉన్నరు. పుణ్యవతికి కొడుకు పుట్టిండు. ఓసారి నోము నోస్కోని పుణ్యవతి మొగని దగ్గరికి (భర్త చెంతకు) పోయి కాళ్ళు మొక్కవోతది. ఆమె చేయికి దారం (తోరము) సూశి (తెలంగాణ ప్రాంతములో చూచిని సూశి అనుట సామాన్యమని గ్రహించగలరు. వారి ఉచ్చారణలో ఆ పదమే వారికి సహజత్వమును కలిగించును) కోపానికొచ్చి మనకేంది దారపు పోగేంది అని తీశి (సి) నిప్పులేస్తడు. భర్తనేమనలేక భర్తసూడకుండ నిప్పులనుంచి దారం తీసి పాలల్ల కడిగి ఇంటెన్కున్న కాకరచెట్టు మీదేస్తది. కాకరచెట్టు ఇర్గకాస్తది. వాళ్ళకున్న ధనమంత మాయమయినది. భర్త బల్లోలె బక్కగయిండు. కొనఊపిరికి వచ్చిండు. ఆఖరికి కాకరకాయలు అమ్ముకుని బతుకుతుంటరు. పుణ్యవతి కొడుకు పెద్దోడయితడు, పైసలు లేక తిప్పల్వడలేక కొడుకును అక్క (భాగ్యవతి) దగ్గరికి పోయి పైసల్దెమ్మంటది. గుర్తుకు ఎల్లమ్మ గుడిలదాచి ఉంచిన ఉంగరం ఇస్తది. (గుర్తెందుకు? ఉంగరమెక్కడిది అని మధ్యలో

నేను ప్రశ్న వేసినాను అందుకు సమాధానము– పుణ్యవతికి కుమారుడు కలిగిన తరువాత భాగ్యవతి ఆ అబ్బాయిని చూడలేదట. అందుకని గుర్తుగా ఉంగరమిచ్చిందట. ఇక ఉంగరము-ఇద్దరు అక్కచెల్లెండ్రు పెండ్లికి పూర్వము ఒకరి ఉంగరం మరొకరు మార్చుకొనినారట – అదీ సంగతి) భాగ్యవతి పైసలు మూట గట్టిచ్చింది. భద్రంగ పొమ్మంది. తోవల దొంగలొచ్చి దోస్కపోయింద్రు. మళ్ళ భాగ్యవతి దగ్గర్కి పోతడు. ఆమె అప్పుడే నోము నోస్కుందామని కందగడ్డ కోస్తుంటది (తెలంగాణములో ఈ కేదారిగౌరి నోము చాల ప్రసిద్ధిచెందినది. 'నోము పట్టినావా ? నోమెప్పుడు నోచుకొనుచున్నావు' ఇత్యాది వరుసలో వాడబడు నోమనిన కేదారగౌరి నోమనే అర్థము). ఇంక ఎన్ని రూపాయలిచ్చిన లాభంలేదని "మీ అమ్మ నోము ఒదిలినందుకే మీకీ కష్టాలన్ని ఒచ్చినవి. మల్ల నోము మొదలుపెడ్తె ఈ కష్టాలన్ని పోతవి. ఈ ఏడు స్వాతికార్తి గూడ వచ్చింది" అన్జెప్పి తోరాలనిచ్చి పంపిస్తది. పుణ్యవతి భర్తకు జెప్పి నోము నోస్కొని ఇంటిలాజులకు (ఇంటిలోని వారందరికి) తోరాలు కడ్తది. బాగ ధనవంతులయితరు. సుఖంగ ఉండి వైకుంఠాన్కి పోతరు" – ఇదీ కథ.–1 (కథ వ్రాయుటలో మాండలిక పదములను ఉచ్చారణలో నుండునంత స్పష్టముగా వ్రాయకపోయినను కథ మాత్రము అంతే).

ఈ కథ వలన జానపద స్త్రీల మనస్తత్వమును, వ్రత విధానమును అర్థము చేసికొనవచ్చును. కథలో అక్కా చెల్లెండ్రు ఉంగరములను మార్చుకొను ప్రసక్తి ఎక్కడా రాకపోయినను అవసరమునుబట్టి ఆ సంఘటనను కథలో దూర్చెదరు. ఇది జానపద కథా పద్ధతిలో నొక విధము.

ఈ కథకు మూలము స్కాందపురాణము. అందు పెద్దమ్మాయి పుణ్యవతి, చిన్నమ్మాయి భాగ్యవతి. వారు కవలలు కారు, వారి తండ్రి వైశ్యుడు. రాజకుమార్తెలుగా జన్మించు ప్రసక్తిలేదు. దీపావళి పండుగకు క్రొత్త అల్లుండ్రను బిడ్డలను పిలుచుకొనివచ్చు ప్రస్తావనలేదు – ఇట్లు మూలములోలేని కాలానుగుణమైన

1. మా అమ్మమ్మ రుక్కమ్మగారు (లింగంపల్లి – గ్రామము – ఇబ్రాహింపట్నం తాలూకా) ప్రతి సంవత్సరము కేదారగౌరి నోము కథను పురోహితుడైన నారాయణం దక్షిణామూర్తిగారు చెప్పుచుండగా తెలుసుకొనినదట.

మార్పులనెన్నింటినో చేర్చినారు కథలో. వారి హృదయములలో వారికి తెలిసిన కథకే ప్రాధాన్యముండును కాని మూలములో నున్న సంగతిని చెప్పబోయినను వినువారుండరు. "విస్సన్న జెప్పినదే వేదము " అనునట్లు తమ పురోహితుడు చెప్పినదే సరియైనదిగా భావించెదరు. కాదుకూడదని కథను సరిజేసి చెప్పబోయిన అజ్ఞానుల క్రింద జమకట్టి అవతలకు పంపివేయుదురు. అందుకని నేను పనిగట్టుకొని మాఅమ్మమ్మగారికి కథ జెప్పిన "నారాయణం దక్షిణామూర్తిగారి చెంతకే వెళ్ళినాను. "చదువుకొనిన వారు, పౌరోహిత్యమును నెరపువారు మూలములోలేని మార్పులను చెప్పవచ్చునా?" అని ప్రశ్నింపగా "నేను జెప్పే కథ ఈనాడు నేనే మొదటగా చెప్పునది గాదు. మా తండ్రినోట విన్న కథను నేను చిన్ననాడే నేర్చుకొంటిని. అదే కథ ఈనాడు చెప్పుచున్నాను. నేను క్రొత్తగ జెప్పిన కథ ఏమీ లేదు" అని జవాబిచ్చినారు. ప్రజలకు ఆసక్తిదాయకముగా, ఆచరణయోగ్యముగా నుండుటకు కథలో మలుపులు మళ్లించినారేమో, దక్షిణామూర్తి తండ్రిగారో, లేక తాతగారో లేక.... ఈనాడు ఏదైన మార్పు చేయదలచినను క్రొత్తగా వినువారులేరు. తరతరముల నుండి ఆ కథ ఒకరి నోటితో మరొక్కరికి అందియేయుండును. జానపద సాహిత్య లక్షణమును బట్టి చిన్నచిన్న సంఘటనలలో మార్పు జరుగవచ్చునుగాని మూలమునే మార్చుట సాధ్యముకాదుగదా, ఏమైననేమి రంగుల హరివిల్లువలె జానపదుల హృదయమును ఆకట్టుకొనినది ఈ కథలో వచ్చిన "ఎల్లమ్మ గుడి", "నోము" అను పదముల ప్రాశస్త్యమువలన తెలంగాణ ప్రాంతమున ఎల్లమ్మ దేవతకు, కేదారగౌరి నోముకు గల వ్యాప్తిని తెలియజేయుచున్నది.

ఈనాటి వ్రత నియమములలో గ్రామీణులు పాటించు కొన్ని ముఖ్యమైన అంశములు.

పూజానంతరము చేతులకు కట్టుకొను తోరములకు–తొమ్మిది లేదా ఐదు వరసల దారమునకు తమలపాకును బంధించుటయేగాక చిత్ర వర్ణములు కలిగిన దారపు పువ్వులను వాని చుట్టు అలంకరించెదరు. ఈ తోరములను గ్రామములందు సాలెవాండ్రు తయారుచేసి యిచ్చెదరు. ప్రతి ఇంటికి ఒక ఎల్లమ్మగుడి అని చిన్న 'దుగుడు' (సుమారు రెండడుగుల పొడవు, రెండడుగుల వెడల్పు) ఉండును. దేవుని గది కలిగిన వారును ఆ గదియందు తూర్పు ముఖముగా ఎల్లమ్మగుడి అను దుగుడును కట్టుకొనెదరు. పవిత్రమైన వస్తువులను

ఇందు పదిలపరచెదరు. సాలెవాండ్రు తెచ్చి యిచ్చిన తోరములను ఒక చిన్న గురిగిలో నుంచి గురిగిని "ఎల్లమ్మ గుడి"లో భద్రపరచెదరు. నోమునాడు యింటిలోని సుమంగళులు ఎల్లమ్మగుడి ముందు మఱ్ఱి ఊడలతో పందిరి వేసి క్రొత్త రవిక గుడ్డపైన గుండ్రని కుడుకనుంచి, కుడుకలో తమలపాకు, తమలపాకులో పసుపుముద్దను పెట్టి గౌరికి ప్రతీకగా భావించి గౌరీపూజ నొనరించెదరు. పూజానంతరము ఇంటిలోని వారందరును విధవలు తప్ప ఆడ, మగ, చిన్నా పెద్దా భేదములేకుండ చేతులకు తోరములను ధరించెదరు. ఆ తోరము చీకిపోవునంత వరకు చేతిమీదనే ఉండవలెను. విధిలేని పరిస్థితిలో తీసి పచ్చని చెట్టుకు కట్టెదరు. ఆనాడు వండు ఇరువది ఒక్క కూరగాయలతో కాకరకాయ, కందగడ్డ తప్పక యుండును. పిండివంటలలో బూరెలు ఉండును. అందుకే "నోమినోన్ని బూరెలు నోచినోడు తిన్నడట" అని సామెత. క్రొత్తగా నోము నోచుకొనువారు స్వాతి కార్తికి ప్రాధాన్యమిచ్చెదరు. ఇంటి పరిస్థితులను బట్టి నోచుకోలేనివారు వ్రతమును జరుపుకొను ఇతరుల యిండ్లలో "పేరంటాండ్ర రవిక" అని పెట్టుదురు. పూజదగ్గర పెట్టిన రవికను తప్పక కుట్టించుకొని వేసికొందురు. ఈ వ్రతమున గ్రామములో కుల విచక్షణ లేక అందరు ఆచరించెదరు. పూజానంతరము బ్రాహ్మణుడు వచ్చి "భాగ్యవతి పుణ్యవతుల"కు సంబంధించిన కేదారగౌరి వ్రతము కథచెప్పి ఇంటివారిపై అక్షతలు వేసి "గౌరమ్మను ఇల్లాలిచే ప్రక్కకు జరిపించి వెళ్ళును. ఇట్లు చేయుటను గౌరమ్మను కదలించుట అందురు. గౌరమ్మను కదలించునంత వరకు దీపము అఖండముగా వెలుగుచునే ఉండును. బ్రాహ్మణుడు మాలమాదిగ తప్ప మిగిలిన కులస్థులందరి గృహములకు వెళ్ళి వ్రతమాచరించిన ప్రతివారి యింటను కేదార గౌరినోము కథ వల్లె వేయుచునే యుండును. శూద్రుల యింటికి బ్రాహ్మణుడు వెళ్ళకపోయినను కేదార గౌరినోమునందు ఆసక్తిగలవారు ఆచరింపకమానరు. ఈ వ్రతము దేశవ్యాప్తముగా ఆచరణయందున్నది.

ఈ వ్రతమునే కేదారేశ్వర వ్రతమనుటకు కారణము ఆనాడు కొందరు కేవలము పార్వతీ (గౌరీ) దేవినేకాక పార్వతీయుతుడైన పరమేశ్వరుని పూజించెదరు. ఈ వ్రతము ఇరువదియొక్క మారు లాచరించు పుణ్యాత్ములు సకల సంపదల ననుభవించి పిదప శివసాయుజ్యము నొందుదురు. ఇది వ్రతఫల ప్రాప్తి–[1]

1. ఆరు వ్రతములు పుట–60 – చందా నారాయణ శెట్టి, సికింద్రాబాదు, 1934.

చల్లచిత్త నోము :

జానపదులకు పాడిపంటలు ముఖ్యము. పాడి లేకున్న మనుగడయే లేదు. అట్టి పాడిని అభివృద్ధి చేసుకొను నాకాంక్షతో చేయు నోము చల్ల చిత్తనోము. దీనిలో పాడి అభివృద్ధి మాత్రమేగాక సకల సౌభాగ్యాభివృద్ధియు జానపదుల అభీష్టము. వాస్తవమున పాడియే సకల సంపదలకు మూలము. చల్ల చిత్త నోము పాటను ఈ విధముగా పాడుదురు.

చల్లచిత్త నోము నోచవేతల్లీ – వెలయావుల పాడి చేయవే తల్లీ
ఇల్లు పాలసేత అలుకవే తల్లీ – ఎల్లసొమ్ములు నీవు తాల్చవే తల్లీ
కొల్లలుగ సౌభాగ్యమేలవే తల్లీ – చల్లని సంపదలను చేపట్టు తల్లీ
చల్లగను సుతులతో సాగవే తల్లీ – ఎల్లబీదల నాదరింపవే తల్లీ–1

– ఇందు వెల్లయావుల పాడి చేయుట, ఇంటిని పాలతోను, నేతితోను అలుకుట అనగా పాడి సమృద్ధిగా నుండుటయే కదా ! ఈ పాడి వలన కలిగిన ఐశ్వర్యము వలన ఎల్ల సొమ్ములును ధరింపుమని చల్లగా సుతులతో నుండుమని ఎడతెగని సంపదలతో వర్ధిల్లుమని చెప్పుచు చివర "ఎల్ల బీదల నాదరింపవే తల్లీ" అని ఇంతటి ఐశ్వర్యమునకు ఫలమైన దరిద్ర నారాయణ సేవను చెప్పుట ఈ నోము ఫలము గొప్పతనమును తెలుపుచున్నది. చల్లవెన్నలతో నీవ్రతోద్యాపనము జరుగును.

"స్త్రీల వ్రత కథలు"లో నీపాట మరియొక విధముగ నున్నది
"చల్లచిత్త నోము చిత్తమారగజేసి ఇల్లు వాకిళ్లతో ఈశ్వర చింతతో,
చల్ల బ్రతుకు సౌభాగ్యలక్ష్మితో ఉల్లసంబులతో ఉండవే తల్లి. –2

– ఈ నోము ఫలము ఇల్లు వాకిళ్ళు, చల్లని బ్రతుకు, సకల సౌభాగ్యము, ఉల్లసంబులతో నుండుట–అన్నిటికిని మించి ఈశ్వర చింతతో నుండుట ముఖ్యము. ఈశ్వరుడనగా ధర్మచింత. ఎంతటి మహోదైశ్వర్యము కలిగినను, ధర్మచింత మానకుండుట భారతీయ జీవన విధానములో విశేషము.

1. తె. జా. గేయ సాహిత్యము–428.
2. స్త్రీల వ్రత కథలు –పుట–74.

ఈ వ్రత విధానమును పైన పేర్కొనిన పుస్తకములోనిట్లున్నది : పైన ఉదాహరించిన పాట పాడుకొని, అక్షతలు తలపై వేసుకొని, చల్ల చిలుకునప్పుడు కన్నుల కంటుకొనిన చల్లబొట్లతో పసుపు కలిపి ప్రతిదినము ఆరుగురు పుణ్యాంగనలకు బొట్టు పెట్టవలెను. ఇట్లు నూటరువదియైదు దినములు చేసిన పిదప ఉద్యాపనము.

మోచేటి పద్మమ్మ నోము :

ఆంధ్రదేశపు పూర్వ భాగమున "మోచేటి పెద్దమ్మ" నోము అనునొక వ్రతమును చేయుదురు. ఇదియే మోచేటి పద్మమ్మ నోము అనుపేర వ్యవహారమున కలదు. పంటలు, సమిష్టి కుటుంబపు సామరస్య సౌభాగ్యములు మున్నగు శుభములను కోరి ఈ నోము నోచుకొందురని ఈ పాటను బట్టి తెలియును. ఈ పాటలోని జీవిత భావనకును, భావనా సౌందర్యమునకును ముగ్ధుడయిన సుప్రసిద్ధ సాహితీ విద్వాంసుడు శ్రీ దేవేంద్ర సత్యార్థి దీనిని ఆంగ్లమున అనువదించి Modern review – అను ఆంగ్ల మాసపత్రికలో ప్రచురించిరి. –[1]. ఈ పాటను పరిశీలించిన పూర్తిగా ప్రకృతి దేవి స్తోత్రమా ఇది అనునట్లున్నది.

"మోచేటి పెద్దమ్మ నోచేటి వేళ, మొగ్గలు తామరలు పూసేటి వేళ
బీరాయి పువ్వులు పూసేటి వేళ బిందెలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ
గుమ్మడి పువ్వులు పూచేటి వేళ
గుండిగలతో ఉదకము తెచ్చేటివేళ
కాకర పువ్వులు పూచేటి వేళ
కడవలతో ఉదకమ్ము తెచ్చేటివేళ
ఆనప్కాయ పువ్వులు పూచేటి వేళ
అటికలతో ఉదకమ్ము తెచ్చేటి వేళ
చిక్కుడు పువ్వులు పూచేటి వేళ
చిప్పలతో గంధాలు తీసేటి వేళ
ఆవులు దూడలు వచ్చేటి వేళ
ఆంబోతు రంకెలు వేసేటి వేళ

సందిటి దీపాలు పెట్టేటి వేళ
చాకింటి మడతల్లు తెచ్చేటి వేళ
అన్నల్లు అందలా లెక్కేటి వేళ
తమ్ముళ్ళు తాంబూలాలు వేసేటి వేళ
మరుదుల్లు మరిజూదమాడేటి వేళ
కూతుళ్ళు గుండిగలు దింపేటి వేళ
కోడళ్ళు కాటు పసుపు కొట్టేటి వేళ
చెల్లెల్లు చేమంతులు ముడిచేటి వేళ
వదినల్లు వంటల్లు చేసేటి వేళ
ముద్దుల్ల మొగము అద్దాన బోలు,
తన ముఖము తామర పద్మాలుబోలు. –[1]

– సామాన్య గృహిణులు కోరుకొను సకల సౌభాగ్యములును, సకల సుఖములును ఇందు సూచితములు. పూజకుపయోగించు తామర మొగ్గలు నిత్య ఆహారమునకుప యోగపడు బీర, గుమ్మడి, కాకర, ఆనప (సొర), చిక్కుడు వంటి కూరగాయలు, పగలంతయు మేసి తమ కోసము వేచియున్న దూడలకు పాలు గుదుపుటకై పెద్ద పొదుగులతో ఇంటికి మరలివచ్చు ఆవులు, వానిని చూచి మదముతో రంకెలు వేయు ఆబోతులు, సాయంకాలమున దీపము వెలిగించుట, చాకలి ఉదిగిన గుడ్డల మడతలు తెచ్చుట, అన్నదమ్ములు తీరికగా తాంబూలము నములుచు అందలాలెక్కుట, బాధ్యతలేని మరుదులు వినోదమునకై జూదమాడుట, కూతుళ్ళు గుండిగలు దించుట, కోడళ్ళు పసుపుకొట్టుట, పెద్దలు పనులయందు నిమగ్నమై యుండ చేమంతి పుష్పములను కోసి చిట్టి చెల్లెండ్రు దండలు గుచ్చుట, ఇంటనున్న వారికిని వచ్చు వారికిని భోజన సౌకర్యములను కల్పించు బాధ్యతగల వదినెలు వంటలు చేయుట–ఇవన్నియును సంపన్నమగు సమిష్టి కుటుంబముననే సంభవించును. ఈ నోము పాట భారతీయ సమిష్టి కుటుంబమునకు ఆదర్శము.

1. సెలయేరు – పుట – 47

మోచేటి పద్మము "మూగ నోమ"నియు, ఆశ్వయుజ బహుళ అమావాస్య మొదలు కార్తీక శుద్ధ పూర్ణిమ వరకు సాయంకాల వేళల యందు జేయు నోముగాను ప్రసిద్ధిపడసినది. ఈ నోము బాలికను అనుకూలవతియైన గృహిణిగా తీర్చిదిద్దుటకు అవసరమైన సహనము, మితభాషిత్వములను అభ్యసింపచేయుటకు తోడ్పడును. సూర్యాస్తమయ సమయము వరకు పెదవి కదపి ఎవ్వరితోను మాటలాడక కుంకుమ బరణి, అక్షంతలు తీసికొని బాలికలు పొరుగిళ్ళ ముత్తయిదువుల వద్దకు వెళ్ళి వారిచే అక్షంతలు వేయించుకొని వచ్చెదరు. పెద్దలు వారిని పరీక్షించుటకును, కొంటె పిల్లలు వారి నియమ భంగము కలిగించుటకును ప్రయత్నించుచుందురు. పొరపాటునను పెదవి కదపరాదు. కదపినవారికి వ్రత భంగమయినట్లే. వ్రతభంగమయిన కలుగు భయంకర ఫలితములపై నుండు విశ్వాసము వారిని వెన్నంటుచునే యుండును. ఇట్టి నియమమును పాటించుట వలన కన్యలలో ఎంతయో సహనశక్తి అలవడును. పూర్వపు సాంఘిక వ్యవస్థలో ప్రసిద్ధిని పొంది, ఆదర్శ ప్రాయముగానున్న సమిష్టి కుటుంబమున మెలగవలసిన స్త్రీలకు అవసరమగు శక్తిని ప్రసాదించుచున్నదీ నోము.

ఈ నోమునకుండు నియమములుగా "కన్యకలు సాయంకాలము కంఠస్నానముచేసి మడుగు వస్త్రములను ధరించి తులసమ్మ వద్ద నాలుగు పద్మములు పెట్టి, నాలుగు వత్తుల దీపము వెలిగించి మాట్లాడకుండ నలుగురు ముత్తైదువులకు బొట్టుపెట్టి నాలుగు నక్షత్రములను లెక్కపెట్టవలెను. రెండవ ఏట ఎనిమిది పద్మములు పెట్టి, ఎనిమిది వత్తుల దీపము వెలిగించి ఎనమండు గురు ముత్తైదువలకు బొట్టుపెట్టి ఎనిమిది నక్షత్రములను లెక్కపెట్టవలెను. మూడవ యేట పన్నెండు పద్మములనుపెట్టి పన్నెండు వత్తుల దీపము వెలిగించి పన్నెండుగురు ముత్తైదువలకు బొట్టుపెట్టి పన్నెండు నక్షత్రములను లెక్కించవలెను. దీనికి ఉద్యాపన తొలియేడు నాలుగేసి అట్లు నలుగురు ముత్తైదువులకును, మలి ఏడు ఎనిమిదేసి అట్లు ఎనిమిదిమంది ముత్తైదువులకును, నల్లపూసలు లక్కజోడ్లు ఉంచి దక్షిణ తాంబూలములతో వాయనమివ్వవలెను. నోచుకొనిన కన్యకు రెండు చేతులమీద, రెండు కాళ్ళమీద రెండేసి అట్లు, రెండేసి డబ్బులు ఉంచి అన్నగారు

తలుపు వెనకనుండి 'తినికుడిచే కాలానికి రాకె పెదుసర గండ' అనియు, 'ఇప్పుడురానా ముప్పున రానా' అనియు అనవలెను. అప్పుడు నోచుకొనిన కన్య 'ఇప్పుడే రమ్మన' వలెను. అన్న వచ్చి పుస్తకముతో నాలుగు దెబ్బలు కొట్టి నాలుగట్లు తీసికొనవలెను. –[1]. అన్నగారి మాటలలోనున్న పరమార్థమేమిటో తెలియ రాకున్నది.

నేటి కాలమున కొందరు ఈ వ్రత దినములలో సాయంకాలము భగవంతునికి నీరాజనములర్పించు రూపమున మాత్రమే ఈ నోమును గుర్తు చేయించుచున్నారు.

కనుమరుగై పోవుచున్న ఈ నోముల ఉదంతమును వినిన ఇవి పూర్వులచే నిజముగా జరుపబడినవైనను, నేటి కాలమున కల్పితములుగా గోచరించుచున్నవి.

చిట్టి బొట్టు :

ఈ నోము రథసప్తమి నుండి ప్రారంభించి సంవత్సరముపాటు చేయుదురు. ఈ నోమును పట్టిన కన్యలు ప్రతి ఉదయమును తాము శుచిగా తయారైనవారై ఐదుగురు ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గంధము, అక్షతలు యిచ్చి నమస్కరించవలెను. చివరన అనగా సంవత్సరాంతమున ఐదుగురు ముత్తైదువులకు యోగ్యతానుసారము బంగారు బొట్లు చేయించి, వారికి పెట్టి, రవిక గుడ్డలను, దక్షిణ తాంబూలము నీయవలెను. దీనికి

"చిట్టి బొట్టు పట్టవలె – సిరిగలయింట పుట్టవలె
పట్టు పుట్టము కట్టవలె – పసిడి నగలు పెట్టవలె
ఏడుగురన్నలతో పుట్టవలె – ఏక చక్రము నేలవలె
పదుగురన్నలతో పుట్టవలె – పట్టభద్రుని చెట్టపట్టవలె
ఉయ్యాల జంపాల లూగవలె – జంటగ బ్రతుకవలె –[2]

– అను పాటను పాడుకొందురు. ఈ పాటకు పాఠాంతరములు గూడ గలవు. అందొకటి

1. నోములు – కనుమర్తి వరలక్ష్మమ్మ. విజ్ఞాన సర్వస్వము. సంపుటము 4.
2. నేను సేకరించినది. పాడినవారు అనసూయమ్మ, రాయిప్రోలు

"చిట్టి బొట్లను నోచవలె - శ్రీమంతుల బిడ్డై పుట్టవలె
తోబుట్లతోడ తులతూగవలె - దొడ్డ మగనికిదు పిత (?) కావలె -1.

- ఇందు పుట్టింటి ఐశ్వర్యమును, అన్నలతో కూడియుండుట వలన కలుగు ఆనందములు, సంపన్నుడైన భర్తను కాంక్షించుట, అనురాగపూరితమైన మెట్టింటి జీవితమును కోరుట వ్యక్తమగును. కన్యలు కలలుగను కామితములు సిద్ధించిన వారి జీవితము "మూడు పూవులు ఆరు కాయలుగా" నుండుననుటలో సంశయము లేదు.

చిట్టిబొట్టు, ఉదయకుంకుమవంటి నోములవలన బాలికలకు శుభ్రముగ, అందముగా ఉండుటను పెద్దలు చిన్ననాటినుండియే అలవరచుచున్నారని చెప్పవచ్చును. వ్రతభంగమైన ముసలి మొగడు లభించుట, సవతిపోరు ఏర్పడుట, అత్తింట నరక యాతనలననుభవించుట, కుంటీ, గుడ్డీవంటి అవకతవకలు గల పిల్లలు కలుగుట వంటి దుఃఖహేతువులకు భయపడియైన చక్కని క్రమశిక్షణ నలవరచుకొందురు.

కామేశ్వరి నోము :

కామేశ్వరి నోము ఇప్పుడు ఆంధ్రదేశమున పూర్వ ప్రాంతముననే ప్రచారములో నున్నను ఒకప్పుడు తెలంగాణమునందును ప్రచారమందున్నట్లు క్రీడాభిరామము వలన మనకు తెలియుచున్నది. కాకతమ్మ, ఏక వీరలతోబాటు కామేశ్వరిని కూడ కాకతీయులు కొలచుచుండిరి. టిట్టిభశెట్టి, మంచన శర్మ మిత్రద్వయ మోరుగల్లు నగరము చూడబోయినప్పుడు వారు ఏకవీరాదేవి గుడి దాటగానే 'కామవల్లీ మహాలక్ష్మి కైటభారి వలపు పాడుచు వచ్చు జక్కుల పురంధ్రిని' చూచిరి....కామేశ్వరి ఏడుగురక్కలలో కడగొట్టు చెల్లెలు. వారినందరిని అక్కలు అందురు. అక్కలలో ప్రసిద్ధికెక్కిన కామేశ్వరి వ్రతము నొనర్చువారు 'అక్కల కొలువు' చేయుట ఇప్పటికిని పరిపాటి. ఆనాడు ఏడుగురు ముత్తైదువుల పూజలొనర్చి తాళమేళములతో నీపాట పాడెదరు. ఆ ముత్తైదువలను అక్కలు ఆవహింతురని మనవారి నమ్మకము. [1].

1. స్త్రీల వ్రత కథలు-పుట 74.

కామేశ్వరిని పూజించిన అపేక్షిత కార్యములొనగూడునను విశ్వాసము కలదు. ఈ కామేశ్వరినే కామవల్లి అని కూడ అంటారు. కామేశ్వరి పాటను ఏడుగురు పాడెదరు. ఈ పాడు వారిని జక్కులు అందురు. ఈ జక్కులు అనునది యక్ష శబ్దభవము. ఈ కామేశ్వరి వ్రతము సమాప్తియగు వేళకు ఆకాశమున చుక్కలు అగుపడును. అందువలన

"అక్కలు లేచేటప్పటికి నక్కలు కూయును" అను నానుడియేర్పడినది.

ఈ కామేశ్వరి లక్ష్మి అవతారము, రుక్మిణి అవతారము కూడ. లక్ష్మి సప్తకన్యలుగా పుట్టెనట. వారిలో చిట్టచివరిది కామేశ్వరి. ఆమెయే రుక్మిణిగా అవతరించెనట. ఈ సప్తకన్యల అవతార కథను చూడగా పూర్వము విశేష పూజలందుకొనిన సప్తమాతృకలని తోచుచున్నది. వీరిని జక్కులనెడి తెగవారు పాడుటవలన వారి పేరునుబట్టి ఈ దేవతలకు కూడ అక్కలు అని పేరు వచ్చియుండవచ్చును. శివుని పరమున యక్షులే జక్కుల వారైరని కామేశ్వరి పాటవలన తెలియుచున్నది.

"రమణ మీ వంశ పారంపర్యమెల్ల
కమలాక్షి గొలువుండు కామవల్లైమను
కామవల్లిని గొల్చు ఘనులెల్లమున్నె
ప్రేమతో మిము చాల ప్రియముజేసెదరు".

– అని శివుడు యక్షులకీవరమిచ్చెనట.

కామేశ్వరి పాటలోని కథాసారాంశమిది :

లక్ష్మీదేవికి శ్రీరామునిపై మనసు కలిగినది. అతనిని గరుడ వాహనముపై వైకుంఠమునకు పిలిపించి

"చెలువంపు చిరునవ్వు చెక్కుటద్దములు,
మొలక వెన్నెలగాయు ముద్దుసోయగము
వాలు గన్నులు మంచి వక్షస్థలంబు,
నీలంపు జిగి నిగనిగ నొప్పు మేను

రాజసం బొనగూర్చు రత్నహారంబు
ఆజాను బాహులు నంగదంబులును
....
కేరి మన్మథుని చెక్కిలి గొట్టు సొగసు
మీరిన యట్టి యామేటి చెల్వంబు"

– గల రాముని చూచి మరులుగొనెను. రాముడు తాను ఏకపత్నీవ్రతుడనని చెప్పగా లక్ష్మి కోపించి "ధరిమీద కృష్ణావతారమందు, స్థిరమైన వ్రతమెల్ల చెడిపోయి పిదప,

గోప భామలను కురూప భామలను
బ్రతిమాలి పదములబడి వేడుకొనుచు
ధృతి తప్పి దొంగవై తిరుగు చుండెదవు."

– అని శాపమిచ్చెను. రాముడు కూడ కోపము వచ్చి

"నాదైన నామీద నవమోహ మహిమ
వీడక గుందుచు వెతల బొందుచును
కామించి విరహాన గ్రాగుచు మిగుల
కామేశ్వరనుపేరు గలిగి యుండుదువు."

– అని ప్రతిశాపమిచ్చెను. పిదప లక్ష్మి శివునికి సప్తకన్యల రూపమున అవతరించెను. వారిలో చివరిది యగు కామవల్లి జన్మమున తన అక్కలతోపాటు వచ్చి కృష్ణుని కామించెను. అతడు నిరాకరించి కల్క్యవతారమున తనను పొందు మనియు, అంతవరకును రుక్మిణీదేవివై పుట్టిన గ్రహింతుననియు, పిదప కల్క్యవతారము వరకు వేచియుండిన–

"ధర్మంబు గలచోట దరుగల చోట
అర్మిలి వసియించి అర్చనలాగొనుము

విరహవేదన నిన్ను వేదింపకుండు
పరగ నింకొక్క ఉపాయంబు కలదు
ధరణీతలంబున ధర్మాత్ములుగను
వొరసి దంపతులలో నొక్కరిబట్టు
వారిలో నొక్కరి వరియింత నేసు
ఆరూఢి మనకు కళ్యాణంబు కల్గు
తప్పక కలికావతారంబు నందు
కర్పూరగంధివై గైకొందు నిజము - అని చెప్పెను.

లక్ష్మి వెంటనే రుక్మిణియై జన్మించిన కృష్ణుని వివాహమాడెను. కాకతీయుల కాలమున కామేశ్వరి పాట పాడు పద్ధతిని క్రీడాభిరామము ఇట్లు వర్ణించుచున్నది.

సీ॥ "ముద్రికా మాణిక్యములదీప్తి కెంగేలి పించెంబు గుంచెతో బిత్తరింప
నుపవాసమున తద్దయును సన్ననగు కౌను చనుదోయి భరమున జలదరింప
దోక చుక్కలబోలు తోరంపు దెలికన్ను లావైళమున సిగ్గు నతకరింప
నిద్దంపు వెలిపట్టు నెరిక దూలిన యప్డు తొడల మించులు వెలి దొంగలింప
నురుమ చప్పుళ్ళకును బిల్లదురుల మ్రోత
కంత కంతకుఁ బేరుబ్బునావహింప
నాఁడె బీటలపై నొలిఁగూడియున్న
యక్క లేద్వురలో నొక్క యలరు బోఁడి" -[1]

మరియు "అక్కలేద్వురు నదె యాడజొచ్చిరి కడుంగడువేడ్క" నని పేర్కొనబడినది.

ఏకాదశీ వ్రతము :

హిందువులలో ఏకాదశి దివసమన్ని దినములలో శ్రేష్ఠమైనదిగా పరిగణింప బడుచున్నది. ఏకాదశి యనగా ప్రతి పక్షమునకు పదునొకండవ తిథియని యర్థము. ప్రతి నెల యందును రెండు ఏకాదశులు వచ్చును. ఏకాదశి యందు

1. తెలుగు జానపద గేయ సాహిత్యము-పుట 424.

హరికీర్తన ప్రధానముగా చేయబడును, కావున దీనికి హరివాసరమనియు వ్యవహారమేర్పడినది. –[1]

ఏకాదశి వ్రతమున అన్ని వ్రతములలో కంటెను కఠినముగా ఉపవాసమును పాటించెదరు. దశమినాడు రాత్రి నిరాహారుడై ఏకాదశి యందు నీరు కూడా పుచ్చుకొనక ద్వాదశినాడు ఉదయము పారణమొనర్చి, ద్వాదశినాడు రాత్రియును నిరాహారుడై యుండవలెను. అట్లుండిననేగాని ఏకాదశి వ్రతము సంపూర్ణము కాదు. "ఏకాదశీవ్రత మొనర్చువాడు సూర్య చంద్ర గ్రహణములలో భూరిదానము లొనర్చిన పుణ్యమును, అశ్వమేధ యజ్ఞఫలమును, అరువది వేల సంవత్సరముల తపఃఫలమును పొందునని స్మృతులు, పురాణములు తెలుపు చున్నవి. ఏకాదశినాడు పవసించుట బ్రాహ్మణులకు భూమిని దానమిచ్చుట కంటెను, విద్యార్థులకు వేదవిద్యాదానము చేయుటకంటేను ఉత్తమమైనదని పురాణేతిహాసములు ఉద్ఘోషించుచున్నవి.

ఏకాదశినాడు ఉపవసింపక భుజించువాడు మహాపాపములు పొందు ననియు పురాణములు హెచ్చరించుచున్నవి. "ఏకాదశ్యాం న భుంజీత పక్షయో రుభయో రపి" అని పెక్కు స్మృతులు చెప్పినవి. –[2] ఇన్ని రకములుగా ఏకాదశి ప్రాముఖ్యమును పేర్కొనుట ఆ దివసమున ఉపవాసముండవలెనను విషయమును హెచ్చరించుటయే. ప్రజలలో పాపభీతి అధికముగా నుండును కనుక సులభముగా లొంగిపోయెదరు.

అన్ని యేకాదశులలో ఆషాఢ శుద్ధ ఏకాదశి చాల ముఖ్యమైనది. దానినే "ప్రథమైకాదశి" – తొలి ఏకాదశి యని అందురు. చాతుర్మాస్యము అప్పటినుండియే ప్రారంభమగును. ఆషాఢశుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తీక శుద్ధఏకాదశి వరకు చాతుర్మాస్యమనబడును. ఈ నాలుగు నెలలందు వచ్చు నేకాదశి దినములు చాల పవిత్రమని భావింపబడుచున్నవి. ఆషాఢ శుక్ల ఏకాదశినాడు చేయు వ్రతమును 'గో పద్మ వ్రత' మందురు.

1. హిందువుల పండుగలు-పర్వములు-పుట 112.
2. హిందువుల పండుగలు, పర్వములు-113.

పూర్వము కుచేలుడు సహితము సర్వ దరిద్రుడై ఏకాదశీవ్రత మాచరించి నందున ధనికుడయ్యెనని చెప్పబడుచున్నది. ఏకాదశీ ప్రాముఖ్యమును తెలుపు కథలనేకములు కలవు. ఇందు రుక్మాంగదుడను రాజు కథ ప్రసిద్ధము. రుక్మాంగదుడు పరమ వైష్ణవ భక్తాగ్రేసరుడగు రాజు. సుప్రసిద్ధ జానపద వాఙ్మయ పరిశోధకుడగు నేదునూరి గంగాధరంగారు "ఏకాదశీ మాహాత్మ్యమును రుక్మాంగద మహారాజు కథగా" రచించిరి.

మొత్తముపై సంవత్సరమునకు ఇరువది నాలుగు ఏకాదశులు వచ్చును. ప్రతి ఏకాదశియు నేదోయొక మాహాత్మ్యము కలదిగా పౌరాణికులు వర్ణించి యున్నారు.

జన సామాన్యము తొలి ఏకాదశి యని పిలువబడు ఆషాడ శుద్ధ ఏకాదశి యందు అధికముగా నుపవాసముందురు. ఈ దినమును గూర్చి ఎస్.సి. డూబేగారు "ఆషాఢ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి. బ్రాహ్మణులు, కోమట్లు, కొందరు రెడ్లు ఈనాడు ఉపవసించెదరు. ఇండ్లలోను, గ్రామ దేవాలయములలో విష్ణువు అవతారములను పూజించెదరు. కొబ్బరికాయను, ఖర్జూరములను నివేదించెదరు. సెనగపప్పు, బెల్లము భుజించెదరు" అని పేర్కొనిరి.–[1] ఇందు పేర్కొనిన కులస్థులేగాక ఇతర కులస్థులును ఈ ఏకాదశి ఉపవాసములను ఆచరించుట కలదు. సెనగపప్పు, బెల్లముతోబాటు భగవంతునికి నివేదించిన పండ్లను ఆరగించుటయు కలదు.

తరువాత మోక్ష ఏకాదశి యని పిలువబడు మార్గశిర శుద్ధ ఏకాదశిని ఆచరించెదరు. దీనినే వైకుంఠ ఏకాదశి అని అందురు. ఈ ఏకాదశినాటికి దాదాపు ఉత్తరాయణము ప్రారంభమగును. ముప్పదిమూడు కోట్ల దేవతలు ఈనాడు భూలోకమునకు దిగివచ్చెదరని పెద్దలందురు. అనగా దేవతలకు ఆరు నెలలు పగలు, ఆరు నెలలు రాత్రి అని వాడుక. దక్షిణాయనమనే రాత్రి తొలగి ఉత్తరాయణమనే పగలు ప్రారంభము కానున్నదని అర్థము. దీనికి సూచనగా విష్ణ్వాలయములలో ఉత్తరమున ఒక ద్వారము తెరచెదరు. తెల్లవారుజామున దైవదర్శనమునకు ద్వారము గుండా పోయెదరు. వారికి మోక్షము

1. Indian village - S.C.Dube

తప్పదని హైందవుల విశ్వాసము. సూర్యుని ఉత్తరాయణ ప్రవేశ చిహ్నముగా ఈ వైకుంఠ ద్వారము తెరచుట ఆచారమయినది.

వైద్యులు సహితము ఉపవాస మప్పుడప్పుడు నుండుట యారోగ్యప్రదమని యందురు. ప్రతి మతమందును నుపవాసపద్ధతికి ప్రాముఖ్యము కలదు. ఈ ఉపవాసపద్ధతి వలన ఇహమును, పరమును సిద్ధింపజేసినారు ఆర్యులు, ఏకాదశి వ్రతమునకు సంబంధించి కథలేగాని పాటలు లభించలేదు. బి. రామరాజుగారు ఈ క్రింది చిన్న గేయమును ఉదాహరించినారు.

చిత్తుమ్మ ఏకాశి చిలుకు దాదోశి
మాదుమ్మ ఏకాశి మంచి దాదోశి
దక్షకుని ఏకాశి ఇంక నెల్లాళ్లు
కాసె పుల్లలుదెచ్చి కసువార దీసి
ఆవుపెండా దెచ్చి అరుగుల్లు అలికి
గోవుపెండా దెచ్చి గోలెంల గలిపి
ధరణి మీదా సాన్పు (కలాపి) దట్టంగ చల్లి
కాళ్ళు మొకమూ గడిగి కడుపలూ గడిగి
కడపకూ ఆకాంత ఏమాని మొక్కు
అష్ట సంపదలివ్వు అతి భాగ్యమివ్వూ
కోటి సంపదలివ్వు కోమాండ్లనివ్వూ
ఎప్పటికి ముత్తైదతనము నాకివ్వూ. –[1]

– ఇందు ఏకాదశి మాహాత్మ్యములు పేర్కొనకపోయినను ఇల్లాలి కోరికలు పేర్కొనబడినవి.

ఏకాదశి మాహాత్మ్యము – రుక్మాంగద మహారాజు కథలో మాత్రము "ధరను యెవ్వరేని మరణంపునొంద, వైకుంఠ పురమునకు వార్పోవు" చుండిరి. అని మోక్ష ప్రధానముగా పేర్కొనబడినది. –[2]

---

1. తె. జానపద గేయ సాహిత్యము–పుట 429.
2. తె. జానపద గేయ సాహిత్యము–పుట 346.

ఏకాదశికి "హరివాసర" మని కూడ పేరు కలదని ఇదివరకే సూచించి నాను. సూర్యుడు, హరి, విష్ణువు--ఇవి యన్నియు సూర్యునకు పర్యాయములు. ఏకాదశి సూర్యుని గతితో సంబంధించినది. ఏకాదశి నాటికి సూర్య గతిలో కొంత మార్పు జరుగును. శయనేకాదశి, పరివర్తనేకాదశి, ఉత్థానేకాదశి, వైకుంఠేకాదశి అనునవన్నియు సూర్యుని గతిని స్పష్టముగా తెలుపు దినములు. సూర్యుడు క్రమముగా విష్ణువుగా ఆరాధింపబడుట ప్రారంభమైన పిదప ఈ ఏకాదశి దినములు హరివాసరములైనవి. పిదప వీని ప్రాధాన్యము ప్రజలకు తెల్పుటకు ఉపవాస నిబంధనములును, పురాణకథలను చేరియుండును. వైష్ణవులకు ఏకాదశి వలెనే, శైవులకు శివరాత్రి మోక్షప్రదమైనది.

లక్షవత్తుల నోము :

ఇది కార్తీక మాసములో ఆచరింపబడును.

సతులకు సకల పాపంబులే బాయు
ఏ పాపమయిన ఏ దోషమయిన
సకల పాపదోష సంగ్రహము పోను
చిచ్చులు బెట్టిన శివహంతలయిన
గరళాన్నమును చేత కలిపి పెట్టినను
దుష్టులు బ్రహ్మహత్యలు కోటి చేసినను
కాంతనంటెడు మహాపాతకము బాయు
స్త్రీవర్తులయినను శివద్రోహులయిన
గోహంతకులయిన బ్రహ్మఘ్నులైన
సకల పాపదోష సంగ్రహము పోను –[1]

– ఈ పాపములన్నియు పోవుటకును, ఇతర వ్రతాచరణములలో సంభవించిన లోపములు పోవుటకును ఈ వ్రతము చేయుదురు. ఇందు నిర్దేశించిన పాపము లను చూచిన పురుషులును దీనిని నొనర్తురని తెలియుచున్నది. ఈ వ్రతమును చేయువిధము 'లక్షవత్తుల నోము' పాటలో ఈ విధముగా నున్నది. దీనినే "లక్షవర్తుల నోము" అని కూడ వ్యవహరింతురు.

1. మిన్నేరు–పుట 241.

"భద్రమైనట్టి ముప్పది పావుసేర్లు
కంచాము తెప్పించి మంచి యాజ్యాన, వత్తులలో పది భాగముగల సంఖ్య
బంగారు వత్తి శోభనంబుగా జేసి
వ్రతముల లోపల వ్రతము గావించి
దానమీయగ వలయును తగినవానికి."

– ఈ వ్రత కథను కృష్ణుని అష్టభార్యలలో నొకతెయైన లక్షణ వ్రాసెనట. ఈ పాట ఫలకృతి ఇది–

"ఈ పాట యెవరైన పాడినా విన్న
నిలమీద సత్రాలు గట్టిన ఫలము
కోటికన్నెల దానము చేసిన ఫలము
గోవు దానంబులే చేసిన ఫలము
విన్నవారికి గలుగు విష్ణులోకంబు
పాడినవారికి బ్రహ్మలోకంబు" –[1]

– సిద్ధించునని చెప్పబడినది. ఈ వ్రతము గూడ చేయలేనప్పుడు కేవలము భక్తి చాలునని ఈ లక్షవత్తుల పాటలోనే కలదు.

"అందుకు శక్తి లేకున్న కలదైన కొలదైన
కలిగినాగాని కాంత దేవరభక్తి కావించవలెను" –[2]

నేను ఈ పండుగ సందర్భమున పరిశీలించిన విషయము ననుసరించి దీనిని స్త్రీలే ఆచరించెదరు. సంవత్సరము మొత్తములో చేయదగిన వ్రతములను గృహ పరిస్థితుల ననుసరించిగాని, అనారోగ్య కారణముగాని, బహిష్టుగా నుండుట కారణముగాగాని ఆచరింపలేని యెడల వాటన్నింటి పరిహారార్థము ఈ వ్రతము కార్తీక పూర్ణిమనాడు ఆచరించెదరు. ఈ దినమున లక్షవత్తులను వెలిగించిన శుభమగుననియు, మోక్షము సిద్ధించుననియు నమ్మకము వారిలో గలదు. అందుకే

1. మిన్నేరు–పుట 243.
2. మిన్నేరు–పుట 241

స్త్రీలు తీరికవేళలో ప్రత్తితో వత్తులను చేయుచు, సాధ్యమయినన్ని ఎక్కువగా తయారుచేసుకొని ఈ వ్రతదినము కొరకు దాచిపెట్టుకొందురు.

వృక్ష పూజ :

వృక్షములను పూజించు ఆచారము అనాదిగా ప్రపంచమంతటను కలదు. ఆ ఆచారపు అవశేషములు ప్రతి మతములో నేటికిని వివిధ రూపములలో కనిపించుచున్నవి. "నిత్యత్వమునకు చెట్లను పూజించుట అన్ని దేశములలోను ఉన్నది. ఫర్ చెట్టు గోపురాకారముగా పెరుగు ఒక విధమైన సరుగుడు చెట్టు. ఇది ఎంత మంచులోనైనను బ్రతుకగలదు. మంచు కప్పినా కూరుకుపోయి మంచు కరుగగానే తలఎత్తి చూస్తుంది. దానిని పూర్వము పాశ్చాత్యులు నిత్యత్వ చిహ్నముగా ఆరాధించినారు. ఆ ఆచారము మతము మారినా క్రిస్మస్ వృక్షముగా నిలచినది. నేటికీ సోషలిస్టు దేశములలో సైతము క్రిస్మస్ పండుగనాడు ఫర్ చెట్టు కొమ్మలను పట్టుకొని క్రైస్తవులు గంతులు వేయుచుందురు. –[1]

సింధులోయ సంస్కృతిలో చెట్లకును, పశువులకు స్థానమున్నట్లు తోచుచున్నది. "జుట్టు విరియ బోసికొని కొమ్ముల శిరోలంకరణము ధరించి, కొన్ని ముద్రికలలో కానవచ్చు. ఆసీనుడైన వ్యక్తిని బోలిన ఒక నగ్నవ్యక్తి ఊర్ధ్వముఖములైన రెండు అశ్వత్థ శాఖలమధ్య నిలువబడియున్న దృశ్యము పెక్కు మృణ్మయ ముద్రికలపై నున్నది. –[2]

వృక్ష పూజ వేదములందును కలదు. మాదకమగు రసమును స్రవించు సోమలత వేదదేవతా గణమున ఒక ముఖ్యమగు దేవత. ఋగ్వేదములోని పెక్కు మంత్రములు సోమలతను, సోమరసమును స్తుతించుచున్నవి. ఈ సోమలత ఏదియో తెలియుట లేదు. –[3]

---

1. తెలుగు పండుగలు – శ్రీ తిరుమల రామచంద్ర–పుట 35, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ – ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ 1975.
2. The Hindu Religious Tradition - page.7
3. Hindu Religion, customs & manners, page.36

భారతీయ సంప్రదాయమున వృక్ష పూజ ప్రాధాన్యము గురించి చెప్పనవసరము లేదు. పూర్వము "అపరాజిత" అను ఓషధిని పూజించి రక్షాబంధనముగా చేతికిగాని, మణికట్టుకుగాని, కట్టుకొనుచుండిరని శాకుంతలమున సింహదమనుని వృత్తాంతమువలన తెలియుచున్నది–[1]. విజయదశమినాడు శమీ వృక్షమును పూజించుట మనమందరమెరిగినదే. దానికి కూడ అపరాజిత అను పర్యాయనామము వ్యవహారమున కలదు. శమీవృక్షమున దేవతలుందురని భారతదేశమున పెక్కు ప్రాంతములవారు నేటికిని విశ్వసించుచున్నారు. సూర్యక్రాంత, విష్ణుక్రాంత, తెగడ మున్నగు మూలికలను కట్టుకొనుట ఆరోగ్యదాయకములని వైద్య గ్రంథములు చెప్పుచున్నవి. తెగడను చిన్నపిల్లల మెడలోగాని, చేతికిగాని కట్టెదరు–[2]

రావిచెట్టును మనము అశ్వత్థనారాయణుడను పేరుతో సంతాన ప్రాప్తి కొఱకు పూజించుట ఆచారము. ఈ అశ్వత్థము నీడన బుద్ధుడు జ్ఞానము పొందుట వలన ఈ చెట్టుకు మరింత పవిత్రత యేర్పడినది. వట, అశ్వత్థ వృక్షములు విష్ణువునకు, బిల్వవృక్షము శివునికిని పవిత్రమైనవి–[3]. పిప్పల, శమి, వట వృక్షములేకాక పెక్కు తక్కిన వృక్షములును వేదకాలమునుండియు పవిత్రములుగా భావింపబడి, పూజింపబడుచున్నవి, వానిలో ఉదుంబర (మేడి), ఖదిర (చంద్ర), నింబ (వేప), తులసి, పలాశ (మోదుగ), ప్లక్ష (జువ్వి), కమలము కలవు. ఉదుంబరమును యజ్ఞ యూపస్తంభములు, స్రువములు చేయుటకును, వటవృక్షమును యజ్ఞమున వాడు చమసములు చేయుటకును, ఖదిరమును స్రువములు, ఆత్మరక్షణమునకుపయోగించు కేడెములు చేయుటకును, బిల్వమును యూపస్తంభములు చేయుటకును వినియోగింతురు–[4].

మహాభారతములోని కర్ణపర్వమున శమి, పీలు, కరీరముల పెద్ద యరణ్యములుండెనని ప్రస్తావింపబడినది.

1. సేయం అపరాజితానామ ఓషధి–అభిజ్ఞాన శాకుంతలము–సప్తమాంకము.
2. పాండురంగ మాహాత్మ్యము.
3. Hindu Religion, Customs and manners - page.35
4. New light on the Indus Civilization Vol.I, Y.K.N. Sastry Page.25

వేపచెట్టునకు వైదిక సంప్రదాయములో స్థానము లేకపోయినను ఔషధ ముగా దాని ఉపయోగము అధికముగా నుండుట వలన దానిని దాక్షిణాత్యులు ఆరాధించు ఆచారము అతిప్రాచీన కాలము నుండి కనిపించుచున్నది. రావి చెట్టును, వేపచెట్టును ఒక పాదులోనే పెంచి వానికి వివాహములు చేయుట ఆర్యద్రావిడ నాగరికతా సమ్మేళనమని నేదునూరి గంగాధరముగారు వ్యాఖ్యానించుట ఎంతో సమంజసముగా నున్నది-[1]

గడ్డి తెగలలో దూర్వా, కుశములు పవిత్రమైనవి. వీనిని వ్రతములకును, పూజలకును వినియోగించుచున్నారు. వేప, రావి, మారేడు, తులసి, కంద, ములగ, గుమ్మడి, రేగు, బచ్చలి మున్నగు చెట్లను పూజించు వ్రతములు పెక్కులున్నవి. వృక్షపూజలు కామ్యవ్రతములలో చేర్చదగినవే యగును.

ఈ వృక్షపూజలలో మనకు తులసి పూజ అతి ముఖ్యము. సంప్రదాయము ననుసరించువారి యిండ్లలో మనదేశమున తులసి చెట్టు ఉండును. స్త్రీలకు సమస్త సౌభాగ్యము లొసగుటకును, దైవభక్తికి ఇది ఆదర్శము.

శ్లో॥ తులసీకాననం యత్ర యత్ర పద్మవనాని చ
సాలగ్రామ శిలాయత్ర తత్ర సన్నిహితో హరిః

– తులసి వనమెచ్చట నున్నదో, పద్మవన మెచ్చట నున్నదో, సాలగ్రామ శిల ఎచట గలదో అచట హరి సన్నిహితుడై యుండును.

"తులసిని నాటినను, నీరు పోసినను, చూచినను, తాకినను, పోషించినను పురుషార్థములొసంగును. తులసి యున్నచోటు పావన స్థలముగా, తులసి తోటకు మూడామడల వరకు గంగాతీర్థముతో సమానమగు పావన స్థలముగా భావించవలెను. ఉదయముననే లేచి తులసిని చూచినచో సమస్త తీర్థములు చూచిన ఫలము లభించును. తులసి సన్నిధిలో ప్రాణముల నెవరు విడుతురో వారికి నరక బాధలేదు సరికదా పరమపదమునకు పోవుదురు-2. ఇట్టి విశ్వాసముల ననుసరించి తెలుగు మహిళలు తులసిని పూజించెదరు. కార్తీక

1. మిన్నేరు-పుట 211.
2. నిత్యసాధన చంద్రిక-విశ్వ హిందూ పరిషత్-రాజమండ్రి పుట-22.

శుద్ధ ద్వాదశినాడు తులసికిని ఉసిరక కొమ్మకును వివాహము చేసెదరు. ఉసరిక విష్ణువు స్వరూపము.

తులసిలో దాదాపు ఏడెనిమిది రకములున్నవి. తులసి ఆయుర్వేద శాస్త్రము ననుసరించి గొప్ప మూలిక. త్రిదోషములను హరించును. దీని మీదుగా వచ్చు గాలి దీర్ఘాయుప్రదము. తులసి గుణములు వైద్య గ్రంథములలో విశేషముగా వర్ణింపబడినవి.

"తులసీ లఘు తిక్తోష్ణారూక్షిః కఫవాత నుత్
క్రిమి దోషమ్ హరత్యేషారుచికృత్వహ్ని దీపనే"–[1]

– తులసి తెగలలో కృష్ణ తులసి ఆయుర్వేద దృష్టితో శ్రేష్టమైనది. ఇది శ్వాసరోగములను, పార్శ్వశూలలను, దౌర్గంధ్యమును హరించును. గజ్జి, తామర, దురద మున్నగు చర్మ వ్యాధులు దీని రసము పూయుట వలన తగ్గుననుట అనుభూతి ప్రక్రియ. తేలు, పాము విషమును కూడ దీని రసము తగ్గించును. ఇట్టి మూలికా ప్రాధాన్యమును బట్టియే దీనినొక దేవతగా పూజించుట, వివాహాదులొనరించి ఆనందించుట ఆచారమై యుండును. అంతేగాక "తులసిని సేవించిన వారికి కలిదోషముండదట–[2]. పెండ్లికాని బాలికలు కన్నె తులసమ్మ నోము అని పూజలు జరుపుదురు. దీనిని కన్నె పిల్లలు వివాహమాశించి చేయుదురు.

తులసిని గురించి ఎన్నియో పురాణ కథలు వెలసినవి. ఈమె ఒక దేవతగా ఆరాధించబడినది. ఈమె జన్మమును గురించి, మహాత్మ్యమును గురించి ప్రసిద్ధిపడసిన కథేతివృత్తమిది : పూర్వము కాలనేమి అను రాక్షసుడుండెను. అతని కుమార్తె తులసి, పరమేశ్వరుడొకనాడు చెమటబొట్లను చేతితో విసరెను. అది సముద్రములో పడగా దానినుండి జలంధరుడను రాక్షసుడు పుట్టెను. వాడు పెరిగి ప్రబలుడై స్వర్గము నాక్రమించెను. అతడు అజేయుడు, అతని భార్య పాతివ్రత్యము చెడనంతవరకు అతనికి మరణము కలుగకుండ పితామహుడు వరమిచ్చెను. విష్ణువునకీ రహస్యము తెలియును. దేవతలు తమను కాపాడుమని

1. ధన్వంతరి నిఘంటువు
2. ధర్మసింధు – తృతీయ పరిచ్ఛేదము – పుట – 538

విష్ణువును ప్రార్థించిరి. విష్ణువు మారువేషమున వెడలి తులసి పాతివ్రత్యమును భంగమొనరించెను. ఇంద్రుడు వెంటనే జలంధరుని తలనరికెను. ఆ తల తులసి యెదుట పడెను. తులసి విష్ణువు మోసమును తెలుసుకొని శిలారూపమును పొందుమని శపించెను. ఆ శాపము వలన విష్ణువు గండకీ నదిలో సాలగ్రామ రూపమును పొందెను. విష్ణువు ఆమెను చెట్టు కమ్మని శపించెను. ఆమెయే ఓషధీ రూపమున తులసి, పద్మ పురాణములోనున్న ఈ కథలో కొంత మార్పున్నది. జలంధరుడు ముక్కంటి మూడవకంటి నుండి పుట్టెను. అతని భార్య బృంద. జలంధరునికి దేవతలతో యుద్ధము జరిగినప్పుడు అతని విజయమునకై బృంద విష్ణువును పూజించెను. విష్ణువు దేవతలకు విజయము చేకూర్చదలచినవాడు కనుక జలంధర వేషమున ఆమె వద్దకు వచ్చెను. ఆమె నిజ భర్తయని నమ్మి అతనితో గడిపెను. ఇంతలో తెగిన నిజమయిన భర్త తల ఆమె ఎదుట పడెను. ఆమె మోసమును గ్రహించి విష్ణువును శపించదలచగా విష్ణువు లోక కళ్యాణమునకై ఈ పని చేసితినని ఆమెకు నచ్చచెప్పి "తులసీదేవిగా నీవు లోకమున పూజలందుకొందువు "అని వరమిచ్చెను. తులసి మహాత్మ్యమునకు పరాకాష్టగా 'శ్రీకృష్ణ తులాభారము' కథ కల్పింపబడినది. ఇది భాగవత హరివంశాదులలో కన్పించదు. వానిలో పుణ్యకవ్రతము మాత్రము కలదు. పారిజాతాపహరణ ప్రబంధమునందును శ్రీకృష్ణ తులాభారము కథ లేదు. కాని స్త్రీల పాటలలో తులసీదళము అను పేరున విపులముగా నున్నది.

వైద్య గ్రంథములలో కార్తీక మాసపు రెండవ పక్షమును, మార్గశిరమాసపు మొదటి పక్షమును పెక్కు రోగములకు ఆలవాలము గనుక "యమదంష్ట్ర" అని పేర్కొనబడినది. ఈ నెలనాళ్ళు అనుసరించవలసిన నిత్యకృత్యములును వివరింపబడినవి–[1]

ఈ తులసి కథ చదివిన "విష్ణువంతటివాడు ఒక భక్తురాలి పాతివ్రత్యమును పాడు చేయుటకు ఉద్యమించునా?" అను సందేహము కలుగును. లోక కళ్యాణమిట్లు చేసితినని విష్ణువు చెప్పిన సమాధానము పాఠకుల మనస్సున కంతగా నచ్చకపోవచ్చును. జలంధరుడు చెమటనుండి పుట్టుట, తులసి పాతివ్రత్య

1. "కార్తికస్య అంతిమః పక్షః, మార్గశీర్షస్య చ ఆదిమః" యమదంష్ట్రా సమాఖ్యాతా.... అష్టాంగ హృదయము–సూత్రస్థానము.

భంగమొనర్చుట, తులసిపెండ్లిని విష్ణువుతో జరిపించుట – వీనిని పరిశీలించగా చెమట వలన రోగములు తలుగుననియు విష్ణువుతో వివాహమున నాలుగు నెలల వాన తరువాత ఓషధులకు సూర్యునితో సంబంధము లేర్పడుట అనియు, దానికి సంకేతమే తులసి వివాహమనియు తోచుచున్నది–1.

ఈ తులసి మహాత్మ్యమును తెలుపు పాటలు జానపద స్త్రీ సాహిత్యములో ఎన్నియో కలవు. తులసీదళము అను పాటలో ఇప్పటి కృష్ణ తులాభార కథ అంతయు కలదు. సత్యభామ కృష్ణుని నారదునకు దానమిచ్చి అతని ఎత్తుసొమ్ముతో మరల అతనిని గ్రహించుటకు తూచిన సందర్భమున–

"అతని త్రాసు తెమ్మటంచు
అడిగె విభునితోడ తెచ్చి
వెలది వింతగా మౌని ఎదుట నిలిచెను.
లెక్కలేని మాడలన్ని ఒక్కవంక రాశి పోసి
ఒక వంక కంసవైరి నందుసుంచెను
ఎత్తుదాక పోసి ధనము
ఏమి నిష్ఠ కోరగలవు
ఎంతగాను తూచినాను తూగదాయెను."

– అప్పుడు సత్యభామ తన అహంకారమును తగ్గించుకొని రుక్మిణి యొద్దకు వెళ్ళి కృష్ణుని తూచుటకు ఆమె ధనమును కోరగా రుక్మిణి నవ్వి

"స్నాన మాచరించి మంచి రతన వన్నెపట్టుగట్టి
మేలి సొమ్ములన్నిపెట్టి మెరపు తీర్చెను,
పొంకమైన భూషణములలంకరించి గంధంబు
పొంకముతో సతులు వేగ అపుడమర్చిరి

---

1. హిందువుల పండుగలు – పర్వములు – 337.

అందముతో తులసిదేవి అరుగ అలికి ముగ్గు పెట్టి
పణతి సకలోపచారమున పూజ చెసేను.

....

తులసి దళము చేతబట్టి తూగవలయును అనుచు బాల
చెలియ మౌనితోడ తా ప్రతిన బట్టెను
మొదట మట్టు ధనము అంతయు
మొదలంట తీసివేసి
సెలియ కుడుకలో తులసి దళములుంచెను
అప్పుడు సర్వజనులు చూడ
అద్భుతముగా విష్ణుమూర్తి
కపటమేమి లేక తూనికమర జొచ్చెను."

– ఇట్లు తులసి దళము మాహాత్మ్యము వివరింపబడినది.

"తులసి ఇంట నుండువారు
తులసి పూజ చేయువారు
తులసి వారి దిక్కున యమ
భటులు చేరలేరుగా
సంస్కరించితేను మోక్ష
మొచ్చు పుణ్యమొచ్చు" –[1]

– ఇట్లు ఫలశ్రుతితో ఈ పాట సమాప్తమగును.

"గోవింద నామాలు" అను పాటలో తులసి పూజా విధానము తెలుపబడినది–[2.]

1. స్త్రీల పాటలు యన్.వి. గోపాల్ అండ్ కో–49–53.
2. స్త్రీల పాటలు యన్.వి. గోపాల్ అండ్ కో – 54.

"తులసి మేలుకొలుపు" అను పాట ఇప్పటి వెంకటేశ్వర సుప్రభాతము వంటిది.

"మేలు కొనవే రామ తులసీ,
మేలు కొనవే లక్ష్మి తులసీ–[1]

"మేలుకొనవే కృష్ణ తులసీ, మేలు కోవమ్మా" అని సంబోధించుటతో ఇది ప్రారంభమగును. ఆచార పరాయణలైన స్త్రీలు ప్రతి శుక్రవారము పసుపు కుంకుమలతో తులసిని పూజించెదరు.

ఒక "తులసిదేవి పూజ" పాటలో ఒక మహిళ ఆమెకు చేయదలచిన షోడశోపచారములలో

అలవాలము గట్టెద ప్రతి దినము త్రి
కాలముల నీరెట్టెద
వ్రేళ్ళ నా జల బిందువులను
మంత్ర మంత్రార్థముల నొరపుచు నొడ
లెల్ల జల్ల నుల్ల సిల్లి మదిశ్రీ
తులసి నిన్నే పూజించెద సతతము–[2]

అని ఎంతో భక్తిని కుమ్మరించినది. పూజాంతమున తులసికి మంగళహారతి నిచ్చెదరు.

వెన్నులును ఆకులును ఏపుగల దళములను
తిన్ననగు శ్రీ తులసి కొమ్మలకును
వన్నె మీరగ తులసి వన పుత్రిక అయినట్టి
కన్యశ్రీ ఆండాళు కాంతమ్మకు
జయ మంగళం నిత్య శుభ మంగళం –[3]

---

1. సెలయేరు – 67.
2. మిన్నేరు – 216.
3. మిన్నేరు – పుట – 218.

– ఇట్లు తులసి మొక్కలోని కొమ్మలకు-రెమ్మలకు-ఆకులకు-దళములకు మంగళ హారతి ఎత్తుట జానపద మహిళల భక్తి పారవశ్యమును తెలుపుచున్నది.

కందగౌరి నోము :

కందగౌరి నోము సంతాన ప్రాప్తి కొరకై చేయునది. దీనిని శ్రావణ బహుళ అమావాస్యనాడు చేయుదురు. దీనినే పోలేరమ్మ అమావాస్య, పోలాల అమావాస్య, పోలామవాస్య అని కూడ వ్యవహరింతురు. పోలేరమ్మను పోలాలమ్మ అందురు. అంతేగాక పోలామవాస్య అనుటకు మరియొక అర్థము కూడ కలదు. పోల అనగా నీరు మేత తిని పనిలేక యున్న ఎద్దు. అట్టి ఎద్దులను పూజించు అమావాస్య కనుక "పోల+అమ=పోలామ" అని అయినది. ఆ రోజు పశువులను పూజించి వానికి పుష్టిని కలిగించు నూనెతో కూడిన పులగమును పెట్టుదురు. అంతేగాక వానితోనెట్టి వ్యవసాయికపు పనులను చేయించరు. ఇది కారణముగా ఈ పేరు వచ్చియుండునేగాని తిండి దండుగగా నుండి వ్యవసాయమునకు తోడ్పడని పశువులను పూజించుటయని మాత్రము కాజాలదు.

ఈనాడు పిలకలు వేసిన కంద దుంపలను తెచ్చి పసుపురాసి కుంకుమ పెట్టి పూజింతురు. దీనివలన కంద అభివృద్ధి చెందినట్లు తమ సంతతి కూడ అభివృద్ధి చెందునని భావము. "ఈ విధముగా ప్రకృతి పదార్థములను సంకేతముగా వాడుకొనుట ఆర్యులలోను ఉండెడిది. మహారాజులయినవారి పట్టాభిషేక సమయములో రెల్లు గడ్డి భూమిలో అల్లుకొని పోయినట్లు తన ప్రజానీకములో అల్లుకొని పోయి సుప్రతిష్ఠుడగునని నమ్మకము కలదు–[1]

స్త్రీలు కందను పూజించుచు –

"కందను పెట్టి పూజించెదను
సిద్ధించును సకల సంపదలు
వెనుకాముందు పసిపాపలు పాయక ఉందురు –[2]

– అని పాడి అక్షతలు వేసికొందురు.

1. లక్ష్మీరంజన వ్యాసావళి – పుట – 123.
2. పాడి వినిపించినవారు యశోదరమ్మ – వెలిమినేడు.

పోలేరమ్మ ప్రసక్తి కలిగిన హాస్య గేయము నొకటి లక్ష్మీరంజనముగారు ఉదాహరించిరి :

గోపికలు : పోలేరమ్మకు మేము పిండీరుబ్బుకొంటె
బోర్లతీసిపోయె మీవాడు
అయ్యో బోర్ల తీసిపోయె మీవాడు.

యశోదమ్మ : మావాడు కాడమ్మ, మరి యెవ్వరోకాని
మందలో ఉన్నాడు మావాడు॥

గోపిక : పోలేరమ్మకు మేము కోక తెచ్చుకుంటె
గోచీ చింపుకు పోయె మీవాడు
అయ్యో గోచీ చింపుకపోయె మీవాడు.

యశోదమ్మ : మావాడు కాడమ్మ మరియెవ్వరోకాని
మందలో ఉన్నాడు మావాడు॥

గోపిక : పోలేరమ్మకు మేము వేట తెచ్చుకుంటె
వాతపెట్టిపోయె మీవాడు-1.

– ఇట్లు చమత్కారమున సంభాషణ గోపికలు కృష్ణుని ఆగడములను ఎత్తిచూపుట, యశోద కృష్ణుని సమర్థించుటతో నడచును. ప్రస్తుతము కృష్ణలీల కన్న పోలేరమ్మ పండుగనాటి సంరంభము ముఖ్యము.

చిక్కుళ్ల గౌరి నోము :

ఈ నోము మాంగల్య సంతాన సౌభాగ్యమునకు ఏడాదిపాటు చేయునది. దీని నాచరించువారు రథ సప్తమితో ప్రారంభించెదరు. ఏడాది పొడవునను ముత్తైదువలను పూజించుచు, వారి ఆశీర్వాదములను పొందుచు అక్షతలను వేసుకొనవలెను. ఉద్యాపనమున ఒక పుణ్యస్త్రీకి చీర, రవికె, బంగారపు చిక్కుడు పువ్వులు వాయనమిత్తురు. ఈ వ్రతము చేయువారీపాట పాడుదురు.

1. లక్ష్మీరంజన వ్యాసావళి – పుట – 123.

"ఎత్తిన బిడ్డను ఎడ బాయకుండ
చేయునో యమ్మ చిక్కుళ్ళగౌరి
వెండి చిక్కుళ్ళు వాయనాలిచ్చెదను
బంగారు చిక్కుళ్ళు పంచి పెట్టెదను
సిరిసంపద నిమ్ము చిక్కుళ్ల గౌరి –[1]

– ఈ వ్రతమునకు మరియొక పాటయును గలదు.

"చిట్టి చిట్టిన గాని చిక్కుళ్ల
గౌరినోము చెల్లి పట్టవే
కంటికాటుక కరగకుండా
చేతిగాజులు చెదరకుండా
కాలిమట్టెలు కదలకుండా
చీకూ చింతా చేరకుండా
చిక్కుళ్ల గౌరి నోము చెల్లి పట్టావే
విడిచిన చీర కట్టకుండా
తొడిగిన రవిక తొడగకుండ
ఒంటి సొమ్ము వదలకుండ
ఇంటి పురుషుడు వెంటానుండ
చిక్కుళ్ల గౌరినోము చెల్లి పట్టావే –[2]

– ఈ పాటలో కంటికాటుక కరుగకుండ, చేతిగాజులు చెదరకుండ అనుట చేత నిత్యమాంగల్యమును, విడిచిన చీర కట్టకుండా, తొడిగిన రవిక తొడగకుండ, ఒంటి సొమ్ము వదలకుండ అనుటచే నిత్యైశ్వర్యమును కోరువారు ఈ వ్రతమును చేయుదురనుట స్పష్టము. ఇవి ఎన్నియున్నను భర్తృ ప్రేమ ఉన్ననే బంగారమునకు తావి అబ్బినట్లు ఇవి అన్నియు రాణించును. కనుక "ఇంటి పురుషుడు

1. నేను సేకరించినది పాడినవారు – యశోదమ్మ – శెర్లపల్లి.
2. మిన్నేరు – 227.

వెంటానుండ" అని భర్తృవిరహమనుసదిలేక కొంగుకు కట్టివేసినట్లే భర్త ఎల్లప్పుడు వెంటనుండు మహాభాగ్యము. ఈ నోము వలన కలుగునని భావము. అంతేగాక స్త్రీలకు కావలసిన కోరికలన్నియు పాటలో మిళితము చేసినారు.

పై పాటయే "వంటి సొమ్ము వదలకుండా వెంట పురుషుని పాయకుండా" వంటి చిన్న మార్పులతో "ఎత్తుకున్న బిడ్డ నెడబాయకుండా - చంకలోనున్న బిడ్డ సడలకుండా పక్కలో నున్న బిడ్డను పాయకుండా" నను చక్కని గృహిణి జీవితమును ప్రతిబింబించు పాఠాంతర భేదమును పేర్కొనినారు బి. రామరాజుగారు–[1]

చిక్కుడు కాయలు తీగెకు ఒంటిగా కాయవు. అవి యెప్పుడును గుత్తులు గుత్తులుగా ఉద్భవిల్లును. సంతాన కాంక్ష కలిగిన యిల్లాలు చిక్కుడు గుత్తులలోని కాయలవలె నుండెడు సంతానమును కోరుటకీ చిక్కుడు తీగ ప్రతీక యగుచున్నది.

ములగ గౌరీ వ్రతము :

ములగ చెట్టును ఇంట నుంచిన "నీవు మునుగుతావా, నేను మునుగు తానా", అని ఇంటి వారికి మంచినైన, చెడునైనా కలిగించునని కొందఱి నమ్మకము. "ఇంటి ముందు ములగ, ఇంటి వెనుక వెలగ" ఉండుట మంచిదని మఱికొందఱి వాడుక.

"ములగనోము నోచిన వనితకు ముచ్చటలన్నియు తీరును" అని సామెత. ఈ వ్రతము మాఘ పూర్ణిమనాడైనను, రథసప్తమినాడైనను ప్రారంభించి ఏడాదిపాటు చేయవలెను. సంవత్సరాంతమున పన్నెండు మంది ముత్తైదువలకు చెరి పన్నెండేసి జతల ములగ కాడలను, లక్క జోడులను, నల్లపూసలకోవ (దండ) జతను దక్షిణ తాంబూలములతో వాయన మివ్వవలెను. పూజలో–

1. తెలుగు జానపదగేయ సాహిత్యము - 428.

"ములగ పేరెత్తరాదు, ములగను చూపించరాదు
ములగ నీడ నిలువరాదు, ములగను అంటరాదు
ములగను నోట పెట్టరాదు-[1]

– ఇవి ఈ వ్రతమునకు చూపిన ఆంక్షలు. ఈ ఆంక్షలు చూడగా ములగనిచట ఒక టోటమిక చిహ్నాముగా జనులు గ్రహించి యుండవచ్చునని తోచును. "పద్ధతి తప్పినను ఫలము తప్పదట". ములగ చెట్టు త్వరగా ఎదిగి సర్వాంగములును ఉపయోగపడునట్టిది. ములగాకుతో పెక్కు వంటలను చేయుదురు. ములగ కాయ ఉపయోగమును గురించి చెప్పనవసరములేదు. ములగ బంక ఔషధములకు ఉపయోగపడును. మునగ బెండ్లతో ఈత నేర్చుకొందురు. మునగ వ్రేళ్ళను ఔషధ ద్రవ్యము. ములగ చెట్టు సకలాంశములును వీర్యవర్ధకములు గనుక దీనితో పెక్కు ఔషధ యోగములను ఆయుర్వేద శాస్త్రములు చెప్పినవి. ములగనే మునగ అని కూడ అందురు. ఇట్టిదే వెలగ గౌరీ నోము.

ఇట్లే గుమ్మడిగౌరి, రేగులగౌరి, బచ్చలగౌరి, విష్ణుకాంత (క్రాంత) నోము, పెండ్లి గుమ్మడిగౌరి మున్నగునవి అన్నియు ఈ వృక్షపూజకు సంబంధించినవే. "విష్ణు క్రాంతను నోచితి" అని సీతపలుకుట జానపద శాఖకు చెందిన రామాయణపు పాటలో కానవచ్చును-[2]

రావి చెట్టును పలుమారు ప్రదక్షిణముచేసి పూజించిన స్త్రీలు గర్భవతులగుదురనుట లోకరూఢి. "రావిచెట్టును ఒకమారు చుట్టి బొడ్డున వేలు పెట్టి చూచినదట – ఒక తొందర పాటుగల వనిత" – అను సామెతకూడ కలదు. రావిచెట్టు గాలి మనోవికారమును పోగొట్టునని వైద్యక గ్రంథములు చెప్పుచున్నవి. కనుకనే రావిచెట్టు ప్రదక్షిణము చేసిన సంతానవతులగుదురను నమ్మకము కలిగినదేమో, పూర్వీకులు రావిచెట్టునందు మొలచిన జమ్మి చెట్టు

1, స్త్రీల వ్రత కథలు – పుట – 64.

2. లంకాయాగము స్త్రీల రామాయణపు పాటలు – కృష్ణశ్రీ.

కొమ్మలతో అరణులను తయారుచేసి నిప్పును పుట్టించెడివారు. ఈ అగ్నినే యాగములందు ప్రయోగించెడివారు–[1]

వ్రతముల ఆచరణలో పెక్కు నియమములను పురాణములు చెప్పుచున్నవి. వ్రతానుష్ఠానములో ఉపేక్ష చూపినను అశ్రద్ధ చేసినను ఫలము దక్కకపోగా మహాపాతకము సంభవించునని పురాణములు హెచ్చరించుచున్నవి–[2]. కాని స్త్రీల వ్రత కథలు మున్నగు పుస్తకములలో ప్రతి కథ చివర "పద్ధతి తప్పినను ఫలము తప్పదు. భక్తి తప్పకుండిన ఫలము కలుగును"–[3] అనియో "కథలోపమైనను వ్రతలోపముండరాదు"–[4] అనియో "శక్తి (దానశక్తి) తగ్గినను ఫలము హెచ్చును"–[5] అనియో పేర్కొనబడినది. ఈ ఫల శ్రుతులు పురాణాదేశములకు విరుద్ధములు కావా ? – అను శంక కలుగవచ్చును. స్త్రీలు సహజముగా ఆచారమును పాటించినను నియమములను పాటించుట కష్టము. వారి శరీర నిర్మాణము, వారి స్వభావము, కుటుంబమున వారికి గల బాధ్యత వారిని పట్టుగా గంటల కొలది ధ్యానాదులొనర్చుటకుగాని వ్రతములాచరించుటకు గాని అవకాశము కల్గించవు. ఈ వ్రతముల వలన ప్రచారమును పొందు కర్మకాండ ప్రాధాన్యము సడలిపోకుండ వారి విషయమున స్త్రీల వ్రతకథలు మున్నగు గ్రంథములు కొంత ఔదార్యమును చూపి నియమనిష్టలను సడలించి భక్తికి ప్రాధాన్యము నిచ్చినవి. భక్తిలేక ఎంత నియమనిష్ఠలతో నున్నను ఫలితము లేదుకదా. భక్తిలేని పూజ పత్రి చేటు అను సామెత ఉన్నదే. ఎన్నియో కారణముల వలన వ్రతమునకు వలయు వస్తువులను చేకూర్చుకొనుటలోను, మంత్రములలోను, తంత్రములలోను లోపము కలుగుట మానవ సహజము. ఇట్టివెన్ని కలిగినను వ్రతములన్నింటికి భక్తియే ప్రధానము కనుక భక్తి యుండిన

1. మిన్నేరు – పుట – 214.
2. హిందువుల పండుగలు – పుట – 8.
3. స్త్రీల వ్రత కథలు – పుట – 48.
4. స్త్రీల వ్రత కథలు – పుట – 66.
5. స్త్రీల వ్రత కథలు – పుట – 72

అన్ని లోపములు తొలగిపోవునని పైవాక్యముల ఉద్దేశము. భక్తియే మోక్ష ప్రధాన హేతువని గీతాచార్యుడు భగవద్గీత భక్తి యోగమున నుడివినాడు.

ఈ వ్రతముల వలన స్త్రీలకు కలుగు ముఖ్య ప్రయోజనమును మనః పరిపాకము. ఏ వ్రతమునకైనను ముఖ్యమైనది దానము. వ్రతము పేర ఉన్నంతలో ఇతరులకు దానమిచ్చి సత్కరించుట, దానితో తనియుట ముఖ్యముగా కానవచ్చును. దానములేని వ్రతములేదు. ఎంత దరిద్రురాలైనను నోచిన నోమునకు ఉద్యాపనము చేయునప్పుడు ఎవ్వరికో ఒక్కరికి ఇంత పెట్టక తప్పదు. వ్రతముల వలన కలుగు రెండవ ప్రయోజనము భక్తి. సహజముగనే స్త్రీలకు భక్తి విశ్వాసములు మెండు. మంత్రతంత్రముల లోపము కలిగినను భక్తియున్నచో భగవంతుడు సంతుష్టుడగునని పెద్దలు చెప్పుదురు. మూడవ ప్రయోజనము ఆస్తికత. నేటి కాలమున ఆస్తికత తప్పని, నాక్తికత ప్రబలుచున్నను ఆస్తికత స్త్రీలకు గొప్ప మనోభావమునిచ్చును. ఆస్తికత అనునది ఒక భగవంతుని యందు విశ్వాసము మాత్రమే కాదు. సదాచారము, సత్ప్రవర్తనము, సంస్కృతి మున్నగు వాని పట్ల విశ్వాసమున కూడ మనము ఆస్తిక్యముగా భావించవచ్చును. తల్లులను చూచి పిల్లలు ఇతరులు బోధింపకయే ఆస్తిక్యమును నేర్చుకొని జీవితమును సుఖవంతము చేసికొనుటకు అవకాశము కలదు. నాలుగవ ప్రయోజనము పరిశుభ్రత, పూజలు, పురస్కారములు, వ్రతములు నోములకై స్నానము చేయుట, మడిబట్టలు కట్టుకొనుట, శుచిగా ప్రవర్తించుట అనునవి పాటించు అలవాట్లు చిన్ననాటినుండియే ఏర్పడును. ఈ వ్రత సమయమునందు విధి నిషేధముల వలన చెడ్డ పనులను వదలుట, మంచి పనులు చేయుటయు అలవడును. పెక్కు వ్రతకథలలో వర్ణితమైన కష్టములను విన్న బాలికల మనస్సున కష్టమును సహింపవలెనను సంకల్పము చిన్ననాటి నుండియే ఏర్పడుట వలన ఉత్తరోత్తర గార్హస్థ్య జీవితములో కష్ట సహనమునకును, ఐశ్వర్యమునందు గర్వింపకుండుట, ఇతరుల నాదరించుట, తోడివారిని సమానముగ చూచుట మున్నగు గుణములలవడుటకును దోహద మేర్పడును. వారి జీవితము సుఖవంతమగును.

పండుగలు

మనము ఏదిఠైన విశేష దినమునుగాని, ఉత్సవమునుగాని జరుపుకొని నప్పుడు ఆ దినమును 'పండుగ' యని వ్యవహరింతుము. దీనికి పండుగు, పండువు, పండువ అని కూడ పర్యాయములు గలవు. "గ, వ" వర్ణములు పరస్పరము మారుట తెలుగు సంప్రదాయము గనుక 'గ' కార రూపములు కొన్ని 'వ' కార రూపములగును. పండుగను పబ్బము అని కూడ వ్యవహరింతుము. కాని వాస్తవమాలోచించిన పండుగకు పబ్బము పర్యాయ పదముకాదు. పబ్బము అనునది 'పర్వన్' అను సంస్కృత పదమునకు తద్భవము. పర్వన్ శబ్దమును అమరకోశకారుడు గ్రహించెను. అమరకోశ వ్యాఖ్యాత, భట్టోజీ దీక్షితుని మునిమనుమడగు భాను దీక్షితుడు "పూరణార్థము" కల "పర్వ" ధాతువునుండి యిది పుట్టినదని చెప్పినాడు. ఆ ప్రకరణమున ఆయన వ్రాసిన పంక్తులు ఈ క్రింద నుద్ధరించుచున్నాను.

"పర్వతి – పూరయతి జనానానందేనేతి పర్వ,
పర్వపూరణే భ్వాదిః, పరస్మైపదీ, సేట్, తతో బాహులకాత్కనిన్"

భావార్థము : జనులను ఆనందమున ఓలలాడించునది కాన పర్వమని పేరు.

పర్వ శబ్దమునకు సంస్కృత నిఘంటువులలో ఈ క్రింది యర్థము లున్నవి–

పర్వస్యాదుత్సవేగ్రన్థౌ ప్రస్తావే విషువాదిషు
దర్శ ప్రతిపదోః సంధౌ స్యాత్తిథేః పంచకాన్తరే ॥ (ధరణీ కోశము)

– ఇందన్నిటి కంటే మున్నుగ పేర్కొనబడినందున ఉత్సవమను అర్థమే ముఖ్యమయినది"–[1]

---

1. ఆర్యుల పండుగలు – పుట – 4

పర్వ శబ్ద తద్భవమైన 'పబ్బము' అనునది కన్నడమున 'ప' కారము 'హ' కారముగా మారి 'హబ్బము' అయినది. మనకు పబ్బముగానే మిగిలినది. పర్వమనగా 'గనుపు' అనగా రెండు భాగముల కాసలు చేరు సంధి స్థానమని యర్థము. కాలమానములో పర్వములు పూర్ణిమ, అమావాస్య, సంక్రాంతి, విషువత్ కాలములు. పండుగ అను పదము కాలమాన సంధికాని విషువత్ కాలము కాని కానక్కరలేదు. పండుగ యనునది మనకు కేవలము సంతోష ప్రదర్శకమైన ఉత్సవము మాత్రమే.

వేదకాలమున పండుగలను 'సమాన' అనెడివారు. ఈ సమాసమున సమత ఎంత గలదో తెలియదు కాని వేద కాలమున సంఘము నేటికంటె సమధికైక్యస్థితి గలది అని మాత్రము చెప్పవచ్చును–[1]

"పండుగ" అను పదము పూర్తిగా తెలుగు పదము. పబ్బము వంటి తద్భవము కాదు. పండుగకు తెలుగుకు తోబుట్టువైన తమిళములోను "పండిగై" అని వ్యవహారము.

ఈ పండుగలు పెక్కు కారణముల వలన ఆచరణములోనికి వచ్చినవి. ఋతు పరివర్తనము వలన ప్రకృతిలో నేర్పడు వివిధ పరిణామములు, పరంపరాగత పూర్వాచారములు, నభోమండలమున అగపడు గృహనక్షత్రాది సన్నివేశములు, ఇష్టదేవతాపూజలు, మహాపురుషుల సంస్మరణలు మున్నగునవెన్నియో ఈ పండుగలకు కారణమై యుండును.

పండుగ దినములలో ప్రజల ఉత్సాహమును తిలకించిన వానిని ఉత్సవముగనే వారు గ్రహించిరని చెప్పవచ్చును. పండుగలలో స్థానమేర్పరచుకొనిన ఆచార వ్యవహారములకును జానపద స్త్రీలు పాడు పాటలలో వ్యక్తీకరించిన భావములకును గల పోలికను దిఙ్మాత్రముగా పరిశీలించ ప్రయత్నించెదను.

ఉగాది :

ఉగాది పండుగతో తెలుగువారికి సంవత్సరము ప్రారంభమగుచున్నది. యుగమనగా కాలవిభాగము. సంవత్సరము కూడ కాలవిభాగము కనుక

1. Ancient Indian Festivals - Dr. K. Krishna Murthy

సంవత్సరాదిని "యుగాది" అనిరి. కర్ణాటకులు, మహారాష్ట్రులును దీనిని "యుగాది" అనియే వ్యవహరింతురు. కాని తెలుగువారు దీనిని "ఉగాది" అని వ్యవహరించుట పరిపాటి అయినది. యకారాది పదములు తెలుగులో లేకపోవుట వలన ఇట్టి వ్యవహారము ఏర్పడి యుండవచ్చును. ఈ ఉగాది పండుగ చాంద్రమాన చైత్ర శుద్ధ పాడ్యమితో ప్రారంభమగును. సంవత్సరాదికి వెనుకటి రోజు ఫాల్గుణ బహుళ అమావాస్య. దీనిని క్రొత్త అమావాస్య అని యందురు. ఈ రోజున పిండి వంటలతోను, జంతు బలులతోను, గ్రామ దేవతలకు "నైవేద్యములు" పెట్టుదురు. ఈ తెల్లవారుగట్ల అనగా తెల్లవారిన "సంవత్సరాది" వచ్చుననగా "దొంగ ఏరువాక" సాగించెదరు.-1 (ఏరువాక పున్నమ పండుగలో వివరించబడినది).

ఈ పండుగనాడు ఉషఃకాలముననే లేచి తలంటుకొని స్నానముచేసి నూతన వస్త్రములను ధరించెదరు. ఇంటిని, ఇంటి ముంగిలిని మామిడాకు తోరణములతో, పూల దండలతో అలంకరించెదరు. ఇంటి భవంతిలో మండపము కట్టి నూతనవత్సర పంచాంగమును పెట్టి సంవత్సరాది దేవతను పూజించెదరు. పిదప ఉగాది పచ్చడిని ఆరగింతురు. దీనికి ఉగాది గుజ్జు, ఉగాది పులుసు, నింబకుసుమ భక్షణం అనియును కొన్ని ప్రాంతములలో వ్యవహారము కలదు. ఈ ఋతువులో పండిన కొత్తచింతపండు, కొత్త బెల్లము, మామిడిపిందెల ముక్కలు, వేపపూవు, ఉప్పు, గసగసాలు మొదలైనవి చేర్చి ఈ ఉగాది పచ్చడిని సిద్ధపరచెదరు. కొన్ని ప్రాంతములలో దీనికి నెయ్యి తిరుగపో(మో)త పెట్టెదరు.

షడ్రసోపేతమైన ఈ రసాయనము సుఖదుఃఖ మిళితమైన మానవుని సంవత్సర జీవితమునకు ప్రతీక. సంవత్సరమంతయు కలుగనున్న సుఖదుః ఖములను మానవుడు ఆనాడే చవి చూచుటకు ప్రారంభించునని దీని భావము. దీనిలో నెయ్యి కలుపుట మానవుడు తామరాకుపై నీటి బిందువువలె అంటీ అంటనట్లుండవలెననుటకు సూచకము. ప్రతి ఉగాదికి అనుభవముతో, వయస్సులో పెరుగు మానవుడు రకరకముల అనుభవములన్నింటినీ సమాన

1. పండుగలు - పరమార్థములు - నేమనూరి గంగాధరం.

దృక్పథముతో కూడిన మనస్సుతో స్వీకరించవలెనను సందేశమును కూడ ఈ ఉగాది పచ్చడి ఇచ్చుచున్నదేమోననిపించును.

భవిష్యత్పురాణములోను, ధర్మశాస్త్ర గ్రంథములలోను ఈ పండుగ నాటి విధులలో వేపాకు తినుట ప్రత్యేకముగా తెలుపబడినది. ధర్మసింధుకారుడు

"తైలాభ్యంగః సంకల్పాదౌ నూతనవత్సర నామ కీర్తనా
ద్యారంభః ప్రతి గృహ ధ్వజారోహణం నింబ పత్రాశనం
వత్సరాది ఫల శ్రవణం ... ." అనినాడు.

– వేపాకు తినుటవలన పెక్కు రోగముల నివారణ జరుగును. సంవత్సరారంభమున తినుట వలన దీని గుణము బహుకాల ముందుననుట కాబోలు. –1 శతాయుస్సుకు, వజ్రమువంటి శరీరము కలుగుటకు, అన్ని సంపదలు కలిగి సర్వానిష్టములు దూరమగుటకుగాను వేప చిగుళ్ళను తినవలెననుటకు

"శతాయుర్వజ్ర దేహాయ సర్వ సంపత్కరాయచ
సర్వానిష్ట వినాశాయ నింబకందళ భక్షణం"

– అని ప్రతీతి. "నింబపత్రం స్మృత్యం నేత్రం" అని భావప్రకాశ ఆయుర్వేద గ్రంథము నుడి. వేపాకు నేత్రములకు మేలు చేయుటయేగాక కుష్ఠురోగమును, అరుచినీ కూడ పోగొట్టును. అయిన చిగుళ్ళకు మారుగా వేప పువ్వులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించుచున్నారు. వేపపువ్వైనా, ఆకైనా చేదుగా ఉండును. ఆ చేదుకు వాత లక్షణములను వృద్ధిపరచు గుణమున్నది. ఆ వాత గుణములను పోగొట్టుటకు క్రొత్త బెల్లమును చేర్చుదురు. బెల్లము వాత గుణమును తీసివేయుటయేగాక మంచి జీర్ణశక్తిని కలిగించును. కాని బెల్లము కఫమును ప్రకోపింపజేయవచ్చును. కనుక దానికి విరుగుడుగా మిరియపు పొడిని చేర్చుట జరుగుచున్నది. ఈ మిశ్రమము త్రిదోషహారిగా పనిచేయును. ఈ పచ్చడిలో చేర్చబడు మామిడి ముక్కలు గొంతు సంబంధమైన రోగములను, ఉబ్బసము వ్యాధిని దూరము చేయును. ఈ ముక్కలలో 'సి' విటమిను ఉండును కనుక మలబద్ధకమును పోగొట్టి గుండెకు బలమును, శరీరమునకు మంచి కాంతిని

1. విజ్ఞాన సర్వస్వము – తెలుగు భాషా సమితి – పుట – 1467.

ఇచ్చి ఆకలిని కలిగించి 'లివర్' రోగములను దూరము చేయుటకు ఉపకరించును. ఇట్లు ఈ పచ్చడిలో వాడు ప్రతి వస్తువు వెనుక అనేక ఆయుర్వేదాంశములు మిళితమై ఉండును. ఈ పండుగనాటి ఇతరములైన పిండివంటలు, మృష్టాన్న భోజనము నాధారముగనే "ఉన్న రోజు ఉగాది, లేనినాడు శివరాత్రి" అను సామెత పుట్టి యుండును.

పండుగనాడు మూడుజాములు గడచిన పిదప ప్రజలు తమ యిండ్లలోనో, దేవాలయములలోనో, చావడిలోనో చేరి పంచాంగ శ్రవణము జరిపించెదరు. ఆ ఏడాదిలో జరుగు మంచిచెడ్డలు, ఆదాయవ్యయములు, వానావరదలు, ధరవరలు, తమ పేరు బలాబలములు, లాభాలాభములు మొదలగునవి పంచాంగ శ్రవణము చేయువారి నుండి తెలిసికొందురు. "జ్యోతిశ్శాస్త్రం మహా పుణ్యమ్" అను సూక్తి ప్రకారము పంచాంగ శ్రవణము సంవత్సరాది దినమునందు గావించుట మహాపుణ్యముగా భావించెదరు.

ఇది వసంతఋతువు ప్రారంభము కనుక ఈ దినమునుండి తొమ్మిది దినములు వసంత నవరాత్రములు- వసంత మాధవ పూజలు, వసంతోత్సవములు జరుపుదురు. ఈ నెలలో బాటల ప్రక్కన చలివేంద్రులు పెట్టవలెననియు, శక్త్యానుసారము చెప్పులు గొడుగులు దానము చేయవలెననియు ధర్మశాస్త్రము చెప్పుచున్నది.

జన పదములలో చైత్రమాసమున ఎక్కడ చూచినను పూచిన చెట్లు, ఝుమ్మని వానిచుట్టును మూగు తుమ్మెదలు, కల మధురముగా వినబడు కోకిల కూహూరావములు, ఎర్రని చిగురుటాకులను మెసవుచున్న పచ్చని చిలుకలు ఎవ్వరికయినను ఆనందమును కలిగింపక మానవు.

ఉగాది సంవత్సరాది పండుగ కనుక ఊరంతయు సంబరముగా నుండును. ఆ సంతోషమున కన్నెపిల్లలు ఈ క్రింది పాటను పాడెదరు. ఈ పాటలో ఆనాటి తీరంతయు వర్ణింపబడినది.

ఉగాది పండుగ వచ్చింది – ఊరికి అందం తెచ్చింది
ఉత్సవాలతో దేవుళ్ళకు ఊరేగింపులు సాగాయి
గుడిలో దేవుని పూజించి గురువుల పెద్దల రావించి

పంచాంగాలను చదివించి, మంచీ చెడ్డలు విన్నాము
అక్కలు బావలు ఆసలతో చక్కావచ్చారు పండుక్కి
అమ్మ వేకువ లేచింది, అందరికి తలలు కడిగింది
సరిపడే నగలు యిచ్చింది, సరిక్రొత్త బట్టలు పెట్టింది
కుల దేవతలను కొలిచింది, గొప్పగ పూజలు చేసింది
ఊటలు నోట్లో ఊరగా, ఉగాది పచ్చడి పెట్టింది
ఉగాది పండుగ వచ్చింది, ఊరికి అందం తెచ్చింది. –[1]

ఈ పండుగనాడు యాచకుల సందడి కూడ ఎక్కువగానే యుండును. వారు దానమిచ్చిన వారిని దీవించుచు, దానమీయని వారిని నిరసించుచు ఊరువాడ తిరిగెదరు. "ఎప్పుడో సంవత్సరమునకొకమారు వచ్చు మొదటి పండుగ కదా, దానమెందుకియ్యరాదు?" అని వారి ఆవేదన. కనుకనే

"ఎప్పుడెప్పుడు పండుగ, ఏడాది పండుగ
ఇచ్చినోళ్ళ పుణ్యం, యియ్యనోళ్ళ పాపం". –[2]

– అని పాడుచుందురు. "పెడ్తే పెండ్లి, లేకుంటే తద్దినము కోరుట" అను సామెత యిట్టి యాచకుల దీవెనలు, తిట్లవలననే పచ్చి యుండవచ్చును. ఇట్టి ఆనవాయితి అనాదిగా వచ్చుచున్నదే. కొందరు పైకందురు, అనలేనివారు మనసు లోనే అనుకొందురు. మన్నారు దాసవిలాస నాటకమున నిట్టి యాచక బృందమునే తలపింపజేయు గొల్లల సంభాషణ :

గొల్లలమాట : "వొరెవొరె ఆ బాపణ్ణి యేల వాకిలి విడి స్తివిరా వానిచేత నేమైనా పరకాలు నాచుకొంట్టివో, దివాళికి రూకా, పొంగల్‌కి రూగా వుగాదికి రూకా.... ఆ ముచ్చుబాంపండురానీ కాళ్ళె యిరగగొట్టేగాని.... –[3]

ఈ ఉగాది పండుగ దినమున జనపదములలో పశువులను పూజించుట ప్రత్యేకత నాపాదించుకొనినది. గోవు ఫాల భాగమునకు పసుపురాచి కుంకుమ

1. సెలయేరు – పుట – 47, 48.
2. సెలయేరు.
3. మన్నారు దాస విలాస నాటకము – రంగాజమ్మ – పుట – 27.

బొట్టుపెట్టి పూజించెదరు. ఇట్లు చేయుటను పుణ్యప్రదముగా భావించెదరు. పంటలతో సమృద్ధిగానుండు యిండ్లలో పాడి కూడ సమృద్ధిగా ప్రసాదించుమని గోమాతను ప్రార్థించుట కనిపించును. పాడి-పంటలపైననే గ్రామీణుల సిరిసంపదలు ఆధారపడియుండును.

ఉగాది పండుగనాడు క్రొత్త ధాన్యముతో వంట వండి భగవంతుని అర్పించి కూరాడునకు, చల్లగుంజకు, విసరురాతికి, రోలునకు నైవేద్యమిడి క్రొత్తపంటను మొట్టమొదటిసారిగా భుజించెదరు. నైవేద్యమిడిన ఆహారమును ఆడపడచులు, కోడండ్రు మొదలగు ముత్తైదువలు భుజించెదరు. దీనిని "క్రొత్తబెట్టుట" అందురు. ఉగాదినాడు వీలుగాకపోయినా మరొక తిథివారములు మంచిగా నున్నవి చూచుకొని ఆనాడు జరుపుదురు.

ఉగాది మొదలు పది దినములవరకు "ఉగాది జాతరల"ని గ్రామము బయలు ప్రదేశమునకు సన్నిహిత కుటుంబములు కొన్ని వెళ్ళి అచ్చటనే పంటలను చేసుకొని రోజంతయు సంతోషముతో కాలమును గడిపి వచ్చెదరు. ఇచ్చట జాతర అనగా ఏ దేవతా ఉత్సవముగానో భావించరాదు.

గ్రామములలో రైతుల చెంతనుండు జీతగాండ్రు ఉగాది లేదా దసరా పండుగ దినములకు లెక్కలు సరిచూచుకొని మారుటయో లేదా వారి దగ్గరనే ఉండుటయో చేయుదురు.

శ్రీరామనవమి :

శ్రీకృష్ణ గాథలవలెనే రామకథ కూడ బహు విస్తారము.
"చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్"

– అని వాల్మీకియే పేర్కొనినాడు. రామమందిరముగాని, రామభజన మందిరముగాని, రామభక్తుడగు ఆంజనేయుని మందిరముగాని లేని తెలుగు ఊరు ఉండదు. కృష్ణునివలె రాముడును తెలుగువారికి నిరంతర ఆరాధ్య దైవము.

ఈ శ్రీరాముడు చైత్రశుద్ధ నవమినాడు అవతరించెనని రామాయణమును, ఇతర పురాణములును తెలుపుచున్నవి. శ్రీరాముడు పన్నెండవ నెలయగు(?) చైత్రమాసమున నవమి తిథినాడు పునర్వసు నక్షత్రము, ఐదు గ్రహములు ఉచ్చస్థితిలో నుండగా కటక లగ్నమున గురుడు చంద్రునితో కలసియుండగా కౌసల్యాదేవికి జన్మించెనని రామాయణము తెలుపుచున్నది.

"తదశ్చ ద్వాదశే మాసే చై త్రేనావమికే తిథౌ
నక్షత్రే దితిదైవత్యే స్వోచ్ఛ సంస్థేషు పంచసు,
....
కౌసల్యా జనయ ద్రామం సర్వలక్షణ సంయుతమ్
విష్ణోరర్థం మహాభాగం పుత్ర మైక్ష్వాక వర్థనమ్". –[1]

– శ్రీరామ నవిమినాడు ఉపవాసములుచేసి రాత్రి జాగరణముచేసి దశమినాడు రాముని పూజింపవలెననియు, అది చైత్రమాసము కనుక వడపప్పు, పానకము, విసనకర్రలు మున్నగునవి దానము చేయవలెననియు వ్రత గ్రంథములలో కలదు.–2 చైత్రశుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు రామ నవరాత్రులు జరిపి నవమినాడు సీతాకల్యాణము చేయుట, దశమినాడు పట్టాభిషేకము చేయుట తెలుగుదేశపు ఆచారము. నవమినాడు రామ జనన ఘట్టమును వాల్మీకి రామాయణము నుండి పఠించి పూజలు చేయుదురు. దశమినాడు పట్టాభిషేక ఘట్టమును పఠించి పూజలు చేయుదురు. తెలుగుదేశమున శ్రీరామ నవమి మహాభక్తితో జరుపుదురు.

జానపద మహిళలును రామభక్తిలో నెవ్వరికిని తీసిపోలేదు– జోలపాటలు, సీతాకల్యాణపు పాటలు, మేలుకొలుపులు, శ్రీరామ దండములు మున్నగు గేయసాహిత్యము అపారముగా నున్నది. తన కుమారుని రామచంద్రునిగా భావించి కౌసల్య రామచంద్రుని జోల పాడినట్లు ఏ అజ్ఞాత రచయిత్రియో రచించిన జోలపాట తెలుగునాట చాల ప్రసిద్ధము.

---

1. బాలకొండ సర్గ 18, శ్లో॥ 8–10.
2. హిందువుల పండుగలు – పర్వములు – పుట – 63.

జోజో దశరథ రాజకుమారా
కౌసల్య వరపుత్ర కరుణా కటాక్షా
రఘుకుల భూషణా రాజపూజితుడా
సీతాంగనాపతీ శ్రీరామచంద్రా ॥ జో ॥
ఎత్తుకున్నా నిలువదేమి చేయుదునూ
చంకబెట్టుకున్న జారిపోపూనూ
పాలు గుడువూమన్న పట్టడే మనసూ
అక్కడిక్కడ చూపి ఆడించరమ్మా ॥ జో ॥
....
బాలలతో ఆడంగ పట్టుకొనివచ్చి
బంగారు గిన్నెలో పాలు నెయ్యిబోసి
సంపంగి తైలాన శిరసొప్పనంటి
మెత్తన్ని కస్తూరి మేనలుగు తీర్చి
చన్నీళ్ళు వేన్నీళ్ళు సమముగా జేసి
మూడు దోసిళ్లతో ముద్దుగా బోసి
జలకంబులమరించె తల్లి కౌసల్య
ఒత్తుకొని పాపణ్ణి ఎత్తుకొని వచ్చి
మెత్తని ఆ పట్టు పొత్తుల్లు పరచి
ముత్యాల కుల్ల తాముందుగా కట్టి
రత్నాల రావిరేక రాములకు తీర్చి
....
మా జన్మ సఫలంబు మరినేటి కాయె
ఇండ్లకూ బోయేము ఇంతిరో మేము
పసుపు కుంకుమలను పరిమాళాలిచ్చి
గుగ్గిళ్ళు పంచెనే కుసుమ శ్రీగంధి. –[1]

1. తెలంగాణా పల్లె పాటలు – పుట – 4–6.

– ఈ పాటలో బాలుని ఉయ్యాలలో వేయునపుడు జరుగు వేడుకలు రాముని పరముగా వర్ణింపబడినవి. రాముని ఉయ్యాలలో వేయునపుడు పేరంటాండ్రకు పసుపు కుంకుమలతోబాటు గుగ్గిళ్ళను పంచిపెట్టినది కౌసల్యాదేవి. నిజమున కాలోచించిన మహారాణియైన కౌసల్యాదేవి యిట్టి పనులన్నియు చేసియుండునా అని పించును. మహారాణియైన కౌసల్యాదేవి చేసియుండక పోవచ్చును కాని ఇచ్చట కడుపారగనిన అందులోను తనివితీర పుత్రసంతానమును గనిన తృప్తిలోనున్న కౌసల్య తమ తోటి యిల్లాండ్ర వంటిదే యను భావనతో ఆమెతో గుగ్గిళ్ళు పంచి పెట్టించక ఊరుకొనలేదు జానపద స్త్రీలు. నామకరణ మహొత్సవమున గుగ్గిళ్ళు పంచిపెట్టుట తెలుగువారి ఆచారము.

రాముని కల్యాణము పాటలు అధికముగా నుండును.

పల్లవి : "రండీ రాముని కల్యాణమునకూ

అ.ప : కామజనకూడాట శ్యామల రూపుడట
ప్రేమచే దాసులకు క్షేమంబులిచ్చునట
పచ్చాని పందిళ్ళలోను హెచ్చు వెలుగూగల ముత్యాలతోను
తోరణములు వేగమె కట్టగాను
మంచి పగడంపు లత దిద్దింపగాను
అందమైనట్టి చాందినీలతోను
స్వచ్ఛముగ వెలుగు లక్ష్మి విలాసములతో
....
"ఏనుగులూ గుఱ్ఱాలధిష్ఠించినా జనులు
ఇరుప్రక్కలా నడచూ చుండంగ
మధ్యా పల్లాకీనీ మోయుచుండంగ
పల్లాకీ చూట్టూ జనులంతా నుండ
శ్రీరామునకు సీత తగుననుచుండ

జనకా రాజునకు జనులచేనుండ

....

పెద్దాలందరు ప్రీతీగాను

పురమున నూరేగించిన పిమ్మటాను

విడిదిలో పల్లకీ దింపగాను

రామునకు చాల ఫలహారమూలు

తెచ్చీ రామూ ముందుంచగాను

పద్మనాభూడు భుజియించగాను

పైడి పళ్లెములోనా పాదమూలు

ఒకతె నీళ్ళతో కడుగుచుండగాను

వేరొకతె పారాణము తీర్చుచుండ

మరొకతె తిలకము దిద్దుచునుండ

వేరొకతె తిరుణాము తీర్చుచుండ

ఇంకొకతె బుగ్గాపై చుక్కుంచి

కనులా కాటుక దిద్ది, నిలువుటద్దము తెచ్చి నీడా చూపించెనట ॥ రం ॥

రత్నాకాంతుల చేత రాణింపు చున్నట్టి

పెండ్లి పీటలు వేస్తిరంట

మంజారములో బియ్యం పోసిరంట

అందూ రాముని సీతనూ రంగూగాను దిద్ది

రాము సోదరు లక్ష్మణూని కలర

ఊర్మిలా దేవీ తగునని

– పెండ్లి కుమారుని అలంకరణమును పడతులు పూర్తిచేసి రత్నకాంతులచేత రాణించుచున్నట్టి పెండ్లి పీటలపైన సీతారాములను కూర్చుండజేసి వారితోబాటుగా లక్ష్మణునికి ఊర్మిళాదేవీ, భరతునికి మాండవి, శత్రుఘ్నునకు శ్రుతకీర్తితగు నని వారిని కూడ ముస్తాబు చేసి పెండ్లి పీటలపైన కూర్చుండజేసిరి.

"నేడు రుషి సూక్తులు రుషులు
పురోహితులూ గూడి ఏడోజాము న పెండ్లి అపుడే జేసేరంట. –[1]

– ఈ విధముగా రామలక్ష్మణ భరత శత్రఘ్నుల వివాహములు ఒక్కుమ్మడిగా జరిగిపోయినవి.

స్త్రీల నోళ్ళలో నానుచున్న ఈ పాట స్త్రీల కొరకు రచింపబడినట్లుగా "మగటూరి వాసుడు కొంతం కొండా దాసుని, మరిమరీ వేడుచునూ మదిని దలంచూచు" అనుట వలన గ్రహింపనగును.

శ్రీరామనవమి భద్రాచలమున మహావైభవముగా జరుగును. భక్తులెందరో ఆనాడు దైవ దర్శనమును చేసుకొని భద్రాద్రి రాముని వివాహవైభవమును తిలకించి తరించెదరు. ఊరూర రామాలయములలో జరుగు రాముని వేడుకను తిలకించుట కంటెను "భద్రాచలము"లో జరుగు రామ మహోత్సవమును తిలకించిన బొందితో స్వర్గమునకు వెళ్లినంత తృప్తిని అనుభవించెదరు జానపదులు.

పల్లవి : కల్యాణం చూతామూరారండీ
భద్రాద్రి రాముల పెళ్లికీ, పోదాము రారండీ ॥ క ॥
ఎంతో దూరము లేనేదట
కృష్ణకు పన్నెండామడున్నదట
వింతవింత హరిదాసు లుండిరట
వీర వసంతము కొల్లలాడిరట
....
కొండపొడుగు పందిళ్ళు వేసిరట
పెళ్ళికొడుకు శ్రీరాముల వారట
పెళ్ళికూతురు సీతాదేవట
....

1. మున్నీరు – పుట – 5–7.

పెళ్లి పెద్ద వాసిష్ట మహాముసట

పేరంటాళ్ళు అరుంధతమ్మట

దేవాంద్రాముని దేవతలొచ్చిరి

....

పాలపుట్టలో సీత నుంచిరీ

పట్టు వస్త్రములు తెరలు కప్పిరీ

చిచ్చుబుడ్లు శ్రీ బి ఆాలండీ

చిరచిర చిరచిర లేవంగా

సీతకూను శ్రీరాములవారు

కాలుతొక్కి కంకణము కట్టిరి

ముత్యాలు తాపిన మంగళ సూత్రము

ముద్దుగాను సీతకు ధరియింపించి

ముత్యాలా పందిటిలోనూ

నవరత్నాలా వానలు కురియా

రంగైనా ముత్యాలు రత్నాలు

సీతారాములవారి తలంబ్రాలట ॥ క ॥ –[1]

– పై వర్ణనలో సీతారాముల కల్యాణము కనులకు కట్టినట్లుగా వివరముగా తెలిపినారు. ముందు పాటయైన "రండీ రాముని కల్యాణమునకూ" అని పాడునపుడు అందులో తాము చూచు సమాజములోని 'రామయ్య సీతమ్మల' వంటి మామూలు వ్యక్తుల వివాహముగా వర్ణింపబడినది. "కల్యాణం చూతామూ

1. మున్నీరు – పుట – 7–9.

రారండి, భద్రాద్రీరామూల పెళ్ళికి పోదాము రారండీ" అను ఈ పాటలో రాముని భగవంతుడను దృష్టిలో అతని వివాహమునకు మామూలు బ్రాహ్మణున కాధిక్యమివ్వక వశిష్ఠ మహామునిని పెండ్లి పెద్దగా, అరుంధతీ దేవిని పేరంటాలుగా, దేవేంద్రుని, దేవతలను వివాహామునకు వచ్చిన ఆతిథులుగాను వర్ణించినారు. దేవత్వము మానవత్వము కన్న మిన్నయను భావము ఈ పాటలో కానవచ్చును.

అవతారపురుషుల జయంత్యుత్సవములలో శ్రీకృష్ణాష్టమి, శ్రీరామనవమి ముఖ్యమైనవి. శ్రీ కృష్ణాష్టమినాడు కృష్ణుని జన్మదినముననుకరించు ఉత్సవములే జరుపబడును. కాని శ్రీరామనవమినాడు శ్రీరాముని జయంత్యుత్సవమా? కల్యాణోత్సవమా అను సందేహము కలుగునట్లు శ్రీరామ జననమునకు సంబంధించిన వేడుకలతో పాటు శ్రీ రాముని కల్యాణమునకు సంబంధించిన వేడుకలును జరుపబడును. ఆట్లు జరుపబడుట చూడ శ్రీరాముని జననము, కల్యాణము నొక్కనాడే జరిగినవను అనుమానము స్ఫురించును. కాని నేదునూరి గంగాధరముగారు రెండింటి యందును గల వ్యత్యాసమును తెలుపుచు "శ్రీరామ చంద్రుడు చైత్రశుద్ధ నవమినాడు జన్మించాడు. ఆ దినం శ్రీరామ జయంతి అనగా పుట్టిన దినమన్న మాట. రాములవారి కల్యాణం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు జరిగింది. ఆ దినం కల్యాణోత్సవం అన్నమాట. ఎందుచేతనోగాని దేశం నలుమూలలవారు చైత్రశుద్ధ నవమినాడు శ్రీరామ కల్యాణం చేస్తున్నారు. రామ దాసుగారి వలన యీ ఆచారం వచ్చిందేమో" నని వివరించినారు–[1]. రామదాసు తరువాత 18వ శతాబ్దము చివర భద్రాద్రిని ఉద్ధరించిన ముక్తేవిపెరమాళ్లయ్య అను భక్తవరేణ్యుడు సీతారామకల్యాణ నిర్ణయమును పండితులతో చేయించినట్లు ముక్తేవి శ్రీరంగాచార్యులుగారు ఆంధ్రభూమిలో తెలిపిరి. శ్రీరామ నవమినాడు సీతారామ కల్యాణము చేయుట భావ్యముగునా? కాదా అను చర్చ వచ్చినప్పుడు ముక్తేవిపెరుమాళ్లయ్య దేశములోని పండిత సభను భద్రాచలములో ఏర్పరచెనట.

1. మున్నీరు – పుట – 9.

వారు వాదవివాదములు నొనర్చి కల్యాణోత్సవము శ్రీరామనవమి నాడు జరుపవచ్చునని నిర్ణయించిరట. –[1]

సీతారాముల కల్యాణమును తెలుపుచు
"సీతాకల్యాణ మహోత్సవ సమయము
చూతాము చెలి–[2]

....

"ఆనంద మానంద మానంద మాయెను
మన రాముడు పెండ్లి కొడుకాయెను
అలజానకీ పెండ్లి కూతురాయెను
కౌసల్య నోచిన నోము సఫలమాయె నేడు ॥ ఆ ॥ –[3]

– అని పాడు పాటలు ప్రసిద్ధము. వ్రత గేయములలోవలె గేయాంతమున ఫలశ్రుతి తెలుపుటయు కలదు.

శృంగారమైనట్టి సుదతి రత్నంబు
చంద్రవంశంబూన జన్మించగానూ
ధారుణీ సుతయైన తరుణిహో కాంత
తా జనకామునికి కూతురైపుట్టి

....

కలియుగాంతము వరకూ ఘనకీర్తులొంది
వర్థిల్లు చుండిరి అయోధ్యలోనూ.

---

1. ఆంధ్రభూమి – దినపత్రిక 29–4–79 (ఆదివారము సంచిక).
2. మిన్నేరు – పుట – 10.
3. మిన్నేరు – పుట – 13.

– అని సీతాకల్యాణము వివరముగా పేర్కొని పాట చివరన

"ఈ సీతా కల్యాణ కథను నెవరైనా వ్రాసినా చదివినా
వ్రాసినా చదివినా విన్నావారికి
సంతానముల కల్గు సంతోషముగనూ
సంతాన వృద్ధులూ చల్లానికరుడు
నిత్యంబుగా కల్గు నిఖిల భాగ్యములు
నిత్య కల్యాణంబు నిజముగా గల్గు
సతిపురుషూలెప్పుడూ సంతోషముగనూ
క్షితిలోను వర్ధిల్లు చిరంజీవులగుచూ
ఆయురారోగ్యంబూ ఐశ్వర్యముగనూ
వారిజాక్షుడు వచ్చి వారి రక్షించు
సంతోషములు గల్గి శుభము లొందుదురు
వై కుంఠ మొందేరు అతి వేడ్కతోను
కలుగూను సత్యంబూ నిజముగా నేడూ
శ్రీరామ చంద్రుడు సృష్టిలోపలను
మావంటి దీనులను మరగి (మరి) పోషించును" –[1]

అని ఫలశ్రుతి చెప్పబడినది.

మేలుకొలుపు పాటలతోబాటు – ఆచార వ్యవస్థలో పేర్కొనదగిన వధూవరులకు సంబంధించిన కొట్నముల పాటలతోబాటు – పెండ్లి కూతురును అత్తవారింటికి అంపించు వరకును పాడు పాటలతోబాటు – నిత్యజీవితమున అడుగడుగున పాడు పాటలలో సీతారాములను మాత్రమే నాయికానాయకులుగా వర్ణించిన పాటలు కోకొల్లలు. ఇవి యన్నియు సీతారాముల యెడ జానపదులకు గల భక్తిని ప్రేమను వెల్లడి చేయుచున్నవి.

1. స్త్రీల పాటలు – పుటలు – 108–114

ఏరువాక పున్నమ :

మృగశిరకార్తెతో పల్లెపట్టులలో నూతన జీవితమారంభమగును. మృగశిర కార్తెకు ముందే వానలు కురిసినను వానికంతగా ప్రాధాన్యమివ్వరు కర్షకులు. "మృగశిరలో విత్తులే మురిగిమురిగి (అధికముగానని) కాస్తుందని, మృగశిర కురిస్తే ముంగారి పండుతుందని, మృగశిరలో మొక్క మీసకట్టున కొడకు కలగాలి" అనునవి సామెతలే కాదు, జానపదుల విశ్వాసములు, పదునెక్కిన పొలములను దున్ని ఏరువాక సాగింతురు. దీనిని "ఏరువాక సాగుట" అందురు. ఈ నాటితో కృషి ప్రారంభమని అర్థము. "ఏరువాక" అనగా దుక్కి ప్రారంభమని శబ్దరత్నాకరకారుడు పేర్కొనెను. దీనిని తెలంగాణమున 'అరికెసాగించుట' అందురు.

ఏరువాక సాగుట మూడు విధములు. (1) దొంగ ఏరువాక – తెల్ల వారితే సంవత్సరాది యనగా తెల్లవారుగట్ల ఎవ్వరితోను చెప్పకుండ రైతు నాగలిని, ఎద్దులను పూజించి ఏరువాక సాగించును. ఉగాది, దసరా పండుగ దినములలో ముహూర్త విచారణ లేకుండగనే క్రొత్త పనులను ప్రారంభింతురు. ఈ రెండు దినముల సంపూర్ణముగా శుభమును కలిగించునను విశ్వాసము జానపదులలో కలదు. (2) ముహూర్త ఏరువాక అనగా మంచి ముహూర్తమును చూపించుకొని ఆ శుభ సమయములో తొలి దుక్కి దున్నుటకు ప్రారంభించుట, (3) 'ఏరువాక పున్నమ' అని జ్యేష్ఠ శుద్ధపౌర్ణమినాడు 'ఏరువాక పున్నమ' అను పేరుతో పండుగగా నాచరించి దుక్కిని ప్రారంభింతురు. కొందరు శ్రావణశుద్ధ పౌర్ణమినాడును జరుపుదురు.

ఏనాడు జరిపినను ఇది కృషీవలుల పండుగ. ఇది ప్రజలకు అన్నదాత యైన కృషీవలుల పండుగ అయినప్పుడు దేశమున కంతటికిని పెద్ద పండుగ అనవచ్చును.

ఈ పండుగ అతి ప్రాచీనమైన పండుగ అని, వైదిక కాలమునందును ఇది జరుపబడుచుండెనని పరిశోధకులు తెల్పుచున్నారు. విష్ణు పురాణమున దీనికి "సీతాయజ్ఞము" అను పేరు కనబడుచున్నది, బుద్ధుని కాలమున నిది

1. శబ్ద రత్నాకరము. చూ. ఏరువాక.

"వప్పమంగళ దివస" అను పేరున వ్యవహరింపబడినట్లు జాతక కథలలో కలదు.

తెలుగు దేశమున ఏరువాకనాడు నాగలిని పూజించుట రెండువేల యేండ్ల క్రిందటి నుండి కలదనుటకు గాథా సప్తశతి సాక్షి. -[1] దుక్కి సాగుటను ఆముక్త మాల్యద పేర్కొనినది -[2]

ఇట్లు సహస్రాబ్దములుగా ఆచరణలో నున్న ఈ పండుగ తెలుగువారిలో బాగుగా వ్రేళ్లు తన్నుకొనినది. ఈనాడు కర్షకులు తెల్లవారు జాముననే లేచి ఎద్దులను కడిగి కొమ్ములకు రంగును పూసి గజ్జెలు, గంటలు, పూలదండలు మున్నగువానితో అలంకరించెదరు. పశువుల కొట్టమును శుభ్రపరచి, పేడతో పూతపూసి జాజు, సున్నములతో ఎఱ్ఱని తెల్లని పట్టీలను తీర్చి అలంకరించెదరు. ఎద్దులతో పాటుగా నాగళ్ళను, గొఱ్ఱులను కూడ అలంకరించి రావిఆకు లేదా తమలపాకుతో కూడిన తోరణములను గట్టెదరు. పంటలకు ఆది దేవతయైన వినాయకుని పూజించి నైవేద్యమిడెదరు. పసుపు కుంకుమలతో అలంకరించిన కాడిని ఎద్దుల మెడకుచేర్చి మంగళ వాద్యములతో ఊరేగించుచు తమతమ పొలములకు వెళ్ళి ముందుగా మూడు చాళ్ళను తోలుదురు. దానితో దుక్కి ప్రారంభ మయినదని అర్థము. కొందరీ వేడుకను మృగశిర కార్తినాడే చేయుట కలదు. ఈనాడు ఊరువాకిట గోగునారతో తయారుచేసిన తోరణము నొకదానిని గట్టి దానిని రైతు బిడ్డలు చేరకోలలతో గొట్టి ఎవ్వరికి దొరికిన పీచును వారు తీసికొని పోవుట ఆచారము. ఇట్లు చేయుట వలన పశువులకు మేలుకలుగునని విశ్వాసము. ఈ దృశ్యము కృష్ణాష్టమి సందర్భమున ఉట్లుకొట్టు దృశ్యమును తలపింప జేయును. పశువులకు అనారోగ్యమేర్పడిన సమయమున ఈ పీచును సన్నని త్రాడుగా పేని వాని కాళ్లకు కట్టుదురు. దానితో రోగ నివారణ జరుగునని వారి నమ్మకము.

ఏరువాక గురించిన పాటలెన్నియో గలవు. నూనె వేసిన పులగమును యెడ్లకు బెట్టి పసుపు కుంకుమలతో అలంకరించిన నాగలికి యెడ్లను కట్టి

1. గాథాసప్తశతి (ప్రాకృతము) - 2-65.
2. ఆముక్తమాల్యద - 4-124.

ధూప దీపములర్పించుచు స్త్రీలు హారతినిచ్చెదరు. నాగలిని పూజించు చున్నప్పుడు స్త్రీలిట్లు మంగళము పాడెదరు.

"మంగళమమ్మా! మా పూజలు గైకొమ్మా
మంగళమమ్మా! నాగలి నీకు ॥ మంగళ ॥
కష్టమనక భూమిదున్ని కరువు మాపి, కడుపునింపి
సకల జీవరాసినీ, చాలున పోషింతువమ్మా ॥ మంగళ ॥
కర్షకులను కరుణతోడ, కాపాడుచు యెల్లప్పుడు
కామితార్థముల నిచ్చెడి కల్పవల్లివమ్మ నీకు ॥ మంగళ ॥ –1

– ఇందు సకల జీవరాసిని పోషించు నాగలిని సకల భూతాత్మయైన దేవతగా భావించి పూజించుట సహజాతి సహజము.

వాన కురిసినంతనే వెర్రెత్తిపోయిన రైతు తాను దున్నబోవు పద్ధతిని, పండబోవు పంటను ఊహించుకొని రాముడేవచ్చి గొర్రు తోలునను నంతటి ఆనందముతో పాడునప్పుడు అతని భార్య కూడ తన కోకిల కంఠమును కలుపును.

"పడమట కొర్రువేసే, పదును వాన గురిసె
పోపొయ్యి రఘురాముడు పదును జూసొచ్చె
గోపమ్మను లేపండి గొర్రు పూజియ్యి
ఇంట్రాన్ని (ఇల్లాలు కావచ్చును) లేపండి సద్దుల్లు గట్ట
శ్రీరాముడు గొర్రు తోలె, సీత విత్తనాలేసె
శ్రీరాముడు యెవ్వరు? సీత యెవ్వారు?
శ్రీరాముడు మా తండ్రి, సీత మా తల్లి
రఘురాముడు గొర్రుతోలె, సీత విత్తనాలేసె.
...."–2

క్రింది పాటలో 'ఏరువాకను దేవతగా ఆరాధించుచు వరములను కోరు కొనుట వివరింపబడినది. దీనిని "ఏరువాక ఆరాధన" అందురు.

1. మిన్నేరు – పుట – 348.
2. మిన్నేరు – పుట – 349 మరియు పల్లెపదాలు – పుట – 2.

"ఏరువాకమ్మకు ఏమి కావాలి?
ఎఱ్ర ఎఱ్రని పూలమాల కావాలి
ఎరుపు తెలుపుల మబ్బు టెండ కావాలి
ఏరువాకమ్మకు ఏమి కావాలి?
పొలము గట్టున నిలిచి వేడుకోవాలి
టెంకాయ వడపప్పు తెచ్చి పెట్టాలి
ఏరువాకమ్మకు ఏమి కావాలి?
ముత్తైదువలందరూ పాట పాడాలి
పుణ్యస్త్రీలందరూ పూజ చేయాలి
ఏరువాకమ్మకు ఏమి కావాలి?
పాటపాడుతు తల్లి, పాదాల మ్రొక్కాలి
ఎడతెగని సిరులివ్వ వేడుకోవాలి
పాడిపంటలు కోరి పరవసించాలి ॥ ఏ ॥-[1]

తల్లులు అన్నము తినక మొండితనముచేయు తమ పిల్లలకు ఆకసమున పరుగిడు మేఘములను చూపి అన్నము పెట్టుట దేశమంతటను గలదు. ఏరువాక సమయమునకు ఆకాశము మేఘాచ్ఛాదనమగుట, దానిని చూచి నెమళ్ళు నాట్యము చేయుట, ఏర్లు పొంగుట – ఈ దృశ్యములనన్నింటిని పిల్లల లేలేత మనస్సున హత్తుకొనిపోవునట్లు అన్నము తినిపించుట ఈక్రింది ఏరువాక పాటలో ఎంతయో కవితా మధురముగా నున్నది.–

ఏరువాక వచ్చింది – ఏరువాకమ్మా
ఏర్లు నదులు పొంగి – వెంటనే వచ్చాయి
నల్ల మేఘాలలో – నాట్యమాడింది
ఇసుక నదిలో దూరి – బుసలు కొట్టింది
పాడుతూ కోయిల – పరుగులెత్తింది
ఆడుతూ నెమలి – అలసిపోయింది
నవ్వుతూ మాబాబు – బువ్వ తిన్నాడు
ఏరువాక వచ్చింది – ఏరువాకమ్మ

1. మిన్నేరు – పుట – 350 2. మిన్నేరు – పుట – 351.

ఇందు ఆధునిక కవితాచ్ఛాయ లలుముకొనినవి. నల్లని మేఘముల నాట్యము, నదిలో దూరిన ఇసుక బుసలు, పాడే కోయిలమ్మ పరుగులు, ఆడే నెమలమ్మ అలసట, బాబుకెంతో ఉల్లాసము కలిగించుయేగాక 'ఏరువాక' అనిన ఏమిటో 'మాట మాత్రముగా' బాలుని పసి మనస్సులో నాటి ఉత్తరోత్తర ఏరువాక పంటల కంతయు మూలమని గ్రహింపు కలుగునట్లు చేయుచున్నది.

ఈ పాటయే చిట్ట చివర కొన్ని మార్పులతో "తెలుగు పల్లె పాటలలో" కలదు. అందు –

"ఆకాశమున మబ్బు లవతరించాయి
ఉరు మొక్కటావేళ ఉరిమి పోయింది.
....
విత్తనాలు దీసి విరజిమ్మవయ్యా,
మృగశిరాకార్తిలో ముంచెత్తువాన
కలపరా అబ్బాయి కొత్త దూడల్ని
కట్టరా అబ్బాయి కొత్త నాగళ్లు
దున్నరా ఓ అయ్య దుక్కుల్లు మీరు
ఒక గింజ కోటియై వర్థిల్లు మీకు
ఏరువాక సాగి ముసురు కోవాలి
కొత్తపంటలు మనము కోరుకోవాలి.

అని కలదు. ఇందు 'మృగశిరాకార్తిలో' వానలు ముంచెత్తునను వాతావరణ శాస్త్ర విషయము ఉండుట విశేషము.

నిజమున కీఏరువాక ఒక వ్రతము వంటిది. ప్రతి సంవత్సరము జరుపు కొను వేడుక అయినను కర్షకులలో నూతనోత్సాహమును కలిగించుచు కమ్మని కలలో తేలిపోవునట్లుచేయును. వృష్టి అనావృష్టి బాధలను మరపించి, పంట ఇంటికి వచ్చునంత వరకును నమ్మకము లేదను విషయమును మరపించి, "తాము పట్టింది పయిడి, ముట్టింది ముత్యము" అను ఆశలకు గురిచేసి, పండించి తీసికొని రాగలమనుకొనిన ధాన్యపు రాసులను ఊహింప జేసి కర్షకులను ఆనందపుటలలో నుయ్యాలలూపును.

1. తెలుగు పల్లె పాటలు – ప్రయాగ నరసింహ శాస్త్రి – పుట – 2.

నాగ పంచమి - నాగుల చవితి :

నాగపూజ భారతదేశమున అతి ప్రాచీనమైనది. దీనిని సంవత్సరమున పెక్కు మారులు జరుపుచున్నట్లు వ్రతగ్రంథముల వలన తెలియుచున్నది. హేమాద్రి పండితుడు చతుర్వర్గ చింతామణి వ్రత ఖండమున చైత్ర వైశాఖ శ్రావణ భాద్రపద కార్తీక మార్గశిర పాల్గుణ మాసములలో ఆచరించు నాగవ్రతములను తెలిపినాడు. కాని తెలుగు దేశమున శ్రావణ శుద్ధ పంచమినాడు నాగపంచమిని, కార్తీక శుద్ధ చవితినాడు నాగుల చవితిని జరుపుట ప్రసిద్ధము.

మనకు నేటికి లభ్యములైన గ్రంథములలో అతి ప్రాచీనమైనదిగా నిర్ణయింపబడిన ఋగ్వేదమునందు ఫణిగణము పేర్కొనబడినది.[1] ఇంద్రుని శత్రువుగా వర్ణింపబడు వృత్రుడు నాగజాతివాడని తెలియుచున్నది.-[2]

అధర్వవేదనమునను నాగుల ప్రసక్తి కలదు.[3] ఇందు పురాణ ప్రసిద్ధ మగు తక్షక, ధృతరాష్ట్ర, ఐరావతులను సర్పముల పేర్లు కానవచ్చు చున్నవి. మహాభారతమున నాగులు తరచు కానవచ్చెదరు.[4] ఈ భూమిక ఆధారమగు వాసుకి, అనంతుడు మున్నగు సర్పముల పేర్లు ప్రత్యేకముగ చెప్పబడినవి. పురాణముల యందు నాగుల కథలు పెక్కుగలవు. మహెూంజోదారో శిథిలము లలో అధోభాగము నాగము, ఊర్ధ్వ భాగము మానవుడుగా గల నాగ చిత్రము లున్న ముద్రికలును చాల లభించినవి.

భారతీయులకు అపారమైన సర్పసాహిత్యమున్నది. సర్పదేవతల రాజు సహస్రగుణుడైన అనంతుడు. ఇతడు విష్ణువునకు శయనము. శివుడు నాగాభరణుడు, నాగకంకణుడు, నాగ యజ్ఞోపవీతి, నాగ మేఖలుడు, నాగకిరీటి సాహిత్యమున నున్న సర్పములలో ఎక్కువ భాగము ఊర్ధ్వలోకములలో కన్పించదు. అధోలోకమైన పాతాళమున కన్పించును. దీనిని పి. థామస్ ప్రస్తావించి "సర్పరాజధాని భోగవతి. అమూల్యములగు సర్పమణులతోనే ఆ నగరమును

---

1. ఋగ్వేదము - 1-2-38
2. ఋగ్వేదము - 2-12-3 మరియు 4-19-8
3. అధర్వవేదము 8-14, 14-16 మరియు 11-9, 16-24
4. ఆదిపర్వము, ఉద్యోగపర్వము, అనుశాసనిక పర్వము.

నిర్మించినట్లు చెప్పుచున్నారు. కనుక ఇది పదునాలుగు లోకములలోను ఐశ్వర్యవంతమైన నగరము" అని వర్ణించెను.[1]

సర్పముల ప్రసక్తి ప్రపంచము నందంతటను కలదు. బైబిల్ ప్రారంభములో ఏడమ్, ఈవ్ కథలో సృష్టి రచనా సమయములో చెట్టును చుట్టుకొని యున్న ఒక సర్పమును వర్ణించిరి. మెక్సికోలో సూర్యమందిరములలో సర్పశిలలున్నవి. మెక్సికో చరిత్రలో మొదటి మహిళ వెంట ఒక పెద్ద గండుపామును చిత్రించుట కానవచ్చును. ఈ మహిళ పేరును ప్రాచీన స్పెయిన్ రచయితలు "మా శరీరమాంసపు మహిళ (The woman of our flesh)" అని అనువదించినారు. ఈ సర్పము సూర్యదేవత-టోనాక్ట్-కోట్. ఈ దేవత మెక్సికో దేవతాగణములో ప్రధాన దేవత. స్త్రీ రూపముననున్న దేవత. ఆదిమానవుని తల్లి. ఈమె పేరు చిహువా – కోహుయట్ – అనగా సర్పపత్ని. సర్పమే మానవజాతి తండ్రి అని ఈజాతి పురాణ కథలు తెలుపుచున్నవి. ఈ కథలు అమెరికాలోని తక్కిన యనాది జాతుల కథలతోను సంవదించుచున్నవి. పాము ఒకానొకప్పుడు మానవాకృతి పొంది యుండెనను భావమే ఈ అభిప్రాయమునకు మూలమై యుండును. హిబ్రూ పురాణ కథలో ప్రలోభపరచు సర్పము మాట్లాడును. పర్షియా పురాణ గాథలలోని రెండు కాళ్ళ ముసలి పాము సైతానయిన అహ్రీమన్ తప్ప మరియొకటి కాదు. సర్పము పితరులకు, భూతములకును సంకేతమను విశ్వాసమున్న కొన్ని ఆఫ్రికా, అమెరికా తెగలలో నేటికిని సర్పము చెడుగుకు సంకేతమను మూఢ విశ్వాసపు ఆదిమ స్వరూపము భద్ర పరుపబడినది. ఈ తెగలు పాములను తమ పితృదేవతల స్వరూపములుగా భావించెదరు. ఈ భావమే పెక్కు హిందూ దేవతలలోను కలదు. పాములకు పితృ స్వరూపమును ఆపాదించుటను నరమేధమున సర్పపూజకు గల సంబంధమును బట్టి గ్రహింపవచ్చును. ఫెర్గూసన్ ఈ నరమేధమును తెలిపినాడు. ఇది నిజముగా పితృ పూజకు సంబంధించి నదియే.–2

టిబెట్టులో సునాగుడను రాజు పాటలీ సరోవరములో ఉన్నట్లుగా చెప్పబడినది. కొరియా, సయాం, ఇండోనేషియా, కాంబోడియా మొదలైన

1. Hindu Religio., customs and manners. page.35
2. Ancient symbol worship - Hoddern M. Westropp and C. Staniland Wake. page - 41

దేశములలో సర్పచిత్రములు కనిపించును. యూదులును, అరబ్బులును పాములను రూపాధిష్ఠాన దేవతగా భావించుచుండిరి. పశ్చిమ దేశములలో సస్యదేవత రన్నత్ - సర్పముల ప్రతీక. భూదేవత "సేవ్" - నాగరాజు భార్య అని నమ్ముచుండిరి. గ్రీకులు సర్పము భూమి పుత్రుడనియు అతనికి పంటలతో సంబంధమనియు నమ్ముచుండిరి. కనుకనే వానికి దేవాలయములు నిర్మించుచుండిరి. గ్రీకు రాజధాని యగు ఏథిని దేవాలయమున కొన్ని పాములను పోషించెడివారట. "సర్పమునొక దేవతగా ఆరాధించు దేశములలో ముఖ్యముగా జుడియా, ఫోనీషియా, మెసపోటేమియా, గ్రీసు, ఇటలీ, స్కాండినేవియా, బ్రిటిష దీవులు, ఆఫ్రికా, అమెరికా, పర్షియా దేశములను చెప్పవచ్చును. -[1]

సర్పపూజ ప్రాముఖ్యము నందుకొనుటను గురించి శ్రీ కాణేపండితుడు చర్చించుచు పాము కాటు వలన మృత్యుభయమే నాగపూజకు కారణమై యుండునని పేర్కొనిరి. -[2]

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ సర్పారాధనము దేవతల వాహనములకు ప్రాముఖ్యము వచ్చిన పిదప ఆచరణములో నేర్పడినట్లు భావించుచు "ఇటీవలి భారతీయ భావపరంపరా రంగము వేరుగానున్నది. భారతీయ జీవితమున గోపూజ మిక్కిలి ముఖ్యమైనదిగా పరిణమించినది. ఇట్టిది వేద వాఙ్మయమున లేదు. వేర్వేరు దైవములకు వేర్వేరు వాహనములుగా పశుపక్ష్యాదులు పేర్కొనబడినవి. అవియే ధ్వజ చిహ్నములుగా కూడ నయినవి. శివునికి వృషభము, విష్ణువునకు గరుడుడు, బ్రహ్మకు హంస - వాహనములును, ధ్వజములును. విష్ణువునకు శయ్య శేషనాగము. అతడే పృథ్వీభారమును తన వేయి పడగలతో వహించు చున్నాడు. శివునకు మెడలో హారము వాసుకి. అతడు సర్పభూషణుడు. ఇతర దైవములతో సంబంధముగలవి ఏనుగు, సింహము, పులి, ఎద్దు. దైవములతో పాటు ఇవి గూడ దేవగణమునకు చేరినవి. శివుని వాహనము వృషభము -

1. నాగ-లింగ ప్రతిమలు - వాటి ఆరాధన (వ్యా) శ్రీ దిగవల్లి వేంకట శివరావు. భారతి, ఫిబ్రవరి, 1945-145.
2. History of Dharma Sastra Vol.II, Part II - P.V. Kane page.824

నందీశ్వరుడు. వాహనములు పూజాస్థానము నాక్రమించినవి. దివ్య భావమిట్లు సృష్టిలోని ప్రతి వస్తువునకు వ్యాపించినది." –[1] అని వివరించినారు.

ఫెర్గూసన్ సర్ప ప్రాధాన్యమును గురించి చెప్పుచు "సర్పములు తమ ఇష్టానిష్టములనుబట్టి గాలిని, వర్షమును మానవునికి ప్రసాదించునను విశ్వాసము తూర్పు దేశముల యందంతటను ఎల్ల కాలముల యందును ఉన్నది." అని పేర్కొనెను. –[2]

నాగపూజా పద్ధతి అతి ప్రాచీనమయినట్లు తైత్తరీయ సంహిత వలన తెలియుచున్నది. సంస్కార కౌస్తుభః వంటి కొన్ని మధ్యయుగపు సంకలన గ్రంథములలో నాగబలియను విధియొకటి గలదు. ఈ విధి సినీవాలినాడుగాని, పూర్ణిమ నాడుగాని, ఆశ్లేషయందు చంద్రుడున్న పంచమి నాడుగాని, నవమి నాడుగాని జరుపవలెను (సినీవాలి యనగా చంద్రరేఖ కానవచ్చు నమావాస్య. ఆశ్లేష నక్షత్రమునకు సర్పము అధిష్ఠాన దేవత.) ఈ వ్రత ప్రయోజనములు రెండు : పామును జంపిన పాప పరిహారము, పామును జంపుట వలన కలిగిన కీడు వంశమునకు తగులకుండుట. ఈ వ్రతమునందు బియ్యపు పిండితోగానీ, గోధుమపిండితో గానీ, నువ్వుల పిండితోగానీ సర్పాకారమును చేసి, దానిని చేటలోనుంచి షోడశోపచారములతో పూజించి పాయసమును అర్పించవలెను. పిదప కరపాద ప్రక్షాళనము చేసికొని, ఆచమన మాచరించి హోమము చేయవలెను. (కాని స్విష్టకృత్ ఆహుతి లేదు. ఓంకారముతో సర్పాకృతి ముఖమున మూడు సార్లు వెన్న కాచిన నేయిని విడువవలెను. తైత్తరీయ సంహితలోని 42 8–8) మంత్రములతోను, పురాణ శ్లోకములతోను, సర్పమును స్తుతించి, జపించి, దానిని అగ్నిలో వేయవలెను. పిదప మూడునాళ్ళుగాని, ఒకనాడుగాని ఆ శౌచమును పాటింపవలెను. పిదప ఆ సర్పము స్థానముననున్నట్లు భావించుచు ఎనమండుగురు బ్రాహ్మణులను ఆహ్వానించి, వారిని ఉపచరించి, భోజనానంతరము దక్షిణా

1. ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్ర చరిత్ర – ప్రథమ సంపుటము – అనువాదము సరిసెల్ల విశ్వనాథ శాస్త్రి. పుట–25.
2. Tree and serpent worship - Ferguson. page.46

తాంబూలమునిచ్చి సత్కరింపవలెను. పిదప బంగారు పాము ప్రతిమను కలశమున నుంచి, ధ్యానించి, ఆ బంగారు నాగ ప్రతిమనుగాని, దాని విలువను గాని, గోవును గాని బ్రాహ్మణునికి దానమీయవలెను. –[1]

నాగారాధన వైదికమతమునసే గాక బౌద్ధులలోను వ్యాపించినది. బుద్ధుని వెనుక నాగము పడగవిప్పి నీడ పట్టునట్లున్న విగ్రహములు చాల కలవు. జైనులలోను నాగపూజ, నాగయాత్ర కానవచ్చుచున్నవి.

పంజాబ్‌లో మిరాసి ప్రజలు నాగపూజతోనే తమ జీవితమును గడుపుదురు. వీరు తమ యిండ్లలో పాము బొమ్మను పెట్టుకొందురు. అట్లు చేసిన నాగుపాము వారింటికి రాదని వారి విశ్వాసము. రోగములు దూరము కావలెనని కోరుకొనుచు మధ్యప్రదేశ్‌లో మార్బత్ అను యక్షిణిని పూజించెదరు. నేపాల్‌లో చంగు నారాయణోత్సవమును జరుపుదురు. గుజరాత్‌లో కృష్ణ సర్పమును పూజించెదరు. వీరు సంతానములేని స్త్రీ నాగపంచమి మొదలుమూడు సంవత్సరముల వరకు ప్రతి పంచమినాడు నాగపూజ చేసిన పుత్రప్రాప్తి పొందునని నమ్మెదరు. అచ్చట నాగులను చంపరు. పొరపాటున చంపినను శాస్త్రోక్తముగా దహన సంస్కారములు చేయుదురు. ఆంధ్రులలోను నిట్టి ఆచారముండెడిది. నేడు నామమాత్రముగా మిగిలియున్నది. చంపబడిన పామునోటిలో రాగి నాణెముల నుంచి, దానిని కాల్చి, కాల్చిన తరువాత ఆ నాణెములను తీసి దాచి పెట్టుకొందురు. ఎవ్వరైనను పాము కాటుచేత బాధపడు వారుండిన పాము కాటువేసిన స్థలమున నల్లని ఉన్ని దారముతో ఈ రాగినాణెమును బంధించి కట్టెదరు. అట్లు చేసిన పాము విషము తగ్గునని జానపదుల విశ్వాసము. కేరళలో నాగులకు నైవేద్యము లర్పించిన లక్ష్మీదేవి ప్రసన్నమగునని విశ్వసించెదరు. ఒరిస్సాయందు అనంతదేవుని, గడవాల్‌లో నాగరాజును, ఔరంగాబాద్‌లో రాజవాను పూజించెదరు. సౌరాష్ట్రము, ధరాంగధ్రా, చంబా, కాంగడా, కాశ్మీర్‌లలో నాగుల ఆలయములున్నవి. చీనాబ్ నదీతీరములో 'వాసుకి నాగుని' ఆలయము లున్నవి. నేపాల్‌లో గరుడనాగుల యుద్ధగాథ ప్రసిద్ధి చెందినది. పొట్ట కోసము జెగ్రిపోతుల నాడించు వారు భారత దేశమునందంతటనుకలరు. –[2]

1. History of Dharma Sastra. Vol.II - Part II - page 824
2. విశ్వవ్యాప్తంగా జరిపే నాగపూజా విధానము (వ్యా) కె. శంకరరావు ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 14-7-76-పుట 35

భయంకరమైన ఈ సరీసృపముల పూజ హిందువులందరికిని సర్వ సామాన్యమయినప్పటికిని దక్షిణ భారతము, వంగదేశము ఈ పూజకు పట్టుగొమ్మలు.–[1] నాగుల చవితి వంటి పండుగనే బెంగాలులోని జానపదులు చేయుదురు. దీనికి మానసాదేవి పూజయని పేరు. మానసాదేవి సర్పదేవత. ఈ పండుగను శ్రావణ మాసమున వానలు కురిసి నదులు నిండుగా పారుచున్నప్పుడు, ప్రకృతి పచ్చగా రమణీయముగా నున్నప్పుడు ఆచరింతురు. ఈ సందర్భమున మానసాదేవి కథను మరియు చాంద్ సౌదాగర్ అను వ్యాపారి కథను పురాణముగా చెప్పుదురు. బేహులా అనునొక పతివ్రత చరిత్రను గానముచేసి నృత్యము చేయుదురు. బేహులా లోకోత్తర సుందరి. ఆమె భర్త మరణించియు ఆమె పాతివ్రత్యము వలన మరల జీవించును. ఈ ఉత్సవమున పడవ పోటీలు జరుగును. పడవను నడుపు నావికులు తెడ్లు వేయుచు ఎలుగెత్తి పాటలు పాడుదురు.–[2] "చాంద్ సౌదాగర్ కథలో పేర్కొనబడిన చాంద్ సౌదాగర్, మానసాదేవి పూజను ఆక్షేపించెనట. దానిపై మానసాదేవికిని, ఆ వర్తకునికిని పెక్కు సంవత్సరముల వరకును కలహము సాగెనట. తుదకు వర్తకుడు పరాజితుడై ఆమెను పూజింపవలసి వచ్చెనట. ఇది మానసాదేవి పూజను గురించి వ్యాపించిన కథ. బెంగాల్‌లో సర్పపూజ ఘర్షణము లేక సనాతనాచారపరుల పూజా రూపమును పొందలేదనుటకు ఇదొక సూచన. –[3]

ఆంధ్రులకును నాగులకును విడిపోని చెలిమి. అమరావతి శిల్పములలో నాగశిల్పములు పెక్కుగలవు. ఇవి నాగరాజుల చిహ్నములనియు నాగపూజ నాగుల పూజ అనియు ఖండవల్లి సోదరులు వక్కాణించిరి. –[4] నాగజాతి వాడొకడు తన తండ్రియగు పరీక్షిత్తును మోసముతో పరిమార్చగా జనమేజయుడు కసితీర్చు కొనుటకు సర్పయాగము చేసెననియు, నాగజాతికి చెందిన ఆస్తీకుడు జనమేజయుని ప్రార్థించి నాగజాతి క్షయము నాపెననియు పరిశోధకులు తెలుపు చున్నారు. జీమూత వాహనుని కథ నాగ గరుడ జాతుల వైరమును పోగొట్టుకథయే.

1. Hindu Religion, Customs and Manners - P. Thomas page.35
2. Indian Myths and Legends - The Legend of Manasa Devi - Shantha Rameshwar Rao.
3. Hindu Religion, Customs and Manners - P. Thomas, page.35
4. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి–పుట.59

నాగజాతిపై అత్యాచారమునకు అంతము జరిగిన దివసములు గనుకనే నాగపంచమి, నాగుల చవితివంటి పండుగలు సమన్వయ రూపమున భారత దేశమున ఆచరణకు వచ్చియుండును.

"తస్మాదియం మహారాజ! పంచమీ దయితా సతాం
నాగానాం హర్షజననీ దత్తాస్త్యై బ్రహ్మణాపురా"

– అను భవిష్యపురాణ వాక్యమును మనమిట్లు సమన్వయ మొనర్చుకొనవచ్చును. కాలక్రమముగా ఈ పండుగ ఋతుపరివర్తన సూచకముగా వైద్య గ్రంథములు చెప్పు పాలు, పేలాలు, చలిమిడి మొదలగు లఘ్వాహారముల సేవనము కూడ చేరి సర్ప పూజా మాత్రముగా మిగిలి యున్నట్లు తోచును. నాగపంచమిని వైష్ణవ సంప్రదాయమువారు గరుడపంచమి అందురు. గరుడ పురాణమున ఇది పేర్కొనబడినది.

ప్రతి గ్రామమునందును వేపచెట్టు మొదటనో రావిచెట్టు మొదటనో నాగవిగ్రహములుండును. వానికి కూడ నాగపంచమినాడు పూజ జరుగును. ఈనాడు ప్రజలు శిరస్నానమాచరించి ఉదయము సర్పవిగ్రహములకు పాలు, కొబ్బెర, పేలాలు, చిమ్మిలి, వడపప్పు, పానకము, చలిమిడి నివేదింతురు. పాము పుట్టల వద్దకు పోయి ప్రత్తితో వస్త్రముల వంటి దండలచే యజ్ఞోపవీతముల వంటి నూలు దారములచే పుట్టలను అలంకరించి, పూజించి పుట్టలలో పాలు పోయుదురు. ప్రత్తితో వస్త్రముల వంటి దండలను, యజ్ఞోపవీతముల వంటి నూలు దారములను ఈనాడు ప్రత్యేకముగా సమర్పించుటను సి.టి. ఆక్కులయ్య దీక్షితులు ఇట్లు వివరించుచున్నారు.

"కుండలినీ యోగమునందు మన శరీరమునందుగల ఇడా, పింగళ, సుషుమ్నా అను మూడు నాడులకు ప్రాముఖ్యము కలదు. ఇడా, పింగళ అను నాడులు పెనవేసుకొన్న రెండు సర్పముల ఆకారమునను" కుండలిని అనునది యెనిమిది వంకరలు గలిగి పడగ ముడిచిన పాము ఆకారమునను నున్నవి. కుండలిని చుట్టుకొని యుండు కందము అనునది శివలింగాకారమున నున్నది. ఈ యోగములో వెన్నెముకకు, నాడులకు విశేష ప్రాముఖ్యము జెప్ప బడినది.

నాగ విగ్రహ ప్రతిష్ఠలలో రెండు పాములు పెనవేసుకొన్న ఆకారముతో తీర్చబడిన రెండు విగ్రహము లిరుప్రక్కలలో నున్నవి. విప్పినపడగ అందులో

శివలింగము గల్గిన యెనిమిది వంకరలతో తీర్చబడిన పాము విగ్రహము మధ్య ప్రతిష్ఠింపబడియున్నవి. శివలింగాకారము గల కాయలు గాచునట్టి వేప వృక్షము, నరముల సూచించు ఆకారముతో నుండి ఈనెలు గల ఆకులుండు అశ్వత్థవృక్షము నాటబడుచున్నవి. నాగారాధనలో పత్తిదండలు అర్పించుచున్నారు. నూలు దారము చుట్టుచున్నారు.

నాగ ప్రతిష్ఠలలో పెనవేసుకొనిన రెండు పాముల రూపముగల ఇరు ప్రక్కల నుండు విగ్రహములు ఇడా, పింగళ అను నాడులకును, విప్పిన పడగ అంచులో శివలింగము గలిగి యెనిమిది వంకరలతో తీర్చబడి నడుమ ప్రతిష్ఠించిన పాము విగ్రహము సుషుమ్నానాడికిని ఊర్ధ్వగామియౌ కుండలినికిని, శివలింగాకారముగల వేపకాయలు కందమునకును, పాంచరాత్రే మహోపరిషధి పాద్మసంహితలో 'యదాశ్వత్థ దళే' రాగి ఆకునందువలె మన దేహమున నాడులు గలవని – పోల్చియున్నది గనుక అశ్వత్థవృక్షము నాడులకును, ఆరాధనలో అర్పించు పత్తిదండ మనలోని వెన్నెముక ఆకారము గల్గియున్నది గాన అది సుషుమ్నానాడికిని, ఆరాధనలో చుట్టబడు నూలు దారము మనలోని అసంఖ్యాక నాడులకును, సంకేతములై పుట్టినవని మనము సులభముగా గ్రహించవచ్చును." – ఈ వివరణము ఆలోచనాత్మకమయిన దైనను నాగులను దేవతలుగా ఆరాధించు జానపదుల మనస్తత్వమునకిది విరుద్ధమైనది.

నాగులను సంతానము కొరకు పూజించుట ప్రసిద్ధము. "పుట్టలో పాలుపోసి పొట్ట తడుముకొనుట" అను సామెత సంతానాపేక్షను వ్యక్తము చేయును. బాలబాలికలు కొబ్బరి గిన్నెలను చిత్రవిచిత్రములుగా నలంకరించి వాని మధ్యన బెజ్జముచేసి, రెండు దారములు గట్టి, పురిపెట్టి త్రిప్పుట కొన్ని ప్రాంతముల గలదు. సాయం కాలమున తోటలకో, ఊరి బయటి ప్రాంతములకో వెళ్లి చెట్ల కొమ్మలకు త్రాళ్లు గట్టి ఊయలలూగుదురు.

ఎస్. సి. దుబే నాగపూజను గురించి చెప్పిన మాటలు ఇక్కడ ఉదహరించుట అనుచితముకాదు. "శ్రావణ శుద్ధ పంచమినాడు ఈ పండుగను

---

1. నాగారాధన ఎట్లు పుట్టినది? (వ్యా) సి.టి. అక్కులయ్య దీక్షితులు. భారతి, ఆగష్టు, 1950, -పుట-181, 182.

బ్రాహ్మణుల, కోమట్లు, రెడ్లు తక్కిన అగ్రవర్ణములవారు చేసుకొందురు. ఈ దినమున హిందువులు పెనముపై రొట్టెలు కాల్చుట నిషిద్ధము. ఈ పండుగ చేసికొనునాడు ఇంటిలో పూజ పూర్తి అగువరకు ఇంటిపెద్ద ఉపవసించును. పూజ నాగపూజతో పాటు అపరాహ్ణము వరకు జరుగును. ఉపవసించిన వ్యక్తులు కొబ్బరికాయ, పేలాలు, పాలు, శనగలు, బెల్లము ఒక పళ్లెరములో నుంచుకొని పుట్ట వద్దకు వెళ్ళుదురు. పుట్టలలో పాములుండునని విశ్వాసము. అక్కడ వారు పుట్టకు ధూపదీప నైవేద్యములు అర్పించెదరు. పుట్టలో పాలుపోయుదురు. పూజానంతరము భోజన సమయమున ప్రసాదమును అందరి విస్తళ్లయందును వడ్డింతురు.–[1] ఇందు పేర్కొనిన నియమనిష్ఠలన్నియు తెలుగువారి పద్ధతి ననుసరించేయున్నవి.

నాగపూజను గూర్చిన కథలు తెలుగులో పెక్కున్నవి. డా॥ రామరాజు గారు ప్రజలలో ప్రచారమునందున్న రెండు కథలను పేర్కొనిరి.

"ఒక బ్రాహ్మణునికి 'ఏడుగురు కుమారులుండిరి. వారందరును వివాహితులు. కడగొట్టు కోడలికి తప్ప తక్కిన కోడండ్రందరకును తల్లిదండ్రులు అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రు నుండిరి. వారు ఏ పండుగ వచ్చినను తమ తమ పుట్టినిండ్లకు వెడలు చుండిరి. చివరి కోడలు పుట్టింటివారెవ్వరూ లేనందున ఎక్కడికి వెళ్లెడిదికాదు. ఒకనాడామె తన దురదృష్టమునకు బిగ్గరగా నేడ్చినది. ఆమె సర్పరాజైన ఆదిశేషుని భక్తురాలు గనుక ఆమె ఎడల ఆతనికి దయ కలిగెను. ఆతడు ఆమె దుఃఖమును నివారించుటకు మానవరూపమున ఆమె మామగారి వద్దకు వచ్చి ఆమెను పండుగకు తమ యింటికి పంపుమని కోరెను. కొన్నాళ్ళయినను తనకు పరాధీనత తప్పునని భావించి ఆతడు తన మేనమామ యని పండుగకు తనను పంపుడనియు ఆమె తన మామగారిని కోరెను. ఆతడు నమ్మతించెను. ఆదిశేషుడామెను నాగలోకమునకు పిలుచుకొని వెళ్ళి సకలోపచారములతో ఆదరించి ఆమెను కరవరాదని సర్పములకు ఆజ్ఞాపించెను.

1. Indian Village - S.C.Dube

ఒకనాడు ఒక ఇత్తడి దీప స్తంభము తీసికొని వెళ్ళుచుండగా కొన్ని పాముపిల్లలు ఆమె కాళ్ళకు అడ్డుతగిలెను, ఆమె వానిని త్రొక్కివేయుదునను భయముతో అడుగులు వేయగా చేతిలోని దీప స్తంభము జారి పాము పిల్లలపై పడెను. ఆ దెబ్బకు కొన్ని పాము పిల్లలు పెద్దగా గాయపడెను. కొన్ని తోకలను కోల్పోయెను. తల్లి పామునకు ఆమెపై తీవ్రమగు కోపము కలిగినను రాజాజ్ఞ వలన ఆమె నేమియు చేయలేకపోయెను. కాని ఆమె నాగలోకము నుండి వెళ్ళిపోయిన పిదప కసి తీర్చుకొనుటకు నిర్ణయించెను.

ఆమె కొన్నాళ్లు గడచిన పిమ్మట అత్తవారింటికి బయలు దేరెను. నాగరాజు ఆమెను ఘనముగా వీడుకొలిపెను. ఆమె అత్తవారిల్లు చేరగనే పాము కసి తీర్చుకొనుటకై అక్కడికి వెళ్ళెను. ఆనాడు శ్రావణశుద్ధ పంచమి. ఆమె ఆదిశేషునే పూజించి తన వలన గాయపడిన పాము పిల్లలను కాపాడుమని అతనిని ప్రార్థించుచుండెను. ఆమెను కాటువేయుటకు పొంచియున్న పాము ఆ ప్రార్థనను వినెను. దాని కోపము చల్లారెను. కసి తీర్చుకొనవలననెడి భావము కరిగిపోయెను. నాగరాజునకు నైవేద్యము పెట్టిన పాలారగించి పాలున్న గిన్నెలో అమూల్యమగు రత్నమునొకదానిని జారవిడిచి వెళ్ళిపోయెను. –[1] సర్పములు మానవాకృతి ధరించి యుండెనని ప్రాచ్యదేశములలో వ్యాపించిన విశ్వాసమునకును ఈ కథను ఉదాహరణముగా పేర్కొనవచ్చును.

పంటలకును పాములకును గల సంబంధము పేర్కొనుచు మరియొక కథను డా॥ బి. రామరాజుగారు ఉదహరించిరి. "నాగపంచమి దినమున ఒక రైతు పొలముదున్నుచుండగా నాగేటి కర్రు ఒక పాము పుట్టలో దిగబడెను. దాని వలన పుట్టలోని పాము పిల్లలన్నియు చచ్చిపోయెను. తల్లి పాముపుట్టకు తిరిగి రాగానే పిల్లలు చచ్చిపోయి యుండుట, నాగేటి కర్రుకు రక్తపు మరక లుండుట చూచెను. రైతే తన పిల్లలను చంపియుండునని తలచెను. వెంటనే అది రైతు ఇంటిలో జొరబడి అతని కుటుంబము నంతయు కసితో కరచి చంపెను. ఇంకను కసి తీరక పొరుగూరిలోని అతని కుమార్తెను కూడ కాటు వేసి చంపవలెనని వెళ్ళెను. కాని అక్కడ ఆమె ఆదిశేషుని పూజించుచు ధ్యాన నిమగ్నురాలైయుండుట గాంచెను. ఆమె ధ్యాన నిమగ్నురాలయియున్నప్పుడు

1. Folktales of Andhra Pradesh - Dr. B. Rama Raju, PP-34, 35, Sterling Publishers, New Delhi-1974

కాటువేయుట ఉచితము కాదని పాము భావించి పూజ ముగియు వరకు వేచి యుండుటకు నిశ్చయించెను. కాని అక్కడ ఆదిశేషునకు నివేదించిన పాలు, పేలాలు కనిపించగా పాలు త్రాగి పేలాలు భక్షించెను.

రైతు కూతురు ధ్యానము చాలించి కనులు తెరచెను. ఎదుట పాము కనబడెను. పాము ఆమెను తాను వచ్చిన కారణమును చెప్పెను. ఆమె తండ్రిని, పరివారమును కూడ చంపినట్లు తెలియజేసెను. రైతు కూతురు మిక్కిలి దుఃఖముతో గట్టిగా నేడ్చి తన కుటుంబమును మన్నింపుమని ప్రాణబిక్ష పెట్టమని పామును ప్రార్థించెను. పాము కరుణించి ఆమెకు కొంచెము అమృతమును ప్రసాదించెను. ఆమె తండ్రియూరికి పరుగున వెళ్ళి మరణించిన తన వారి నోట అమృత బిందువులను చిలకరించెను. వారందరును నిద్ర నుండి మేల్కొని నట్లు సజీవులై లేచిరి. ఆనాటి నుండి శ్రావణశుద్ధ పంచమినాడు భూమిని దున్నుట, కూరగాయలను త్రెంపుట, తరుగుట, వండుట మున్నగు పనులు నిషేధింపబడినవి. పూజానంతరము పుట్టవద్ద నాగదేవునికి పాలు, పేలాలు, ఒక గ్రుడ్డు నివేదించుట ఆచారమైనది. –[1] ఈ పూజయందు నాగులకు చల్లని, అపక్వ పదార్థములను నివేదించుట ఆచారము. కొన్ని ప్రాంతములలో దీపమును వెలిగింపరు. దీనికి కారణము నిప్పును, మంటను చూచి పాములు భయపడుటయే కారణము కావచ్చును.

నాగపూజను కార్తీకశుద్ధ చవితినాడు తెలుగుదేశపు తూర్పుప్రాంతమున చేయుదురు. శ్రీనాథుడు "చలి ప్రవేశించు నాగుల చవితినాడు" అనుట కార్తీక మాసమునే సూచించుచున్నది. కొందరు ఇంటిముందు నాగ ప్రతిమను ప్రతిష్ఠించి గాని పాము పుట్టవద్దకు వెళ్ళిగాని పాలుపోసి నాగేంద్రునకు మ్రొక్కు కొనెదరు. చలిమిడి ప్రధానమైన నైవేద్యముగా పెట్టుదురు. ఇది కడుపు చలవకోసమని స్త్రీల విశ్వాసము.

పురుషులు కొన్ని కర్మలలో పితృపితామహ, ప్రపితామహులను పేర్కొనునట్లే నాగేంద్రుని కొలుచు సందర్భమున స్త్రీలు తమను, తమ అత్తగారిని, అత్తగారి అత్తగారిని – మూడు తరముల స్త్రీలను పేర్కొనుచు

1. Folktales of Andhra Pradesh - Dr. B. Ramaraju P.P.32,33

"శేషమ్మ కొలిచిన నాగేంద్రుడా
సీతమ్మ కొలిచిన నాగేంద్రుడా
శ్రీశైలభ్రమరాంబ కొలిచె నాగేంద్రుడా
మా అత్త కొలిచిన నాగేంద్రుడా
ఆవిడత్త కొలిచిన నాగేంద్రుడా
మా పూజలందుకో నాగేంద్రుడా
సిరిసంపదలియ్యవా శ్రీ నాగన్నా."–[1]

అని ప్రార్థించెదరు.

జానపద స్త్రీలు నాగ విగ్రహమునుగాని, నాగచిత్రమునుగాని, పుట్టను గాని పూజించునప్పుడు ఇట్లు పాడుదురు.

"నాగేంద్రుడా! నాగేంద్రుడా
మా వాళ్లు చీకటి వాకిట తిరుగుతారు
నడుము త్రొక్కితే నావాళ్ళనుకో
పడగ త్రొక్కితే పారిపో తండ్రీ"

నాగుల చవితికి నాగన్న! స్నానం సంధ్యలు నాగన్న
పువ్వులు పడగలు నాగన్న మడిబట్టలతో నాగన్న
చిమ్మిలి చలిమిడి నాగన్న పాలు పండ్లూ నాగన్న
దివిటీ తేజున నాగన్న ఉపవసించుచు నాగన్న
ఉద్యాపించుచు నాగన్న ఊరేగొస్తాం నాగన్న
పుట్టకు వస్తాం నాగన్న పూజలు గొనరా నాగన్న –[2]

ఈ పాటలో ఋత్వనుకూల ఆహారమైన చిమ్మిలి, చలిమిడి, పాలు, పండ్లు తెలుపబడినవి. ఆయా ఋతువుల కనుగుణమైన ఆహారమునే దేవతలకు నివేదించుట మన ఆచారము.

ప్రతి భయంకర జంతువు దేవాంశ సంభూతమని దానికి దూరముగా నుండవలెనని దానిని ప్రార్థించిన కీడు కలుగదని మన పూర్వుల నమ్మిక. అట్టి నమ్మకములలో ఒకటి నాగపూజ. ఈ క్రింది పాటలో అప్పటి అమాయక ప్రజల నమ్మకము ఎంత గాఢమైనదో తెలియనగును.

1. మిన్నేరు – పుట – 208 2. మిన్నేరు – పుట – 208

"ఉసిరిగ చెట్టుకింది పసరిగ పాము
కూసమూడ్చీ పాము పడగ బుస్సంది
పాము నన్నూ చూచి పడగ నెత్తింది
పడగలెత్తకుపాము పగవారముకామూ

పడగెత్తి దూసింది నాలుకలు రెండూ
కోడెనాగూవైతె కోకలెట్టేము నాలుకలు దూయకే నీవారము నాగూ
మంచి నాగూవైతె పంచలెట్టేము
పడగలెత్తకు నాగు పగవారము కాము

మా చేను పండితే చలిమిడేసేము
మా నువ్వులు పండితే చిమ్మిలేసేము
నాలుకలు దుయ్యకే నీవారము నాగూ
మా పత్తి పగిలితే పంచలెట్టేము
మా యావు లీనితే పాలు పోసేము
పడగ లెత్తకు నాగు పగవారము కాము
నీ పూజ చేసేము నీకు మొక్కేము. –1

ఇదియే పాట మిన్నేరులో కలదు. –[2]

పాములు ఒక విధముగా కర్షక గృహిణులకు నెచ్చెలులు, ఎందుకనగా చేలను పాడుచేయు ఎలుకలను తినును. కనుకనే ఆ గృహిణి నాగన్నకిట్లు ఉపదేశమిచ్చుచున్నది.

పుట్టలో నాగన్న బూచి నాగన్న
ఎండలో పడుకోకు ఎఱ్ఱి నాగన్న
కలిగినోరి కోడళ్ళు గర్వవంతూలు
కళ్ళాపి జల్లేరు కాళ్ళ చిమ్మేరు
ఎంగిళ్ళు జల్లేరు భంగపుచ్చేరు
అటుబోకు నాగన్న చాకిరేవులకు

1. పల్లెపదాలు–139   2. మిన్నేరు – 209

చాకి రేవులలోన చేరి పడుకుంటె
సాలెపురుగూ అని సంపేరు నిన్ను
అటుబోకు నాగన్న చెరుకు పొలములకు
చెరుకు పొలములలోన చేరి పడుకుంటె
నల్లచెరుకు అని నరికేరునిన్ను.[1]

– ఈ పాటయే కొద్దిపాటి మార్పుతో మిన్నేరున కలదు.[2]

అందమనునది ఎంత సౌమ్యమో అంత భయంకరముగా నుండును. పాము పడగ విప్పి ఆడుచున్నప్పటి అందము. బెబ్బులి అంగలు వేయుచు గాండ్రు మను చున్నప్పటి అందము ముచ్చటైనవే, కాని భయంకరమైనవి, కాళిదాసు తపస్సు చేయుచున్న పార్వతి సౌందర్యమును వర్ణించుచు అపూర్వమైన సౌందర్యమును పాపప్రేరకము కాదనెను. ఆమె అపూర్వ సౌందర్యము తపస్వులకు ఉపదేశముగా నున్నదనియు చెప్పెను.–[3]

కాని కోడెత్రాచు సౌందర్యము ఉపదేశము కాదు, ఉపద్రవకరము. పాము మంత్రము వంటి ఈక్రింది పాటలో నాగుబాము సౌందర్యము భయంకర మనోహరముగా వర్ణింపబడినది.

నాగా దిగరా!
నా తండ్రి దిగరా, నాగన్న దిగరా, నాగా దిగరా
నల్ల చుక్కల నాగ ముద్దునాగా ॥ నాగా ॥
నవనవలాడేటి నల్ల చుక్కలనాగ
తళతళ లాడేటి తెల్ల చుక్కలనాగ
పసిమి పొరలుగల పచ్చన్ని నాగా ॥ నాగా ॥
కొండచిలువల కెల్ల కోర్కెతో రాజువై
పరుగిడు పాములకు ప్రభువువై రంజిల్లి
మొగలి చెట్లపైని మసలి తిరుగులాడి
పాలు ఆరగించు పచ్చన్ని నాగా ॥ నాగా ॥
పక్కాను పదిహేను మచ్చాలు గలవాడ

1. పల్లెపదాలు - 141   2. మిన్నేరు -210
3. కుమారసంభవము -5వ సర్గ

గురివింద పూసల కళ్లయిన గలవాడ

పరికి ముళ్ళవంటి పళ్ళు గలవాడ నాగా దిగరా-1

ఇదే పాట మిన్నేరులో కలదు.-[2]

సామాన్యముగా పురుగు పుట్ర యున్నచోట్లను తల్లులు పిల్లలకు హెచ్చరించెదరు. ఈ స్థలములు పిల్లలకు తెలియుట అవసరము. ఈ స్థలములు భయోత్పాదకములు కావు. కనుక ఇట్టిచోట్ల పాములుండునను సందేహము కూడ ఉండదు. కాని అట్టిచోట్లే ప్రమాదకరము కావచ్చునని తల్లులు ఊహించుట జానపద స్త్రీల జాగరూకతను తెలుపును.

"పిల్లలందరు గూడి పుల్లలేరబోతె

పుల్లలో వుండేటి ఓ పుల్లనాగ ॥

ఇల్లలికి ముగ్గెట్టి మల్లెలు విరజల్లి

మల్లెల్లొ వుండేటి ఓ మల్లి నాగా ॥

గొల్లభామలు గూడి చల్లల్లు చెయ్యంగ

చల్లకుండ కింద చల్లనాగయ్య ॥

ఇవతల యిది కొండ అవతల అదికొండ

నట్టనడుమను కొండ నల్ల తాచయ్య-[3]

- ఇదియే పాట మిన్నేరులో కలదు.-[4] ఇట్టి పాటయే కొద్ది మార్పులతో నున్న దానిని డా॥ కృష్ణకుమారిగారు సేకరించినది నాకిచ్చిరి :

దిగుదిగు నాగన్న ఓ నాగన్న దివ్యసుందర నాగన్నా

దిగకపోతే నీకు తగదు నాగన్నా

అటు కొండ ఇటు కొండ నాగన్నా

మద్దె నున్నది బాట నాగన్నా

బాటల్లో ఉండేటి బాటల్లో పండేటి బాలనాగన్న

చెట్టు లెక్కగలవా నాగన్నా, చెరబండ లాడగలవా నాగన్న

1.పల్లెపదాలు - పుట - 140
2. మిన్నేరు - పుట-209, 210
3. పల్లెపదాలు-138.
4. మిన్నేరు-208

చెట్టూ చెట్టూకు నీవు చేరీ చెలిగింతలాడ ॥అటు॥
ఇల్లలికి ముగ్గెట్టి మల్లెల్లు విరజల్ల, మల్లెల్లో ఉండేటి పిల్లనాగన్న
పిల్లలందరు గూడి పుల్లలకైతేని బోతే,
పుల్లల్లో ఉండేటి, పుల్లల్లో ఉండేటి పిల్లనాగన్న
భామలందరు గూడి బావి నీళ్ళ కెళ్ళితే
బావిలో ఉండేటి బావిలో పండేటి బాలనాగన్న ॥అటు॥ –[1]

జోల పాటలలోని ఒక పాట నాగులకు సంబంధించినది గలదు. దీనిని పిల్లల హెచ్చరించుట కొరకో మరి యెందులకో తల్లులు పాడెదరు.

"నాగ స్వరం పాడితే నాగులకు నిద్ర
పుట్టలో నుంటేను భూములకు ముద్ర
అమావాస పున్నాల మసగలేసుద్ద
పాటి మీదా కోస్తే కక్ష కట్టేను
బూకరించుచు పడగ బుస్స కొట్టేను
గుడిలోన నాగులు, కొల్చిన దేవుడు. –[2]

– ఇదియే పాట మిన్నేరులోను గలదు–[3] ఇందు 'పుట్టలో నుంటేను భూములకు ముద్ర' అనుట సర్పము పంటలనిచ్చు దేవత అనుటను బలపరచు చున్నది.

"జోలల్లు పాడితే బాలలకు నిద్ర
నాగస్వరము పట్టితే నాగులకు నిద్ర"–[4]

– అనియు

"జోలల్లు పాడితే బాలలకు నిద్ర
నాగస్వరం పాడితే నాగులకు ఆట"–[5]

---

1. డాక్టర్ నాయని కృష్ణకుమారిగారు సేకరించినది, కాకినాడ.
2. పల్లెపదాలు – పుట–137
3. మిన్నేరు – పుట–208
4. సెలయేరు – పుట–22
5. జానపగేయాలు – రెండవ సంపుటి – 55.

అనియు జోల పాటలోని హాయిని నాగస్వరములోని మాధుర్యము జతగా తెలుపబడినవి.

నాగ పూజా ప్రాధాన్యముతో పోల్చినపుడు ఈ పాటల సంఖ్య చాల తక్కువ యనియే తోచుచున్నది.

తెలుగువారు పెట్టుకొను పేర్లలో పాముల పేర్లును చాల కలవు – సుబ్బమ్మ, పాపమ్మ, శేషమ్మ మొదలగున్నవి పాపమ్మ శబ్దమును శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు తమ "కథలు గాథలు" లో చర్చించిరి...... "సుబ్బమ్మ, పాపమ్మ శేషమ్మ – ఇలాగుంటాయి. ఇందులో పాపమ్మ, శేషమ్మ అనే రెండూ పర్యాయాలే కాని ఆయీ సందర్భం యెవరికోగాని గోచరించదు. శేషమ్మ శేషుని పేరని గోచరిస్తుంది కాని పాపమ్మ దానికి పర్యాయపదం కావడమెలాగో కొంచెం వ్యాఖ్యానించాలి. పాప శబ్దం సుప్రసిద్ధమే గనుక దానిని బట్టి పాపమ్మ, పాపయ్య అనే స్త్రీ పుంస నామధేయాలు రెండూ సమర్థించడం సుళువే కాని, ఆయీ ప్రక్రియ (పాప + అమ్మ + పాప + అయ్య) అబ్రవీత్పురాణ పండితులదిగాని విజ్ఞులది గాదు. ఏతల్లి తండ్రులో పాప శబ్దాన్ని, పాతక శబ్దాన్ని తమ బిడ్డలకు నామకరణం చేయరని వ్రాయనక్కర లేదు. కనుక కొంచెం ఆలోచించాలి. ఆయీ "పాప"లో వుండే రెండో ప్రకారం యిటీవల ఆదేశంగా తెల్గు వ్యాకరణం తెచ్చి పెట్టింది. కాని అసలు శబ్దంలో పుట్టింది. కాదు. ఔపవిభక్తిక వికారంగా తెలుసుకోవాలి. అసలు శబ్దం పాముగాని పాప కాదు. పాము + అమ్మ అని ప్రక్రియ. వేపచెట్టు వేము + చెట్టు మాదిరిని చూచుకోవాలి. మన భారతీయులు పాముల యందు దేవత్వాన్ని అంగీకరించి పూజించడం అందరు యెరిగిందే. (నాగుల చవితి, సుబ్బరాయని షష్ఠీ). పాపయ్య, పాపమ్మలు దేవతానామాలుగానే పరిణమిస్తాయిగాని పాతక పర్యాయాలుగా పరిణవింపవు."–[1]

నాగపూజయు, నాగుల పేర్లను పెట్టుకొనుటయు భారతదేశమున కాశ్మీరము మొదలు కన్యాకుమారి వరకును వ్యాపించియున్నవి.

తెలుగువారి పొరుగున నున్న తమిళనాడులో మహిళలు పుట్టల వద్దకు వెళ్ళి పుట్టలను పువ్వులతో అలంకరించి కర్పూర హారతి నిచ్చి పూజించి పండు నైవేద్యమిచ్చి పుట్టలలో పాలు పోయుదురు. గర్భిణీ స్త్రీలు త్రాచు పామును

1. కథలు గాథలు – భాగము – 2–శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి.

చూచిన నాగపూజను తప్పనిసరిగా చేయుదురు. అప్పుడు పాటలను పాడుదురు. –[1] అందలి ఒక పాట "పుట్రుపుట్రు నాగరే, భూమి ఇడమ్ నాగరే" అని ప్రారంభమగును. దీని భావమిట్లున్నది : పుట్టలో నివసించే నాగదేవుడా, భూమిలో నివసించే నాగదేవుడా, నితోక బెత్తపు తీగవలె అందమయినది. పడగ చేటంత వెడల్పయినది. నీ కండ్లు గురువింద గింజలవలె ఎర్రనైనవి. నీ పన్నుల అందము సన్నని బియ్యపు గింజల వంటిది. దేవేంద్రకుటుంబన్ అనే కార్మికుడు తన మెడకు పార తగిలించుకొని మన్ను త్రవ్వుటకు చెరువు గట్టు నకు వెళ్ళినాడు. అతనికి నీవేమి హాని చేయకుము. ఎత్తిన పడగను పూర్తిగా దింపివేయుము. అతనికి దారి యిమ్ము ఓ మంచి నాగరాజా"

ఈ పండుగలో నింకొక విశేషము – పాము పుట్ట చెంతకు ఒంటరిగా వెళ్ళదు. వెంబడి తన సంతానమును తోడుగా తీసుకొని వెళ్ళును. వారిచేత పూజలు చేయించును. నాగపూజ పాటలను వినుట వలనను, నాగ ప్రతిమలను నాగుల నివాసస్థలములుగా ప్రసిద్ధివడసిన పుట్టలను పూజించుట వలనను పిల్లలకు ఆయురారోగ్యములను కోరుకొనుటయేగాక పిల్లలకు పాములనిన కలుగు సహజభీతిని తగ్గించి ధైర్యమును పెంపొందించవలెననికూడ వారి కోరిక కావచ్చును.

కృష్ణాష్టమి (గోకులాష్టమి) :

భారతీయ వాఙ్మయములో – కృష్ణునిపై ఉన్నంతటి సాహిత్యప్రక్రియలు మరియే వ్యక్తిని గురించి కూడా లేవు. కృష్ణుని జన్మమొదలు అవతార సమాప్తి వరకును గల అతని లీలలు సాహిత్యమున వివిధశాఖలుగా విస్తరించినవి. దీనికి కారణము కృష్ణుడు సంపూర్ణ భగవదవతారమని హైందవులు భావించుటయే గాక అతడవతరించి, ఆచరించి, ప్రదర్శించిన మహాకార్యములును కారణములు.

కృష్ణుని అవతారము భారతీయులునమ్ము దశావతారాలలో ఎనిమిదవది. ఇతని చరిత్రము హరివంశ, విష్ణు పురాణ, భాగవతములలో అతి విపులముగా నున్నది. తక్కిన ఉపపురాణములలోను ప్రసక్తాను ప్రసక్తముగా పెక్కు చోట్ల కనిపించును.

---

1. Folklore of Tamilnadu - I.S.M. Laxmanan Chettiar, National Book Trust, New Delhi 1973. page = 44, 45.

కృష్ణుని లోకోత్తర సుందరమూర్తిగను, మహాబల పరాక్రమశాలిగను, రాజనీతి దురంధరుడుగను, మహాతత్త్వవేత్తగను మన పురాణములు పేర్కొను చున్నవి. అతడు ప్రపంచమునకు ప్రసాదించిన మహాగ్రంథమైన భగవద్గీత భారతీయ మత ప్రవర్తకులకు ప్రస్థానత్రయములో నొకటైనది. భగవద్గీత కవితా మాధుర్యమును, విషయ వివేచనమును, భావనా స్పష్టతయును నేటికిని ప్రపంచ తత్త్వవేత్తలకు దిగ్భ్రాంతి కలిగించుచున్నవి. రాజనీతి దృష్టిలో కృష్ణుడు మనకు చేసిన గొప్ప మేలు కేంద్ర పరిపాలన పద్ధతి అని నేను భావించు చున్నాను. కృష్ణుని కాలమున భారతదేశము కంసుడు, నరకాసురుడు, కాలయవనుడు, శిశుపాలుడు, దుర్యోధనుడు మున్నగువారి పాలనమున ముక్కలు ముక్కలుగా నుండెను. ఎవరికివారే చక్రవర్తులు, మహా బలసంపన్నులు. రాజ్యలోభమున ఇరుగుపొరుగు రాజులపై దండెత్తుట, నిరంతరము యుద్ధములు జరుపుట మున్నగు చర్యలతో దేశము బహురాజకముగను, నిజమునకు అరాజకముగను ఉండెను. కనుక దేశము కేంద్ర పరిపాలనము క్రింద నుండుట దేశ భద్రతకును ప్రజా శ్రేయస్సునకును ముఖ్యమని భావించిన శ్రీకృష్ణుడు ఉన్నంతలో ధర్మచింత గలవాడును, ఇతరుల విశ్వాసమునకు పాత్రుడునునైన ధర్మరాజును పాలకునిగా చేసి దేశమును ఏక పరిపాలన క్రిందకు తెచ్చుట సమంజసమని తలచెను.

ఈ మహాపురుషుని జన్మదినము రోహిణీ నక్షత్రయుక్త శ్రావణ బహుళ అష్టమి. ఈ దినముననే కృష్ణ జయంతి, కృష్ణాష్టమి, గోకులాష్టమి, జన్మాష్టమి, ఉట్ల పండుగ అని వ్యవహరించెదరు. అష్టమి రాత్రి కృష్ణుడు జన్మించెనట. కనుక కృష్ణాష్టమి పండుగను రాత్రులలో ఉత్సాహముగా జరుపుకొందురు. "అర్ధరాత్రికి 25 నిమిషములకు ముందు పూజ ప్రారంభమగునట్లు స్నానాదులను పూర్తి చేసికొని "శ్రీకృష్ణ ప్రీత్యర్థం సపరివార శ్రీకృష్ణ పూజాం కరిష్యే" అని సంకల్పము చేసి, వైభవముగా షోడశోపచార పూజలను పూర్తి చేయవలెనను నియమము కలదు.–[1] సాయంకాలము వరకు ఉపవసించి అర్ధరాత్రి కృష్ణ విగ్రహమును పూజించుట, అప్పుడే ప్రసవించిన దేవకీదేవి పాలు

1. శ్రీ కృష్ణాష్టమి (వ్యా) – ఆగమవేత్త – ఆరాధన (మాసపత్రిక) ఆగష్టు 1977–పుట–38.

కుడుచుచున్నట్లున్న కృష్ణ విగ్రహములను శయ్యపై నిడి పూజించుట, ఉయ్యాలలో వేసి కృష్ణ విగ్రహమును ఆడించుట, కృష్ణ విగ్రహమున ఊరేగించుట చేయుదురు. పూజా సమయమున చిన్నపిల్లల చాపల్యము నూహించి శ్రీకృష్ణునకు పెక్కు పిండివంటలను, ప్రసవించిన దేవకీ యశోదలకు బాలింతలు తినదగు ఓషదీ ద్రవ్యములను నైవేద్యము పెట్టుట ఆచారము, పూజాంతమున రోహిణీ సహితుడైన చంద్రునకు కూడ పూజ నాచరించెదరు. తరువాత శ్రీకృష్ణ జన్మగాథలు, శ్రీకృష్ణ లీలలను విని భక్తులు పరస్పరము "దధి, క్షీర, ఘృతము"లను చల్లుకొందురు. కృష్ణుని లీలలను స్మరింపజేయుటకు వీధులలో, దేవాలయములలో ఉట్లు కట్టుట, మరునాడు ఉట్లనుకొట్టుట మున్నగు వినోదములు దేశమంతటను జరుగును. దక్షిణ భారతమున ఉట్ల పండుగకు తమ పాటలలో నొక ప్రత్యేకత నాపాదించినవారు తాళ్లపాక వారు. –[1]

జానపదుల ఈ ఉట్లు కొట్టు సంరంభము ఎంతో వేడుకను గొల్పును. ఈ ఉట్లుకొట్టు పద్ధతి రెండు విధములు. మొదటి రకములో ఒక ఎత్తైన చెట్టు కొమ్మను నాటి, ఆ కొమ్మ చివరన ఉట్టి కట్టి, అందు పెరుగు కుండ నుంచెదరు. చుట్టు జనులు గుమికూడి చిన్న చిన్న రాళ్ళతో ఉట్టిపైనున్న కుండకు రంధ్రములు కొట్టుదురు. ఆ రంధ్రముల గుండా క్రింద పడుచుండు పెరుగును అందరు ఒకరిపై నొకరు చల్లుకొందురు. రెండవ రకమున రాళ్ళు రువ్వుట ఉండదు. పెరుగుకుండను దేవాలయపు ప్రాంగణము ముందుండు ధ్వజస్తంభము చివరనైనా లేదా నునుపైన ఒడ్డు, పొడవు కలిగిన చెట్ల మొద్దులను నాటి వానిపైన నుంచెదరు. ఆ స్తంభమునకు పైభాగమున నొకరుండి స్థంభము నెగబ్రాకుచు కుండ నందు కొనుటకు ప్రయత్నించు వారి చేతులు పట్టును వదలి జారిపోవునట్లుగా పై నుండి చింతపండు పులుసును, సబ్బు నీళ్ళను పోయుచుందురు. ఇట్టి ఇబ్బందుల నన్నింటిని కడతేర్చి స్తంభము చివరి భాగముననున్న కుండ నందుకొనిన వారు అదృష్టవంతులుగా నెన్నబడుదురు. వారు కుండలోనున్న పెరుగును తిలకించ వచ్చిన వారిపై చల్లుదురు.

ఇది గ్రామీణుల వీరత్వమును సూచించు వేడుక. మా నాన్నగారి చిన్న తనమున మా గ్రామమున (రాయిప్రోలు – హైద్రాబాదు.) నున్నటి స్తంభముల

1. తాళ్ళపాక కవుల పదకవితలు–ద్వితీయ భాగము–పుట–506.

నెక్కుటకు మారుగా మైనము దట్టముగా పూసిన స్తంభములనెక్కి స్తంభము చివరనున్న పెరుగు కుండను చేత దీసికొని క్రిందికి జారుటకు యువక బృందము ముందునకు వచ్చెడివారట. ఈ మైనమును కొనుటకగు ఖర్చును గ్రామీణులు చందాల రూపమున డబ్బు వసూలు చేసెడివారట. మైనము ఎండకు కరుగు చుండును. కావున మైనపు స్తంభమెక్కుచుండ జారిపోవుట సహజము. అట్టి కష్టసాధ్యమైన కార్యమును సాధించి స్తంభము చివరి వరకు నెక్కి పెరుగు కుండను తీసికొని మరల క్రిందికి జారివచ్చిన వారిని చూచుటకు మూగిన జనము అతనిని "కన్నయ్య, కన్నయ్య" అని కేకలు వేయుచు పిలిచెడివారట. గ్రామీణులు అతనిని చూచి గోపాలకృష్ణుడే అవతారమెత్తివచ్చియుండునని భావించి పరవశించినను పరవశించియుందురు.

పాలుపెరుగు కుండలను ఉట్లపైనుంచుట - శ్రీకృష్ణుడు చిన్నతనమున గోపికల గృహములను చొచ్చి ఉట్లపై నున్న వారి పాలు, పెరుగు, వెన్నలతో గూడిన కుండలను పగులగొట్టు దృశ్యమును తలపింపజేయును. గ్రామీణుల గృహములలో భద్రమునకై పాలుపెరుగు మీగడలను ఉట్లపై దాచుట నేటికిని కలదు. "ఉన్ననాడు ఉట్ల పండుగ లేనినాడు లొట్ల పండుగ" అనునది ఈ పండుగ ననుసరించియే వచ్చిన సామెత కావచ్చును. ఉట్లు పాడి సమృద్ధిని, లొట్లు మద్యపానమును సూచించును.

జన్మ దినములకు నక్షత్రము ప్రధానముగా నెంచు సంప్రదాయము కల వారు రోహిణీ నక్షత్రమెప్పుడు వచ్చునో ఆనాడు కృష్ణాష్టమి పండుగ జరుపుకొందరు. ఒక్కొక్కప్పుడు రోహిణి నక్షత్రము శ్రావణమాసమున బహుళాష్టమి యందు రాక భాద్రపద మాసముననే వచ్చును. అప్పుడు భాద్రపద మాసము ననే జరుపుకొందురు.-[1]

కృష్ణాష్టమి వ్రతమును గూర్చి, పండుగను గూర్చి వ్రత గ్రంథములును, స్కాందాది పురాణములును, వసిష్టసంహిత మున్నగు సంహితులును విశేషముగా పేర్కొనినవి. కృష్ణుని చరిత్ర జగద్విదితము కనుక దాని వివరణ అవసరము లేదు. జానపదుల జీవితములో ఈ కృష్ణుడు ప్రతి అణువునందును భాసించును.

1. హిందువుల పండుగలు-పర్వములు-పుట-100

వేకువనే మేలుకొనినది మొదలు రాత్రి పరుండు వరకును ప్రతి పని యందును, ప్రతి క్రీడయందును, ప్రతి విలాసమునందును, ప్రతి వినోదము నందును కృష్ణుడు ప్రత్యక్షమగును, ముత్తైదువలు తెలతెల వారగనే-

"బంగారు చెంబుతో పన్నీరు పట్టుకు
పడతి రుక్మిణి వచ్చె మేలుకో
రంగైన బంగారు కెంగేల బూనుకు
తరుణి సత్యవచ్చె మేలుకో-[1]

అని మేలుకొలుపు పాటలతో కృష్ణుని మేలుకొలిపెదరు. ఈ మేలుకొలుపులలో ప్రాతర్విధుల వివరణము. ప్రాతఃకాల రమణీయకము పరస్పరము పోటీ పడు చున్నట్లు ఈ పాటల రచన సాగును. మరొక్క మేలుకొలుపులో పక్షుల కలకలము పెరుగు త్రచ్చు సవ్వడులు, ప్రేమల గుసగుసలు, దీపకాంతుల వెలవెలలు చాల మనోహరముగా వర్ణింపబడినవి.

"కలకలమని పక్షిగణములు కూసెను
కాంతుడా యిక నిద్రలేరా
జలజారి కాంతులు వెలవెల బారెను
తలుపుదీసి చూడు లేరా
తరణులందరు దదిచిల్కు వేళాయె
తడవుండ రాదింక లేరా
అరగంటి చూపుతో నట్టిట్టు చూచేవు
గుసగుస మాటాడ కూడవంటే నీకు
గుప్పెత్తు చున్నావు లేరా
పసితనంబేగాని పెద్ద తనంబు లేదు
బాగాయె నిక చాలు పోరా.
పొమ్మంటి ననుచు నీ బుద్ధిలో నెంచకు
ప్రొద్దులేదనియంటి లేరా
దీపకాంతులెల్ల తెలతెలనయ్యెను
దేవదేవ మేలుకోరా.-[2]

1. మిన్నేరు-పుట-274.
2. మిన్నేరు-పుట-282 (మేలుకొలుపు పాటలను ఉన్నతవర్గపు స్త్రీలు ఎక్కువగా పాడుచుందురు)

కల్పనలకు కాణాచియైన జానపద మహిళలు –
"అరుణోదయంబాయె అంభోజములు విచ్చె అదుగో
తూర్పు వేగే లేవయ్య కృష్ణా అఖిలలోకాదీశ రావయ్య
....
పూని దాసకోటి స్నానాది విధుకై సంభారములు దెచ్చె లేవయ్యా
కృష్ణా! సకలామరసేవ్య రావయ్యా"–[1]

– అని పాడుచు తమ స్నానాదికములను ముగించెదరు.

ప్రతి తెలుగు తల్లియు బాలకృష్ణుని మధుర సుందర స్వరూపమును తన కుమారుని యందే చూచును. కృష్ణుని బాల్యలీలలన్నియు తన ముద్దుబిడ్డ ముచ్చటలలో తొంగిచూడగా తననాడించునప్పుడును కృష్ణలీలలనే స్మరించుచు ఆడించును.

తారంగం తారంగం తాండవ కృష్ణా తారంగం
తారంగంబని సారెకు నాదర
వారు వీరు జూడవత్తురు కృష్ణా ॥తా॥
అందమైన చెవులా మద్దికాయ లల్లాడగా
పులిగోరు పతకము బొజ్జపైనుండి తూలాడగా ॥తా॥
తందన ధిమి ధిమి తకమై
అనుచును అందరు జూడగ ఆడర కృష్ణా ॥తా॥
ముందర రాముడు మురళిని సల్పగ
అందరు జూడగ ఆడర కృష్ణా ॥తా॥
అందెలు గజ్జెలు సందడి సేయగ
మందరధరుడా ఆడర కృష్ణా ॥తా॥
కుందన చౌకట్లందము మీరగ
దంధన తకతక ధిమిధిమి యనుచును.–2 ॥తా॥

ఈ పాటలో పసిపిల్లల రక్షకు అనుసరించదగిన "మద్దికాయలు, పులి గోరులు"ను పిల్లలకు ముచ్చటగా అలంకరించు కస్తూరి తిలకము, అందెలు, గజ్జెలు,

1. మిన్నేరు–పుట–275 2. మిన్నేరు–పుట–271.

కుందన చౌకట్లు మున్నగు నగలును తెలుగుతల్లి తన బిడ్డ విషయమున ఆశించునవి.

కృష్ణుడు జన్మించి పెరిగి పెద్దవాడై దుడుకు చేష్టలతో వ్రేతలను వ్రేపల్లెను ఒక కొలికికి తెచ్చిన పాటలు లెక్కకు మిక్కిలిగా నున్నవి. వానిలో నొక్కటి.

"కస్తూరి రంగరంగా నాయన్న కావేటి రంగరంగా
శ్రీరంగ రంగరంగా నినుబాసి యెట్లు నే మరచుదురా.
కంసుణ్ణి సంహరింప సద్గురుడు అవతారమెత్తెనపుడు
దేవకి గర్భముననను కృష్ణావతారుడై జన్మించెను.
ఏడురాత్రులు ఒకటిగా ఏక రాత్రిని జేసెను
ఆదివారం పూటనూ అష్టమి దినమందు జన్మించెను
తలతోటి జననమైతే తనకు బహుమోసంబు వచ్చుననుచు
యెదురు కాళ్ళను బుట్టెను ఏడుగురు దాదులను చంపెనపుడు
తన రెండు హస్తములతో దేవకీ బాలుణ్ణి యెత్తుకొనుచు
అడ్డాలపై వేసుకు ఆ బాలు చక్కదనము చూచెను ॥
వసుదేవ పుత్రుడమ్మా యీ బిడ్డ వైకుంఠవాసుడమ్మ
నవనీత చోరుడమ్మ యీ బిడ్డ నందగోపాలుడమ్మ-[1]

ఈ పాటయే విపులముగను కృష్ణలీలల నన్నిటిని వర్ణించునట్టిదిగను "స్త్రీల పాటలు"లో కలదు,-[2]

కృష్ణుడు దాదాపు నూట పదునారు సంవత్సరములు జీవించి అవతారము చాలించెనని పురాణములు చెప్పుచున్నవి.

హరివంశ, విష్ణుపురాణ భాగవతములలో లేని రాధయను నాయికతో కృష్ణునికి సంబంధమున్న యట్లు సంస్కృతమునందును, తక్కిన భారతీయ భాషలయందును పెక్కు రచనలున్నవి. పైన పేర్కొనిన పురాణములలో రాధ కనుపించదు గనుక రాధ పాత్ర తరువాత కల్పనదని పలువురు భావించిరి. ఈ

1. తెలుగు పల్లెపాటలు-ప్రయాగ-పుట-20.
2. స్త్రీల పాటలు, యన్. వి. గోపాల్ అండ్ కో, - పుట-3-9.

రాధ కేవలము కాంతికి సంకేతమనియు దీనిని పౌరాణికులు రాధయను వ్యక్తిగా భావించిరనియు "వైదిక సంపత్తి"–[1] యను గ్రంథమున పండిత రఘునందన శర్మగారు వివరించిరి. కాని రాధయను వ్యక్తి యున్నట్లుగా రెండు వేలేండ్ల క్రిందటి గాథా సప్తశతి మనకు సాక్ష్యము పలుకుచున్నది. రాధాకృష్ణులను గూర్చి కొన్ని గాథలు దానిలో కలవు.

బొడ్డెమ్మ పండుగ :

బ్రతుకమ్మ పండుగ ప్రధానముగా పెద్దల పండుగయిన, బొడ్డెమ్మ పండుగ పిల్లల పండుగ. ఈ రెండు పండుగలును తెలంగాణమున ప్రత్యేకముగా జరుపబడును. ఇవి రెండును నోములుగా ఆచరింపబడునవయినను పండుగలుగా వ్యవహరింతురు. వినాయక చవితినాడు లేదా భాద్రపద బహుళ పంచమినాడు మొదలిడి మహాలయామావాస్యతో ఈ బొడ్డెమ్మ పూజలను పూర్తిచేయుదురు. ప్రారంభించిన దినమున నొకపీటపై పుట్టమన్నుతో బ్రతుకమ్మ ఆకారములో త్రికోణ గోపురాకారముగా నిర్మించి చుట్టును బ్రతుకమ్మలో వాడబడు తంగేడు, బంతి మొదలగు వివిధ పుష్పములతో నలంకరించి శిఖర ప్రదేశమున బియ్యముతో నిండిన కలశమును పూనించి, కలశముపై నొక క్రొత్త రవికెబట్ట నుంచి దానిపై తమలపాకున పసుపు ముద్ద నుంచి ఆ ముద్దను గౌరమ్మగా భావించి పసుపు కుంకుమలతో పూజింతురు. ఆమెయే బొడ్డెమ్మ. కొన్ని ప్రాంతములలో కలశమును పెట్టకయే పూజించుటయు గలదు. సాయంకాలమున ఇంటి ముందర వాకిటి ప్రదేశమున నలికి ముగ్గులు పెట్టి బొడ్డెమ్మను మధ్య నుంచెదరు. చుట్టుప్రక్కల నుండు పిల్లలందరును బొడ్డెమ్మ చుట్టునుచేరి చేతులు తట్టుచు వినోదముగా పాటలు పాడుచు తిరుగుచుందురు. ఈ బొడ్డెమ్మను గ్రామములోని కుటుంబీకులు ఎవరికి వారే ప్రత్యేకముగానైనను లేదా సమష్టిగా నైనను పూజించుట గలదు. సమష్టి పద్ధతిలో పూజలను జరిపిన కన్యల గుంపు అధికముగా నుండి ముచ్చట గొలుపు చుండును. ఈ సందర్భమున ప్రతి దినమును కన్యలు తమతమ యిండ్ల నుండి బియ్యమును తెచ్చి కలశములో పోయుటయును, చివరి దినమున ఆ బియ్యముతో వంటచేసుకొని కన్యలు కలసి కట్టుగా వినోదించుటయును గలదు. ఈ పండుగ సందర్భమున పాడు పాటలలో పిల్లల భావముల కనుకూలమైన

1. గాథా సప్తశతి.

చిన్న చిన్న పాటలతో బాటుగా బతుకమ్మ పండుగలప్పుడు పెద్దలు పాడు పెద్ద పెద్ద పాటలును మిళితమై యుండును. "బొడ్డెమ్మ నృత్యములను ఆట పాటలను మన మౌత్తరాహుల గర్భో నృత్యముతో పోల్చు కొనవచ్చు" డా॥ బి. రామరాజుగారు అభిప్రాయపడుచున్నారు.–[1] ఆంధ్ర దేశమున అధిక ప్రచారముగల పిల్లల పండుగయిన గొబ్బెమ్మకును, తెలంగాణమున ప్రచారమునగల పిల్లల పండుగ యిన, బొడ్డెమ్మకును సామ్యము లధికముగా కలవు. ('గొబ్బెమ్మను' గురించి 'సంక్రాంతి పండుగ'లో వివరముగా పేర్కొనబడినది.)

సాయంత్రము మొదలుకొని చీకటి పడువరకును పిల్లలు, పిల్లలతో బాటుగా ఆసక్తి కలిగిన పెద్దలును పాటలు పాడుచు బొడ్డెమ్మను పూజించి పప్పు బెల్లముతో కూడిన ఫలహారములను పంచిపెట్టి బొడ్డెమ్మను పూజాగృహములో దాచి పెట్టెదరు.

బొడ్డెమ్మ పాటలు ఉయ్యాల, వలలో, గౌరమ్మ, చందమామ, కోలు మొదలయిన మకుటములతో పాడబడును. బ్రతుకమ్మ పాటలంత పెద్దవిగా కాక చిన్నచిన్న యితివృత్తములను కలిగియుండును. ఉదాహరణమునకు–

"ఆకలాయెనె హంస ఉయ్యాలో చూపలాయెనె హంస ఉయ్యాలో
తల్లిగారింటికి ఉయ్యాలో పోయిరావే హంస ఉయ్యాలో
తల్లి ఏమన్నదే ఉయ్యాలో ఓ రామాజిల్కా ఉయ్యాలో
తల్లి తనపొత్తులా ఉయ్యాలో తినిపొమ్మన్నదే ఉయ్యాలో
తండ్రి ఏమన్నదే ఉయ్యాలో ఓ రామజిల్కా ఉయ్యాలో
తండ్రి ఆరునెల్లు ఉయ్యాలో ఉండిపొమ్మన్నదే ఉయ్యాలో
అన్న ఏమన్నడే ఉయ్యాలో ఓ రామజిల్కా ఉయ్యాలో
అన్న ఆవూల్యాగ ఉయ్యాలో ఇస్తిపొమ్మన్నడే ఉయ్యాలో
వదినె ఏమ్మన్నదే ఉయ్యాలో ఓ రామజిల్కా ఉయ్యాలో
వదిన వాకిట్లనే ఉయ్యాలో వద్దు పొమ్మన్నదే ఉయ్యాలో–[2]

1. తె. జానపదగేయ సాహిత్యము–పుట–429.
2. నేను సేకరించినది పాడినవారు–రామలచ్చమ్మ, రాయిప్రోలు.

– పుట్టింటికి వచ్చిన ఆడుబిడ్డకు ఆ ఇంటివారు చేయు మర్యాదలలో నుండు భేదమును పైగీతము ప్రతిబింబించుచున్నది. కన్నకూతురుపై నుండు మమకారముతో తల్లి తన పొత్తులో తినుమని ఆప్యాయతను వెదజల్లుట, తండ్రి పెండ్లయి దూరముగా వెడలిన కూతురును వ్యామోహముకొద్దీ ఆరునెలలు ఉండిపొమ్మనుట, అన్న ఆవు ననుకరించు లేగదూడవలె అమాయకుడగుట వలన చెల్లెలు కోరిన కోరికలను నెరవేర్తుననుట, మిగతా వారికుండు ఆత్మీయత ఆడుబిడ్డయెడ తన కుండకపోవుట వలన యింటిగడపను కూడ త్రొక్కనివ్వక వాకిటిలో నుండే తరిమి కొట్టినట్లు వద్దు పొమ్మనుట ఎంతో సహజముగా నున్నది.

ఇచ్చెటోడీశ్వరుడు ఉయ్యాలో రాసెటోడు బ్రహ్మ ఉయ్యాలో
ఇరవై ఆవులమంద" ఉయ్యాలో ఈశ్వరుడిచ్చెనే ఉయ్యాలో
అరవై ఆవులమంద ఉయ్యాలో బ్రహ్మ ఇచ్చెనే ఉయ్యాలో
ఆమంద ఈమంద ఉయ్యాలో కల దొడ్డీ నిండ ఉయ్యాలో
అన్న పాలు పిండితె ఉయ్యాలో గిన్నెల్లా మోత ఉయ్యాలో
వదినె చల్లజేస్తే ఉయ్యాలో వాడెల్లమోత ఉయ్యాలో
రాపోలు మాపల్లె ఉయ్యాలో రేపల్లెనే ఉయ్యాలో
మా అన్న కన్నయ్య ఉయ్యాలో మా వదినె గోపమ్మ ఉయ్యాలో[2]

– ఈ పాట చిన్ననాడు బొడ్డెమ్మ చుట్టు తిరుగుచు మేము పాడుకొనినది. చిన్ననాడు ఆ పాట అర్థము తెలియకపోయినను చేతుల చప్పట్ల రవళిలో అనిర్వచనీయమైన ఆనందమును పొందెడివారము. 'ఇచ్చేవాడు' ఈశ్వరుడు – కోరిన కోరికలను సులభముగా నెరవేర్చువాడు. 'నొష్టన' అదృష్టమును లిఖించువాడు బ్రహ్మ ఇచ్చిన ఈశ్వరుడు ఇరువది ఆవులే అయినా అదృష్టమును లిఖించిన బ్రహ్మ. అరవై ఆవుల నిచ్చినాడు. ఆ మంద ఈ మంద కలిసి దొడ్డి (పశువుల కొట్టము) నిండుట పాడిసమృద్ధిని తెలుపుచున్నది. పాల మోత గిన్నెలలో ధ్వనించగా, చల్లమోత అధికముగా నుండును కనుక వాడంతయు వినిపించినది. నిజమునకు పాడి సమృద్ధితో కలకలలాడే యిండ్లతో కూడిన పల్లెలు రేపల్లెలే కదా. ఇట్టి చిన్న చిన్న పాటలు మేము చిన్ననాడు పాడుకొనినవి పెక్కు కలవు.

1. రాయిప్రోలు–నేను పుట్టి పెరిగిన ఊరు.
2. చిన్ననాడు నేను పాడుకొనినది.

డా॥ బి. రామరాజుగారు సేకరించిన పాటలలో కన్యలు తమ వివాహము లగుటకును, మంచి భర్తలు లభించుటకును, లక్ష్మీ పార్వతుల నీ బొడ్డెమ్మ రూపముగా నర్చింతురను భావముగల చక్కని పాటలను పేర్కొనిరి. ఉదాహరణమునకు–

మాలుమర్తి మేడమీద చందమామ వెండియ్య వేనగరలు చందమామ
వెండియ్య వేనగరలకు చందమామ ఇత్తడియ్య చేరెలు చందమామ
ఇత్తడియ్య చేరెలకు చందమామ రాగియ్య కడుపలు చందమామ
రాగియ్య కడుపలకు చందమామ ముత్యాల ముగ్గులు చందమామ
ముత్యాల ముగ్గులకు చందమామ వజ్రాల వాకిండ్లు చందమామ
వజ్రాల వాకిండ్లకు చందమామ పవడాల పందిళ్ళు చందమామ
పవడాల పందిళ్ళకు చందమామ మంచినీళ్ళ బావిపుట్టె చందమామ
మంచినీళ్ళ బావి ప్రక్క చందమామ మంచి మల్లె తీగబుట్టె చందమామ
కోసేవారెవరు లేక చందమామ కొండెత్తు పెరిగిపోయె చందమామ
కోయించు చందప్ప చందమామ పంచిపెట్టు గౌరమ్మ చందమామ [2]

ఈ పాటలో వ్యంగ్యాత్మకమైన భావము కలదు. ముత్యాల ముగ్గులు, వజ్రాల వాకిండ్లు, పగడాల పందిళ్ళు – అనుట వలన సిరిసంపదలతో తులతూగు గృహమని భావించవలెను. అట్టి యింటిలో మంచి మల్లెతీగ పుట్టెను. ఆ తీగయే కన్య. మంచి నీళ్ళ బావి ప్రక్కన పుట్టిన మంచిమల్లె తీగకు నీటి కొరతలేక ఏపుగా పెరిగినది. అనగా పుట్టినింటిలో కన్య ఎట్టి కొరతయులేక 'మంచిమల్లె' వలె అందచందములతో అలరారుచున్నదని భావము. కోయువారు లేక ఆ తీగ కొండెత్తు పెరిగిపోయినట్లే వివాహము లేక ఎదిగిన స్త్రీకిని శోభ లేకపోయినది. కనుకనే తీగెకు ఆలంబనము వలె కన్యకు జీవితములో తోడు కావలసినదే కదా. కన్య మనసు వివాహమును కోరినను వివాహమునకు పూనుకొనవలసిన బాధ్యతను పెద్దవారైన చందప్ప, గౌరమ్మలపై ననే పెట్టబడినది. భారతీయ సభ్యతా సంప్రదాయాలకు మచ్చురానివ్వని భావపరంపర ఈ పాటలలో వెల్లివిరియుచున్నది.

---

1. వెండి వెనుగ్రలు కావచ్చును.
2. తె. పల్లె పాటలు–పుట–38.

అట్లే --

ఇటు గుట్టటుగుట్టా కోలు నడుమా నల్లగుట్టా కోలు

....

మిద్దెమీద గూచున్నా కోలు పణతూ లెవ్వారే కోలు
రచ్చమీద గూచున్నా కోలు రాజు లెవ్వారే కోలు
మిద్దెమీద గూచున్నా కోలు పణతి (సూరమ్మా) కోలు
రచ్చమీద గూచున్నా కోలు రాజు (రామన్నా) కోలు –[1]

– ఇందు చివరి చరణములందలి కుండలికరణములలో ఆదర్శదంపతులై, అన్న వదిన వరుసలో నున్నవారి పేర్లు చేర్చుట పరిపాటి. తొమ్మిది దినములును ఈ విధముగా కొలిచి తొమ్మిదవనాడు బొడ్డెమ్మను చెంతనున్న బావిలో జారవిడిచెదరు. జారవిడుచుచు–

బొడ్డెమ్మ బొడ్డెమ్మ బిడ్డలెందారే
బావిల పడ్డ వారికి వారిద్దరమ్మా
చెర్ల పడ్డవారికి చే (చె) రిద్దరమ్మా
కుంట్ల బడ్డావారికి కోరిద్దరమ్మా
నిద్రబో బొడ్డెమ్మ నిద్ర బోవమ్మా
నిద్రకూ నూరేండ్లు నీకు వేయ్యేండ్లు
నినుగన్న తల్లికీ నిండ నూరేండ్లు. –[2]

అని పాడుదురు. ఇట్లు చేయుటను బొడ్డెమ్మను నిద్ర బుచ్చుట అందురు. ఈ పండుగలో తొమ్మిదవనాడు బాలికల హడావిడి అధికముగా నుండును. బాలికలు బొడ్డెమ్మపై కలశములో నింపిన బియ్యముతో పరమాన్నమును వండి బొడ్డెమ్మను నీళ్ళలో వదలి అచ్చటికి వచ్చిన బాలికలకు పంచిపెట్టెదరు. అదియే ఆనాటి ప్రసాదము. ఈ తొమ్మిదవ నాటి ముచ్చట బ్రతుకమ్మ పండుగలో చివరినాడు చేయు "చద్దుల"ను బోలినది. ఆడపిల్లలు తమ పెద్దలను

---

1. తె. పల్లెపాటలు–పుట–39
2. తె. పల్లెపాటలు–పుట–40

అనుకరించుచు నిట్లు చేయుదురు. ఇందులో అనుకరణమున్నను చిన్ననాటి నుండియే బాలికలకు భక్తితో పాటుగా రుచికరమైన వంటకములను తయారుచేయు నైపుణ్యమలవడును.

కలశముపై నుంచిన కొత్త రవిక గుడ్డను పెండ్లీడుకు వచ్చిన కన్యలు జాకెట్టుగా (రవికె) కుట్టించి ధరించెదరు.

బొడ్డెమ్మ, బ్రతుకమ్మ - ఈ రెండు పేర్లను ఇదమిత్థమని అర్థము చెప్పుటకుగాని నిర్వచించుటకుగాని కష్టముగా నున్న పదములు. బ్రతుకమ్మ అను పదమునకు కొందరు "బ్రతుకు + అమ్మ" అని అర్థము చెప్పి మంగళ గౌరి, జీవనధాత్రి-1 జీవనగౌరి అనిరి. వసంతఋతువుతో ప్రకృతిలో జీవనము, ఆనందము ప్రారంభమయినట్లే శ్రావణ భాద్రపద మాసములతో కూడిన వర్ష ఋతువుతో జీవితము - బ్రతుకుదెరువు ప్రారంభమగును. జీవనాధారమైన ధాన్యములకు కారణమైన దుక్కిదున్నుట, నారుపోయుట, సస్యములు మొలచుట మొదలగు వ్యవసాయపు కార్యములు ఈ ఋతువులో జరుగును. వర్షము పడి వర్షపాతము వలన దేశమంతయు చెట్టు చేమలతో పచ్చగా కనులవిందుగా నుండును గనుక ఈ బ్రతుకునకు ప్రతీకగా బ్రతుకమ్మ పండుగను చేయుట సమంజసము. 'బ్రతుకమ్మ కథ'కు జనప్రచారమున నున్న కథలు వేరుగా నున్నవి.

బొడ్డెమ్మ అను మాటకు అర్థము ఊహించుట కష్టతరముగనే యున్నది. బొడ్డెమ్మ పాటలలోని యితవృత్తమును తరచిచూచిన ఒక్క విధముగా ఊహించుటకు వీలగుచున్నది. బొట్టె, బొట్టియ, బొట్టియడు, బొట్టెడు, బొడిప, బొడిపి, బొడిమ, బొటిమ, పొట్టి, పోటి, పొటమరించు, మొటిమ - ఈ పదములకు చిన్న (ఆకారములోను, వయసులోను), సన్నని, చిన్నపిల్ల, చిన్న పిల్లవాడు, చిన్న కొడుకు అను అర్థములు కలవు.-[1] బొట్టియ, బొట్టియడు, బొట్టె, బొట్టెడు అను పదములలో బొట్టె అను పదము బొట్టియ అను పదము కొడుకునకును, కూతురునకును సామాన్య వాచకములు. ద్రుతము మీది కచటతపలు, గజడ దబలు'గా మారుట వ్యాకరణ సమ్మతము. ప్రాచీన ద్రావిడ 'ట' కారం తెలుగులో అచ్చుల మధ్య 'డ' కారముగా

1. శబ్ద రత్నాకరము

మారడము శాస్త్ర సమ్మతము.-1 వ్యాకరణము ననుసరించి వ్యాకరణమునకు కట్టుబడి యుండవలయునను నియమము లేని జనవాడుకలో బొట్టె, బొట్టియ అను పదములు బొడ్డె, బొడ్డియ అని వ్యవహారములో సరళ పదములుగా మారుటలో విశేషము లేదు. బొడిమ, బొడిప, బొడిపి అను పదములు చిన్న మొటిమకును, బొడువ (చిన్న గడ్డ) కును వాడుచున్నాము. ఈ రెండిటి యర్థము కూడ చిన్న అనునదియే. అంతేగాక కదలక మెదలక కాళ్లు ముడుచుకొని కూర్చొనిన వారిని చూచి 'బొడ్డెమ్మ వోలే కూర్చున్నది' అందురు. ఈ ఉపమానమును చిన్న ఆకారమునే సూచించు చున్నది. 'మా అమ్మ, మా బొడ్డెమ్మ' అని పెద్దవారు చిన్న పిల్లలను ముద్దు చేయుటయు తెలంగాణమున కలదు. వీని నన్నింటిని పరిశీలించగా బొడ్డెమ్మ అను పదమునకు పిన్నవయసులో నున్న కుమారికలు, కన్యలుచేయు వ్రతమని మనము అర్థము చెప్పవచ్చును. ఈ ఊహకు ఈ పండుగను బొట్టియలే చేయుటయు, పాటలలోను కన్యల ఊసే యుండుటయును గమనార్హము.

అంతేగాక ఈ పండుగ వృక్ష ప్రాధాన్యమును కూడ సూచించుచున్న దనవచ్చును. బొడ్డ అనగా అత్థి (మేడి) చెట్టు అని అర్థము.-2 మేడి భారత దేశపు అతి ప్రాచీనమైన మహావృక్షములలో నొకటి. దీని పూజలును వ్రతములును ఎన్నియో కలవు. సంతానమునకును, వివాహమునకు ఉదుంబరమును (మేడి) పూజించుట కలదు. ఈ మేడిచెట్టు పువ్వులు లేకయే కాయలు కాచు విచిత్రమైన మ్రాను. కనుక "మూడు పువ్వులు ఆరు కాయలు" అను సామెత కంటెను విచిత్రముగా కేవలము కాయలే కాచు చెట్టు కనుక మన ప్రాచీనులకు పూజార్హమై యుండవచ్చును. విచిత్ర వస్తువులను, విచిత్ర స్వభావములను దైవలీలగా భావించి పూజించుట ప్రాచీన మానవ స్వభావము. కనుక ఈ మేడిచెట్టు పూజ - ఈ బొడ్డ పూజ - 'ఉదుంబర గౌరి పూజ'గా వట సావిత్రి వ్రతము వాటివలె వ్యాప్తిలోనికి వచ్చి యుండవచ్చును.

---

1. తెలుగు జానపద భాషలో మార్పులు-చేర్పులు (వ్యా) - డా॥ నాయని కృష్ణకుమారి, అక్షరార్చన-సాహిత్యవ్యాస సంకలనము. సంపాదకులు-ఆచార్యదివాకర్ల వెంకటావధాని ప్రభృతులు-హైదరాబాదు 1972-పుట-267
2. శ. రత్నాకరము.

ఉదుంబర వృక్షము ప్రాచీన క్షీర వృక్షము.

"యజ్ఞాంగో బ్రహ్మవృక్షశ్చ హేమదుగ్ధోపృథా...."

అని వైద్య రత్నమాల, 'యజ్ఞయోగ్య : అని రాజనిఘంటువు 'యజ్ఞాంగమని అమర కోశకారుడును పేర్కొనినారు. –[1] ఉదుంబర వృక్షము యజ్ఞములలో ఉపయోగ పడునట్టిది; కనుక పవిత్రమైనది. ఈ క్షీర వృక్షములను వంశాభివృద్ధి నిమిత్తము, సంపద కోసము పూజించుట నేటికిని కలదు. అశ్వత్థ నింబ వృక్షములను కలిపి పూజించినట్లే ఉదుంబర నింబవృక్షములను కూడ పల్లెటూళ్ళలో ఆంజనేయస్వామి గుడివద్దనో, నాగుల ప్రతిమలున్న చోటనో నాటి పూజించుట పెక్కుచోట్ల కలదు.

నిషిద్ధమైన ఫలము ఏదో అది నిమ్నజాతిది అని ప్రస్తుతము సాధారణ ముగా భావింపబడుచున్నది. కాని వృక్షశాస్త్రమునకు సంబంధించిన కొన్ని వాస్తవములు ఈ భావమును తోసిరాజనుచున్నవి, మనకు పూర్తిగా విరుద్ధముగా నున్న ప్రాంతములలో (తూర్పు దేశములలో) కొన్ని మేడి తెగలు పవిత్రముగా భావింపబడుచున్నవి. కనుక మేడిచెట్టు దాదాపు ఆఫ్రికా యందంతటా, బ్రాహ్మణు లకు పవిత్రమగు వటవృక్షమువలె పవిత్రమయినది. భారత ద్వీపసమామ్నాయము నందును, ఉత్తర ఆస్ట్రేలియా ఖండమునందును వలె పొలినేషియా ద్వీపములు పెక్కింటిలోను మేడిచెట్లు మిగుల పూజింపబడుచున్నది. ప్రాచీన ఈజిప్టు దేశమున వటవృక్షము నిరంతరము పూజింపబడెడిది గ్రీసు, ఇటలీ దేశములలోను ఈ విధముగనే పూజింపబడుచుండెను". –[2] ఈ పై పరిశీలనాధారముగా మేడి పవిత్ర వృక్షజాతికి సంబంధించినదనుట నిస్సందేహము.

ఉదుంబర వృక్షము కొన్ని కుటుంబములకు గృహ దేవత. వివాహాది శుభకార్యములలో దీనిని మొట్టమొదట పూజించుట విధాయకము. ఈ పద్ధతి తెలుగు దేశమునందలి కొన్ని బ్రాహ్మణ వంశములందును కలదు.

---

1. శబ్ద కల్పద్రుమః– చూడు : ఉదుంబర
2. Ancient Symbol Worship - By H.M. West op and C. Stanil and wake. P.43. Kumar brothers - New Delhi 1970

బ్రతుకమ్మ పండుగ :

మహాలయామావాస్య ముందు తొమ్మిది రోజులపాటు కన్యలు మాత్రమే చేయు పండుగ బొడ్డెమ్మ పండుగ. తరువాత నవరాత్రముతో ప్రారంభమగు పండుగ బ్రతుకమ్మ పండుగ. జానపదుల నోళ్ళలో బ్రతుకమ్మ బతుకమ్మగా సహజత్వమును చేకూర్చుకొనినది. దీనిని తెలంగాణమందంతట ముత్తైదువలు మహోత్సాహముతో వ్రతమువలె ఆచరింతురు. ఈ పండుగలో మహిళల కళాకౌశలము బ్రతుకమ్మను రూపొందించుటలోను, సాయంకాలము జరుపు నృత్యగీతములలోను ప్రస్ఫుటమగును. బతుకమ్మ రూపమును తీర్చు పుష్పాలంకరణమును, మండలాకారముగ జరుగు నృత్యమును పరస్పర స్పర్థతో జరుగుచుచూపరులకు అన్ని విధముల ఆనందమును కలిగించును. ఈ నృత్యములును, అలంకరణమును చూచుటకు స్త్రీ పురుష భేదము లేకుండగా ఊరివారందరును సమావేశమై ఆనందింతురు. ఇది ఇంతకు మునుపు బొడ్డెమ్మ పండుగలో సూచించినట్లు శారదా ప్రకృతిలక్ష్మి పూజయే యని భావింతురు. వర్షాకాలము తరువాత పుష్పించిన వన్యవృక్షముల పువ్వులతో ప్రకృతి దేవిని – జీవన ధాత్రి యగు మంగళ గౌరిని వివిధ రీతుల ఆరాధించి ఆనందము పట్టలేక సాయంకాలములలో దేవి చుట్టు మండలాకారముగా నృత్యముచేయుచు చప్పట్లు చఱచుచు గానము చేయుట, ప్రత్యక్ష దైవమగు ప్రకృతిదేవిని పూజించుటయే ననిపించును.

బతుకమ్మ పండుగ దినములలో సీమంతినులు వెదురు సిబ్బలలోగాని, తీగల సిబ్బలలోగాని, ఇత్తడి పళ్లెములలోగాని గుమ్మడి ఆకులను, పువ్వులను పఱచి వానిమీద గోపురాకారముగా తంగెడు, గునుగు, గన్నేరు, రుద్రాక్ష, కట్ల, అడవి చేమంతి, గట్టు గొరివిడి, నువ్వు మున్నగు వన్నె పుష్పములను పేర్చుదురు.

బతుకమ్మను పేర్చుటకుపయోగించు పుష్పము లన్నింటికన్నను తంగెడు పూలు విశిష్టస్థానము నాక్రమించినవి. ప్రకృతి జానపదులకు ప్రసాదించిన బంగారుపూలు తంగేడుపూలు. ఆ పుష్పములను తెచ్చి బ్రతుకమ్మలో జోడించిననేగాని జానపద స్త్రీలకు బతుకమ్మను తీర్చిదిద్దినట్లుగా నుండదు. బతుకమ్మను బంగారు కాంతులతో ప్రకాశింపజేయ తంగేడు పూలను సుప్రసిద్ధులు అభ్యుదయ కవులైన కుందుర్తిగారు" తెలుగువారి బతకమ్మల కమ్మని మొగానవెలుగు

నింపు పూలు" అనుటలో అతిశయోక్తి లేదు. బతుకమ్మ ఎత్తును పెంచి పేర్చుటలో గ్రామీణ పడతులు పందెములు వేసికొందురు. బతుకమ్మ ప్రక్కన చిన్న పళ్ళెములో తమలపాకుపైన పసుపు ముద్దగా గౌరమ్మను తీర్చి ప్రత్తి దండను వేసి కుంకుమతో, పుష్పములతో అలంకరించెదరు. పుష్పరాశి బతుకమ్మ, పసుపుముద్ద గౌరమ్మ. బతుకమ్మను, గౌరమ్మను పూజామందిరములో నుంచి పూజించెదరు. సాయంకాలము ముత్తైదువలు, కన్యలు పట్టు పీతాంబరములు, భూషణములను ధరించి పూజా గృహమునందు పెట్టిన బతుకమ్మలను, తీసుకొని ఊరు బయట చెరువు గట్టుననో కాలువ గట్టుననో, దేవాలయ పరిసరములలోనో గుమిగూడి బతుకమ్మలను మధ్య నిలిపి చుట్టు మండలాకారముగా తిరుగుచు చేతులు చరచుచు పాటలు పాడెదరు. నృత్యమును చూచుటకు ఊరి వారందరును సమావేశమగుదురు. హాస్యమునకును, కొంటె కోణంగి చేష్టలకును మితియేఉండదు. బతుకమ్మలను తెచ్చిన ఒక కిన్నెర కంఠి పాటను ప్రారంభించగా, ఇతరులు ఆమెను అనుసరించెదరు. ఈ పాటలు బొడ్డెమ్మలో వలెనే ఉయ్యాల (వలలో), గౌరమ్మ, చందమామ, కోలు మొదలయెన పల్లవిని కలిగియుండును. ఈ పాటలలో పురాణకథలు మొదలు నేటి మహాపురుషుల కథలు వర్ణింపబడును. ఈ పాటలలో బతుకమ్మ పుట్టు పూర్వము లను తెలుపు ఒక పాటను ఓరుగల్లు సమీపముననున్న మొగిలిచర్ల వస్తవ్యుడగు భట్టు నరసింహకవి రచించెను. ఇది చాల వ్యాప్తిలోనున్నది. దీనిని డా॥ బి. రామరాజుగారు పేర్కొనినారు. –[1]

శ్రీలక్ష్మీదేవియు చందమామ సృష్టి బ్రతుకమ్మయ్యె చందమామ
పుట్టిన రీతి జెప్పె చందమామ భట్టు నరసింహ కవి చందమామ
ధరచోళ దేశమున చందమామ ధర్మాంగుడను రాజు చందమామ
ఆ రాజు భార్యయు చందమామ అతి సత్యవతియంద్రు చందమామ
నూరునోములు నోమి చందమామ నూరు మందిని గాంచె చందమామ
వారు శూరులయ్యు చందమామ వైరులచే హతమైరి చందమామ
తల్లిదండ్రు లపుడు చందమామ తరగనీ శోకమున చందమామ
ధనరాజ్యముల బాసి చందమామ దాయాదులను బాసి చందమామ

1. తె.జా.గే.సాహిత్యము పుట–432

వనితతో నా రాజు చందమామ వనమందు నివసించె చందమామ
కలికి లక్ష్మిని గూర్చి చందమామ ఘన తపంబొనరించె చందమామ
ప్రత్యక్షమై లక్ష్మి చందమామ పలికె పరమడుగుమని చందమామ
వినుతించి వేడుచు చందమామ వెలది తన గర్భమున చందమామ
పుట్టుమని వేడగా చందమామ పూబోణి మది మెచ్చి చందమామ
సత్యవతి గర్భమున చందమామ జన్మించె శ్రీ లక్ష్మి చందమామ
అంతలో మునులునూ చందమామ అక్కడికి వచ్చిరీ చందమామ
కపిల గాలవులునూ చందమామ కశ్యపాంగీరసులు చందమామ
అత్రి వసిష్ఠులు చందమామ ఆ కన్నియను జూచి చందమామ
బ్రతుకగనే ఈ తల్లి చందమామ బ్రతుకమ్మ యనిరంత చందమామ
పిలుతురదివర నుండి చందమామ ప్రియముగా తలిదండ్రి చందమామ
బ్రతుకమ్మయను పేరు చందమామ ప్రజలంత అందరూ చందమామ
తాను ధన్యుఁడంచు చందమామ తన బిడ్డతో రాజు చందమామ
నిజ పట్టణము కేగి చందమామ నేల పాలించఁగ చందమామ
శ్రీ మహావిష్ణుఁడు చందమామ చక్రాంకుడను పేర చందమామ
రాజు వేషంబున చందమామ రాజు ఇంటికి వచ్చి చందమామ
ఇల్లింట మని వుండి చందమామ అతివ బ్రతుకమ్మను చందమామ
పెండ్లాడి కొడుకులా చందమామ పెక్కుమందిని గాంచె చందమామ
ఆరువేల మంది చందమామ అతిసుందరాంగులు చందమామ
ధర్మాంగుడను రాజు చందమామ తన భార్య సత్యవతి చందమామ
సరిలేని సిరులతో చందమామ సంతోష మొందిరీ చందమామ
జగతిపై బ్రతుకమ్మ చందమామ శాశ్వతంబుగ వెలసె చందమామ

ఈ పాటలోని కథ కడప, కర్నూలు ప్రాంతములనుండి మహబూబునగరు జిల్లా మీదుగా వచ్చి తెలంగాణము నందంతట వ్యాపించియుండునని డా॥ బి. రామరాజుగారభిప్రాయపడిరి. ఇదియే పాట "పల్లెపదాలు"లో కలదు.-1 ఈ బతుకమ్మ పాటలలో వివిధములైన యితివృత్తములతో నీతులను బోధించు ఘట్టముల వర్ణనలతో పాటలుండును.

1. పల్లె పదాలు-115-116

బతుకమ్మ మండల నృత్యము తరువాత బతుకమ్మను ఓలలాడించుటకు చెరువు గట్టునకు పాటలు పాడుచు తీసికొనివెళ్ళెదరు. ఈ పాటలో పూవులు, నగలు, పండ్లు, మున్నగు సంపద వర్ణనము కలదు. దీనిలో గౌరమ్మకు - బతుకమ్మకు ప్రీతి పాత్రమైన వస్తువు ఏమి అని భక్తితో ప్రశ్నించుట గ్రామీణుల అమాయక హృదయమును తెలుపును. నేను సేకరించిన ఈ పాటను ఉదహరించుచున్నాను.

"ఏమేమి పువ్వబ్బునే గౌరమ్మ
ఏమేమి కాయబ్బునే గౌరమ్మ
తబుకుతో తక్కేడు ముత్యాలు బోసుక
వెండి కుచ్చుల సొమ్ములు పెట్టుక
ఈడనే పెండ్లాడవే గౌరమ్మ! ఆడనే పెండ్లాడవే గౌరమ్మ
తంగేడు పువ్వబ్బునే గౌరమ్మ? తంగేడు కాయబ్బునే గౌరమ్మ
"తబుకుతో తక్కేడు"
ఒకటేసి వెలగపండు గౌరమ్మ దూరాన దోరపండు గౌరమ్మ
నిన్ను జూసి మాయన్నలు గౌరమ్మ ఏడు మేడాలెక్కిరి గౌరమ్మ
ఏడుమేడల నందున గౌరమ్మ ఏడాది కొక దీపము గౌరమ్మ
పోతే పోతివిగాని గౌరమ్మ మల్లెప్పుడొస్తావు గౌరమ్మ
మళ్ళీ ఏడాది మరువక వచ్చేను. -[1]

ఈ పాటలోని పచ్చని తంగేడుపూలు, తెల్లని ముత్యాలు, సొమ్ములు, వెలగపండ్లు, దీపము, మేడలు - ఇవి యన్నియు సమృద్ధికిని, సంతానమునకు సూచకములని తోచుచున్నది. తెలంగాణా ప్రాంతమున బతుకమ్మను చెరువు గట్టుకు తీసుకొని వెళ్ళుచు పాడునటువంటి ప్రసిద్ధమైన పాట యొకటి కలదు.

శ్రీలక్ష్మినీ మహిమలు గౌరమ్మ - చిత్రమై తోచునమ్మ
భారతీ సతివయ్యు - బ్రహ్మ కిల్లాలివై
పార్వతీ దేవివై - పరమేశు రాణివై
పరగ శ్రీలక్ష్మివయ్యు గౌరమ్మ - భార్యవైతివీ హరికినీ

1. నేను సేకరించినది, సావిత్రి-గడ్డం మల్లయ్యగూడెం.

ముక్కోటి దేవతలు, చక్కనీ కాంతులూ
ఎక్కువగ నిను గూర్చి, పెక్కునోములు నోమి
ఎక్కువా నిను కొల్తురే గౌరమ్మ
ఇహ లోకముల యందునా.

– పార్వతీ దేవిగా, లక్ష్మీదేవిగా గౌరమ్మను కొలుచుట ఈ పండుగలోని ప్రత్యేకత. ముక్కోటి దేవతల చేతను ఆరాధింపబడు దేవి గౌరమ్మ.

గొప్పయగు నీ ముద్దు – కొప్పింద్ర నీలములు
గప్పు చీకటి జగతి – గప్పు కొప్పున బిళ్ళ
చెప్పతరమూ గానిదీ గౌరమ్మ! చంద్రరేఖా పాటిదీ!.

నిగనిగా యనెడు నీ – నగుమోము జూచితే
జగతి పున్నమనాటి – చంద్రుని ఓడించు
సొగసైన నీ తిలకమూ గౌరమ్మ – చూచితే ఆనందమూ!

నల్లవరి బియ్యమో – మల్లె మొగ్గలో లేక
తెల్ల వజ్రంబులో – ముల్లోకములు యేలు
తల్లి నీ దంతములు గౌరమ్మ – దానిమ్మ బీజంబులూ

బాలలూ వృద్ధులూ, ప్రౌఢాంగనలు కన్నె
ప్రాయంపు కాంతలూ, పరగాశ్వయుజ శుద్ధ
పాడ్యమీ మొదలుకొనియు గౌరమ్మ
భక్తి నీయందు నిల్పి

తొమ్మిదీ దినములూ, నెమ్మనంబున బొంగి
అమ్మలక్కలు గూడి ఆస్తిలో తమకున్న
సొమ్ములు ధరియించుకా గౌరమ్మ
శోభనంబున పాడుచూ

బంగారు పువ్వులూ
బ్రతుకమ్మ యని పేర్చి
మంగలంబని నిన్ను
మధ్యనా నిల్పియు

రంగు గుమ్మడి పువ్వులా గౌరమ్మ
రాశిగా నర్పింతురూ
కట్ల పుష్పంబులూ కాకర పువ్వులూ
కలగోటు పువ్వులూ, గన్నేరు పువ్వులూ
పొట్ల పువ్వులు జల్లుతూ గౌరమ్మ
బొగడ పువ్వులు నింపుచూ
పారిజాతంబులూ, పైడి తంగెడిపూలు
గోరింత పొన్నలు, కురువింద మల్లెలు
తీరు రుద్రాక్ష పూలూ గౌరమ్మ, ఏరినా కుసుమంబులు
పాలమీగడట్లు పానకంబులు జున్ను
పోళీలు మరిమడుగు, పువ్వులూ శేమియల్
మేలు శక్కర గరిజలూ గౌరమ్మ
మెప్పుగా సమర్పింతురూ!.
గంగ నర్మద యమున కావేరి సరయూ
తుంగభద్రాది ముచికుండ (ద) నది తీరముల
పొంగి వేడుక మీరగా గౌరమ్మ
పురుషులూ స్త్రీలు గూడి
కోరి ఈ రీతిగా, పూజింతుము
చారు సుందరమైన, సౌభాగ్యముల నిచ్చి
కారుణ్యముల నేలుమా గౌరమ్మ
కల్పాయువొసగి మాకు. –[1]

ఈ పాటలో కొంత ఆధునికత ఉన్నను నేడు పల్లె పట్టులలో నీ పాట బతుకమ్మ పండుగ సందర్భమున అధిక ప్రచారమును పొందినది. ముత్తైదువలు బతుకమ్మను తీసికొని పోయి నీళ్ళలోనుంచి ఇటునటు కదలించెదరు. దానికే 'ఓలలాడించుట' అని పేరు.

1. సరాగాలు : ఇదియే కొన్ని మార్పులతో తెలంగాణ పల్లె పాటలలో గలదు-పుట-79.

బ్రతుకమ్మను ఓలలాడించుచు
"కోట గదిలె కొమ్మన గదిలె
మున్నూరు మూకతో రామన్న గదిలె
వెండి పళ్ళెం లేక వెలుగదే కోట
రాగి పళ్ళెం లేక రగులదే కోట
పగిడి పళ్ళెం లేక పలుకదే కోట
కోటంత బొమ్మరిల్లూ గౌరమ్మ – కోడండ్లకాట పాటా.
మంటెంత (ముంటెంత) బొమ్మరిల్లు -- గౌరమ్మ – మరదండ్ల కాట పాటా–[1]

అని పాడుకొందురు. బ్రతుకమ్మను ఓలలాడించి పిదప గౌరమ్మ రూపమున నున్న పసుపు ముద్దను పరస్పరము ముత్తైదువలు వాయనము లిచ్చుకొందురు. అట్టి సమయమున–

"జొన్నల్ల పుట్టిన గౌరి – జొన్నల్ల పెరిగిన గౌరి
అన్నలేసిన పొన్నల కింద – నేను చేసిన నిమ్మల కింద
చల్లంగుండు సంపతి గౌరమ్మ
వడ్లల్ల పుట్టిన గౌరి – వడ్లల్ల పెరిగిన గౌరి ॥అన్నలేసిన॥
కందుల్ల పుట్టిన గౌరి – కందుల్లో పెరిగిన గౌరి ॥అన్నలేసిన॥
పెసళ్ళ బుట్టిన గౌరి – పెసళ్ళ పెరిగిన గౌరి ॥అన్న లేసిన॥–[2]

– అని పాడుచు ఇట్లే మినుములు మొదలైన పంటలను పేర్కొనుచు పాడెదరు. దీనినే "అట్లతద్ది పాటలు" శీర్షికతో సోమరాజుపల్లి చెంచయ్యగారాంధ్ర ప్రభలో ప్రకటించినట్లు డా॥ బి. రామరాజుగారు పేర్కొనిరి.–[3]

పిదప చద్దులు లేక ఫలహారములు పరస్పరము వాయనమిచ్చెదరు. ఈ పండుగ దినములలో మొదటి దినము వాయనము – వక్కలు తులసీదళములు, రెండవ దినము – పప్పు బెల్లములు, మూడవ దినమున – బెల్లమువేసి ఉడికించిన

1. తెలంగాణ పల్లె పాటలు–పుట–88
2. తెలంగాణ పల్లె పాటలు–పుట–87,88.
3 తెలంగాణ పల్లె పాటలు–పుట–87.

శనగ ముద్దపప్పు, నాలుగవ దినము – నాన బియ్యము అనగా బెల్లము కలిపిన పాలల్లో నానబెట్టిన బియ్యము, ఐదవ దినమున – అట్లు, ఆరవ దినమున – బ్రతుకమ్మ పండుగను అలెమందురు – అనగా అలుగుట; ఆనాడు బ్రతుకమ్మను పేర్చుటగాని ఆడుటగాని యుండదు. ఏడవనాడు – వేపకాయలు అనగా వేపకాయ రూపములోనున్న బజ్జీలు, ఎనిమిదవ రోజున – వెన్నముద్దలు అనగా నువ్వులు బెల్లము కలిపిన చిమ్మిలి ముద్దలు, తొమ్మిదవ రోజున – చద్దులు కలుపుట, అనగా రకరకములైన చిత్రాన్నములు, – పెరుగన్నమును కలుపుదురు. ఈ పండుగను తెలంగాణములోని కొన్ని ప్రాంతములలో మహాలయామావాస్యతో ప్రారంభించి దుర్గాష్టమితో సమాప్తి చేయుదురు. మొదటి దినము బతుకమ్మను యెంగిలి పూవువేయుట అనియు తొమ్మిదవ దినమునాటి బతుకమ్మను చద్దులబతుకమ్మ అనియు అందురు.

బతుకమ్మ జన్మ వృత్తాంతమును తెలుపు పాటను, ఊరేగించు పాటను, ఓలలాడించు పాటను వాయనములిచ్చు పాటను, పరిశీలించిన విశ్వమంతటను భగవంతుని స్వరూపమును తిలకించు భారతీయుల – ప్రత్యేకించి మహిళల హృదయము, వారి ఆకాంక్షలు వెల్లడి యగుచుండుట స్పష్టము. విశ్వ స్వరూపిణియైన సర్వమంగళయైన గౌరి నిరంతరము మాంగల్యమును, సౌఖ్యమును ఇచ్చునను ఉద్దేశముతో పచ్చటి ప్రకృతిని ఆరాధించుటలో ఎంతో సామంజస్యము కలదు.

తరువాత దశమినాడు "దసరా" (విజయదశమి) నాడు ఆయుధపూజ, పొలిమేర దాటుట, పారు వేట, జమ్మిపూజ మొదలగునవి ముఖ్యాచారములుగా నున్నవి. ఇందు స్త్రీల ప్రమేయమంతగా లేదు. స్త్రీ సంబంధి "దసరా పాటలకు" మారుగా "పిల్లల దసరా పాటలు" ఈ జానపద సాహిత్యమున ప్రసిద్ధములు.

ఇంతవరకును పేర్కొనిన బతుకమ్మ పాటలు తెలంగాణమునందలి ప్రతి గ్రామమునను వినిపించును. ఈ విధముగా ఎన్నియో బతుకమ్మ పాటలు తెలంగాణపు స్త్రీల నోళ్ళలో ఊటలై స్రవించుచున్నవి. ఇవి తెలంగాణా జానపద సాహిత్యములో ప్రత్యేక స్థానమును ఆక్రమించినవి.

అట్లతద్దె (అట్ల తదియ) :

తెలుగు నాట తూర్పు ప్రాంతముననను, దక్షిణాంధ్రముననను భాద్రపద బహుళ తదియనాడు ఉండ్రాళ్ళ తద్దెను, ఆశ్వయుజ బహుళ తదియనాడు అట్లతద్దెను జరుపుకొందురు. ఇందు అట్లతద్దె ప్రసిద్ధికెక్కినది. బ్రతుకమ్మ పండుగవలెనే ఇది పండుగగా ఆచరింపబడుచున్నను నిజమునకిదొక నోము. ఈ పండుగను కార్తీక శుద్ధ తదియనాడు తెలంగాణములోని గ్రామమైన రాయిప్రోలులో జరుపుకొనుట గమనించితిని. పూర్వమునుండియు వారట్లే చేయుచున్నారట. ఆచరణ పద్ధతిలో మాత్రము భేదములేదు. స్త్రీలు తెల్లవారు జాముననే లేచి–

"అట్ల తద్దోయ్ ఆరట్లోయ్
ముద్ద పప్పోయ్, మూడట్లోయ్
పడకల క్రింద పిడికెడు బియ్యం
పిల్లలార! జల్లలార! లేచిరండోయ్. –[1]

అని పాడుచు పిల్లలను పెద్దలను నిద్ర లేపుదురు. అభ్యంగ స్నానమాచ రించి వ్రేళ్ళకు గోరింటాకును పెట్టుకొందురు. గోరింటాకు గోళ్ళకు లలిత రాగమును గూర్చు ద్రవ్యము. దీనిని మాంగల్య చిహ్నముగా ధరించెదరు. పిదప గవ్వలాట లాడుదురు. రాత్రి గౌరీపూజను చేసికొందరు.

ఈ నోముచేయు విధానమును వరలక్ష్మమ్మగారిట్లు చెప్పిరి. "దీనికి ఉత్తరేణి మొక్కను తెచ్చి గౌరీదేవితోపాటు పూజింపవలెను. పదనొకండు అట్లు చొప్పున పదనొకండు ముత్తైదువులకు దక్షిణ తాంబూలముతో వాయన మిచ్చి ఉద్యాపన చేయవలెను."–[2]

ఈ నోము అష్టాదశ వర్ణముల వారు చేయుదురు గనుక "అష్టాదశ వర్ణముల వారికిని అట్లతద్దె" అను నానుడి యేర్పడినది. ఈ నోము సౌభాగ్యవంతుడు, యువకుడు అగు భర్త లభించుటకు చేయునట్టిదని "స్త్రీల వ్రతకథలు" లో కలదు. ఒక రాచ చిన్నదానిని ఒక ముసలి వరునకిచ్చి వివాహము

1. సెలయేరు –పుట–48.

2. నోములు(వ్యా) కనుపర్తి వరలక్ష్మమ్మ. విజ్ఞాన సర్వస్వము సంపుటము–4.

చేయుటకు ప్రయత్నింపగా ఆమె అంగీకరింపక ఒక రాత్రి అడవికి వెళ్ళి మఱ్ఱి చెట్టు క్రింద తపస్సు చేసెననియు కొంతకాలమునకు పార్వతీ పరమేశ్వరులు సాక్షాత్కరించి 'నీవు అట్లతద్ది వ్రతము నోము నోచుకొని దీపాల వేళ వరకు ఉపవాసముండి పిమ్మట భోజనము చేయుమని' చెప్పిరట. ఆమె అట్లే చేసి చక్కని పడుచు మగనిని పొందెనట. –[1]

ఈ వ్రతకథలో చేయు విధానము ఇట్లున్నది : "అట్ల తద్దెనాడు నోము నోచుకొని పగటివేళ భోజనము చేయక త్రాగక ఉపవాసముండి చీకటి పడినంతనే గౌరీదేవికి పది అట్లు నైవేద్యమిచ్చి, పది అట్లు ముత్తైదువలకు వాయనమివ్వవలెను. అట్లు పది సంవత్సరములు చేసిన పిమ్మట ఒక రాగి డబ్బును, నల్లపూసలను, లక్క జోడును పదిమంది ముత్తైదువలకు వాయనమివ్వవలెను. –[2]

ఇప్పటికిని ఈ అట్లతదియనాడు చంద్రునివలె తెల్లనైన అట్లుపోసి శారద చంద్రుని పూజించి నైవేద్యము పెట్టుదురు. అధిక సంఖ్యాకులు చంద్ర దర్శనము చేయకుండ భోజనము చేయరు. ఇంటిలో 'ఆకలి, ఆకలి' అని తొందరచేయు కన్యలకు సుకుమారియైన రాచవారి అక్కమ్మ ఆకలికి ఉండలేక చంద్రుడు రాకుండగనే అన్నము తినిన దోషమునకై ఆమెకు ముసలి మొగడు, అందవికార మైన పిల్లలు సంభవించినారని కథ చెప్పుదురు. –[3]

చాతుర్మాస్య వ్రతములలో తేలికయగు పదార్థములను భుజింపవలెనని ఆయుర్వేద గ్రంథములు ఆదేశించుచున్నవి. అట్టి ఆదేశమునకు ఆపలక్షణముగా ఈ దినమున అట్లు, బెల్లపట్లు (గుడాపూపములు) ఆరగించుట ఆచారమై యుండును. గ్రామములలో ఊరుబయటి తోటలలో ఉయ్యాల లూగుటలోని ఆనందమును ఈ పండుగనాడనుభవించుట ఒక ప్రత్యేక ఆకర్షణ. నేటికాలమున

---

1. స్త్రీల వ్రతకథలు–గొల్లపూడి–పుటలు–47,48
2. స్త్రీల వ్రతకథలు–గొల్లపూడి–పుటలు–48.
3. జానపద సాహిత్యము–మన సంస్కృతి (వ్యా) – నేను రచించినది. ఆంధ్ర రచయిత్రుల సప్తమ మహాసభ సంచిక, ఫిబ్రవరి, 1975–పుట–65.

అట్లతద్దెనాడు ఉయ్యాల లూగు ఆచారము ప్రాచీన కాలమున శ్రావణమాసమున జరుపబడుచు నేడు కనుమరుగైన "ఆలోల చతుర్థి"(Alola Chaturthi)లో కనిపించును. –[1]

"ఈ అట్ల తద్దెనాడు మాలలు గొంతెమ్మ (కుంతి) పూజ చేయుదుచు. దీనికొక గాథ చెప్పుదురు. భారత యుద్ధానంతరము ధర్మరాజు మృతులకు అంత్య క్రియలు జరుపుచు తర్పణము చేయుచుండగా తర్పణోదకము నందుకొనుటకు కర్ణుని చేయి వచ్చెనట. ధర్మరాజు ఆశ్చర్యపడి ఇది యేమి అని వ్యాస మహర్షిని ప్రశ్నించెను, 'కర్ణుడు నీ జ్యేష్ఠ సోదరుడు అతనికిని తిలాంజలి యిమ్ము' అని వ్యాస మహర్షి సమాధానము చెప్పెనట 'ఈ సంగతి ముందే తెలిసియుండిన యుద్ధమే లేకుండ చేసి యుందుము కదా, అని ధర్మరాజు తల్లిని శపించెనట. అప్పటినుండి గొంతెమ్మ మాలల యిలవేల్పు అయ్యెనట."–[2]

గొంతాలమ్మ పండుగ అను శీర్షిక క్రింద సెలయేరులో నొకపాట యున్నది. గొంతెమ్మ ఒక నందిని (ఎద్దు) పెంచగా నది అదరు బెదరు లేక ఊరివారి చేనును మేయుచుండెను. ఒకనాడు అది ఒక కాపు చేనును మేయుచుండగా ఆ కాపు దానిని తోలుకొని వెళ్ళి గాజు స్తంభమునకు కట్టి కొట్టబోగ గొంతెమ్మ అంతఃపురము నుండి బయటకు వచ్చి దానిని కొట్టవద్దని రైతును బ్రతిమాలి అతనికి వెయ్యి వరహాలు బహూకరించెను.

"కాపోరి జేనుకెళ్ళీతే కట్టిపెడతారు, ముద్దూల నందన్నా
మాలహరి చేనులో మసలుమా ముద్దూల నందన్నా
మాలోరు మంచోరు మక్కువతొ కొలుస్తారు ముద్దూల నందన్నా
అని ఎద్దుకు ఉపదేశించెనట. –[3]

---

1. Ancient Indian Festivals - By Dr. K. Krishna Murthy
2. హిందువుల పండుగలు – పర్వములు–పుట–68.
3. సెలయేరు – పుట–1.

ఎద్దు మేయుట, దానిని ప్రేమతో చూచుట, కాపు వారిలో కఠినత్వము మాలవారిలో దయాస్వభావమును ఎత్తిచూపుట – ఇవన్నియు నిది వ్యవసాయపు పండుగ అగుటను సూచించుచున్నవి.

గోదావరి ప్రాంతమున నేడు గొంతెమ్మ పండుగనాడు పాలు, రేగడి మట్టి పిసికి గొంతెమ్మ ప్రతిమను తయారుచేసి సాయంత్రపు నుండి ఊరేగించుచు తెల్లవారు లోపల నదిలో కలుపుట కలదట. ఇది శూద్రులచే నిర్వహింపబడు నట–[1]

దీపావళి :

"ధీం థాం, దీవెల పండుగ" అని వాడుక. 'దీపావళి' పదమును విడదీసిన దీప + ఆవళి – దీపములయొక్క వరుస అని అర్థము. దీపముల వరుసను పెట్టి ప్రజలు సంతోషపడుటకు కారణములుగా 1. శ్రీకృష్ణుడు సత్య భామా సహాయుడై నరకాసురుని చంపుట, 2. బలిచక్రవర్తి వామనునిచేత తన యావద్రాజ్యమును గోలుపోవుట, 3. శ్రీరాములు రావణ వధానంతరము ఈ దినమున రాజ్య పట్టాభిషక్తుడగుట, 4. నరకము నుండి విముక్తి చెందుటకై యముని గూర్చి ప్రార్థించుట, 5. విక్రమార్క చక్రవర్తి ఈ దివసమున పట్టాభిషిక్తుడగుట – మొదలగు కథలు ప్రజలలో ప్రచారమునందు కలవు.–2

"ఉత్తర ధ్రువమండల వాసులుగా నుండినప్పుడు మన పూర్వులగు నార్యులకు తులాసంక్రమణమునాడు దీర్ఘరాత్రి ప్రారంభమగుచుండెనని తెలియును. నాటి నుండి తిరిగి యారునెలల వరకు వారు చీకటిలోనే కాలము గడుపవలసివచ్చెను. కావున నీ చీకటి ప్రవేశించినతోడనే వారు దీపోత్సవమున జేసి "బలి" యను శత్రువును పాతాళమునకు తన మూడవ పాదముచే నడగద్రొక్కి యచ్చుటనే తాను బహుకాలముందు వాడగుటచే సూర్యుడు మరల తమ కగుపడుగాక యని ప్రార్థించుటకై యేర్పాటు చేసిన పండుగ ఈ దీపావళి యని తోచుచున్నది–[3]

1. ఈ విషయమును తెలియజేసినవారు గోదావరి ప్రాంతీయులైన పద్మమ్మ.
2. హిందువుల పండుగలు–పుట–14.
3. హిందువుల పండుగలు–పుట–20.

తులా సంక్రమణమునాడే దీపావళి యనుటకు ప్రమాణముగా ధర్మసింధు విట్లు పేర్కొనుచున్నది.

"తులా సంస్థే సహస్రాంశౌ ప్రదోషో భూత ధర్మయోః
ఉల్కాహస్తానరాః కుర్యుః పిత్ర్యాణాం మార్గదర్శనం". –[1]

సూర్యుడు దీపావళినాడు తులారాశిని పొందుచున్నాడనియు, నాడు లోకులు దివిటీలతో తమ పితృదేవతలకు మార్గదర్శనము చేయవలయుననియు దీని యర్థము. ఈ పండుగ నాడు

"యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయచ"
అని యమధర్మరాజును పూజింతురు.

మన దేశములో ఉత్తరాయణము మకర సంక్రాంతి నాడు వచ్చును. కాని యుత్తర ధ్రువమందు తులాసంక్రాంతి నాడు వచ్చును. తులా సంక్రాంతి నాడే దీపావళి యని తెలియుచున్నది. కావున దీపావళినాడు ధ్రువమండలమందు దక్షిణాయనము ప్రారంభమగును. దక్షిణాయన మందు చీకటి యుండుటచే చీకటిలో (రాత్రి కాలమందు) శ్రాద్ధ కర్మాదులు చేయరు. కావున నీ దక్షిణాయానములో చనిపోవువారికి నుత్తరాయణము వచ్చిన తరువాత శ్రాద్ధకర్మలను చేయుచుండిరని సురవరం ప్రతాపరెడ్డి గారు పేర్కొనినారు. –[2]

ఇట్లు పితృదేవతలీయారు నెలలు నరకమందుందురని హైందవుల విశ్వాసము. కావున వారికి నరక బాధ యుండకుండునట్లుగా యముని పూజించుటయు, దివిటీలతో నా చీకటిలో పితరులకు స్వర్గము చూపించుటయు నీ పండుగ వలన కలుగునని పూర్వులూహించి ఈ యుత్సవము నేర్పాటుచేసి యుండవచ్చును.

పండుగ దినములలోనేగాక దీపావళి పర్వదినము మొదలుకొని కార్తీక మాసాంతము వరకు గూడ ఇంటిముందర దీపములను పెట్టెదరు. ఆకాశ దీపములని కొందరు మేడలపై దీపములు పెట్టుటయు, మరికొందరెత్తైన

1. ధర్మసింధు.
2. హిందువుల పండుగలు–పుట–24.

గుట్టలమీద దీపములను వెలిగించుటయు కలదు. ఇది చూడ దీర్ఘరాత్రిలో పితరులకు మార్గదర్శకముగా నుండుటకై నిట్లు దీపములను వెలిగింతురనియే భావించవలెను.

ఇట్లు పలువిధములుగా దీపావళి పండుగ జరుపుకొనుటకు కారణములేమైనను ఆసేతు హిమాచల పర్యంతము భారతీయులు కడువేడుకగా జరుపుకొను పండుగ ఇది.

ఆంధ్రదేశమందు, దక్షిణ భారతదేశమందును ఈ పండుగ మూడు నాళ్ళు జరుపబడును. ఆశ్వయుజ బహుళ చతుర్ధశి, అమావాస్య, కార్తీక శుద్ధ పాడ్యమి – ఈ మూడు నాళ్ళను కలసి సమగ్రమైన దీపావళి పండుగ. మొదటి దినమున నరక చతుర్ధశి, రెండవదినమున దీపావళి అమావాస్య, మూడవ దినమున బలిపాడ్యమిగా జరుపబడును.

ఈ పండుగ ప్రాశస్త్యమును వ్రతగ్రంథములు పేర్కొనుచున్నవి. ఆశ్వయుజ కృష్ణ చతుర్ధశీ నాటి రాత్రి రెండు జాములకు తరువాత నరకాసుర సంహారము జరిగినట్లు వాడుక కావున నరకుని పీడ (నరక అను పదమునకు నరకము అను ఇతరములైన అర్థములున్నను ప్రజలలో నరకాసురుడను రాక్షసునికి సంకేతముగా మాత్రమే వాడబడుచున్నది) వదలుటచే ఆనందపరవశులై ఆబాల వృద్ధము అమితోత్సాహమున శేషించిన యా రాత్రి భాగమునను, మరు దినమునను మహోత్సవములు జరుపుకొందురు. ఆ యుత్సవ దినములు రెండును వరుసగా నరక చతుర్ధశి, దీపావళి అమావాస్య అను పేరులతో వ్యవహరింపబడుచున్నవి. ఆశ్వయుజ బహుళ చతుర్దశీనాడు నరకభయ నివారణార్థము నూవుల నూనెతో అభ్యంగ స్నానము నాచరించెదరు. అమావాస్యనాడు ఉదయము తలంటుకొని ప్రదోష సమయమున దీపములు వెలిగించి లక్ష్మీపూజ చేయుదురు. చతుర్దశి, అమావాస్య, పాడ్యమి – ఈ మూడు దినములకును దీపావళియని పేరున్నను ఏనాడు స్వాతీ నక్షత్రము వచ్చునో ఆనాడు ఉత్తమమైనది.

దీపావళి ప్రాచీన కాలమునుండియు వివిధ నామములతో పిలువబడు చున్నది. కౌముదీ మహోత్సవముగా ముద్రారాక్షసమున పేర్కొనబడినది.

1. నాగానందము–శ్రీహర్షుడు–4వ అంకము–విష్కంభము

నాగానంమున దీప ప్రతిపదుత్సవముగా పేర్కొనబడినది –[1]. నాగానందమున విశ్వావసు మహారాజు తన కూతురు మలయవతికిని, అల్లునకును దీప ప్రతిపదుత్స వమున అనగా కార్తీక శుక్ల పాడ్యమినాడు ఉత్సవాను రూపమైన బహుమతినిచ్చుటకు ఏర్పాటు చేయుమని తన పుత్రుని వద్దకు ప్రతీహారిని పంపును. మహావీరుడు ఈ అమావాస్యనాడు నిర్యాణము చెందినాడనియు, ఆనాడు దేవతలు ఆయనను పూజించి పావానగరమంతటను దీపములు వెలిగించిరనియు, అప్పటి నుండి దీపావళి పండుగ జరుపబడుచున్నదనియు జైన వారి వంశమున గలదు.

బౌద్ధ జాతక కథలలో లక్షదీపోత్సవము, దీపదానము జరుపబడినట్లును బుద్ధుని చుట్టు దీపములు పెట్టి పూజించినట్లును కలదు. విజయనగర రాజుల కాలమున దీపావళి మహోత్సాహమున జరుపుకొనుచుండినట్లు ఆ కాలమున రచితమైన "ఆకాశ భైరవ కల్పము" అను సంస్కృత గ్రంథము పేర్కొనుచున్నది.

దీనిని తెలుగువారు దీవెల, దివిలి, దివ్వెల పండుగయని వ్యవహరింతురు. సింహాసన ద్వాత్రింశతిలో నిది దివ్వెల పండుగగా చెప్పబడినది. (భాగము – 2 పుట – 29)

ప్రాచీన కాలమున వివిధ దేశములలో ప్రత్యేకోత్సవములలో దీపదాన మొనర్చు ఆచారమున్నట్లును, ఇతర మతస్థులు దీపావళిని పోలిన దీపోత్సవమును జరుపుకొనుటయు తిరుమల రామచంద్రగారు వివరముగా పేర్కొనినారు. –[1]

ఇప్పటికే శాఖాచంక్రమణమైనది. ఏది ఏమైనను "దీపావళి" కనుల విందును గొలుపు పండుగ యనుట నిస్సందేహము – నిరుపేద ధనిక భేదము లేకుండగా ఎవ్వరెవరి శక్త్యానుసారము వారు జీవితములోని కష్టనష్టములను మరచి ఆనందముతో గడుపుదురు. ఇది టపాకాయ చప్పుళ్లతో, మతాబుల వెలుగులలో, పిండి వంటల ఘుమఘుమలో స్వర్గసౌఖ్యములను స్మరింపజేయును. స్త్రీపురుష భేదము లేకుండగా ఆబాల వృద్ధులు–

"దిబ్బు దిబ్బు దీలామాస, మళ్ళీ వచ్చే
నాగుల చవితి, పుట్టమీద పట్టకట్ట" –[2]

---

1. హిందువుల పండుగలు–పర్వములు–పుట–237–242
2. సెలయేరు–పుట–48.

అని పాడుచు వినోదించెదరు. ఇదియే ప్రాంతీయ భేదముతో పాఠాంతరములతో నున్నది.

దిబ్బా దిబ్బా దివ్వెల పండుగ
మళ్ళీ వచ్చె నాగుల చవితి
ఎప్పుడు తిందును - చలిమిడి ముద్ద -[1]
"దుబ్బు దుబ్బు దీలామాస
మళ్ళీ వచ్చె నాగుల చవితి
పుట్టమీద పొట్టి కళ్ళు"
దిబ్బు దిబ్బు దీపావళి
బులుసు చెట్టుమీద పెద్దలార దిగిరండి -[2]

అనియును పాడుదురు బాలవృద్ధ భేదము లేకుండ ఈ పండుగలో పాల్గొనుట విశేషము. 'పుట్టమీద పొట్టికళ్ళు' దేనికి సంకేతమో!

ఈ దీపావళి సందర్భముగా తెలంగాణమున గొల్లలు బర్రెలను, దున్నపోతులను అలంకరించి ఊరేగింతురు. ఈ దృశ్యము మన రాజధాని నగర వీధులలో - ఆధునిక వాహనములు, నాగరికత మితిమీరిన వీధులలో విచిత్రముగాను, రమ్యముగాను ఉండును. వ్యవసాయమున తమకు తోడు నీడ గానున్న పశువులను గౌరవించుటకు సంకేతమే ఈ ఊరేగింపు. దీపావళి పండుగకు వ్యవసాయముతో గల సంబంధమును ఈ మహిషోత్సవము తెలుపుచున్నది.

ఉత్తరాది వారితోపాటు దక్షిణ దేశీయులును క్రొత్త లెక్కలను (ఆదాయ వ్యయములకు సంబంధించినవి) ప్రారంభించుట తమ ధనకనక వస్తు వాహనములను పూజించుట, ఉగాది నాటివలెనే సంవత్సర జాతక ఫలితములు చెప్పించుకొనుట, రూపాయిని యెగురవేసి దాని మ్రోతనుబట్టి తమ యదృష్టమును తెలిసికొనుట, జల ప్రవాహములో దీపములను వదలి అవి ఆరకుండ ప్రయాణము చేసినచో తమ జీవితములు ఒడిదుడుకులు లేకుండగా నడచునని భావించుట జరుగును.

1. లక్ష్మీరంజన వ్యాసావళి-పుట-124
2. పండుగల పరమార్థములు-పుట-44.

మార్వాడీలు ఈ అమావాస్యనాడు "లక్ష్మీపూజ" చేయుదురు. ఆంధ్రదేశ మున వ్యవసాయదారులు తమ కృషికి ఫలితముగా సస్యములతో నిండి కన్నుల పండుగగా నుండు కేదారములకు ప్రతీకగా "కేదారగౌరీ వ్రతము" చేయుదురు. (ఈ వ్రతమును గురించి ఇదే ప్రకరణమునందలి "నోములు వ్రతములు" అను శీర్షికలో వివరింపబడినది). కొంద ప్రాంతములందు "గౌరమ్మ" పండుగలు చేయుదురని నేదునూరి గంగాధరముగారు పేర్కొనిరి.

దీపావళినాడు టపాకాయలు, మతాబుల రూపమున మందుగుండు కాల్చుట వలన గాలిలో నుండు అనారోగ్యమును కలుగజేసెడి క్రిములు నశించి గాలి శుభ్రపడును.

తెలంగాణ ప్రాంతమున క్రొత్త అల్లుండ్లను పిల్చుకొని వచ్చుట, కానుకలతో వారిని తృప్తిపరుచుట అను ఆచారము కలదు. కన్నెపిల్లలు, నూతన వధువులు "దీపావళి బొమ్మల" కొలువును పెట్టి వినోదించుట పరిపాటి.

మార్వాడీలు చేయు "లక్ష్మీపూజ" క్రమముగా ఇతర ప్రాంత ప్రజల యందును వ్యాపించినది. "లక్ష్మీపూజ" సమయమున పాడు నొక మంగళ హారతిని నేదునూరి గంగాధరముగారు పేర్కొనిరి.

"మహాలక్ష్మియని నిన్ను చాల గొలిచితే, ఓలక్ష్మి నీకింత జాలమేలా?
పాల సముద్రుని పట్టిరోయని నిన్ను, పలుమారు పిలిచితే పాలించ వేమమ్మా,
మంగళం, మంగళం, మహాలక్ష్మి, మంగళం, మంగళం
అలికి పూసిన యింట్లో చిలుకు చల్లితి నేను, మెరుపు చూపుతురావె
అలుక లేలా,
కళకళ నవ్వుచు కలయిండ్ల నెక్కుచు, కలికి ముద్దులగుమ్మ చిలుక
రావమ్మా ॥మంగ॥
ఒంటిగా నీవు మాయింటికి రావమ్మ, జంట బాయక నావెంట నుండూ
కంఠాన మెరసేటి కంఠహారములిత్తు, యింట్లోకి రావమ్మా యిపుడు మహాలక్ష్మి
॥మంగ॥ –[1]

1. పండుగలు–పరమార్థములు–పుట–48–49.

లక్ష్మి సమారాధనము ఎడ ప్రజలకు అంతులేని విశ్వాస మేర్పడినది. దీపము లేని గృహమునందు లక్ష్మి నిలువదు అనియు "దీపారాధన లక్ష్మీ కటాక్షము" అని చాలామంది నమ్మకము.

ఘూర్జరులు, మార్వాడీలు మొదలగు నుత్తర హిందూదేశ వాసులకిది ఉగాది పండుగ.–[1]

గుజరాత్ దేశమునకు ఈ పండుగతో గత సంవత్సరము పోయి క్రొత్త సంవత్సరమారంభమగును–[2] వంగ దేశస్థులు ఈ పండుగను కాళీ పూజగాను, దుర్గా పూజగాను భావించెదరు.

సంక్రాంతి :

సంక్రాంతి పండుగ మార్గశిర పుష్యమాసములలో సూర్యుడు మకర రాశి ప్రవేశించిననాడు వచ్చును. శ్రీనాథుడు సంక్రాంతిని "పెనుబండువు" అని పేర్కొనినాడు. పండుగకు నెలముందు నుండియే అనగా ధనుర్మాసారంభము తోనే ఈ పండుగ సంతోషము ప్రారంభమగును. 'సంక్రాంతి సాలుకొకమారే' అనునది సామెత. ఏ పండుగయినా సంవత్సరమున కొకమారే అయినను ఈ పండుగను ప్రత్యేకముగా పై సామెతలో వ్యవహరించుట వలన ప్రజలలో ఆ పండుగ యెడ గల ఉత్సాహాతిరేకము వ్యక్తమగును.

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశింపగానే ధనుర్మాసవ్రతము ప్రారంభ మగును. ఈ ధనుర్మాసము ముప్పది దినములును భక్తులు వేకువనే మేల్కొని స్నానానుష్ఠానములు ముగించి గుంపులుగా చేరి భజనచేయుచు గ్రామ ప్రదక్షిణ మొనరింతురు. ఈ భజనలు భోగి పండుగ నాటితో ముగియును. కనుక ఈ ధనుర్మాసమునకంతకును 'పండుగ నెల' అనియే వ్యవహారము. ఈ దినములలో గ్రామీణులు తమ యిండ్లను చక్కబరుచు కొందురు. గాదెలు, ధాన్య భాండాగారములు మొదలగు వాటికి వెల్లవేయుదురు. ప్రాతబడి నిరుపయోగమైన

1. దీపావళి(వ్యా)–గ.సు.(రచయిత) భారతి నవంబర్ 1924–పుట–150.
2. మన పండుగలు–వ్రతములు(వ్యా) శ్రీమండ నరసింహం, భారతి జనవరి 1946–పుట–136.

వస్తువులను భోగి మంటలలో కాల్చివేయుటకై వేరుగా నుంచెదరు. ఇల్లాండ్రు, బాలికలు ప్రతి దినము సూర్యోదయమునకు ముందుగానే లేచి 'సంక్రాంతికి చంకలెత్తలేని చలి' అను మాటను మరిపించు ఉత్సాహముతో ముంగిళ్లను ఊడ్చి కలయంపి చల్లి వింత వింత ముగ్గులను తీర్చెదరు. ద్వారమున కిరువైపులను, వాకిటి మధ్య భాగమునను పేడముద్దలనుంచి వానిని పసుపు కుంకుమలతో అలంకరించి వానిలో బంతి, చేమంతి, గుమ్మడి మున్నగు పుష్పములను చెక్కుదురు. వీనినే గొబ్బిముద్దలు, గొబ్బెమ్మలు అని అందురు. ఇందు తల్లి గొబ్బి (పెద్దది) పిల్ల గొబ్బి (చిన్నది) అని రెండు రకములను చేయుదురు. బాలికలు ఈ గొబ్బెమ్మల చుట్టును తిరుగుచు లయానుగుణముగా చేతులను తట్టుచు పాటలు పాడెదరు. దీనిని గొబ్బిళ్లాట అందురు.

సంక్రాంతి పండుగ వెనుకటి దినమునకు భోగియని పేరు. ఈనాడు తెల్లవారు జామున ప్రతియింటి వాకిటను మంటలువేసి పాతవస్తువులను కాల్చి వేయుదురు. నెల మొత్తము వాడిన గొబ్బెమ్మలను పిడుకలుగా ఎండబెట్టి ఈ మంటలలో వేయుదురు, ఈ మంటలను ఉత్తరభాగమున 'లోడి' అని అందురు. పిదప మంగళ స్నానములు చేసి భోగి పీడ వదలినదని సంతోషింతురు.

ఆంధ్ర దేశమున నిది వ్యవసాయపు పండుగ. సంక్రాంతి పండుగనాటికి క్రొత్త పంటలు ఇంటికివచ్చి గ్రామీణుల ఇండ్లు కలకలలాడుచుండును. ఈ పండుగ దినములలో యాచకులకు 'ల' గుణింతము లేకుండగా దానములు చేసిన తమకు సస్యసమృద్ధి అధికముగా కలుగునని వీరి విశ్వాసము. స్త్రీలు వరి కంకుల తోను, వరి కంకులతోరణములతోను ఇండ్ల నలంకరించుట – పండుగ నాటి సస్యసమృద్ధిని వ్యక్తము చేయును.

తాము పండించి తెచ్చిన బియ్యముతో, ఈ ఋతువున పండు కాయగూర లతో పాలుపోసి పులగము వండెదరు. పిదప సాయంకాలము పిల్లలకు పేరంటము చేసి రేగి పండ్లు, చెఱకుముక్కలు మొదలైనవానిని తలపై పోసి దిష్టి తీయుదురు. దీనిని భోగి పళ్లు పోయుట అందురు.

సంక్రాంతి పండుగదినములలో దేవాలయములలో విధిగా "పొంగలి" నైవేద్యము భగవంతునికి నివేదించి దైవ దర్శనమునకు విచ్చేసిన భక్తులకు పంచి

పెట్టుదురు. ఈ పొంగలి కొక ప్రత్యేకత కలదు. సంక్రాంతి శీతకాలపు పండుగ. దేవాలయములలో "పొంగలి" ప్రసాదముగానిచ్చుట అనాదిగా వచ్చుచున్న ఆనవాయితి. నెయ్యి కారుచు తయారైన పులగమును పొంగలి అందురు. నెయ్యి వాతదోషములను హరించుననుట ప్రసిద్ధము. నెయ్యి ఖరీదైన వస్తువు. దానిని బీద బిక్కి తగినంతగా వాడుకొనజాలరు; వాడుకొనినను ఒక్క రోజు. నెలంతయు వాడుకొన జాలరుకదా. అందుచేత దేవాలయములలో దానిని సమృద్ధిగా పులగములో వాడి దేవుని నైవేద్యముగా పలువురకు పంచిపెట్టి ప్రజల వాత దోషమును హరించుటకు కృషి చేయుటయే కోవెలలోని ధనుర్మాస దీక్ష వెనుక దాగిన పరమార్థమని చెప్పువచ్చును. ఆర్థిక పరిస్థితికి అనుగుణముగా ఆరోగ్య సూత్రములనుకూడ మలచి ఆచారములుగా చేసినారనుటకు ఈ పొంగలి ప్రసాదము నిదర్శనము. కాని నేటి కాలమున అంతటి కమ్మని పొంగలి ఆశించుట అపరాధమేమో! ఈ పొంగలి ప్రాధాన్యమును బట్టియే ఈ పండుగ పొంగల్, పొంగలి' అని తమిళులలో ప్రచారమును పొంది యుండవచ్చును.

భోగి మరునాడు మకర సంక్రాంతి. ఇప్పటినుండి ఉత్తరాయణము ప్రారంభమగును. కనుక దీనికి ఉత్తరాయణ పుణ్యకాలమని పేరు. ఈనాడు తెలకపిండితో లేదా నువ్వులపిండితో ఒడలు రుద్దుకొని స్నానము చేయుదురు. అన్ని కులములవారును తమ పూర్వుల పుణ్యలోక ప్రాప్తికై తర్పణ శ్రాద్ధ దానములు చేయుదురు. నువ్వులు, బెల్లము, గుమ్మడి కాయలు ముఖ్యముగా దానమిచ్చెదరు. ఉత్తర హిందూదేశమున ఉన్ని కంబళ్లను దానమిచ్చుటయును కలదు. ఇవన్నియు శీతవాత హర సూచకములే.–[1]. కొన్ని ప్రాంతములలో ఈ సమయమునకు సజ్జలు పండును. కనుక నువ్వులతో అద్దిన సజ్జ రొట్టెలుచేసి వెన్న ముద్దలతో ఆరగించుట విశేషము. స్త్రీలు తమ మాంగల్యాభివృద్ధికై ఇష్టులకును, శిష్టులకును కుంకుమ, పువ్వులు, సుగంధ ద్రవ్యములతో బాటుగా నువ్వులు బెల్లమును పంచిపెట్టెదరు. ఈనాడు పిన్నలు పెద్దలకు నమస్కరించి ఆశీర్వాదము పొందుదురు. కనుక దీనికి మొక్కుల పండుగ అని కూడా కొన్ని ప్రాంతములలో పేరుగలదు.

1. పంటసిరిపండుగ–సంక్రాంతి(వ్యా) శ్రీ తిరుమల రామచంద్ర. భారతి–జనవరి–పుట–93.

సంక్రాంతి మరుసటి దినము కనుము. ఈనాడు గ్రామీణులు గ్రామపు పొలిమేరలు దాటి ప్రయాణము చేయరు. 'కనుమునాడు కాకైన కదలదని' సామెత. ఇది పూర్తిగా కర్షకుల పండుగ. తమ కృషికి బాసలుగా నిలచిన పశువులను వారీనాడు గౌరవింతురు. "ఆవుల పబ్బము" (ఆవుల మేపు - తాటియాకు 32) కలదని కాటమరాజు కథ చెప్పుచున్నదని దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు పేర్కొనిరి. కాని అది ఏనాడు జరుపబడునను విషయము నిర్దిష్టముగా నిర్ణయింప బడలేదు.-[1] ఆ పండుగ ఈ కనుము పండుగయే అయి యుండవచ్చును. కనుమునాడు కర్షకులు ఉదయముననే లేచి స్నానాంతరము పశువుల కొట్టముముందు పాలతో పులగము వండుదురు. పులగము వండునప్పుడు సంతోషముతో కేకలు వేయుదురు. పులగమును దేవతలకు నైవేద్యముగా పెట్టిన తరువాత ఆ పులగము మెతుకులను తమ పంటచేలలో చల్లుదురు. దీనిని పొలిచల్లుట అందురు. దీని వలన పంట పొల్లుపోక గింజ రాలుబడి హెచ్చునని కర్షకుల విశ్వాసము. ఈ పులగము మెతుకులను పసుపు కుంకుమలతో కలిపి చల్లుదురు. ఇది పూర్వకాలపు రక్తసిక్తాన్న బలి హరణమునకు సంకేతము కావచ్చును. ఈ సమయముననే ఎర్ర గుమ్మడి కాయను పొలమునకు దిష్టి తీసి పగుల గొట్టెదరు.

మనకు "ముందున్నది ముసుర్ల పండుగ" అను సామెత కలదు. దీనిని మొసళ్ళ పండుగ అనుటయు కలదు. దీనికి హిందువుల పండుగలు - పర్వములలో ఒక వివరణ కలదు. "నిజమున కిది మొసళ్ళ పండుగ కాదు. ముసర్ల పండుగ. ముసర అనగా అన్నపు మెతుకులు. ఈ పదము నేడు తెలుగులో లుప్త ప్రాయమైనను కన్నడమున వ్యవహారమున నున్నది. ఈ సామెత కొక చిన్న కథ కలదు. ఒక గొర్రెపిల్ల ఒక పొలమున చాల ఉత్సాహముతో గంతులు వేయుచుండెనట. పాపము! దానికేమి తెలియును. తన జీవిత మెప్పుడు ఇతరుల ప్రీత్యర్థమగునని. అక్కడనే మేయుచున్న ఒక ఎద్దు దానిని చూచి "ముందున్నదిలే, ముసర్ల పండుగ" అని గేలి చేసెనట. ముసర్లు- పొలాలలో పొలి అన్నపు మెతుకులు - చల్లు పండుగ రానున్నది - అప్పుడు తెలియునులే మిడిసిపాటు అని దాని అర్థము. సంక్రాంతి తరువాత కనుము పండుగనాడు ఎడ్లకెక్కడ లేని

1. ఆవుల పబ్బము(వ్యా) దేవరపల్లి వేంకట కృష్ణారెడ్డి. భారతి (మాసపత్రిక) పుట-74.

వైభవము. గొఱ్ఱెలకేమో బలియగు పాటు. కనుక ఈ సామెత ఒకానొకప్పుడు పంట సిరికి గొఱ్ఱెనో మరియొక జంతువునో బలి ఇచ్చు ఆచారమును సూచించుచున్నది. బల్యన్నమును దాని రక్తముతో రంజితమొనర్చుటకు మారే నేడు పసుపు కుంకుమలతో కలుపుటయు, మేషశిరః ఖండమునకు మారే గుమ్మడికాయను పగలగొట్టుటయు....రుద్ర యామళమున నిట్లు నుడవబడి యున్నది.

"ఛాగా భావేతు కూష్మాండం శ్రీఫలంవా మనోహరం,
వస్త్ర సంవేష్టితం కృత్వా ఛేదయే చ్ఛురికాదినా"

మేకకు మారు బూడిద గుమ్మడికాయను గాని, చక్కని కాశీఫలమును గాని (ఎఱ్ఱ గుమ్మడికాయను గాని) గుడ్డతో కప్పి ఛేదించవలెను.–[1] శ్రీ ఫల మనగా కొబ్బరికాయ అను వాడుక కలదు.

కనుమునాడు పశువులను నీటితో కడిగి వాని కొమ్ములకు రంగులు పూసి పూల దండలను మెడలో వేయుదురు. గంటల పట్టెడలు కట్టెదురు. కాళ్లకు గజ్జలు కట్టుదురు. సాయంకాలము మేళ తాళములతో పశువులను ఊరేగింతురు. పశువుల పరుగు పోటీలు, కోడి పందెములు, గొఱ్ఱె పొట్లేళ్ల పందెములు మొదలగు వినోదములు జరుగును. ఇవి తెలుగువారి జాతీయతకు చిరకాలముగా నిలచిన చిహ్నములు.

ఈ పండుగ దినములలో గొబ్బిగౌరి వ్రతమును స్త్రీలాచరించెదరు. ఇది భోగి పండుగనాడు ఆరంభమగును. భోగినాడు సాయంకాలము నట్టింట ఒక మండపమును నిర్మించి ఆ దినములలో దొరుకు పండ్లు, కూరగాయలు, చెరుకు గడలు, పువ్వులతో అలంకరింతురు. మండప మధ్య భాగమున బియ్యము పోసి దానిపై బంకమట్టితో చేసిన గౌరీ విగ్రహమును ఉంచెదరు. పూజలు చేసి రాత్రి వేళ పాటలు పాడి దేవిని నిద్ర పుచ్చెదరు. ఉదయము మరల మేల్కొలిపెదరు. ఇట్లు మూడు దినములు పేరంటముతో సహా జరుగును. నాలుగవనాడు ఉద్వాసనము చేయుదురు. మండపము నలంకరించిన కూరగాయలతో కలగూర

1. హిందువుల పండుగలు–పర్వములు–పుట–253–254

వండెదరు. దీనికి గొబ్బి కూర అని వ్యవహారము. నాలుగవనాటి సాయంకాలము ముత్తైదువలును, బాలికలును గొబ్బి దేవిని గొనిపోయి చెఱువులోగాని నదిలోగాని ఓలలాడించెదరు. అది యా దేవితో గూడి యందరు అవభృథ స్నానము చేసినట్టు అర్థము. తర్వాత ఇష్ట బంధువులతో గూడి దేవ సన్నిధిని చిత్రాన్నమును భుజించి పండ్లు తాంబూలములు ముత్తైదువుల కొసంగెదరు. ఈ వ్రతమునే "గొబ్బి లక్ష్మి" వ్రతమని కూడా అందురు. ఇట్లనుట వలన 'గొబ్బి' గౌరిగను, లక్ష్మిగను భావింపబడినట్లు తెలియుచున్నది. గొబ్బిలో లక్ష్మి దాగియున్నట్లు చెప్పు కథలును వాడుకలో నున్నవి.

కొన్ని ప్రాంతములలో స్త్రీలు కనుమునాడు పుట్టింటి క్షేమమును కోరి ఒక వ్రతమును చేయుదురు. దానిని "కాకి పిడచలు పెట్టుట" అందురు. ఎరుపు, పసుపు, తెలుపు (పెరుగు) రంగులతో అన్నమును కలుపుకొని పిడచలుగా చేసి పూజా పురస్కారములు ఆచరించి కాకులకు వెదజల్లుదురు. వ్రత పరమార్థ మెట్లున్నను "కనుమనాడు కాకైన కదల ద'ను సామెతకును ఈ కాకి పిడచలకును ఏమైనా సంబంధమున్నదేమో! వానికి సమృద్ధిగా ఆహారము గ్రామము లోనే లభించుచుండగా జీవనాధారమునకై ఇతర ప్రాంతములు తిరిగి రావలసిన అవసరముండదు కదా.

సంక్రాంతి, దీపావళి ఆంధ్రులందరును ఆచరించునవే. అయినను సంక్రాంతి ఆంధ్ర ప్రాంతములో వలె తెలంగాణ ప్రాంతమున ఆదర పాత్రము కాలేదు. తెలంగాణ ప్రాంతీయులు ధనుర్మాసమును పీడ దినములుగా భావించి సంక్రాంతి వెళ్ళు వరకు ఎట్టి శుభకార్యములను మొదలు పెట్టరు. కొత్త అల్లుండ్రను పిల్చుకొని వచ్చుట, బొమ్మల కొలువు పెట్టుట వంటి వేడుకలు దీపావళి పండుగ సందర్భముననే చేయుదురు. కనుమనాడు పచ్చని వర్ణములోనున్న వస్త్రములను ధరించుట ఆచారము. ఈ రంగు వస్త్రములు పీడను తొలగించునని విశ్వాసము.

ఇది సాంప్రదాయసిద్ధమైన సంక్రాంతి సంక్షిప్త చరిత్ర. ఇక జనపదములలో ఈ పండుగ సందర్భమున ప్రచారముననున్న పాటలను పేర్కొందును.

సంక్రాంతి సమయమున జనపదములలో ఎటు చూచినను స్త్రీలలో ఉత్సాహము సమధికముగా కనిపించును. కన్నె పిల్లలు ఉదయముననే లేచి

ముగ్గులు తీర్చిన ముంగిలిలో గొబ్బెమ్మను పెట్టి నవధాన్యములతోను, పుష్పముల తోను అలంకరించి కుండలాకారముగా నిలచి, చేతులు తట్టుచు, గొబ్బిచుట్టు తిరుగుచు పాటలు పాడెదరు. ఇది చూచుటకు నృత్యమును తిలకించినట్లుండును. వీనిని గొబ్బి పాటలనియు, గొబ్బిచుట్టు తిరుగుటను గొబ్బి తట్టుట అనియు అందురు. గొబ్బి పదములను పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో పేర్కొని నాడు.

"గొబ్బి పదములు వెన్నెల పదములు-[1].

అన్నమాచార్యుడు కూడ గొబ్బిళ్ళ పాటను పాడినాడు.

"కాలని దోపరికి గొబ్బిల్లో, యదు కులము సామికిని గొబ్బిళ్లో" -[2].

దీనిని బట్టి ఈ పాటలు అతి ప్రాచీన కాలమునుండియే తెలుగు దేశమున వాడుకలో నున్నట్లు మనము నిర్ణయింపవచ్చును.

గర్భ అను సంస్కృత పదము నుండి 'గొబ్బి' వ్యుత్పత్తి వచ్చినట్లు డా॥ రామరాజుగారు పేర్కొనిరి-[3], నేదునూరి గంగాధరము గారు "సంక్రాంతి పండగను గొబ్బెమ్మ పండుగ అని యందురు. గొబ్బెమ్మ అనగా గోపునకు తల్లి. గోపు అనగా గోపాల కృష్ణుడు. అందుచేతనే తల్లి గొబ్బి, పిల్ల గొబ్బి అని రెండు రకములు చేయుదురు" అని వ్యాఖ్యానించిరి.-[4]. ఎల్దండ రఘుమా రెడ్డిగారు "గొబ్బియళ్లో అనగా పూజల నుతులు" అని అర్థము చెప్పిరి-[5]

గొబ్బియను పదము గోపి అను సంస్కృత తద్భవమని నా అభిప్రాయము. 'గోపి' అను పదము నుండియే గొబ్బి పదము వచ్చిన దనుట సమంజసము. అండాళు ధనుర్మాసములో తాను గోపికా భావనతో ఈ పాటలు పాడినట్లు సంప్రదాయమున్నది. ఆమె రచించి పాడిన తిరుప్పావైలో గోపికలు పాటలు పాడుచు కృష్ణుని ఆరాధించినట్లు వర్ణనము కలదు. కనుక గోపి పదము "గొప్పి

1. పండితారాధ్య చరిత్ర-పుట-513.
2. తాళ్లపాకవారి కృతులు-సం-3-పుట-327, తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ.
3. తెలుగు జానపదగేయ సాహిత్యము-పుట-429.
4. పండుగలు-పరమార్థములు-సంక్రాంతి శీర్షికలో
5. పల్లె పదాలలో ప్రజా జీవనము-(అముద్రితము) -పుట-415.

– గొబ్బి" అనియు గోపి యర్కళ్ అను తమిళ బహువచన రూపము గొబ్బియలో అనియు మారి యుండుట సంభవము. తెలుగు, తమిళములు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందిన సోదర భాషలు కావున నిట్టి మార్పులను పొందుటలో ఆశ్చర్యములేదు. ఈ వాదమునే తిరుమల రామచంద్రగారు సమర్థించుచున్నారు.[1]. గొబ్బి పదములనే కుమ్మి పదములు అనుటయు గలదు. కుమ్మి పదములను పాడుటను నేదునూరి గంగాధరము గారు "బాలికలు గుండ్రముగా తిరుగుచు, చేతులు తట్టుచు, గంతులు వేయుచు అభినయముతో పాడుదురు" అని –[2] పేర్కొనిరి. ఇందు గొబ్బి యాటలో వలె గొబ్బెమ్మలను పెట్ట నవసరము లేదు. గొబ్బెమ్మలను పెట్టిన గొబ్బియాట అనబడును.

"బాలికలార బాగుగ కుమ్మి
జట్టుగ నిలచియు వేగము రారె
కోలాహలముగ కుమ్మిని వేయుచు
కోరిన యారోగ్యము గైకొందము.
....–[3]

అను విధమున ఈ పాటలు సాగును. మద్రాసు పట్టణములోని ఆటలను పేర్కొనుచు మేరీ ఫ్రాన్సెస్ బెల్లింగ్టన్ "కుమ్మి యనునది మరియొక ఆట. ఇది బృంద నాట్యము వంటిది. అన్ని విధములను దీనినే పోలిన ఒక యాటను భావనగర్‌లో చూచితిని. దాని నచట గర్డో యందురు" అని యనినారు.–[4] ఇచట ఇంగ్లీషు ఉచ్చారణలో "గర్భ గర్ధ" అయియుండును. గుజరాతులోని గర్భోనృత్యము గొబ్బి వంటిదేకదా.

గొబ్బి పూజానంతరము ఆగొబ్బిళ్ళను తీసి భోగి పిడకలుచేసి గోడలకు చరచెదరు. ఈ పిడుకలను భోగినాడు భోగిమంటలలో వాడుదురు. సాయం కాలముచేయు "సంది గొబ్బి" పూజకు పేరంటాండ్రను పిలిపించి పళ్ళు తాంబూలములు పంచిపెట్టుదురు.

1. నుడి–నానుడి–తిరుమల రామచంద్ర–పుట–119
2. మిన్నేరు–పుట–27 3. మిన్నేరు–పుట–16.,,
4. Woman in India. By Mary Frances Bellington. Chapman & Hail. Ltd., London 1885.

ఈ సమయమున చేయు గొబ్బి గౌరమ్మ వ్రతమున కన్యకలు ఈ క్రింది పాట పాడుచు వరము కోరుదురు.

"సుబ్బి గొబ్బెమ్మ – సుఖపడనిస్తావా.... ....
మల్లె పువ్వంటి – మరిదినిస్తావా
మంకెన పువ్వంటి – మరదల్నిస్తావా–[1]

ఈ పాటలో కన్యకల కోరిక లెంత సున్నితమో – తామర పువ్వంటి తమ్ముడు, చేమంతి పువ్వంటి చెల్లెలు, మల్లె పువ్వంటి మరది – వ్యక్తమొనరించుచున్నారు. మరదలు ఎప్పుడును వదినలపై కారాలు మిరియాలు నూరును గనుక మంకెన పువ్వంటి మరదలు అని ఉపమించుటలోగల ఔచిత్యము ప్రశంసనీయముగా నున్నది. ఇట్లే నిత్య జీవితములో తిలకించు పుష్పములతో కుటుంబములోని ఇతర వ్యక్తులను కూడ పోల్చుదురు. తెలంగాణా ప్రాంతమున కన్యలు బొడ్డెమ్మ నోముచేయుట, ఈ గొబ్బిగౌరి నోమును పోలుచున్నదని 'బొడ్డెమ్మ పండుగలో' పేర్కొనినాను. భోగి పండుగనాడు పాత వస్తువులను భోగిమంటలలో కాల్చుట పీడానివారణకు చిహ్నము. ప్రకృతిలో పాతరాలిపోయి కొత్తచిగురు తొడిగినట్లే భోగితో పాత యంతయు భస్మమై, జీవితములో కొత్త మొలకెత్తుననుటకు ప్రజల విశ్వాసము. భోగి మంటలలో పాత వస్తువులను కాల్చుచు

"ఆడ–నాడ–వాడ; వాడ; గోడ
గొంది కొంపలు దండి వేసవదూసరి భోగరమంట–[2]

అని పాడుదురు. సంక్రాంతి సమయము ధాన్య ఆగమ సమయము కనుక యాచకుల రాయిడి ఎక్కువగానుండును. గంగిరెద్దుల వారు, జంగమ దేవరలు సరేసరి.

పండుగ దినములలో మాలెతలు వరివెన్నులు చేర్చి కట్టి పల్లెములో పెట్టుకొని పసుపు అలంకరణము చేసి ఇంటింటికి తిరుగుచు పాటలు పాడుచు యాచింతురు.

---

1. మిన్నేరు–229. 2. సెలయేరు–48.

పాండవులు పాండవులు తుమ్మెద, పంచ పాండవులె తుమ్మెదా
ఓయి భామల్లాల తుమ్మెద భామ్మల్లార తుమ్మెదా
పండిన వరిచేలు తుమ్మెద, పాయల్లు తొక్కింది తుమ్మెదా
పట్టండి నందిని తుమ్మెద, నోఋక్క దాని తుమ్మెదా
యీనిన వరిచేలు తుమ్మెద తమ్మిరాయీరు పెడజమ్మింది తుమ్మెదా
పొగతోటలన్ని తుమ్మెద పాడి పాడిగ తొక్కింది తుమ్మెదా
చెరకు తోటలన్ని తుమ్మెద టెడతొక్కి వేసింది తుమ్మెదా
యెక్కడెక్కడ వెదకినా తుమ్మెద యేడాదినంది తుమ్మెదా
కాపొరి చేలో తుమ్మెద కట్టి పెడతారు తుమ్మెదా
మాలవారి చేలోకి తుమ్మెద వెళ్లు నందన్న తుమ్మెదా
మాలవారు మంచివారు తుమ్మెదా నిన్ను గొలుతూరు తుమ్మెదా

ఇదే పాట కొద్ది మార్పుతో పల్లెపదాలలో, సెలయేరులో కలదు. –[2]

వీనిలో ఎద్దులను మాలవారు గౌరవించుటకు నంది సంకేతము.

సంక్రాంతి పండుగనాడు ఇంటి ప్రాంగణ ప్రదేశమునలంకరించి సంక్రాంతి పురుషుని ప్రతిమను ప్రతిష్ఠించి పూజించెదరు. ఇతడు ప్రతియేటను ప్రత్యేక లక్షణములతో వచ్చునని ఆతని నామము, వేషము, వాహనములనుబట్టి దేశములో శుభాశుభములు సంభవించుననియు పెద్దలు చెప్పుదురు. ఇతనిని "సంకురమయ్య, సంక్రమాణ పురుషుడు" అని జానపదులు వ్యవహరించెదరు. ఈ సంక్రాంతి పురుషుని ప్రతిమ యెదుట పిడుకల నిప్పుపై పాలను పొంగించెదరు. పొంగుచున్న పాలలో బియ్యమును, బెల్లమును వేయుట తెలంగాణా ప్రాంతమున ఆచారము. ముందుగనే సంక్రాంతి పురుషుడు వాహనారూఢుడై వచ్చు దిక్కును పురోహితుల వలన తెలిసికొని పాలను పొంగించు కొత్త గురిగెను ఆ దిక్కుగా వంచి పెట్టుటను ప్రత్యేకముగా పాటించెదరు. తరువాత పప్పు బెల్లమును నైవేద్యము పెట్టి భక్తితో నమస్కరించుచు–

"ఎలుక ముట్టాలేదు – చిలుక ముట్టాలేదు
నీకే పెట్టితినయ్య కాలభైరవుడా" –[3]

1. నేను సేకరించినది – పాడినవారు – నేదునూరి సూర్య ప్రభావతి – రాజమండ్రి.
2. పల్లె పదాలు–పుట–135; సెలయేరు–పుట–41.
3. పండుగలు–పరమార్థములు–పుట–62.

అని ప్రార్థించెదరు. పొంగగా మిగిలిన పాలను పంటపొలములలో జల్లెదరు. నైవేద్యమును ఇంటిలోనివారు తీసికొందురు.

సంకురమయ్యనే బలిచక్రవర్తి అనుట కొన్ని ప్రాంతముల సంప్రదాయము. బలిచక్రవర్తి దానధర్మములకు ప్రసిద్ధిచెందినవాడు. "బలిచక్రవర్తి అడిగిన వారికి లేదనకుండ ధర్మము చేసెడివాడు. క్రతువులు యాగములు చేసెడివాడు. ఇట్లు కొంత కాలము గడువగా అతనికి పుణ్యము ఎక్కువ యగు చున్నదని కృష్ణ పరమాత్ముడు కనిపెట్టి వామనావతారముతో మూడడుగులు దానమడిగి అతనిని పాతాళమునకు అణగద్రొక్కెను. బలిచక్రవర్తి పాతాళమునకు పోవు సమయమున 'నా అజ్ఞానమున నిన్ను తెలిసికొనలేక పోయితివి. ఇక నా గతి యేమి? అని అడిగెనట. అప్పుడు వామనుడు నీవు సంవత్సరమునకు మూడు రోజులు స్వేచ్ఛగా భూలోకమున సంచరించి నాలుగవ రోజున పాతాళమునకు మరలిపొమ్ము అని అనుజ్ఞ యిచ్చెనట. అందువలన సంక్రాంతి పండుగ దినములలో బలిచక్రవర్తి స్వరూపుడగు సంకురమయ్య బొమ్మను మట్టితో చేసుకొని, పూజించి, పిండివంటలు నైవేద్యమిచ్చి గౌరవించుచున్నారు.-1 బలి చక్రవర్తి రాక్షసరాజే అయినను అతని పాలనలో ప్రజలకెట్టి కష్టములును కలుగ లేదు. అందుకనియే బలిచక్రవర్తి ప్రజల ఆదరణకు పాత్రుడయ్యెను. ఈ సంక్రాంతి మూడు దినములును బలిచక్రవర్తి యేలుబడియందుండు ఆనంద దినములని ప్రజల నమ్మకము. -[2]

పొలి చల్లునప్పుడు పెక్కు పాటలు గలవు. వీటి లక్ష్యము ధాన్యము రాసులుగా పండునట్లు అభిలషించుటయే.-[3]

నేదునూరి గంగాధరంగారు దాదాపు పన్నెండు పొలిపాటలను వివిధ ధాన్య రీతులను, పెక్కు ధాన్యపు వంగడములను తెలుపువానిని పేర్కొనినారు-[4].

1. గొబ్బెమ్మ(వ్యా) శ్రీమతి పి బాలాత్రిపుర సుందరమ్మ, గృహలక్ష్మి, జనవరి, 1954, -పుట-4.
2. మన పండుగలు-వ్రతములు(వ్యా) శ్రీమండ నరసింహం, భారతి, జనవరి 1946-పుట-137.
3. తెలుగు పల్లెపాటలు-ప్రయాగ నరసింహ శాస్త్రి. - పుట-6.
4. మిన్నేరు. పుటలు-398-420.

ధనుర్మాసము నెలరోజులు గోవులను పూజించవలెనని మన శాస్త్రములు ఘోషించుచున్నవి. కాని ప్రతివారికిని ఆవులుండవుకదా. ఆవుపేడతో గోవునుజేసి పూజించవలెనని వ్యాసులవారి ప్రబోధమట. బ్రాహ్మీమూహూర్తముతో గోమాత పూజవలన ప్రజాసమూహమునకు బ్రహ్మ తేజస్సు వృద్ధియగునని హైందవుల విశ్వాసము –[1].

స్వర్గమున గోవునకు మహా గౌరవముగల యట్లు కథలు గలవు. అన్ని లోకములకును మిన్నయగు విష్ణులోకమునకు "గోలోక" మని పేరు. బ్రహ్మ దేవుడు గోవును బ్రాహ్మణుని ఒకేనాడు సృష్టించెనని అందువలన గోవు బ్రాహ్మణునితో సమాన గౌరవపాత్రమైనదను విశ్వాసము హైందవులలో కలదు. గోమహిమనుగూర్చి స్కాంధ, పద్మ, విష్ణు, గరుడ పురాణములు, స్మృతి గ్రంథములు విశేషముగా పేర్కొనినవి.

ఆవు పేడతో కలాపి చల్లుట, గొబ్బెమలను తయారుచేయుట – మొదలగు విషయములను పరిశీలించిన అందు పూజకుగల ప్రాధాన్యమున కన్నను ఆరోగ్యసూత్రములధికముగా ఇమిడియున్నవి.

భోగినాడు చలిమంటలు, పిండి వంటలు, పిల్లలకు భోగి పండ్లు పోయు వేడుకతో గడచిపోయిన, సంక్రాంతి నూతన వస్త్రాలంకారములతో, ఆత్మీయుల యిష్టాగోష్టితో జరుగును. కనుము పశువుల సంబరముతో, ముక్కనుమ కన్యల, నూతన వధువుల బొమ్మల నోముతో గడుచును. ఈ పండుగలో జరుపు కోడి పందెములు గొఱ్ఱె పందెములు నేడు కనుమరుగై పోవుచున్నవి.

ధనుర్మాసమంతయు రకరకములైన ముగ్గులను వేయుదురు, అందు గోపాదములు, నాగ బంధములు, సూర్యుని బొమ్మలు తప్పక యుండును. చివరి దినమున ముగ్గులకొక ప్రత్యేకతకలదు. సూర్యుని ఉత్తరాయణగతికి చిహ్నముగా ముగ్గులతో రథమును తాడు కట్టి లాగుచున్నట్లు తీర్చుదురు. ఇట్టి రథములతో కూడిన ముగ్గులు ప్రతి ఇంటిముందును కనిపించును. ఆనాటితో సంక్రాంతి పురుషునకు వీడుకోలు చెప్పినట్లగును. ముగ్గులతో తీర్చు శంఖములు, పద్మములు మకరములను పారిజాతాపహరణము పేర్కొనినది –[2]

1. సంక్రాంతి(వ్యా) – వేదం రామశాస్త్రి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 22–1–69, పుట–7
2. పారిజాతాపహరణము–ఆ. 3. గద్య 41.

హోళి :

హోళి పండుగ ఫాల్గుణ పౌర్ణిమనాడు జరుపబడును. ఈ హోళి పండుగనే వసంతోత్సవము అందురు. ఈ పండుగ ఇంచుమించు భారత దేశమందంతట గావింపబడుచున్నది. అయినను దీని యెడ ఉత్తర దేశీయుల కుండినంత ఆదరము దాక్షిణాత్యులకు లేదనవచ్చును. వసంత విషువత్తు ఫాల్గుణ పూర్ణిమనాడే సంభవించుటచేత వైదిక కాలమున నూతన వత్సరము ఈనాటి నుండియే ఆరంభ మగుచుండెనట. వైదిక కాలమున చాతుర్మాస్య వ్రతము ఫాల్గుణోత్సవముతో ప్రారంభమగుచుండెనట. దీనినే "మదనోత్సవము" అనికూడ అనుచుండిరి. ఇది అతి ప్రాచీన మనుటకు గాథా సప్తశతిలోని పెక్కు గాథలు తార్కాణము.

"గాథా సప్తశతి ఈ ఉత్సవమును పగ్గుచ్ఛణ (ఫాల్గుణక్షణ - ఫాల్గుణోత్సవ)" అని పేర్కొనినది.

నేడు ఈ పండుగ చాలవరకు దక్షిణ దేశమున తమిళ, తూర్పు కోస్తా ప్రాంతములలో అంతగా లేకపోయినను దేవాలయములలో కామ దహనాదులతో ఉత్సవము జరుపుదురు. తెలుగు నాట "కాముని పండుగ, కాముని పున్నమ" అని పండుగకు వ్యవహారము కలదు. పండుగ దినమున అనగా ఫాల్గుణ పౌర్ణిమ నాటి రాత్రి వీధులలో కాముని బొమ్మను తయారుచేసి దానిపై కట్టెలు, పిడుకలు, చెత్తా చెదారము, దొరికిన పనికిరాని వస్తువులనెల్ల వేసి కాల్చివేయుదురు. కాలిన కాముని బూడిదను ఇంటి కప్పులపై, పొలాలపై చల్లుదురు. అట్లు చల్లిన క్రిమి కీటకాదుల నాశనము జరిగి ఎక్కువ పంటలు పండునని జానపదుల విశ్వాసము. కన్నడ దేశమున దీనిని "కామన హబ్బ" అని తమిళమున "కామన్ పండుగై" అని వ్యవహరింతురు. మహారాష్ట్రులలో హొూళికాగ్నిలో పోలీలు (భక్ష్యములు) వేయు నాచారము కలదు. కన్నడ, మహారాష్ట్ర భాషలలో కొన్ని పదములను "ప" కారమునకు మారుగా "హ" కారముతో నుచ్చరింతురు. కావున 'పొలి' యను పదమును వారు హోళి యని యుచ్చరించి పై పద్ధతిగా నుత్సవము చేయుచుందురని యనుమానింపవచ్చును-[1]

1. హిందువుల పండుగలు-పుట-199.

హోళి పదమునకు అర్థము ఇదమిత్థమని చెప్పుట కష్టము. కోతకువచ్చిన ధాన్యమును కోయునప్పుడు చేయు కోలాహలమే క్రమముగా హోలా, హోలాకా అని రూపు చెందినదని కొందరు భావించుచున్నారు. హోళికా అను రాక్షసుని సంహరించిన దినము గనుక హోళీ పండుగ వ్యవహారమునకు వచ్చినదని మరి కొందరనుచున్నారు. కాని శివుడు మన్మథుని తన మూడవ కంటి మంటలో భస్మము చేసిన దినముగా ఈ పండుగకు ప్రసిద్ధి కలదు. ఏమైనను ఈ పండుగ ప్రపంచ మంతయు వసంత ఋతువులో ఆనంద తుందిలమైనప్పుడు మైమరచి వావి వరుసలులేక ఆడిన మన ప్రాచీనుల ఉత్సాహమునకు చిహ్నమని చెప్ప వచ్చును. ఫాల్గుణ పౌర్ణమి వెన్నెలలో రంగునీటిని చిమ్ముకొనుట వాత్స్యాయనుడు పేర్కొనెను–[1]

ఈ పండుగను రెండు రోజులు జరుపుదురు. మొదటి రోజున కాముని పటము వ్రాసి కామ దహనమును జరుపుదురు. దీని ఉద్దేశ్యము వసంత ఋతువు వలన దేహమానసములలో కలిగిన ఉద్రేకమును జయించుట, కాముని దహించుట. ఆ కాముని దహన మెట్లున్నను బాహ్యముగా జరుగు దహనకాండ మాత్రము ఘోరముగా నుండును. రెండవ నాటి ఉత్తవమును ధులండి అనియు 'ధూల్ వాడ్' అనియు అందురు. అనగా దుమ్మును ఒకరిపై నొకరు చల్లుకొని ఆనందించుట.

బుద్ధుని కాలములో దీనిని "బాలనక్షత్త" అను నొక పండుగగ జరుపుచుండిరి. దీనిని "మూర్ఖుల పండుగ" అనుచుండిరి. ఈ ఉత్సవము చాల ప్రచురముగా నుండియుండును. కనుకనే దీనిని ప్రాచీన సంప్రదాయజ్ఞులు, ధర్మశాస్త్రకారులు వదలుకొనలేక సంప్రదాయ సమ్మతముగా పరిగణించిరి–[2].

ఈ ఉత్సవమును విజయనగర చక్రవర్తులు, వైభవోపేతముగా జరుపు కొనెడివారు. శ్రీకృష్ణదేవరాయలు దీనిని తిరుపతిలో కొండపైన శ్రీవేంకటేశ్వరుని సన్నిధానమున స్వామి పక్షమున వసంతోత్సవముగా జరుపుచుండెను.–[3]

ఈ వసంతోత్సవమును ముక్కు తిమ్మన పారిజాతాపహరణమున కృష్ణ రాయఋని వర్ణించు సందర్భములో పేర్కొనినాడు–[4].

---

1. వాత్స్యాయన కామ సూత్రములు. 1–4–42.
2. జైమినీ న్యాయమాల–హెూలాకాధింరణము.
3. హిందువులు–పండుగలు పర్వములు 307–308.
4. పారిజాతాపహరణము ఆశ్వా–1–139.

రంగులు చిమ్ముకొను ప్రసక్తి, నిరంకుశోపాఖ్యమున కలదు–[1]

ఇట్లు సహస్రాబ్దులుగా ఉన్న ఈ పండుగను నేడు నాగరికులు ఈసడించు కొనుచుండినను జానపదులు ప్రాణ ప్రదముగా ఆనందించు చున్నారు. ఆ ఆనంద కోలాహలమే హోళి పాటలు – కాముని పాటలు మున్నగు అసంఖ్యాక గేయ సాహిత్యము.

ఫాల్గుణ పౌర్ణిమ ఇంకను పది, పదిహేను రోజులు ఉందనగానే, స్త్రీలు, పిల్లలు పాటలు పాడుకొనుచు ఇంటింటికి తిరుగుదురు. ముఖ్యముగా కూలీనాలీ చేసుకొనువారు పనులు ముగించుకొని పది ఇరువది జట్లుగా బయలుదేరి పాటలు పాడుకొనుచు ఇంటింట ధాన్యమునో, డబ్బునో వసూలు చేయుదురు. వారి బెడద పడలేక అందరును తృణమో పణమో ఇచ్చి వదిలించుకొందురు. అట్లు గాక ఎవ్వరైనా తప్పించుకొన జూచినను వీరు మాత్రము వదలునది లేదు.

"నిన్న సూస్తే నిన్న లేవు
మొన్న సూస్తే మొన్న లేవు
ఓ! దొరబాబు! మమ్మొదిలి పోకు మా దొరబాబు–[2]

దొరబాబు పనిమీద ఎక్కడికైన వెళ్ళియో లేదా వీరిని తప్పించుకొన చూచినచో వీరు ఆచూకీ తీసిగాని వదలరు. అట్లే దొరబాబు పేరుకు మారుగా ఇతరుల పేర్లను మార్చుచు పాటలు పాడెదరు. డబ్బును, ధాన్యమును వసూలు చేసెదరు. అట్లు పోగయిన ధాన్యముతో డబ్బుతో పూర్ణిమనాడు వేడుకలను జరుపుకొని వినోదించెదరు. వివాహముకాని కన్యలు మాత్రమే పూర్ణిమనాడు ఉదయమే లేచి తలంటు పోసికొని ఒక చిన్న బుట్టకు గన్నేరు పూలు గట్టి అందులో పసుపుతో పార్వతి బొమ్మను చేసి పూజించి పాటలు పాడుకొనుచు జట్లు జట్లుగా ఇల్లిల్లు తిరుగుదురు. ఇట్టి సమయమున ఇట్లు పాడెదరు.

---

1. నిరంకుశోపాఖ్యానము–కందుకూరి రుద్రకవి–ఆశ్వా–2–ప–99.
2. నేను సేకరించినది, పాడినవారు, సాతాని రంగమ్మ, గడ్డం మల్లయ్యగూడె.

"కాముడూ భీముడూ కట్టెక్కి పోంగ
కామునికీ తలువాలూ–[1] పోయనెల్లాయ–[2] ॥కాముడూ॥
బీరాయి పువ్వులు పూయనెల్లాయో
భీమునికి తలవాలూ పోయనెల్లాయా ॥కాముడూ॥
కాకరా పువ్వులూ పూయనెల్లాయా
కామునికి తలవాలూ పోయనల్లాయా ॥కాముడూ॥
చిక్కుడు పువ్వులూ పూయనెల్లాయా
శివునికి తలువాలు పోయనెల్లాయా ॥కాముడూ॥–[3]

ఇందులో పేర్కొనబడిన కాముడూ, భీముడూ, శివుడూ – ముగ్గురిలోను పండుగతో సంబంధములేని భీముని ప్రసక్తి యేలకో? బీరాయి పువ్వులు అని నందుకుగాను చెవులకింపుగా భీముని ప్రసక్తి వచ్చినదేమో లేదా కాముడు కామమునకు సంకేతమైనట్లు భీముడు శరీరబలము వలన కలిగిన మదమునకు సంకేతము గావచ్చును. ఏది ఏమైనను కనుల యెదుట కనిపించు తలంబ్రాలు పోసికొనుటకు సరిపోవు వయస్సునకు వచ్చిన కన్యల పాటకు ముగ్ధులై మురిపముతో దానమొసంగెదరు. ఇంటివారలు ఇన్ని రోజులుగా జరుగు యాచన ఒక యెత్తు – పండుగనాటి యాచన ఒక యెత్తు. కామ దహనానంతరము పల్లెటూరి స్త్రీలు గుంపులుగా పాటలు పాడుచు ఇంటింటికి తిరుగుచు వారి దగ్గర నుండి డబ్బును గాని ధాన్యమునుగాని యాచించి తీసుకొనెదరు. దీనిని హోళి కట్నమనియు, పండుగ మామూలు అనియు అందురు. ఈ డబ్బును తరువాత ఎవరిది వారు పంచుకొందురు.

నిమ్మలు బూసె నిమ్మలు గాసె – హోళి
చెమ్మకేళిర హోళి

ఇందు "శ్యామ్ ఖేలేరే హెూళి" –[4] (కృష్ణుడు హోళి ఆడెను) అను హిందీ వాక్యము "చెమ్మకేళిర హోళి" అను వాక్యముగా తెలుగునందు మారి

1. తలంబ్రాలు 2. పోయువేళాయె, 3. నేను సేకరించినది, పాడిన వారు, నక్క లచ్చుమమ్మ, రాయిప్రోలు.

4. తెలం. పల్లెపాటలు–పుట–62.

యుండునని డా॥ రామరాజుగారు అభిప్రాయపడుట సంభావ్యముగా నున్నది. దొర అను భక్తి భావము ఇతర సమయములందు ప్రదర్శించినను ఈ పండుగ సందర్భమున వినయవిధేయతలు, వావివరుసలను– అన్నింటిని................ ప్రక్కకు నెట్టి పరిహాసములను పాటలలో గుప్పించి వినోదించెదరు.

ఈ కాముని పండుగ వేళకు గోధుమల, యవల, శనగల పంటలు ఇండ్లకు చేరును. తక్కిన పెక్కు పండుగలవలె ఈ పండుగయును ధాన్యలక్ష్మికి సంబంధించిన పండుగయే కనుక ఈ పాటలలో ధాన్యముల ప్రసక్తి తరచుగా కనిపించును. పాటలు పాడువారు ధాన్యములను ప్రశంసించుటయో, దాన మడుగుటయో, దాతల సమృద్ధిని సూచించుటయో చేయుదురు.

యఁవులూ బూసే యఁవులూ గాసే ఓ రచ్చ గుమ్మడి
యవులా పండ్లు ఏమోతినే ॥ఓ॥
పచ్చీ వొయ్యా గంగానాడే ॥ఓ॥ గంగానునా గట్టినిమ్మా ॥ఓ॥
ఎవరి చేతికందినాదే ॥ఓ॥ ఏగిలెత్తే దొరుసాని ॥ఓ॥
నీ ఎడుమ సేతీకందినాదే ॥ఓ॥ మూడొద్దులు వొయ్యినాడే ॥ఓ॥
ముక్కూపుల్ల ల్దెచ్చీనాడే ॥ఓ॥ నీ ముక్కూపుల్లాల టోకెట్టి ॥ఓ॥
ఈ ముద్దూలియ్యో దొరూసాని ॥ఓ॥ నాలుగొద్దులు వొయ్యినాడేస
ఈ నల్ల పూసల్దెచ్చినాడే ॥ఓ॥ నీనల్ల పూసాలాటోవెట్టీ ॥ఓ॥
ఈ ముద్దులియ్యో దొరుసాని ॥ఓ॥ ఏడొద్దులు వొయినాడే ॥ఓ॥
ఈ ఎర్ర జీరల్దెచ్చినాడే ॥ఓ॥ ఎర్ర జీరలాటువెట్టీ ॥ఓ॥
ఈ ముద్దూలియ్యి దొరుసాని ॥ఓ॥ యవులూ పూసేయములుగాసే ॥ఓ॥ [1]

ఈ పాటలో దొరసానిని ప్రశంసించుట, ఆమె భర్త ముక్కుపుల్లలు, నల్ల పూసలు, ఎర్రచీరెలు తెచ్చెననుటలో – కోర్కెలు తీర్చెననుట – స్పష్టము. పాటలు పాడువారు తమవిగా కొన్ని, దొరసానివిగా కొన్ని, దొరసానిని తృప్తిపరుచుటకు కానుకలను తెచ్చిన దొరవిగా కొన్ని – భావములను మేళవించి ప్రదర్శించినారు.

---

1. డా॥ నాయని కృష్ణకుమారిగారు కరీంనగరు ప్రాంతమున సేకరించి సందర్భవశమున నాకిచ్చినది.

ఈ పాటలలో కేవలము శృంగారము, పొగడ్త, హేళన మాత్రమేగాక సమకాలిక రాజకీయ చరిత్రాంశములు కలవి కూడా నున్నవి. ఉదాహరణమునకు

చక్కవోలె పాగాజుట్టి, ఏలినావు హైదరాబాదు
ఎంత చక్కని వాడవయ్యా ఓ కుతుబ్ సాబు
మన్నులేని మక్క మసీదు, రాయిలేని చారుమినారు
ఏమి జేపుదు నీదు పాలన, ఓ కుతుబ్ సాబు–[2]

కుతుబ్‌షాహీలు మత సామరస్యమునకును, సత్పరిపాలనకును పేరెన్నిక గలవారు. దీనిలో మక్కమసీదు కేవలము రాతి కట్టడమనియు చార్‌మినార్ రాయి లేని ఇటుక సున్నపు కట్టడమని చెప్పుతు ఆనాటి వస్తు విశేషములను తెలిపినదీ జానపద వనిత.

తెలంగాణమున గ్రామాధికారి పటేలు. అతని వైభవమును సహజముగా వర్ణించి అతనిని గిలిగింతలు పెట్టు పాటలును కలవు. క్రింద పేర్కొనిన పాట పటేలు స్వరూప స్వభావములు, వేషభూషణములు, పౌరుష పరాక్రమములు తెలుపుచున్నది.

కాటిక్కాయ దారిలోన – కమ్మదారి వద్దు పండె.
నేరనెద్దూ చేను మేసెనో – ఓ పాటేల నేరపూస పారదోలవో
కుంకుంకాయె దారిలోనె – కుసుమ దారివద్దు బండె
నేరనెద్దూ చేను మేసెనో – ఓ పాటేల – నేరుపూస పారదోలవో॥
ముందట వోయె నాగటయ్యా – ముత్యాలంచు దోతులయ్యా
నేరనెద్దూ చేను వేసెనో – ఓ పాటేల – నేరుపూస పారదోలవో॥
ఇద్దూ మిరుస అందొలు ఎద్దుమీద పోసుకొని
ఎద్దు నువ్వు గూడి పోంగనో – ఓ పాటేల – ఎఱ్ఱచెలుక దుమ్మురేగునో
దొడ్డు దొడ్డు దోతులమీద – ఒడ్డినాడె మొలతాడు
దొడ్డిగలుమలెల్లి రాంగనో – ఓ పాటేల – దొడ్డవారి అల్లుడందురూ

2. హోళి పండుగలలో జానపదులు ఆటలు–పాటలు (వ్యా) మునుగోటి యాదయ్య, ఆంధ్రభూమి–11–4–79.

సన్న సన్న దోతులమీద - సాపినాడె మొలతాడు
సందిగలుమ లెల్లి రాంగనా - ఓ పాటేల - సౌదర్ల అల్లుడవందురో-[1].

ఇంతగా పొగడిన గ్రామీణులు ఆ పటేలు తమకేమియు విదల్చకపోయి నప్పుడు బూతుమాటలతో తిట్టిపోయు పాటలును కలవు.

"కిఱ్ఱు కిఱ్ఱు చెప్పుల్ దొడిగి - లంజెవాడ కెల్లిపోంగ
లంజేవదినె గండుకుక్కనో - ఓ - పాటేల - ఏడువాడలెల్ల దరిమెనో॥
ఏలుకున్న ఎండిటాకు - ఉంచుకున్న లంజేకిచ్చి
ఏడ్చుకుంట నీవు రాంగనో - ఓ - పాటేల.-[2]

సామాన్య దినములలో ఇట్లు ఎవ్వరైనను దూషించినచో పటేలు సన్నిహితులు పాడినవారిని చీల్చి చెండాడి యుండెడివారు కానీ, హోళి పండుగ కనుక హాస్యము ఈ పండుగలో ముఖ్యము కనుక వెక్కిరింతలను ఎవ్వరు పాటించరు.

స్త్రీలను వర్ణించునప్పుడు వారి సౌందర్యమును, విలాసములను, బంధువర్గములో వారి గొప్పతనమును వర్ణించు పాటలును కలవు.

కట్నొ కరకంచుచీరె - పెట్నొ జోడుంగరాలు
రాళ్ళ భూమి నడుపలేకనో - ఓ దొరుసాని - రాజుకొక్క మేలుబంపనో
నీలిచీరె కట్టినావు - నీలాల పేరేసినావు
నీసటి యారాండ్ల కల్లనో - ఓ దొరుసాని - నువ్వేమీరి మించివున్నవో
పట్నంబోయి పాటేలు - పట్టుచీరె లంపినాడు
పొగసెల్ల బదులు బంపవో - ఓ దొరుసాని - రాజుకొక్క మేలుబంపవో-[3]

- దీనిలో నీనడుము పిడికెడైన అను ఒక్క మాటతోనే ఈ జానపద వనిత తన దొరసాని సౌందర్య సౌభాగ్యమునంతటిని వెల్లడించినది. తోడి

---

1. సౌదర్ల-చౌదరుల-చౌదరి అనుపదము చతుర్ధహార (-రాజ్యాంశ మయిన నాలుగవ భాగపు పన్నును వసూలు చేయువాడు) అను సంస్కృత భవము-చఉత్తహార-చౌద్దర-చౌద్దరి అయినది తెలుగుదేశమునందలి కొందరు గ్రామాధికారులకు కొన్ని కులములకును, ఈ చౌదరి పదము వ్యవహారమైనది.

2. తె.ప. పాటలు-65. 3. తె. పల్లెపాటలు-పుట-67.

కోదండ్రందరిలోను ఆమెను గొప్పదానిగా చేసి ఉబ్బించినది. పట్టుచీరె పంపిన పటేలుకు పాగాసెల్ల పంపుమను సంప్రదాయమును విస్మరించని జానపదగేయకర్త సంప్రదాయజ్ఞానమును ప్రశంసింపక తప్పదు.

గొప్పింటివారి వేడుకలను తెలుపుటకు "సీత వసంతము" ఒక మచ్చు తునక. ఈ పాటలో సీతాదేవి, రామచంద్రుడు వసంతములాడుట ఇతివృత్తము. సీతాదేవి –

"జపమంటపములోని జగదేక రాము
కనులు మూసుకు జపము చేయుచుండగను
పాదమున అందెను కదలకుండగను
బంగారు చెంబుతో వసంతములు దెచ్చి"

ఈ విధముగా రాముని పాదములకు వసంతము ఆలది పరుగెత్తివచ్చెను. రాముడు కనులు తెరచి చూచి జపము చాలించి ఆమెను వెన్నాడెను. ఆమె కౌసల్య దగ్గరకువచ్చి గట్టిగా కౌగలించుకొనినది–

"ఓ యమ్మ నీ గుండెలదురుచున్నావి
నీతోటి ఆడిన చెలికత్తెలెవరు
నిను బట్టుకొనవస్తె పరిగెత్తివస్తివా?

– అని కౌసల్య సీతాదేవి నాదరముతో చూచి సంగతి గ్రహించినది. పిదప రాముడు కొప్పెర్లతో వసంతము చేయించి సీతపై చల్లుటకు చిమ్మన గ్రోవులతో కౌసల్య యింటికి వచ్చెను. సీతమ్మ లోపల దాగుకొనియుండగా రాముడు కౌసల్య–

"ఓయమ్మ మామీద వసంతముల జల్లి
ముచ్చువలెనే వచ్చి దాగియున్నాది
అంపుము..........–[1]

అని కోరెను. ఈ అల్లరికి సుమిత్ర మొదలగువారందరు కూడ గుమిగూడిరి. రాముని కంటబడకుండ వారందరును కోడలిని ఎత్తుకొని అంతః పురము లోపలికి పోదొడగిరి.రాముడు అడ్డమువచ్చి సీతపై వసంతములు చిమ్మెను.

1.స్త్రీల రామాయణపు పాటలు–99–101.

అంతలో దశరథ మహారాజు గూడ ఆ వార్తవిని అక్కడికి చేరెను. రాముడు "బంగారు చెంబు అర్ధాంగికిచ్చి ముంచగా పోయగా" దశరథుడు చూచెను. "భరతశత్రుఘ్నులను పైడి స్తంభాల చాటునుండి తొంగిచూతురు" అత్తింటను ముద్దుముచ్చట్లలో తేలియాడిన కోడంద్రకు సీతాదేవి ప్రతీక. సహృదయులైన అత్తమామల హృదయమును తెలుపుట ఈ పాట ఉద్దేశమైనట్లు తోచుచున్నది. తమ ముద్దు ముచ్చట్లను చూచి ఆనందించు అత్తమామలుండవలెనను భావము స్త్రీలు ఈ పాటలో వ్యక్తము చేసిరి. ఈ పండుగ సందర్భమున రంగులతోబాటు ఎంతటి శృంగారమును ఒకరిపై నొకరు విఱజిమ్ముకొనినను చేష్టలు మాత్రము తప్పుత్రోవ ద్రొక్కవు.

పు:- హొూళి పండుగ వచ్చినాదే రాజమ్మ రాజమ్మో
హొూళియాట ఆడుదామే
రంగులు దెస్తి రవికెదెస్తి
మేలైన చీరాదెస్తి
హొూళి హొూళిర హొూళి - చెమ్మకేళిర హొూళి
హొూళి యాట ఆడుదామ రాజమ్మ రాజమ్మో.

స్త్రీ :- మానాన్న నిన్ను జూస్తె రాజయ్య రాజయ్యో
నీకు నాకు ఒకటే పట్టి
వద్దన్నదాక హొూళి పట్టి
రంగులొద్దు రవికెలొద్దు
మేలైన చీరాలొద్దు
హొూళి హొూళిరా హొూళి - చెమ్మకేళిరహోళి
హొూళియాట ఆడుదాము
అందరోలె పాడుదాము రాజయ్య రాజయ్యో. -[1]

- ఈ పాట వినుటకు సామన్యముగానున్నను ఇందు కట్టుబాట్లు, నీతి నియమములను దాటజాలని కన్య - ఆమెను వలచి హొూళిపండుగ అను సాకుతో ఆమెను స్వంతము చేసికొననెంచు పురుషుడు కనులకు కట్టినట్లుగా గోచరించు

1. నేను సేకరించినది. పాడినవారు, బుజ్జమ్మ, కోయెడ.

చున్నారు. "హోళి ఆట ఆడుదామ – వరుస గలిపి పాడుదామ?" అని ప్రశ్నించిన రాజయ్యకు రాజమ్మ తండ్రియెడ తనకున్న భయమును తెలిపి రాజయ్య మనస్సు నొప్పించక పండుగ సందర్భమున "హోళి యాట ఆడుదాము, అందరోలె పాడుదాము" అని సమాధాన మిచ్చినది. ఈ పండుగ వావి వరుసల పట్టింపు లేనిది, కనుక అంతటితోనే ఆగి అందరివలె కలిసి ఆడుట, పాడుటవరకే ఉంచినది. కానీ హద్దుమీరి వరుస కలిపి పాడుకొనుటకు యిష్టపడలేదు. ఈ పాటలో హాస్యముగా తండ్రికి తమ ప్రణయము తెలిసిన దండించునను అర్థములో ప్రయోగించిన "హోళి పట్టి" కి వివాహ జీవితమున నొక ప్రత్యేకత కలదు.

తెలంగాణమున ఇప్పటికిని అక్కడక్కడా "ఆషాఢ పట్టి శ్రావణపట్టీల వలెనే "హోళి పట్టి" అను పేరుతో నూతన వధూవరులకు నూతన వస్త్రములతో, మిఠాయి పేర్ల (హారముల)తో మర్యాద జరుపుదురు. పెండ్లి జరిగిన సంవత్సరములో వచ్చు హోళి పండుగకు వరుడు, అతనివైపు పెద్దలు వధువు ఇంటికి వెళ్ళి అందరు కలసి రంగులాడుట, తరువాత వధూవరులకు నూతన వస్త్రములను బహూకరించి, మెడలలో మిఠాయి బిళ్ళలతో గూడిన హారములను వేయుట జరిపెదరు. దీనినే "హొూళి పట్టి" అందురు. పై పాటలోని నాయిక తన తండ్రి కోపమున "హోళి పట్టి" గా వ్యంగ్యముతో చెప్పినది.

ఈ పండుగ ప్రధానముగా ఔత్తరాహులదే అయినను దేశమంతటను వేర్లుపాకిపోయినది. ఇది గమనింపగా ఇరుగుపొరుగు రాష్ట్రముల భాషా సంప్రదాయములు, పండుగలు పబ్బములు – ఇట్లు ఎన్నో విషయములు ఒకరి నుండి ఇంకొకరు గ్రహించి ఆనందించెదరనుటకు ఈ పండుగ ఒక్క చక్కని నిదర్శనము. మొత్తము పైన అందమైన హరివిల్లులాంటి పండుగ హొూళి, జానపద స్త్రీలు పాడు హోళి సందర్భములోని జానపద గేయములు శృంగార రసభరిత కావ్యములు. శృంగారములోని తీరుతెన్ను లన్నింటిని పుణికి పుచ్చుకొనినవీ పాటలు.

ఈ హోళి పండుగవంటి పండుగ ప్రపంచమంతటను ఆచరింపబడు చున్నది. యూరప్ ఖండమున వివిధ దేశములందు ఆచరింపబడు కార్నివాల్ పండుగ హోళి వంటిదియే. ఆ పండుగ యందును రంగునీళ్ళు చిమ్ముకొందురు. జర్మనీ దేశమున ఫిబ్రవరిలో జరుగు కార్నివాల్ చాలావరకు మన హోళిని పోలియుండును.

ఫ్రాన్సులో ఈ పండుగను 'ఒట్మంగల్' అందురు. ఆనాడు ఒట్మంగల్ అను దిష్టి బొమ్మను చేసి పాటలు పాడుచు, నాట్యమాడుచు, భూతులు తిట్టుచు, ఆ బొమ్మను కొట్టుచు స్త్రీ పురుషులూరేగుదురు.

ఊరేగింపు తరువాత బొమ్మను మంటలలో వేసి కాల్చి వేయుదురు. ఇటలీలో ఈ పండుగను ఫిబ్రవరి నెలలో జరుపు కొందురు. దానిని వారు "రెడ్డిక" అందురు. వారము దినములు ఈ పండుగ జరుగును. స్త్రీ పురుషులు పాటలు పాడుచు నాట్యము చేయుచు ఆనందింతురు. గ్రీసులో హెూళివంటి పండుగను ఆచరింతురు. ఆనాడు ప్రేమ దేవతయగు "పెమీనాను" పూజించి విందులారగించెదరు. దీనిని ఫ్లోరెలియా, పలేరికా అనియు వ్యవహరింతురు. ఫ్లోరేలియా అనగా పుష్పోత్సవము. హంగేరిలో జరుగు ఈస్టర్ పండుగ హెూళి పండుగను బోలి యున్నది. ఈస్టరు పండుగ సందర్భమున వచ్చు ఆదివారమున ఇండ్లను అలంకరించి పాటలు పాడుచు నాట్యము చేయుచు రంగునీళ్ళు పరస్పరము చిమ్ము కొందురు. పోలాండులో జరుగు అరిష్న అను పండుగ మన హోళి వంటిది. ఆనాడు స్త్రీ పురుషులు కలసి మెలసి ఆడుచు పాడుచు ఆనందింతురు. సైబీరియాలో జరుగు 'ఇసిలిడి' హెూళిని పోలియుండును. ఈజిప్టువారు వల్లిక అను పేరుతో జరుపుదురు.

బర్మాలో హెూళిని 'టిజాన్' అందురు. ఏప్రెల్ నెల మధ్యన ఈ పండుగ నాచరించెదరు. ఇది పెద్ద పండుగ. రంగునీళ్లకు మారుగా సువాసనలను వెదజల్లు నీళ్లను ఒకరిపైనొకరు చల్లుకొందురు. సింహళమున హోళిక అను బొమ్మను పెద్ద మంటల ముందుంచి పూజింతురు. మరునాటి ఉదయము సువాసన జలములను గాని, మాములు నీటిని గాని చిమ్ముకొనుచు నాట్యము చేయుదురు. నేపాల్‌లో మన వలెనే హోళి జరుపుకొందురు. ఫాల్గుణ పూర్ణిమ రాత్రి రాజభవనము ముందు ఒక స్తంభమును నిలబెట్టి దానిని చెట్ల కొమ్మలు, రెమ్మలు, పువ్వులతో అలంకరింతురు. పెద్ద మంటవేసి పాటలు పాడుదురు. మరునాటి ఉదయము వసంతములోజల్లు లాడుదురు.

లావోస్‌లో రంగునీళ్లతో స్నాన మాచరించుచు తమ పాపములను కడిగి వైచుకొనుచున్నట్లు అనుభూతిని పొంది నూతన సంవత్సరమునకు స్వాగతము పలుకుదురు. –[1]

1.వసంతానికి స్వాగతమిచ్చే హోళి–పాషా–ఈనాడు దినపత్రిక –6–3–1977

వ్రతములను పండుగలను పరిశీలింపగా మనకు ప్రధానముగా కొన్ని అంశములు స్పష్టమగుచున్నవి. ప్రకృతి మానవునికి తల్లి వంటిది. తల్లి వలన మానవుడు ఎట్టి రక్షణమును, ప్రయోజనమును పొందుచున్నాడో అట్లే ప్రకృతి మాత నుండియు పొందుచున్నాడు. దానికి కృతజ్ఞతా సూచకముగా కొన్ని పండుగలను వ్రతములును ఆవిర్భవించినట్లు తోచుచున్నది. వినాయక చవితి, కృష్ణ జయంతి, శ్రావణ మాస వ్రతములు, అట్లతద్ది, ఉగాది మున్నగు వానిని దీనికుదాహరణముగా చెప్ప వచ్చును.

మానవుడు సంఘజీవి. సంఘములోని ఇతర వ్యక్తులతో స్నేహసౌహార్థములు పెంపొందించుకొనుటకు ప్రయత్నించును. ఈ ప్రయత్నమునకు పండుగలు – పబ్బములు ప్రయోజన కరములు. ఆ తరుణముల యందు ప్రజలు పరస్పర ద్వేష భావమును విడనాడి సంతోషముతో గడపుట వలన మనస్సు వికసించి మానవత్వము ఉజ్జ్వల మగును, దీని వలన కలసికట్టుగా ఏ ఆపదనైనను ఎదుర్కొను ధైర్యము, ఏ మహత్తర కార్యము నైనను సాధించు ధైర్యము వారికి కలుగును.

ఆరోగ్య సంపాదనము కూడ ఈ పండుగల లక్ష్యమైనట్లు తోచుచున్నది. ఆయా ఋతువులలో ఆచరించు పండుగలలో ఆరోగ్య సూత్రము లిమిడి యున్నట్లు మనకు స్పష్టమగును. శ్రావణమాసమున పచ్చి శనగలు పంచుట, ఆవిరిలో ఉడికిన వస్తువులను భగవంతునికి నైవేద్యము పెట్టుట, చాతుర్మాస్యముననుఏకాదశుల యందును ఉపవాసముండుట వైద్యుని అవశ్యకత లేక ఆరోగ్యమును కాపాడు కొనుటకే అని మనము ఊహింప వచ్చును. ప్రతి పండుగ నాడును అభ్యంగ స్నానమాచరించుట విధిగా నిర్ణయించుట చూడగా అభ్యంగమునకు ఎంత ప్రాముఖ్యమున్నదో గ్రహింప వచ్చును. వైద్యక గ్రంధములు "అభ్యంగ మాచారేత్ నిత్యమ్ నజరాశ్రమ వాతహా" నిత్యమును అభ్యంగము చేయుట వలన ముదిమి, అలసట, వాత రోగములును నశించునని చెప్పుచున్నవి. ప్రతి దినమును నూనె అంటుకొని స్నానమాచరించుటకు మన దేశమున కేరళులు, వంగీయులు ప్రసిద్ధి. అభ్యంగము నిత్యమును ఆచరింపలేనివాడు పండుగ నాడైనను ఆచరించుట మేలని ధర్మ శాస్త్రజ్ఞులు దీనిని విధించినట్లున్నది. చెవిలో చమురు చుక్కలు వేయుటవలన శిరఃపార్శ్వ కర్ణశూలములు పోయి ఆరోగ్యవంతులగుదురు. తలపై చమురు మర్దించుట వలన నేత్రములకు చలువ

చేయును. ఇట్టి అభ్యంగ స్నానము వెనుక ఆరోగ్య సూత్రములెన్నియో ఇమిడి యున్నవి. మామూలు దినములలో అభ్యంగ స్నానమాడిన ఒళ్లు బద్ధకించిన వారును పండుగ నాటి నియమమును దాట జాలక వెనుకాడెదరు. కొన్ని ప్రాంతములలో "మామిడి, మర్రి, నేరేడు, జువ్వి, అత్తి, పట్టలను నీటిలో నానవేసి ఆ నీటితో అభ్యంగస్నానము చేయుదురు. ఆ నీటితో స్నానము చేయుట వలన మెదడూ, కళ్లూ ఆరోగ్యవంత మగునని చెప్పుదురు. ఆ అయిదు వృక్షముల పట్టలనే "పంచత్వక్కు" లందురు.

ఉగాది, దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగలకు వెల్ల వేయించుట, పండుగరోజున ప్రత్యేకమైన శ్రద్ధతో గృహములను, గృహ ప్రాంగణములను శుభ్రపరచి ఆవు పేడతో కలయంపి(కళ్లపు)చల్లి, ముగ్గులు వేయుట ఆరోగ్యరీత్య చాలా అవసరమైనవని చెప్ప నక్కర లేదు.

"ఏకఃస్వాదు నభుంజీత" ఒంటరిగా తీపి పదార్థములను తినగూడదు. అనగా సంతోషమును ఒక్కడే అనుభవింపకూడ దనియు ఇరుగుపొరుగు వారికి కూడ పంచిపెట్టవలెననియు తెలుగువారి సంప్రదాయము. సంతోష సమయము నందును, ఇష్టార్థము సిద్ధించినప్పుడును ఆనంద సూచకముగా ఇతరులకు పారితోషకములిచ్చుట మానవుని స్వభావము. ఈ స్వభావమునకు విరుద్ధ వ్యక్తులును ఉండవచ్చును. సంతోష సమయమున అనగా పండుగ నాడైనను కొంతైనను దానమాచరించి జీవితమును సార్థకము చేసికొనుటకు దానధర్మము లను పెద్దలు నిర్ణయించినారు. ఇట్లే పూజలు కూడ పండుగల యందును, వ్రతముల యందును విధిగా ఆచరించబడుచున్నవి. సర్వ శక్తుడైన భగవంతుని నిత్యమూ ధ్యానింపలేక పోయినను ఏదో ఒకనాడైనను ధ్యానించి కృతజ్ఞతను తెలుపుకొనుట కూడ వ్రతోత్సవముల ఉద్దేశము. ఆనాడైనను నియమ నిష్ఠలతో మానవుడు మనస్సును కొంత సేపైనను చిక్కబట్టి అంతర్ముఖుడై మంచి చెడ్డలను గ్రహింపగల వివేకమును సంపాదించుటకు వ్రతములు తోడ్పడుచున్నవి.

పండుగలు ప్రకారాంతములుగా కుటుంబ కళా ప్రదర్శనములు అనవచ్చును. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలు స్త్రీల కళా చాతుర్యము నకును, కళాభిరుచికిని నిదర్శనములు. నవరాత్రి, సంక్రాంతి మొదలైన పండుగల సందర్భములలోని బొమ్మల కొలువులును, వివిధ వర్ణముల రంగవల్లులును యువతుల కళా స్పర్థను సూచించును.

పండుగలు చర్విత చర్వణముగా తిరిగి వచ్చునవైనను మానవాళికి ఒక వినూత్నశోభను తెచ్చుచున్నవి. ప్రతి పండుగలోను ఒక ఆదర్శము ఒక ప్రత్యేకత ఇమిడి ఉన్నవనుట స్పష్టము. పుణ్యము, పురుషార్థము, ఆనందము, వినోదమును ఏకోన్ముఖముగా అందించు ఆచారములే ఈ పండుగలు; సంస్కృతి సంప్రదాయములు సమిష్టిగా అందించిన వేడుకలే ఈ పండుగలు.

గ్రామదేవతలు – జాతరలు :

ప్రతి గ్రామమునకు గ్రామదేవతలుందురు. వీరిలో పోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, బాలగమ్మ, ముత్యాలమ్మ, మొదలగు వారు ప్రసిద్ధులు. గ్రామములలో నెట్టి అంటువ్యాధి సోకినను, దానికి కారణము – గ్రామదేవతల కోపమని భావించి వారిని శాంతింప జేయుటకు సాకను పెట్టుట, బలులిచ్చుట పరిపాటి. గ్రామము నందు ప్రతి సంవత్సరము తప్పక ఒకమారు గ్రామదేవతకు అర్పించుటకై "బోనముల" ను తీయుట, జాతర జరుపుట – జరుగును. గ్రామీణులందరును ఈ జాతరలో పాల్గొందురు. దేవతను ఊరేగించుట, నృత్య సంగీతములు, కావలసినంత అల్లరి ఈ మహోత్సవములలో నుండును. ఉత్సవ వైభవము గ్రామీణులు ధన వ్యయమును చేయుటను బట్టియు దేవాలయ ధర్మాధికారుల ఐశ్వర్యమును బట్టియు ఉండును.

ఈ గ్రామదేవతల జాతర సందర్భమున పాడు పాటలో పురుషులే పాల్గొందురు. రెండు మూడు రోజులకు సరిపోవునంతటి దీర్ఘగేయములను వారు ఆలాపింతురు. గ్రామీణులు జరుపు జాతరలో "బీరన్నజాతర" చెప్పుకోదగినది. ఈ జాతరను "బీరప్ప పండుగ" అందురు. ఈ పండుగ సందర్భమున ఆడుబిడ్డలను, అల్లుంద్రను, బంధువులను తమ ఇండ్లకు పిలిపించుకొని, గృహములను అలంకరించుకొని, ధనవంతులు పేదవారలను భేదము లేకుండా జాతరలో పాల్గొందురు. ఇది తెలంగాణమున జరుగు గొప్ప వేడుక. దీనిని ప్రతి సంవత్సరము కాక ఐదారు సంవత్సరముల కొకమారు జరుపుకొందురు. కనీసము పంద్రెండు సంవత్సరములు దాటకుండగా ఈ జాతరను జరుపుకొనక పోయిన గ్రామమునకు అరిష్టము ప్రాప్తించునని గ్రామీణుల విశ్వాసము.

ఈ జాతరలు జరుగు సమయమున ఊరి వారందరికిని సంగతి చాటింపు ద్వారా తెలియజేయుట గ్రామములలో ఆచారము. ఆ చాటింపును విని ఊరి వారు జాతరలు జరుగు సమయమునకు ఇరుగు పొరుగు గ్రామముల నుండి తమ బంధువు లను పిలిపించుకొనుటకు ఉత్సాహపడుదురు. ఈ చాటింపును గురించి డా॥ విజయభారతి గారు బద్దెపూడి ఎఱ్రభూపతి రచించిన యువజన హృదయానందము "రఘునాథీయము" అను అముద్రిత కావ్యము నుండి ఈ క్రింది పద్యమును ఉదాహరించిరి.

"కూతుర యేమి సేతునిక కూనల దేవికి జాతరంచు యీ
రాతిరి చాటనింట నొక రాగిని కుట్టిన కాను సైతమున్
చేతనులేదు పండుగెటుచెల్లు నటుంచును వేశ్యమాత జా
మాతవినంగ పల్కి కడు మాయల పన్నుగదోచుపో (జో) గులన్" –[1]

దీనిని బట్టి జాతరల చాటింపు విధము పూర్వము నుండియు ఆచారము నందున్నట్లు తెలియుచున్నది.

భక్తులు అభీష్టము సిద్ధించి నప్పుడు సాక పెట్టుట (సాకను పోయుట), బలులనిచ్చుట గురించి ఇదివరకే పేర్కొనబడినది. సాకపెట్టు ఆచారమును సింహాసన ద్వాత్రింశిక తడవినది. –[2]

ఈ సంప్రదాయము అతి ప్రాచీన కాలము నుండియు ఆంధ్రదేశమునందు న్నట్లు సురవరం ప్రతాపరెడ్డిగారు "దేవత ముందు నిండు కుండయందు నీరు పోసి నైవేద్యమును పెట్టుటను సాకపోయుట అందురని" – తెలిపినారు–[3] కాని నేటి గ్రామములలోని ఆచారమును బట్టి చూడగా నీరుకు మారుగా కల్లును సాకపోయుట అలవాటులోనున్నది.

గ్రామ దేవతాలయములలో కోళ్ళను, మేకలను, గొర్రెలను బలియిచ్చు ఆచారము నేటికిని కలదు. ఈ బలియిచ్చిన జంతువుల రక్తమును, తలలను

1. దక్షిణాంధ్ర వాఙ్మయము–సంఘజీవితము(అముద్రితము) సిద్ధాంతవ్యాసము (Vol.I)
2. సింహాసన ద్వాత్రింశిక–భాగము–1–పుట–85.
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర–పుట–108.

దేవికి అర్పించెదరు, పిదప మిగిలిన అవయవములలో గ్రామమునందలి పటేలు మొదలగు గ్రామాధికారులకు వంతుల ప్రకారము ముట్టజెప్పి మిగిలిన భాగమును బలియిచ్చిన గ్రామీణుల కిచ్చివేయుదురు. ప్రత్యేకముగా జంతువుల కాలేయమును చిన్న చిన్న ముక్కలుగాచేసి అమ్ముదురు. ఇది అమ్మవారి ప్రసాదముగా భక్త జనము డబ్బు పెట్టి కొని, నిప్పులపైన కాల్చుకొని తిందురు.

పూర్వకాలమున తెలుగుదేశమున శక్త్యాలయములలో నరబలులిచ్చెడి ఆచారముండెనని తెలియుచున్నది. ఈ దేవాలయములను "సంపుడు గుడులు" అని వ్యవహరించుచుండిరి. సింహాసన ద్వాత్రింశికలో దీని ప్రస్తావము కలదు. –[1]

గ్రామ దేవతాలయముల పూజలను, బలులను గూర్చి శుకసప్తతి చక్కని దృశ్యమును చిత్రించినది. –[3]

గ్రామ దేవతలకు బలులిచ్చు ఆచారమును రైట్ రెవరెండ్ హెన్రీ వైట్ హెడ్ పేర్కొనుచు ఏలూరు సమీపములోని ధర్మాజి గూడెములోని ఒక సంఘటనను వివరించెను. –[1]

ఆషాఢ శ్రావణ మాసములలో పోచమ్మకు జాతర జరుగును. ఈ జాతరలో బోనముల నెక్కించెదరు. జాతరలనిన జానపదులకు ప్రాణపదము. నిజమునకు జాతరలు భక్తికి మాత్రమేకాక నవరసములకును నిలయమైన కళాస్వరూపములనవచ్చును. జాతరలలో దేవతా విగ్రహములను పురవీధులలో నూరేగించునప్పుడు పురుషులు వివిధ వాద్యముల కనుగుణముగా చిందులు త్రొక్కుట, కత్తులు, కర్రలు త్రిప్పుట, సి(శి)గముల నూగుటమున్నగు పనులతో తమ భక్త్యావేశములను తెలుపగా, మహిళలు శుచిగా చిత్తారి పనితనము గల బోనపు కుండలను తలపై పెట్టుకొని నేటి సర్కసులోవలె చూపరులకు అద్భుతము గొల్పుచు మెడ నటునిటు త్రిప్పక నాట్యమునందు తలపై నిడుకొనిన కలశమును కదలనీయక ఏకాగ్రచిత్తయయిన నట్టువకత్తెవలె బారులు తీర్చి నడచుచు శ్రద్ధాసక్తులను, కళాసంపదను ఆవిష్కరింపగా, అదియొక మహాద్భుత లోకమువలె

1. సింహాసన ద్వాత్రింశిక భాగము 1–పుట–78.
2. శుకసప్తతి పాలవేకరి కదిరీపతి–2.
3. The village Gods of South India - by R. Rev. Henry whitehead - pp.68, 69
4. సిగములు స్త్రీలును ఊగుదురు.

కన్పించును. "కొన్ని ప్రాంతములలో తెరచాపలవంటి వస్త్రములతో ప్రభలను నిర్మించి మేకులపై నెత్తి ఊరేగింపు తీసికొనిపోవుదురు. అప్పుడు భక్తులు కత్తులు మొదలయిన ఆయుధములను దాల్చి వీరత్వముట్టిపడునట్లు "అశ్శరభశరభా, అల్లల్ల భీరా! నీ గ్రుడ్లు తీయిస్తునా? నీ పళ్ళు పీకిస్తునా? అని భీకర నాదములు చేయుచు పోవుదురు"–[1]

ఇట్టి జాతరలలో ప్రేమికులు కలసికొనుటకు అవకాశమెక్కువగా నుండును. ఎల్లమ్మ, పోచమ్మవంటి క్షుద్ర దేవతోత్సవములను జాతరలనియు, నరసింహస్వామి, చెన్నకేశవస్వామి, భ్రమరాంబవంటి దేవతోత్సవములను తిరునాళ్ళనియు వ్యవహరింతురు. జానపదుల దృష్టిలో జాతరయైనను, తిరునాళ్ళయినను ఒక్కటే. రెంటియందును సమానమైన భక్తి భావముతో పాల్గొందురు. స్త్రీలు ఈ ఉత్సవములలో పాల్గొనుట మాత్రమే ఉండునుగాని జాతరకు సంబంధించిన దేవతల కథలు పాడుట ఉండదు.

ఒక ఇల్లాలు జాతరకు వెళ్ళదలచినది. ఆమె భర్త అనారోగ్యముతో వెంబడి వెళ్ళలేని స్థితిలో నుండెను. ఆమె అతనిని సూది మందు (ఇంజక్షను) తీసికొని తొందరగా జబ్బు నయము చేసుకొని తన వెంబడి రమ్మనుచున్నదీ

క్రింది పాటలో :–

సూదిమందు ఏసుకో నాయి లింగో రాజలింగం
సూడపోరా జాతరలన్ని నాయి లింగో రాజలింగం
ఏడూపాయల జాతర యెల్లి నాయి లింగో రాజలింగం
ఏలు మొక్కుల దుర్గను కొలవు నాయి లింగో రాజలింగం
అదగిరి గుట్ట నెక్కి నాయిలింగం రాజలింగం
ఆదయ్యను మొక్కురా నాయిలింగం రాజలింగం
సమ్మక్క జాతరకెల్లి నాయిలింగం రాజలింగం
సమ్మక్కకు దండం బెట్టయ్యో నాయిలింగం రాజలింగం
యముడాల జాతరయెల్లి నాయిలింగం రాజలింగం
ఎయ్యిలా లచ్చల పూజలుచేయు నాయిలింగం రాజలింగం

1. లక్ష్మీరంజన వ్యాసావళి–పుట–128.

పిల్లా జల్లా సల్లంగుండ నాయిలింగం రాజలింగం
ఎల్లా దేవత లేదుకుందము నాయిలింగం రాజలింగం. –[2]

ఈ పాట తీరునుబట్టి ఆధునిక వైద్య పద్ధతి వ్యాప్తినందిన తరువాతిదని తెలియుచున్నది.

జానపదులలో ఆస్తికత్వమే అధికము. వారి జీవిత గమనములో మంచి చెడులకు భగవంతునిపైననే భారము మోపి యుందురు. చెడు జరిగిన తమ దురదృష్టముగా భావించి భగవంతుని ఒకటి రెండు మాటలతో తిట్టి సరి పెట్టుకొందురు. మంచి జరిగిన తమ గొప్పదనము నేమాత్రము ప్రశంసించుకొనక దైవమే తమకా సదుపాయములను కలిగించినాడని మరి మరి చెప్పుకొందురు.

"చీకటి కోనలో నేనొక్క దాన్ని
శివుడు నాకిచ్చిండు చిన్ని బాలల్లా
నా చిన్ని బాలలకు పాలు లేవాని
పరమేశుడిచ్చిండు పాడియావుల్లా
పాడావుల మందకు నీళ్ళు లేవాని
వసుదేవుడిచ్చిండు వరుస కాల్వల్లు"

"శివుడు చిన్ని బాలలను తనకివ్వడమే" కాక వారి పోషణార్థమై పాడి యావులను కూడ ప్రసాదించినాడు. పాడియావుల మందకు నీళ్ళు లేవని వసుదేవుడు నీటి కాల్వల నిచ్చినాడట. వరుణ దేవుడనుటకు మారుగా వసుదేవుడని పేర్కొనినారేమో ననిపించుచున్నది". 'పుట్టించిన వాడు పోషించక మానుతాడా' అనునట్లు పిల్లలతోబాటుగా దైవమే పిల్లల ఎదుగుదలకు దోహదముగా అవకాశములను కల్పించినాడని ఆ జానపద మాతృమూర్తుల నమ్మకము. ఈ పాటలోనే–

"ఐతే నిను గన్నతల్లి అవిరేణుమంగు
మంగు నిను గన్నతల్లి మావిడాల ఎల్లి
ఎల్లి నిను గన్నతల్లి ఏకాంబ్రజ్యోతి
ఏకాంబ్ర జ్యోతమ్మ ఎవరాడపడుచు

1. నేను సేకరించినది–పాడినవారు మల్లమ్మ–సూర్యాపేట్.

మాదిగోరి ఆడపడుచు మదపుటేనగ
గోసంగి చెల్లెలమ్మ కొమ్ము టేనుగ-[1]

- ఏకాంబ్రజ్యోతి అనగా అరుంధతి అని జానపదులలో వాడుక. అంతే గాక అరుంధతీదేవి మాదిగవారి ఆడపడుచు అనుచు తమ కులదైవముగను పేర్కొనినారు.

మాల మాదిగవారు ప్రత్యేకముగా గొంతాలమ్మ పండుగ జేసెదరు. గొంతాలమ్మ మాదిగవారి కులదేవత. గొంతెమ్మను గూర్చి ప్రసిద్ధమైన పాట సెలయేరులో కలదు-[2]

తిరునాళ్ళకు వెళ్ళుట యను ముచ్చట ఆడమగ భేదము లేకుండగా నుండును. తిరునాళ్ళలో ఎన్నాళ్ళనుండియో మనసుపడిన ప్రేయసీ ప్రియులకే గాక, కన్ను వేసిన వారికి పడతుల చెంత చేరుట మొదలగు పనులకు అవకాశము బాగుగా నుండును. అట్టి పొరపాట్లు జరుగకుండ జాగ్రత్త పడుమని హెచ్చరించుచు ఒక తల్లి బిడ్డతో-

"ఎల్తే ఎల్దువుగాని ఎంతో జాగ్రతయమ్మి" -[3]

యని హెచ్చరించుచున్నది. తన కూతురు ఏడు తరములు అటు నిటు మంచి పేరు సంపాదించవలెనని ప్రతి తల్లియు కోరును. తన పిల్లలు ఎటువంటి తప్పు చేయకూడదనుట మాతృమూర్తి మనస్తత్త్వము.

సామాన్యముగా భగవంతుని తమకంతయు మంచియే జరుపించుమని దండము పెట్టు కొందురు మానవులు. తమ మంచితో బాటు ప్రక్కవారి చెడుపును కాంక్షించు వారును ఉందురు. అనుకూలమైన పరిస్థితులు తనకు ఏ విధముగా చేకూరునని తలంచుచు ఒక చెడ్డ యిల్లాలు.

"మొక్కిన మొక్కులు సల్లగుండీ
మొగుడి కళ్ళు పోతే-నా
మొగుడి కళ్ళు పోతే, కట్టమీద ఆ అంకాళమ్మకు

---

1. తె.పల్లె పాటలు పుట-117.
2. సెలయేరు-50,51. 3. పల్లెపదాలు-112.

పెట్ట కోళ్ల నిస్తూ, దండుకు పోయిన యిద్దరు మరుదులు
గుండ్లు తగిలి సస్తే - పెద్ద గుండ్లు తగిలి సస్తే,
సాతులూరి యా పోతురాజుకు, మేక పోతునిస్తు
సంకేనవున్నా చంటి బిడ్డకు
సన్ని గొట్టిపోతే - మాయ
సన్ని గొట్టి పోతే
సత్తె నపల్లీ గోపాలుడికి
నిత్తె పూజ సేతు,–[1]

అని కోరికలను కోరినది. చెంతనున్న మరదులతో మనస్పర్థలు వచ్చి వారితో పోట్లాడి, వారి పీడ విరుగడై పోవునట్లు కోరినదనిన సరిపెట్టుకోవచ్చును. కాని దండుకు వెళ్లిన ఇద్దరు మరదులును చచ్చిన పోతరాజునకు మేక పోతు నిచ్చెదనని మొక్కు కొనుట ఆమె కర్కశత్వమును తెలియజేయుచున్నది. అంతే గాక తన చంటిబిడ్డకు, మగనికి కూడా కీడును ఆలోచించినదనిన ఆమె యెంతటి కఠినురాలో వ్యక్తమగుచున్నది.

ఇట్లే జాతరల సమయమున ఉత్సాహముతో పాడు పాటలలో స్త్రీ పురుషుల మనస్తత్వము, ప్రేయసీ ప్రియుల మధ్యనుండు సంబంధముల తీరులు స్పష్టముగా వ్యక్తమగును.

ప్రకృతి ఒడిలో పెరిగిన మానవుడు ప్రకృతి వైపరీత్యములకు భయపడి ప్రకృతిని ఆరాధించుటతో ప్రారంభమైన సగుణోపాసన విశ్వమంతటను వేయి కళారూపములతో విరాజిల్లినది. ఒకచోట అంబరచుంబి దేవమందిరములుగా వెలసినది. మరియొకచోట కరుణమయ భక్తికావ్య స్రవంతిగా ప్రవహించినది. ఇంకొక చోట వ్రతములుగా పండుగలుగా వ్యాపించినది. ఆ రూపములలో ఒకటి వ్రతోత్సవ గేయ సముదాయము. ఇది జానపద మహిళల సంప్రదాయ అభిరుచితో పరిరక్షితమై జీవనది వలె తరతరములుగా జాతికి సంక్రమించినది. వ్రతాచరణమున వేద మంత్రముల కెంత ప్రాధాన్యమున్నచో ఈ గేయములకును అంతటి ప్రాధాన్యమున్నది.

---

1. పల్లె పదాలు - 236.

శ్రామిక గేయములు

ప్రాచీన కాలము నుండియు మానవుడు పరిశ్రమజీవి. ఆటవిక స్థితిలో ఆహారమునకును, రక్షణమునకును పరిశ్రమించుట పెక్కు వృత్తులకును, హస్తకళల కును మూలమైనది. పరిశ్రమ వలన వృత్యాదులేర్పడినట్లే వృత్తుల వలన దేహ పరిశ్రమ యేర్పడును. ఈ విధముగా శ్రమయు వృత్తియు అన్యోన్యాశ్రయములై అనాది కాలము నుండియు మానవుని సంఘ వ్యవస్థను లక్ష్యమును మార్చుచునే యున్నవి.

సంఘ వ్యవస్థ మారిన కొలదియు పరిశ్రమ స్వరూపమును మారు చుండును. మానవుడు పూర్వము కష్టసాధ్యమైన పరికరములతో శ్రమపడి సాధించిన వానిని నేడు యంత్రముల తోడ్పాటుతో అనాయాసముగా సాధింప గలుగుచున్నాడు. నూతన యంత్రముల ఆవిష్కారముతో మిగిలిన శ్రమ మరికొన్ని నిర్మాణములకు కారణమగుచున్నది. శ్రమ యనునది మానవునికి ఎన్నటికిని తరుగని అమూల్యమైన మూలధనము. దీనిని గురించియే నేడు నూతన ఆర్థిక సిద్ధాంతములు బయలువెడలినవి. ఈ శ్రమ సిద్ధాంతమునకు మూలపురుషుడు అనదగిన వాడు కారల్ మార్క్సు. ఇతని సిద్ధాంతము నేడు కొన్ని దేశములలో రాజ్యాంగ వ్యవస్థకును, పాలన వ్యవస్థకును, సంఘ వ్యవస్థకును చుక్కానియైనది.

శ్రమయును వృత్తులును పరస్పరాశ్రయములు గనుక వృత్తుల వలన నేర్పడు శారీరక శ్రమను పోగొట్టుకొనుటకు మానవుడు కనుగొనిన ఉపాయములలో నొకటి గేయము. పరిశ్రమించు మానవుని ముఖము నుండి ఈ గేయము స్వచ్ఛందముగా వెలువడి అతని శ్రమను పోనడచును. అదియే క్రమముగా శ్రామిక గేయ సాహిత్యముగా రూపొందినది. ఇట్టి సాహిత్యమునకు మూలకారణ మైన వృత్తులను, వాని వలన కలిగిన శ్రమను, వీని పరస్పర సంబంధములను పరిశీలింతము.

మానవుని శ్రమ జీవితమును దృష్టియందిడుకొని వృత్తి అను పదమునకు గల అర్థములలో జీవనోపాయము అను అర్థమును ప్రధానముగా గ్రహింప వచ్చును. శబ్దరత్నాకరమున జీవనోపాయము చతుర్విధములుగా విభజింపబడినది. అవి – కృషి, పాశుపాల్యము, వాణిజ్యము, సేవ. –[1] వీనిలో వాణిజ్యమున కాయకష్టమునకు ఆవశ్యకత తక్కువ కావచ్చును గాని కృషి, పశుపాలనము, సేవ– అను మూడింటిలోను కాయకష్టము పాలెక్కువ. ఈ కాయకష్టము చేయువారు అధిక సంఖ్యాకులు జానపదులే గనుక శ్రమకు సంబంధించిన పాటలు గ్రామములలో బహుముఖముగా వ్యాపించినవి. పాటక జనమునకు రెక్కాడిననేగాని డొక్కాడదు. వారు చేయు పనులలో కలుగు శ్రమను పోగొట్టుకొనుటకు డా॥ గంగప్ప గారన్నట్లు – "కొంతైన శ్రమను మరచిపోయి, ఉత్సాహముతో, హాయిగా ఉండవలెనని తలంచి తదుచితముగా పాడుకొనిన పాటల సంఖ్యే అధికము"–[2] ఈ పాటలు ముఖేముఖే సరస్వతి అనునట్లుగ వృత్తులతో సంబంధములేని జానపదుల నాలుకలపై సహితము నాట్యము చేయుచుండును.

కమ్మరము, కుమ్మరమువంటి వ్యవసాయేతర వృత్తులును కొంతకు కొంత వ్యవసాయమునకు సంబంధించినవే. కమ్మరి లేనిదే నాగేటి కర్రు లభింపదు. వడ్రంగి లేక నాగలి రూపొందదు; మేదర లేక ధాన్యము భద్రపరచు గాదెలు, గంపలు మున్నగునవి లభింపవు. ధాన్యమును తూర్పార పట్టవలెననిన మేదర్లు అల్లిన చేట అవసరము. పండిన ధాన్యమును అమ్ముటకును వానికి మారుగా తక్కిన వెచ్చములను కొనుటకును అంగళ్ళు, వ్యాపారులు తప్పనిసరి.

ఇట్లు గ్రామము పలు వృత్తులకాకరమై తేనెతెట్టువలె దినదినము చైతన్య విలసితమైయుండును.

ప్రస్తుతము నా పరిశీలనాంశమున శ్రామిక గేయములలో స్త్రీ సంబంధి గేయములకు ప్రాధాన్య మివ్వబడినది.

స్త్రీల శ్రమ ప్రధానమైన గేయములను రెండు విధములుగా వింగడింపవచ్చును. ఈ రెండు విధములకును గేయములుపలబ్ధమగుచున్నవి. 1. వ్యవసాయ ప్రధానములు; 2. గృహ పరిశ్రమలు. వ్యవసాయ ప్రధానములలో

1. శబ్దరత్నాకరము–పుట–728
2. తెలుగు దేశపు జానపద గీతాలు. డా॥ ఎస్. గంగప్ప–పుట–9.

కేవలము వ్యవసాయమునకు సంబంధించిన అనగా వ్యవసాయమును సాగించుటకు కావలసిన నీటివసతులను సమకూర్చుకొనుట మొదలు పంటలను పండించి పంటను ఇంటికి చేర్చుట వరకు గల గేయములు చేరును. గృహ పరిశ్రమలలో ఇంటనే యుండి కేవలము స్త్రీలే నిర్వహించు దంపుళ్ళ వంటి పనులకు సంబంధించిన గేయములు చేరును.

1. వ్యవసాయ ప్రధానములు :

ఆదిమ మానవుడు ప్రకృతి సిద్ధమైన సంపదపైననే ఆధారపడి జీవించెను. నాగలిని చేత బట్టుట, భూమిని దున్నుట, పంటలను పండించుట అను విషయములు అతనికి తెలియవు. జానాభా పెరుగుటతో బాటుగా అతడు జీవనోపాధికి మార్గములను అన్వేషించ మొదలిడెను. శ్రీ నండూరి రామమోహన రావు గారన్నట్లు "కేవలము ప్రకృతి పైననే ఆధారపడితే పెరుగుతున్న జనాభాకు చాలదు. వాటిని తమంతట తాము పండించడము సాధ్యమని తెలుసుకోవటము తోనే వ్యవసాయము ప్రారంభమైనది".–[1] నాడు మొదలు నేటివరకును వ్యవసాయమే వృత్తిగా జీవించువారి సంఖ్య ఎక్కువ. వ్యవసాయము గ్రామీణుల భాగ్యసంపద.

ఈ వ్యవసాయము ఒంటరిచేయు పనిగాదు. ఇది సమష్టి కార్యము. వ్యవసాయమునకు సంబంధించిన ఏ పనియైనను – ఊడ్పులు మొదలు నూర్పుల వరకు ఇతరుల సహాయము ఆపేక్షితము. ఒక హిందీ జానపద కవి వ్యవసాయము ఒంటరివాని పని కాదని ఒక చక్కని గీతము పాడెను.

'జో అకేలే ఖేతి కర్ తా హై
ఔర్ అకేలే మార్ పీట్ కర్ తా హై
ఘాసు కహతే హై – వహ్ దోనో
సదాహార్ ఖాతే హై. –[2]
(ఒంటరిగా సేద్యము చేసేవాడు
ఒంటరిగా పోరాటము సాగించేవాడు

1. నరావతారం–శ్రీనండూరి రామమోహన రావు–పుట–61
2. గ్రామసాహిత్య (హింది), తీన్‌రా భాగ్, రాజనరేశ్ త్రిపాఠీ, –పుట–61

ఘాసు చెప్పుతున్నాడు - వారిద్దరు

ఓడిపోతారెప్పుడూ).

ఈ కాలమున విజ్ఞాన శాస్త్రాభివృద్ధి వలన ఒకే భూమిలో మాగాణి పంటలను, మెట్ట పంటలను పండించుటయు, ఒకే క్షేత్రమున మూడు పంటలు పండించుటయు, ధాన్యమును కూరగాయలను మార్చిమార్చి వేయుటయు జరుగుచున్నవిగాని పూర్వము ఒకటి రెండు పంటలు మాత్రమే పండించుచుండు వారు. తొలకరి రాగానే దుక్కి దున్నుట ప్రారంభమై ఆయా వృత్తుల వారికి పనులు ప్రారంభమగును. మూడు నెలల పంటలు భాద్రపద మాసమునకు, నాలుగు నెలల పంటలు పుష్యమాసమునకు సిద్ధమై ఎటుజూచినను సస్యలక్ష్మి, ధాన్యలక్ష్మి తాండవ మాడుచున్నట్లుండును. ఆయా సందర్భములలో గ్రామీణులు పాడుపాటలు ఎన్నియో సహస్రాబ్దుల క్రిందటి మన పూర్వుల వేదబుక్కులను తలపించుచుండును. వానలు కురిసినప్పుడును, పిడుగులు పడినప్పుడును, ప్రకృతి తన రమణీయకములు వెలార్చినప్పుడును ప్రాచీన ఋషులు సూక్తములను పలికి నట్లే గ్రామీణులును గొంతెత్తి పాడుదురు.

గ్రామీణుల దృష్టిలో సొంత భూమిని మించిన ఆస్తి మరొకటి లేదు. సొంత భూమిని కన్నబిడ్డతో సమానమని భావించిరి. "ముసలితనానికి సొంత భూమైన ఉండాలి, వయసులోకన్న కొడుకైన ఉండాలి" తర్రైనబర్రైన తన చేను పండాలి, కుంటైన, గూనైన తన కడుపు పండాలి" అను నమ్మకముతో వారు భూమిని సంపాదించుటకు పూనుకొనినారు.

ప్రకృతి ఒడిలో జీవించిన మానవుడు ఋతువుల మార్పును గమనించి ఋతువుల కనుకూలముగా సేద్యమును ప్రారంభించెను. కార్తుల ననుసరించి విత్తనములను చల్లెను. ఈ అనుభవముతో నేర్చుకొనిన విద్యను తరువాత తరముల వారికి అందించెను. ఈ అనుభవజ్ఞానము ఆధునిక ఖగోళ వాతావరణ శాస్త్రమున విరుద్ధము కాదు. వారి అనుభవము పండిన సూక్తులు ఎన్నియో సామెతలుగా రూపొందినవి. వానిలో కొన్నింటిని వారి అనుభవ వైవిధ్యమును తెల్పుటకు ఉదహరించెదను.

మృగశిర విత్తితే మురిగి మురిగి కాస్తుంది (ఎక్కువగా కాయుననుట)

ఆరుద్రకురిస్తే దారిద్ర్యం ఉండదు.

ఆరుద్రలో అడ్డెడు చల్లినా పుట్టెడు పంట,
ఆశ్విని కురిస్తే అంతా నష్టం,
భరణి కురిస్తే ధరణి పండును,
కృతిక పునర్వసులు సత్తువ పంట,
మఖలో మానెడల్కిందొొక్కటే,
పుబ్బలో పుట్టెడలికినా ఒక్కటే,
పుబ్బలో విత్తడంకంటే ఊరుకోవడం మేలు,
పుబ్బలో చల్లినా బూడిదలో చల్లినా ఒక్కటే,
ఆశ్లేషలో పూచిన ంతులేని పంట,
ఉత్తర పదును ఉలవకు అదును,
చిత్తలో చల్లితె చిట్టెడూ కావు,
స్వాతి కురిస్తే సముద్రాలు నిండుతాయి,
అనురాధలో అడిగినంత పంట,
జ్యేష్ఠ చెడకురియును,
మూల మురుగ కురియును,
విశాఖ వర్షం ఆముదాలకు హర్షం,

మిధునంలో మొలచిన మీసకట్టున పుట్టినకొడుకు అక్కరకు వస్తారు.

భాద్రపదం వానలు పైరులకు మంచిది,
మాల పున్నం ముందు మాదిగైనా చల్లడు,
కన్యలో చల్లితే ఊదుకు తినడానికి ఉండదు,
తులలో వానలు పొలానికి మేలు,
ఎద్దులేని సేద్యం చద్దిలేని పయనం,
తొలకరి వానలు మొలకలకు తల్లి,
మనుచూచి వ్యవసాయం, మిన్నుచూచి విత్తనం,
క్షేత్రమెరిగి విత్తనం, పాత్రమెరిగి దానం,
కంచెలేని చేను తల్లిలేని బిడ్డ,
దుక్కికొద్ది పంట బుద్ధికొద్ది సుఖం,
పత్తిపంటా పాడియావూ ఒక్కటే

అదనుతప్పిన పైరూ, ముదిమిలో పుట్టిన బిడ్డలూ ఒక్కటే,
దున్నేరోజుల్లో దేశం మీదికిపోయి కోతల కాలంలో కొడవలి పట్టినాడట,
కాలంలో విత్తనాలు కలలోనైన పోయాలి.
జొన్నపంటకు మన్ను బలము కావాలి,
నువ్వులకు ఏడు దుక్కులు ఉలువకు ఒక దుక్కి.

జొన్న చేను క్రమాభివృద్ధిని సూచించు క్రింది పాటలో వారి జ్ఞానము ఎంత నిక్షిప్తమయి యున్నదో చూడవచ్చును.

"మఖలో జల్లేరు మా జొన్న! నిన్ను
ఉత్తర హస్తలలో జల్ల ఉత్తవైపోవే!
స్వాతి కార్తిలో జల్లగ జూచి
విశాఖలో నొక్క విసురు విసిరేను
ఉంద్రాళ్ళ తద్ది ఉంద్రమంతుండి
అట్ల తద్దినాటికి అట్టంత పెరిగి
చిత్తకార్తిలోను శృంగారించుకొని
మొదలు తన్నిన ఏడు గింజలురాలు–[1]

వ్యవసాయ ప్రధానమగు స్త్రీల పాటలలో ఈ క్రింద పేర్కొనిన పనులకు సంబంధించిన పాటలు ప్రచారమునందు గలవు. 1. వానపాటలు, 2. విత్తనములు చల్లుట, 3. నాట్లు, 4. కలుపు తీయుట, 5. చేనికావలి, 6. కోతలు, 7. నూర్పులు.

వాన పాటలు :

ఏ దేశమునందైనను దేవ మాతృకములగు పంటలే యెక్కువ. దేవమాతృకములనగా వర్షముపై నాధారపడి యుండునవి. పూర్వము నుండియు ప్రజలందరు వ్యవసాయమే ముఖ్యవృత్తిగా గలిగి వ్యవసాయముపై నాధారపడిన వారగుటచే సకాలమునకు వర్షములు కురియకపోయిన వారి జీవనోపాధి జరిగెడిది కాదు. అతివృష్ట్యనావృష్టి దోషములచే పంటలు పాడైన వారి దుర్భర స్థితికి అంతుండదు. కనుకనే ప్రకృతిదేవి యనుగ్రహము కొరకు ఆరాటపడిన మానవుడు విసుగెత్తి తన ప్రక్కననే పారుచున్న నదులకు కాలువలను కట్టి వినియోగించుకొనుటకు అనాది కాలము నుండియే ప్రయత్నించినాడు.

1. నేను సేకరించినది పాడినవారు బిక్షపతి, రాయిప్రోలు

వనవాసములో నున్న పాండవులను మరపించుటకు దుర్యోధనుడు నదులకు ఆనకట్టలు కట్టి కాలువలు త్రవ్వించి నీటి సౌకర్యములు కలుగజేసెనని భారవి కిరాతార్జునీయమున వర్ణించెను. బుద్ధుడు తన ఉపదేశములలో పెద్ద కాలువల నుండి పంట కాలువలు, పంట కాలువలనుండి పిల్లకాలువలు ఏర్పడినట్లు ఆచార్యులనుండి ఉపదేశములు ప్రజలకు వ్యాపించునని పేర్కొనెను. శ్రీకృష్ణ దేవరాయలు దేశసౌభాగ్యమునకు మూలమైన కుంటలను కాల్వలను నిర్మించిన రాజునకు ధర్మవంతుడను కీర్తి వచ్చునని "ఆముక్తమాల్యద"లో నుడివి యున్నాడు-[1]. చెరువును త్రవ్వించుట సప్తదానములలో నొకటిగా పేరు బడసినది.

ఇన్ని విధములుగా నీటిపారుదల వసతులకై ప్రయత్నించినను వరుసగా రెండు సంవత్సరములు వర్షము తగ్గు ముఖము పట్టిన అంతటను కరవుకాటకములే. కావున ప్రకృతికి ఎదురీది మానవుడు మనజాలడనియు, వర్షములు పడకపోయిన పంటలు పండవనియు జానపదులు గాఢముగా విశ్వసించినారు. అందుకనియే గ్రామీణులు వానకొరకు ప్రార్థనలు, మహాభారత విరాటపర్వ పురాణ కాలక్షేపములు, కప్పల ఊరేగింపులు, వరుణ దేవుని పూజలు మున్నగునవి జరుపుదురు. శివునకు సహస్ర కుంభాభిషేకము కూడ చేయుదురు. గ్రామీణులు వానదేవుని ప్రార్థించు పాటలెన్నియో వారి ఆవేదనను తెలుపునట్టివి కలవు-[2] జానపదులు వర్షకాములై ఉత్సాహముతో పాడుట వేదోక్తమైనది-[3].

వర్షము కొరకు కప్పను పూజించుటయు కలదు. కప్పను తెచ్చి దేవతావిగ్రహమును ఊరేగించినట్లు ఊరేగింతురు. పసుపు కుంకుమలతో పూజింతురు. కప్పను గుడ్డలో కట్టి ఒక కర్రకు వ్రేలాడగట్టి ఆ కర్రను భుజముపై నిడుకొని పల్లకీని మోసినట్లు మోయుచు గ్రామీణులు కొందరు "కప్పాకప్పా నీలాలు కడవలనిండా వానాలు" అని పాడుచు వీధులవెంబడి తిరుగుటయును కొన్ని ప్రాంతములలో కలదు.

ఇట్లు కప్పను వర్షమునకై పూజించుట, స్తుతించుట వేదకాలము నుండియు నున్నట్లు తోచుచున్నది. ఋగ్వేదముననున్న మండూక సూక్తము.

1. ఆముక్తమాల్యద2.4.ప.236
2. మిన్నేరు-పుటలు-340-346-347
3. అధర్వేదము-6-79-1(వివేచన-మూడవసంచిక-పుట-100).

దీనినే సూచించును. –[1] డా॥ గిడుగు వేంకట సీతాపతిగారు ఈ మండూక సూక్తమును తెలుగులో అనువదించుచు మాక్స్ ముల్లర్‌గారు గ్రీక్ సాహిత్యము నందును కప్పలపూజ కలదని పేర్కొనినట్లు తెలిపిరి. –[2]

అనాది కాలమునుండి వచ్చుచున్న విశ్వాసమే నేడు జానపదుల కప్ప పూజలకు కారణమై యుండును. కప్ప నీటిలోనుండు జంతువు కనుక కప్పను పూజించిన వర్షము పడునని జానపదుల నమ్మకము. కప్పను ఊరేగించుచు–

"వానదేవుడా! వానదేవుడా!
వానల్లు కురిపించు వానదేవుడా
కప్ప తల్లి నీళ్లాడే వానదేవుడా
కడవల నిండ నీళ్లొచ్చె వానదేవుడా
చెరువులన్ని నిండాలి వానదేవుడా
చేలన్ని పండాలి వానదేవుడా –[3]

అని పాడుదురు. కప్ప పెళ్ళి చేయునప్పుడు.

"కప్పమ్మ పెళ్ళి కోయంచు మేళములు
గొప్పగా తెప్పించినాడు
వరుణ దేవుడు పంపినాడు ॥ఓ చెలీ॥
కప్పమ్మ గడప తొక్కినదీ–శుభమున్న
సూచనలు చూరు చెప్పినదీ
కప్పలెగిరె – వానలమ్మా – పొలములో
కనకమే పండు తాయమ్మా"–[4]

అనియు –

వానల్లు కురవాలి వానదేముడా
మా వూరి చెరువైన వానదేముడా

1. ఋగ్వేదము. 7–6–103.
2. మండూకస్తుతి (వ్యా) డా. గిడుగు వేంకట సితాపతి–భారతి–మే, 1924.
3. మిన్నేరు–పుట–342 4. మిన్నేరు–పుట–343.

ముంచెత్తి పోవాలి వానదేముడా
కప్పలకు పెళ్ళి వానదేముడా
గొప్పగా సేయాలి వానదేముడా [1]

అనియును పాడెదరు. ఇట్టి పాటలను శ్రీ దేవేంద్ర సత్యర్థి వేదసూక్తములలోని వారుణ స్తోత్రములవంటివని పేర్కొనినట్లు డా॥ బి. రామరాజుగారు తెలిపిరి. –[2].

కొన్ని ప్రాంతములలోని పల్లెలలో ప్రత్యేకముగ హరిజన స్త్రీలు గుంపులుగాచేరి కప్పను తలమీద పెట్టుకొని ఊరేగించుచు ఇట్లు పాడెదరు.

మా పల్లె పాలించు వానదేముడా, మమ్మెల్ల రక్షించు వానదేముడా
మా కెల్ల వర్షమిచ్చి వానదేముడా, మాకెల్ల పంటలిచ్చి వానదేముడా
మాకెల్ల నీరిచ్చి వానదేముడా, మా దప్పికలు దీర్చి వానదేముడా
మా పల్లె పాలించి వానదేముడా, మమ్మేలు కోవయ్య వానదేముడా
ఉత్తరాన ఉరుమురిమె వానదేముడా, దక్షిణాన జల్లుకురిసె వానదేముడా
ఏ దిక్కునున్నావో వానదేవుడా, మా దిక్కు రావోయి వానదేవుడా
మా కెల్ల వర్షమిచ్చి వానదేవుడా, మా చెరువు నిండించి వానదేవుడా
మాకెల్ల పంటలిచ్చి వానదేవుడా, మా మొరలు వింటివయ్య వానదేవుడా–[3]

వానదేవుని పూజ ప్రత్యేకముగా తెలుగు పరయాలలో (మాలలో) చాల అలవాటులో నున్నట్లున్నది. వీరు కప్పను తెచ్చి దానికి మంత్రతంత్రములతో అభిషేకము చేయుదురు" అని థర్‌స్టన్ కూడ పేర్కొనెను. –[4]

వర్షమును గురించిన విశ్వాసములు ప్రతి దేశమునందును కలవు. కాకేషన్ (ఇప్పటి సోవియట్ యూనియన్) ప్రాంతమునకున్న పూర్వపు షా, చూసర్ (Pshaus, Chewsurs) తెగలలో "వానకొరకు దుక్కి" అను ఉత్సవము చేసెడివారు.

---

1. పల్లెపదాలు–పుట–1
2. తెలుగు జానపద గేయ సాహిత్యము–పుట–480.
3. తెలుగు పల్లెపాటలు–ప్రయాగ నరసింహ శాస్త్రి–పుట–1.
4. Omens and Superstitions of Southern India - Thurstone =-305.

క్షామమేర్పడినప్పుడు కన్యలు నాగలిని మెడకు కట్టుకొని నదిలోనికి నడుము లోతువరకు ఈడ్చుకొని పోయెడివారు. దీనివలన వర్షము కురియునని విశ్వాసము. అమెరికాలోను ఈ ఆచారము కలదు. ఒక వృద్ధ మహిళగాని, పురోహితుని భార్యగాని పురోహితుని దుస్తులు ధరించును, తక్కిన స్త్రీలు పురుషవేషము ధరించి నాగలిని ప్రవాహమున కెదురుగా నీటిలోనికి ఈడ్చుకొని పోయెదరు. దీనివలన వర్షము కురియునని విశ్వాసము. –[1] నైరుతి అమెరికాలోని ప్యూబ్లో ఇండియనులు మధ్య వేసవినుండియే రాబోవు వానలకు స్వాగతము పలుకుచు పూజలను చేయుదురు. –[2]

నేటి కాలమునందువలె బాగుగా కాలువలూ, కరెంటు, ఆయిల్ ఇంజన్లూ పూర్వకాలమున అందుబాటులో లేకపోవుటవలన రైతునకు పొలములలో నీరు పారించుట ఒక పెద్ద పనిగా ఉండేది. ఈనాటికిని ఇన్ని సదుపాయములు సమకూరినను నీటి యెద్దడిగల ప్రాంతములలోను, పేదరికముచేత ఆయిల్ ఇంజన్లు కొనలేని స్థితిలో నున్నవారును కపిల తోలి, ఏతాము నెత్తి (తొక్కి), గూడువేసి పొలములకు నీరు పారించుచుందురు. ఆ సందర్భములో పని బరువును మరచి పోవుటకు పాడుకొను పాటలే కపిల (మోట), గూడుగీతములు– ఈ పనులు ముఖ్యముగా పురుష ప్రాధాన్యముతో గూడినవి.

కపిలను తోలు పని పురుషులది. తోడిన నీరును పొలమునకు మలుపు పని స్త్రీలది. అయినను నడుమునకు కొంగును బిగించి పురుషులతో సరిసమానముగా కపిలను తోలు జానపద స్త్రీగణము గ్రామీణ పరిసరములలో అచ్చటచ్చట కనిపించుచుండును.

కపిలను తోలునప్పుడు పాడు ఒక పాట నిట నామమాత్రముగా పేర్కొందును.

ఊరకుంద్రా ఉత్తోడా, మావూరు మంచిది కాదు
కులమోళ్ళు కనుక్కుంటె కులము సెడిపేరు–[3]

–ఈ పాటలో ఒక నెఱజాన వలచిన వలపుగానికి తన మనస్సు నిచ్చింది. అవకాశము చూచి అతడు ముందడుగు వేయబోయినాడు. ఇంతలో ఆమెకు

1. Golden Bough Vol.I - Sri James George Frazer - page.281.
2. Lore Munro S. Edmonson - page.175
3. ఆలిచిప్పలు–ఆణిముత్యాలు–పుట–3.

సంఘము గుర్తుకు వచ్చినది. ఎట్టి పొరపాటు జరిగినను పదిమంది నోటిలోబడి కులమునుండి వెలివేయబడు పరిస్థితిని ఊహించుకొని భయపడినది. కులము కట్టుబాట్లను అధిగమించలేని స్త్రీ మనస్తత్వము ఇందు వ్యక్తమగుచున్నది.

విత్తనములు చల్లుట :

భూమిని దున్నుటకు మునుపు దుబ్బులను మొక్కలను వైశాఖ జ్యేష్ఠ మాసములలో నరకివేయుదురు. దీనిని తెలంగాణా ప్రాంతమున "లొట్ట ఏరుట" అందురు. పురుషులు నరకివేసిన పొలములోని అవసరములేని చెట్టుచేమలను స్త్రీలు ఒక్క చోటికి చేర్చుదురు. అట్టి సమయములలో

"నరకవయ్యా, నరకవయ్యా! ఓహో నరకవయ్య
వాడేమి కొట్టాడు చింతచెట్టు
వీడేమి కొట్టాడు చిన్నచెట్టు
నీవేమి కొట్టావు – ములగ చెట్టు
నరకవయ్య నరకవయ్య
ఓహో – నరకవయ్య"–[1]

అని పాడుచు పనిలో ఉత్సాహమును కల్పించుకొనెదరు. వీరు తలను మాడ్చు ఎండను కూడ లెక్కించక ఈ పనులకు పూనుకొందురు. కొట్టిన దుబ్బులను ఎండబెట్టి వంట చెరుకుగా నుపయోగింతురు. వర్షములు కురిసిన తరువాత రైతులు దుక్కి ప్రారంభింతురు. దుక్కిని మొదట దున్ని, తరువాత అడ్డముగా దున్నుదురు. దీనిని "ఇరువాలు" అందురు. 'చాలుమీద చాలు దున్నితే చచ్చునేల పండుతుందని' వారి నమ్మకము.

భూమిని దున్నుటకు నాగలి కర్రు వాడుకలో నుండినట్లు ఋగ్వేదము నుండి తెలియుచున్నది. "సీరాను" (నాగలిని) దున్నుము. నాడిని సరిజేయుము. ఇక్కడ సిద్ధపరుచబడిన పొలములో విత్తనములు నాటుము, మా స్తుతులతో పొలము సస్యశ్యామలముగా నుండుగాక, పండిన సస్యముల వద్దకు కొడవళ్లు చేరుగాక–[2]

1. మధుర కవితలు–పుట–252; ఇదే పాట కొద్ది మార్పుతో పల్లెపదాలులో కలదు–పుట–29.
2. ఋగ్వేద ఆర్యులు–రాహుల్ సాయంకృత్యాయన్–పుట–217.

నాగలిని దున్నుట పురుషుల పని. పూర్వకాలమున అత్యవసర పరిస్థితిలో తప్ప స్త్రీలు నాగలిని తాకక పోయెడివారట. కొన్ని తెగలలో ముఖ్యముగా ఆటవిక జాతులలో ఈ విధినిషేధములు నేటికిని ఉన్నవి. 'ఖార్యా' తెగ స్త్రీలు నాగలిని తాకుట, ఇంటి కప్పులను వేయుట నిషిద్ధము. స్త్రీలకు పురుషులతో సమానమైన గౌరవ ప్రతిపత్తులున్నను కొన్ని పనులలో వారు పాల్గొన గూడదనియు, దూరముగా నుండ వలయుననియు నిషేధము కలదు. ఒరయాన్ తెగ స్త్రీలు కూడ నాగలిని తాకరు. ఈ నిషేధమును ఉల్లంఘించిన ఎడల వారు ప్రాయశ్చిత్తము చేసికొన వలెను-[1]

దున్నిన భూమిలో విత్తనములను వెద జల్లుదురు.

అథర్వ వేదమునందు విత్తుటను గురించిన ప్రసక్తియున్నది [2]

చేమకూర వేంకటకవి రఘునాథరాయల పరాక్రమమును వర్ణించు పట్టున దక్షిణాపథమున ఆనాటి వ్యవసాయ కార్యములలో భాగమైన విత్తుటను సూచించెను-[3]

విత్తనము శ్రేష్ఠమైన పంట బాగుగాపండును. పొలము పనులలో విత్తనములు విత్తుట నాందిగా మార్పులు భరత వాక్యముగా గ్రహింపవచ్చును. ఈ విత్తనములను పొలములో ప్రత్యేకమైన వ్యక్తులు చల్లిన పంట బాగుగా వచ్చునను విశ్వాసము కలిగి ఉందురు. కనుక ఆ విశ్వాసముతోనే హస్తగుణము మంచిదను కొను వారితోనే విత్తనములు చల్లింతురు.

"నాగన్న విత్తితే నవ్వుతుందీ మొలక
రంగయ్య చల్లితే పొంగుతుందీ పైరు
ముద్దులా నాతొలిక ముత్యాల తొలికా
గిలికితే, రతనాలు సిలికేటి గిలికా-[4]

అని కర్షకులు పాడుచు విత్తనపు గింజలతోగూడిన గంపలను తలలపైన మోసుకొని పొలమునకు వెళ్ళుదురు. పురుషులు నాగలి చాలును తిన్నగ పోనివ్వగ ఆ చాలులో స్త్రీలు గంపలలోని గింజెలను గుప్పిట తీసుకొని క్రమముతప్పకుండ విత్తెదరు.

1. Tribal Culture of India. page.244
2. అథర్వ వేదము-3-24-5
3. విజయవిలాసము-పీఠిక-ప.44.
4. సెలయేరు-పుట-143.

శ్రమ విభజన ననుసరించి నాగలితో దున్నుట పురుషుని పని, విత్తనములు వెదజల్లుట స్త్రీల పని. స్త్రీలు అనుకూలముగా దొరకని సమయమున పురుషులు విత్తుటయును కలదు. అందులకై పై పాటలో పురుషుల 'హస్తవాసి' పైనుండు నమ్మకము పేర్కొనబడినది. అంతేగాని గింజలు విత్తుట స్త్రీల పని.

విత్తనములు చల్లుచు పాడు పాటగా ప్రసిద్ధిని పొందిన పాటనొకటి నిట పేర్కొందును.

దత్తి రామచంద్రుడ, దత్తి రామచంద్రుడా
నన్నూరు నాగళ్ళు, ఎడ్లు ఎనిమిది నూర్లు ॥దత్తి॥
ఎల్లెనే-1 రామన్న ఎన్నెల-2వలే ॥దత్తి॥
దున్నిదున్ని శ్రీరాముడు దూపలేగొనే ॥దత్తి॥
సీతమ్మ దెచ్చింది తియ్యటంబళ్లు ॥దత్తి॥
రామన్న తాగెనే కడుపు చల్లబడంగ ॥దత్తి॥
శ్రీరాముడు నాగలి గొట్టె సీత సాలేసే ॥దత్తి॥
రఘురాముడు మోటగొట్టె రంభ నీళ్ళుగట్టె ॥దత్తి॥
గోడెనుక మా తాత గోజుమలు అలికించే ॥దత్తి॥
మొలిచిందొ మొలువలేదో చూచిరాంద్రి అన్నో ॥దత్తి॥
మొలచింది పంట మొద్దు కొరగిందో ॥దత్తి॥
అన్నాలు గల సెల్లె అలిగిపోయిందో ॥దత్తి॥
పస్పుసేను పంటె-3 చెల్లె పట్టుచీర పెడుతా ॥దత్తి॥
జొన్న సేను పంటె చెల్యా దొడ్డుచీర పెడుతా ॥దత్తి॥
సజ్జసేను పంటె చెల్యా సారెచీర పెడుతా ॥దత్తి॥
వరిచేను పంటె చెల్యా వరాలచీర-4 పెడుతా ॥దత్తి॥
పెట్టుపోతలు నేనొల్ల బిడ్యనీ-5 అన్నో ॥దత్తి॥

---

1. వెళ్లెనే 2. వెన్నెల 3. పండిన
4. వరహాల (వరాహముద్రగల బంగారు నాణెములు) విలువజేయు
5. బిడ్డను
6. నేను సేకరించినది-పాడినవారు-లలితాబాయి, సుల్తానుబజారు, హైద్రాబాద్.

ఈ పాటలో నాలుగు నూర్ల నాగళ్ళకు ఎనిమిది నూర్ల ఎద్దులను కట్టి శ్రీరామచంద్రుడు పొలమును దున్నుటకు వెళ్ళగా అతని ననుసరించి సీతమ్మ అంబలి తీసుకొని వెళ్ళినది. నాలుగునూర్ల నాగళ్ళు కలిగిన శ్రీరామునికైనను అంబలి త్రాగుటను తప్పించకపోవుట జానపదులకు సహజాతి సహజము. వ్యవసాయపు పనులతో అలసిపోయిన శ్రమజీవులకు అంబలే అమృతముగా గోచరించును. ఆ సమయమున వారికి పంచభక్ష్య పరమాన్నములకన్నను అంబలియే అధిక సుఖము నిచ్చును. శ్రీరాముడు నాగలినిగొట్ట సీత విత్తనములను చాలులో వేయుట, అతడు మోటగొట్ట ఆమె పొలమునకు నీళ్ళను గట్టుట గ్రామీణ కుటుంబములలోని దంపతుల పరస్పర సహకార జీవితమును కనులకు కట్టించు చున్నది. ఇంతవరకు ఒక వరుసలో నడచిన ఇతివృత్తము 'గోడెనుక మా తాతగోజు (దు)మలు అలికించే' అను పాదముతో మలుపు తిరిగినది. అన్నలు గల చెల్లెలు అలగినది. ఆమెను అనునయించు అన్న చీరెసారెలు పెట్టుదునని బ్రతిమాలెను. అవియేవి వద్దని చెల్లెలు అన్నతో అతని బిడ్డను (తన మేన కోడలును) ఇవ్వుమని కోరినది. ఇట్టి పాటలలో చివరన అన్న యిచ్చు కానుకలేవియు వద్దని అతని కూతురు నిచ్చిన తన కొడుకునకు వివాహము చేసికొనవచ్చునను మేనరికముల యెడ నుండు మక్కువను ప్రదర్శించుట సామాన్యము.

ధాన్యమును విత్తుటవంటి సేద్యపు పాటలు ప్రతి సాహిత్యముననను ఉండును. కొండమీద తక్కువ రకము ధాన్యమైన "ఉక్డీవరి" ని (నివ్వరి) విత్తు ఇద్దరు బీద కర్షకులకు సంబంధించిన గోవా జానపదగేయమును క్రింద ఉదహరించుచున్నాను.

పైలే పైలే దోంగరీ హతలీ ఏక్ సరీహెూ
హతలీ ఏక్ సరీహెూ
తాంతూర పేరలీ ఉకడీ వరీ హెూ
ఉకడీ వరీహెూ
ఉకడీవరీ బాదు జలీ
ఉకడీ వరీ బాదు జలీ
ఉకడీ వరీ బాహెూశాలీ
ఉకడీ వరీ బాహెూశాలీ

జ్యాచీ బాయకో కాళీతో
గేలా త్యా జాళీ
జ్యాచీ బాయకో గోరీతో
రాహ్యలా ఘరీం
మనచీం సావజేం ఆలీంగా
వరీఖా ఊన గేలింగా హెూ
వరీఖా ఊన గేలింగా
జ్యాచీ బాయకో కాళితో
గేలాత్యా జాళీ
జ్యాచీ బాయకో గోరీతో
రాహ్యలా ఘరీం

"ఎత్తయిన కొండపై – ఎత్తయిన గుట్టపై పరిపొలము దున్నారు.
ఇద్దరూ ఉక్డీవరి విత్తారు, ఓహెూ! ఉక్డీవరి విత్తారు
ఉక్డీవరి మొలకెత్తింది, ఉక్డీవరి మొలకెత్తింది
ఉక్డీవరి బాగా ఎదిగింది, ఉక్డీవరి బాగా ఎదిగింది
నల్లభార్య మొగుడు పొలం చూడడానికి రాత్రి వెళ్లాడు,
తెల్లభార్య మొగుడు ఇంట్లోనే ఉన్నాడు; ఇంట్లోనే ఉన్నాడు,
అడవినుంచి పశువులు వచ్చాయి, వరిచేను మేసి వెళ్ళాయి.
నల్లభార్య మొగుడు పొలం చూడడానికి రాత్రి వెళ్ళాడు
తెల్లభార్య మొగుడు ఇంట్లోనే ఉన్నాడు, ఇంట్లోనే ఉన్నాడు–[1]

ఇల్లలుకగానే పండుగ కాదనునట్లు ధాన్యమును విత్తుటతోనే పంట చేతికి రాదనియు, పంటకు సరియైన కాపల లేకపోయిన వ్యర్థమనియు ఈ పాట తెలుపుచున్నది.

నాట్లు :

వరిని పండించుట తక్కిన ధాన్యములను పండించుట వంటిది కాదు. తక్కిన ధాన్యములు విత్తనములు చల్లిన చాలును. వరి అట్లు కాదు. వరి నారును

1. జనజీవన దర్పణాలు–గోవా జానపదగేయాలు(వ్యా) శ్రీవినాయక్ సదాశివ్ సుఖ్‌ఠణ్‌కర్, భారతి, జులై, 1965–పుట–58.

ఒక చోటనుండి తొలగించి మరియొక చోట నాటవలెను. ఈ నాటు పద్ధతిని కొంత వివరించవలసి యున్నది.

శ్రేష్టమైన వరి విత్తనములను తెచ్చి ఒక రోజు నానబెట్టుదురు. పిదప వానిని వరిగడ్డితో 'మండెకట్టి' అందు ఈ నానిన విత్తనములను పోసి పైన మరల గడ్డి కప్పెదరు. దానిపై రోజునకు మూడు పూటల చొప్పున రెండు మూడు రోజులు నీరు పోయుదురు. నీటి తడితో, గడ్డి వేడిమితో వరి విత్తనములు మొలకలెత్తును. మొలకలెత్తిన గింజలను నీళ్ళునిండిన మడిలో చల్లెదరు. దీనిని "వరిని అలుకుట" అందురు. అవి ఒత్తుగా పెరుగును. ఆ మడిని నారుమడి యందురు. వరి పంటకు వచ్చు కాలమునననుసరించి నాలుగు నెలల పంట అయిన నాలుగు వారములకు, ఆరునెలల అయిన ఆరు వారములకు ఒత్తుగా పెరిగిన నారును తీసి నీళ్ళు నిండిన మడులలో దూర దూరముగా నాటుదురు.

మండెను పెట్టునప్పుడును, వరిని అలుకునప్పుడును శుభప్రదమైన తిథి వారములను ఎన్నుకొందురు. "మంగళవారమునాడు మండె వేయరాదు" –[1] అను వాడుక కలదు. ఇది నాగరికులకు మూఢ విశ్వాసముగా కనవచ్చినను గ్రామీణులకిది గాఢ విశ్వాసమే. మండెను విప్పిననాడు మొలకెత్తిన వరి విత్తనములను కొన్నింటిని పెనము మీద వేయించి, దంచి బియ్యమును చేసెదరు. ఇవి మొలకెత్తుటకు ముందు బాగుగా నాని యుండుట వలన దంచునప్పుడు నూకలుగా విడిపోవుచుండును. వీనిని "మొలక నూకలు" అందురు. వీనిని తల్లులు అత్తవారింటనున్న తమ బిడ్డలకు ప్రత్యేకమగు పిండివంటవలె పంపుటయును కలదు.

నాటు పాటలను ఔత్తరాహులు "రసియాగీతము" లందురని డా॥ బి. రామరాజుగారు పేర్కొనిరి. –[2]

నాట్లు వేయుట చాల శ్రమతో కూడినపని. స్త్రీలే ముఖ్యముగా ఈ పనిని నిర్వహింతురు. శరీరమును వంచి నీళ్లలో నిలచి కూలీజనము గుబురుగా వచ్చిన వరిని పీకి పొలములో ఎడమెడముగా నాటుదురు. ఈ నాట్లు వేయుటను "ఊడుపూడవము" అని కూడ వ్యవహరింతురు.

---

1. వ్యవసాయ సామెతలు–పుట–77.
2. తెలుగు జానపద గేయ సాహిత్యము–పుట–482.

సామాన్యముగా ఈ ఊడ్పు పాటలును, కలుపు పాటలును, కోతపాటలును, దీర్ఘకథా గేయములతో కూడినవై యుండును. ఈ పనులలో వారు దినమంతయు ఎక్కడికి వెళ్లనవసరము లేకుండగా ఒకే దగ్గర ఉండుటకు వీలుండును. కనుక గేయములు పెద్దవైనను వారికి ఇబ్బంది లేదు.

పని పాటలలోను పూజాపురస్కారములలోనూ గౌరమ్మను కొలువనిదే నిలువదు. సంప్రదాయములో పుట్టి సంప్రదాయములో పెరిగిన స్త్రీల మనసు 'నాట్లు' సమయమున సాగు గౌరమ్మ పాటలలో ఈ క్రింది పాట ఒకటి–

గట్టుమూకులు గట్టి గడలూ బొందిచ్చి
గట్టురాయని ఇంట్లో పుట్టె గౌరమ్మ
పుట్టుటే గౌరమ్మ ఎమేమి గోరు
కుట్టావయ్యారి రవికె, కుంకుమాకాయ
జాల వయ్యారి రవికె జామాల పేరు
వంకా చక్కటి కుడుక వజ్రాల పేరు
నీ చేతి కంకణము ఏదే శ్రీగౌరు
ఆడబోయిన కాడ ఏడబోయినదో–[1]

– గౌరమ్మ "గట్టురాయని" ఇంటిలో పుట్టినదనుట "పర్వతరాజు" ఇంటిలో పుట్టెననుటకన్నను రమ్యముగా నున్నది. సిరి కాటపట్టైన హిమవంతు కూతురునకు నగలకు కొదువలేక పోయినది. తల్లి "నీచేతి కంకణము ఏదీ "శ్రీగౌరు" అని అడుగగా ఆడబోయిన కాడ ఏడ బోయినదో నని నిర్లక్ష్యముగా జవాబిచ్చినది. గారాబముగా పెరిగిన పిల్లలలో ఈ నిర్లక్ష్యపు జవాబులు పరిపాటి.

నాట్ల సందర్భములో పాడు దీర్ఘగేయములలో నేను సేకరించిన ఒక గేయమునిట పేర్కొందును. గేయము శీర్షిక "సీతను చంపుట". ఈ శీర్షికను చూచి ఎవరైనను ఆశ్చర్యపడవచ్చును. జానపదులకు సీతాదేవిపైన ఉన్న గౌరవము నూతన కల్పనకు మాతృకయైయినది.

1. పల్లెపదాలు–పుట–9.

జానపదులు రాముడు సీతకు చేసిన అన్యాయమును సహింపజాలక పోయిరి; సీతను అరణ్యములో వదలిపెట్టి రమ్మని లక్ష్మణునికి రాముడిచ్చిన ఆజ్ఞను రాముని పైనున్న కసి కొలది సీతను చంపిరమ్మని ఆజ్ఞాపించినట్లు మార్చు కొనిరి. వారికి సీతపై నున్న గౌరవమట్టిది. సీతమ్మకు రాముడు చేసిన అన్యాయము కొండంత జేసి ప్రచారము చేసిరి. ఈ పాట సీత లక్ష్మణ, కౌసల్యాసుమిత్రా లవకుశుల సంభాషణ రూపముననున్నది. –[1]

చాకలి నిందకు భయపడి రాముడు సీతను అరణ్యమున వదలి పెట్టి రమ్మని లక్ష్మణుని ఆజ్ఞాపించెను. అతడు సీతను అరణ్యములో వదలి వచ్చుటకు తీసికొని వెళ్ళును. ఇది ఉత్తర రామాయణ కథ. కాని ఈ గేయము లక్ష్మణుడు సీతతో రాముడు ఆమెను చంపుమని తనను ఆజ్ఞాపించినట్లు పలుకు మాటలతో ప్రారంభమగును.

"ఇలలేని వార్త నీయింట్ల జరిగె
ఏమి చెప్పుదు వదినగారు
నల్ల నల్లని వాడు నామంబు గల్లాడు ॥నల్ల॥
మాయన్న రాముడు నీ పుణ్యపురుషుడు
నిను సంప(చంప) సెలవిచ్చినాడు".

– అని లక్ష్మణుడు సీతతో పలికెను. ఇది అంతఃపురమున జరిగిన సంభాషణము. మూలోత్తర రామాయణమున లక్ష్మణుడు రాముని అభిప్రాయమును సీతను అడవిలో వదలినప్పుడు చెప్పును. ఈ పాటలో అట్లుగాక అంతఃపురముననే చెప్పుట, అందు ననుచంపుమని రాముడాదేశించినట్లుగా తెలుపుట– అను వినూత్న కల్పనకు కూడ జానపదులు వెనుకాడలేదు. సీతమ్మ అతని మాటలు వినినది. ఆశ్చర్యపోయినది.

"నల్ల నల్లనివాడు నామంబు గల్లాడు (కలవాడు)
నా పుణ్య పురుషుడు నను నంప సెలవిచ్చినాడా"

– అని ప్రశ్నించుచు సామాన్యుల కోడలు భర్త బెదిరించిననో, తోడి కోడండ్రు అదలించిననో, అత్తగారిని చేరి మొర పెట్టుకొనునట్లు ఆమె అత్త కౌసల్య మేడకు వచ్చినది.

---

1. ఎన్. గోపాలు (ప్రస్తుతము వారు ఆచార్య ఎన్. గోపిగారు) సహాయముతో నేను సేకరించినది–పాడినవారు; కృష్ణమ్మ, మహబూబ్‌నగర్ జిల్లా.

ఎన్నడూ రానిది కోడలు సీతమ్మ
నామ్యాడ కొస్తున్నాది, నా మహలు కొస్తున్నాది.

– అని ముంగిళ్లు అలికించి అత్త కౌసల్య ముత్యాలు పరిపించినది. పగడాలు చల్లించి తన అత్త కౌసల్య పందిళ్ళు వేయించినది. వచ్చిన సీతను కుర్చీ పీట మీద కూర్చుండబెట్టి ఆమెను కౌసల్యాదేవి "రామ సోధ్యము, లంక సోధ్యము, లక్ష్మణా సోధ్యము చెప్పరాదా" అని అడిగినది. అందులకు సీత

ఎత చెప్ప నే నొస్తే కథ చెప్పమంటారు
ఏల చెప్పుదూ అత్త గారు – యాల చెప్పుదూ అత్తగారు
నల్ల నల్లని నామంబు గల్లాడు
నీ కొడుకు రాముడు – నా పుణ్యపురుషుడు
నను సంప సెలవిచ్చినాడు.

అని పలికినది. ఆ మాటలకు కౌసల్యదేవి విస్తుపోయినది.

'నీ పుణ్యపురుషుడు నీ మీద దయలేక పోయెనా?"

అని ఆమెను పరామర్శించి "కొంచమంత కుచేలములో పగడమంత సద్ధి గట్టి కొడుకుల్ల కనుకోవే సీతా" అని ఆమె నాశీర్వదించి సాగనంపును. సీతా దేవి అట్లే సుమిత్ర యొద్దకును, కైకేయి యొద్దకునూ, వదిన శాంతమ్మ యొద్దకును వెడలి వారియొద్ద నుండియు అట్టి ఆశీర్వచనమునే పొందును; పిదప లక్ష్మణునితో సహా అడవికి బయలుదేరెను. ఆ ఎండలో వేడి దుమ్మునబడి వెళ్ళు చుండగా చేతులూపుట వలన ఆమెకు "ఉరుములే దిగెను" (అనగా రెక్కలు మిక్కిలిగా నొప్పిపెట్టినవని భావము). ఆమె లక్ష్మణుని సంబోధించి

ఇగ సంపు లక్ష్మణయ్య
నడచి నాకాళ్లాకు బొబ్బలొచ్చాయి"

అని పలికెను. అప్పుడు లక్ష్మణుడు విద్యుక్త ధర్మము నాచరించు ఆదర్శ అనుజుడు గనుక

'రామ బాణము తీసి పెక్కునబెట్టి
నాతి నడుముల కేసినాడు
దేవి నడుముల కేసినాడు'

ఆశ్చర్యమేమనగా ఆబాణము వెంటనే సీతమ్మవారి నడుమున బంగారు ఒడ్డాణముగ మారిపోయినదట. ఇట్లే లక్ష్మణుడు ఆమె చేతులపైన గూడ బాణములు వేసిన అని బంగారు కంకణములయినవి. పిదప గొంతునకు గురిపెట్టి బాణము వదలెను. అది బంగారు గొలుసు అయినది. దేవి కొప్పును గురిపెట్టి బాణము వదిలెను. అది బంగారు పువ్వులుగా మారినది. ఇక లాభములేదని ఒక బాణమును ఆమె బొడ్డు ప్రదేశమున వేసెను. అప్పుడు గర్భములోనున్న లవకుశులు

"పినతండ్రి లక్ష్మణ ఇగ సంపకయ్యా" అని అరచిరట.

అంతట లక్ష్మణునికి జ్ఞానోదయమయినది. ఆమె అమరురాలు అని నిశ్చయజ్ఞానము కలిగినది. అప్పుడు లక్ష్మణుడు

"సావు(చావు)లేదే సత్యపాలకు రాలువమ్మా
నిత్యపాలకు రాలువమ్మా" అని ఆమెను ప్రశంసించెను.

గర్భవతి అయిన సీతను అరణ్యములో ఒంటరిగా వదలినను ఆమెకే హానియు కలుగ లేదు. వాల్మీకి మహర్షి ఆమెను తన ఆశ్రమమునకు పిలుచుకొని వెళ్లి కాపాడెను. సుఖప్రసవానంతరము లవకుశులను గొప్పవారిని చేసెను. ఆమెకు దైవ రక్ష సంపూర్ణముగా నున్నదనుటను జానపదులు పై కథలో చాటిరి.

ఈ పాటవంటిది కన్నడ జానపద సాహిత్యమునందును గలదు. ఆ పాట అసమగ్రముగానున్నట్లు తోచుచున్నది. దీని శీర్షిక "కుయ్యుబారయ్య పాపి సిరుసా నరికి రావయ్య పాపి శిరస్సు".

మడివాడ మాచప్ప (మడివేలు మాచప్ప) మాటలకు మనసు బాధపడిన రాముడు లక్ష్మణుని పిలచి సీతను అడవికి పిలచుకొని వెళ్ళి, అక్కడ చంపి వేయుమని ఆజ్ఞాపించును.

ఎలో నన్న తమ్మనాద లక్ష్మమణదేవా
అడవి అరణ్యాకె కరుకొండ్హోగి
నిన్న అత్తిగెయాద సీతమ్మ నవర

అల్లి సిరనేద్నేయన్ను మాడ్బుట్టు
అవళ గురతన్ను తక్కొండు బారప్ప"

– "తమ్ముడా లక్ష్మణా, నీ వదినె సీతమ్మగారిని అడవికి పిలుచుకొనిపోయి, అక్కడ ఆమె శిరస్సు ఛేదించి, గుర్తులు తీసికొనిరా" అని ఆజ్ఞాపించును రాముడు. "అన్నయ్యా, ఏలాటి గుర్తులు తెమ్మందువు?" అని లక్ష్మణుడు ప్రశ్నించెను. "ఆమె శిరస్సు ఛేదించి, ఆ రక్తముతోనున్న చంద్రహారమును నాకు చూపుము" అని రాముడనెను.

లక్ష్మణుడు ఈ పని తన చేత కాదనెను. కాని రాముడు "అయిన నీవు నా తమ్ముడవు కావు. నీవే అయోధ్యలో కాపురముండుము. నేను వెళ్ళి పోవుదును" అని భీష్మించెను. చివరకు లక్ష్మణుడు అతని మాట మీరలేక దుఃఖముతో సీతమ్మను పిలుచుకొని వచ్చెను. ఆమె వచ్చుచు రాముని ఆజ్ఞను తన చెవులార వినెను. లక్ష్మణుడు రథమును సిద్ధము చేసెను. అప్పుడు సీత

"మైదా లక్ష్మణదేవ
నన్నకైయిన అన్నదరుణ
సినగూ నిమ్మణ్ణనవర్గూ ఇవత్తెముగీతు
స్వల్ప తాళప్ప అడుగే మాడ్తని" అంద్బుట్టు
సీతమ్మ అడుగె మాడకె హొఁగిద్దారె"–[1]

మరిదీ లక్ష్మణా! నీకును, నీయన్న గారికిని నా చేతి అన్నపు ఋణము నేటితో తీరినది, కొంచెముండుము. వంట చేసి పెడుదును" అని సీతమ్మ అంతః పురములోనికి వెళ్ళినది. ఆమె చొరవను చూచి రామలక్ష్మణులు ఒకరి ముఖము మరొకరు చూచుకొనుటయే మిగిలినది.

తెలుగు జానపద గేయములో సీతమ్మ గర్భములోని లవకుశులు లక్ష్మణుని అడ్డగించి నట్లున్నది. దీనిలోని చివరి మలుపు కొంత విడ్డూరముగనే యున్నది. రాముని తీవ్రమైన కోపమును సీతమ్మ "ఈ నాటితో నా చేతి అన్నపు ఋణము తీరినది" అని వంటకు పూనుకొనుటతో కోపమును మరియొక వైపునకు త్రిప్పినట్లు

1. జానపద రామాయణ(వ్యా) - సంకలనము-పి.కె.రాజశేఖర్ మరియు ఎస్. బసవయ్య-పుటలు-68,75.

ఊహించవచ్చును. భూమిలో అన్నపు ఋణము తీరిన దనిన ఆయుస్సు మూడిన దని ధ్వని. ఇచ్చట సీత ఆయుస్సు మూడుట వలన భర్తకు మరదికి ఇకపైన ఆమె చేతితో అన్నమును వండిపెట్టు అదృష్టము లేదని అర్థము. అటుపై కథ ఏమయినదో చెప్పక వదలి వేయబడినది. చంపుట వంటి భీభత్స దృశ్యమును వర్ణింపలేక కన్నడ జానపదులు ఇట్టి చక్కని మలుపుతో కథను పూర్తిచేసి నట్లు తోచుచున్నది.

చాకలివాని మాటలను గూఢచారుడు అంతఃపురములోని రామునికి చెప్పినట్లు దానిమీద రాముడు సీతాపరిత్యాగమునకు నిశ్చయించినట్లును ఉత్తర రామాయణములో కలదు. కన్నడ జానపద గేయకారులు ఆ నిందను రాముడే ప్రత్యక్షముగా వినినట్లు కల్పించినారు. గర్భిణి అయిన సీతమ్మ చింతకాయలను కోరగా వాని కొరకై స్వయముగ వెళ్ళిన రాముడు "మడివేలు మాచయ్య" భార్యతో కీచులాడుచు తనపై నింద మోపుట స్వయముగా వినెను.–[1] ఈ సంఘటనను గమనించిన అంతఃపురములోనున్న రాముని కన్న ఊరిలో తిరుగు మామూలు రామునిని ప్రజలెక్కువగా నిష్ట పడినట్లు తెలియుచున్నది.

కలుపు తీయుట :

పంటచేలలో నాటిన విత్తనములతో బాటు భూమి గుణము వలనగాని గాలికి వచ్చి పడుట వలన గాని కొన్ని అనావశ్యకములగు మొక్కలు పెరుగును. వానిని 'కలుపు' మొక్కలందురు. వానిని పెరుగనిచ్చిన ముఖ్యములగు మొక్కల ఆహారమును తినివేసి ఆ మొక్కలను పెరుగనియ్యవు. కనుక వానిని తొలగింప వలసియుండును. దీనిని కలుపు తీయుట అందురు. కలుపు తీయుట నాట్లునాటినంత శ్రమతో గూడిన పని. వీనిని గురించిన పాటలు చాలకలవు. నాట్ల పాటల వలెనే ఇవియును కడు దీర్ఘమైనవి కలవు. ప్రబంధకవులును కలుపు తీయుటను కడు రమ్యముగా వర్ణించిరి.–[2]

నాటు పాటలు, కలుపు పాటలు, కోత పాటలు – ఈ మూడింటిలోను ఎక్కువ భేదముండదు. జాతరలలో వినిన దీర్ఘ కథాగేయములనో లేదా తమకు

1. జానపద రామాయణ (కన్నడ) –పుట–70.
2. సారంగధర చరిత్ర–చేమకూర వేంకట కవి ఆ. 1–ప.–73.

నచ్చిన పురాణేతిహాస ఘట్టముల గైకొని తమ వాతావరణమునకు అనుగుణముగా మలచుకొని గుంపులోనొకరు చెప్పుచుండ మిగిలిన వారు అవే చరణములను పాడుచుందురు.

జానపదులకు సీతారాములపై అతిభక్తి, మితిమీరిన అనురక్తి. అందువలన రామాదుల గాథలను విశేషముగా పాడుదురు. అటువంటి పాటలలోనిది ఒకటి. ఇది శ్రీరామాదుల జననమునకు సంబంధించిన కథను తెలుపుచున్నది.

అగ్ని దేవుని వరమున దశరథుని భార్యలు గర్భవతులయిరి.

"గర్భుసిన్నెలు దోచె కమాటమదనలకు
'కుశములు'-[1] నలుపాయ మొగము తెలుపాయ
కౌసల్య అనియేటి కాంత గర్భమున
రాముడూ అనియేటి రాజు ఉదయించే
కైకమ్మ అనియేటి కాంత గర్భమున
భరతూడు అనియేటి రాజు ఉదయించే
సుమిత్ర అనియేటి సవతి గర్భమున
లక్ష్మన్న శత్రుగ్నులు ప్రత్యక్షమైరి

నలుగురు రాజ కుమారులలోను "అయోద్యా పట్నము రాములది యాయా, అడవిపై అజనాలూ (అధికారము కావచ్చు) భరతులకాయా".

అట్టేను కైకమ్మనిక్కి చూడగనూ
మరచిన సుద్దులు మనసందు దలచీ
అయోద్యా పట్నము భరతులది యాయా
అటవిపై అజనాలు రాములది ఆయా,
పొయ్యేము వాచ్చేము పొయ్యివచ్చేము
దీవన లీయమ్మ దేవి కౌసల్యా
పట్టు పుట్టాములే -[2] కట్టేటి తల్లి
నారసీర లెట్లు కట్టెదవమ్మా
నారాయ సీరాయ నడుము కట్టుకొని

1. కుచములు 2. పట్టు పుట్టములు

కూరాయ నారాయ కుడియ భోజనము
పాలును అన్నము భోంచేసే తల్లి
పండు బాలా –[1] లెట్లు భుజింతువమ్మ
పండాయ ఫలమాయ వున్న చోటాయా" –

కౌసల్య స్థానములో ఈ జానపద స్త్రీలే నిలబడి కోడలు సీతమ్మను గురించి విలపించుచున్నారు. రామాయణము కథను మార్చగల సామర్థ్యమేయున్న సీతను అంతఃపురములో నుంచి, కైకేయిని అడవులకు పంపించ గల యంతటి అభిమానము వీరికి సీతపైన. కాని కథను మార్చలేక సానుభూతిని మాత్రమే మళ్ళించినారు.

"ఆదేవి కదలుతా భూదేవి కదిలా
భూదేవి కదలుతా భూదేవిపైనున్న రుక్షాలే–[2] కదిలా
రుక్షాల పైనున్న పక్షులే కదిలా
బుడుబుడున ఆ దేవి భూమ్మింద –[3] నడవ
మెత్తనీ కాళ్లకు ఒత్తునీ రాళ్ళు"–[4]

ఇట్లు సీతాదేవితో పాటు భూదేవి కదలినట్లు వర్ణించినను భూదేవి కన్న ముందు జానపదుల మనసులు కరిగి సీతాదేవితో పయనమయినవి. అలతినలతి పదములలో తమ హృదయము నందలి ఆరాటమంతయును వెళ్ల గ్రక్కినారు.

క్రింది పాటలో పంటతో బాటు పెరుగు కలుపు మొక్కలను కలుపుదీయక పోయిన పంటకు కలుగు నష్టమును శృంగారముతో జోడించి పాడినది ఒక ప్రియురాలు.

చింతమాను చిలకలార
చింతలేటి జాణలార
చందమామా, వంటి దానినిరా
ముద్దులరంగా, సందుగాదూ, ఏమి సేతునురా ॥చిం॥

1. పండు ఫలాలు. 2. వృక్షాలు
3. భూమిమీద. 4. తెలుగుదేశపు జానపద గీతాలు–ఎస్. గంగప్ప–పుటలు–20–22.

చందమామ వంటి అందమే గాక, చందమామకుండు చల్లదనము కూడ ఈమెలోనున్నది. ఈ నాయిక తన భావములన్నిటినీ గుదిగట్టి, మనస్సును క్షేత్రమును అచ్చుకట్టుచేసి, ప్రేమయను నీరును పోసి సంరక్షించినది.

చిలుకలుంటె బంతిగట్టి
చిలుకలూరి మళ్ళుదున్ని
కలికి వద్ద మొలక జల్లితీ
ముద్దుల రంగా కలుపు దీయా మరచి పోతిరా ॥చి॥–[1]

పండిన ప్రేమ పంటను పదిలముగా చూచుకొను నేర్పుకూడా కలిగినదీమె. పండిన పంటను ఆశించి వచ్చు చిలుకలకు దూరముగానే పంటనుంచినది. కాని పంటతో బాటు పెరుగు కలుపు మొక్కలను పెరుగనిచ్చినట్లే ప్రేమతో పాటే, ప్రేమను పాడు చేయు మనస్తాపములు, అపోహలు, చిర్రుబుర్రులు అను కలుపును కూడ పెరుగనిచ్చినది.

ఈ అభిమానిని సరియైన సమయములో కలుపుదీయక ప్రేమను కలుషితము చేసికొనినది. కాని తన పొరపాటును గ్రహించ గలిగినది. కనుక పశ్చాత్తాపముతో "కలుపు దీయా మరచి పోతిరా" అని పలికినది.

చేనికావలి :

పంటకు వచ్చిన పొలమును పక్షులు, జంతువులు మొదలగు వానినుండి కాపాడు నిమిత్తము మంచెలను నిర్మించి వానిపైన కూర్చుండి పొలము నాలుగు వైపుల కాపల కాయుచుందురు. మంచె యనగా నాలుగు వైపుల గుంజలను పందిరివలె నాటి వాని పైన రెండువైపుల ద్వారములు తెరచియుండు చిన్న గుడిసె వేయుదురు. ఎండ ఎక్కువగా నుండిన గుడిసెలోను, ఎండ తక్కువగా నుండిన పందిరి పైనను కూర్చుండి ఎక్కడినుండి ఏ పక్షులు ఎక్కడ వాలుచున్నది గమనించి చూచుచుందురు. తమ చేతులలో వడిసెలను ధరించి వానిలో రాయిని బంధించి దూరముగ విసరుచు పక్షులను పొలముపైన వ్రాలకుండ జాగ్రత్త పడుచుందురు.

ఒక "చెలువుడి చెల్లెలు" ను చేను కావలి యుంచిన, ఆమె కాపలాకాయు విధమిట్లున్నది.

1. సెలయేరు–పుట–116

"చెరువు కట్ట దున్నించి వుయ్యాలా
చెరుకులే నాటించి వుయ్యాలా
మంచెమీదా మంచె వుయ్యాలా
మంచినీళ్లా బావి ,,
చెలువుడీ చెల్లెల్ని ,,
చేను కావలుంచి ,,
ఈనెలు బెండ్లొలిచి ,,
మంచేలే కాపించి ,,
వెండిదే వడిశెల ,,
భమిడిదీ ఆరాయి ,,
గిరగిరా తిప్పుతూ ,,
గుప్పునా రాయొదల ,,
టక్కునా తగులునూ ,,
తల్లకిందుగ పడును ,,
పొయ్యేటి పిట్టలను ,,
బోరలే పగలేశె ,,
నడిచేటి పిట్టల్ని ,,
నడుములే విరగేశె ,,
కూర్చున్న పిట్టలను ,,
గుండెలే మురగేసె ,,
వచ్చేటి పిట్టలను ,,
వడిసెతోనే వేసె ,,
ఆ పిట్ట నీ పిట్ట ,,
గుడికట్టుకొని వచ్చె ,,
వండుమని పెదవొదిన ,,
వాకిట్లొ వేసెనే ,, —[1]

ఈ పాటలో ఈనెలు బెండ్లు ఒలచి కావించిన మంచె, వెండి వడిశె, అందులో పెట్టు భమిడి రాయి "చెలువుడి చెల్లెల్ని" ఎత్తిపొడచుటకు వాడినను, పొలమును

1. పల్లెపదాలు–పుటలు–113–114

కాపలా కాయనప్పుడు వడిశెలతో రాళ్లను రువ్వి పక్షులను తరముట చక్కగా వర్ణింపబడినది. తప్పించుకొనజాలని పరిస్థితులలో ఆ దెబ్బ ధాటికాగలేని పక్షులు నేలకొరుగుట కలదు. నేలకొరిగిన పక్షులను యింటికి తీసుకొని వెళ్ళి వండుకొని తినుటయు జానపదులలో కద్దు. ఇక్కడ చెలువుడి చెల్లెలు కర్కశులైన మగవారిని మించిన గడుగ్గాయి వలె నున్నది. ఇట్టి వారికిని "రాయినా శందనాలో ఓయి.....[1]" అను పాటలోని స్త్రీ స్వభావము నందలి మృదుత్వమునకును హస్తిమశకాంతర భేదమున్నది.

పంటచేని చుట్టు మట్టిగోడలను కట్టి, తుమ్మ కంప వేసి, ముండ్లచెట్లను నాటి బాట వెంబడి పోవు పశువుల నుండి పొలమును కాపలా కాయుచుందురు. పశువుల నుండి రక్షించవలెననుకొని తుమ్మ కంప నాటగ, ఒక స్త్రీ వింతపశువై ఆ తుమ్మ కంపలను దూరిపోయినదట.

"ఆరుగంపా దూరుంగపా, బాలుడేసిన తుమ్మకంపా
తుమ్మకంపలు దూరిపోతబ్బీ, బంగారి సామీ"–[2]

ఇంత కష్టపడి అంత కష్టపడి ఆమె వలపుగాని చెంతచేరినది. పొలమును కాపలాకాయుచును శృంగార కలాపములు నెరపుటలో వెనుకాడని జాణలు కొందరుందురు.

పొలము పండి భూదేవికి నమస్కరించునట్లు వరికంకులు వంగినవి. పిట్టలను తోలుటకు మంచె యెక్కిన 'కాపలా స్త్రీ' చేతి "వడిశెల వారు (దారము)" ఒకటి తెగినది. ఈ అదనులో ఒక గువ్వ అడ్డమాకయు లేక వరివెన్నులను తినుచున్నది. ఏమిచేయలేక అవశురాలైన కాపలా స్త్రీ (పురుషుడైన కావచ్చును) మనోభావమును ఈ క్రింది పాటలో మనము చూడవచ్చును.

వడిశాలా వారు తెగెనమ్మా వోయమ్మలలనా
వడిశాలా వారు తెగెనమ్మా
వడిశాలా వారు తెగెనూ పెడిసాకె–[3] లగువాయె
అదిలిచ్చి తోలితే కదలాదు పెడుసూ ॥వడిశాల॥

---

1. పల్లెపదాలు–పుట–8 2. పల్లెపదాలు–పుట–223.

3. ఒక రకమయిన పక్షి (గువ్వ)

యారణ్ణ శ్రేనికీ యిరవై వరహాల పన్నూ
పన్నెట్లు దీర్తునే పాపిష్టిపెడుసా ॥వడిశాల॥ –[1]

సిత్తజొన్నలూ దిని సిరుబుగ్గ నీరూతాగి
వనపెంట వనములో వొరిగింది పెడుసూ ॥వడిశాల॥

పచ్చి జొన్నలూ దిని పారేటి నీరూతాగి
పారేటి వొడ్డునా పారాడు పెడుసూ ॥వడిశాల॥

యెండిదే వడిశాలా పగిడీదే గుండూ
అదిలిచ్చి తోలితే కదలాదు పెడుసూ ॥వడిశాల॥

గుగ్గుళ్ల కిందికి నుగ్గులకు నే బోతే
నుగ్గులట్లా కంకులనే గగ్గుల్లు సేసే ॥వడిశాల॥ –[2]

వడిశెలను చూచి దాని దెబ్బ జ్ఞాపకము వచ్చి పిట్టలు భయపడును. వడిశెల దారము తెగిన సంగతి గ్రహించిన ఈ పిట్ట కదలదు, మెదలదు. ఆ పిట్ట చేనును పాడుచేయుట వలన కాపలాపిల్ల పొలము యజమానికి చెల్లింప వలసిన పన్నును ఎట్లు చెల్లించగలను? అని బాధపడుచున్నది. కనుకనే ఈ పాటలోని కాపలా మనిషి ఈరన్న సేనికె యిరువై వరహాల పన్ను అనుట పొలమును ఇతరులు కౌలునకు తీసికొని వ్యవసాయము చేయు పద్ధతిని సూచించుచున్నది.

మంచెలను నిర్మించి చేని కావలి కాచుటయేగాక పంట పొలముల యందును, తోటలయందును దిష్టి బొమ్మలను పెట్టుట పరిపాటి. దిష్టి బొమ్మలను చూచి పిట్టలును, జంతువులును నిజమగు మనిషి అను భ్రమతో చేల దరికి రావు. ఈ దిష్టి బొమ్మలను గురించియు పంట కావలి గురించియు రెండు వేల సంవత్సరముల నాటి గాథా సప్తశతి యందును మనోహరమగు వర్ణనలు గలవు.

---

1. ఈ సందర్భమున వ్యవసాయము చేసి నష్టపడిన శ్రీనాథుని విలాప చాటువు జ్ఞాపకము వచ్చుచున్నది. బిలబిలాక్షులు తినిపోయె తిలలు పెసలు ఎట్లు చెల్లింతు టంకంబులేడునూర్లు అని శ్రీనాథుడు చింతించెను.– చాటుపద్యమణిమంజరి–వేటూరి ప్రభాకర శాస్త్రి.
2. త్రివేణి–పుటలు–143–44.

కాళిదాసు రఘుమహారాజు దిగ్విజయమును వర్ణించుచు శాలి గోపికలు (వరిచేలను కాయు పడుచులు) రఘుమహారాజు కీర్తిని పాడినట్లు వర్ణించినాడు. –[1]

తెలుగు ప్రబంధ కవులును ఈ శాలి గోపికలను వర్ణించిరి. –[2]

రఘునాథ నాయకుడు పొలము కాపరి పడుచును అపూర్వముగా ఇట్లు వర్ణించెను.

"కరముల జిలుకలు వ్రాలగ
శరమున రాజసపు టెన్ను చెరివి నవసుదా
కరకళదగు పార్వతులన
పరగుదు రాప్రోలి శాలిపాలిక లెపుడున్. –[3]

రాజులను గూడ శాలిగోపికలు ఆకర్షించినారనిన వారి సౌందర్యాతిశయ మును గురించి చెప్పనే అవసరము లేదు. సాధారణముగ చురుకుదనము అంగసౌష్ఠవము, సౌందర్యము కన్నను ఇతరులను ఎక్కువగా ఆకర్షించును. శాలి గోపికలు నిరంతరము నిలుచుండి వడిసెలు త్రిప్పుట, మంచె అంతటను తిరుగుట మొదలగు శరీర శ్రమ వలన మిగుల నాకర్షణీయముగ నుందురు.

కోత పాటలు :

నాట్లు వేయునపుడు, కలుపులు తీయునపుడు, కోతలు కోయునపుడు పాడు పాటలలో భేదము అంతగా నుండదని ఇదివరకే పేర్కొంటిని. శ్రమాపనయ నమే వీని ముఖ్యోద్దేశము. ఈ మూడు పనులను చేయునప్పుడు పొలములో నడుము వంచి ఏకధాటిగా రోజంతయు శ్రమింతురు. అట్టి శ్రమను తగ్గించు కొనుటకు గుంపులుగాచేరి ఒకరు పాట చెప్పుచుండగా ఆ గుంపంతయు అందుకొని పాడుచుపని చేయుచుందురు. పని వలెనే దీర్ఘకాలము పాడుట కనుకూలమైన పాటలనెన్ను కొందురు.

---

1. రఘువంశము–సర్గ–4–శ్లో. 20.
2. పార్వతీపరిణయము–ఆ. 6 ప. 185.
3. రామాయణము–పుట–ఆ. 2 ప. 12.

గ్రామములోని కామందుల పొలములలో పని యెక్కడనున్నది తెలిసికొని కూలీ స్త్రీలు ఆయా పొలములకు వెళ్ళుదురు. వెళ్ళుచు వారు-

ముప్పావలా-[1] ముప్పావలా కూలొస్తాది
మా అప్పరావే కోతలోకి కూలికెల్దామా ॥మా॥
కూకుంటె కూలొస్తాదా మా అప్పరావె ॥ముప్పా॥
కుందనపు గలత్తికంటె కుదురుగ మెడసరుకొని
దారి తంగేడుపూలు తలను ఒద్ది పెట్టుకొని ॥మా॥ ॥ముప్పా॥
కోతకట్టు ప్రొద్దుటెండ వెచ్చ వెచ్చ కాయుచుండ
చద్దిమూట, కలియ గంజి-[2] ముంత కదలకుండ
తొణకకుండ నెత్తిమీద నిలిపికోని
అంచుల చీర నడుముకు బిగగట్టె రానసక ॥మా॥ ॥ము॥
కొడవలి పిడి నడుముకు చెక్కి
తోడివాండ్ర తోటి కలిసిపోదాము రావె ॥మా॥ ॥ము॥ -[3]

అని పాడుచు ముప్పావల కూలి కదా, అను ఆశతో కోతకూలికి పయనమయినారు. కూలీజనము పనీపాట లేక ఇంటిలో వ్యర్థముగా 'కూర్చోననే కూర్చొనరు'. ఎవరైన కూర్చొనిన తోటివారు వదలక పనికి తీసికొని వెళ్ళుదురు. పై పాటలో పనికి వెళ్ళదలచని ఒక అప్పగారిని పనికి తీసికొనిపోవుటకు ఆమెను బ్రతిమాలుచున్నారు తోటివారు. ఈ పాటలో కూలిజనము కోత పనికి వెళ్ళునప్పుడు సిద్ధమయిపోవు పద్ధతి చక్కగా వర్ణింపబడినది. పొలము దారిలో కనిపించు తంగేడుపూలను సిగలో తురుముకొనుట; సాయంకాలము వరకు పొలము దగ్గరనే ఉండవలెను గనుక ఆహారముగా చద్దన్నము, గంజిని వెంబడి తీసుకొని వెళ్ళుట, చీరను నడుమునకు పట్టుగా బిగించికట్టి కోతపనికి అవసరమగు కొడవలిని నడుములో చెక్కుకొని తోటివారలతో కలిసి పొలము గట్టుకు ప్రొద్దుటెండ వెచ్చదనములో ప్రయాణమగుట సహజ సిద్ధముగా నున్నది.

1. డెబ్బది ఐదు పైసలు.
2. కలినీళ్ళు పెట్టి వండిన అన్నము వార్చగా వచ్చిన గంజి.
3. నేను సేకరించినది-పాడినవారు : అంజమ్మ, అజీజ్‌నగర్.

ఈ పాటలోని కాంత తంగేడు పూవును తలలో తురుముకొనినది. జానపద కాంతలు తంగేడు పువ్వుతోబాటు దారి ప్రక్క కుడివైపున నుండు విష్ణుకాంతము (నీలి వర్ణముగల) పువ్వును తలలో తురుముకొనుట పరిపాటి.

కూలివారి యెద్దడి అధికముగానున్న సమయములలో కామందులు పొలము పనులకు రమ్మని ఒక్కొక్క యింటికి వెళ్ళి ఆశలు రేపుచు వారిని పిలుచుకొని వచ్చెదరు. అట్టి సందర్భమును తెలుపు ఒక పాట :

"ఏలూరి ఎంకమ్మ, కడయింటి కనకమ్మ
దొడ్డెనుక దుర్గమ్మ, దొండపాడు దానమ్మ
వస్తారా నాకూలికి, మీకు ఇస్తాను మంచి కూలి
గుత్తి కుసుమాలొడ్లు, గురుతైన సాంబాలు
రాగి రెక్కాలొడ్లు, కలయ కూలేస్తాను. ॥వస్తారా॥
సరియైన సన్నొడ్లు, గట్టైన గొట్టొడ్లు
వసంధైన పాలసన్నలు, పలిత మిచ్చె పాకాలొడ్లు ॥వస్తారా॥ –[1]

– అని పేరు పేరున పిలిచి కోతపనికి తీసుకొని వెళ్ళుదురు. ఈ పాటలో మేలి రకమైన వడ్ల పేర్లు పేర్కొనినారు. మేలి రకమైన వడ్ల ఆశకు వెళ్ళి వానిని సంపాదించి తెచ్చుకొనిననూ, వానిని ఎక్కువ ధరకు అమ్మి డబ్బు సంపాదించు కొందురేగాని వానిని కూలీజనము తినుటకు ఉపయోగించరు. మామూలుగా "కడుపునకు పట్టుండునని" తొందరగా జీర్ణముగాని 'దొడ్డు"గా నుండు గొట్టొడ్ల అన్నమును (గట్టి వరిబియ్యపు అన్నము) భుజించెదరు. ఈవడ్లు సుకుమారులైన వారికి తొందరగా జీర్ణము కాదన్న మాటయేకాని కాయకష్టము చేయు కూలీజనము సులభముగనే జీర్ణము చేసికొందురు.

పంట కోతకు రాగానే అంతకు మునుపు చేసిన పనులవలెగాక కూలీజనములో అమితోత్సాహము వచ్చును. కూలీ డబ్బేకాక పంటలు బాగుగా పండిన రైతులను యాచించి ధాన్యరూపమైన "చేట దానము"లను గూడ గైకొనవచ్చునని వారిలో ఆశ.

1. నేను సేకరించినది. పాడినవారు–ముత్యాలమ్మ, రాయిప్రోలు.

కోత కొయ్యండమ్మలాలా సేలు, కోరుకున్నా మమ్మలాలా
ఆరు మూడు కాలమైన, అసలుకి మరి కొసరులేదు
సోడినేలు యెన్నులేసి, సోలెడు గింజలకైతే
పాలికాపు బత్తేలకు, సాలొచ్చును, కొయ్యండీ
దసరా భోగాలంటె, ఆసరా తీరుస్తాయి
పసిరాలకి కసవుంటే, భాగ్యాలే పండాయి
సాలొచ్చిన మారాజు, నెయిములగా యిస్తాడు
కాసుసేత పడితేను, గగన మందేము మేము–[1]

కూలి ప్రజలు ధాన్యమును కొసరి తీసుకొనుట పరిపాటి. కావున రైతు కాలము అనుకూలముగా నుండి పంటలో బాగుగా కలిసివచ్చి 'మూడు ఆరు అగునట్టి' కాలము వచ్చిన "అసలుకు మరి కొసరు లేక" చేతులు దులుపును. కూలీలు తమకు సోలెడు గింజలు అధికముగా లభించునన్న తృప్తిలో రైతునకు పంటలు బాగుగా పండవలెనని ఆశించెదరు.

కొయ్యండల్లా కొయ్యండీ కోసీ బణుపూ లెయ్యండీ
వానల వరదల వంగిన సేను వెన్నుల నీనిన వన్నెల సేను
తిన్నగ దీసీ మొదలూ కోసీ పనలన్నీని పొంజెట్టావా
గింజలు బందలో పడిపోకుండా పొందుగ వెన్నులు కొయ్యండల్లా
కాలం సూతే సీతా కాలం కొడవలి పాటూ జాగర్తల్లా
కాలూ సెయ్యా ఆడింతేనే కుండలో కూడు కలిసొత్తాది–[2.]

పై పాటలో కోత కోయునప్పుడు తీసికొనవలసిన జాగ్రత్తలు చక్కగా చెప్పబడినవి. "కాలం సూత్తే సీతాకాలం" అనుట వలన శీతాకాలంలో గాయములు తొందరగా మానవను హెచ్చరిక చేయబడినది. కర్షక జనము "కాలూ సెయ్యా ఆడితేనే కుండలో కూడు కలిసొత్తాది" అనుట వారి స్థితిగతులను తెలుపుచున్నది. కోతకు వచ్చిన పంటను కోయుటను యజుర్వేదము పేర్కొనినది–[3.]

1. పల్లె పదాలు–పుట–12. 2. పల్లెపదాలు–పుట–13.
3. యజుర్వేదము–పుటలు–12, 68.

జానపదులు వ్యవసాయపు పనులలోనే మనసు లగ్నము చేసుకొని పనులొనరించుచు వ్యవసాయపు పాటలనే పాడు కొనుచుండినను సభ్యాసభ్యపు శృంగారపు వ్యవహారములనుకూడ అందు జోడింతురు.

కూలికిపోయె వానినొకనిని పొలము అధికారిణి వలచినది అతనితో

"లింగా, నిన్ను మరవలేనురా,
చిక్కని నామాల కొండస్వామి అసమాన లింగ ॥లిం॥
ఉంటే, ఈ వూరిలో యుంపు
పోతే, మీ వూరికి పోరా
చుట్టు ముట్టు పల్లెల్లా యుంటె
చూడక నా ప్రాణముండదు ॥లిం॥
కూలికి పోతే నాకేరారా
నీమునుము నేనే కోస్తా
కోసిందంతా కట్టలు కడతా
కట్టిందంతా గూటికేస్తా ॥లిం॥

కూలికి తనదగ్గరకే రమ్మని, అతడు కోయవలసిన మునుమును తాను కోయుటకు సిద్ధముగా నున్నానని తెలుపుచున్నదనిన ఆమె అతనిని ఎంతగా వలచినదో! అతనిని చూడకుండ ఉండలేనను భావమును చక్కగా వ్యక్తీకరించినది. అంతేకాక

"గూటిమీద నిన్ను కూచుండబెట్టా
దుత్త అంబలి నీకే పోస్తా
వుల్లిగడ్డ నీ చేతికిస్తా
మేరమేరకు నీ కన్నుల చూస్తా ॥లిం॥-[1]

అని అతనిపైన గాఢముగా మనసు లగ్నమై యుండుటను తెలుపుకొనినది.

పై పాటయే కొద్ది మార్పుతో తెలంగాణా పల్లె పాటలలో-
కూలికి పోయితె నాకె రారా - నాలికి పోతే రారా
నీమునుము నేనే కోస్త - నామునుము నేనే కోస్త

1. సెలయేరు-పుట-120

రాజా నిన్ను మరవలేనురా – రాజా నిన్ను మరవలేనురా
చక్కని నామాలకొండ – స్వామి చక్కని రాజా ! !–[1]

అని పేర్కొనబడినది. పై పాటల క్రమమును పరిశీలించిన ఇట్టి వలపులు అనాదిగా నున్నట్లు మనకు స్పష్టము. కాని ఇవి అరుదు. గాథాసప్తశతిలోను ఇట్టి సంఘటనలు కానవచ్చుచున్నవి. ఒక యజమానురాలికిని, సేవకునకును సంబంధము కలిగినది. వారు పచ్చని చేలలోనే పచ్చ విలుతుని ఆరాధించినారు. ఆమె సుఖ పారవశ్యముతో సొక్కి సోలి కనులు మోడ్చియుండగా ఆ రసికుడు భయపడి తన యజమానురాలు మరణించినదేమో యని పరుగుతీసినాడు. ఆ వెంగళిని చూచి చెంతనున్న అరవిచ్చిన పత్తికాయ నవ్వినట్లున్నదట–[2]

కోతల సమయమున కొడవళ్ళు చేతబూని పనిచేయుచున్న పల్లె పడుచులు

"కొయ్యండి కోతాలు కొడవళ్ళ తోటీ గుణాసారి గున్నమ్మా
కొయ్యించి పొయ్యండి గాదెల్లలోను ,, ,, –[3]

అనుచు యజమాని గాదెలను నింపుటకు ఉద్యుక్తులగుదురు.

కలుపుతీత, కోత వంటి పనులలో స్త్రీల సంఖ్యయే అధికముగ నున్నను పురుషులు గూడ పాల్గొనుట కలదు. అట్లు కోతలు కోసి అలసిసొలసిన ఒక ప్రియుని ప్రియురాలు హెచ్చరించుచున్న ఈ క్రింది పాట ఆమె ప్రేమాతి శయమును తెలుపుచున్నది.

"తలమీద కొచ్చాడు, తండ్రీ సూరీడు
యిలలోన జనులెల్ల, యిసిగి పోనారు
కొడవలీ మొలనుంచి, కోత సాలించి
రావోయి బేబేగ, రంగన్న బావా
మొకమెల్ల కప్పింది ముత్యాల సెమటా

1. తెలంగాణా పల్లెపాటలు–పుటలు–161, 162
2. గాథా సప్తశతిలో తెలుగు పదాలు–పుట–15.
3. జానపద గేయోత్పత్తి (వ్యా)--వింజమూరి సీతాదేవి, కిన్నెర, డిశెంబరు 1953–పుట–572.

ఒల్లెల్ల వొసివాడి కందిపోనాది
కొడవలీ మొలనుంచీ, కోత సాలించి
రావోలు బేబేగ, రంగన్న బావా
బంగారు నీమోము వొసివాడి పోయె
వొల్లెల్ల కందింది, వెర్రీనా బావా

నాట్లు, కలుపు, కోతలు, నూర్పులు అనునవి సమిష్టి పనులు; ఒక వ్యక్తి చేయునవి కావు. ఇవి జానపదులలో సమైక్య భావమును, కలిసికట్టుగా పనిచేయు తత్త్వమును పెంపొందించుటయేగాక ఆత్మీయతను ప్రోది చేయును.

నూర్పులు :

వరి పంట నాట్లు వేయుటతో ప్రారంభమై నూర్పులతో అంతమగును. నూర్పుల సమయమున గాలివాటు నెరిగి ధాన్యమును తూర్పారబట్టుదురు. ధాన్యమందలి పొల్లు గాలికి ఎగిరి దూరముగా పడుటకును, గట్టి గింజలు రాశిగ పడుటకును ఎత్తు ప్రదేశము నుండి పోయుదురు. గాలి లేకపోయిన పొల్లు గింజలు కూడ గట్టి గింజలలో పడును. అందుకనియే "గాడుపు వచ్చినప్పుడే తూరపార బట్టాలి" అను వాడుక యేర్పడినది.

నూర్పుల సమయములో పొలిపాటలను పాడుట పరిపాటి. "పొలిగాడు పంటలను సిద్ధింపజేసే దేవుడు. ఎక్కడైన కుప్పనూర్పులు జరుగుతుంటే పొన్నలన్నీ దాటి పొలిగాడు అక్కడ తయారు"-2 పొలిపదమే "పొలియో, వలియో, వొలియో, ఒలియో"- అను రూపాంతములను చెందినది.

'పొలిగాడంటె' అమితమైన అభిమానము కర్షకులకు, పొలిగాని వలన తమ ధాన్యపురాశి ఎదుగునని వారి నమ్మకము.

"ఎద్దులూ తొక్కంగ యెదిగెనే రాశి
కోడేలు తొక్కంగ కొల్లాయె రాశి
పెయ్యలూ తొక్కంగ పెరిగెనే రాశి

1. మధుర కవితలు-పుట-253 2. పల్లెపదాలు-పుట-18.

పొలిగాడు కొట్టంగ పోగాయె రాశి
వచ్చెనే పొలిగాడు పొన్నలూ దాటీ
దాగెనే పొలిగాడు దండాకొట్టల్లో-1 -[2]

నూర్పు పనిలోవడి వెన్నుల నుండి ధాన్యమును వేరుచేయుటకు ఎద్దులతో, దున్నపోతులతో ఎండిన వెన్నులను తొక్కింతురు.

ఈ సందర్భమున పరస్పరము మేలమాడినట్లుగా నున్న ఒక పాటలో పల్లెటూరి మేనత్త మేనమామ బిడ్డల సరస ప్రసంగము ముచ్చటగొల్పును.

"నవ్వుల నారాశి అత్త కొడుకొచ్చి
నువ్వులు నూర్చాలని నూరెడ్ల నడుగు
పాలుతాగి మాయెద్లు పత్తినూర్పు వెళ్ళె
పదిపుట్ల ధాన్యమ్ము నూర్చేముగాని
పత్తిచేనెన్నడూ నూర్చి యేమెరుగ
నూరుపుట్ల ధాన్యము నూర్చాముగాని
నువ్వుచేనెన్నడూ నూర్చి యేమెరుగ
అత్తకూతురువని అడిగితినిగాని
అతి జాణవే యౌట నిన్ను నేనెరుగ
మామ కొడుకువని మన్నించితిని గాని
మాట కారుడవౌట నిన్ను నేనెరుగ"-[3]

వడ్లను నూర్చుటకే ఎడ్లను వాడుదురు. ఇట్లు నూర్చుటను "బంతి కట్టుట" అందురు. ఈ పాటలోని జాణ తన యత్తకుమారునిని హాస్యము పట్టించుటకు నువ్వుల నూర్పిడికి ఎడ్ల నడిగినది. ఆ రహస్యమును గుర్తించిన అత్తకొడుకు తనయెద్లు పత్తి నూర్పులకు వెళ్ళెననెను. పత్తిని విడదీయుదురే గాని నూర్పరు. ఈ ఇరువురు ఒకరినొకరు మూర్ఖులను చేసికొనుటకు ప్రయత్నించిరి.

1. తూర్పారబట్టినప్పుడు ఏర్పడే ధాన్యపు చార
2. పల్లెపదాలు-పుట-19.
3. మిన్నేరు-పుటలు-170, 296

జానపదులు తాము కష్టపడి పనిచేసి సంపాదించిన ధాన్యపు రాశులను చూచి తమ గొప్పతనమని ఉప్పొంగిపోరు. అంతటికిని భగవంతుని అనుగ్రహమే కారణమను భక్తిభావమే వారిలో మెండు. కుప్పబోసి రాశిగానున్న ధాన్యములోను వారు పవిత్ర దేవాలయముల కొండ శిఖరములనే చూచినారు. -1

"శ్రీశైల పర్వతము శిఖదేలె రాశీ
తిరుపతి గట్టులా దివ్యమై ,,
కాళహస్తిలాగు కళలూరె ,,
కోటప్పకొండలా గొప్పదై ,,
మంగళా గిరిలాగ పొంగెరా ,,
వేదాద్రి గట్టులా వెలిగెరా ,,
దుర్గ గట్టులాగ తోచెరా ,,
సింహాద్రిగట్టులా చెన్నొందె ,, -2

నూర్పుల సమయములో రాశులను కొలుచుటకు సిద్ధముగానున్న సమయమున ఆ కళ్ళము చెంతకు శనగలు, వేరుశనగలు అమ్మువారి గంపలు, కల్లుకుండలును వచ్చుట పరిపాటి.

సిరి సంపదలను, పాడిపంటలను గౌరమ్మకు మారు రూపముగా ఆరాధింతురు పల్లీయులు

"అయిపోయె గౌరమ్మ అయిపోయెనమ్మ
ఆపైన గిరిమీద ఆడి రావమ్మ
మా జొన్నలయిపోయె మేము పోతాము
మళ్ళొచ్చి నీ పాటలెల్ల పాడేము" -3

– అని పాడుకొనుచు నూర్పిళ్ళను ముగించిన పిదప ధాన్యమును రాశిగా పోయుదురు. ధాన్యరాశి నుండి దొంగతనము జరుగకుండుటకు రాశిచుట్టును బూడిదతో గీతగీచి రాశిపై తమ కిష్టమైన గుర్తులను బూడిదతోగాని పేడతోగాని"

1. మన గేయ సాహిత్యము – శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి. భారతి, మే, 1941–పుట–580.

2. పల్లెపదాలు–పుట–22 3. పల్లెపదాలు–పుట–23.

వ్రాయుదురు. దీనినే 'ముద్రవేయుట' అందురు. ముద్రవేయుటకు కొన్ని కుటుంబములలో వంశపారంపర్యముగా వాడునట్టి చెక్కపలకలు గూడ నుండును. రాశి చుట్టును గీయుగీతను 'పొలిగీత' అందురు. పొలిగీత గీయక ధాన్యమును కొలచిన లాభము కలుగదని కర్షకుల విశ్వాసము. ముద్ర వేయువాడు సామాన్యముగ ఇంటి పెద్దయే అయియుండును.

ముప్పై మూర్ల పాగజుట్టి - ముద్దెర పల్క చేతబట్టి
ముట్టిముట్టి ముద్దెర లేత్తువో-ఓ పాటేల-ముప్పైయారు రాసులమీదనో
అరువై మూర్ల పాగజుట్టి - ఆరె బరిగె చేతబట్టి
అరవైయారు రాసులమీదనో-ఓ పాటేల-అంది ముద్దరలేతువో-[1]

ముద్ర వేయునప్పుడు ముద్ర వేయువాడు తలపాగను చుట్టుకొనుట ఆచారము. వివాహాది శుభకార్యములలోను పెండ్లి పెద్దలు తలపాగను చుట్టుకొనుట గమనింపవచ్చును. కళ్ళములోనున్న కర్షకులందరును కుంకుమను బొట్టుగా పెట్టుకొందురు. ఆడవారు అందుబాటులోనున్న పువ్వులను తలలో తురుముకొందురు.

ముద్రవేయుటను 'గురివేయుట' అని ప్రాచీన ప్రబంధములు వర్ణించినవి. వెలిగపూడి కృష్ణయామాత్యుడు భానుమద్విజయమున గురివేయు పద్ధతిని ఉత్ప్రేక్షించెను -2. చంద్రునిలో కళంకమును పలువురు కవులు పలు విధములుగ ఉత్ప్రేక్షించిరి. ఈ కవి ఉత్ప్రేక్ష విచిత్రముగా నున్నది. కర్షకులు ధాన్యమును పండించి రాశులు పోసిరట. అవి ఆకాశమునందలి నక్షత్ర రాశులను తాకెనట, ఆ రాశులకు పేడతో ముద్రలు వేసిరట. ఆ పేడ దగ్గరలోనున్న చంద్రునికి తగిలెనట. అదియే చంద్రునిలోని మచ్చయట. దీనిని బట్టి ఈ ముద్రవేయు సంప్రదాయము తెలుగు దేశమున అనూచానముగా వచ్చుచున్నదని గ్రహింపవచ్చును.

---

1. తెలంగాణా పల్లెపాటలు-పుట-66
2. భానుమద్విజయము - వెలగపూడి కృష్ణయామాత్యుడు. 1-18 దక్షిణాంధ్ర వాఙ్మయము - సంఘజీవితము - భాగము-1, 1967 (అముద్రితము) - విజయ భారతి-పుట-355.

పూర్వము ముద్రలువేసిన ధాన్య రాశులకు నమ్మకస్తులైన జీతగాండ్రను కావలియుంచి ధాన్యమును ఒక రోజంతయు పొలములోనే ఉంచెడివారు. ఎవరైన దొంగతనమును చేసిన ముద్ర చెదరిపోవును గనుక దొంగతనము చేయుటకు సాహసించెడివారు కారు. నేడు గ్రామీణ పరిస్థితులనుబట్టి ప్రజలపైన విశ్వాసము సడలుట వలన రాశులను కూల్చి ముద్రలువేసి, దొంగతనము జరుగకుండ ఆనాడే ధాన్యమును ఇంటికి తరలించుచున్నారు.

ధాన్యమును ఇంటికి తరలించుటకు ముందు ధాన్యరాశికి అనగా పంటలక్ష్మికిని, గ్రామదేవతలకును పూజలు జరుగును. ఈ పూజ పిదప భూస్వామిని ఆశ్రయించుకొనియున్న అన్ని వృత్తులవారును, బుడుబుడుకల వారు, గంగిరెద్దులవారు మున్నగు భిక్షకులు కళ్ళము చుట్టును మూగుదురు. భూస్వామి ఆయా వృత్తుల వారికి తన యోగ్యతానుసారము ధాన్యమిచ్చుటయేగాక భిక్షకులకు దానము చేయును. వ్యాధుడు, పిట్టలను కొట్టువాడు, మత్స్యములను పట్టువాడు ఎట్లు పాపశీలురో కృషీవలుడు కూడ చెట్టు కొట్టుట, దున్నుటయందు పెక్కు జీవరాశులను చంపుట వలన పాపమునుపొందును. కనుక కళ్ళములో ధాన్యమును దానము చేయవలెనని పరాశరస్మృతి చెప్పుచున్నది. దీనినే ఖలయజ్ఞ మనికూడ పరాశరస్మృతి పేర్కొనెను-[1]. పిదప ధాన్యమును బండ్లకెత్తి ఇంటికి చేర్చుదురు. తరువాత ఒక మంచి దినమునుచూచి జీతగాండ్రను కలసి భూస్వామిని కూడ ఆహ్వానించి పంట పొలమున కొత్త ధాన్యముతో అన్నమును వండి, క్షేత్రదేవతకు వేటను-[2] బలియిచ్చి దానిని కూడ వండి పొలమునందే కలసికట్టుగా భుజించెదరు.

ఇదే విధముగా తరతమ భేదము లేకుండ పొలములో పంట కాలమున ఆచరింపబడు మరొక వేడుక "ఉలుప", పంట పొలములో కలుపుతీసిన తదనంతరము పక్షులకు, ఎలుకలకు బెదురుపెట్టుటకు కుండలకు సున్నము రుద్ది, కట్టెలకు తగిలించి వాటికి మనుష్యుల ఆకారము కల్పించుటకు కమీజు,

1. పరాశర స్మృతి, ఆచారకాండము, అధ్యాయము-2, శ్లో. 9, 10.
2 గ్రామీణులు వేటకు మారుగా యాట అందురు. యాట అను పదము వేటనుండి పుట్టి గ్రామీణుల యాసలో ఏట అయి, పిదప యాట అయియుండును.

ధోవతులను చుట్టి నామాలు తీర్చిననాడు ఈ ఉలుప చేయబడును. సరిగ అదే సమయమునకు 'ఉలవ' పంట చేతికివచ్చును. అట్టి 'ఉలువలను" గుడాలు (గుగ్గిళ్ళు)గా వేసి భూస్వామితోబాటు జీతగాం్రడందరును బుక్కెదరు (తినెదరు). కొందరు ఈ సందర్భమున కల్లును సేవించుటయు గలదు. ఇట్టిదే మరియొక వేడుక "చెట్ల క్రిందికి వెళ్ళుట". వరి పంటకు కాముని పున్నమ పండుగతో నీరును కట్టుట (పారించుట) ఆపివేయుదురు. "దీనిని తళ్ళు విడుచుట" అందురు. అప్పటినుండి మరల నూర్పుల సమయము వరకు కర్షకులకు కొంచెము విశ్రాంతి లభించును. ఇట్టి సమయమున కర్షక కుటుంబములు గుంపులుగా బంధుమిత్రులతో చెట్లక్రిందికి వెళ్ళుదురు. ఆరోజంతయు విందులతో, ఉయ్యాలలూగుట వంటి వినోదములతో చెట్లక్రిందనే గడిపెదరు. దీనిని ఉగాది జాతర అని కూడ అందురు. ఈ ఉగాది జాతరలు "కాముని పున్నమ" మొదలు "ఉగాది" పండుగ లోపున ఎప్పుడైనను జరుపుకొనవచ్చును. ఆనాడు స్త్రీలు ప్రత్యేకముగా నాగపంచమి వంటి పండుగలలో వలె పొలము గట్టులలో నుండు పుట్టలకు పాలుపోసి, పుట్టమన్నును తెచ్చుకొనెదరు. కొంత పుట్టమన్నను పొలములందు చల్లుదురు. మరికొంత పుట్టమన్నులో పేడను కలిపి గాదెలను అలుకుదురు. అట్లు చేయుట వలన రాబోవు పంటలు సమృద్ధిగా కలుగునని వారి విశ్వాసము. మిగిలిన పుట్టమన్నును ఎత్తిపెట్టి తరువాతి కారు పంటలో వెదజల్లుటకు గృహము లందు భద్రపరచుదురు.

ధాన్యమును ఇంటిలోని కణజముల (ధాన్యాగారము) లోను, గాదెలలోను, గరిసెలలోను భద్రపరుతురు. వానిలో వినాయక విగ్రహమును ఉంచుట ఆచారము. వినాయకుడు మరుసటి పంటను గూడ బాగుగా పండించునను విశ్వాసమునకు ఇది చిహ్నము. గణపతిని పంటల దేవునిగా ఆరాధించుట అనాదిగా నున్నది. గణపతికి నున్న శుర్పకర్ణ, ఏకదంతాది పర్యాయములు ఇతడు పంటల దేవుడనుటకు సాక్ష్యములు. చేటలు ధాన్యము తూర్పారపట్టుటకు ముఖ్యమైనవి. ఏక దంతము నాగలికి రూపకల్పన. లంబోదరము-ధాన్యము గాదె-దానిచుట్టు పామును బిగించుట పంటలను పాడుచేయు ఎలుకలను

నాశనము చేయుటకు సూచన.–[1] గణేశుడు మొదట ఆర్యేతర వ్యవసాయ దేవతయని అతని ఆకార విశేషములను బట్టి నిర్ధారణ చేయవచ్చును.–[2]

పంట ధాన్యమును కళ్లము నుండి తరలించిన పిదప కళ్ళమున అడుగులో మిగిలిపోయిన ధాన్యమును, చుట్టుప్రక్కల చెదిరిన ధాన్యమును ఒక దగ్గరికి చేర్చి భూస్వామి చెంత పనిచేయు జీతగాండ్రు పంచుకొందురు. దీనిని "లేకి" అందురు. "లేకి చేటకు రాదు, కూలి కుండకు రాదు" అను వాడుక యున్నను లేకి వలన చాల ధాన్యమును సేకరించువారును ఉందురు. నూర్పుల సమయము నను ధాన్యపు కట్టలు కొట్టునప్పుడు సగము కొట్టిన కట్టలను విడిగా పడవేయుదురు. వీనిని "దొంగ కట్టలు" అందురు. ఈ కట్టలను కూడ పిదప జీతగాండ్రు నూర్చుకొని ధాన్యమును పంచుకొందురు.

ఇంటికి చేరిన క్రొత్త ధాన్యమును ధనిక దరిద్ర భేదము లేకుండ కొంత దంచి, మంచి దినము చూచి గంజి వార్చకుండ అన్నమును వండెదరు. రోలు రోకలిని, విసురురాయిని, చల్లగుంజను, కూరాటికుండను, ఇలువేల్పులను పసుపు కుంకుమలచేత నలంకరించి, తమలపాకును లేదా మఱ్ఱియాకును బిగించిన పసుపు దారములను కట్టెదరు. పచ్చని విస్తరాకులలో వండిన అన్నమును కొంత తోడి పెరుగు, నెయ్యి, బెల్లము, వండిన పెసరపప్పును ఆ అన్నముపైన బెట్టి వాటికి నైవేద్యమిడుదురు. నైవేద్యము పెట్టిన పిదప ఆ ప్రసాదమును మొట్టమొదట ఇంటి ఆడపడచులు భుజింపవలెను. పిదప కోడండ్రు భుజింపవలెను. దీనిని "క్రొత్త పెట్టుట" అందురు. ఇది ఒక పండుగగా జరుపబడును. సాధారణమగు పండుగలకు ఆడుబిడ్డలను పిలిపించినట్లే క్రొత్త పెట్టుటకు కూడ పిలిపింతురు. నేడు నాగరికత ప్రబలుట వలన కొందరు ఉగాది వంటి పండుగలనాడే క్రొత్త బియ్యముతో 'క్రొత్త పెట్టుట'యును కలదు.

ఇంత వరకును వ్యవసాయము ప్రధానముగా గల పనులు పేర్కొనబడినవి.

---

1. సాహితీసుగతుని స్వగతం–వినాయకుడు(వ్యా) తిరుమల రామచంద్ర, భారతి, సెప్టెంబరు 1960–పుట–84.
2. Abstracts of Folk Lore studies - Volume XIII. Number 1. The American Folk Lore Society, 1975-page.23. A study of Ganesh (essay) SEN Gupta Shankar.

గృహ పరిశ్రమలు :

శ్రామిక గేయములలో వ్యవసాయ ప్రధాన గేయముల తరువాత ముఖ్యమయినవి గృహ పరిశ్రమాధారమైన గేయములు. నిత్య జీవితమున వంటావార్పులు ప్రధానమైనట్లే వాని కనుబంధమై, వానిని ఒదిగించగల దంచుట, విసరుట మున్నగు పనులు కూడ ముఖ్యమైనవి. ఇవి దీర్ఘకాలము కొనసాగునవి. అందువలన వానిలో శ్రమ ఎక్కువగా నుండును. కొందరు జీవనోపాధికై దంచుట, విసరుట, నూలువడకుట మున్నగువానిని నిరంతరము చేయవలసి యుండును. అప్పుడు కలుగు అలసటను పోగొట్టుటకు పాటలు పాడుకొందురు. ఈ పాటలను ఎడతెరపిలేక పాడుదురు. కనుకనే ఎవరైనను ఏ విషయమునైన చాలసేపు చెప్పుచున్నప్పుడు వినుట కోపిక లేక దంపుళ్ళ పాటలను దృష్టిలో నుంచుకొని "ఏమి నీ రోకటి పాట" అని విరసించుటయు కూడ మనము చూచుచున్నాము. రోలు రోకలి నిత్యజీవితములో భాగమైనందున దానిపై ఎన్నియో సామెతలు పుట్టినవి. రోటిలో తలబెట్టి రోకటి పోటుకు వెరచినట్టు, రోలు కరువు నెరగదు; రోలు వెళ్ళి మద్దెలతో మొరబెట్టుకొన్నట్లు; రోహిణి కార్తిలో విత్తుట రోటిలో విత్తుటే; "గోరు చుట్టుమీద రోకటి పోటు" – ఈ సామెతలలో కోరి కష్టములను తెచ్చుకొని భయపడుటను, మన కష్టములను మన కన్నను మిగుల కష్టపడు వానితో మొరబెట్టుకొనుటను సహజముగా పరిహసించుట కానవచ్చును.

దంచుట, విసరుట చాల శరీర శ్రమతో కూడిన పనులు, దంచునప్పుడు నిటారుగా నిలుచుండి చేయెత్తి పోటువేయుట, పెక్కుమంది వరసలో పోటువేయుట శరీర శ్రమను కలిగించుటయేగాక బుద్ధికిని, చాకచక్యమునకును నికషములు. కనుకనే ఈ పనులు కష్ట సాధ్యములయినను స్త్రీలకు వ్యాయామము వంటివి అంగసౌష్ఠవమును కలిగించును. ప్రాచీన కవులు దంపుళ్ళలోనున్న మహిళల సౌందర్యమును వర్ణించిన సందర్భములు కలవు.

"సువ్వి సువ్వి సువ్వి సువ్విని, సుదతులు దంచెదరోలాల ॥పల్లవి॥
వనితలు మనస్సులు కుందెన చేసిటు వలపులు తగనించోలాల
కనుచూపులనెడు రోకండ్లను కన్నెలు దంచెదరోలాల ॥సువ్వి॥
బంగరు చెఱగుల పట్టు పుట్టములు కొంగులు దూలగ నోలాల
అంగనలందరు నతి వేడుకతో సంగడి దంచెదరోలాల ॥సువ్వి॥

కురులు దూలగ మంచి గుబ్బచనులపై, గురులు దూలాడగనోలాల
అరవిరి చాగుల నతివలు ముద్దులు, గురియుచు దంచెదరోలాల ॥సువ్వి॥
ఘల్లు ఘల్లుమను కంకణరవముల పల్లవ పాణుల నోలాల
అల్లన నడుములు అసియాడుచు సతులొల్లనె దంచెదరోలాల ॥సువ్వి॥
కప్పురగంధులు కమ్మని పువ్వుల చప్పరములలో నోలాల
తెప్పలుగా రతి దేలుచు గోనేటప్పని బాడెదరోలాల-1 ॥సువ్వి॥

మగువల దంపుళ్ళను తిలకించిన అన్నమాచార్యులు తనకు కలిగిన పారవశ్యమును ఈ పాటలోని శైలిలో ఎట్లు పొందుపరచెనో సహృదయులే తెలిసికొనగలరు. ఈ పాటలోని సుదతుల అందమును నేడు కూడ గ్రామములలో నచ్చటచ్చట కనులార కనవచ్చును. ఇట్టి పాటను తలపింపజేయుచు సెలయేరులో నొక పాట గలదు.

ఓలాలా !
కంచెల చెరిగే చేడికురులపై
తుమ్మెద లాడిన వోలాలా
ఘనతుమ్మెద లాడిన వోలాలా
చెమటకు తడిసి చెదరిన గంధం
ఘుమఘుమ లాడిందోలాలా !
అది ఘుమ ఘుమ లాడిందోలాలా !
ముఖమున ఉండే కస్తురి తిలకం
ముక్కుకు జారిందోలాలా
కొనముక్కుకు జారిందోలాలా॥
చెరిగేటప్పుడు చేతుల గాజులు
గలగలలాడిన వోలాలా
అవి గలగల లాడినవోలాలా॥
గొప్పది రోకలి, గుప్పున దంచగ
జబ్బలు కదిలిన వోలాలా !

1. తాళ్ళపాక అన్నమయ్య పాటలు-తిరుమల-తిరుపతి దేవస్థానం వారి ప్రచురణ-పుట-52.

ఘనజబ్బలు కదలిన వోలాలా !!
హంస నడుకలు నడిచే భామకు
అందెలు కదలిన వోలాలా
కాలందెలు కదిలిన వోలాలా–[1]

ఈ పాటలో దంచుట అను పనియందు నిమగ్నురాలైన ప్రియురాలి అందచందములను ప్రియుడు తిలకించుచు ముగ్ధుడగుటను గమనింపవచ్చును. ఇందు కవితా స్పర్శ కొంతయున్నను జానపదుల భావనా రీతిలో నుండు సహజత్వ మును కోలుపోలేదు. నల్లని కురులను తుమ్మెదలతో పోల్చి చెప్పుట కవి సమయము. ఇక్కడి జానపదునికి ఏ కావ్యములో ఏ వర్ణన కలదోయని వెదకి ప్రయోగములను వాడవలసిన అవసరము లేదు. నిత్యజీవితములో అతడు తిలకించు సుందర దృశ్యములే అతనిని కవి నొనరించినవి. చెమటకు గంధము తడియుట, కస్తూరి తిలకము ముక్కుకు జారుట, చెరుగునప్పుడు చేతుల గాజులు గలగలలాడుట, రోకలితో దంచగ జబ్బలు కదలుట, హంస నడకలవంటి ఒయ్యారపు నడకలలో అందెలు కదలుట సహజము. ఇట్టి సహజ లక్షణములే అతనికి తన ప్రియురాలిలో ఒక ప్రత్యేకత నాపాదింపజేసినవి. స్త్రీలకు వారు చేయు పనులు అందమును అతిశయింపజేయుననుటకు ఈ పాట చక్కని ఉదాహరణము.

జీవిత విధానమునకు ప్రతిరూపమైన గాథాసప్తశతిలో వంట మసి మోమునకు తగిలి చంద్రసుందరముగ నింపు గొలుపుచున్న భార్య ముఖమును చూచి భర్త నవ్వినట్లును,–[2] పిండి దంచుచుండ పిండి మేన నిండియుండిన కాపుబిడ్డ క్షీరసాగరమునుండి బయలు వెడలివచ్చు లక్ష్మీదేవివలె బాటసారులను ఆకర్షించినదనియు–[3] గాథలు కలవు.

విసరురాతి పాటలును దంపుడు పాటలవంటి ప్రాముఖ్యము గలవే. పిండి లేక ఏ పిండి వంటలను చేయలేము. బియ్యపుపిండి, శనగపిండి ప్రత్యేకమగు వంటలలో వాడినను గోధుమపిండి, జొన్నపిండి, రాగిపిండి నిత్యావసరములు.

---

1. సెలయేరు–పుట–126.
2. శ్రీ శాలివాహన గాథా సప్తశతీ సారము–అనువాదము–రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ–పుట–3, పద్యము–11.
3. అదే–పుట–77, పద్యము–308.

అనంతపురము జిల్లా పెనుగొండ ప్రాంతములో విసరురాతిని "రాగురాయి" అని కూడ వ్యవహరించెదరు. ఇందలి పాటక జనుల ముఖ్యాహార ధాన్యము రాగులు అగుటయే బహుశః ఇందుకు కారణము కావచ్చును. రాగులే ఎక్కువగా విసరి "సంకటి" చేసికొని ఆహారముగా గ్రహించెదరు. రాగులు విసరుట వాళ్ళ నిత్యకృత్యములలో నొకటి. అందుచేతనే "రాగురాయి" అని పిలువబడుచున్నదని తలంపవచ్చును. –[1]

మానవునికి తినతిండి తరువాత ముఖ్యమైనది కట్టుటకు బట్ట. నూలువడకుట బట్టలు నేయుట మనదేశమున అనాదిగానున్న పరిశ్రమలు. వీనిలోను స్త్రీలకు ప్రాముఖ్యమెక్కువ. నూలు వడకుటలో స్త్రీలదే పై చేయి. సన్ననూలుకు తెలుగుదేశము పేరు వడసినది. నూలు వడకుట ప్రధాన జీవికగా పూర్వకాలము నుండి కలదు. "కౌటిల్యుని కాలమున పేదవారు, ఇల్లు కదలని ఉన్నత కులస్త్రీలు, నా యనువారు లేక విడిగానున్నవారు, భర్త సముద్ర వ్యాపారమునకు వెళ్ళగ జీవికకై పాటుబడవలసిన స్త్రీలు, విధవలు, కన్యలు, స్వయముగ తమ జీవికను నిర్వహించుకొనవలసి వచ్చినప్పుడు ఇంటియందే నూలువడకి దానిని స్వయముగా గాని సేవకుల మూలమునగాని వస్త్రములు నేయు స్థలములకు పంపెడివారు. స్వయముగా వెళ్ళువారు సూర్యోదయమునకు ముందె అక్కడికివెళ్ళి నూలు అప్పగించి వారినుండి ధనమో, సరకులో ప్రతిఫల ముగా తీసికొనుచుండిరి. –[2] తమ జీవిక కోసము నూలు తెచ్చియిచ్చి వస్తు వినిమయము చేసికొనుటకు వచ్చు స్త్రీల ముఖమును తేరిపార జూచుచు వారితో నితర విషయములను ముచ్చటించు నేత సంస్థ పర్యవేక్షకుని శిక్షింపవలెనని కౌటిల్యుడు చెప్పెను. ఇతర దేశములలోను స్త్రీలు పర్యవేక్షకుని శిక్షింపవలెనని కౌటిల్యుడు చెప్పెను. ఇతర దేశములలోను స్త్రీలు వడకుట వృత్తిగా గలిగియుండిరి. జపాను మహిళలు పట్టుకాయలను ఒలచి పట్టు పరిశ్రమను ప్రారంభించిరనుట ప్రసిద్ధము. జపానులో కల టోక్యో చిత్రవస్తు ప్రదర్శనశాలలో వేయేండ్ల క్రిందటి లిఖిత పుస్తకమున్నది. దానిలో కురియా మహిళలు జపానుకు చేనేత కళను తెచ్చిన విధము వర్ణితమైనది. –[3]

1. జానపద సాహిత్యసంపద–విసురురాతి పాటలు (వ్యా) శ్రీఎస్, గంగప్ప, భారతి, డిశంబరు, 1970–పుట–43.
2. Some aspects of Social Life in Ancient India - Sandhya Mukerjee. page.-130.
3. On understanding woemn - Mary R, Beard - page.45

పెరుగు చిలుకుట, వెన్నతీయుట పైన చెప్పిన వృత్తులంత ప్రధానము కాకపోయినను నిత్యజీవితములో అవసరమయినవే గనుక స్త్రీల దృష్టి వానియందును ప్రసరించి పాటలుగ రూపొందినవి. ఈ పాటలను కవ్వము పాటలందురు. కవ్వము పాడికి చిహ్నము. నిత్యకృత్యములలో తెల్లవారుటతోనే ప్రారంభమగు మేలు కొలుపులతో బాటు కవ్వము పాటలు ప్రారంభమయి శ్రవణ పేయముగ వినబడును.

దీపారాధనలో నుపయోగించు వత్తులు సిద్ధము చేయుట, విస్తరాకులను కుట్టుట, అప్పడములు చేయుట, వడియములు పెట్టుట వంటి పనులను గూడ స్త్రీల గృహపరిశ్రమలలో గ్రహింపదగును.

గృహజీవన యాత్రలో ఎప్పటికప్పుడు సంభవించు సుందర సన్నివేశము లను, కష్టములను, ఆవేదనను జానపద మహిళలు మననము చేసికొని పాటలుగ చిత్రించినారు. ఇట్టి పాటలలో వారి ఆత్మోద్గారము ఇతివృత్తము కన్నను స్వగతముగనే వెలువడును, పరిశ్రమలోనుండు శ్రమననుసరించి, అందు వినియోగించు సమయముననుసరించి కథారహిత గేయములతోబాటు, కథాసహిత గేయములను పాడుదురు. కథాసహిత గేయములలో రామాయణ భారతాది కథలను సహితము తమ యిష్టానుసారముగా మలచుకొని, మూలము ననుసరించవలెనను నియమము లేవియును పాటింపక తమ మనోభావముల కనుకూలముగ కథాసన్నివేశములను మార్చుకొని పాడుదురు.

గృహజీవనము నాశ్రయించుకొని గృహపరిశ్రమల ననుసరించి పాడుపాటలను ఈ క్రింది విధముగా విభజించవచ్చును. 1. కవ్వము పాటలు, 2. రోకటి పాటలు, 3. విసరురాతి రాటలు, 4. రాట్నము పాటలు,

కవ్వము పాటలు :

కదురు కవ్వంబులు కలయాడునింట
కరువు కాటకంబులు కలికానలేవు –[1]

1. సెలయేరు–పుట–18

ఈ రెండు పంక్తులు చిన్నవిగా కనిపించుచున్నను, కదురుకవ్వములనునవి చిన్న వస్తువులైనను వీని ప్రభావము గొప్పది. కదురాడుట యనగా వస్త్ర పరిశ్రమకు, కవ్వమాడుట యనగా పాడి సమృద్ధికి సూచకములు. ప్రాచీనులు ప్రతి యింటను ఈ రెండు సంపదలు సమృద్ధిగానుండిన దేశములో క్షామమున కవకాశముండదని విశ్వసించినారు.

పాడి సమృద్ధిగానున్న గృహములలో మీగడ పెరుగును చిలికి వెన్నదీసి చల్ల చేయుదురు. ఈ చల్ల చిలుకు కార్యము తెల్లవారుజామున నే పూర్తిచేయదురు. ప్రొద్దెక్కిన వెన్న సరిగా పడదను నమ్మకము కలదు. ప్రాతః కాలమున చల్లజేయుటకు కవ్వము నాడించుట, గృహకృత్యములను పూర్తిగావించుకొని తీరిక వేళలలో నూలును పడకుటకు కదురు రాట్నముల నాడించుట వలన ఆ పనులు ఇంటిలోని యువతల గృహిణీత్వముతోబాటు వారు సంపాదించగలిగిన డబ్బును చెప్పక చెప్పుచున్నవి. అన్ని పనులలో వలెనే ఈ కవ్వముతో చల్లను చిలుకునప్పుడు చేతులను వెనుకకు ముందునకు కవ్వమునకు బిగించిన త్రాడుతోబాటు నాడించుచు పాటలను పాడుదురు.

అన్నా బిండేటి పాలు - కిన్నెరల మోత
అమ్మా చేసేది చల్లోయీ
అమ్మా చేసేది చల్లా - కవ్వాల మోత
రాగిదీ కవ్వామోయీ
రాగిదీ కవ్వాము - రవ్వాడే వెన్న
చింతాదీ కవ్వామోయీ
చింతాదీ కవ్వాము - చిల్లాడె వెన్న
దంతేదీ కవ్వామోయీ
దంతేదీ కవ్వామూ - ధ్వనులెల్ల చల్ల
ఉక్కుదీ కవ్వామోయీ
ఉక్కుదీ కవ్వాము - ఊగోచు వెన్న
రేపల్లె వాడలోయీ
రేపల్లెవాడల చల్లమ్మ చల్ల.-2

2. పల్లెపదాలు-పుట-45

ఈ పాటలోని యువతి తన అన్న పితుకు పాలలో కిన్నెరల మోతను, అమ్మ చేయు చల్లలో కవ్వముల మోతను విని ఆనందించినది. పాటలో పెరుగును చిలికి చల్లనుచేయుచు వెన్నదీయుటకు రాగి, చింత. దంతము, ఉక్కు కవ్వములు పేర్కొనబడినను గ్రామములందు ఈ కవ్వములేవియు కనుపించవు. చింతకట్టెను పొయ్యిలో వంటచెరుకుగా తప్ప ఇంటిలో వండే వస్తువులకు వాడరు. చింత కట్టెను వాడిన చింతలు కలుగునని వారి విశ్వాసము. కవ్వమునకును, కవ్వము మొదలు బిగించబడు కవ్వపు బిళ్లకును సామాన్యముగా నల్లమద్దికట్టెను, చల్లగుంజకు గారెకట్టెను ఉపయోగింతురు.

చల్లగుంజను ఇంటిలో ప్రతిష్ఠించునపుడు (పాతునవుడు) గుంతలో ముత్యమును, పగడమును, పంచలోహపు ముక్కలను అడుగునవేసి దానిపైన కృష్ణాష్టమి పండుగ సందర్భమున ఉట్లు కొట్టునప్పుడు ముక్కలై క్రిందపడు కుండపెంకును (బోకిని) ఉంచెదరు. తరువాత పసుపు, కుంకుమలతో పూజించి దానిపైన గుంజను పాతుదురు. ఉట్ల పండగనాటి కుండ ముక్కను గుంతలోనుంచిన పాడి సమృద్ధిగా గలుగునని జానపదుల విశ్వాసము. ఈ విశ్వాసమును గాఢముగ విశ్వసించువారు తాము క్రొత్తయిండ్లు కట్టునప్పుడు ఆ సంవత్సరమున వచ్చు కృష్ణాష్టమినాడు ఉట్లలో ఉంచు కుండను పగులకుండ, ఇతరుల చేజిక్కకుండ నేర్పరులైనవారిచేత తెప్పించుకొని దానిని భద్రపరిచి చల్లగుంజను ప్రతిష్టించు నప్పుడు అడుగున 'కుండకు కుండ' మొత్తముగా నుంచుట కలదు.

నేటి కాలమున ఇంటికవసరమైన పాలను ఉంచుకొని మిగిలిన పాలను ఎప్పటికప్పుడు అమ్మివేయుచున్నారు. కాని పూర్వ పద్ధతిననుసరించి గ్రామములలో పాలను అమ్ముట కవకాశములు తక్కువ. ఎన్ని పాలున్నను వాటిని ఇంటిలోనే కాచి తోడుబెట్టి, తోడిన పెరుగును చల్ల చేసెడివారు. పాలను కాచుటకు ప్రత్యేకమైన పొయ్యి ఉండును. ఇది కట్టెల పొయ్యి మాదిరిగగాక కుంపటి ఆకారములో భూమి లోతులో నుండును. దీనిని 'దాలి' అందురు. దాలి పొయ్యిలో పాల కొలతనుబట్టి పిడకలు వేసి నిప్పును రాజవేసి, పాలను కుండలో బోసి పెట్టుదురు. కుండపైన మూతగా కుండ పరిమాణము ననుసరించి అటికలనుగాని గురుగులనుగాని వాడుదురు. వీటిలో కొంచెము నీళ్ళుబోసి పాలకుండపైన కొద్ది వంపులోవంచి అడ్డముగా మూతబెట్టుదురు. పాలు మరగకాయునప్పుడు బిగ్గరగా

మూత ఉండిన పొంగుటకు అవకాశముండును గనుక మూతను బిగ్గరగా బెట్టకనిట్లు ఓరగా పెట్టుదురు. వారు వాడు పిడకల సంఖ్యనుబట్టి పొంగుటకే అవకాశముండదు. ఒకవేళ పొంగు వచ్చినను వచ్చిన పొంగుపై చల్లుటకు నీరు మూతగా నుపయోగించు గురిగిలోనే సిద్ధముగనుండును. సన్నని మంట సెగలో పాలు బాగుగ మరిగి మీగడ కట్టును. మీగడెంత బాగుగా కట్టిన చల్ల చేయునపుడు వెన్న అంత బాగుగా వచ్చును. పాడి కలిగిన వారింటికి చల్ల కొరకు ముంతలు తీసికొని ఊరిలోని పాడిలేనివారు వచ్చెదరు. వారు చల్లకు మారుగ తవుడును ఇంటివారికి ఇచ్చిపోవుదురు. నేడు తవుడుకు మారుగా డబ్బును ఇచ్చుటయు కలదు. మిగిలిన చల్లను పేదబిక్కికి, జీతగాంద్రకు పోయుదురు. వారికి జొన్నగటుకతో బాటు చల్లయున్న పూట గడచిపోవును. ఇందరికి పంచగా ఇంకను మిగిలినచో, చల్లను కుడిదిలోగాని పెరటిలోని కరివేపాకు చెట్లకుగాని పోయుదురు. కుడిదిలో బోసిన చల్లను త్రాగిన బఱ్ఱెలు, ఆవులు పాలు బాగుగా నిచ్చుననియు, కరివేపాకు చెట్లకు బోసిన కరివేపాకుకు వాసన ఎక్కువగుననియు వాడుక. ఇప్పటికిని మిగిలిన పుల్లటి చల్లను కరివేపాకు పాదులలో పోయుచుందురు.

చల్లలోనుండి తీసిన వెన్నముద్ద కొఱకు పిల్లలు తల్లిచుట్టు మూగుట ఒక సుందర దృశ్యము. వెన్నముద్దతో కూడిన జొన్నరొట్టెను తినుటలో పిల్లలుచూపు ఉబలాటము అమితము. వారిని పాలమీగడ కంటె పాల గోకు, మీగడ పెరుగు కంటె వెన్న విశేషముగా ఆకర్షించును. మిగిలిన వెన్నను కాచి నెయ్యిచేసి కోమటి వారికి అమ్ముదురు.

గ్రామములలో పదిమందికి పంచగలిగిన పాడిని గొల్లవారును, ధనిక కుటుంబములును కలిగియుండుట సామాన్యము. పంటతోబాటు పాడిని కలిగిన వారిలో పటేండ్లు ముఖ్యులు. అందుకయే "పటేలు ఇంటికి పాలకని చల్లకని"-1 గ్రామీణులు పోవుచుండుట పరిపాటి.

చల్లకు వచ్చిన గ్రామీణులు-
"ఆయింటి ఈ యింటి పొరుగు
పొరుగు నాకు బోసె పెరుగు" -[2]

1. తెలంగాణా పల్లెపాటలు-పుట-132.
2. తెలంగాణా పల్లెపాటలు-పుట-41

అని సంతోషపడునట్లుగ అడిగినంతనే పెరుగు మజ్జిగలను లేదనకుండ వోయు గృహిణులను "చల్లను బోసిన కడుపు చల్లగుండ" అని దీవించుచు వెళ్ళుదురు.

రోకటి పాటలు :

రోకటి పాటలను దంపుళ్ళ పాటలనుట సామాన్యము. వీనికి సువ్వి పాటలని కూడ పేరు. "సువ్వి" అనునది దంచుటయందు కలుగు శ్రమ వలన వెలువడు ఊర్పుల శబ్దము – ఉస్, ఉస్ అను దానిని బట్టి ఏర్పడియుండవచ్చును.

గృహ పరిశ్రమలలో దంపుళ్ళ పని ముఖ్యమైనది. దీనిని ఒక పెద్ద కుటీర పరిశ్రమ అనవచ్చును. పండిన ధాన్యమును ఉన్నదున్నట్లే ఏ కందమూలముల వలెనో, ఫలములవలెనో తినలేముగదా! వానికి సంస్కారము అవసరము. కందులు, పెసర్లవంటి పప్పుదినుసులను పప్పునంటుకొని యుండు పొట్టును తీయక పోయినను తినవచ్చును గాని వడ్లను పొట్టుతీయక తప్పదు. నాగరికత ప్రబలని కాలములో ఆదిమానవులు ధాన్యమును బండలపై పోసుకొని మరియొక రాతితో దానిని నూరి పొట్టు తీసి తినెడువారట. ధాన్యమును సులభముగ పొట్టుతీసి బియ్యమును చేయు సాధనమును కనిపెట్టుట అనగా రోలు రోకళ్ళను కనిపెట్టుట నాగరికతలో ప్రధాన ఘట్టము.

ఒకరి కీర్తి బహుళ ప్రచారము పొందిన దనుటకు 'రోళ్ల రోకళ్ల పాటలు' అను నానుడి ప్రచారమందినది. శివభక్తుల కథలను అప్పటి స్త్రీలు ఈ విధముగా పాడుచుండిరని పాల్కురికి సోమనాథుడు తెలిపెను.

"…. ….రొకటి పాటలట్లు వేదములు
పనుగొన మా శివభక్తుల యిండ్లు"–[1]

దీనిని బట్టి శివభక్తుల చరిత్రములు ఎంత బహుళ ప్రచారమంది యుండినవో కనుగొనవచ్చును. నన్నె చోడుదును ఒక శబర కామిని

"పటికపు రోలముల్ వెదురు ప్రాలొగి బోయుచు గౌరు కొమ్మురో
కటగొని దంచుచున్…. …. …. …. ….రసో
త్కటముగ …. …. …. …. …. …. …."–[2]

1. బసవపురాణము. 2. కుమార సంభవము

జంగము మల్లికార్జునుని కథను పాడెనని వర్ణించినాడు. విన్నకోట పెద్దన--

తలకొని తలంబ్రాలు దంపెడు వేళ - [1]

తరువోజలు పాడెదరని చెప్పినాడు.

నేడు ప్రచారమునందున్న రోకటి పాటల వరుసలను గమనించిన డా॥ యస్వీ జోగారావు గారన్నట్లు "రోకటి పోటునకు ఎన్ని యొదుపులుండునో యా పాటకన్ని గతులుండును"-[2] పాటననుసరించి, పాట చెప్పువారి ననుసరించి ఈ గతులలో మార్పుల గోచరించుచుండును.

రోటి బండను గృహములలో ప్రతిష్టించునప్పుడు అడుగున పగడము, ముత్యములతో బాటు పంచలోహపు ముక్కలను ఉంచుట వరిపాటి. చల్లకవ్వము వలెనే రోకండ్లను కూడ చేవ గలిగిన నల్లమద్ది కట్టెతో తయారు చేయుదురు.

వడ్లను దంచుటకు మామూలు పచ్చడ్లను నూరు రోలు రోకలి సరిపోవు. ఒకేమారుగ రోటిలో బుడ్డెడు, కుండెడు వడ్లను బోసి దంచుదురు. కనుక రోలు పైన కట్టె కుదురునుగాని ఇనుప కుందెననుగాని అమర్చెదరు. ధాన్యము బాగుగా నలుగుటకు అనుకూలముగా రోకళ్లకు చివరన "ఇనుప పొన్నులను" వేయించెదరు. ఒక చెల్లెలు అన్నను తనకు మంచి చేవ రోకళ్ళు చేయించుమని కోరుచు వానికి సర్వసాధారణముగా వేయు ఇనుప పొన్నులకు మారుగ వెండి పొన్నులను వేయించు మని అడుగుచున్నది ఈ క్రింది పాటలో :-

"నా చేతి రోకళ్ళు నల్ల రోకళ్ళు
చేయించు అన్నయ్య చేవ రోకళ్ళు
వేయించు అన్నయ్య వెండి పొన్నుల్లు"-[3]

ఈ రోకటి పాటలు నాటినుంచి నేటివరకు వినిపించుచునేయున్నవి. స్త్రీలు దంపుళ్ళ సమయమున పాటలు పాడుచు అలసటను తీర్చుకొనుచు ఎన్ని గంటలైనను వడ్లు దంచుదురు. నేడు వడ్లమరలు, పిండిమరలు పల్లెటూళ్ళలోను

1. కావ్యాలంకార చూడామణి.
2. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర-పుట-348
3. సెలయేరు-పుట-16.

వ్యాపించుట వలన విసరురాయి శబ్దము శ్రుతిగా, రోకటి దంపుళ్ళు మద్దెల ధ్వనిగా పాటలు వినబడవు. కాని మారుమూల గ్రామములలో ఇవి ఇంకను జీవించి యున్నవి.

పూర్వము దంచుట నిత్యకృత్యములలో నొకటి గనుక ఇది ప్రతి గృహిణికిని తెలిసియుండెడిది. దంచుట తెలియని వారుండుట అరుదు. దంచుట తెలియని వారు నవ్వులపాలగుటయు, తెలిసినవారు ప్రశంసలు పొందుటయు కలదు. ఒక గృహిణి "గాజులెవరికి అందమ్మో" అని ప్రశ్నించి "చేయెత్తి పోటెట్టు చెలియకందమ్మో"-1 అని తానే సమాధానము చెప్పినది.

గార్హస్థ్య జీవితమున మన పూర్వుల భావన యెప్పుడును సమష్టి కుటుంబమే గనుక వారు ఒకరే దంచుట దోషముగ భావించినారు.

"ఒంటి రోకటి పోటు చూడ దోషమ్మో
ఒడిగట్టి మల్లెలు కోయ దోషమ్మో"-[2]

అని ఈసడించినారు. ఒక యింటిలో ఒకరికి మించిన స్త్రీలుండుట పరస్పర సాహాయ్యకరమేగాక ఇంటికి నిండుతనమును గూడ చేకూర్చునని వారు భావించిరి.

ఒక గరిత పనిపాటలలో మిగులజాణ. ఆమెకు దంపుళ్ళు అనిన లెక్కయే లేదు.

"దంపు దంపు అనియేరు అదియెంత దంపు
ధాన్యరాసుల మీద చెయ్యేసినట్లు
వంట వంట అనియేరు అదియెంత వంట
వదినెతో మరదళ్ళు వాదాడినట్లు". -[3]

పూర్వము ఎప్పటికప్పుడు వడ్లు దంచుకొని అన్నము వండుట ఆచారము. నిలువయున్న బియ్యముకన్నను అప్పుడు దంచిన బియ్యము రుచికరమేగాక ముక్కిపోవు ప్రమాదముండదు. ఈ పాటలో దంపు తరువాత వంట చెప్పుట

1. పాతపాటలు-నేదునూరి గంగాధరం-భారతి, జూన్, 1932.
2. అందే.
3. సెలయేరు-పుట-16.

వలన ఏనాటికానాడు వడ్లు దంచుకొని వంటావార్పు చేసికొనెడివారని ధ్వనించుచున్నది.

దంచుట అను పదము ప్రాముఖ్యమునుబట్టి వడ్లు దంచుట అను పనినే స్ఫురింపజేయునదైనను ఇతర ధాన్యములను, మిరపకాయలను, పసుపు కొమ్ములను దంచుట వంటి ఇతరములగు దంపుడు పనులను కూడ ఇందు గ్రహించదగును.

"…. …. …. …. …. …. …. …. …. …. …. …. ….
సువ్వని నేనొక పోటేసితేనూ
చుక్కలు పిక్కటిల్లు సూరన్నకదలు
ఆస్సని నేనొక్క పోటేసితేనూ
ఆకసమ్ము కదలు ఆ రాజు కదలు"-1

దంచునప్పుడు 'సువ్వి' అననది పాటకు ఊత పదముగా, అస్సనునది శ్రమకు ప్రతిధ్వనిగా నుపయోగింతురు. సూర్యచంద్ర ఆకాశ తారకములను చలింపజేయునంతటి గట్టిగ ధ్వని పిక్కటిల్లునట్లుగా పోటు వేయగలిగిన దిట్ట తనముగల జాణలును ఉందురనిన అతిశయము కొంతయున్నను పోటు వేయుటలో నుండు పనితనమును తెలుపుచున్నదీ పాట. దంచునప్పుడు స్త్రీలు ఒక కాలును ముందునకు మరొక కాలును వెనుకకు చాచి ఒక చేతిలో రోకలిని పైకెత్తి కుందెనలోని వడ్లపైనవేసి అది క్రింద పడకముందే మరొక చేతితో అందుకొందురు. అది అంతయు అరక్షణములో జరిగిపోవును. చూచువారు వారి నైపుణ్యమునకు ఆశ్చర్యపడుచు రోకలిని ఒక చేతినుండి మరియొక చేతికెట్లు మార్చుకొనిరా అని గమనించ నెంచునంతలోనే మరొక పోటు కుందెనలో పడును. మధ్య మధ్యన రోకండ్ల వేగములో చేతులు నలగిపోవునేమో అని భయమును కలిగించునట్లు ఒక చేత ఎత్తిన రోకలి క్రిందికి వచ్చులోపల మరొక చేతితో కుందెనలోని వడ్లను కదలించి రోకలిని పట్టుకొనుటకు సిద్ధముగా నుందురు. దంచుటలోని వారి హస్తకౌశలము చూపరులకు ఇంద్రజాలమువలె నుండును.

1. పల్లెపదాలు-పుట-47.

ఒక యువతి తమలపాకులమీద వడ్లెండబోసి చిలుకలచేత వడ్లు దంపించి–

తమలపాకులమీద వండ్లెండబోసి
రాచిలక పోచిలక వడ్లు దంతాము
రాచిలక దంచినవి రాసులడ్డాయి
పోచిలక దంచినని పోగులడ్డాయి. –[1]

వడ్లు బాగుగా నెండిన సులభముగా దంపుడు పడును గనుక వడ్లు దంచుట కన్న ముందు ఎండబోయుట సహజము. కాని పై పాటలో ఎండబోసిన వడ్లను తమలపాకులమీద నెండబోయుటను వానిని తోటి కాంతల తోడ్పాటుతో గాక చిలుకల సహాయమున దంచబూనుకొనుటయు చమత్కారముగా నున్నవి. ఆమె ఎన్నుకొనిన వస్తు సముదాయమును పరికించిన తమలపాకులో నుండు సుకుమారత చిలుకలలో నుండు అందచందములు ఆమెలోను రూపు దాల్చినవేమోననిపించును.

మరియొక చిన్నారి రోలు రోకలిని ఎన్నుకొను విధమును తెలుపుచు
"రోకలి చిన్నాది, రోలుచిన్నాది
నాతోటి పోటేసె, చెలియ చిన్నాది" –[2]

అని బియ్యమును పోటు వేయునప్పుడు తనకు తోడుగానున్న చెలియ చిన్నారి తనమును తెలుపుచున్నది. వడ్లు దంచిన తదుపరి పొట్టును చెరగి, చెరగిన బియ్యములో నుండు మెరికలను వేరుజేసి పోటు పెట్టుదురు. ఇట్లు పోటు పెట్టుటకు ధాన్యము తక్కువ రాశిలో నుండును. గనుక చిన్న రోలును, చిన్న రోకలిని ఎన్నుకొనుటయే గాక ఈమె చెలియను కూడ చిన్నదానినే ఎన్నుకొనినది. అంతేగాక చిన్నవయసులోనున్న కన్యలకు వడ్లు దంచు పనిని ఒకేమారుగా నేర్పక కొంచెము కొంచెముగా నున్న వడ్లను రోటిలో బోసి దంచనేర్పెదరు. ఇక్కడ ఈ యువతి కూడ అట్లే పిన్న వయస్సులోనున్న పిల్లలకు వడ్లను దంచు పద్ధతిని నేర్పుచున్నట్లున్నది.

ఎట్టి పని పాటలతో మనస్సులగ్నమై యున్నను యువతులు కుటుంబ బంధుత్వమును, అందులోను పుట్టింటి వారిని మరవ జాలరనుటకును ఈ

1. సెలయేరు–పుట–16 2. సెలయేరు–పుట–16.

పాటలు ప్రతిరూపములు. వీరు మాతృమూర్తియెడ మరువజాలనంత కృతజ్ఞతను కనబరతురు.

"రోకలికి రోటికి రెండు దండాలు
మముగన్న తల్లికీ వెయ్యిదండాలు"–[1]

– ఆహారమును తయారు కావించుకొనుటకు తోడ్పడు రోకలికి రోటికి రెండు దండములను, తనను కనిన తల్లికి వెయ్యిదండములను పెట్టుచున్నదనిన తల్లియెడ నిచ్చట కూతురు కనబరచు ఆత్మీయత వ్యక్తమగుచున్నది. జననీజన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి అను సూక్తి యుండనే యున్నది కదా.

నేడు కుటుంబ నియంత్రణముతో కుటుంబములు పరిమితమై ఇద్దరు ముగ్గురితో నుండు కుటుంబ వ్యవస్థ అధికముగా ప్రచారము నందున్నదిగాని పూర్వము అధిక సంఖ్యలో సంతానము గలిగి కలసిమెలసి కళకళలాడు కుటుంబములకే అధికమైన ప్రశస్తి ఉండెడిది. అట్టి కుటుంబములలో అన్నదమ్ముల మధ్యన పుట్టిన చెల్లెలు ముద్దు మురిపెములకు అంతుండదు.

"ముగ్గురన్నల తోడ నేబుట్టినాను
నానడుము మువ్వంచు చీర గోరింది
నలుగురన్నలతోడ నేబుట్టినాను
నానడుము నల్లంచు చీర గోరింది
అయిదుగురన్నలతోడ నేబుట్టినాను
నావొళ్ళు అద్దాల రవిక గోరింది" –[2]

– ఈ పాటలో యువతి కోరికను అన్నలు మన్నించి నారనియేకదా యర్థము. మురిపెములను తీర్చు అన్నలున్న ముచ్చటలు నెరవేర్చుకొను చెల్లెండ్రకు కొదవేముండును. ఆడింది ఆట పాడింది పాటగా నుండును.

అమృత భాండములో విషపు బిందువులవలె కుటుంబములలో అత్తగారి ఆరళ్లు కోడండ్రకు నరకప్రాయ మగును. అత్త తాను కూడ ఒక యింటి కోడలే యను మాటను మరచి ప్రవర్తించును. కోడలు మెత్తనిదైన అత్తగారి నోటికి

---

1. సెలయేరు–పుట–16. 2. పల్లెపదాలు–పుట–47.

అదుపుండదు. కోడలు నోటి దురుసుదైన యింటిలో వాగ్యుద్ధములు తప్పవు. కోడలు మరికొంత గట్టిదైన అత్త నోటికి తాళము పడినట్లగును ఇట్టి పాటలును ఈ దంపుళ్ళసమయమున మహిళల గళములలో ఖంగుమని మారు మ్రోగినవి. అత్తాకోడండ్ర ఆర్భాటములు "కౌటుంబిక గేయము" లలో వివరింపబడినవి.

ఈ అత్త కోడండ్ర పోరును దేవతలును తప్పించుకొనలేకపోయిరి. అన్నమాచార్యుని సంకీర్తనములలోని అత్తాకోడండ్ర స్థానములో నున్న లక్ష్మీ సరస్వతుల సంవాద రూపమైన ఒక గేయమును బాలాంత్రపు రజనీకాంతరావు గారు పేర్కొనిరి–[1]

నిత్య జీవితమున తాను చూచిన అత్తాకోడండ్ర వాగ్వివాదములనే అన్నమాచార్యుని వంటి పదకవితా పితామహుడు సాహిత్య స్థాయికి తెచ్చి లక్ష్మీ సరస్వతుల సంవాదముగా రచించెననిన జానపద మహిళా వాఙ్మయ ప్రభావమెట్టిదో మన మూహింపవచ్చును. ఆ వాఙ్మయమునకు ముగ్ధుడై అతడు స్త్రీల పాటలను వేలకు వేలు రచించెను.

రోకటి పాటలు దంపుళ్లతోనే ఆగవు. దంచిన ధాన్యము నుండి పొట్టును, తవుడును, విడదీయుట, చెరగుట, జల్లెడ పట్టుట, రాళ్ళు మెరికలు ఏరుట, చక్కజేసిన ధాన్యమును భద్రపరచుట–అవన్నియును దంచుటలోని అంతర్భాగ ములు. ఈ పనులు జరుగుచున్నంత వరకును పాటలు సాగుచునే యుండును.

దంచిరి దంచిరి ధన్నాడకాడ–దంచిరి దంచిరి ధన్నాడకాడ
జల్లెలుపట్టిరి జల్లెల కింద జల్లెల కింద
తూర్పులు వట్టిరి తుమ్మల్లకింద తుమ్మల్ల కింద
బువ్వలు వండిరి బూర్గు పల్లీల--బూర్గు పల్లీల
కూరలు వండిరి కూచూరు కాడ కూచూరు కాడ
పులుసులూ కాచీరి పూడూరు కాడ పూడూరు కాడ
ఆకూలూ తెంపిరీ–అలూరు కాడ, అలూరు కాడ
ఇస్తార్లు గుట్టీరి–యింజమూరీలా, యింజమూరీలా

1. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము–బాలాంత్రపు రజనీకాంతరావు–పుట 162.

భోజనాలు జేసిరి బోంపల్లీల-బోంపల్లీల
చుట్టాకు దెంపిరి సూరారం కాడ సూరారం కాడ
నరాలు దీసిరి నాగేల్లికాడ, నాగేల్లికాడ
పొగాకు నింపిరి పోలేపల్లిలా పోలేపల్లిలా
జుర్రూన గుంజీరి జూలపల్లీలా, జూలపల్లీలా
గుర్రూన పండీరి గుర్కుంటకాడ, గుర్కుంటకాడ-[1]

- ఈ పాటలో పేర్కొనబడిన గ్రామములు తెలంగాణ ప్రాంతములోనివి. వడ్లను దంచి బియ్యముచేసి వంటవండి భుజించుట మొదలు భోజనానంతరము పురుషులు చుట్టలను కాల్చుట, బడలికను తీర్చుకొనుటకు నిద్రించుట వరకు వర్ణింపబడినది. పూర్వము జానపదులు సిగరెట్టు, బీడీలకు మారుగా చుట్టలను కాల్చెడివారు. పొలము గట్టుననున్న మర్రిచెట్టు క్రిందరాలిన వాడిపోని ఆకులను తీసికొని ఈనెలు తీసి ఒక్కొక్క ఆకును వేరుగ చుట్టగాచుట్టి అందు పొగాకును చేర్చి చుట్టలుగ ఉపయోగించెడివారు.

మన వివాహ వ్యవస్థ జీవితమునకు సంగ్రహరూపము వంటిది గనుక వివాహమునందును కొట్నములు దంచునప్పుడు సువ్విపాటలు వినవచ్చును.

"సువ్వి రామచంద్ర సువ్వి సువ్వి కీర్తిసాంద్ర సువ్వి
సువ్వి సీతమ్మ మాకు శుభములిమ్మా సువ్వి సువ్వి"-[2]

విసరు రాతి పాటలు :

నాగరికతతోబాటు పని పాటలలోను మార్పులు వచ్చినవి. 'ఇంజన్లు' 'ఎలెక్ట్రిక్ మిషన్లు' వచ్చుటతో కపిల తోలు వృత్తి వెనుకబడినట్లే, పిండిమరల రాకతో విసరురాళ్ళును (తిరుగలి) మూలబడినవి.

ప్రాచీన సంప్రదాయము ననుసరించి వారు విసరురాయిని పనిముట్టుగానే గాక గౌరీదేవిగా పూజింతురు. విసరురాతిని ప్రతిష్ఠించుటను డా॥ దొణప్ప గారిట్లు పేర్కొనిరి. "విసరురాతిని పాతునపుడు దేవళములో విగ్రహ ప్రతిష్ఠ చేసినంత తంతు జరిపించెదరు. ఇంటిలో ఎక్కువగా జనము పారాడనిచోట నేలను త్రవ్వి,

1. శ్రీ మహేందర్ జీ గారు పర్గి తాలూకాలో సేకరించి నాకిచ్చినది.
2. స్త్రీల పాటలు-ఎన్.వి.గోపాల్ అండ్ కంపెనీ.

'గుండావర్తనము'చేసి అడుగున రాగి తగడు– రాగిరేకు– మీద యంత్రోద్ధారకము చేయించి, పసుపు కుంకుమ బరణితోపాటు పాతిపెట్టుదురు. శ్రీమంతులు బంగారు, వెండి నిమ్మరసముతో కడిగిన పగడము, మంచిముత్యములు కూడ బరణిలో నుంచెదరు. పండుగ పబ్బములనాడు ప్రత్యేక పూజలు జరిపించెదరు. మామూలు పొరకతో విసరురాతి చుట్టుపట్టుల ఊడువరాదు. దానికి కాలు తగుల కూడదు. మీద కూర్చుండరాదు.–[1] కూర్చుండి తుమ్మిన యెడల చేటెడు కుడుములువేసి గౌరమ్మను ఎడపెట్టవలెనను కట్టడ కలదు–[2].

విసరురాతితోబాటు రోలు రోకలిని, కవ్వముతోగూడిన చల్లగుంజను గౌరమ్మగ పూజించుట కలదు. ఈ ఆచారమును ఇంటి యిల్లాలు పుట్టింటి నుండి తెచ్చుకొను సారె బియ్యమును (ఒడి బియ్యమును) వండునప్పుడును, క్రొత్త బెట్టునప్పుడును గమనింపవచ్చును. ఇట్టి సందర్భములలో పై పరికరములను సున్నము జాజు పట్టీలతో తీర్చిదిద్ది, పసుపు కుంకుమలతో అలంకరింతురు. పసుపు కొమ్మునుగాని, తమలపాకునుగాని పచ్చదారములో బిగించి వాని చుట్టు గట్టి, వానికి నైవేద్యములనిడి పూజింతురు.

చిన్న చిన్న విసరురాళ్ళు ప్రతి యింటను ఉండును. ఎక్కువ ధాన్యమును తక్కువ సమయములో విసరవలెననిన పెద్ద విసరురాళ్ళు అవసరము. కనుక పెద్ద విసరురాయి ఇంటిలో లేనివారు కలిగిన వారింటికి వెళ్ళి ధాన్యమును విసరుకొని వచ్చుచుండిరి. అవసరమైనచో వీరికి ఇంటివారు విసరుటలో తోడ్పడుటయు, వారికి కృతజ్ఞతగ వీరు వారి పిండిని విసరుటయు జరుగుచుండె డిది. ఇట్టి పనులలో గ్రామీణుల పరస్పర సహకార భావము వ్యక్తమగును.

తిరుగలి చిన్నదైన ఒక్కరు లేదా ఇద్దరు గిరగిర త్రిప్పి సునాయాసముగ పనిని పూర్తి చేసికొందురు. పెద్దపెద్ద విసరురాళ్ళుండిన ముగ్గురు నలుగురయిననే గాని పని సులభముగ, తొందరగ కాజాలదు. విసరుటకు వచ్చిన మహిళలు విసరురాయి చుట్ట ఒక కాలు మడచి, ఒక కాలు చాపి కూర్చుండెదరు. ఒకరు

1. "కడపమీదను మతి సన్నికంటి మీదను, ఱక్కమీదను గూర్చుండ జాడగాదు" కాశీ ఖండము 2. 75
2. జానపద కళాసంపద–పుట–170.

ఏ కాలు మడచి, ఏ కాలు చాపి కూర్చుండెదరో తక్కినవారును అట్లే కూర్చుండెదరు. వారిలో నొకరు చేతి ఒరవడి కలిగినవారు కుడిచేతి పిడికిలితో బుక్కుబోయుచు మిగిలిన వారితోబాటు కుడివైపుగ త్రిప్పుచుందురు. కుడిచేత విసరునప్పుడును ఎడమచేత విసరునప్పుడును ఒకే వరుసలో కుడివైపుగా మొదలిడి ఎడమవైపునకు విసిరెదరు. బుక్కు బోయుటను వాయి, కోగు అని వ్యవహరింతురు. బుక్కు పోయునప్పుడు ఎడమచేత నెమ్మదిగ విసరుచుందురు. అట్లు విసరుట వలన విసరురాతిలోని ధాన్యము దోరగా మెదగును. అప్పుడు విసరురాతి గుంజను కుడిచేతికి మార్చి చాల వేగముగ విసరుదురు. అట్లు విసరిన పిండి పూర్తిగా మెదగి బయటకు వచ్చును. మొదట నెమ్మదిగా విసరునప్పుడు పాటలోని ఒక పాదమంతయు దీర్ఘముగ పాడి చివరి చుట్టులలో కుడిచేత విసరునపుడు చేతి వేగము అధికమగును గనుక పాటలోని మరియొక పాదమును ముక్తాయింపు చేయుదురు. లెక్కప్రకారము వాయవాయకు ఒక పాదము పూర్తియగునట్లు పాటను మలచుకొందురు. ఇట్లు విసరుట పూర్తియగు వరకును వంతులవారిగా నొకరు పాట చెప్పుచుండ మిగిలినవారు పాట నందుకొనుచు విసరుటలోనున్న ఆయాసమును మరచిపోవుదురు.

విసరురాతి ధ్వనిలోనుండు లయకనుకూలముగ పాటలోని పాదములను ఉచ్చరించునప్పుడు నిదానమైన రాగములో పాడుట, దంపుళ్ళలో 'ధనధన' మను ధ్వని కనుగుణముగా పాదములు త్వరత్వరగ అందుకొని పాడుట ఒక ప్రత్యేకత. ఒకే పాటను సందర్భానుసారముగ రాగమును మార్చి రెండు పనులలో పాడు నేర్పుగల మహిళలును ఉందురు.–[1]

కృష్ణశ్రీగారు "విసరురాతి పాటల వరుసలు ద్విపద వరుసలవలె కనబడును. కాని వీనిలో ద్విపదల గణనియమము కనబడదు. ఇవి నాలుగేసి కిటతకిట ఆవృతాల పాదాలపాటలు, పాడేవారు పాదమునకు ఇరవై మాత్రలు ఏదో రీతిని ఇమిడించెదరు."–[2] అని పేర్కొనుటయేగాక అట్టి పాటలను కొన్నింటిని

1. అట్లు పాడి వినిపించినవారు. రుక్మిణమ్మ–రాయిప్రోలు. అట్టి వరుసలో పాడిన "రాముల వుంగరం" అను ఒక పాటను ఈ శీర్షికలోనే పేర్కొనినాను.

2. పల్లెపదాలు–పుట–42.

పాడి వినిపించినారు. –[1] కాని దంపుళ్ళ పాటలో వలెనే ఇందులోను ఎట్టి మాత్రానియమములను గమనించక స్త్రీలు తమ యిష్టానుసారముగా పాడు పాటలే అధికముగా నుండునని అనుభవముతో తరువాత తెలిసికొనినాను.

గృహకృత్యములుగ నెరుపబడు ఈ పనులు స్త్రీ సంబంధములు గనుక పాడు పాటలును గృహ సంబంధములును, స్వగతములునునై ఆత్మాశ్రయము లగుచున్నవనుట విదితమే.

అత్తింటిని మెట్టిన కోడలికెప్పుడు పుట్టింటి పైననే ధ్యాస. ఆ ఇంటిని ఆ ఇంటిలోని వ్యక్తులను గూర్చి ఆలోచించుచుండును. జరిగిన సంఘటనలను మననము చేసికొనుచు, జరుగబోవు సంఘటనలను ఊహించుచు కథల నల్లుకొనుచుండును. ఆ కథనమునే కంఠముతో కలిపి ప్రక్కవారికి వినిపించుచుండును.

ఆదివారమునాడు అమావాస్యనాడు
అన్న ఇంటికి నేను గిన్నెనడుగ బోతె
మా వదిన శాంభవి లేదు పొమ్మనెను
మా యన్న మంచివాడు మళ్లి రమ్మనెను
చిన్నోనికి చీటంగి సిలుకు కుళ్ళాయి
బాలునికి పొట్లంగి పాలు పోసె గిన్నె
నాకు నల్లచీర నెమలి వన్నె రవికె
వడినిండ బియ్యము వళ్లొ కొబ్బరి గిన్నె
పసుపు కుంకుమ యిచ్చి పంపె మాయన్న –[2]

1. నేను 'జానపదగేయముల' వరుసలు' అను వ్యాసమును రచించిన సందర్భమున వారితో సంప్రదించితిని. తేది: 11-5-72.
2. పల్లెపదాలు-పుట-39. ఇదే పాట పర్గి తాలూకాలో శ్రీ మహేందర్‌జీ గారుసేకరించి నాకిచ్చినారు. అందు 'నల్ల చీరకు' మారుగా 'పచ్చ చీర' అని కలదు. నల్లచీరకు మారుగ పచ్చ చీరను చేర్చి సంప్రదాయము నెరిగినవారే పాడగలరు. నిజమునకు నెమలివన్నె రవికెతోగూడిన నల్ల చీరకన్నను, పచ్చచీరయే అందమును అతిశయింపజేయును.

చిన్ననాటి నుండి చెల్లెలు అత్తింటికి వెళ్ళువరకును అన్నతో కలసి ఆత్మీయత ననుభవించినది. ఆ బంధమే అన్న చేత చెల్లెలుకు మర్యాదలను పొందింపజేసినది. వదినె వలె కటువుగా పలికించలేకపోయినది. పసుపు కుంకుమలనిచ్చి ఒడినింద బియ్యమును (ఒడి బియ్యము) బెట్టి చెల్లెలును అత్తింటికి పంపినాడు. పుట్టింటివారు ఆడబిడ్డలకు చేయవలసిన మన్ననలలో నిదియొక రకము. చెల్లెలుకు నల్లచీర తెచ్చినాడనిన ఆమె మనసు పడినదనియో, లేక చిన్ననాటినుండి చెల్లెలు అభిరుచి నెరింగినవాడై ఆమె కిష్టమని అతడు తెచ్చిన నల్లచీరను కాదనలేకపోయినదనియో భావించవలెనేగాని ఒడిబియ్యము పోసి, సారెబెట్టునప్పుడు నల్లచీరను తెచ్చుట శుభసూచకము గాదు. ఈ అన్న చెల్లెండ్రెట్లు మరచిరో తెలియరాకున్నది.

అన్నవేసిన దట్టిని జాగ్రత్తగా ఉతికి అన్నవాడలకు వెళ్ళి చాకలిని ఇచ్చిరమ్మనుట ఈ క్రింది పాటలోని ఇతివృత్తము.

"నల్లకొండల నడుమ వుతికె సాకాలి
మాయన్న ఏసిన దట్టి–[1] పేరేమి?
చింతకుంట సూలమ్మ శిరువెళ్ళతొగరు
నంద్యాల నల్లంచు లంజ పేటంచు
కందనోలు కరకంచు కందిబేదంచు
ఉతకరా చాకాలి వుల్లిపువ్వోలె
మడసారా సాకాలి మల్లెమొగ్గోలె
ఇచ్చిరా సాకాలి అన్నవాడలకి
ఇచ్చేను వొచ్చేను ఇల్లు నేనెరుగ
గచ్చుతొ కట్టిన గాజు స్తంభాలు
సున్నమ్ము పూసిన సురటి మిద్దిళ్ళు
వేపమాని యెదురిల్లు ఎద్దూల మిద్దె –[2]

గ్రామీణుల బంధుత్వము కొలది ఒకరింటికినొకరు వెళ్ళినప్పుడు స్నానాదులను చేసి విడిచిన బట్టలు వారింటిలోనే వదిలి వెళ్ళుట, వాటిని ఉతికించి ఇంటి

1. పల్లెపదాలు–పుట–41.
2. దట్టికాసె–శబ్దరత్నాకరము.

వారు బంధువులకు తిరిగి పంపించుట పరిపాటి. పూర్వాచారపరాయణులు విడిచిన బట్టలను, తడిబట్టలను వెంబడి తీసుకొని వెళ్ళుట అశుభసూచకముగ భావించుదురు. ఈ పాటలో చెల్లెలింటికి వచ్చిన అన్న వస్త్రములను వదలి వెళ్ళినాడు. ఆమె పేర్కొనిన 'దట్టి' అతని ధోవతియై యుండును. ఆమె చాకలితో తెల్లగా నుతికి శుభ్రపరచి తన అన్నవాడలకు వెళ్ళి ఇచ్చిరమ్మనుచున్నది. అందులకు సమాధానముగ చాకలి 'ఇచ్చేను వొచ్చేను ఇల్లు నేనెరుగ' అని పలికెను. ఈ ఇంటి చాకలి క్రొత్తగా మారినవాడై యుండును. పాతవాడే అయియుండిన అతనికి ఆమె అన్నగారిల్లు తెలిసియే యుంటును. గ్రామములలో రెండు మూడు సంవత్సరముల గడువు ననుసరించి చాకలివారు ఇండ్లు మారుచుందురు.

విసరురాతి పాటలలో మనస్సులోని భావములను, సంసారేతివృత్తములను తెలుపునవి ప్రధానములైనను ఆసక్తిని రేకెత్తించు ప్రశ్నల రూపమున సంవాదాత్మకములై, చిట్ట చివర జవాబులను తెలియజేయు పాటలును ఉండును.

"తూరుపు వాకిళ్ళకు దూలాలుగావు
పరమటి విండ్లకు –[1] పలకల్లుగావు
మాయింటి కోడండ్లకు రోకళ్ళు గావు
ధనము రాసులిచ్చె తండ్రి రామయ్య
నీవైన చెప్పరాద ఆమాని పేరు
అమ్మరో నీకింత వినవేడుకైతె
మాడల్లొ –[2] పొయ్యేటి మరదుళ్ళనడుగు
మాడల్లొ పొయ్యేటి మరది సుబ్బయ్య
నీవైన చెప్పరాద ఆమాని పేరు
అమ్మరో నీకింత వినవేడుకైతె
మైసాక్షి పక్షుల్ల మానుల్లనడుగు
అమ్మరో నీకింత వినవేడుకైతె
బారాసావిటి మీది బావల్లనడుగు
అమ్మరో నీకింత వినవేడుకైతె

1. మేడలో 2. పడమటి ఇండ్లకు

కొలుపుసావిడిమీది కొడుకుల్ల నడుగు
అమ్మరో నీకింత వినవేడుకై తె
నేలాన పండిన పల్లేరు చెట్టు. –[1]

ఈ పాటంతయు జవాబేమై ఉండునా అను ఆసక్తిని, ఆలోచనను రేకెత్తించుచు పొడుపు కథవలె సాగినది. "బూ. .బూ. .బూ. . బుడ్డగోసిపండు" అను సామెత మాదిరిగా సాగదీసి సాగదీసి చివరకు "పల్లేరు చెట్టు" అను సమాధానమును తెలుసుకొనునట్లు చేసినదీ పడతి. విసరుటలో తోడుగానున్న స్త్రీలకు వాకిళ్ళకు దూలములు కాజాలని, ఇండ్లకు పలకల్లు కాజాలని, కోడండ్లకు రోకళ్ళు కాజాలని వృక్షమేమై ఉండునా యను ఉత్సుకతను కలిగించి, వారి మనోవేగముతో బాటు విసరుటలో చేతి వేగమును హెచ్చించునట్లు చేసి పని తొందరగా పూర్తియగునట్లు చేయు స్త్రీల నైపుణ్యము ఈ పాటలో కననగును. ప్రశ్నకు సరియైన జవాబు దొరకకపోయిన పిండిని ఏర్పడకుండ ప్రశ్నవేసిన యువతియే సమయోచితముగ జవాబును కూడ తెలియజేయుట ప్రశంసార్హమే.

విసరి పిండిగా తయారుచేయు ధాన్యమును పేర్కొనుచు ఒక పడతి

"చోళ్ళునల్లన్న పిండి తెల్లన్న
అంబలి పుల్లన్న డొక్క చల్లన్న" –[2]

అని చోళ్లపైని రంగు నలుపు వర్ణమైనను పిండి విసరిన తరువాత తెల్లగా నుండునని, అట్లే అంబలి పుల్లనైనను కడుపును చల్లబరచునని తెలిపెను.

సీతారాములపైన పాటలు పాడనిదే ఏపనియైనను ముందుకు సాగదనునట్లుందురీ మహిళామణులు. లంకా పట్టణములోనున్న సీత జాడలను అరసికొనుటకు వెళ్ళిన హనుమంతునకును, సీతకును సంభాషణ మిట్లు జరిగెను.

రాములవుంగరం, సీతమ్మ శృంగారమూ
నీ జాడాకు నేనే వస్తినమ్మ, మా అమ్మాదేవి ॥నీ జాడాకు॥
ఎక్కడి వాడావురా ఏ పల్లె వాడావురా

1. పల్లెపదాలు–పుట–40.
2. సెలయేరు–పుట–20.

ఓరిఓరి, ఓరా నీపేరే నాకు తెల్పూముగా॥
మా తండ్రి రాములూ మా తల్లి సీత దేవి
నా పేరె అన్ననంటరూ–[1] మా అమ్మాదేవి ॥నా పేరే॥
రామ లక్ష్మణులూ వారన్న దమ్మూలూ, వారిద్దరు బాగయున్నారా
ఓరీ, ఓరీ హనుమా వారిద్దరూ బాగయున్నారా
బాగయున్నారు తల్లి క్షేమంగ ఉన్నారూ, తల్లి
నీవే ఎడబాసినావూ, మా అమ్మా దేవి ॥నీవే ఎడ॥
పెద్దత్త కౌసల్య నడిపి అత్త సుమిత్ర వారందరు బాగయున్నారా
బాగయున్నారూ తల్లీ క్షేమంగ ఉన్నారూ తల్లీ ॥నీవే ఎడ॥
ఆకాలాయె తల్లీ దూపలాయె తల్లీ అన్నాము సెలవియ్యమ్మా
మా అమ్మదేవీ అన్నాం సెలవియ్యమ్మా ॥రాముల॥
కొమ్మకొమ్మకు కోటి రాక్షసులన్నవి ఓరి అనుమా ॥కోటి॥
ఆకాలాయె తల్లి దూపాలాయె తల్లీ, అన్నాము సెలవియ్యమ్మా,
చెట్టుచాటూకు పొయ్యి–[2] ఒక పండు తెంపుకొనీ
తిని నీళ్ళు దాగరా, ఓరిఓరి హనుమా ॥తినీ॥–3

– ఈపాటలో సీతాదేవి అందరి యోగ క్షేమములను అడిగి కైకేయిని మాత్రము పేర్కొనకపోవుట జానపద మహిళలకు ఆమెపై గల కోపమును తెలుపుచున్నది. సీతాదేవి కుశల ప్రశ్నలలోను ఒక వైపరీత్యము కనిపించుచున్నది. హనుమంతునికి ప్రత్యక్షముగ అయోధ్య వార్తలేవియు తెలియవు. అతనిని సీత అయోధ్యను గురించి అడగుట విడ్డూరమే. కాని ఆ విడ్డూరమే జనపదుల మనస్తత్వమును తెలియజేయు చున్నది. నేడు గూడ ఎవ్వరైనను బంధువులు చాలకాలము తరువాత ఇంటికి వచ్చినప్పుడు జానపద స్త్రీలు అతడు ఎక్కడినుండి వచ్చెను, అతనికి ఏమి తెలియును అను వివక్షయేలేక తమ ప్రశ్న పరంపరనంతయు వారి యెదుట కుమ్మరింతురు. అట్లే ఈ పాటలోని సీతాదేవి గూడ తన మనస్సులోని ఉత్కంఠ నంతయు హనుమంతునికి తెలిపినది. చెట్టుచాటుకుపోయి హనుమంతుని

1. హనుమ అని అందురు. 2. పోయి
3. నేను సేకరించినది. పాడినవారు రుక్మిణమ్మ, రాయిప్రోలు– ఇబ్రాహింపట్నం.

పండుతినుమని సీతాదేవి చెప్పుటలో జానపద స్త్రీల మాతృహృదయము స్పష్టమగుచున్నది. తల్లి కుమారునికి ఏదిద్రైనను వస్తువు చేతబెట్టి ఎవ్వరికిని తెలియకుండ చాటుకుపోయి తినుమని చెప్పు పద్ధతినే సీత పాత్రకును కల్పించినారు. రాక్షసులు చూచిన అతనిని పండు తినకుండ బాధింతురేమో యను తపన ఆమెలో వ్యక్తమగుచున్నది. ఇదే పాటను పదములలోని అతి దీర్ఘములను హ్రస్వములుగా నుచ్చరించుచు దంపుళ్లలో పాడుదురు.

రాట్నము పాటలు : వస్త్రములు నిత్యోపయోగములు గనుక నూలు వడకుట, వస్త్రములు నేయుట ప్రధాన పరిశ్రమలుగా నెన్నవచ్చును. పాశ్చాత్య దేశములకు నూలు బట్టల నేత తెలియని కాలమున మన దేశము నుండి వస్త్రముల ఎగుమతి విశేషముగ జరుగుచుండెను. కొన్ని సహస్రాబ్దముల క్రిందట భారతదేశమునకు వచ్చిన ఒక ఈజిప్టు పౌరుడు ఇక్కడి వస్త్రములను చూచి ఆశ్చర్యపడి మన దేశమున వస్త్రములను పండించు చెట్లున్నవని చెప్పెనట.

ఈ పరిశ్రమ బ్రిటిషు పరిపాలనలో తగ్గుముఖము పట్టినది. అగ్గి పెట్టెవంటి చిన్న వస్తువులో పదహారు గజముల చీరెను ఇమిడ్చిన ఒక నిపుణుడు దానిని ఈస్టిండియా కంపెనీ వారికి బహూకరించగ ఆ కంపెనీ నాయకులలో ఒకడు ఆ కార్మికుని పిలిపించి మర్యాద చేయించి కుడిచేతి బొటనవ్రేలిని నరకి వేసినట్లు చెప్పుదురు. పాశ్చాత్య సంపర్కము వలన మన దేశమున మరమగ్గములు విరివిగా నెలకొనిన తరువాత మనదేశపు వడకు–నేత పరిశ్రమకు ఆదరణ తగ్గినది.

నిత్యావసరమైన గుడ్డల పరిశ్రమను పునరుద్ధరించిన యెడల దేశము సంపన్నము కాగలదను నిర్ణయముతో గాంధీ మహాత్ముడు భారత స్వాతంత్ర్యోద్యమములో నూలు వడుకుటను విధాయకముగా చేసెను. ముప్పది కోట్లమంది పట్టుదలతో నూలు వడికిన మరి మూడు నెలలలో స్వాతంత్ర్యము సిద్ధించునని గాంధీ మహాత్ముడు చాటుచుండెను. ఆయన రాజకీయ చర్చలకై ఇంగ్లాండుకు వెళ్లినప్పుడు "లంకాషైరు నూలు" యజమాను లాయనను కలుసుకొని "మీ నూలువడకు ఉద్యమము వలన మా యంత్రాగారములు మూలబడినవని గోలపెట్టినారట. దీనినిబట్టి రాట్నమునకెంత ప్రాధాన్యము కలదో దానిని ఆయుధముగా నుపయోగించుటలో గాంధీజీ దూరదృష్టి యెంతటిదో స్పష్టమగును. అర్ధ శతాబ్ది క్రిందటి వరకు పల్లెలలో ప్రతి ఇంటను విధిగా స్త్రీలు

నూలు వడకుచుండిరి. ఒరిస్సాలో ముఖ్యముగా శంబల్‌పూర్ జిల్లాలో నవవధువు అత్తవారింట మొదటి సంవత్సరము చేయుపని పగలు, రాత్రి నూలు వడకుటయేనట–[1]. ఇప్పుడు మనదేశమునను నూలు యంత్రములు ప్రబలి నందున రాట్నములకు ప్రాధాన్యము తగ్గినను కొన్ని రాజకీయ పక్షములను, నూలు వస్త్రముల నభిమానించు వారును ఉన్నందున నూలు వడకు పరిశ్రమ ఇంకను పూర్తిగా నశించలేదు.

జానపదులలో నూలు పడకుట ఉపవృత్తిగా వెలసిన కుటుంబములలోని స్త్రీలు తీరిక వేళలలో ఈ పనినిచేయుచు పోటీలుపడి నైపుణ్యమును సంపాదించి రాట్నముపైన వడికిన నూలు చిలకలను (కండెలను) అమ్మి కుటుంబమును పోషించుచుండిరి. ముసలవ్వలతోబాటు బాలికలును నిపుణత్వమును సంపాదించుకొనుచుండిరి. రాట్నమునకు కదురు ముఖ్యము గనుక ఈ పాటలను కదురు పాటలు అనికూడ వ్యవహరింతురు.

దారమును తీయునప్పుడు కదురు శ్రుతిగా రాట్నము పాటలలో స్త్రీల ఆశలు, ఆశయములు కవితా రూపములో వెలువడిన తీరును ఈ క్రింది పాటలలో చూడవచ్చును.

వడుకూ వడుకూ కదుర వడకనే కదురా
ఏకుల్ల బుట్టంత యెల్లుండి సంత
ఏకేకు ఒక బార యెల్లుండి సంత
నాయేకులైపోయె నాకేమొచింత
యేకుల్ల యెల్లక్క పత్తి పుల్లక్క
రాట్నాల రామక్క రావె పోదాము ॥వడకు॥
కదురు సల్లంగుంటె కదిలింతు గోల్కొండ
మగడెందుకే తగని మగడెందుకే ॥వడకు॥–2

ప్రత్తిని మొదట శుభ్రపరచి వ్రేలాడేసి పొడుగు ఏకులుగ తయారు చేసికొని రాట్నముపైన దారమును తీయుదురు. రాట్నముపైన దారముతీయు వేగము అధికముగా కలిగినవారు బుట్టెడు ఏకులనైనను గంటలో దారము తీయుదురు.

---

1. పంజాబు జానపద గేయాలు–శ్రీ దేవేంద్ర సత్యార్థి. భారతి, సెప్టెంబరు, 1954.
2. పల్లెపదాలు–పుట–43.

"కదురు సల్లంగుంటె కదిలింతు గోల్కొండ" ననుటలో ఈ స్త్రీ తన జీవితమునకు సరిపోవు ఆర్థిక సంపాదనమేగాక గోల్కొండను కూడ కొనగలిగిన ధనమును కదురుపైన సంపాదింప గలననుట తెలుపుచున్నది. అట్లనుట వినువారికి అతిశయమనిపించినను వారి కష్టార్జితముపై వారికుండు ఆత్మవిశ్వాస మట్టిది. అనుకూలమైన భర్తలభించిన స్త్రీకి అంతకంటె అదృష్టమింకొకటి యుండదు. కాని అట్లుగాక "తగని మగడు" లభించి, ఇంటి వ్యవహారములలో స్వాతంత్ర్యములేక యుండి ఆర్థికముగా అతనిపైన ఆధారపడి యుండవలసి వచ్చిన స్త్రీల జీవితములు నరకకూపములు. పతి ధర్మము ప్రధానముగా భార్యకు రక్షణయిచ్చుట, పోషించుట. ఈ కార్యములు రెండును భర్త వలన పొందలేని స్త్రీలకు భర్త తగని మగడుగనే కనిపించును. అట్టి స్థితిలో జీవనోపాధికి తోడ్పడు కదురు చల్లగుండిన తగని మగనిని కాదనుటకును వెనుకాడని స్త్రీలు కూడ యుందురని తెలియుచున్నది. అట్లనుటలో మగనిని కాదను అవినీతి వారిలో కలుగుచున్నదనుట కన్న దుర్మార్గపు ప్రవృత్తి కలిగిన పురుషుల బానిసత్వమును త్రోసి రాజను ఆత్మవిశ్వాసము వారిలో కలుగుచున్నదనుట మేలు.

మరియొక పాటలో ఒక వనిత

"రాట్నం చల్లంగుంటె రప్పిస్తు గోల్కొండ
కదురు చల్లంగుంటె.....కదిలిస్త ఢిల్లీని...."–[1].

– అని పలికినది. పై పాటలోని స్త్రీకన్న ఈమె రెండాకులు ఎక్కువ చదివినట్లున్నది. ఈమె గోల్కొండలో బాటు ఢిల్లీనికూడ కదలించగల ఆత్మవిశ్వానమును ప్రకటించుచున్నది.

జానపదుల జీవితములో "కవ్వమాడని యిల్లు కదురు తిప్పని కొంప మగ్గములేని ఊరు" లేకుండెడిదని ఈ క్రింది వాటిలో చక్కగా తెలుపబడినది–

అందచందము లేని ఆడకూతురికి
అందమేరు పరుచు ఆ పత్తిచెట్టు
పాడి పంటలున్న బంగారమిచ్చు
పైడి పత్తిని పెంచ బంగారుహెచ్చు

1. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి – పుట.172

పాలు పెరుగులున్న పాపల కొఱకు
పత్తినూలు దీయుపొతల కొఱకు
కవ్వమాడని యిల్లు కదురు తిప్పనికొంప
మగ్గము లేనూరు మరిగానరాదు
రాట్నాల మ్రోతమ్మ రవ్వలా మోత
కనకగిరి గొల్లోరి కవ్వాలమోత
ఏకుల్ల రాట్నము కాళ్ళ సంకెళ్ళు
కలవారి అల్లుడి కాళ్ల సంకెళ్ళు
ఏకేకు ఒక బార ఎల్లుండి సంత
నాయేకులయి పోయె నాకేమి చింత
పుంజమ్ము నూలుకు పోగు తక్కువ
కొండమీద పొద్దుంది కొట్టబోకత్త
చేనివారొస్తారు చెప్పబోకత్త. –[1]

జానపద కుటుంబములు పెరటి వృక్షముగా పత్తి చెట్టును పెంచెడివారు. ఆర్థికముగా రాట్నముపైన ఆధారపడి జీవించువారు పత్తి చెట్టును పైడి వృక్షముగనేగాక కల్పవృక్షముగను ఆరాధించినారనిన ఆశ్చర్యమేమియు లేదు. పాటలోని చివరి ఐదు వాక్యములు చిన్న కథను తెలుపుచున్నవి–

"ఒక అత్తింటి కోడలు నూలును వడికినది. ఎల్లుండియే సంత. సంతలో అంతవరకు వడికిన నూలును అమ్ముకొనవలెను. ఇంటిలోనున్న ఏకులన్నియు అయిపోయినవి. చివరి పుంజము నూలుకు ఒక పోగు తక్కువయినది. తన దగ్గరనా పత్తి లేదు. తక్కువయిన పోగును చేర్చవలెను. ఏమి చేయవలెనో పాలుపోలేదు. ఉత్సాహము ఆగలేదు. ఎట్లైన ఆ పోగును పూర్తి చేయవలెనను కొనినది. అత్తకు చెప్పకుండ పత్తిచేను గల వారి చేనుకువెళ్ళి దొంగలించి తెచ్చినది. ఇంటికి వచ్చినంతనే అత్తచేతిలో పట్టుబడినది. ఇంటి పనులు పూర్తికాలేదేమా యని అత్త కొట్టబోయినది. "పొద్దు పూర్తిగా క్రుంగలేదు, కొండమీద కొంత ప్రొద్దున్నది పని పూర్తి చేసుకొనెదను, అల్లరి పెట్టకు"మని, జరిగిన సంగతి తన ఆచూకీ వెదకుచు వచ్చు చేనివారికి చెప్పబోకుమని బ్రతిమాలినది. పల్లెపట్టులలో ఏ పదుచు ఏ యింటివారికి సంబంధించినదను సంగతి అందరికి బాగుగ తెలిసియుండును.

1. పల్లెపదాలు–పుట–44.

కనుక వారు దొంగతనము చేసిన వారితో వాదులాటకు వచ్చెదరు, వదలరు. అందుకనియే అత్తను వారితో జరిగిన సంగతి చెప్పబోకుమని బ్రతిమాలుచున్నది. అత్త కడుపులో పెట్టుకొని కాపాడునో లేదా కోడలుపైన కక్షను సాధించుకొనుటకు నలుగురికి చెప్పి అల్లరి పెట్టునో తరువాతి కథ". ఇచ్చటి కోడలు చేసిన దొంగతనము బుద్ధి వక్రించిన దొంగతనమునుగాక ఉరుకలువేయు ఉత్సాహములో చేపట్టిన పనిని పూర్తి చేయవలెనను తొందరను సూచించుచున్నది.

పై పాటలోని పై రెండు చరణములు, చివరి రెండు చరణములు సెలయేరులోను కలవు. -[1]

పత్తి చెట్టువంక, పత్తాకు వంక
రాజ్యంలో సీతమ్మరాత ఫలం వంక -[2]

వడకుట నిత్య జీవితావసరములకు తప్పక చేయవలసిన పని. ఒక ఇల్లాలునకు ఇది ఎట్టి విసుగును కలిగించినదోయేమో! తన తలవ్రాతను గుఱించి తలపోసినది. "తానే కాదు ఆ మహాతల్లి సీతకూడ కష్టములు పడినది. ఆమె తల వ్రాతయు వంకరే" యని సమాధాన పడినది. సీతమ్మ అదృష్టరేఖ సరిగా లేదనుటకు తాను నిత్యము తిలకించుచున్న పత్తిచెట్టు, పత్తి ఆకులలోనుండు వంకలను దృష్టాంతము లుగా చేపట్టినది.

ఈ సమయమున పాడు పాటలలో రాట్నము, పత్తిచెట్టు ప్రాధాన్యములనే గాక కుటుంబ బాంధవ్యములను తెలుపు పాటలును ఉండును. -[3]

శ్రమ జీవనము స్త్రీకి అనూచానముగ వచ్చిన అలవాటు. తన జీవిత సహచరుని కొఱకో, తన సంతానము కొఱకో, తన వంశ మర్యాద కొఱకో ఆమె నిరంతరము పాటుపడుచునేయుండును. ఆ పాటువలన కలిగిన శ్రమను పోగొట్టుటలో రూపుదిద్దుకొనిన పెక్కు గేయములు ఆమెకు వారసత్వముగా, సాంప్రదాయికముగా లభించినవి. అట్టి వానిలో కొన్నింటిని ఇచ్చట దిఙ్మాత్రముగా పేర్కొనుట జరిగినది.

1. సెలయేరు-పుట-18.
2. సెలయేరు-పుట-18.
3. సెలయేరు-పుటలు-18, 19.

ముగింపు

పరమాణువులోని స్థిరాంశమువలె, బీజములోని జీవాంశమువలె, కఱ్ఱలోని చేపవలె సంఘములో స్థిరముగా నుండునది సంప్రదాయము. ఇది ఎన్ని ఆటుపోటులుగా వచ్చినను, ఝంఝూమారుతములు వీచినను, భూకంపములు సంభవించినను నశించదు. కాని దేనికయినను రక్షణ అవసరమయినట్లు దీనికిని రక్షణ అవసరము. రక్షణలేనిదే ఏదియును మనజాలదు; ఎదుగజాలదు. సంప్రదాయమునకు సంరక్షకులు ఏ దేశమునందైనను స్త్రీలదే ప్రధానపాత్ర.

దేశములో వివిధ నాగరికతల, వివిధ మతముల, వివిధ పరిపాలనముల ప్రభావమెంతపడినను స్త్రీలు మాత్రము ఆ ప్రభావమునకు తలవంచక పరంపరగా సంక్రమించిన సంప్రదాయమును రక్షించుకొనుచునే వచ్చిరి. ఈ సంప్రదాయమునకు నిక్షేపములవంటి స్త్రీల జానపద గేయములనాధారముగా అనాదిగా వచ్చుచున్న, నేడు ఆచరింపబడుచున్న సంప్రదాయ పద్ధతులను వివరించుటకు ప్రయత్నించితిని. ఈ గేయములు శ్రుతి స్మృతులవలె పండుగలకును, పబ్బములకును, ఆచార వ్యవహారములకును నేటికిని స్త్రీలలో అత్యంత ప్రామాణికములైయున్నవి.

సంప్రదాయ పరిశీలనలో కుటుంబములో పరస్పర సంబంధములు, నామకరణాది సంస్కారములు, వ్రతోత్సవములు, వృత్తులు, పరిశ్రమలు, మున్నగువాని సంబంధముగల సందర్భములలో పాడబడు స్త్రీల జానపదగేయ సాహిత్యమునుగైకొని వానిలోని విశేషములను విశ్లేషించి యథాశక్తి సువ్యక్తమొనరించుటకు ప్రయత్నించితిని.

అంత కడివెడు పాలపై
ఒక్కింత మీగడ పేరినట్లుగ
మనకు మిగులును గతములోపలి
మంచి, అదియే సంప్రదాయము.[1]

అని డా॥ సి.నారాయణరెడ్డి సంప్రదాయ విశిష్టతను కొనియాడినారు. 'యువభారతి' ప్రచురణ 1972, పుట.3

ఎన్ని అవాంతరములు పైబడినను సరకు చేయక సహస్రాబ్దములుగా విశిష్టమైన సంప్రదాయమును పరిరక్షించుచు దానిని తరువాతి తరముల కందించుచున్న జానపద స్త్రీలను వేనోళ్ళ కొనియాడక తప్పదు.

---

1. 'చైతన్యలహరి', యువభారతి ప్రచురణ 1972.పుట.3

ఉపయుక్త గ్రంథసూచిక

తెలుగు :

1. అక్షరార్చన – సాహిత్యవ్యాస సంకలనము, సంపాదకులు – ఆచార్య దివాకర్ల వెంకటావధాని ప్రభృతులు, హైదరాబాదు, 1972.

2. అర్థవిపరిణామ పద్ధతి – దువ్వూరి వెంకటరమణశాస్త్రి.

3. ఆంధ్ర యక్షగాన వాఙ్మయచరిత్ర, డా॥ యస్వీ జోగారావు, ఆంధ్ర విశ్వకళా పరిషత్ప్రకాశితము, 1961.

4. ఆంధ్ర రచయిత్రుల సప్తమ మహాసభ సంచిక – 1975. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.

5. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము – బాలాంత్రపు రజనీకాంతరావు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1958.

6. ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి, ఖండవల్లి లక్ష్మీరంజనం మరియు బాలేందు శేఖరం, బాలసరస్వతి బుక్ డిపో, కర్నూలు, మద్రాసు, 1974.

7. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, సురవరం ప్రతాపరెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1949.

8. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు, డా॥ సి.నారాయణరెడ్డి, ఆంధ్రపదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు, 1967.

9. ఆర్యుల పండుగలు – మంత్రి ప్రగడ వెంకటేశ్వరరావు, విజయ ప్రెస్, వరంగల్, 1968.

10. ఆలి చిప్పలు – ఆణిముత్యాలు, సంపాదకులు : రాళ్ళపల్లి సుందరం, ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, డా॥ తంగిరాల వేంకట సుబ్బారావు, జానపద సమితి, బెంగుళూరు, 1972.

11. ఓఘవతీ పరిణయము, అక్కినేపల్లి నృసింహకవి.

12. ఋగ్వేద ఆర్యులు, చారిత్రక సాంస్కృతిక అధ్యయనం - రాహుల్, సాంకృత్యాయన్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1974.
13. కథలు గాథలు - భాగము-2, శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి.
14. కర్షక కామధేనువు - గట్టినేని రామస్వామి చౌదరి, శ్రీవెంకటేశ్వర గ్రంథమాల, గుంటూరు జిల్లా, 1966.
15. కళాపూర్ణోదయము, పింగళి సూరన.
16. కావ్యాలంకార చూడామణి - విన్నకోట పెద్దన.
17. కుమార రాముని కథ - సంపాదకులు, డా॥ ఎన్.వెంకటరమణయ్య, గవర్నమెంటు మాన్యుస్క్రిప్ట్ లైబరీ, మద్రాసు, 1952.
18. కుమార సంభవము - నన్నెచోడుడు.
19. కొత్తా-పాతా (వ్యాససంపుటి) - నార్ల వెంకటేశ్వరరావు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1975.
20. గర్భిణీ హితచర్య - వావిలికొలను సుబ్బారావు, ఒంటిమిట్ట.
21. గాథాసప్తశతిలో తెలుగు పదాలు - తిరుమల రామచంద్ర ప్రాకృత అకాడమీ, హైదరాబాదు 1973.
22. చాటుపద్య మణిమంజరి, వేటూరి ప్రభాకరశాస్త్రి.
23. చాటుపద్య రత్నావళి, సంపాదకుడు - శ్రీరంగాచార్య, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1978.
24. జానపద కళాసంపద (ప్రథమ సంపుటము) డా॥ తూమాటి దొణప్ప, నిర్మలా పబ్లికేషన్స్, విశాఖపట్నం, 1975.
25. జానపద గేయాలు - సేకరణ, ఎల్లోరా : విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.
26. జానపదగేయాలు - రెండవ సంపుటి - సేకరణ : ఎల్లోరా, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1959.
27. జానపదగేయాలు - సాంఘిక చరిత్ర, సంపాదకులు : డా.బి.రామరాజు మరియు డా.నాయని కృష్ణకుమారి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974.
28. జానపద గేయ వాఙ్మయ పరిచయము - హరి ఆదిశేషువు, రాజ్యలక్ష్మి ప్రింటర్స్, గుంటూరు, 1967.

29. జానపద గేయ వాఙ్మయ (సాహిత్య) వ్యాసావళి, నేదునూరి గంగాధరం.
30. జైమినీ భారతము – పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు.
31. తల్లీబిడ్డ – దరిశి సుభద్రమ్మ, ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ, 1956.
32. తాళ్లపాక అన్నమయ్య పాటలు – భావవివరణ – కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి, తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము, తిరుపతి, 1976.
33. తెలంగాణం – మొదటి భాగం (వ్యాస సంకలనం) దేశోద్ధారక గ్రంథమాల.
34. తెలంగాణా పల్లెపాటలు (మొదటిభాగం) సేకరణ డా॥ బి.రామరాజు, సుదర్శన్ ప్రింటర్స్, హైదరాబాదు, 1968.
35. తెలుగు కథానికా స్వరూప స్వభావాలు – డా॥ పోరంకి దక్షిణామూర్తి, సిద్ధాంతవ్యాసము (అముద్రితము) ఉస్మానియా విశ్వవిద్యాలయము, 1976.
36. తెలుగు జానపద గేయ గాథలు – డా॥ నాయని కృష్ణకుమారి, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1977.
37. తెలుగు జానపద గేయ సాహిత్యము, డా॥ బి. రామరాజు, ఆంధ్ర రచయితల సంఘం, హైదరాబాదు, 1958.
38. తెలుగుదేశపు జానపద గీతాలు – డా॥ ఎస్. గంగప్ప, పౌరసంబంధశాఖ, హైదరాబాదు, 1976.
39. తెలుగు పల్లెపాటలు – సంకలనం – ప్రయాగ నరసింహశాస్త్రి, కవితా పబ్లికేషన్స్, విజయవాడ, 1960.
40. తెలుగువాణి – ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, ఉగాది, 1975.
41. త్రివేణి సంపాదకులు : శ్రీ బి. రామరాజు, శ్రీ ఎన్.గోపాలకృష్ణమూర్తి, శ్రీ ఎన్.గంగాధరం, శ్రీ టి.దొణప్ప, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, హైదరాబాదు, 1960.
42. దక్షిణాంధ్ర వాఙ్మయము, సంఘ జీవితము, విజయభారతి, సిద్ధాంత వ్యాసము, సంపుటములు, 1, 2 (అముద్రితము) ఉస్మానియా విశ్వవిద్యాలయము, 1967.

43. ధర్మసింధువు, తెలుగు అనువాదము - బ్రహ్మశ్రీ కొల్లూరి రామశాస్త్రి, వావిళ్ల రామశాస్త్రులు, 1954.
44. నరావతారం - శ్రీ నండూరి రామమోహనరావు.
45. నిత్యసాధన చంద్రిక - విశ్వ హిందూపరిషత్.
46. నిరంకుశోపాఖ్యానము - కందుకూరి రుద్రయ్య.
47. నుడి-నానుడి- తిరుమల రామచంద్ర, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ, 1971.
48. పండితారాధ్య చరిత్రము, పాల్కురికి సోమనాథుడు; శ్రీ చిలుకూరి నారాయణరావు (పరిష్కృతము)
49. పండుగలు - పరమార్థములు - నేదునూరి గంగాధరం, రాజమండ్రి, 1956.
50. పల్నాటి వీరచరిత్ర, శ్రీనాథుడు. సంపాదకుడు పండిత శ్రీ ఉమాకాంత విద్యాశేఖరులు.
51. పల్లెపదాలు - సంకలితము - కృష్ణశ్రీ. ఆంధ సారస్వత పరిషత్తు, హైదరాబాదు, మన్మథనామ సంవత్సరము.
52. పల్లెపదాలలో ప్రజాజీవనము, ఎల్దండ రఘుమారెడ్డి, సిద్ధాంత వ్యాసము అముద్రితము, ఉస్మానియా విశ్వవిద్యాలయము, 1972.
53. ప్రజావాఙ్మయము, చింతాదీక్షితులు, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1955.
54. పాంచాలీ పరిణయము, కాకమాని మూర్తికవి.
55. పాండురంగ మహాత్మ్యము - తెనాలి రామకృష్ణకవి.
56. పాతపాటలు - సాంప్రదాయక విజ్ఞానము (మొదటి భాగం), టేకుమళ్ల కామేశ్వరరావు, గుంటూరు, 1941.
57. పార్వతీ పరిణయము - రాయరఘునాథ తొండమాన్.
58. పారిజాతాపహరణము - నంది తిమ్మన.
59. పిల్లల మనస్తత్త్వశాస్త్రము, ధూర్జటి సుబ్బారావు, విశాలాంధ్ర ప్రచురణా లయం, విజయవాడ, 1965.

60. మన్నారు దాస విలాస నాటకము – రంగాజమ్మ.
61. మన్నారుదాస విలాస ప్రబంధము – రంగాజమ్మ.
62. మనుచరిత్ర – అల్లసాని పెద్దన.
63. మిన్నేరు – సంకలనం – నేదునూరి గంగాధరం, ప్రాచీన గ్రంథావళి, రాజమహేంద్రవరము, 1968.
64. ముక్తికాంతా పరిణయము – పరమానంద తీర్థుడు.
65. మున్నీరు, సంకలనం – నేదునూరి గంగాధరం, ప్రాచీన గ్రంథావళి, రాజమహేంద్రవరము, 1973.
66. మెసపొటేమియా సాహిత్య సంగ్రహం – కృష్ణచైతన్య, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ, 1958.
67. యయాతి చరితము – పొన్నకంటి తెలగన్న.
68. యుగయుగాలలో భారతీయ మహిళ – జె. వరలక్ష్మి, ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాదు, 1977.
69. రామాయణము – రఘునాథ నాయకుడు.
70. రామాయణ విశేషములు – సురవరం ప్రతాపరెడ్డి, ఆంధ్ర గ్రంథాలయ ముద్రాశాల, బెజవాడ, 1943.
71. లక్ష్మమ్మకథ, వెస్ట్ వార్డ్ అండ్ కంపెనీ, మద్రాసు–21
72. లక్ష్మీరంజన వ్యాసావళి, ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, ఆంధ్ర రచయితల సహకార సంఘ ముద్రణాలయం, హైదరాబాదు, 1970.
73. వ్యవసాయ సామెతలు – సంకలనకర్త– నేదునూరి గంగాధరం, విశ్వసాహిత్యమాల, రాజమండ్రి.
74. వ్రత రత్నాకరము – ద్వితీయభాగము, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు.
75. విజయ విలాసము – చేమకూర వేంకటకవి.
76. వివేచన – మూడవ సంచిక – సంపాదకుడు : బి.రామరాజు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాదు, 1978.

77. శకుంతలా పరిణయము – పెద్దాడ నాగయామాత్యుడు.
78. శివరాత్రి మహాత్మ్యము – శ్రీనాథుడు.
79. శ్రీకాకుళం ప్రజల భాష – వి.సి.బాలకృష్ణశర్మ, ప్రపంచ తెలుగు మహాసభల జిల్లాస్థాయి సంఘం, శ్రీకాకుళం, 1975.
80. శ్రీమదాంధ్ర మహాభాగవతము, ఆదిపర్వము, అరణ్యపర్వము, విరాట పర్వము, ఉద్యోగపర్వము, శల్యపర్వము, అనుశాసనిక పర్వము.
81. శ్రీమదాంధ్ర మహాభారతము, చతుర్థస్కంధము, దశమ స్కంధము
82. శ్రీశాలివాహన గాథాసప్తశతి సారము, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1964.
83. శుకసప్తతి–పాలవేకరి కదిరీపతి.
84. సరాగాలు – ఎల్లోరా, విజయవాడ, 1961.
85. సారంగధర చరిత్ర – చేమకూర వేంకటకవి.
86. సారస్వత వ్యాసములు – ద్వితీయ సంపుటము – పరిష్కర్త, పురిపండా అప్పలస్వామి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1969.
87. సాహిత్య మొర్మారాలు – తాపీ ధర్మారావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1976.
88. సాహితీ సుగతుని స్వగతము – తిరుమల రామచంద్ర, విశాలాంధ్ర ప్రచురణ, విజయవాడ, 1969.
89. సింహాసన ద్వాత్రింశిక, కొఱవి గోపరాజు.
90. స్త్రీల పాటలు – ఎన్.వి.గోపాల్ అండ్ కంపెనీ, మదరాసు, 1977.
91. స్త్రీల పౌరాణికపు పాటలు – సంపాదితము – కృష్ణశ్రీ, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1955.
92. స్త్రీల రామాయణపు పాటలు – సంపాదితము – కృష్ణశ్రీ, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1955.
93. హిందువుల పండుగలు – సురవరము ప్రతాపరెడ్డి, బాలసరస్వతీ బుక్ డిపో, కర్నూలు, 1953.
94. హిందువుల పండుగలు – పర్వములు, శ్రీ తిరుమల రామచంద్ర, బాలసరస్వతీ బుక్ డిపో, కర్నూలు, 1960.

95. పూర్వగాథాలహరి – శ్రీ వేమూరి శ్రీనివాసరావు, వెంకట్రామ అండ్ కో, సికింద్రాబాదు, 1958.

96. విజ్ఞానదీపిక । సంపాదక వర్గము, శ్రీ యన్.నరోత్తమరెడ్డి (అధ్యక్షులు), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1976.

97. విజ్ఞాన సర్వస్వము – సంపుటము–3, తెలుగు సంస్కృతి–1, సంపుటము–4, తెలుగు సంస్కృతి–2, సంపాదక సమితి – శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ మరియు ఇతరులు, తెలుగుభాషా సమితి, హైదరాబాదు, మద్రాసు.

98. శబ్దరత్నాకరము, బహుజనపల్లి సీతారామాచార్యులు, చెన్నపట్టణము, 1969.

– సందర్భానుసారముగా ఇతరములైన వ్యాసముల ప్రసక్తి అక్కడక్కడ గావింపబడినది. వాటి వివరణ ఆయా ప్రకరణములలోనే యివ్వబడినది.

కన్నడము :

1. జనపద రామాయణ – రా.గౌ. వి.కె.రాజశేఖర, బసవయ్య, కన్నడ అధ్యయన సంస్థె మానస గంగోత్రి, మైసూరు.

సంస్కృతము :

1. అధర్వవేదము.

2. అభిజ్ఞాన శాకుంతలము – కాళిదాసు.

3. అమరకోశము – లింగా భట్టీయ గురుబాల ప్రబోధికా సహితము, వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి, 1933.

4. అష్టాంగ హృదయమ్ (సూత్రస్థానము) – వాగ్భటాచార్యుడు.

5. ఋగ్వేదము.

6. కాదంబరి – భానుడు.

7. కుమార సంభవము – కాళిదాసు, చౌకంబ విద్యాభవన్, వారణాసి.

8. గౌతమ ధర్మ సూత్రములు.

9. చరక సంహిత

10. తైత్తరీయోపనిషత్తు – శిక్షావల్లీ.

11. ధన్వంతరి నిఘంటువు.
12. ధర్మసింధు – కాశీనాథోపాధ్యాయుడు.
13. నాగానందము – శ్రీహర్షుడు.
14. పరాశర స్మృతి, ఆచారకాండము, ప్రాయశ్చిత్తకాండము.
15. మనుస్మృతి, చౌఖంబా సంస్కృత సంస్థాన్, వారణాసి, 1970.
16. యజుర్వేదము.
17. రఘువంశము, కాళిదాసు.
18. లలితా సహస్రనామస్తోత్రమ్, శ్రీవిద్యాసేవాసమితి, సికింద్రాబాద్, 1975.
19. వాచస్పత్యము – మూడవ సంపుటము.
20. వాత్స్యాయన కామసూత్రములు.
21. వాల్మీకి రామాయణము – బాలకాండము, అయోధ్యకాండము, కిష్కింధ కాండము, సుందరకాండము, యుద్ధకాండము.
22. వ్యాస మహాభారతము – ఉద్యోగ పర్వము, భీష్మపర్వము.
23. శబ్ద కల్పద్రుమము.
Chau Kamba Sanskrit Series VARANASI
24. A Sanskrit English Dictionary, Sir Monier Monier-Williams. Oriental Publishers, Delhi.

ప్రాకృతము :

1. గాథా సప్తశతి – హాలుడు.
2. పా ఈ శబ్ద మహార్ణవ

హిందీ:

1. అవధీలోక్ గీత్ ఔర్ పరంపరా – ప్రొఫెసర్ ఇంద్రప్రకాశ్ పాండేయ. ప్రకాశక్, రామ్‌నారాయణలాల్, ఇలహాబాద్, 1958.
2. కాశ్మీరు ఔర్ హిందీకే లోక్ గీత్ ఏక్ తులనాత్మక్ అధ్యయన్ – జవహర్‌లాల్ అండ్, విశాల పబ్లికేషన్స్, కురుక్షేత, 1971.
3. గ్రామ్ సాహిత్య–తీన్‌రా భాగ్–రామ్ నరేశ్ త్రిపాఠి, ఆత్మారామ్ అండ్ సన్స్, ఢిల్లీ, 1952.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.	100/-
2.	తెలుగు వాగ్గేయకారులు – అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ.	70/-
3.	తెనుగు సాహితి	రూ.	36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ.	36/-
5.	సమీక్షణం	రూ.	36/-
6.	పరిణతవాణి – 1,2,3,4,5,6 సంపుటాలు (36,45,60,65,60,150)	రూ.	370/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ.	70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ.	30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ.	15/-
10.	రాయప్రోలు రచనలు – తత్వవివేచన	రూ.	60/-
11.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ.	40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ.	8/-
13.	మన జాతినిర్మాతలు	రూ.	4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ.	24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ.	50/-
16.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ.	250/-
17.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ.	10/-
18.	సంస్కృత పాఠవల్లరి	రూ.	4/-
19.	నా సాహిత్యోపన్యాసములు	రూ.	5/-
20.	గౌతమబుద్ధుడు – జవహర్‌లాల్ నెహ్రూ	రూ.	3-60
21.	విమర్శకవతంసులు	రూ.	45/-
22.	మన దేశం – తెలుగుసీమ	రూ.	7/-
23.	మన నదులు – కృష్ణా గోదావరులు	రూ.	3/-
24.	మధురభక్తి – ముగ్ధభక్తి	రూ.	80/-
25.	ప్రాచీన కవిత	రూ.	10/-
26.	ప్రసంగ వ్యాసాలు	రూ.	5/-
27.	దశరూపక సారం	రూ.	5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ.	2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ.	5/-
30.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ.	60/-
31.	శివరాత్రి మాహాత్మ్యము	రూ.	75/-
32.	తెలుగు రచన	రూ.	7/-
33.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ.	85/-
34.	సాహిత్య సోపానములు	రూ.	75/-
35.	మన హాస్యము	రూ.	100/-
36.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ.	100/-
37.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ.	130/-
38.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ.	150/-